AOVA103B112

శ్రీహయగ్రీవాయ నమః

ఆనందాశ్రమగ్రంథరత్నమాల

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము.

బుక్కపట్టణము
రామానుజయ్య
గారిచేఁ
బరిశోధితము.

మద్రాస్.
వేమూరు - వేంకటకృష్ణమసెట్టి అన్డ్ సన్సుచేఁ
బ్రకటింపఁబడుచుండినది.

ఈ క్రొత్తకూర్పు
ఎ. కణ్ణన్ సెట్టి అన్డ్ కంపెనీవారిచేఁ
బ్రకటితము.

286, చైనా బజాఱు రోడ్డు,
ఆనందముద్రణాలయమున ముద్రితము.

1924

(COPYRIGHT REGISTERED)

Price: Rs. 2-4

MEMORIAL LIBRARY
V.R. NARLA
D. P.P.R.R.I.J
Acc. No. 10122

294.5923
RAM

Page 1 to 160 Printed at the India Printing Works. 161 to 322 Printed at the Ananda Press.

విషయసూచిక.

ఆరణ్యపర్వము - ప్రథమాశ్వాసము.

శౌనకుఁడు ధర్మరాజునకు ధర్మంబులు సెప్పుట.	...	3
ధర్మరాజు సూర్యు నారాధించి వరంబుఁ గొనుట.	...	6
విదురుఁడు ధృతరాష్ట్రుని విడిచి పాండవులయొద్దకుఁ బోవుట	...	8
ధృతరాష్ట్రునకు వ్యాసుఁ డింద్రసురభిసంవాదంబు సెప్పుట.	...	10
మైత్రేయుఁడు దుర్యోధనుని శపియించుట.	...	12
కిమ్మీరుం డనురాక్షసుఁడు భీమునిచేఁ జచ్చుట.	...	13
యాదవపాంచాలాదులు పాండవులకడ కేతెంచుట.	...	14
ద్రౌపది శ్రీకృష్ణునితోఁ దనపరిభవంబు సెప్పి దుఃఖించుట.	...	15
కృష్ణుఁడు ధర్మరాజునకు సౌంభకాఖ్యానంబు సెప్పుట.	...	17
సాల్వుఁడు ప్రద్యుమ్నునిచే బాధితుం డై మరలిపోవుట.	...	20
పాండవులు ద్వైతవనంబునకు వచ్చియుండుట.	...	21
ద్రౌపదీధర్మరాజులసంవాదము.	...	24
భీమసేనధర్మరాజులసంవాదము.	...	27
కృష్ణద్వైపాయనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చుట.	...	31
ఈశ్వరుండు కిరాతవేషంబున నర్జుననొద్దకు వచ్చుట.	...	34
అర్జునుఁడు పరమేశ్వరుని స్తోత్రము సేయుట.	...	37
ఇంద్రుఁడు దేవగణంబులతో నర్జుననకుఁ బ్రత్యక్షుం డగుట.	...	38
అర్జునుఁ డమరావతికిఁ బోవుట.	...	39
ఊర్వశి యర్జును నపుంసకునిఁగా శపించుట.	...	42

ఆరణ్యపర్వము - ద్వితీయాశ్వాసము.

ధర్మరాజునకు బృహదశ్వుండు నలోపాఖ్యానంబు సెప్పుట.	...	47
నలుండు దమయంతియొద్దకు దేవదూత యై పోవుట.	...	51
నలుండు స్వయంవరలబ్ధ యైనదమయంతిం బెండ్లియగుట	...	52
నలుఁడు దమయంతీసహితుం డై యడవికిఁ బోవుట.	...	54
దమయంతిశాపంబునం గిరాతుండు చచ్చుట.	...	56
దమయంతి సుబాహుపురంబు ప్రవేశించుట.	...	59
నలుఁడు కర్కోటకునిచేత దష్టుం డగుట.	...	60
చేదిపురంబున సుదేవుఁ డనుబ్రాహ్మణుఁడు దమయంతి నెఱుఁగుట.	...	62
దమయంతి నలు నెడఁబాసి విదర్భాపురంబు సేరుట.	...	63
నలుండు కలిచేత విముక్తుం డై విదర్భకుఁ బోవుట.	...	66
కేశిని యనుదూతి దమయంతితో నలునిగుణంబులు సెప్పుట.	...	68
నలుండు నిజరూపంబుతో దమయంతిం గూడుట.	...	70
ధర్మరాజునొద్దకు నారదమహాముని వచ్చుట.	...	72

రోమశమహాముని ధర్మరాజునొద్దకు వచ్చుట ... 81
రోమశుండు ధర్మరాజునకు ధర్మవిశేషంబులు సెప్పుట. .. 83
అగస్త్యుండు లోపాముద్రను వివాహం బగుట. ... 86

ఆరణ్యపర్వము - తృతీయాశ్వాసము.

అగస్త్యచరిత్రము. .. 89
దేవతలు వైకుంఠమునకుఁ బోయి విష్ణుని స్తుతియించుట ... 90
అగస్త్యుఁడు వింధ్యంబు పెరుఁగకుండ వారించుట ... 91
అగస్త్యుఁడు సముద్రోదకంబు పానంబు సేయుట. ... 92
భగీరథుండు సముద్రము జలముచే నించుట. ... 93
సగరసుతులు కపిలమహామునికోపాగ్నిచే భస్మ మగుట. ... 94
రోమశుఁడు ధర్మజునకు ఋశ్యశృంగుచరిత్రము సెప్పుట. ... 97
ఋశ్యశృంగుఁడు వేశ్యను మునికుమారునిఁగా భావించుట. ... 98
విభాండకుఁడు ఋశ్యశృంగుని వెదకుచు వచ్చుట. ... 100
అకృతవ్రణుఁడు ధర్మరాజునకుఁ బరశురామునిమహిమ సెప్పుట. ... 101
పరశురాముఁడు కార్తవీర్యునిఁ జంపుట. ... 104
రోమశుఁడు ధర్మజునకు సౌకన్యాఖ్యానంబు చెప్పుట. ... 107
చ్యవనుఁ డాశ్వినుల సోమపీథులఁ జేయుట. ... 108
మాంధాతృచరిత్రము. ... 109
సోమకుం డనురాజర్షి చరిత్రము. ... 110
శిబి యనురాజర్షి చరిత్రము రోమశుఁడు ధర్మజునకుఁ జెప్పుట. ... 112
రోమశుఁడు ధర్మజునకు నష్టావక్రుచరితంబు చెప్పుట. ... 113
రోమశుఁడు ధర్మరాజునకు యవక్రీతుచరిత్రంబు చెప్పుట. ... 115
దేవత లర్వావసునకు మెచ్చి కోరినవరంబు లెల్ల నిచ్చుట. ... 118
పాండవులు గంధమాదనపర్వతంబునకుం బోవుట. ... 120
భీముఁడు సౌగంధికహరణార్థంబు పోవుట. ... 122
భీమునకు హనుమంతుఁడు చతుర్యుగాచారవర్తనంబులను దెలుపుట ... 125
హనుమంతుఁడు భీమునకుఁ దనపూర్వరూపంబుఁ జూపుట. ... 125
భీముఁడు యక్షరాక్షసులతో యుద్ధంబు సేయుట. ... 128
భీముఁడు జటాసురునితో యుద్ధంబు సేయుట. ... 130

ఆరణ్యపర్వము-చతుర్థాశ్వాసము.

ఇంద్రుఁడు పాండవులయొద్దకు వచ్చుట. ... 136
అర్జునుఁడు నివాతకవచు లనురాక్షసుల జయించినకథ. ... 138
అజగరోపాఖ్యానము. ... 141
ధర్మరాజు భీమసేనుని వెదకఁ బోవుట. ... 142
ధర్మరాజు నహుషప్రశ్నంబునకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట. ... 144
శ్రీకృష్ణుఁడు సత్యభామతోడఁ బాండవులయొద్దకు వచ్చుట. ... 147
మార్కండేయుం డనుముని పాండవులయొద్దకు వచ్చుట. ... 148
మార్కండేయుఁడు ధర్మరాజునకు బ్రాహ్మణప్రభావంబు సెప్పుట. ... 150
అత్రిగౌతములపరస్పరసంవాదము. ... 152

మార్కండేయుండు ధర్మరాజునకు వైవస్వతువృత్తాంతంబును దెల్పుట. ... 154
మార్కండేయుండు ధర్మజునకుం బ్రళయప్రకారంబు సెప్పుట. ... 156
నారాయణుఁడు మార్కండేయునకుఁ దనప్రభావంబు సెప్పుట. ... 159
మార్కండేయుఁడు ధర్మరాజునకుఁ గలియుగధర్మంబులు సెప్పుట. ... 161
కలియుగంబున విష్ణుండు గల్కిరూపంబున ధర్మంబు ప్రతిష్ఠించుట. ... 163
మార్కండేయుఁడు ధర్మరాజునకు బ్రాహ్మణప్రభావంబు సెప్పుట. ... 164
,, ,, నింద్రద్యుమ్నుచరిత్రము సెప్పుట. ... 169
,, ,, కువలాశ్వచరిత్రము సెప్పుట. ... 170
,, ,, మధుకైటభులచరిత్రము సెప్పుట. ... 172

ఆరణ్యపర్వము-పంచమాశ్వాసము.

ధర్మజునకు మార్కండేయుఁడు పుత్రుని కుండఁదగు గుణంబులు సెప్పుట. ... 176
,, ,, పతివ్రతామాహాత్మ్యంబు సెప్పుట. ... 177
కౌశికుం డనుబ్రాహ్మణుఁడు ధర్మవ్యాధునియొద్దకుం బోవుట. ... 179
ధర్మవ్యాధుఁడు కౌశికున కహింసాస్వరూపంబు సెప్పుట. ... 181
ధర్మవ్యాధుఁడు కౌశికునకు జీవలక్షణంబులు సెప్పుట. ... 183
ధర్మవ్యాధుఁడు కౌశికునకుఁ దనపూర్వజన్మవృత్తాంతంబు సెప్పుట. ... 189
మార్కండేయుఁడు ధర్మజునకు నంగిరసుం డగ్ని యైనతెఱంగు సెప్పుట. ... 190
ఇంద్రుఁడు కేశి యనురాక్షసునిఁ బాఱఁదోలుట. ... 194
కుమారస్వామియవతారము. ... 197
ఇంద్రుఁడు కుమారస్వామిపై నెత్తివచ్చుట. ... 198
ఈశ్వరుండు కుమారస్వామియొద్దకు వచ్చుట. ... 200
కుమారస్వామి సప్తమాతృకల బాలగ్రహంబులఁ జేయుట. ... 202
ఈశ్వరుండు కుమారసహితుం డై భద్రవటంబు సేరుట. ... 204
కుమారస్వామి మహిషాసురుం జంపుట. ... 204
సత్యాద్రౌపదీసంవాదము. ... 207
ద్రౌపది సత్యభామకుఁ బతివ్రతాధర్మంబులు సెప్పుట. ... 210
ధృతరాష్ట్రుఁడు పాండవులవనవాసక్లేశంబునకు దుఃఖించుట. ... 211
కర్ణశకునిదుర్యోధనులు మంతనంబు సేయుట. ... 213
కర్ణసౌబలులు ధృతరాష్ట్రుచేత ఘోషయాత్ర కనుజ్ఞ గొనుట. ... 215
దుర్యోధనుఁడు ఘోషయాత్ర పోవుట. ... 216
చిత్రసేనుం డనుగంధర్వరాజు దుర్యోధనునితో యుద్ధము చేయుట. ... 219
భీమార్జుననకులసహదేవులు గంధర్వులతో యుద్ధంబు సేయుట. ... 221
చిత్రసేనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చి దుర్యోధనుని విడిచిపెట్టి పోవుట. ... 223

ఆరణ్యపర్వము-షష్ఠాశ్వాసము.

దుర్యోధనునివిషాదము. ... 225
దుర్యోధనుండు ప్రాయోపవేశము సేయఁ బూనుట. ... 227
ప్రాయోపవిష్టుం డైనదుర్యోధనునిఁ గృత్య పాతాళంబునకుఁ గొనిపోవుట. ... 230
దుర్యోధనుఁడు ప్రాయోపవేశము మాని కరిపురంబునకుఁ బోవుట. ... 232
దుర్యోధనుఁడు వైష్ణవం బనుయజ్ఞము సేయుట. ... 234
ద్వైతవనంబునందలి మృగసమూహము ధర్మజుస్వప్నంబునందు వచ్చి తమదుఃఖము సెప్పుట. 236

వ్యాసుఁడు ధర్మజునకు వ్రీహిద్రోణాఖ్యానంబు సెప్పుట. ... 238
ముద్గలునకు దేవదూత పుణ్యలోకంబు తెఱంగు సెప్పుట. ... 239
సైంధవుఁడు ద్రౌపదిం జూచి మోహించుట. ... 241
ద్రౌపది సైంధవునితో నిష్ఠురోక్తులు పలుకుట. ... 244
సైంధవుఁడు ద్రౌపదిని బలాత్కారముగా నెత్తికొని పోవుట. ... 246
పాండవు లేవురు సైంధవుపై యుద్ధమునకుఁ బోవుట. ... 247
అర్జునుఁడు సౌవీరకుమారులం బన్నిద్దఱఁ జంపుట. ... 250
భీముఁడు సైంధవుం బట్టికొని పరిభవించుట. ... 252
ధర్మజునకు మార్కండేయుఁడు రామాయణకథ సెప్పుట. ... 254
బ్రహ్మ రావణకుంభకర్ణవిభీషణులకు వరంబు లిచ్చుట. ... 256
దశరథుఁడు రామవిశ్లేషముచే సురలోకగతుం డగుట. ... 258
మారీచుఁడు మాయామృగం బై చనుదెంచుట. ... 261
రావణుఁడు సీత నెత్తికొని లంకకుఁ బోవుట. ... 262
శ్రీరాముఁడు కబంధుఁ డను రాక్షసుం జంపుట. ... 264
వాలిసుగ్రీవులయుద్ధము. ... 267
త్రిజట తనస్వప్నవృత్తాంతము సీతతోఁ జెప్పుట. ... 268

ఆరణ్యపర్వము-సప్తమాశ్వాసము.

రాముఁడు లక్ష్మణుని సుగ్రీవునొద్దకుఁ బంపుట. ... 272
హనుమంతుఁడు రామునితో సీతం జూచినవృత్తాంతంబు సెప్పుట. ... 274
వానరవీరులు నానాదేశంబులనుండి సుగ్రీవునొద్దకు వచ్చుట. ... 276
రాముఁడు దర్భశయనుం డై సముద్రుం బ్రార్థించుట. ... 277
అంగదురాయబారము. ... 279
ప్రహస్తధూమ్రాక్షులయుద్ధము. ... 281
కుంభకర్ణుఁడు యుద్ధము సేయుట. ... 283
ఇంద్రజిత్తు లక్ష్మణుతోడ యుద్ధము సేయుట. ... 285
ఇంద్రజిత్తు లక్ష్మణునిచేతఁ జచ్చుట. ... 287
శ్రీరాముఁడు రావణాసురుని సంహరించుట. ... 289
మార్కండేయుఁడు ధర్మజునకు సావిత్ర్యుపాఖ్యానంబు సెప్పుట. ... 291
సావిత్రి సత్యవంతుని వివాహం బగుట. ... 294
సత్యవంతుఁడు సావిత్రీసహితుం డై వనంబునకుఁ బోవుట. ... 295
సావిత్రి యమునివలన నభీష్టవరంబులు వడయుట. ... 297
సత్యవంతుఁడు సావిత్రితోడ మరలి తనయాశ్రమంబునకు వచ్చుట. ... 300
సూర్యుఁడు బ్రాహ్మణవేషమునఁ గర్ణునకు హితంబు సెప్పుట. ... 302
సూర్యుఁడు కర్ణునితో నింద్రునిచే శక్తిఁ గైకొను మని చెప్పుట. ... 304
కుంతి దుర్వాసునకుఁ బరిచర్య సేయుట. ... 306
కుంతి సూర్యునివరంబున గర్భంబుఁ దాల్చి కర్ణుం గాంచుట. ... 308
ధర్మరాజు బ్రాహ్మణునియరణిఁ దెచ్చుటకుఁ బోవుట. ... 313
నకులాదులు యక్షుని నిరాకరించి నీరు ద్రావి మూర్ఛితు లగుట. ... 314
ధర్మరాజు యక్షప్రశ్నంబుల కుత్తరంబు లిచ్చుట. ... 317

5

J. Siva Prasad

శ్రీకృష్ణమూర్తి

6

ఉ. మూఁపున వామకుండలము ♦ మోవి నొకించుక మోడ్పునందముం
జూపెడునోరచూపు సొగ♦సుంబొమ నొక్కట నిక్కఁ గన్పడం
గ్రేపులు సొక్కఁ గల్పకము♦క్రిందఁ ద్రిభంగిగనిల్చి యంగుళీ
వ్యాపితవంశపూర్తి యయి ♦ వర్తిలుమోహనమూర్తిఁ గొల్చెదన్.

శ్రీ

హరిహరహిరణ్యగర్భేభ్యో నమః.

శ్రీమదాంధ్ర మహాభారతము.

ఆరణ్యపర్వము, ప్రథమాశ్వాసము.

కీర్తిశ్రీవల్లభ
లోకజనస్తుత్య సర్వలోకాశ్రయ ర
త్నాకరపరివృతసకలధ
రాకాంత జితారి రాజరాజనరేంద్రా. 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నట్లు పాండవులు నిజాయుధం బులు ధరియించి కృష్ణాసహితు లై [1]యుత్తరమించి యరిగిన నింద్రసేనాదు ... మూలభృత్యులు పదునాలుగువేలరథంబులతోడ సుభద్రాభిమన్యుప్రతివిం ... దులం దోడ్కొని వారిపిఱుందన యరిగి రంత నప్పాండవులం జూచి పౌర ... బరమదుఃఖితు లై.

క. చనునె యధర్మద్యూతం,బున నిట్టుల పాండురాజపుత్త్రులఁ బ్రభుల ... వనగతులఁ జేయ దుర్యో, ధనధృతరాష్ట్రులకు విగతఖేదయహృదయు ...

క. క్రూరతరధార్తరాష్ట్రుని,కారము వారింప రైరి గాంగేయుఁడు న ... బ్బాహ్లీకద్రోణుఁ గృపుఁడు ను, దారుఁడు విదురుండు నేం ... దలం ...

సీ. కర్ణజయద్రథగాంధారు లాప్తు లై, యుండంగ లోభి దుర్యోధను ... రాజుగా నీతనిరాజ్యంబునం దెట్టు, లుండఁగ నేర్తు మీ యుర్వి ... నేది ధర్మువు ప్రజ నెవ్వరు గాతురు, పరమధార్మికు లై నపాండ ... యరిగినచోటికి యరుగుద మని వారి, పిఱుఁదన చని [2]పాపభీతి ...

ఆ. వీరులార మమ్ము విడిచి మీ కరుగంగ, జనునె మాకు నొండు ... సాధులకు నసాధుసహవాసమునఁ బాప, సంప్రయోగ మగుట ...

---

1. 'ఉత్తరమించి' యనుటకుఁ జూడు 'ఏఁగె నుత్తరమించి తమ్ములతో' (... 'తీర్థమించు' వంటిది. క. యుత్తరించి అ. యుత్తరం బధిగమించి. 2. గ. పాపభీత ...

క. తిలలును నీళ్లును వస్త్రం, బులుఁ బుష్పసుగంధవాసనమున సౌరభముం
బొలు పెసఁగఁ దాల్చుఁ గావున, నలయక సత్సంగమమున నగు సద్గుణముల్. 6

వ. సాధుసమ్మతంబు లైనగుణంబుల నొప్పి జన్మవిద్యాకర్మంబులం బ్రశస్తుల రై యా
ర్యవృత్తుల రైనమీసహవాసంబున నుండి ధర్మవిదులము గృతార్థుల మగుదుము
దుష్కృతంబులయం దనారంభు లయ్యును జనులు దుర్జనదర్శనస్పర్శనసంభాషణ
సహాసనంబులం జేసి ధర్మవిహీను లగుదురు గావున నేము దుర్యోధనురాజ్యంబున
నుండ నోపము మీయనుగమనంబున కొడంబడవలయు నని కృతాంజలు లైన
నప్పౌరులం జూచి ధర్మతనయుం డి ట్లనియె. 7

క. మీయందు లేనిగుణములు, మీయనురాగమునఁ జేసి మిగిలి వెలింగెన్
మీయనుగతి మాకు నభి, ప్రాయము వనవాసదుఃఖభర మోపుదురే. 8

తే. వలవ దుడుగుండు మీ రని వారి నెల్లఁ, గరుణఁ బాండవజ్యేష్ఠుండు గ్రమ్మఱించెఁ
బౌరు లట్లు నివర్తింపఁ బడి నిరంత, రార్తనాదు లై యరిగిరి హస్తిపురికి. 9

వ. ఇట్లు [1]పాండవులు గృతప్రస్థానులై గంగాతీరంబునం బ్రమాణాఖ్యవటంబున విడిసి
గంగాస్నానంబు సేసి నాఁటిపగలును రాత్రియు నంద యుండి రంతఁ బ్రభాతసమ
యంబున. 10

[క]. పరువడి నగ్నిహోత్రములు బంధులు శిష్యులుఁ దోడ రా మహీ
సురవరు లెల్లఁ బాండునృపసూనులయొద్దకుఁ బ్రీతి నేఁగుదెం
... బహువేదఘోషములఁ జేసి నిరస్తసమస్తకల్మషో
...లగు చున్నధన్యులు జగత్పరిపూజ్యులు బ్రహ్మసమ్మితుల్. 11

... తోడన వనవాసంబు సేయ నిశ్చయించి వచ్చినవిప్రుల నతిప్రీతి గౌరవం
... తదాశీర్వాదంబుల నభినందితుం డై ధర్మతనయుండు వారల కి ట్లనియె.

...ర్వస్వుల మై, సపత్నులనికారమునఁ బ్రచండాటవిలో
...కమూలము, లుపయోగించుచును నిచ్చ నుండెదుమాత్రోన్. 13

...చ్చి నవయం, గా నేల నివాసములకుఁ గ్రమ్మఱి చనుఁ డు
...ర్థులభ, యానకవనవాసమార్గ మగునే మీకున్. 14

...బ్రాహ్మణులు పరమదుఃఖితు లై మీర కాని మాకు నొండుగతి లేదు
...శరణ్యుల విడుచుట ధర్మంబు గాదు. 15

...భక్తిఁ గొలుగువారి నెప్పుడు, నన్యు లైన విడువ రట్టె విప్ర
...పరుల వసుధేశ మీయట్టి, ధార్మికులకు విడువఁ దగునె చెప్పుమ. 16

...తోడ వనవాసంబు సేయ వచ్చువారల నిలిపి పాండవులు, 2, K. లైన వారిని నన్ను...
... వారి నన్నులు లైన ... జాలరలై

వ. అస్మత్పోషణోపాయచింత సేయ వలదు వన్యమూలఫలంబుల నేమ తెచ్చికొని యుపయోగించుచు జపహోమాదిపుణ్యక్రియల మీకుం బ్రియంబు సేయుచు నుండెద మధర్మవర్తి యయి మీ కపకారంబు సేసినధార్తరాష్ట్రులరాష్ట్రంబున నుండ నోప మనిన వారలరాక కొడంబడి. 17

తే. ఇష్టమృష్టాన్నములఁ దొల్లి యెల్లప్రొద్దుఁ, దృప్తు లగుచున్నవసుమతీదేవవరులఁ
గానలందు శాకాశనుల్ గాఁగ నెట్లు, సూడనోపుదు నని ధర్మసూనుఁ డపుడు.

శౌనకుఁడు ధర్మరాజునకు ధర్మంబులు సెప్పుట.

వ. శోకమూర్ఛితుం డై మహీతలంబుపయిం బడిన నాతని నాశ్వాసించి శౌనకుం డను బ్రహ్మఋషి దొల్లి యాత్మవ్యవస్థానార్థంబు జనకగీతంబు లయినశ్లోకంబుల యర్థంబులు యుధిష్ఠిరున కి ట్లనియె. 19

క. శోకభయస్థానంబు ల, నేకంబులు గలిగినను విహీనవివేకుం
డాకులతఁ బొందునట్లు వి, వేకము గలవాఁడు [1]బుద్ధివిగతుం డగునే. 20

క. శారీరమానసమహో, దారుణదుఃఖములఁ జేసి తఱఁగి శరీరుల్
క్రూరతరబాధఁ బొందుదు, రా రెంటిని జెఱుతు రార్యు లమలినబుద్ధిన్. 21

వ. వ్యాధి శ్రమానిష్టసంస్పర్శ నేష్టవివర్జనంబు లను నాల్గింటం బుట్టి శారీరదుఃఖం బు లాశుక్రియాది ప్రతియోగంబుల నుపశమిల్లు మఱి స్నేహజంబు లయిన మానసదుఃఖంబులు జలంబుల నగ్ని యుపశమిల్లునట్లు విమలజ్ఞానంబునం జేసి యుపశమంబునం బొందు. 22

క. స్నేహార్ణవమగ్నుం డయి, దేహి మహాదుఃఖముల నధృతిఁ బొందును దుః
ఖాహతుఁడు శోకతాపవి, మోహి యగుఁ స్నేహమూలములు రాగాదుల్. 23

వ. కావున బంధుమిత్త్రధనసంచయంబులవలని స్నేహంబు విడుచునది పద్మపత్త్రంబు [2]నీరం బొందనియ ట్లెఱుక గలవారి నట్టియెడలను స్నేహంబు వొందదు స్నేహంబున రాగంబును రాగంబునం గామంబును గామంబునం గ్రోధంబును గ్రోధంబునం దృష్ణయు వర్తిల్లు. 24

క. అది సర్వదోషములకా, స్పద మది దురితక్రియానుబంధంబులకున్
మొదలు నిరంతరదుఃఖ, ప్రద మని మది నెఱిఁగి తృష్ణఁ బాతురు సుమతుల్.

వ. మఱియుఁ దృష్ణాతురుం డర్థలోభంబునఁ గోటరస్థం బయినయనలంబునం జేసి దగ్ధం బగువృక్షంబునుంబోలె వినాశంబునం బొందు నట్ల యర్థాసక్తుం డైనవాఁడు శుభంబులుఁ వడయ నోపండు మృత్యువువలనం బ్రాణులకు భయంబు గలుగున ట్లర్థవంతులకు రాజ చోర స్వజన జ లానలంబులవలన భయంబు నియతంబు. 26

తే. జలములందు మత్స్యంబులు చదలఁ బక్షు, లామిషం బెట్లు భక్షించునట్లు దివిరి

1. క. బుద్ధివికలుం. 2. క. జ. నీరం బొరయనియ.

యెల్లవారును జేరి యనేకవిధుల, ననుదినంబును భక్షింతు రర్థవంతు. 27

క. అర్థమ యనర్థమూలం, బర్థమ మాయావిమోహనావహము నరుం
డర్థార్జనదుఃఖమున న, పార్థీకృతజన్ముఁ డగుట పరమార్థ మిలన్. 28

వ. అట్టియర్థంబువలన దర్ప కార్పణ్య మాన భయోద్వేగంబులు పుట్టుఁ గావున [1]నర్థో
పార్జనచింత సేయవలదు రూప యౌవన ధన విభవప్రియసంవాసంబు లనిత్యంబు
లగుట నందు బుద్ధిమంతులు విమోహింప రనిన నమ్మునివరునకు ధర్మతనయుం
డి ట్లనియె. 29

సీ. ఆత్మోపభోగార్థ మర్థలాభేచ్ఛ నా, కెన్నండు లేదు మహీసురాగ్ర
గణ్యుల నత్యుగ్రకాననాంతరమున, నెవ్విధంబున భరియింతునొక్కొ
యని యిప్డు వగచెద ననవద్యగుణయుక్తి, ననఘ మాయట్టిగృహస్థతతికిఁ
బోష్యుల నెయ్యెడఁ బోవక యుండను, విప్రుల నతిథుల వృథయ పుచ్చఁ
ఆ. జనునె నిజధనంబు సంవిభాగించి యీ, వలయు సాధురక్ష వలయుఁ జేయ
నభిమతాశ్రమంబులందు గృహస్థాశ్ర, మంబ కాదె యుత్తమంబు వినఁగ. 30

వ. [2]మఱి యార్తునకు శయనంబును భీతున కభయంబును దృషితునకు జలంబును
బుభుక్షితునకు నన్నంబును శ్రాంతునకు నాసనంబును నిచ్చుట సనాతనం బైన
యుత్తమగృహస్థధర్మంబు తృణ భూ మ్యుదక ప్రియవచ నాదరదానం బెల్లవారికి
[3]నశ్రమంబ యాత్మార్థంబుగా నన్నపాకంబును నసాక్షికభోజనంబును వృథాపశు
ఘాతంబును బాపహేతువు లగ్నిహోత్రంబులు ననడ్వాహంబులు నతిథి బాంధవ
విద్వజ్జన గురు మిత్ర భామినీ నివహంబు లపూజితంబు లై యెగ్గు సేయును గావున
గృహస్థుండు సర్వసంతర్పకుండు గావలయుం గావునం బ్రతిదినంబును బక్షి
శునకశ్వాపదార్థంబు సాయంప్రాతలయందు వైశ్వదేవంబు సేసి యమృతాశియు
విఘసాశియుఁ గావలయు యజ్ఞశేషం బమృతంబు నాఁ బరఁగు [4]నతిథిభుక్త
శేషంబు విఘసంబు నాఁబడు నట్టివృత్తి వర్తిల్లువాఁ డుత్తమగృహస్థుం డనిన
ధర్మరాజునకు శౌనకుం డి ట్లనియె. 31

క. హరివిషయాభిలాషము, గారణముగ నెంతయెఱుక గలవారును దు
ర్వారవికారముఁ బొందెడు,వారు నిజేంద్రియము లవి యవశ్యము లగుటన్. 32

వ. సంకల్పజం బైనకాయంబునం గలిగినమనస్సుచేతం బ్రేరితం బై శ్రోత్రాదీంద్రి
యంబులు శబ్దాదివిషయంబులం బరిభ్రమించుటం జేసి విషయాభిలాషవిశిఖవిద్ధు
లై దేహులు తేజోలుబ్ధంబు లైనశలభంబులుంబోలె శోకానలంబునం బడి త
మెఱుంగక యవిద్యాకర్మతృష్ణలం జేసి సంసారచక్రంబునందుఁ బరివర్తిల్లుదు రట్టి

1. జ. నర్థత్యాగంబు సేయ వలయు రూప. 2. క. మఱి యార్తభీతుల కభయంబును. 'మఱి తృషితునకు జలంబును బుభుక్షితునకు నన్నంబును శ్రాంతునకు శయనంబును నిచ్చుట' అని పెక్కుప్రతుల పాఠము. 3. అ. నవశ్యంబ. 4. క. భోక్ష్యభుక్త.

బ్రహ్మాదితృణపర్యంతభూతప్రవృత్తియందు రాగద్వేషవిముక్తులై యభిమానమత్సరంబులు విడిచి వేదచోదితం బైనసమ్యక్సంకల్పసంబంధం బింద్రియనిగ్రహంబు వ్రతవిశేషంబు గురుసేవనం బాహారయోగం బధ్యయనాగమంబు కర్మసన్న్యాసంబు చిత్తనిరోధం బనునెనిమిదింటను గర్మానుష్ఠానంబు సేసినమహాత్ములు దమతమతపోమహత్త్వంబునం జేసి సంసారంబు జయింతురు నీవును శుశ్రూషాశ్రవణగ్రహణ[1]ధారణోహాపోహార్థవిజ్ఞానతత్త్వజ్ఞాన[2]సమన్వితుండవు నీచేతం [3]బ్రారబ్ధంబు లైనయవి సర్వంబులును సంపన్నంబు లగు. 33

క. వసురుద్రాదిత్యాదులు, వసుధేశ తపంబుగారవంబున నైశ్వ
ర్యసమృద్ధు లైరి తపమునఁ, బ్రసిద్ధముగ నిష్టసిద్ధి వడయుము నీవున్. 34

వ. తపస్సిద్ధు లైనవారు దమతలంచినదానిన క్రమంబునం బడయుదురు గావున నీవు నుపశమవంతుండ వై తపంబు సేసి యోగార్థసిద్ధి వడసి బ్రాహ్మణుల [4]ననుచరించుచు నీమనోరథంబు సఫలంబు సేయు మనిన శౌనకువచనంబు సేకొని భ్రాతృమధ్యగతుం డైనధర్మతనయుండు ధౌమ్యునకు నమస్కరించి యి ట్లనియె. 35

తే. వనమునకువచ్చి నవయంగ వలవ దుడుగుఁ, డనిన నుడుగక మాతోన యరుగు దెంతు
మనిరి బ్రాహ్మణుల్ వీరి కాహార మేయు, పాయమున నుగ్రవనమునఁ బడయ నేర్తు.

వ. వీరల విడువ నోప నేమి సేయుదు ననిన విని ధౌమ్యుండు పెద్దయుం బ్రొద్దు చింతించి ధర్మరాజున కి ట్లనియె. 37

ఆ. భూతరాశి తొల్లి పుట్టి బుభుక్షాభి, తప్తమయినఁ జూచి తద్భయంబు
నపనయింపఁ గడఁగి యదితిసుతాగ్రణి, కమలబాంధవుండు గరుణతోడ. 38

వ. ఉత్తరాయణగతుం డై యుర్వీరసంబు పరిగ్రహించి దక్షిణాయనగతిం బర్జన్యభూతుం డై యోషధులం బడసి రాత్రులయందుఁ జంద్రకిరణామృతంబునం జేసి వానిం దడుపుచు వర్ధించి యం దన్నంబు పుట్టించి [5]ప్రజాప్రాణధారణంబు సేయుటం జేసి యన్నం బాదిత్యమయం బని యెఱింగి తొల్లి భీమ వైన్య కార్తవీర్య నహుషాదులు యోగసమాధిస్థితు లై సూర్యభజనంబున నన్నంబుఁ బడసి యాపదలవలనం బ్రజల సముద్ధరించిరి గావున. 39

లయగ్రాహి.
వారిరుహమిత్రు నమరోరగమునిద్యుచరచారణగణప్రణుతచారుగుణు భూతా
ధారు నఖిలశ్రుతిశరీరు హరిశంకర సరోరుహభవప్రతిము దారుణతమిస్రా
దారణమరీచిపరిపూరితదిగంతరు నఘారి నతికారుణికు సూరుఁ ద్రిజగద్ర
క్షారతుసహస్రకరుఁ గోరి భజియింపుము మనోరథఫలంబు లగు భూరిభుజ నీకున్.

వ. అని ధౌమ్యుండు విశుద్ధాత్ముం డైనధర్మరాజునకు సూర్యుం డర్ఘ్యముండు భగుం

---

1. గ. ధారణరుచివిజ్ఞాన. 2. జ. సంబంధితుండవు. 3. గ. బ్రారంభితంబైన. 4. క. భరింపు నీకు మనోరథంబు సఫలం బగు ననిన. 5. గ. ప్రజారక్షణంబు.

డనునివి మొదలుగాఁ గలనామంబులయష్టోత్తరశతంబు నభీష్టసిద్ధిప్రదం బయినదాని విస్పష్టార్థవర్ణోచ్చారణంబును విధియుక్తంబును గా నుపదేశించి దీనిం దొల్లి యింద్రువలన [నారదుండు వడసె నారదువలన (వసు వసురాజు వడసె) నాతనివలన నేను బడసితి] నేను నీ కిచ్చితి నిది దేవనిర్మితంబు దీన నాదిత్యు నతిభక్తి నారాధింపు మనిన. 41

ధర్మరాజు సూర్యు నారాధించి వరంబు గొనుట.

సీ. హితుఁ డైనతనపురోహితునుపదేశంబు, పేర్మితోఁ జేకొని ధర్మసుతుఁడు
నెమ్మిఁ బుష్పోపహారముల నాదిత్యుఁ, బూజించి భాగీరథీజలంబు
లం దుండి విషయంబులం దింద్రియంబుల, [1]ననవరతావధానమున నొడిచి
వాయుభోజనుఁడుఁ బ్రాణాయామపరుఁడునై, సూర్యాదినామముల్ సూర్యుగుఱిచి
ఆ. జపము సేయుచున్నఁ దపనుఁ డాతనికిఁ బ్ర,త్యక్షమయి త్రిలోకచక్షుఁ డమర
వరుఁడు దురితహరుఁడు తరణి త్రయీమూర్తి, వనజమిత్త్రుఁ డిట్టు లనియెఁ గరుణ.

వ. నీతపమునకు మెచ్చితి నీ(వరణ్యమున నుండఁగల) పండ్రెండేండ్లును వన్యఫలమూలకంబులు నీమహానసంబున ద్రుపదరాజపుత్త్రిచేత సాధితంబు లై యక్షయంబు లైన చతుర్విధాహారంబు లగు నని వరం బిచ్చి వనజహితుం డంతర్హితుం డైన. 43

చ. అడరఁగ ధర్మనందనుఁ డహర్పతిచేత వరంబు పేర్మితోఁ
బడసి మహీసురోత్తముల భవ్యులఁ బల్వుర నిర్వహించె న
ప్పుడు ద్రుపదాధిరాజసుత పొల్పుగ వండినశాకమూలముల్
గడురుచి నిష్టభోజనసుఖంబును దృప్తియుఁ జేయు చుండఁగన్. 44

వ. ఇట్లనేకసహస్రమహీసురవరుల ననుదినంబును నభిమతభోజనంబులం దనిపి విఘసామృతభోజనంబులం దృప్తు లైనతనపతులభుక్తశేషంబు ద్రుపదపుత్త్రిక యుపభోగించు చుండం గొన్నిదినంబు లందు యుండి పాండవులు బ్రాహ్మణులచేతం గృతస్వస్త్యయను లై బ్రహ్మర్షిసంఘంబులతోఁ గామ్యకవనంబున కరిగి రంత నిట ధృతరాష్ట్రుండు విదురుం బిలిపించి నీవు భార్గవుకంటె బుద్ధిమంతుండవు పాండవకౌరవులకు సముండవు సమ్మతుండవుఁ జెప్పు మింక నప్పాండవు లేమి సేయువా రనిన విదురుం డి ట్లనియె. 45

మత్తకోకిలము. దేవమూర్తులు పాండుపుత్త్రులు ధీరచిత్తులు వారిపెం
పే వెలుంగనివాఁడవే ధరణీశ వాయుసుతుండు గాం
డీవియుఁ భుజవిక్రమప్రకటీకృతుల్ వివిధాస్త్రవి
ద్యావిశేషులు వైరివీరులఁ దక్క నిత్తురె పోరులన్. 46

వ. కదిసి యధర్మద్యూతంబున భేదము పుట్టఁ బాండుపుత్త్రులకును నీ
తనయుల కని మును చెప్పిన, విన నొల్లక కొడుకుపలుకు వింటివి కడఁకన్. 47

---

1. క. ననవరతానుభావమున నొడిచి. 2. పోష్యభుక్త.

వ. ఇంక నయినను వారి రావించి తొల్లి నీచేతం బడయం బడినరాజ్యంబునందుఁ బ్రతిష్ఠించి కీర్తియు ధర్మంబును నిలుపుము రాజ్యంబును ద్రివర్గంబును ధర్మమూలంబులు గావున నంద వర్తిల్లు మధర్మవర్తి యయి కర్ణశకునిదుశ్శాసనశిక్షితుం డైన దుర్యోధనుదుశ్చేష్టితంబుల కొడంబడ వలవదు. 48

తే. వీనిపుట్టినపాపంపువేళఁ బెక్కు, దుర్నిమిత్తముల్ పుట్టిన నిర్ణయించి
యేను జెప్పితిఁ దొల్లియు వీనిచేత, నెట్టుఁ గౌరవులకు నెగ్గు పుట్టు ననియు. 49

వ. కులదూషకు దూషించి కులంబు రక్షించుట ధర్మువు ధర్మరాజు నఖిలమహీరాజ్యరక్షకుం జేసి పుత్త్రపౌత్త్రమిత్త్రామాత్యబంధువర్గంబుల నెల్ల రక్షింపుము సభామధ్యంబునందు ద్రౌపదీభీమసేనులం బ్రార్థింప దుశ్శాసనుం బంపుము. 50

చ. అతిశయితామరోత్తముఁ డహర్పతితేజుఁ డజాతశత్రుఁ డూ
ర్జితుఁ డజితుండు నీసుతులు సేసినయెగ్గు దలంపఁ డాతనిన్
ధృతి ననునీతుఁ జేయుము ప్రతీపకులోత్తమ యిట్ల యైన నీ
[1]కృతమునఁ గౌరవాన్వయ మకిల్బిషకీర్తిఁ బ్రకాశితం బగున్. 51

వ. అని పలికినవిదురుపలుకులు విని కడు నలిగి ధృతరాష్ట్రుం డి ట్లనియె. 52

క. నాదేహంబునఁ బుట్టిన, యాదిసుతుర్ విడువ నెట్టు లగు నాత్మజులం
గా దనక విఘాతించుద, యాదూరులు గలరె యిట్టు లన నీ కగునే. 53

వ. నీవు నాకొడుకులయున్నతి కెన్నండు సహింపవు నీసహాయత్వంబు నేనొల్లఁ బాండవులకడ కేనియు నొండుగడ కేనియు నీకిష్టం బైనచోటికి నరుగు మనిన నాక్షణంబ విదురుండు మనోజవైకరథారూఢుం డై పాండవులకడకుం గామ్యకవనంబున కరిగె నంత నతనిరాక దవ్వులం గని ధర్మరాజు భీమసేనున కి ట్లనియె. 54

సీ. గాండీవ మాదిగాఁ గలయాయుధావలు, లుక్కివంబున నప్పు డొడిచికొనఁగ
మఱచినవాఁ డయ్యు మందాత్ముఁ డాధార్త, రాష్ట్రుండు గాంధారరాజతనయు
వచనముల్ విని యక్షవతినెపంబున వానిఁ, గష్టుఁ డై కొన సమకట్టి మనల
మగిడింపఁగా దుష్టమతిఁ జేసి విదురుఁ బు, త్తెంచెఁ గా కున్న నేతేరఁ డితఁడు

ఆ. సింక జూద మాడ నే నోప నిది పని, గాఁగ వచ్చు నొక్కొ కడఁగి విదురుఁ
డేమి సేయువార మితనినియోగంబు, మనకుఁ జేయ కునికి మానుషంబె. 55

వ. అని తమలోఁ బలుకుచున్నసమయంబున విదురుం డేతెంచిన నతనికిఁ బ్రత్యుద్గతు లై వినయప్రియసత్కారంబుల సంతుష్టుం జేసి తదాగమననిమిత్తం బడిగిన వారికి విదురుం డి ట్లనియె. 56

క. మతి వారికి మాకును గడు, హితుఁడవు చెపు మయ్య యింక నెయ్యది కార్య
స్థితి యని ధృతరాష్ట్రుం డే, కత మిష్టం బైనకార్యగతి నన్నడుగన్. 57

వ. ఏ నుభయపక్షంబులవారికి జగంబునకు లగ్గుగ హితం బైనవిధంబు సెప్పిన నది

1. కతమున...మకల్మషకీర్తిఁ.

సర్వజనరుచికరం బైనయాహారంబు రోగాతురునకు నరుచికం బైనయట్ల యతనికి రుచియింప దయ్యె. 58

ఆ. కార్యగతుల తెఱఁగుఁ గలరూపు సెప్పిన, నధికమతులు దానిఁ [1]నాదరింతు
రల్పకార్యబుద్ధు లగువారలకు నది, విరసకారణంబు విషముపోలె. 59

వ. దాననచేసి ధృతరాష్ట్రుండు నన్నొల్లక యెగ్గులు వలికి నీవు విపరీతచేతస్కుండ విందుండ వలవదు పాండవులకడకుం బొమ్మనిన వచ్చితి రూపలావణ్యవతి యై వృద్ధశ్రోత్రియునిచేతం బరిణీత యైనతరుణియుంబోలె రాజ్యలక్ష్మి యద్దురాత్మునందు విరక్తయ కాని ప్రీతిఁ బుట్టింపదు. 60

ఆ. ధర్మరహితు లైనధార్తరాష్ట్రులకు భూ, రాజ్యలక్ష్మి సుస్థిరంబు గాదు
ధర్మతనయ నిన్నుఁ దద్రాజ్యసంపదల్, వలచి తమకుఁ దామ వచ్చి పొందు.

వ. నావచనంబున నెగడునది యనిన ధర్మరాజు నట్ల చేయుదు నని యున్నంత నిట ధృతరాష్ట్రుండు పాండవులయొద్ద విదురునునికి యెఱింగి ధృతిహీనుం డై తన హృదయంబును దృష్టియుం బోనివిదురుం బాసి నిమిషం బేని నిర్వహింప నోపక సంజయున కి ట్లనియె. 62

క. నెమ్మి గలవాని నాచి, త్తమ్మెఱిఁగెడువాని విదురు ధర్మప్రియు నా
తమ్ముని నిట వేగ తోడ్కొని, రమ్మరుగుము కామ్యకాఖ్యరమ్యాటవికిన్. 63

వ. అని పంచిన నప్పుడ సంజయుం డతిత్వరితగతిం గామ్యకవనంబున కరిగి. 64

మ. ధరణీదేవసహస్రసంకులముతోఁ ధౌమ్యుండు ధర్మక్షమా
భరణుల్ నల్వురు దమ్ములున్ విదురుఁడుం బాంచాలియుం బ్రీతిఁబం
ధురు లై [2]కొల్చుచు నుండ నున్నబుధమిత్రున్ ధర్మరాజుం బ్రభా
స్వరతేజుం బ్రభుఁ గాంచి సంజయుఁడు సంజాతప్రమోదాత్ముఁ డై. 65

క. వనవాసము సేసియుఁ ద్రిభు, వనరాజ్యము సేయునట్టివడువున సంతో
షనిబద్ధబుద్ధి యగుయమ, తనూజునకు భక్తి నెఱఁగి తా ని ట్లనియెన్. 66

వ. మిమ్ము ధర్మార్థవిదుం డైనవిదురునిం గౌరవేంద్రుం డిప్పుడుం దలంచు చుండు మీయనుమతంబునఁ దనయనుజుం దోడ్కొనితేర నన్నుఁ బుత్తెంచె ననిన విని ధర్మరాజు విదురున కి ట్లనియె. 67

తే. సర్వజనులును ధృతరాష్ట్రశాసనంబు, సేయు చున్నచో మనకు విశేషభక్తిఁ
జేయవలయుఁ గావున నెడసేయ కరుగు, మనిన విదురుండు గజపురి కరిగె నంత.

వ. ధృతరాష్ట్రుండును వినియవినమితోత్తమాంగుం డైనవిదురు నతిస్నేహంబునం గౌఁగిలించుకొని మూర్ధాఘ్రాణంబు సేసి నీవు నిత్యక్షమానిరతుండవు నాబుద్ధిలేమికి క్షమియింపు మనిన విదురుం డి ట్లనియె. 69

---

1. ననుచరింతు. 2. క. కొల్వఁగ నొప్పుచున్న బుధబంధున్.

ఆ. నీవు నీసుతుండు నెఱిఁ దప్పి పలికినఁ, బథ్య మయినపలుక పలుక వలయు
నీరు లయినపాండవేయులతో విగ్రహంబు సేయు టిది నయంబు గాదు. 70

వ. అనుచు నెప్పటియట్ల కార్యసహాయుం డై విదురుండు ధృతరాష్ట్రునొద్ద నున్న
నయ్యిద్దఱసంగమంబునకు శంకించి దుర్యోధనుండు కర్ణ శకుని దుశ్శాసనులతో
ని ట్లనియె. 71

క. పాండవహితుఁ డగువిదురుఁడు, వెండియుఁ జనుదెంచి కార్యవిధులందు సహా
యుం డయ్యె నతనితోడ హితుం డయి మంతనము సేయఁ దొడఁగెఁ విభుఁడున్.

వ. వీర లింకఁ బాండవుల నిందులకు రావించువార లయిన నగ్నివిషజలంబులు ప్రయో
గించి వారల కపాయంబు సేయుద మనిన విని శకుని దుర్యోధనుం జూచి యి ట్లేల
బాలిశం బైనమతిఁ దలంచితివి విదురధృతరాష్ట్రులు విపరీతమతు లై రావించినను
నిత్యసత్యనిరతు లైనయప్పాండవులు దమ చేసినసమయంబు సలుపక యేల వచ్చు
వా రగుదు రనిన శకునిదుర్యోధనులకుఁ గర్ణుం డి ట్లనియె. 73

ఉ. ఇత్తఱిఁ బన్ని పోయి పయి నెత్తి రణం బొనరించి వారలన్
మిత్తికి నంపి ధాత్రి నిరమిత్రముఁ జేయుద మిట్టు లైనఁ ద
ద్వృత్తులు నీక దక్కుఁ గురువీర కడంగుము నావుడున్ మదో
న్మత్తుఁడు కౌరవుం డతనిమాటకు సంతస మంది చెచ్చెరన్. 74

వ. సమరసన్నద్ధుఁ డై సమస్తబలంబును సమకట్టి వెలువడినం దనదివ్యదృష్టి
నంతయు నెఱింగి కృష్ణద్వైపాయనుండు వచ్చి యిది ధర్మంబు గా దుడుగు మని
దుర్యోధనుని వారించి ధృతరాష్ట్రున కి ట్లనియె. 75

క. పుడమియు రాజ్యముఁ గోల్పడి, యడవుల నేకతమ యున్నయప్పాండవులం
గడఁగి వధియింపఁగా నీ, కొడుకు కరిగెడు ని ట్లు తలఁపఁ గూడునె బుద్ధిన్. 76

క. ధృతియుతు లై [1]సత్యవ్రత, రతు లయి పదుమూఁడువత్సరంబులు ధర్మ
స్థితి సలిపి వార కడఁగెద, రతులపరాక్రములు మీఁద నాహవమునకున్. 77

క. వనగతు లని వారలపైఁ, జని భంగముఁ బొంది రాఁగ సమకట్టెడు నీ
తనయుఁడు గావున నీ వా, తని వారింపు మది యనుచితం బని నెమ్మిన్. 78

క. విను [2]నీవును గురుఁడును శాంతనవుఁడు విదురుండు నుండి తగునె యధర్మం
[3]బున నీయుపేక్ష ననయం, బును బాండవవిగ్రహంబు పుట్టుట లగ్గే. 79

వ. అనిన విని ధృతరాష్ట్రుండు దుఃఖితుం డై నాకును గాంధారికిని భీష్మ విదుర కృప
ద్రోణులకు ననిష్టం బైన దుష్టద్యూతంబు [4]ప్రవర్తించి దుర్బుద్ధి యైనదుర్యోధనుం
బుత్త్రస్నేహంబున విడువ నోప (నేమి సేయుదు) ననిన ధృతరాష్ట్రునకుఁ గృష్ణ
ద్వైపాయనుం డి ట్లనియె. 80

---

1. గ. యురుసత్యవ్రతు లై. 2. అ. మేను నీవు గురుశాంతనవులు. 3. జ. బు నుపేక్షింపఁగ ననయంబునఁ. 4. ఇది ప్రేరణార్థకము.

ధృతరాష్ట్రునకు వ్యాసుఁ డింద్రసురభిసంవాదంబు సెప్పుట.

ఆ. ఎల్ల నెయ్యములకుఁ దల్లిదండ్రులయందు, సుతులవలని నెయ్య మతిశయంబు
ధనము లెంత గలిగినను సుతరహితుల, కెమ్మెయిని మనఃప్రియమ్ము లేదు. 81

వ. తొల్లి సకలగోమాత యయినసురభి సురరాజుకడకుం బోయి కరుణంబుగా నేడ్చిన దానిం జూచి సురపతి విస్మితుండై యిట్లేల రోదనాకులితలోచన వయి యున్నదాన వెల్లవారికి లగ్గ కదా యనిన నింద్రునకు సురభి యిట్లనియె. 82

క. నీవజ్రము రక్షింపఁగ, నావారికి దక్కఁ ద్రిభువనంబులఁ గల భూ
తావలి కెల్లను గుశలము, దేవేంద్ర జగత్త్రయప్రదీప మహాత్మా. 83

వ. దీనిం జిత్తగింపుము బలంబు గలబలీవర్దంబులతో బలహీనంబు లయినవానిం బూనిన నవి దుర్వహభారవహనమహాలాంగలాకర్షణంబులయం దసమర్థంబు లైన నడిచియుం బొడిచియు ములుకోలలం గుట్టియుఁ దిట్టియు దుర్బలబలీవర్దంబుల జనులు బాధింపం జూచి యేను దానికి దుఃఖించెద ననిన సురభికి సురపతి యిట్లనియె. 84

క. నీకు నపత్యశతంబు ల, నేకంబులు గలవు వాని కేకాకృతి దుః
ఖాకులత సంభవింపదు, శోకింపకు మనిన సురభి సురపతి కనియెన్. 85

వ. దేవా దీనాననంబు లయి దుర్బలంబు లయినయపత్యంబులదుఃఖం బే నెట్లు సూడ నోపుదు ననిన నగి యింద్రుండు దానికిం గరుణించి వర్షంబునఁ దృణవర్ధనంబు సేసి దుర్బలబలీవర్దంబులకు బలంబు గావించె నని యింద్రసురభిసంవాదంబు (వేదంబులందు) వినంబడుఁ గావున నీకుం బుత్త్రస్నేహంబు సామాన్యంబుగా దైనను దీను లై వనంబున ననయు చున్నయప్పాండవులకు దయాళుండ వగుము.

తే. నీవుఁ బాండుండు విదురుండు నెమ్మి నాకు
నొక్కరూపైనయట్లు నీకుఁ గుంతితనయులు
నీసుతులు నూర్వురును బాండునృపతనూజు
లేవురును నొక్కరూప కా నెఱుఁగవలయు. 87

క. సుజనులసహవాసంబునఁ, గుజనులు సద్ధర్మమతు లగుట నిక్కము ధ
ర్మజునొద్దనుండి నీయా, త్మజుఁడు ప్రశాంతుండు ధర్మమార్గుండు నగున్. 88

వ. రాజర్షి యైనధర్మరాజుతోడిసహవాసంబు సర్వజనహితంబు గావున నాతని నుపాసించి దుర్యోధనుం (డతనియొద్దఁ) గొండొకకాలం బుండునట్లుగాఁ బనుపు మట్లయిన నుభయపక్షంబులకు లగ్గగు ననిన ధృతరాష్ట్రుండు కృతాంజలి యయి మునీంద్రా దుర్యోధనుండు నాపలుకులు వినండు కురుకులంబు రక్షించునట్టిబుద్ధి గలదేని వాని మీర శిక్షింపుం డని మ్రొక్కిన. 89

క. అనఘుఁడు మైత్రేయుఁ డను, మునినాథుఁడు వచ్చి ధర్మమున నాతని దా
ననుశాసించుఁ జిరంబుగ, నని చెప్పుచు నప్పరాశరాత్మజుఁ డరిగెన్. 90

వ. అంత. 91

ఉ. న్యాయవిదుండు కామ్యకవనంబున ధర్మజునొద్దనుండి మై
త్రేయుఁడు ధీయుతుం డరుగుదెంచిన నప్పుడ యమ్మునీంద్రు నిం
ద్రాయితుఁ డాంబికేయుఁ డుచితస్థితిఁ బూజితుఁ జేసె నాత్మ ని
శ్శ్రేయసలాలసుం డయి విశేషసపర్యలఁ జేసి భక్తితోన్. 92

వ. ఇట్లు దనచేతం బూజితుం డై సుఖవిశ్రాంతుం డైన మునివరునకు ధృతరాష్ట్రుండు ముకుళితహస్తుం డై భట్టారకా యెందుండి వచ్చితి రని యడిగిన నతనికి మైత్రేయుం డి ట్లనియె. 93

చ. అలఘుతపోభరంబున జటాజినముల్ ధరియించి రూక్షవ
ల్కలములు గట్టి కూరలును గాయలుఁ బండులు భోజనంబుగా
నలయక కామ్యకం బనుమహావిపినంబున నున్న పాండవే
యులకడనుండి వచ్చితిఁ గురూత్తమ నీసుతు నిన్నుఁ జూడఁగన్. 94

వ. ఏ నఖిలతీర్థదర్శనార్థంబు పరిభ్రమించుచుఁ గురుజాంగలంబున కరిగి యందుఁ గురుకులోత్తము లైనపాండుపుత్త్రులం జూచితి. 95

ఆ. అనిన నవనతాస్యుఁ డయి ధృతరాష్ట్రుఁ డి, ట్లనియె నెట్లు సెప్పుఁడయ్య యందుఁ
బాండవులకు సత్యభాషణులకుఁ గుశ,లం బె వార లిట దలంతురొక్కొ. 96

క. అమితభుజశక్తి నంతక, సము లప్పాండుసుతు లిందు సౌభ్రాత్రస్నే
హమునకు విచ్ఛేదముగా, సమయాతిక్రమము సేయ సమకట్టరుగా. 97

వ. అనిన మైత్రేయుం డి ట్లనియె. 98

క. చనుదెంచి మహామునివరు, లనవరతము వారలకుఁ బ్రియంబొనరఁగ దీ
వన లీఁగఁ జేసి కుశలమ, మనుజేశ్వర వారు ధర్మమతియుతు లగుటన్. 99

క. వారలు సమయము దప్పిన, వారిజరిపుహితులగతు లవశ్యముఁ దప్పున్
వారికి నకారణంబ ని, కారము నీకొడుకు సేసెఁ గడు నహితుం డై. 100

వ. అని దుర్యోధనుం జూచి యయ్యా నీవు బుద్ధి గలవేనిఁ బాండవులతో విరోధంబుడుగు మ ట్లయిన నీకును వారికిం గురుకులంబునకు లగ్గగు నాపలుకుఁ జేకొనుము.

సీ. వజ్రసంహనను లవార్యపరాక్రముల్, పాండుకుమారు లాఖండలాభు
లందఱు నాగశతాయుతప్రాణు లు, గ్రాహవకాంక్షు లుత్సాహపరులు
వారలలో బలవంతుండు బకహిడిం, బాసురు లనువారి [1]నాసురమునఁ
జంపె నాగాయుతసత్త్వ జరాసంధు, నెక్కటి మోర్చినయక్కజుండు

తే. [2]ఘోరవనమున వీరుఁ గిమ్మీరుఁ డనుసు, రారి [3]నిశ్చలఘనభీకరాంగుఁ బట్టి
పోర వధియించినట్టిసమీరజునకు, భూరిభుజునకు మార్కొనువారుఁ గలరె.

1. అ. నాహవమున. 2. క. ఘోరరణమున. 3. అ. నిశ్చలభీకరాకారు.

మైత్రేయుఁడు దుర్యోధనుని శపించుట.

వ. వారికి వాసుదేవధృష్టద్యుమ్నులు సంబంధసహాయులు జరామరణవంతు లైన మనుజులు వారిం జెనకి యెట్లు జీవింతురు నీవు వారితో నోడంబడి యుండు మిది కార్యం బనిన మైత్రేయుపలుకు లాదరింపక పాదాంగుష్ఠంబున నేల వ్రాయుచు బాహు లెత్తి తొడలు సఱచి నగు చున్నయాదుర్యోధనుం జూచి మైత్రేయుం డలిగి యీయపరాధంబున నాహవం బగు నందు భీముగదాఘాతంబున నీయూరుయుగళంబు భగ్నం బయ్యెడు మని శాపం బిచ్చిన వెఱచి ధృతరాష్ట్రుండు మునీంద్రా యట్లు గా కుండం బ్రసాదింపు మనిన న మ్మునివరుం డి ట్లనియె. 103

తే. కడఁగి సమబుద్ధి వీనికిఁ గలిగెనేనిఁ, గాదు శాపఫలం బట్లు గాక బుద్ధి
హీనుఁ డై గర్వితుం డగు నేని శాప, హవ్యవాహఫలంబు వీఁ డనుభవించు. 104

వ. అని ప్రసన్నుం డైన మైత్రేయునకు నాంబికేయుం డి ట్లనియె. 105

క. కిమ్మీరుం డనురక్కసుఁ, డమ్మారుతతనయుచేతఁ నత్యుగ్రవనాం
తమ్మున నిహతుం డయినవి, ధ మ్మెట్టులు సెప్పు మద్భుతం బిది యనినన్. 106

వ. నాపలుకులు నీకొడుకు వినండయే నేల చెప్పెద దీనిం బాండవసహాయు లైన విప్రులచేత విదురుం డిమ్ముగా నెఱింగినవాఁ డతనివలన విను మని చెప్పి మైత్రేయుం డరిగినం గిమ్మీరవధకథాశ్రవణ[1]పరుం డై త న్నడిగినధృతరాష్ట్రునకు విదురుం డి ట్లనియె నిం దుండి చని పాండవులు మూఁ డహోరాత్రంబులు నిరంతరప్రయాణంబు సేసి కామ్యకవనంబుఁ జొచ్చువా రొక్కనాఁటియర్ధరాత్రంబున రాక్షసప్రచారవేళయందుఁ బరిభ్రమించుచు రాక్షసమాయ గావించుచున్నవాని నతినిశితదంష్ట్రాకరాళం బైనతనవదనగహ్వరంబుఁ దెఱచి గ్రుడ్లు మెఱవ బభ్రుకేశంబులు దూల బాలార్కరశ్మియుతం బయినబలాహకంబునుంబోలె సకలప్రాణిభయజననంబుగా గర్జిల్లు చున్నవాని [2]నిజపాదఘట్టితమహీతలప్రచలనవేగవేల్లితవల్లీపల్లవబాహుపరిరంభణసుఖంబుఁ బాదపంబుల కాపాదించు చున్నవాని నెదుర నొక్కరక్కసుం గని రంత వాఁడును బ్రాహ్మణసంఘంబుముందటఁ గృష్ణాజినావృతు లై వచ్చుపాండవుల దవ్వులం గని మార్గనిరోధి యై మహాపర్వతంబునుంబోలె నున్న నదృష్టపూర్వప్రమాణం బైనవానిదేహంబుఁ జూచి నిమీలితనయన యయి దుశ్శాసనకరాకృష్టవికీర్ణవేణీభరంబు వెనువెంట నొలయం బాంచాలి పంచపర్వతంబులనడిమినదియుంబోలెఁ బతులనడుమ భయవ్యాకులచిత్త యైన నింద్రియంబులు విషయరతిం బరిగ్రహించునట్టు లేవురు నక్కోమలిం బట్టుకొని భయపడ కుండ నాశ్వాసించు చున్నంత. 107

క. రక్షోఘ్నమంత్రముల నా, రాక్షసమాయాపరిస్ఫురణఁ జెఱిచెఁ గ్రియా
దక్షుఁడు ధౌమ్యుఁడు పాండవు, లీక్షించుచు నుండఁగా నహీనప్రతిభన్. 108

1. గ. కుతూహలుం డై. 2. గ. జ. నిజపాదఘట్టనమహీతలప్రచురవేల్లితవల్లీపల్ల.

వ. అంత. 109

క. ప్రతివిహితమాయు నత్యా, యతభుజయుగుఁ గోపఘూర్ణితారుణవిస్ఫా
రితనేత్రు నసురఁ జూచి భ, రతకులనందనుఁడు ధర్మరా జి ట్లనియెన్. 110

వ. నీ వెవ్వరివాఁడ వెవ్వండ వీవనంబున నేల యున్నవాఁడ వనిన వాఁ డి ట్లనియె. 111

క. ఏను బకాసురునసుజుఁడఁ, గీనాశుఁడ మానవులకుఁ గిమ్మీరుఁ డనం
గా నెగడుదు నీకామ్యక, కాననమున సర్వసత్త్వఖాదనబుద్ధిన్. 112

క. పాయక యుండుదు రాక్షస, మాయల సమరంబు సేసి మనుజుల విగతో
పాయులఁ జంపుచు భక్షణ, సేయుదు నమరాదులకు నజేయుఁడఁ బోరన్. 113

వ. నాకు వెఱచి యెల్లవారును నతిదూరంబున దీనిం బరిహరింతురు మీ రెవ్వరిం
దుల కేల వచ్చితిరి మి మ్మందఱ వధియించి యిపుడ భక్షించెద ననిన వానికి యుధి
ష్ఠిరుం డి ట్లనియె. 114

ఆ. ఏను ధర్మసుతుఁడ నీతఁడు భీముండు, వాఁడు విజయుఁ డల్లవారు గవలు
[1]పాండవేయుల మనుప్రథ నవవాసంబు, సేయ వచ్చితిమి విశేషయుక్తి. 115

సీ. అనవుడు రాక్షసుం డట్టహాసంబుతో, నట్టట్టు భీముండె యీతఁ డేమి
పుణ్యమో వీని నెప్పుడు సంపఁ గాంతునో, యని యున్నచోఁ దానె యరుగుదెంచె
నధికమాయన్న బకాసురు నాయిష్ట, సఖు హిడింబాసురుఁ జంపి యున్న
ఖలు మ్రింగి జీర్ణంబు గావింతు వాతాపిఁ, దడయక మ్రింగినతపసియట్ల

ఆ. యనిన రక్కసునకు [2]నరిగినయగ్రజు, నలుక మెఱఁగి వీరుఁ డర్జునుండు
మొనసి గాండివంబు మోపెట్టె నవశిత, ఖడ్గపాణు లైరి కవలు నంత. 116

కిమ్మీరుం డను రాక్షసుఁడు భీముచేఁ జచ్చుట.

ఉ. ఘోరపరాక్రముల్ ప్రబలకోపపరుల్ పృథుసారభూరిభూ
మీరుహపాణు లుద్ధతు లమిత్రవిఘాతులు వీరబృందబృం
దారకు లార్చు చొండొరులఁ దాఁకిరి దారుణభంగిఁ బొంగి కి
మ్మీరసమీరసూనులు సమీరవిధూతపయోధులట్టి రై. 117

తరలము. పొరిని వారలచేతియున్న త[3]భూరుహాయుధముల్ పర
స్పరకఠోరశిరస్థలంబులపై వడిం బడి మత్తకుం
జరశిరఃపతితంబు లై నలసన్మృణాళములట్ల జ
ర్జరిత మయ్యెఁ దదారవప్రతిశబ్ద మొప్ప [4]నగంబులన్. 118

వ. ఇట్లొక్కముహూర్తంబు వృక్షయుద్ధంబు సేసి యాసన్నమహీరుహంబులు సమ
సిన నయ్యిద్దఱు శిలాయుద్ధంబునకుఁ దొడంగి చేయు నెడం బవనజనిక్షిప్తనిష్ఠుర
శిలాహతహృదయుం డై భానుం బట్టుకొను స్వర్భానుండునుం బోలెఁ గిమ్మీరుండు

---

1. అ. పాండవులము సమయపడి వన. 2. నలిగిన. 3. భూరిభూరుహముల్; జ. భూరుహాయుత
ముల్. 4. ఖ. అ. నభంబునన్.

భీముం బట్టుకొనిన భీముండు వాని హీనబలుం గా నెఱింగి కృతాంతదండాను
కారంబు లయినతనబాహుదండంబుల నమ్మనుజకంటకుకటికంఠప్రదేశంబులు
పట్టుకొని నేలం బెట్టి దేహయష్టి విఱిచి బకుం జంపినవిధంబునఁ గిమ్మీరు విగత
ప్రాణుం జేసి. 119

తే. బకహిడింబులు హతు లైనఁ బనివి పనివి, యఱచి శోకింపఁగానక యమపురమున
కరిగి తక్కట రాక్షస యనుచుఁ దెరువు, వాయఁ బావని దత్కళేబరము వైచె.

వ. ఇట్లు ధర్మరాజువచనంబునఁ గిమ్మీరు నశ్రమంబున వధియించి తద్వనవాసులకు
రాక్షసభయం బుడిపినమహావీరు నమ్మారుతాత్మజు ధర్మార్జుననకులసహదేవులును
ధౌమ్యాదిమహీసురవరులును బ్రశంసించి రని విదురుండు గిమ్మీరువధ సెప్పిన విని
ధార్తరాష్ట్రులకు హృదయదళనం బయ్యె నిట పాండవులు కామ్యకవనంబున నుండు
నంత. 121

యాదవపాంచాలాదులు పాండవులకడ కేతెంచుట.

సీ. వసుమతీరాజ్యంబువలన నిరస్తు లై, మునివృత్తి నత్యుగ్రవనములోన
నవయుచుఁ బాండుభూనాథనందను లున్న, వా రని విని యతిక్రూరమతుల
ధృతరాష్ట్రసుతుల నిందించుచుఁ బాంచాల, యాదవవృష్ణిభోజాంధు లెల్ల
నచ్యుతప్రముఖు లై యప్పాండవులకడ, కేతెంచి శోకపరీతు లగుచు

ఆ. నున్న నధికధర్మయుక్తుఁ డుపేంద్రుండు, నికృతిఁ జేసి పాపనియతబుద్ధిఁ
బాండవులకు నట్లపాయంబు సేసిన, ధార్తరాష్ట్రులకును దద్ద యలిగి. 122

క. అనిఁ గర్ణశకునిదుర్యో, ధనదుశ్శాసననవాస్రధారాపాతం
బునఁ దృప్తివొందు వసుధాం, గన రాక్షసకాకగృధ్రగణములతోడన్. 123

క. అవినీతుల వధ్యులఁ గా, రవపాంసులఁ జంపి ధర్మరాజునకుఁ గురు
ప్రవరున కొనరింతమ యా, యవనీరాజ్యాభిషేక [1]మవిజితశక్తిన్. 124

వ. అని యుగాంత్యకాలకుపితకృతాంతాకృతి నున్నజగన్నాథు జనార్దనుం బ్రశాంత
చిత్తుం జేసి యర్జునుం డతని ని ట్లని కీర్తించె. 125

ఆ. పూజ్యుఁడవు పురాణపురుషుండ వీశుండ, వప్రమేయుఁడవు చరాచరంబు
లయినభూతరాసు లచ్యుత నీయంద, పుట్టు నిలుచు లయముఁ బొందుచుండు.

వ. నీవు దొల్లి గంధమాదనంబునం గందమూలఫలాశనుండ వై పదివేలేండ్లు తపంబు
సేసి పుష్కరంబున నేకాదశసహస్రవర్షంబులు జలంబుల యాహారంబుగా నుండి
ప్రభాసం బనుతీర్థంబున దివ్యసహస్రవర్షంబు లేకపాదస్థితుండ వయి యుండి బదరీ
వనంబునం [2]బవనంబు భక్షించుచు నూర్ధ్వబాహుండ వయి యేకపాదంబున
ననేకసహస్రవర్షంబులు నిలిచి సరస్వతీసత్త్రంబున [3]నవకృష్ణోత్తరాసంగుండ వై ని
యమకృశీకృతశరీరంబుతోఁ బండ్రెండు వర్షంబు లశేషవ్రతంబులు సలిపినతపోని

1. గ. మవహితబుద్ధిక్. 2. జ. దత్ఫలంబులు. 3. గ. నపకృష్టోత్తరా.

ధానంబవు నిఖిలలోకజైత్రుండ వయి చైత్రరథంబున నుత్తమక్రతువు లనేకం బులు సేసి యొక్కొక్కక్రతువునకు నూఱుసేసిలక్షలు సువర్ణంబులు దక్షిణ లిచ్చిన యజ్ఞపురుషుండవు తపోయజ్ఞంబులు రెంటను సమృద్ధతేజుండ వయి దైత్యదాన వేంద్రుల వధియించి యింద్రున కింద్రత్వం బేకాధిష్ఠితంబు సేసినలోకప్రభుండ వదితికిం గశ్యపునకు నుదయించి యింద్రానుజుండ వై త్రివిక్రమంబులం ద్రిజగం బుల నభివ్యాపించినవిశ్వరూపధరుండవు. 127

క. నరకశిశుపాలు రాదిగ, ధరణీకంటకుల నధికతరదర్పులం బ
ల్వుర వధియింపఁగ మహి నవ,తరించినమహాత్ముఁడవు నుతస్థిరశక్తిన్. 128

క. అనృతము మదమును మత్సర,మును గ్రోధము [1]ననువికారములు వొరయునె ని
న్ననుపమగుణముల నీ కొరు, లెన పోల్పఁగఁ గలరె సురముసీంద్రప్రణుతా. 129

వ. అని కృతాంజలి యయిన ధనంజయుం జూచి దనుజభంజనుం డి ట్లనియె. 130

తే. నరుఁడు నారాయణుండు నాఁబరఁగునాది,మునుల మిద్దఱమందు నీవనఘ నరుఁడ
వేను నారాయణుండ ననూనశక్తి,యుతుల మై మర్త్యయోనిఁ బుట్టితిమి పేర్మి.

తరువోజ. నిరతంబుగా నేను నీ వనుభేదనియమంబు లే [2]దైక్యనిష్ఠయ మనకు
నిరువురకును నీకు నిష్టుండ నాకు నిష్టుండు మఱి నీ కనిష్టుండ నాకుఁ
గర మనిష్టుం డట్లుగా నమ్మ మనుచు ఘనభుజుల్ భువనోపకారైకమతులు
హరియునరుఁడుఁ బ్రియముతోఁడఁదగిలి యన్యోన్యహితభాషలగుచుండునంత.

ద్రౌపది శ్రీకృష్ణునితోఁ దనపరిభవంబు సెప్పి దుఃఖించుట.

వ. అఖిలరాజలోకపరివృతుం డయి యున్న నారాయణునొద్దకు వచ్చి ద్రుపదరాజ పుత్త్రి ముకుళితకరాంబుజ యయి నిన్ను నాదిప్రజాసర్గంబునఁ బ్రజాపతి వని యసి తుం డయినదేవలుండును సత్యంబువలన యజ్ఞం బుద్భవించుటం జేసి నిత్యసత్య మయుండ వయినయజ్ఞపురుషుండ వని కశ్యపుండును శిరంబున దివంబును బాదం బుల మేదినియును లోచనంబుల సూర్యుండును నవయవంబుల లోకంబులు నభి వ్యాపించుటం జేసి సర్వమయుండ వని నారదుండును నక్షయజ్ఞాననిధి వని సర్వ మునిముఖ్యులును జెప్పిరి. 133

మధ్యాక్కర. అని సనివృత్తు లై పుణ్యచరితు లై యాత్మప్రబోధ
వినిహితచిత్తు లై సర్వధర్మార్థవిదు లయి తృప్తిఁ
దనరెడురాజర్షివరులకును యోగధరులకు సాధు
జనులకు గతి నీవ నిత్యకారుణ్య సర్వశరణ్యా. 134

వ. నీయంతఃకరణప్రవృత్తి కగోచరం బెద్దియు లే దయినను నాపడినపరాభవం బెఱిం గించెద. 135

సీ. పార్థివప్రభుఁ డైనసాండుమహీపతి, కోడల నయి యుద్ధకుశలు లయిన

---

1. క. నిర్వికారమును; జ. దుర్వికారమును. 2. అ. దున్కి నిక్కము మనకు.

పాండుతనూజులకు భార్య నై పూజ్యుఁడ, వైననీసఖియు నై - యధికశక్తిఁ
బరఁగుధృష్టద్యుమ్నుభగిని నై ధృతరాష్ట్రు,పట్టిచే సభఁ దలపట్టి యీడ్వఁ
బడి పాపకర్ముచేఁ - బరిధాన మొలువంగఁ, బడి దారుణం బైనపరిభవంబు

ఆ. పడితి నట్టినన్నుఁ - బాండవుల్ సూచుచు, నుండి రోరులపోలె - నుక్కు దక్కి
యాపగాతనూజుఁ - డాది గాఁ గలవృద్ధ, బంధుజనులుఁ జూచి - పలుక రయిరి.

క. శరణనినవారిఁ గరుణా, కరు లయి రక్షించుపురుషకారాన్వితు లే
శరణని యఱచిన నాలిం, పర భీమార్జునులబాహు-బల మేమిటికిన్. 137

వ. భ్రాతృపుత్త్రబంధుజనంబులు నాకుం గలిగియు లేనివా రయి రట్టియెడం గర్ణుండు నన్నుం జూచి నగియె. 138

ఆ. కర్ణునగవు లోక-గర్హితుం డగుదుస్స, సేను చెయిదికంటె - శిఖియపోలె
నడరి నామనంబు - నతిదారుణక్రియ, నేర్చు చున్నయది మహీంధరుండ. 139

వ. తొల్లి వేదాధ్యయనంబు సేయుచు బాలకేళీవినోదంబున నున్నకాలంబునఁ బ్రమాణకోటియందు సుప్తుం డయినభీమసేను నంటఁ గట్టి గంగమడువునం ద్రోపించియు విషంబుఁ బెట్టియు విషసర్పంబులం గఱపించియు [1]జననీసహితు లైనయేవురను వారణావతంబున లక్కయిల్లు సొనిపి యందు దహనంబు ప్రయోగింపం బంచియు ననేకంబు లైనయపకారంబులు సేసి యిప్పుడు దుర్యోధనుం డధర్మద్యూతంబున రాజ్యంబు నపహరించి రాజలోకసమక్షంబునం దమ్ము నిరాకృతులం జేసినను బరాక్రమపరాఙ్ముఖు లైనపాండవులు నాపరిభవంబు నెట్లు దలఁగెద రని బాష్పధారాస్నపితపయోధర యయి పాణిపల్లవంబుల నయనసమ్మార్జనంబు సేయు చున్న పాంచాలిం జూచి వాసుదేవుం డి ట్లనియె. 140

చ. తనుకుచు నున్ననీహృదయ-తాపనిమిత్తమునర్థ సుకేంద్రనం
దనుపటుబాణపాతహతిఁ - దద్ధృతరాష్ట్రబలంబు మృత్యుసా
దనమున కేఁగుఁ జుమ్మిదియ - తథ్యము నావచనంబు దప్పదివ్వ
వ్వననిధు లేడు నింకిన దివంబును రాత్రియు సంచలించినన్. 141

వ. అనిన నర్జునుండు ద్రౌపదిం జూచి యి ట్లనియె. 142

ఉ. ఈపురుషోత్తముండు మన - కిందఱకుం గుశలంబు సేయుచుం
బాపకలంకపంకములఁ - [2]బాయఁగఁ జేయుటఁ జేసి దుర్మదో
ద్దీపిత[3]శత్రుసంహతి హ-తిం బరమార్థము పొందు నేల సం
తాపము నీకుఁ జేయఁగ [4]ద్వి-ధామజయోన్నతి గల్గి యుండఁగన్. 143

---

1. 'లాక్షాగృహంబున నుండఁ బనిచి యెవ్వ రెఱుంగకుండ ఘోరానలంబు దరికొలుపం బనిచియు నట్టి దుర్యోధనుం డిప్పు డధర్మద్యూతంబున' నని యొక్కప్రతి. 2. గ. బాపుచు నుండుటఁ జేసి. 3. గ. చ. జ. శత్రులోకవితతిం బరిమారుతు మల్ల మేల సంతాపముఁ బొందఁ జేయఁగ. 4. ఖ. విధాతృనియోగము; జ. వృథావిజయోన్నతి.

వ. అనిన ధృష్టద్యుమ్నుండు (సక్రోధుండయి) యిట్లనియె. 144

క. వినయవిహీనుల దుర్యో, ధనదుశ్శాసనులఁ బవనతనయుఁడు రాధా
తనయుని నరుఁడే గుంభజు, ననిఁ జంపుదు మేల వగవ కంబుజనేత్రా. 145

వ. అని యందఱు ద్రుపదరాజపుత్త్రి నాశ్వాసించి రంత నచ్యుతుండు ధర్మరాజున
కిట్లనియె. 146

తే. ద్వారవతినుండి యేయుయుధానువలన, ధారుణీశ యింతయు విని తత్క్షణంబ
యరుగుదెంచి యాపన్నుఁడవైన నిన్నుఁ, జూచి దుఃఖోపహతమనస్కుండ నైతి.

వ. అయ్యవసరంబున నేను మీయొద్ద నుండమింజేసి యిట్టిదుర్వ్యసనంబు సంభవిల్లెం గామజంబు లైనస్త్రీద్యూత మృగయాపానంబు లను నాలుగుదుర్వ్యసనంబులం బ్రవర్తిల్లకుండఁ బ్రతిపాదింపవలయు నందును విశేషంబుగా ననర్థమూలం బయిన ద్యూతంబుఁ బరిహరింపనినాఁడు పాపం బగు నని హేతుదృష్టాంతంబులు సూపి కృపద్రోణవిదురగాంగేయులం దోడుసేసికొని యాంబికేయు నొడంబఱిచి దుష్టద్యూతంబు సర్వప్రకారంబుల వారింతు. 148

క. వలచి హితంబునఁ బథ్యముఁ, బలికినఁ జేకొనని ధర్మబాహ్యుల నవివే
కుల నిగ్రహింతు మీకె, గ్గులు [1]మత్సాన్నిధ్యమున నగునె యెయ్యెడలన్. 149

కృష్ణుఁడు ధర్మరాజునకు సౌంభకాఖ్యానంబు సెప్పుట.

వ. ఏను సముద్రతీరంబున సాల్వుతోడం బదినెలలు యుద్ధంబు సేసి వాని వధియించుచుండి యక్కడ నుసలితి నది గారణంబుగా మీకు దుర్వ్యసనావసరంబున నలబ్ధసన్నిధానుండ నయితి ననిన నది యెట్లని యుధిష్ఠిరుం డడిగిన నాతనికి సౌంభకాఖ్యానంబు సవిస్తరంబుగాఁ గృష్ణుం డిట్లని చెప్పె నీయజ్ఞంబున సర్వ్యునిమిత్తంబున నసహిష్ణుం డయిన శిశుపాలుండు నాచేత నిహతుం డగుట విని వానితమ్ముండు సాల్వుం డనువాఁడు తద్వధప్రవర్తితక్రోధుం డయి కామగమనం బయినతన సౌంభకం బనునగరంబుతో సన్నద్ధుం డయి వచ్చి ద్వారవతీపురంబు నవరోధించి.

చ. ప్రతినరపాలకాలు శిశుపాలు బలాధికుఁ జంపి దర్పసం
హితుఁ డగు చున్నవృష్ణిఖలుఁ డెక్కడ [2]నెక్కడ నాతనిం జయో
న్నతి వెలయంగఁ జంపెద రణంబున నంచు నలంఘ్యవిక్రమో
ర్జితుఁ డయి దానిచుట్టు విడిసెం జతురంగమహాబలంబుతోన్. 151

క. మే లగుతత్పురబాహ్యావని, శాలోద్యానములతాలసాలసరళహిం
తాలతమాలావలి ని, ర్మూలితముగఁ జేసెఁ దచ్చమూసామజముల్. 152

వ. మఱి తృణజలధాన్యసమిత్సమృద్ధం బయి శతఘ్నీప్రముఖానేకయంత్రంబుల నలంఘ్యపరిఘాప్రాకారంబులను నపారబలరక్షితఘనకవాటచతుర్గోపురంబులను లబ్ధ

1. క. సేసినధార్తరాష్ట్రకుల నెయ్యెడలన్. 2. జ. (బో నగు.

ప్రభూతవేతన ప్రహృష్ట పుష్ట ధృష్ట వీరసుభటసంకులంబులను నపరిమితగజతురంగ
శతాంగంబులను [1]ప్రదీప్తాలాతశాతశరచక్రతోమరపరశుపాశాంకుశకూటంబులను
[2]వీరయోధారూఢవిశాలాట్టాలకంబులను నొప్పి పరుల కసాధ్యం బయినద్వార
వతి భేదింపనేరక దాని వెలిం బ్రపా చైత్య దేవాయతన వల్మీకంబులు వర్జించి సమ
తలప్రదేశంబున నిబిడంబుగా శిబిరసన్నివేశంబు సేసి నిత్యంబు నుపద్రవంబు
సేయుచున్న సౌంభకవిజృంభణంబునకు సహింపక సమరసంరంభంబున సర్వా
యుధసన్నద్ధు లయి. 153

క. ఉద్యద్బలులు కుమారులు, విద్యాధరసములు పురము వెలువడిరి రక్షై
కోద్యములు చారుదేష్ణుఁడుఁ, బ్రద్యుమ్నుఁడు సాంబుఁడును విపక్షజిఘాంసన్. 154

మణిభూషణము. రామవిక్రముఁ డజేయుఁ డరాతిగజావలీ
సామజాహితుఁడు సాంబుఁడు సాల్వచమూపతిన్
క్షేమవృద్ధి యనువాని నకృత్రిమసాహసో
ద్దాముఁ దాఁకె శరధారల [3]ధారుణిఁ గప్పుచున్. 155

క. జాంబవతేయు బృహద్విశి, ఖంబులకున్ బెదర కెదిరి ఘనుఁ డేసె రణా
గ్రంబున నాతనిపై నవి, లంబితుఁ డై క్షేమవృద్ధి లక్షశరంబుల్. 156

వ. వాని యేయు నేర్పునకు సహింపక సాంబుండు జాంబూనదపుంఖంబు లయినవిశిఖం
బులం దదీయరథాశ్వమర్మంబుల నేసిన నవి మర్మభేదవేదనలం దలరి యతివేగం
బున [4]రణభూమి వెలువడ రథం బీడ్చుకొని సారథికి వశంబు గాక పఱచె నట్లు సాల్వ
చమూపతి సమరవిముఖుం డయిన. 157

స్వాగతము. వేగవంతుఁ డనువీరుఁడు సాంబున్, వేగవంతుఁ డయి పేఁకను దాఁకెన్
వేగబాణపదవీతతులన్ ది, గ్భాగముల్ విశిఖపంజరముల్ గాన్. 158

ఆ. సాంబుఁ బాయు మనుచుఁ జారుదేష్ణుం డల్గి, వేగవంతుఁ దాఁకి పేఁకతోడ
వానిమస్తకంబు వ్రయ్యంగ వడి గదం, బొడిచె రుధిరవారిపూర మొలుక. 159

వ. ఇట్లు చారుదేష్ణునిష్ఠురగదాఘాతంబున వేగవంతుండు విగతజీవుం డయి నిర్ఘాత
పాతభిన్నోన్నతగిరిశిఖరంబునుంబోలె నేలఁ ద్రెళ్లినం జూచి విచింత్యుం డనువాఁ
డవించిత్యవిక్రముం డయి. 160

తే. చారుదేష్ణుపైఁ గడువాఁడిశరము లేసె, నతఁడు కార్ముకహస్తుఁ డై యాక్షణంబ
వానిపై నభిమంత్రించి వహ్నిబాణ, మేసె నుగ్రస్ఫులింగంబు లెసఁగఁ జదల.

క. అనలాస్త్ర మట్లు వక్షముఁ, గొనిన విచింత్యుండు గూలెఁ గుతలం బద్రువన్
ఘను వానిఁ జూచి హాహా, స్వనము లెసఁగ సాల్వసేన సంక్షోభించెన్. 162

వ. సాల్వుండు నిజసేనాసంక్షోభం బుడిపి సర్వాయుధసనాథం బయినరథం బెక్కి

1. జ. ప్రతిపాలితనిశాత. 2. గ. విహరద్యోధారూఢ. 3. జ. దప్పక. 4. గ. జ. రణంబు వెలువడ.

యాదవకుమారవాహినిపయి నెత్తి యేయుచు వ్రేయుచుం బొడుచుచుఁ బ్రతి
బలంబు నెల్ల నాయుధమయంబుగాఁ జేయుచున్న వాని కలిగి. 163

సీ. హంసవర్ణోత్తమహయములఁ బూనిన, రథ మెక్కి కాంచనరమ్యయష్టి
సంభృతమకరధ్వజం బొప్ప బద్ధగో, ధాంగుళిత్రాణుఁ డై యతులశాత
సాయకావలిఁ జేసి సాల్వుఁ బిల్చుచు వాని, మీఁదఁ బ్రద్యుమ్నుఁ డమేయబాణ
వర్షంబు గురిసిన వాఁడును వానిపైఁ, గడువాఁడిబాణముల్ గడఁగి యేసె
ఆ. నధికవీరు లయినయయ్యిద్దఱకు నస్త్ర, కోవిదులకుఁ బోరు ఘోర మయ్యెఁ
దద్ద భయము వొంది తద్ద్వారకాపురి, సాంభకమున జనులు సంభ్రమింప. 164

క. అని మొన సాల్వుఁడు ప్రద్యు, మ్నుని శాతశరాలివిద్ధమర్ముం డయి పె
ల్చన మూర్ఛవోయి పడియెం, దనరథముపయిన్ ధరిత్రి దల్లడపడఁగన్. 165

ఉ. అంతన మూర్ఛ దేఱి కలుషానలదీప్తముఖుండు సాంభకుం
డంతకదండదారుణము లైనశరంబుల రాకిఁ జేయు ది
గ్దంతిబలాఢ్యు నేయుడు నతండును మూర్ఛితుఁ డయ్యె వాని సం
భ్రాంతిఁ దదీయసారథి యపాస్తరణాంతరుఁ జేసెఁ జెచ్చెరన్. 166

వ. ఇట్లు మూర్ఛితుం డయినప్రద్యుమ్నుం దోడ్కొని చని రణంబునకు దూరంబుగా
నరదంబు నిలిపికొని దారుకసుతుం డున్నంత నెక్కొంత ప్రొద్దునకు మూర్ఛ దేఱి
ప్రద్యుమ్నుండు సూతున కిట్లనియె. 167

క. ఘోరాహవరంగమునకు, దూరముగా నన్ను నిట్లు దోడ్కొని తేరన్
దారుకసుత నీ కుచితమె, వీరారంభంబు సూచి వెఱచితె చెపుమా. 168

వ. (మఱియు సారథిం జూచి విహ్వలమానసుం డయి యిట్లనియె.) 169

క. సమరవిముఖత్వమును రణ, విముఖులఁ జంపుటయు శరణు వేఁడిన రక్షిం
పమియును యాదవవంశో, [1]త్తములకుఁ గల నయినఁ గలవె దారుకతనయా. 170

క. విక్రమము విడిచి సమరా, పక్రాంతుఁడ నయిన నన్ను బలదేవుఁడునుం
జక్రధరసుతులు ననుజులు, నక్రూరాదులును నేమి యని నగరె సభన్. 171

వ. చెట్ట సేసి తింక నయినఁ జెచ్చెర సాంబచారుదేష్ణు లున్నచోటికి సాల్వాభి
ముఖంబుగా రథంబు వఱపు మనిన సారథి యిట్లనియె. 172

క. రథి కిమ్ము గానియెడ సా, రథి [2]ధృతి మెయిఁ గానవలయు రథియును దత్సా
రథిఁ గావ వలయు రథిసా, రథులు పరస్పరశరీరరక్షకు లగుటన్. 173

ఆ. సాల్వబాణవిగత[3]సంజ్ఞుఁడ వైనని, న్నిట్లు దెచ్చితిని సహింప వలయు
నారథాశ్వములమనఃస్యదమును నిదె, చూడు మనుచు సూతసూనుఁ డపుడు.

వ. సవ్యాపసవ్యచిత్రమండలగతుల నాక్షణంబ సాల్వునకు నప్రదక్షిణంబుగా రథంబు
వఱపిన దాని సహింపక సాల్వుండు మూఁడమ్ముల సారథి నేసి మఱియు రాక్షస

1. క. ఖ. త్తములం దివి గలచె చెపుమ. 2. అ. తద్రథి. 3. సత్త్వుండ.

మాయ ననేకశరంబులు ప్రద్యుమ్నుపై సేసిన. 175

క. అమ్మాయాశరములు భ,గ్నమ్ములు గాఁ జేసి తన్ముఖమ్మునఁ దద్వ
క్షమ్మున నొక్కట బ్రహ్మా,స్త్రమ్మును బ్రద్యుమ్నుఁ డేసె దారుణభంగిన్. 176

వ. ఇట్లు బ్రహ్మాస్త్రపీడితుం డయి సాల్వుండు మూర్ఛవోయి రథంబుపయిం బడిన వాని వెండియు నొక్కదివ్యబాణంబున నేయ సమకట్టిన నంతరిక్షంబున హాహారవంబు లెసఁగె నంత దేవగణప్రేరితు లయిననారదమారుతులు ప్రద్యుమ్ను పాలికి వచ్చి యి ట్లనిరి. 177

తే. వీఁడు నీచేత వధ్యుండు గాఁడు మున్న
కేయ కుండుము వీని నారాయణుండు
మొనసి వధియించు నని పల్క వనజగర్భుఁ
డనినఁ బ్రద్యుమ్నుఁ డేయక యనఘుఁ డుండె. 178

సాల్వుఁడు ప్రద్యుమ్నుచే బాధితుం డై మరలి పోవుట.

వ. అంత సాల్వుండును నివృత్తుం డయి ద్వారకాపురియవరోధం బుడిగి తనసౌంభకం బెక్కి క్రమ్మఱి చనియె నంత నీయజ్ఞంబు నిర్వర్తితం బయిన నే నరిగి బలభగ్నకృతపాదపవనంబులదాని ననభిజ్ఞాతద్వారదేశంబులదాని నస్వాధ్యాయస్వాహాకారస్వధాకారమహీసురాగారం బయినదాని నపేతభూషణయోషిజ్జనంబులదాని ద్వారవతిం జూచి యాహుకాత్మజువలన నంతవృత్తాంతంబును నెఱింగి సాల్వుం జంపి కాని యిప్పురంబు సొర నొల్ల నని నిశ్చయించి దీని నప్రమాదుల రై రక్షించుకొని యుండుం డని బలదేవాదులం బంచి యప్పుడ ప్రయాణభేరి వ్రేయించి కృతస్వస్తివచను (లయిన) పురోహితప్రముఖబ్రాహ్మణవరులకు నమస్కరించి శైబ్యసుగ్రీవంబు లనువాహంబులం బూనినదివ్యరథం బెక్కి. 179

ఆ. పాంచజన్యరవముఁ బంచమహాశబ్ద,రవముఁ జెలఁగె దిశలు చెవుడువడఁగ
నొలసి జనులదీవెనలు మించె రమ్య మై, గరుడకేతనంబు గ్రాలెఁ జదల. 180

వ. అట్లసంఖ్యాతచతురంగసైన్యంబులతో నరిగి గిరి వన సరోవర సరిద్దేశంబులు గడచి మార్తికావతదేశంబున కరుగునంతకు ముందర సాల్వుండు సౌంభకారూఢుం డయి సముద్రకుక్షిదేశంబునకుం బోయిన. 181

క. ఏనును వానిపిఱుందన, మానక చని తచ్చమూసమాజముతోడన్
భూనాథ రణము సేసితి, నానానిశితాస్త్రవర్షకణ[1]వ్యాప్తముగన్. 182

క. వీరు లగుసాల్వయోధుల, నారాచావళులు [2]గప్పి నారథముపయిన్
సారథిమీఁదఁ దురంగమ,చారుధ్వజతతులపయి నసంఖ్యాతముగన్. 183

వ. (తొరఁగిన) వాని నెల్ల నస్మదీయగోచరంబులు గా కుండ ననేకాయుతశరంబు లేసి సాల్వసైన్యంబుతో మహాయుద్ధంబు సేసిన. 184

---

1. గ. వ్యాజముగన్. 2. క. గ. గప్పె...నసంఖ్యాతముగన్. వాని నెల్ల.

మ. అవనీనాథ తదాహవాంతరమునం దస్మత్కరాకృష్టశా
ర్ఙ్గవినిర్ముక్తనిశాతసాయకశతాగ్రచ్ఛిన్నమై దైత్యదా
నవదేహప్రకరంబు వాత[1]విధుతార్ణఃపూరసంఘూర్ణితా
ర్ణవకుక్షిం బడియెం గపిప్రవరసైన్యక్షిప్తశైలాకృతిన్. 185

చ. ఘనతరదైత్యదానవనికాయకళేబరపాతఘట్టనం
దనరి యుగాంత్యకాలచలితంబునుబోలెఁ బయోధి మ్రోసె స
వ్వనధిరవంబుకంటె ననివారితమై చెలఁగెన్ మదీయవా
హిని భటసింహనాద హయహేషిత సింధురబృంహిత ధ్వనుల్. 186

వ. అట్టిమదీయసేనోత్సాహంబును నిజసేనాక్షీణతయుం జూచి సహింపక సాల్వుండు వెండియు సౌంభకారూఢుం డయి నాతో మాయాయుద్ధంబు సేయ సమకట్టె.

సీ. పరుశు పాశాంకుశ కరవాల శూల ము, ద్గరములు నామీఁదఁ దెరలఁ గురిసె
[2]నేనును గడఁగి యద్దానవశస్త్రముల్, వాయంగఁ జేసితి మాయఁ జేసి
వెఱవక సాల్వుండు వెండియు నామీఁదఁ, బరుషశిలావృష్టిఁ గురిసె పరుస
సమరఁ దమఃప్రకాశములతో దుర్దిన, సుదినశీతోష్ణముల్ గదియఁ జేసి

ఆ. దితిసుతాధముండు శతసూర్యశతచంద్ర, శతసహస్రవిష్ణుతతులు వెలుఁగ
గగనతలము సేసెఁ బగ లిది రే యిది, యని యెఱుంగ నయితి మనములోన.

క. మనుజేంద్ర సర్వమాయా, పనోదనం బయినయగ్నిబాణంబున [3]న
ద్దనుజవినిర్మితమాయా, వినివర్తనఁ జేసితిని [4]సవిస్మయమతి నై. 189

వ. అట్టియవసరంబున ద్వారవతినుండి యాహుకప్రేషితుం డయి యొక్కరుం డతిత్వరితగతిం బఱతెంచి సాల్వుచేత నక్కడ వసుదేవుండు పట్టువడియె నీ వెవ్వనితోడం గయ్యంబు సేసెదు క్రమ్మఱి చని పురంబు రక్షించుకొను మనిన విని యుదరిపడి మహాబలపరాక్రము లయినబలదేవాదులు రక్షించుకొని యుండ వసుదేవుఁ డేల పట్టువడు నిది పోల దని సంశయించుచు విమనస్కుండ నయి యుండు నంత. 190

సీ. పుణ్యకర్మంబులు వోలిసిన నుర్వికి, నేతెంచునట్టియయాతివోలె
భూషణదీప్తులు వొలియంగ వివృతకే, శాంబరుం డయి సౌంభకంబువలనఁ
బడుదెంచువసుదేవుఁ బాపనిశాచర, బలపీడ్యమాను దవ్వులన కాంచి
యత్యంతమోహశోకాంధుండ నయిననా, హస్తంబువలన విస్రస్త మయ్యె

ఆ. శార్ఙ్గ మప్రియావసన్నదేహుండ నై, యుడిగి రథముమీఁదఁ బడితి నేను
దానిఁ జూచి భయము దగిలి మత్సైన్యంబు, దల్లడిల్లి యులిసెఁ బెల్లు రేఁగి.

---

1. జ. విహతా. 2. గ. నస్త్రిముల్ నేనును నడరించి దానవుఁ బాయంగ. 3. అ. నద్దనుజనిర్మితమాయావినివర్తనుఁ. 4. క. గ. సవిస్తరమతి నై.

వ. అంత నెంతయుం బ్రొద్దునకుఁ దెలిసి సాల్వుసౌంభకంబున వసుదేవుం గానక దాని మాయఁగా నెఱింగి పదంపడి మాయావి యయినసాల్వుం జూచి వానిపయి నలిగి యే నేసిన నయ్యసురయు సౌంభకంబు నదృశ్యం బగుటయు. 192

క. అసురులయాక్రోశధ్వను, లెసఁగెం బదిదిశల నంతఁ నేనును దద్రా
క్షసుల గతాసులఁ జేసితిఁ, బ్రసభంబున శబ్దభేదిబాణప్రతతిన్. 193

వ. అంత సాల్వుండును దనసౌంభకంబుఁ బ్రాగ్జ్యోతిషంబుఁ జేసి తానును మానవుం డయి పర్వతవర్షంబు నాపయిం గురిసిన. 194

ఆ. పరుషవిషమభూరి పాషాణభీషణ, గిరులు వచ్చి నన్నుఁ గెరలఁ గప్ప
వజ్రబాణ మేసి వాని నన్నింటిని, బాచి యున్ననన్నుఁ జూచి యపుడు. 195

క. దారుకుఁ డిట్లనియె మహా, వీరు నుపేక్షింపఁ దగునె వీనిని మాయా
ప్రారంభు నుపేక్షింప ర, పారపరాక్రములు పోరఁ బ్రాకృతు నయినన్. 196

వ. అనిన వానిపలుకులు విని యలిగి యనలజ్వాలాకరాళం బయి ప్రతికూలరాక్షస యక్ష గంధర్వ దైత్య దానవభస్మసాత్కరణదారుణం బయినచక్రంబు నభిమంత్రించి సౌంభకంబుపయి వైచిన నది యుగాంతకాలపరివేషభీషణం బయినరవిమండలంబునుంబోలె గగనంబునం బఱచి సౌంభకమధ్యంబునం బడిన. 197

చ. తడయక ఘోరదర్శనసుదర్శనపావకుచే దహింపఁగాఁ తెలుఁగులో కర్మణి
బడి పరమేశ్వరోగ్రశరపావకదగ్ధపురత్రయాభ మై ప్రయోగం వేయటంగాని
యొడరి ధరిత్రిమీఁదఁ బడియెం జెడి సౌంభక మంత సాల్వుఁడుం
బడియె మదీయచక్రపటుపాతరయంబున రెండు వ్రయ్యలై. 198

పాండవులు ద్వైతవనంబునకు వచ్చి యుండుట.

వ. అని యిట్లు సాల్వుం దనచంపినవిధంబు సెప్పి చక్రధరుండు పాండవుల వీడ్కొని సుభద్రాభిమన్యులం గాంచనరథం బెక్కించుకొని తోడ్కొని ద్వారవతి కరిగె ధృష్టద్యుమ్నుండును బ్రతివింధ్యాదు లయినద్రౌపదేయులం దోడ్కొని ద్రుపదపురంబునకుం జనియె నిట పాండవులును రథంబు లెక్కి యాయుధంబులు ధరియించి యింద్రసేనాదిమూలభృత్యు లిరువదుండ్రు ముందట రా ననేకసహస్రబ్రాహ్మణవరులతో ద్వైతవనంబున కరిగి రంత ధర్మరాజు తమ్ముల కిట్లనియె. 199

మధ్యాక్కర. ఇది మహోగ్రాటవి సింహశరభోరగేంద్రశార్దూల
మదగజాకీర్ణంబు దీనిలోన నేమఱి యుండ వలయు
నదియునుం గాక పరప్రయోగమాయలు గల వెఱిఁగి
మది నుండునది యన్న నన్న కిట్లను మఘవనందనుఁడు. 200

వ. బ్రహ్మవిదు లయిన(తపోధన)బ్రాహ్మణులును వృద్ధులు నఖిలలోకద్వారంబుల నప్రతిహతు లయిననారదద్వైపాయనాదిమునివరులు నీచేత నుపాసితు లయి నీకుశ

లంబ కోరుచుండుదురు భవత్ప్రతాపం [1]బెల్లవారికి రక్షణీయం బివ్వనంబు సకల కాలకుసుమఫలభరితవనస్పతిశాఖాశిఖారూఢ మయూరకీరకోకిలాలాపమధురంబును బకబలాకకోక కారండవ సారస రమ్య మధుకరసౌమ్యసరోవరసంకులంబును విమలశీతలజలప్రవాహనదీశోభితంబును మహర్షిగణసేవితంబును నై యొప్పుచున్నయది యిం దుండుద మని లలితలతావితానాదిరమణీయంబు లయిన వృక్షమూలంబుల నేవురు వేఱువేఱ నివాసంబులు సేసి నియతాత్ము లయి యిష్టంబున దేవపితృకార్యంబులు సేయుచుం దమ్ముఁ జూడ వచ్చినమహామునులకు బ్రాహ్మణులకు మనఃప్రియంబు లయినయాహారంబులు వెట్టుచు ద్వైతవనంబున నుండు నంత. 201

క. పాండవులకడకు ధర్మవిదుండు తపోదహనదగ్ధదురితౌఘుఁడు మా
ర్కండేయుం డనుమునినాథుం డంతేవాసిగణముతోఁ జనుదెంచెన్. 202

వ. ఇట్లు వచ్చి వారలచేత నర్చితుం డయి వనవాసక్లేశదుఃఖితు లయినపాండవులను ద్రౌపదిం జూచి యమ్మార్కండేయుం డి ట్లనియె. 203

సీ. పితృనిదేశమునఁ బృథివీశ్వరత్వంబు, విడిచి సానుజుఁ డై పవిత్రచరిత
జానకిఁ దోడ్కొని చని వనంబున నున్న, రఘుకులనందను రాముఁ దొల్లి
చూచితి నిపుడు భూసురవంశపోషకు, సాధుజనస్తుత్యు సత్యధర్మ
నిత్యు [2]ధర్మజు రమణీయకీర్తిప్రియు, శమవంతుఁ జూచితి సగర భరత

ఆ. నల యయాతి వైన్య నాభాగు లాదిగ, నాదిరాజు లెల్ల నధికధర్మ
సత్యయుక్తిఁ జేసి సకలలోకంబులు, వడసి భాగధేయభాగు లయిరి. 204

వ. పాపసాబలప్రయుక్తుం డయినధార్తరాష్ట్రునట్లు ధర్మువు దప్పినవా రెవ్వరును లేరు మీరు ధర్మనిత్యులరు సత్యవ్రతులరు గావున మీ కిష్టసిద్ధి యగు నని మార్కండేయుం డరిగిన నపరసంధ్యోపాసనాసీనుం డయినధర్మరాజును సాయంహోమార్థప్రజ్వలితజ్వలనంబు లయినయనేకసహస్రబ్రాహ్మణాగ్నిహోత్రంబులం జూచి బకదాల్భ్యుం డనుమహాముని యి ట్లనియె. 205

ఉ. భూమిసురోత్తముల్ ప్రకృతి[3]పుణ్యవిధాయులు వీరు ఋగ్యజు
స్సామపరాయణుల్ పరమసాధుచరిత్రులు మీకు సంతత
ప్రేమమునన్ శుభోన్నతులు పెంచుచు నుండుటఁ జేసి సద్గుణో
ద్దామ యరణ్యవాస మిది దద్దయు నొప్పెడు మాకుఁ జూడఁగన్. 206

వ. బ్రాహ్మణానుగ్రహంబునం జేసి తొల్లి వైరోచనాదు లనేకకాలంబు లక్షయలక్ష్మీవిభవు లయి సముద్రనేమిభూచక్రంబు రక్షించి యనిలసహాయుం డయినయగ్నిదేవుం డరణ్యంబు దహించునట్లు బ్రాహ్మణసహాయుం డయినమహీశుండు శత్రు

1. క. గ. బెల్లవారిని రక్షించు నివ్వనంబు. 2. ధర్మాత్మజు నిన్నుఁ గీర్తి. 3. గ. పుణ్యవిధేయులు.

వర్గంబు నిశ్శేషంబుసేయు వినీతుం డయి విప్రులచేత [1]ననుశాసితుం డయినరాజు నకు [2]నలబ్ధలాభాదిత్రితయంబు సంపన్నం బగు బ్రాహ్మణరహితుం డయి ధర్మ హీనుం డయినరాజును బ్రజ వలవదు ప్రజానురాగంబు లేనివానికి రాజ్యంబు సుస్థిరంబు గానేరదు మీరు బ్రాహ్మణప్రియులరు ధర్మనిత్యుల రెప్పుడును మీ కభ్యుదయం బగు నని బకదాల్భ్యుం డరిగినఁ బాండవులుం దమయిష్టంబున నుండి దుఃఖోపశమనంబు లయినకథలు సెప్పుకొను చున్నయవసరంబున ద్రౌపది ధర్మ రాజున కి ట్లనియె. 207

ద్రౌపదీధర్మరాజులసంవాదము.

ఆ. వృద్ధు కొడుకుపలుకు విని కూరుఁడై పాప,బుద్ధిఁ జేసి మిమ్ము భూతలంబు
వెలువరించి రాజ్యవిభవంబు గొని యిప్పు, డలుక సెడి సుచిత్తుఁ డయ్యెనొక్కొ.
ఆ. అద్దురాత్ముహృదయ [3]మది యయఃపాషాణ, నిష్ఠురంబు ధర్మనిధుల మిమ్ము
నట్లు గొడుకు లెగ్గు లాడంగఁ బోయిన, వల దనండ కలహవాంఛఁ జేసి. 209
సీ. విమలహర్మ్యంబుల విహరించువారలఁ, బ్రియమహార్హాసనశయనరతులఁ
జందనాగురులిప్త చారుసర్వాంగుల, నతనరనాథసేవితుల మిమ్ము
వనమునఁ గ్రుమ్మరువారిఁగాఁ గుశబృసీ, శయనాభిరతులఁగా నియతరూక్ష
భూరేణుధూసరీభూతవిగ్రహులఁ గా, ద్రుతవన్యమృగనిషేవితులఁ గాఁగ
ఆ. నిట్లు సూచి చూచి యే నెట్లు చిత్తోప, శాంతి సేయుదాన సకలభోగ
విషయవిరతిఁ జేసి విధియును ధృతరాష్ట్రు, నట్లు మీకు నహితుఁ డయ్యెనొక్కొ.
క. భవదాజ్ఞానిగళంబునఁ, దవిలి పరాక్రమము విడిచి ధరణీశ్వర నీ
యవరజు లిడుమలఁ బడి కడుఁ, జివికిరి చెఱఁ బడినసింహశిశువులభంగిన్. 211
ఆ. పరనరేంద్రమకుటపద్మరాగద్యుతి, నరుణ మగుభవత్పదాబ్జయుగము
పరుషదారుశిలలపై నిప్పు డరుగుట, నరుణ మయ్యెఁ బర్వతాంతరముల. 212
క. అనవరతసౌఖ్యసంపదఁ, బెను పొందుచు నుండుమీకు భీకరకాంతా
రనివాసాయాసంబుల, ననఘా యిబ్బంగి నవయ నలమట వొడమెన్. 213
వ. నిత్యంబునుం బదివేవురు బ్రాహ్మణులు బ్రహ్మవిదులు [4]పసిండితళిగల నిష్టాన్నం బులు గుడిచి తృప్తు లయినం దద్భుక్తశేషం బుపయోగించు చున్ననీకు వన్యమూలఫలాశనంబు లుపయోగించుచు నన్యులయందుఁ గ్రోధంబు విడిచి యునికి యుచితంబు గాదు. 214
సీ. పదివేలగజములబలమున విలసిల్లు, ననిలసుతుండు గాఁ డడవిలోనఁ
గ్రుమ్మరి కాయలుఁ గూరలుఁ దిని పేద, వడినఁ జూచియు దీర్ఘబాహుయుగళుఁ

1. గ. జ. నధిష్ఠితుం డయిన. ఖ. ననుష్ఠితుం డయిన. 2. క. నలబ్ధలాభాదిచతుష్టయంబు; గ. వర్గచతుష్టయంబు. 3. మరయంగ నాయసనిష్ఠు. 4. క. పసిండిపళ్లెరంబుల.

డయ్యును బాహుసహస్రంబు గలిగిన, యర్జునుకంటె బలాఢ్యుఁ డగుచు
నేకవేగంబున నేనమ్ము లొక్కయ, మ్మేసినవిధమున నేయ నేర్చు

ఆ. నర్జునుండు వనమృగావలిఁ గలిసి యి, ట్లున్నఁ జూచియును సుఖోచితాత్ము
లైనకవలు దీనులై యున్నఁ జూచియు, నుపశమంబుఁ దాల్చి యుండఁదగునె.

వ. క్షమయును దేజంబును నయ్యాయికాలంబులఁ బ్రయోగింప నేరనిరాజునకుం బ్రజానురాగప్రతాపంబులు లేవనునీయర్థం బితిహాసంబున వినంబడు క్షమాతేజంబులలోన నెయ్యది విశేషంబు దానిన నిర్ణయించి చెప్పు మని బలీంద్రుండు దొల్లి తనపితామహుం డయినప్రహ్లాదు నడిగిన నాతండు బలీంద్రున కిట్లనియె. 216

ఆ. క్షమయ తాల్చి యుండఁజన దెల్లప్రొద్దుఁ దేజంబ తాల్చి యుండఁజనదు పతికి
సంతతక్షముండు సంతతతేజుండు, నగుట దోష మందు రనఘమతులు. 217

వ. ఎట్లనిన "నిత్యక్షమాన్వితుం డయినవానికి భృత్యులు వెఱవక యవమానంబు సేయుదు. రర్థంబులయం దధికృతు లయినవారలు ధనంబు లపహరించి దర్పంబు సూపుదురు. మఱి నిత్యతేజోధికుం డైనవాఁ డతిక్రూరదండంబున సర్వజనసంతాపంబు సేయుచు, గృహగతం బైనసర్పంబునుంబోలె నెప్పుడు నుద్వేగకరుం డగుం. గావునఁ గాలోచితంబులుగా క్షమాతేజంబులు గల్పించునది. యథాకాలకల్పితక్షమాతేజుం డైనవానికి నుభయలోకసిద్ధి యగు నని బలీంద్రప్రహ్లాదసంవాదంబు సెప్పి వెండియు ద్రౌపది యిట్లనియె. 218

తే. [1]ఆది నపరాధ మొక్కటి యైన నదియు
నల్ప మైనను క్షమియించు నదియుఁ గాక
చెనసి యపరాధములు పెక్కు సేయు చున్న
పాపకర్ములకు సహింపంగ నేల. 219

క. ఇది తేజంబున కవసర, ముదితక్రోధుండ వగుము యొక్కించుక దు
ర్మదు లగుసుయోధనాదుల, నదయుల వధియింతు రుగ్రులై నీతమ్ముల్. 220

వ. అనిన ధర్మరాజి ట్లనియె. 221

సీ. క్రోధంబు పాపంబు క్రోధంబుననచేసి, యగుఁ జువ్వె ధర్మకామార్థహాని
గడఁ గ్రోధి కర్జంబు గానండు క్రుద్ధుండు, గురు నైన నిందించుఁ గ్రుద్ధుఁ డైన
వాఁ డవధ్యుల నైన వధియించు మఱి యాత్మ, ఘాతంబు సేయంగఁ గడఁగుఁ గ్రుద్ధుఁ
డస్మాదృశులకు ధర్మానుబంధుల కిట్టి, క్రోధంబు దాల్చుట గుణమె చెపుమ

ఆ. యెఱుక గలమహాత్ము లెఱుక యజ్ఞనముల, నార్చుఁ గ్రోధ మనుమహానలంబుఁ
గ్రోధవర్జితుండు గుఱుకొని తేజంబు, దాల్చు దేశకాలతత్త్వ మెఱిఁగి. 222

క. క్షమ గలవానికిఁ బృథ్వీ, సమునకు నిత్యంబు విజయసంసిద్ధి [2]యగుక్

1. క. అరయ నపకార మొక్కఁ డైన నదియు నల్ప, మైన క్షమియించు నది గాక యలయ కెపుడుఁ, జెనసి. 2. క. ధృతక్షముఁ డైనవాని.

క్షమి యైనవానిభుజని, క్రమము గదుర్ప వెలయు సర్వకార్యక్షమ మై. 223

వ. తేజఃప్రభవంబు లైనయమర్ష దాక్షిణ్య శౌర్య శీఘ్రత్వంబు లనునాలుగు గుణంబులు క్షమావంతునంద వీర్యవంతంబు లగుఁ దొల్లి కశ్యపగీత లైనగాథలయందీయర్థంబు వినంబడు వినుము వేదంబులు యజ్ఞంబులు శౌచంబును సత్యంబును విద్యయు ధర్మువు సచరాచరం బయినజగ మంతయు క్షమయంద నిలిచినవి తపస్స్వాధ్యాయయజ్ఞకర్తలయు బ్రహ్మవిదులయుం బడయుపుణ్యగతులు క్షమావంతులు వడయుదు రదియునుం గాక కృష్ణద్వైపాయన భీష్మ విదుర కృప ద్రోణ సంజయప్రభృతులు నాయుపశమంబ కీర్తింతు రుపశమహీనుం డయినదుర్యోధనుకారణంబున ధార్తరాష్ట్రుల కెల్లం బ్రళయం బగు ననిన ద్రౌపది వెండియు ని ట్లనియె. 224

మధ్యాక్కర. క్షమయంద చిత్తంబు నిల్పి నిర్గతకల్మషబుద్ధిఁ
క్రమమున ధర్మువు[1]నంద వర్తిల్లు కరుణాత్మ నిన్ను
నమరంగ ధర్మువు రక్షించుఁ బ్రీతి నని శత్రు లందు
శమబుద్ధి సేయంగఁ జనునె నీకు నజాతశత్రుండ. 225

ఆ. ధర్మదూరు లైన ధార్తరాష్ట్రులయంద, ధర్మ వేమి సేయు ధరణినాథ
నికృతిపరులయందు నికృతి సేయనివారు, వారినికృతిఁ జేసి వధ్యు లండ్రు. 226

క. ఆర్యులకు విహీనతయు న, నార్యుల కున్నతియుఁ జేసి యవినీతుఁ డవై
కార్యము దప్పితి నీకు న, నార్యులు చుట్టములె యార్యు లరులె విధాతా. 227

వ. అని విధాతృని ధర్మువు నాక్షేపించుద్రౌపదిం జూచి ధర్మరాజి ట్లనియె నాస్తికులయట్లు [2]ధర్మాభిశంకిని వై దైవదూషణంబు సేసెదు శిష్టచరితం బయినధర్మంబు నధిక్షేపించుచున్నదుర్మతికిం బ్రాయశ్చిత్తంబు లేదు ధర్మువు దప్పక నిత్యులై జీవించుచున్నమైత్రేయ మార్కండేయ వ్యాస వసిష్ఠ నారదప్రభృతులం బరమయోగధరులం బ్రత్యక్షంబ చూచెదము వీ రెల్ల నన్ను ధర్మపరుం డని మన్నింతు రన్యులన్యాయంబు సేసి రనియు నే నేల ధర్మువు దప్పుదు. 228

క. ధీరమతియుక్తిఁ జేసి వి, చారింపఁగ నిక్కువంబు సర్వజనస్వ
ర్గారోహణసోపానం, బారఁగ ధర్మంబ చూవె యతిరమ్యం బై. 229

వ. తపస్స్వాధ్యాయ బ్రహ్మచర్య (దానధర్మ)యజ్ఞంబు లనుపుణ్యకర్మంబు లఫలంబు లగునేని వీని నేల [3]ఋషిగణంబులు సేవింతురు నీజన్మంబును ధృష్టద్యుమ్నుజన్మంబును బుణ్యకర్మఫలసద్భావంబునకు నిదర్శనంబులు గావె మఱి పుణ్యఫలంబులు గలయట్ల పాపఫలంబులును గలవు తొల్లి బ్రహ్మ దనపుత్త్రులకుం గర్మఫలసద్భావంబు సెప్పె నందుఁ గశ్యపుండు ధర్మప్రబోధనంబునం జేసి పుణ్యఫలప్రాప్తుం డయ్యె విధా

1. గ. రక్షించుచున్న. 2 జ. ట్లధర్మశంసిని వై ... నతిక్రమించు చున్నదుర్మతికిం, 3. గ. జ. దేవర్షి గంధర్వగణంబులు.

తృనియోగంబునం బుణ్యపాపఫలంబు సంప్రాప్తం బగు విధాతృననుగ్రహంబు ననకాదె పుణ్యకర్మంబులు ప్రవర్తించి [1]మర్త్యు లమర్త్యత్వంబును బొందుదు రనిన విని ద్రౌపది యి ట్లనియె. 230

ఆ. కర్మఫలము [2]లేదు । కర్మఫలాప్తికిఁ, గారణంబు విధియ । కా దనంగ
నంతయెఱుక లేనె । యార్తనై విధి చెద్ది, కలసి పలికితిం బ్రి । యంబు దప్పి. 231

ఆ. వేదశాస్త్రములును । విధివిధానములును, న ప్రమాణ మనుదు । రాత్మకులకుఁ
బుణ్యగతులు లేమి । భూనాథ యెఱుఁగని, దానఁ గాను ధర్మ । తత్త్వయుక్తి. 232

వ. తొల్లి నీతిమంతు లయినబ్రాహ్మణులు మదీయజనకునకుం జెప్పంగ వింటి నెఱుక గలవారికిం గర్మంబు గర్తవ్యంబు గర్మరహితు లయి స్థావరంబులయట్లు జనులు జీవింప నేర రల్పఫలంబు నైనను గర్మంబుఁ బ్రవర్తించు చున్నవారిం జూచెదము దైవమానుషంబులు గర్మఫలప్రాప్తికి నిమిత్తంబులు పురుషుండు మనంబున నర్థసిద్ధి నిశ్చయించి కర్మంబునందుఁ గృతోత్సాహుండు గావలయు నట్టివానికి దైవంబు సహాయం బయి కర్మసిద్ధి గావించు. 233

మధ్యాక్కర. తిలలందుఁ దైలంబు కాష్ఠములయందుఁ । దిరముగా నగ్ని
గలుగు టెఱిఁగి యుపాయపూర్వమునఁ । గడఁగి తత్సిద్ధి
యలయక యుత్సాహవంతుఁడు వడయు । న ట్లనుత్సాహ
మొలసి దైవపరుఁ డది వడయంగను । నోపునె యెందు. 234

మధ్యాక్కర. కడు నిమ్ముగా దున్ని బీజములు సల్లి । కర్షకుం డున్నఁ
దడయక వర్షంబు గురిసి కావించుఁ । దత్ఫలసిద్ధి
నడుమఁ బర్జన్యుఁ డనుగ్రహింపని । నాఁ డేమి సేయుఁ
గడఁగి చేయం గలదానిఁ జేయును । గాక కర్షకుఁడు. 235

వ. కర్మఫలంబులు దైవమానుషసిద్ధంబు లయినను బురుషోత్సాహసముపార్జితంబు లయిన నవి సుస్థిరంబు లయి సురక్షితంబు లయి వర్తిల్లు [3]ననీహమానుం డయి దైవపరుం డయినవాఁడు నీరిలోనియానపాత్రంబునుంబోలె నవసన్నుం డగుం గావునఁ గర్మఫలసిద్ధి నిశ్చయించి యుత్సాహవంతుఁడ వయి నీయనుజులపరాక్రమంబునం బరుల జయించి మనయందలియర్థకృశత్వం బపనయింపు మనిన యాజ్ఞసేనివచనంబుల కనుగుణంబుగా భీమసేనుండు ధర్మరాజున కి ట్లనియె. 236

భీమసేనధర్మరాజులసంవాదము.

మ. పితృపైతామహ మైనరాజ్య మరినిర్భేద్యంబు గాండీవిచే
నతిగుప్తంబు బలారి కైనను నవార్యం బిట్టిదానిన్ సుదు
ర్మతి నన్యార్థము సేసి నీకుఁ జనునే । మర్త్యేశ యుగ్రాటవిన్
వ్రతముల్ సల్పుచు ధర్మలేశచరణ । వ్యాసక్తి ని ట్లుండఁగన్. 237

1. గ. మహాత్ము లమర్త్యంబుఁ బొంది రనిన. 2. క. లందు. 3. గ. జ. నమానుషుం.

క. ఆమిషము సింహములచే, గోమాయువు గొన్నయట్లు । కువలయరాజ్య
శ్రీ మనచేఁ గొని కౌరవుఁ, డే మని తలఁచునొకొ బుద్ధి । నిష్టులుఁ దానున్. 238

క. దుర్మతులను దుర్జనులను, ధర్మస్థితి నోర్వఁ దగునె । ధరణీశ్వర దు
ష్కర్ములగు ధార్తరాష్ట్రుల, పేర్మి యడంగింపఁ గడఁగు । పృథుభుజశక్తిన్. 239

వ. ధర్మకామప్రభవం బయి సర్వార్థసాధనం బయినయర్థంబు విడిచి మిత్రుల కప్రియంబు నమిత్రులకు హర్షంబునుంగా మునివృత్తిం జేకొని ధర్మువు ధర్మ వనుచు ధర్మువునందు బుద్ధి నిలిపి దుర్మనుజునట్లు నిర్వేదింపం దగునె. 240

ఆ. బాహుబలము మెఱసి । పరులసంపదలు సే, కొనఁగ లావు లేని । కుత్సితుండు
నియతదుఃఖవృత్తి । నిర్వేదపరుఁ డగుఁ, గాక నీకుఁ దగునె । కౌరవేంద్ర. 241

చ. నరనుత నీయనుజ్ఞఁ గొని । నాఁడ విరోధుల నెల్లఁ బోరిలో
సరభసవృత్తి నుక్కడఁగఁ । జంపితిమేని మహోగ్రకాననాం
తరముల నుండ కుండ నతి । దారుణదుర్మృగసంగమంబునం
బొరయక యుండఁగా [1]మనకుఁ । బోలు నమందమనఃప్రియంబుగన్. 242

క. సమయాతిక్రమభీతిని, క్షమాయుతుల మైనమనలఁ । గౌరవులు పరా
క్రమహీనులుగాఁ దలఁతురు, సమరోత్సాహంబు విడిచి । జడమతి నున్నన్. 243

తే. తగిలి నిత్యంబు నేకాంత । ధర్మనిరతుఁ, డగుట యుక్తమె పురుషున । కట్టివాని
వెలయ ధర్మకామంబులు । విడుచుఁ బ్రాణ, విగతు సుఖదుఃఖములు రెండు । విడుచునట్లు.

సీ. ధర్మకామంబులు । తఱుఁగంగ నర్థార్థి, యగువాఁడు పతితుఁ డౌ । నర్థసేవ
నర్థార్థముగఁ జేయు । నతఁ డుగ్రవనములోఁ, గోరకు [2]సేయున । క్కుమతిఁ బోలు
నర్థధర్మములకు । హానిగాఁ గామార్థి, యగునాతఁ డల్పజ । లాశయమున
జలచరం బెట్టు ల । జ్జలములతోఁ జెడు, నట్లు కామంబుతో । హానిఁ బొందు

ఆ. నర్థధర్మములు మ । హాబ్ధిమేఘములట్టు, లుభయమును బరస్ప । రోదయమ్ము
లిట్లుగాఁ ద్రివర్గ । మెఱిఁగి [3]సామ్యమున సే, వించువాఁడు సర్వ । విత్తముండు.

వ. భవదాచరితం బైనయీధర్మం బర్థకామంబులకు కాదు నీకును నీబాంధవులకును బాధాకరంబు దానయజ్ఞసత్పూజలు గావింప నర్థహీనున కశక్యంబు జగంబులు ధర్మమయంబులు ధర్మువునకు మిక్కిలి యొండెద్దియు లే దయినను నర్థార్థంబు [4]గానిధర్మువు క్షత్రియుల కయుక్తంబు. 246

ఉ. శత్రుల నాజి నోర్చుటయు । సర్వభయంబులఁ బొంద కుండఁగా
ధాత్రిఁ బరిగ్రహించి యుచి । తస్థితిఁ గాచుటయుం బ్రియంబుతోఁ
బాత్రుల కర్థ మీఁగియును । బ్రాహ్మణపూజయుఁ జువ్వె యుత్తమ
క్షత్రియధర్మముల్ సుగతి । కారణముల్ విపులార్థమూలముల్. 247

1. జ. ఁగలుగఁ • బోలునె వైరిమనఃప్రియం బొగిన్. 2. చ. సేయని • కుమతి. 3. గ. సౌమ్యమున. 4. ఖ. గా ధర్మువు క్షత్రియుల కనుత్తమంబు.

వ. కేవలధర్మాచరణంబు శత్రుజయంబునకు సాధనంబు గాదు, నికృతి వలయుఁ, బూర్వభ్రాతలైనయసురుల నమరులు నికృతిన కాదె నిర్జించిరి, కావున నీవు సమయధర్మరక్షణవ్రతం బుడిగి శత్రువుల జయింప నుద్యోగింపుము. 248

క. జయశీలి వైననీకుం, బ్రియ మొనరింపంగ నున్నపృథుయశులు ముదా
శ్రయు లగుదురు సృంజయకే, కయయదుపాంచాలు రాదిగాఁ గలసుహృదుల్.

తే. మిత్రసంపన్నుఁ డైననమిత్రు మిత్ర, బలముతోడ భేదించి దోర్బలముఁ [1]జలముఁ
గలిగి దేశబలంబును గాలబలముఁ, గలుగువానికసాధ్యంబు గలదె యెందు. 250

తే. బలము గలవానిఁ బలువురు బలవిహీను, లొక్కటై కూడి నిర్జింతు రుత్సహించి
మధువుఁ గొన నుత్సహించినమనుజుఁ బట్టి, కుట్టి నిర్జించుమధుకరకులమునట్లు.

వ. [2]శూద్రాన్నంబునందలిదుర్గంధంబునుంబోలె దుర్యోధనురాజ్యంబు దూష్యం బగుటఁ బౌరజానపదబ్రాహ్మణవరులు నీ కనురక్తు లయి భవద్రాజ్యంబ వలచి యుండుదురు దీని నేల యెడ సేసెదు సర్వాయుధసనాథం బైనరథం బెక్కి గజపురంబున కభిముఖుండ వై విజయప్రయాణంబు సేయుము. 252

మ. ప్రణుతక్షాత్త్రగుణంబు విక్రమము దర్పం బేర్పడ విక్రమ
క్షణదానం బొనరింపు మీక్షణమ విఖ్యాతంబుగా సంగరాం
గణమధ్యంబునఁ జేయు మర్జునబృహద్గాండీవనిర్ముక్తమా
ర్గణధారావళి ధార్తరాష్ట్రకదళీకాంతారవిచ్ఛేదమున్. 253

క. బహురథగజవాహనభట, సహితులు బలవంతు లని విచారింపకు నీ
యహితులు మద్బాహుగదా, నిహతికి మార్కొనఁగఁ బోర నిలువం గలరే. 254

క. అరివరుల నోర్చి సాగర, పరివృతభూచక్ర మెల్లఁ బాలింపు ప్రజా
పరిపాలనంబుకంటెను, ధరణీశ విశేష మొండు ధర్మువు గలదే. 255

వ. రాజ్యపదస్థుం డైనక్షత్త్రియుండు భూరిదక్షిణంబు లైనయజ్ఞంబుల దేవబ్రాహ్మణులం దృప్తులం జేసి బ్రాహ్మణులకు నగ్రహారంబులు గోసహస్రంబులు నిచ్చి దురితంబులవలనం బాసి తమోవిముక్తుం డైనచంద్రుండునుంబోలె వెలుంగు ననిన భీమసేనునకు ధర్మరా జిట్లనియె. 256

ఉ. నీవచనంబు ధర్మ్యము వినీతము నీతియుతంబు నిష్టసి
ద్ధ్యావహ మత్యుదార మిది యైనను నిపుడు దలంపఁగా విచా
[3]రావసరాప్తికిం విషయ మైనది కార్యఫలంబు లెల్ల స
ద్భావమునన్ విచారసులభంబుల యండ్రు విచారపారగుల్. 257

క. వనమునఁ బండ్రెం డేండ్లును, జనపదమున నెఱుఁగ కుండ సరి నొకవర్షం
బును జలుపఁ బూని సత్యము, దనరఁగఁ జేసితిఁ బ్రతిజ్ఞ దగ వృద్ధసభన్. 258

1. క. దేశ, బలముఁ గాలబలంబును బరఁగుబుద్ధి. 2. అ. శ్వదృతియందలి. 3. రావసరోక్తికిఁ విషమ మైనది.

×Vide [illegible] : [illegible]

చ. అలఘుగుణంబులం దధికుఁ డై నమహాత్ముఁడు రాగకోపమా
యలఁ బడి యక్షమావివశుఁ డై యచిరాంశులతావిలాసచం
చల మగులక్ష్మి కాసపడి సత్యము ధర్మువుఁ దప్పి సత్సభా
వలిఁ దగువారియొద్దఁ దగుఁ వాఁ డయి [1]సద్విధి నుండ నేర్చునే. 259

వ. ఏ నెట్లును సత్యసమయం బతిక్రమింప నోప, శుభోదయకాలంబుఁ బ్రతీక్షించి యుండుము, రాజ్యంబులుఁ బుత్త్రులును ధనంబును యశంబును సత్యంబునకు సమంబులు గా వనిన భీమసేనుం డి ట్లనియె. 260

ఆ. అంతకుండు జనుల కాసన్నుఁ డై యుండ, నిమిషమాత్ర మేని నిశ్చయింపఁ
దగనిజీవనంబు దద్దసుస్థిరముగాఁ, జేసి కార్య మెడయఁ జేయఁ దగునె. 261

వ. శరీరికి మరణంబు నియతంబు, మరణంబునకు ముందర వైరంబు దీర్పనివాని జన్మంబు నిరర్థకంబు, సకలరాజసమక్షంబునం బరులచేత నట్లు మనపడినపరిభవంబునకుం బ్రతీకారంబు సేయునంతకు రేయునుం బగలును నాహృదయంబు దపించుచుండు, నాకంటె నర్జుననకులసహదేవులుం గుంతీదేవియు నంతస్తాపంబున నెంతయు సంతప్తు లగుచున్నవారు. 262

క. వీరలదుఃఖము దీర్పక, క్రూరనికారు లగురిపులకును ముదముగ ను
గ్రారణ్యములో ధర్మువుఁ, గారుణ్యముఁ దాల్చి యునికి కార్యమె నీకున్. 263

వ. ఇది బ్రాహ్మణధర్మంబు గాని క్షత్త్రియధర్మంబు గాదు మనుప్రణీతంబు లైనరాజధర్మంబులు నీయెఱుంగనియవి లేవు [2]శత్రుసంహారంబు సేయనినాఁ డత్యంతహాని యగు నట్లుం గాక. 264

తే. వనమునందుఁ బండ్రెండుసంవత్సరంబు, లుండ నేర్చితిమేనియు నొరు లెఱుంగ
కుండ నజ్ఞాతచర్యయం దొక్కదివస, మైన నుండంగ నేర [4]మె ట్లనిన వినుము.

వ. ఆబాలవృద్ధప్రసిద్ధుండ వై పార్థివసూర్యుండ వైననిన్నును సింహసదృశు లైననీ తమ్ములను నెఱుఁగనివారు లేరు మనగూఢభావంబు మేరువునిగూఢభావంబునుం బోలె నఘటమానం బ్లైని యివ్వనవాసక్లేశం బెన్నఁడును మనకుఁ బాయ నేరదు మన మిప్పు డివ్వనమునఁ బదుమూఁడుమాసంబులు సలిపితిమి సంవత్సరప్రతినిధి గా మాసంబులు సేసికొనుట యెందునుం గలయదియ దీన ధర్మవిరోధంబు లేదు విజయారంభంబున కిది యవసరం బనిన భీమసేనుపలుకులు విని నిశ్వాసవ్యాకులితముఖుం డై పెద్దయుం బ్రొద్దు చింతించి ధర్మరా జి ట్లనియె. 266

క. క్రమమునఁ బాండిత్యపరా, క్రమగర్వములందుఁ గడుఁ బ్రగల్భుండవు మ
ధ్యమ! నీచెప్పినయది కా, ర్యమ యయినను ధీరబుద్ధి వై విను మనఘా. 267

వ. [4]అల్పీయం బైనకార్యంబు సాహసారబ్ధం బైనను దోషంబు లే దిది మహా

1. గ. సజ్జనుఁ డుండ. 2. గ. జ. శత్రువర్ధనంబున నత్యంతహాని. 3. జ. మె ♦ క్లైన మనము.
4. క. గ. అల్పోపాయం బైన.

కార్యంబు సాహసక్రియాసాధ్యంబు గాదు సువిచారితం బై సిద్ధిం బొందు విచారపూర్వారబ్ధకార్యంబునకు దైవంబును ననుకూలం బగుం గావున నిమ్ముగా విచారింప వలయు. 268

సీ. శూరులు ధృతరాష్ట్రసుతులు దుర్యోధనా, దులు దురాధర్షు లందఱును మనకు
నాతతాయులు ǂ మఱి యంగభూవిభుఁడును, భూరిశ్రవుఁడు మద్రభూమిపతియు
నాదిగాఁ గలవీరు ǂ లవిజేయవిక్రము, ల్లొలసి తత్సుహృదు లై ǂ యున్నవారు
మనచేత జితు లై నేమను జేసి రెల్లను, జని సుయోధనుచేత ǂ సత్కరింపఁ
ఆ. బడి కడంగి వానిప్రస్తవంబున నాజి, వేచి ప్రాణములను ǂ విడువ నున్న
వారు వార లెల్ల ǂ వసుధఁ బ్రసిద్ధులు, వినఁగ నస్త్రశస్త్రవిద్యలందు. 269

క. వినవయ్య కర్ణగర్వం, బని నాతఁ డభేద్యకవచుఁ ǂ డగుటయు విలునే
ర్పును నతనిబాహువిక్రమ, మును దలఁచిననాఁడు గన్ను ǂ మూయదు నాకున్.

వ. మఱియు భీష్మద్రోణకృపాచార్యులు సము లయ్యును వారియొద్దన యున్నవారు వార లపారదివ్యాస్త్రవిశారదులు వారల నోర్చి కాని దుర్యోధను నిర్జింపం బోల దని విచారించుసమయంబున. 271

కృష్ణద్వైపాయనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చుట.

క. వారలపుణ్యోదయమున, వారిజభవనిభుఁడు లోకవంద్యుఁడు వచ్చెం
బారాశర్యుఁడు ధర్మశ, రీరుఁడు కృష్ణాజినోత్తరీయుఁడు ప్రీతిన్. 272

వ. ఇట్లు వచ్చి పరమభక్తిపరు లైనపాండవులచేతం బూజితుం డై కృష్ణద్వైపాయనుండు ధర్మరాజున కిట్లనియె. 273

క. వీరు లగుభీష్మకుంభజ, శారద్వతకర్ణు లమితసత్త్వులు వారిం
బోర వధియించు టెంతయు, భారం బని యున్ననీకు ǂ [1]భర మెఱిఁగి మదిన్. 274

ఆ. దాని నపనయింపఁగా నిప్డు వచ్చితి, నధికయోగలబ్ధ ǂ మతిరహస్య
మీవిశేషవిద్య ǂ సేవింపఁగాఁ బార్థుఁ, బనుపు మితఁడు దీనఁ ǂ బడయు సిద్ధి. 275

వ. అని ధర్మతనయు నేకాంతప్రదేశంబునకుం దోడ్కొని చని సత్యవతీసుతుండు విధిదృష్టవిధానంబునం బ్రతిస్మృతి యనువిద్య నుపదేశించి దీనిశక్తి నర్జునుం డధికతపోవీర్యవిభవుం డై యింద్రయమవరుణకుబేరాదిదేవతలను నీశ్వరునిఁ బ్రత్యక్షంబు సేసికొని వారలవలన దివ్యాస్త్రంబులు వడసి శత్రువుల జయించు మఱి యివ్వనంబు భవచ్చిరనివాసంబునం జేసి విరళఫలకుసుమపాదపం బై మృగకులోపరోధి యై యొప్పకున్నయది యొక్కచోటన పెద్దకాలం బునికి యెవ్వరికిం బ్రీతిజననంబు గాదు కావున నొండువనంబున కరుగునది యని చెప్పి యమ్మునివరుం డరిగినఁ దద్వాక్యముదితు లై ద్వైతవనంబు వాసి పాండవులు బ్రాహ్మణవరులతోన కామ్యకవనంబున కరిగి సరస్వతీతీరంబునందు నివాసంబు సేసి కొండొక

1. భయ.

కాలం బుండ నోర్వఁ డజాతశత్రుం డర్జునుఁ జూచి యి ట్లనియె. 276

క. సాధితశాత్రవు లగుభీ, ష్మాదులయం దధిగతాశ్రేయం బయ్యెఁ జతుగ
పాదం బగు చున్నధను, ర్వేదము బ్రాహ్మణులయందు వేదముపోలెన్. 277

వ. [1]అయ్యాది మహనీయం బయి దివ్యమంత్రకలితం బయి వారలకు సన్నిహితం
బగుఁ గావున. 278

క. వారలు దుర్యోధనుచే, నారాధితు [2]లిష్టసత్క్రియలు సల్ప రణ
ప్రారంభ మయిన నెదిరెదు, వారు పరాక్రాంతు లై యవశ్యము మనతోన్. 279

వ. దివ్యాస్త్రవిదు లైనవారల నోర్చునట్టియుపాయంబు గృష్ణద్వైపాయనుండు ప్రసా
దించి చెప్పె నీవిద్య నీవు ప్రతిగ్రహించి కవచకార్ము[3]కప్రాసఖడ్గధరుండ వై య
న్యుల కజేయుండ వై యుత్తరదిక్కున కరిగి తపోయోగబలంబున నింద్రుఁ బ్రత్య
క్షంబు సేయుము తొల్లి వృత్రునకు వెఱచి వేల్పులు తమయాయుధంబులు
నింద్రునందు సమర్పించి రవి యెల్ల నీకుఁ దత్ప్రసాదంబున నగు మఱి యింద్రు
నుపదేశంబున నీశ్వరు నారాధించి తదనుగ్రహంబున నిష్టసిద్ధి వడయు మని
వేదవ్యాసునుపదేశం బని. 280

క. ధృతినియమవ్రతునకు దీ, క్షితునకుఁ బార్థునకు విగతకిల్బిషునకు ధ
ర్మతనూజుఁడు ప్రీతిఁ బ్రతి, స్మృతి నుపదేశించెఁ దా నమిత్రజిగీషన్. 281

వ. అర్జునుండును నయ్యోగవిద్యాగ్రహణప్రభావంబున నధికతేజోమూర్తి యై ది
వ్యాస్త్రలాభార్థం బగ్రజుచేత ననుజ్ఞాతుం డై విధివిహితహోమసంతర్పితవీతి
హోత్రుండును బ్రాహ్మణకృతస్వస్త్యయనుండును నై ధౌమ్యాదిమహీసురవరులను
భ్రాతృవరులను వీడ్కొని తపంబున కరుగ సమకట్టిన. 282

సీ. ఆతని గాండీవహస్తు నక్షయబాణ, తూణీరయుగళు నున్నతుంగభుజునిఁ
గనకవర్మావృతఘనతరతనుఁ జూచి, పొంగి యంతర్హితభూతములును
బ్రాహ్మణప్రవరులుఁ బార్థునిమనమునఁ, దలఁచినయర్థంబు దడయ కిష్ట
సంసిద్ధి యయ్యెడు సర్వవిఘ్నములును, శాంతిఁ బొందెడు మని సంతసమునఁ

ఆ. బలికి రంతఁ దరుణి పాంచాలి బీభత్సు, కడకు నరుగుదెంచి కమలనేత్ర
యరిజయార్థ మరుగునాతనియుత్సాహ, మెఱిఁగి యిట్టు లనియె సిందువదన. 283

క. అవమానాసహ మగునీ, యవమక్షత్రియకులంబునం దిం కిట పు
ట్టువు గా కుండెడు సత్త్వమ, మవుబ్రాహ్మణకులమునంద యయ్యెడు నాకున్. 284

చ. అరికృతదుష్పరాభవమహార్ణవమగ్నుల మమ్ము నందఱం
గరుణ సముద్ధరింపుము జగన్నుత యన్యులు వూనఁ గానియీ
భరము వహింపఁ బూనినయపారగుణాన్వితు నిన్ను దిక్కులుం
ధరణియు సోముఁడుం నభము ధాత్రియు గాడ్పును గాచు చుండెడున్. 285

1. ఈవచనము వెక్కుప్రతులఁ గానిపింపదు. 2. జ. లిష్టసత్క్రియల నల్పరణ. 3. క. కాస్త్రఖడ్గ.

వ. అని దీవించి పాంచాలరాజపుత్త్రి దనస్నేహలాలసవిలోలాపాంగవిలోకనంబులం బార్థుం బరిగృహీతపాథేయుం జేయుచుఁ దద్వియోగతరళం బైనహృదయం బెట్ట కేనియు నొక్కఁ దంత సేసికొని యుండె మఱి పార్థుండును బూర్వోత్తరదిశాభిముఖుం డై యొక్కరుండ యరిగి యైంద్రయోగశక్తి నిఖిలభూతదుర్నిరీక్షుం డగుచు హిమశైలగంధమాదనంబుల నతిక్రమించి. 286

ఉ. వీరుఁడు యోగవిద్యయును విల్లును దోడుగ నింద్రకీల మ
భూరినగంబుపైఁ గడఁగి పోవఁగ బోయినఁ బోవ కుండు ము
గ్రారివిభేది నీ వనుమహామధురధ్వని విన్చె వానికిన్
బోరన నంతరిక్షమునఁ బొల్చె నిరంతరపుష్పవృష్టియున్. 287

వ. దానికి విస్మయం బంది చనువాఁడు ముందట నొక్కవృక్షమూలంబున నున్నవృద్ధబ్రాహ్మణు బ్రహ్మతేజోధికు నవిరతయమనియమకృశీభూతశరీరుం గని నమస్కరించి తత్సమీపంబున విశ్రమించి యున్న నప్పార్థుం జూచి బ్రాహ్మణుం డి ట్లనియె.

క. ఎందుండి వచ్చి తయ్య య, నిందితతేజుఁడవు ధర్మనియతుండవు నీ
కిం దుండ నేల సిద్ధిం, బొందితి చేకొను మభీష్టభూరిఫలంబుల్. 289

క. ఇది శాంతతపస్వుల కా, స్పద మిందుఁ గృపాణకవచబాణాసనసం
పద దాల్చి యుండ నేటికి, విదితక్షత్త్రియకులుండ వే నీ వనఘా. 290

వ. వీతహర్షక్రోధు లైనబ్రాహ్మణు లుండెడుపుణ్యనివాసంబున నాయుధంబులు ధరియించి యుండ వలదు వీని విడువు మని [1]నిషేధించిన నవ్విప్రువచనంబులకు సంచలింపక యున్నయాతనిధైర్యంబునకు మెచ్చి సహస్రాక్షుండు నిజరూపంబుఁ జూపి యతని కి ట్లనియె. 291

ఆ. ఇష్ట మైనవరము లిచ్చెదఁ బ్రీతితో, వేఁడు మనిన నమరవిభున కపుడు
కరముభక్తి మ్రొక్కి కరములు మొగిచి యి, ట్లనియెఁ బురుషవృషభుఁ డర్జునుండు.

వ. దేవా నా కిష్టం బైనవరంబు భవత్ప్రసాదంబున దివ్యాస్త్రలాభం బనిన నది యేమిగహనంబు దానిన యిచ్చెదఁ బుణ్యలోకంబులు దేవత్వంబును సర్వకామంబులు వేఁడు మనిన నర్జునుం డి ట్లనియె. 293

సీ. దివిజాధినాథ నా కవి యెల్ల నేటికిఁ, బరమాస్త్రలాభంబ కర మభీష్ట
మరులు సేసినమహాపరిభవక్లేశంబు, వాపంగ నోపక యేపు డవి
నురుదుఃఖితుల సహోదరుల నందఱఁ బెట్టి, చనుదెంచి మిన్నక చనిన నన్నుఁ
దగువారు జగములోఁ దెగడరే నావుడు, సుతునకుఁ బ్రీతుఁ డై శతమఖుండు
ఆ. గరుణ నిట్టు లనియెఁ బరమాస్త్రలాభంబు, నీకు నిష్టమేని లోకవంద్య
గరళకంఠు నీశుఁ బరముఁ బ్రసన్నుఁ గా, వేగ చేయు మధికయోగశక్తి. 294

వ. అట్లేని నిఖిలలోకపాలసహితుం డై యీశ్వరుండు నీయభిమతం బొనరించు నని

1. క. బోధించిన విప్రువచనంబులకు.

సహస్రలోచనుండు లోచనాగోచరుం డైన నర్జునుండును దద్వచనంబున సమా
హితచిత్తుం డై హిమశైలశిఖరంబున కరిగి వివిధకుసుమఫలవృక్షంబులను విమల
నిర్ఝరజలంబులను గమలకుముదకల్హారకలహంససంకులపంకజాకరంబులను రమ్యం
బైనతపోవనంబునందుఁ బరమేశ్వరు నుద్దేశించి తపంబు సేయం దొడంగిన. 295

క. సురదుందుభినాదంబులు, సురపాదపసంభవప్రసూనసుగంధో
త్కరవాహితపవనము వి, స్తరిల్లె నాతనికి హృదయసమ్మద మెసఁగన్. 296

వ. అందు మనోవాక్కాయకర్మనియతుం డై పరమేశ్వరుం దనచిత్తంబున నిలిపి నిరం
తరత్రిరాత్రోపవాసంబుల నొకమాసంబు సలిపి ద్విగుణితత్రిరాత్రోపవాసంబుల
రెండవమాసంబుఁ జలిపి పక్షోపవాసంబుల మూఁడవమాసంబు సలిపి యూర్ధ్వ
బాహుం డై యేకపాదాంగుష్ఠాగ్రంబున నిలిచి వాయుభోజనంబు సేయుచు నాలవ
మాసంబు సలిపి యిట్లతిఘోరతపంబు సేయు చున్నయర్జునుం జూచి యందలి
ఋషులు విస్మయం బంది యీశ్వరుపాలికిం జని యిట్లనిరి. 297

ఉ. భూరిబలుండు పాండవుఁ డపూర్వతపం బొనరించుటం దదీ
యోరుతపఃప్రభావదహనోత్థితధూమచయంబు లంబుదా
కారము లై వనాంతరముఁ గప్పె జగత్త్రయనాథ తత్తపో
భారము సర్వజీవుల కపారభయావహ మద్భుతం బిలన్. 298

వ. ఆతనియభిమతంబుఁ బ్రసాదించి తత్తపోభారంబు వారింపు మనిన వారలపలుకులు
విని పరమేశ్వరుండు దరహసితవదనుం డగుచు వానియభిప్రాయం బే నెఱుంగుదు
నిష్టవరప్రసాదంబున వానికి మనఃప్రియంబుఁ జేసెద మీరు మీయాశ్రమంబుల
కరిగి సుఖం బుండుం డని యప్పుడు. 299

ఈశ్వరుండు కిరాతవేషంబున నర్జునునొద్దకు వచ్చుట.

సీ. కాంచనవర్ణాపఘనుఁ డై మహోన్నత, కార్ముకహస్తుఁ డై కాలకంఠుఁ
డెఱుకరా జయ్యె నద్రీంద్రతనూజయు, వనచరీభావంబు వఱలఁ దాల్చెఁ
గుఱుచచేతులు మిడిగ్రుడ్లును గడుకొన్న, [1]తఱటులు మఱి[2]చెంచుఁదలలు నమరఁ
దడవిండ్లు సేపట్టి తడయక యెఱుకు లై, యార్చుచు భూతమ్ము లాత్మసతుల

తే. నెఱుకసతులఁ గావించి యయ్యెఱుకరాజు
ముందటం బక్కియల నొక్కమొగిన నిలిచి
రంత వేఁటనెపంబున నంధకారి
గదలెఁ దద్వన మెల్ల గ్రక్కదలు చుండ. 300

చ. అలుగుల మంది యందులమృగావలియుఁ విహగంబులుఁ భయా
కులగతిఁ బొంది మూఁగలును గుంటులుఁ జీకులు నై నయట్టు లై
యులియక యున్నచో నడఁగి యుండఁ గిరాతబలంబుతోడఁ బిం

1. క. తలవళ్లు; గ. తలముళ్లు; జ. తడలట్లు. 2. క. చుంచుతలలు; గ. చింకితలలు; అ. చెంచుఁదనము లమర.

గలనయనుం డుమేశ్వరుఁడు గవ్వడి డాయఁగ వచ్చెఁ జెచ్చెరన్. 301

వ. అంత నీశ్వరచోదితుం డయి మూకుం డనుదైత్యుండు సూకరం బై భీకరాకారంబున బీభత్సు వధియింప సమకట్టి పయిం బఱతెంచిన. 302

క. అనఘుండు దాని దవ్వులఁ, గని ఘనుఁ డయి పాండవుండు గాండీవగుణ
ధ్వని సేయుచు డాసినఁ బె, ల్చన యేయఁ గడంగి నిలిచె సంరంభమునన్. 303

వ. అదియును నాక్షణంబ యేసినయమ్మునుంబోలె నతివేగంబున నాసన్నం బైన దాని నేయ కేయకు మని యెఱుకురాజు వారించినను వానివచనం బాదరింపక. 304

చ. పటువిశిఖంబునం ద్రిదశపాలతనూజుఁడు పంది నేసె ము
న్నట పరమేశ్వరుండును రయంబున దానిన యేసె నిట్లు లో
[1]క్కొటఁ బడియెన్ హరార్జునులఘోరశరంబులు పందిపైఁ గుభృ
త్తటముపయిన్ వడిం బడు నుదగ్రమహాశనులట్ల మ్రోయుచున్. 305

క. హరుశరమును నరుశరమును, సరి నిరుపక్కియలు దాఁకి జవ మఱి శరసం
భరమునఁ దిరిగె వరాహము, శరనిధిమథనమునఁ దిరుగుశైలముపోలెన్. 306

వ. ఇట్లిద్దఱచేత శరవిద్ధుం డై మూకదైత్యుండు సూకరరూపంబు విడిచి నిజరూపంబుతోడ నదృశ్యుం డయ్యె నంత నర్జునుండు విస్మితుం డై ముందట నత్యున్నతచాపధరు మేరుశిఖరాకారు నపారకిరాతపదాతిసమేతు నభినవయౌవనవనచరీసహస్రపరివృతు నొక్కపురుషుం గని నీ వెవ్వండవు మనుష్యగోచరంబు గాని యివ్వనంబునఁ బ్రియవనితానుగతుండ వయి యేల క్రుమ్మరియెదు మఱి నాయేసినమృగంబున యేసి మృగయాధర్మవిరోధం బేల చేసితి నిన్ను నిప్పుడ నానిశితబాణజాలంబులపాలు సేసెద ననిన నగుచు నాతనికి నయ్యెఱుకురా జిట్లనియె.

ఆ. ఏను నామృగంబు నేసితి నది మదీ, యాస్త్రనిహత మయ్యెఁ [2]సది నెపముగఁ
జనునె నీకు లేనిశౌర్యసంపదఁ జెప్పి, కొనఁగ మదము పలుకఁ గుజనునట్లు. 308

క. పలుకుల నొప్పదు బీరము, గలవేని రణంబు సేయఁ గడఁగుము నీదో
ర్బల మిప్పుడ యుడిపెద నని, తలరక యేయుచుఁ బినాకి దాఁకెఁ గిరీటిన్. 309

వ. అంత. 310

చ. ప్రతిబలదర్పభంజనుఁడు పార్థుఁడు దారుణబాణవర్షము
న్నతి నతివీరుఁ డై కురిసినం బరముండు మహాంబువృష్టిఁ బ
ర్వతము గ్రహించునట్లు బలవంతుఁడు దాని గ్రహించి పోర న
క్షతతనుఁ డయ్యె వాని నతిగర్వితుఁ బార్థుఁడు సూచి యాత్మలోన్. 311

చ. ఇతఁడు సురేంద్రుఁ డొండెఁ బరమేశ్వరుఁ డొండె ధనేశుఁ డొండెఁ గా
కతులబలప్రభావయుతుఁ డన్యుఁడు గాఁ డొరుఁ డైన మద్భుజా
వితతధనుర్విముక్తశరవేగము పోర సహించి యిట్లు ల

1. ఆ. క్కటఁ... గాఢశరంబులు. 2. క. నవికలముగ; ఘ. నదరి నడుమ.

క్షతుఁడు నమూర్ఛితుండు నయి కంపముఁ బొందక యుండ నేర్చునే. 312

వ. నాయేసినయపారదుర్వారనారాచంబు లవివేకియందుఁ బ్రయుక్తంబు లయిన సుభాషితంబులుంబోలె వీనియందు నిష్ఫలంబు లగు చున్నయవి. 313

ఆ. ఎఱుఁగ నన్ను నుఱక యేసినశరములు, నెఱఁకు లాడి నాకు నిశితదివ్య
విశిఖతతులయట్లు వేదన గావించు, టిది యపూర్వ మితఁ డెవ్వఁడొక్కొ.

వ. ఇప్పర్వతంబు దైవనివాసంబు గావున నితండు కిరాతరూపప్రచ్ఛన్నుం డైనయెయ్యేనియొక్క దివ్యపురుషుండు గావలయు నని యశనికల్పంబు లయినదివ్యశరంబు లయ్యెఱుకపయి నేసి యర్జునుం డక్షయబాణంబు లైనతూణీరములయం దమ్ములు గానక ఖాండవదహనంబునాఁ డగ్నిదేవుండు నాకిచ్చినయక్షయశరధు లిప్పుడు యుగాంతకాలరిక్తంబు లైనశరధులుంబోలె నున్నయవి యిది యేమి యద్భుతంబో యనుచు నలిగి గాండీవం బెత్తికొని యెఱుకపయిం బఱచి. 315

క. అపహృతగాండీవుఁడు నై, యపరిమితక్రోధహృదయుఁ డర్జునుఁడు పరం
తపుఁ డెఱుకమస్తకంబునఁ, గృపాణపాతంబుఁ జేసెఁ గిట్టి కడంకన్. 316

క. అదియు వృథ యైనఁ బార్థుఁడు, వదలక వృక్షముల రాల వైచెను రణదు
ర్మదు వనచరు నవి యెల్లం, దదంగముల నడఁగె నద్భుతంబుగ నంతన్. 317

వ. (దానం గోపించి). 318

క. హరుఁ బెనఁగి పట్టుకొని భీ, కరబలుఁ డర్జునుఁడు ముష్టిఘాతంబుల సం
గర మొనరించెను వనచర, వరు లాతనిశౌర్యగౌరవముఁ బొగడి రెదన్. 319

క. తనదివ్యగాత్రమున న, ర్జునగాత్రనిపీడఁ జేసె శూలధరుం డం
తన మూర్ఛవోయి పీడిత, తనుఁ డై పార్థుండు ధరణితలమునఁ బడియెన్. 320

వ. అంత. 321

చ. వరదుఁడు పార్థశౌర్యవిభవంబున కాతనిధైర్యవృత్తికి "కిన్నరుడుగ"
ప్డరుదుగ మెచ్చి సన్నిహితుఁ డయ్యె జటామకుటేందురేఖయుం
గరమున శూలముం గరళకాలగళంబు బృహద్గజాజినాం
బరముఁ దృతీయలోచనముఁ బన్నగహారము నొప్పు చుండఁగన్. 322

వ. ఇట్లు విరూపాక్షుండు నిజరూపంబుతో నర్జునునకు సన్నిహితుం డై క్షత్రియులా రెవ్వరు నీయట్టిశౌర్యధైర్యవంతులు లేరు నీతపఃక్షాత్రగుణంబులకు మెచ్చితి నీకోర్కి సఫలంబు సేసెద సదేవాసురమానుషం బైనజగం బంతయు నీవ జయింతు నాస్వరూపంబు సూడు మని దివ్యదృష్టి యిచ్చినం జూచి పార్థుండు కృతార్థుం డయి (పులకితుం డగుచు సర్వాంగాలింగితోర్వీతలం బగు) దండప్రణామంబు సేసి. 323

క. వరదు సురాసురవందితుఁ, గరుణాకరు హరుఁ బినాకకరుఁ గరిచర్మాం
బరు నీశ్వరు గిరిజాసుం, దరు నిట్లని ప్రస్తుతించె దద్దయు భక్తిన్. 324

అర్జునుఁడు పరమేశ్వరుని స్తోత్రము సేయుట.

దండకము. శ్రీకంఠ లోకేశ లోకోద్భవస్థానసంహారకారీ పురారీ మురారిప్రియా చంద్రధారీ మహేంద్రాదిబృందారకానందసందోహసంధాయి పుణ్యస్వరూపా విరూపాక్ష దక్షాధ్వరధ్వంసకా దేవ నీ దైనతత్త్వంబు భేదించి బుద్ధిం బ్రధానంబు గర్వంబు విజ్ఞాన మధ్యాత్మయోగంబు సర్వక్రియాకారణం బంచు నానాప్రకారంబులన్ బుద్ధిమంతుల్ విచారించుచున్ నిన్ను భావింతు రీశాన సర్వేశ్వరా శర్వ సర్వజ్ఞ సర్వాత్మకా నిర్వికల్పప్రభావా భవానీపతీ నీవు లోకత్రయావర్తనంబున్ మహీవాయుఖాత్మాగ్నిసోమార్కతోయంబులం జేసి కావించి సంసారచక్రక్రియాయంత్రవాహుండవై తాదిదేవా మహాదేవ నిత్యంబు నత్యంతయోగస్థితిన్ నిర్మలజ్ఞానదీపప్రభాజాలవిధ్వస్తనిస్సారసంసారమాయాంధకారుల్ జితక్రోధరాగాదిదోషుల్ యతాత్ముల్ యతీంద్రుల్ భవత్పాదపంకేరుహధ్యానడిండీరధారానుభూతిన్ సదాతృప్తులై నిత్యులై రవ్యయా భవ్య సేవ్యా భవా భర్గ భట్టారకా భార్గవాగస్త్యకుత్సాదినానామునిస్తోత్రదత్తావధానా లలాటేక్షణోగ్రాగ్నిభస్మీకృతానంగ భస్మానులిప్తాంగ గంగాధరా నీప్రసాదంబునన్ సర్వగీర్వాణగంధర్వులున్ సిద్ధసాధ్యోరగేంద్రాసురేంద్రాదులున్ శాశ్వతైశ్వర్యసంప్రాప్తులై రీశ్వరా విశ్వకర్తా సురాభ్యర్చితా నాకు నభ్యర్థితంబుల్ ప్రసాదింపు కారుణ్యమూర్తీ త్రిలోకైకనాథా నమస్తే నమస్తే నమః. 325

వ. అని యిట్లు స్తుతియించి కృతాంజలియై కిరీటి వెండియు నిట్లనియె. 326

క. ఎఱు కని యెఱుఁగక నిన్నున్, మఱుకువ నెదిరితిని దీని మఱవుము నన్నుం
గఱకంఠా క్షమియింపుము, నెఱి నెవ్వరి కెఱుఁగ నగునె నీచరితంబుల్. 327

వ. అనినయప్పార్థుం గరుణారసప్రీతివిస్తారితవిలోకనామృతమ్మున సంతర్పితుం జేసి నగుచు నీశ్వరుండు వానిచేయి వట్టుకొని ధనంజయా నీచేసినవ్యతిక్రమంబు క్షమియించితి నతిమానుషం బైననీపరాక్రమంబునకు మెచ్చితిఁ బూర్వజన్మంబున నీవు నరుం డనుదేవర్షివి నారాయణసఖుండవు నరనారాయణు లనంగా మీ రిద్దఱు బదరీవనంబున ననేకాయుతవర్షమ్ములు తపమ్ముఁ జేసినమహావీర్యవంతులరు మీతేజమ్మున జగమ్ములు రక్షితమ్ము లగుచున్నయవి యిగ్గాండీవమ్ము దొల్లియు నీయదియ దీనన చేసి శక్రాభిషేకమ్మునాఁ డసురుల జయించి తది యిప్పు డక్షయశరధులతోడ మదీయమాయాగ్రస్తం బయ్యె నీగాండీవమ్మును నక్షయశరధులు నీ కిచ్చితిం గొను మింక నీ కిష్టం బైనవరమ్ము వేఁడు మిచ్చెద ననిన నర్జునుం డి ట్లనియె. 328

క. త్ర్యంబక నాకు నభీష్టవరంబుఁ బ్రసాదించెదేని రౌద్రము దివ్యా
స్త్రం బనఁ బరఁగినపాశుపతంబుఁ బ్రసాదింపు మిందుధర దయతోడన్. 329

వ. అదియును బ్రహ్మశిరం బనున స్త్రంబును యుగాంత్యకాలంబునందుఁ బ్రయుక్తమ్ములై జగత్సంహారమ్ము సేయు వానివలన నభిమంత్రితమ్ములై యనేకశతసహస్ర

సంఖ్యలశూలంబులు గదలు నాశీవిషంబులయట్టియమ్ములు నుద్భవిల్లు నని విందు
నీకారుణ్యమ్మున దీనిం బడసి దైత్యదానవయక్షరాక్షసపిశాచోరగమ్ముల నతివీరు
లైనభీష్మద్రోణాదులను జయింతు సహజకవచకుండలుం డైనకర్ణుని వధియింతు
ననిన నీశ్వరుండునుం గరుణించి విశుద్ధాత్ముం డైనపార్థునకు మంత్రధ్యానజపహో
మపూర్వకంబుగా సంధానమోక్షణసంహారసహితంబుగాఁ బాశుపతాస్త్రం బిచ్చి
దీనికి నసాధ్యం బెద్దియును లే దల్పులయందుఁ బ్రయుక్తం బైన జగత్సంహారము
సేయు. 330

క. దీనివిధానం బెఱుఁగం, గా నింద్రకుబేరవరుణకాలాదులకుం
దా నతిగహనం బనినను, మానవులకు నెఱుఁగు టఘటమానము గాదే. 331

వ. ఈదివ్యబాణమ్మున నీ వఖిలలోకమ్ములు జయింతు వని కౌంతేయునకు వరం బిచ్చి
పురాంతకుం డంతర్హితుం డయ్యె నంత. 332

చ. అవిరళసూర్యమండలసహస్రసమప్రభ మై ధనంజయ
ప్రవరుకరమ్మునన్ వెలుఁగుపాశుపతాస్త్రముఁ జూచి దైత్యదా
నవసురయక్షరాక్షసగణమ్ము గరమ్ము భయమ్ముఁ బొందె నం
దవనియు దిర్దిరం దిరిగె నబ్ధిశిలోచ్చయసంచయంబుతోన్. 333

క. త్రిణయనగాత్రస్పర్శం, బున నిజగాత్రము పవిత్రమును ముక్తాఘం
బును నతితేజోవీర్యం, బును నైనఁ బృథాసుతుండు ముదితుం డగుచున్. 334

క. మంటి హరుదేహ మంటం, గంటి నుమాధీశు [1]నమరకంటకహను ము
క్కంటిఁ గఱకంఠుఁ జూడం, గంటిఁ గృతార్థుండ నైతిఁ గడుఁ బుణ్యమునన్. 335

క. ఇమ్ముల ధర్మజునకు జన, సమ్మతునకు రిపుజయంబు సకలమహీరా
జ్యమ్ము సమకూరె నేఁడు ఘ, నమ్ముగ సర్వప్రయోజనమ్ములతోడన్. 336

ఇంద్రుఁడు దేవగణంబులతో నర్జునునకుఁ బ్రత్యక్షం బగుట.

వ. అని సంతుష్టహృదయుం డై యున్నంత. 337

సీ. హరుచేత సంప్రాప్తవరుఁ డయ్యె నరుఁ డని, యెఱిఁగి యింద్రుండు ధనేశధర్మ
[2]వరుణేశ్వరులతోడ సురగణసహితుఁ డై, దివ్యవిమానముల్ దివమునందు
వెలుఁగంగఁ గౌరవకులవీరుపాలికి, వరదుఁ డై కరుణతో వచ్చె నట్టి
యవసరమ్మున ఘనరవగభీరం బైన, మధురవాక్యమున ధర్మప్రభుండు

ఆ. ప్రీతి నిట్టు లనియెఁ బీభత్సునకు ధర్మ, నిత్య! పాండుపుత్త్ర నీకు మెచ్చి
వరము లిచ్చువేడ్క వచ్చిరి నెయ్యు రై, యమరనాథుఁ దొట్టి యమరు లెల్ల.

వ. వీరలం జూడు మని దివ్యదృష్టి యిచ్చి నీవు నరుం డనుపూర్వఋషివి బ్రహ్మ
నియోగంబున మనుష్యుండ వై యుత్తమక్షత్త్రియకులంబున నుద్భవిల్లితి మఱి
సూర్యాంశజుం డైనకర్ణుని దేవదైత్యదానవగంధర్వయక్షరాక్షసాంశజు లైన

1. అ. నసురకంటకు హరు. 2. వరుణాశ్వినులతోడ.

రాజులను వధియింతు నీ కక్షయకీర్తి యగు నని దండధరుం డప్రతివారణం బైన
దండంబు విధియుక్తంబుగా నిచ్చిన. 339

క. ఘోరారివారణము లగు, వారుణపాశంబు లిచ్చెఁ గ వరుణుఁడు మఱి కౌ
బేరాస్త్రము నర్థి నిచ్చెఁ గు, బేరుఁడు విజయునకు నహితభేదికిఁ బ్రీతిన్. 340

వ. ఇట్లు దివ్యపురుషుం డైనపార్థుండు లబ్ధదివ్యదృష్టి యై యమూర్త్యరూపధరు లైన
పితృదేవతలతోడం దనముందట నిలిచినమహానీలవర్ణుం డైనవైవస్వతుని వైడూర్య
వర్ణుం డై యర్ణవనదీశైలసేవితుం డైనవరుణేశ్వరుం జాంబూనదవర్ణుం డై యక్ష
గణంబుతో నున్నకుబేరునిం జూచి వారివలన దివ్యాస్త్రంబులు వడసి వాక్పుష్ప
ఫలజలంబుల నందఱం దృప్తులం జేసి వెండియు. 341

ఆ. అమరగణసమేతు నైరావతారూఢు, వజ్రధరుఁ ద్రిలోకవంద్యు నింద్రు
వృత్రశత్రు నమరవిభుఁ జూచి యెద నాది, మునివరుండు నరుఁడు ముదమునొందె.

ఉ. ఇందుధరప్రసాదమున నిష్టవరంబులు గాంచి బాంధవా
నందవిధాయి యైననిజనందను మర్దితశత్రు, సద్గుణా
నందితుఁ జూచి యొప్పు నయనంబులు వేయును గన్నతత్ఫలం
బందెఁ బురందరుండు పరమాద్భుతసమ్మదపూరితాత్ముఁ డై. 343

వ. ఇట్లు దేవేంద్రుండు ధనంజయుం జూచి సంతోషిల్లి నీవు పరమేశ్వరువలనఁ బరమ
సిద్ధితో దేవత్వంబు వడసితివి దేవకార్యంబు దీర్ప నర్హుండవు గాన నారథంబుఁ
బుత్తెంచెద నమరావతికి రమ్ము నీకు దివ్యాస్త్రంబు లంద యిచ్చెద నని దేవేంద్రుండు
దేవగణంబులతో నమరావతికి నరిగె నర్జునుండును దద్రథాగమనంబు ప్రతీక్షించు
చుండునంత. 344

సీ. వారిదమార్గంబునవలన మహానీల, వైజయంతీవిభవంబు వెలయ
నాబద్ధవివిధరత్నావళిప్రభఁ జేసి, రమ్య మై రోదోంతరంబు వెలుఁగ
నురునేమిరవమున నుర్వరాధరదరీ, ముఖములు ప్రతిశబ్దముఖరితంబు
లగు చుండ నానావిధాయుధంబులు దాల్చి, యశనివిద్యుత్సహస్రాభిశోభి

ఆ. తాభ్రసదృశ మై మహాజవాశ్వాయుత, వాహ్యమాన మైనవరరథంబు
మఘవునాజ్ఞఁ జేసి మాతలియుక్త మై, యింద్రతనయుఁ డున్నయెడకు వచ్చె.

వ. మాతలియు నర్జునుం జూచి సురాసురకిరీటతటఘటితరత్నప్రభాభాసురపదుం డైన
మహేంద్రుండు మీయయ్య భవద్దర్శనం బపేక్షించి నిన్ను నమరావతికి రాఁ
బనిచె రాజసూయాశ్వమేధశతంబులం జేసినవారి కైనను దుర్లభం బీరథంబు దీని
నెక్కు మనిన నర్జునుండును గంగాస్నానపవిత్రీకృతగాత్రుం డై దేవ ఋషి పితృ
తర్పణంబులఁ జేసి మాతలిప్రయుక్తం బైనయాదివ్యరథం బెక్కె. 346

అర్జునుఁ డమరావతికిఁ బోవుట.

చ. అలఘుతపస్సమాధినియమాత్ములకుం బహుపుణ్యలోకకాం

షులకు విశుద్ధమానసులకుఁ సతతంబును సంశ్రయంబ నై
లలితనిలింపదంపతివిలాసవిహారమహోత్సవంబులుం
గలిగి వెలుంగురత్నమయకందరసుందర మందరాచలా. 347

వ. నీయందలిపుణ్యతీర్థంబులు సేవించుచు గంగాంబు[1]చ్యోతస్థలీరుహావనస్పతిఫలంబు లుపయోగించుచు సుఖం బుండితి నమరావతికిం బోయి వచ్చెద నని మందర నగంబు వీడ్కొని పురందరనందనుండు దేవపథంబున కరిగి. 348

సీ. పరమధర్మస్థితిఁ బ్రజఁ గాచి యేలిన, రాజర్షులకు నుగ్రరణమునందుఁ
బతుల ప్రస్తవమునఁ బ్రాణముల్ విడిచిన, వీరులకును యజ్ఞవిధులఁ జేసి
సురలను వసుమతీసురులను దనిపిన, ధర్మాత్ములకు మహాతాపసులకు
నిలయంబు లై రమణీయంబు లగురత్న, హర్మ్యవిమానసంహతులదాని
తే. సకలభువనంబులం గలసత్పురముల, కెల్ల నుపమాన మై దహనేందురవుల
దీప్తి లేకున్నఁ దన దైనదివ్యదీప్తి, విస్తరంబున నెప్పుడు వెలుఁగుదాని. 349

వ. మఱియు ననాహితాగ్నులకు నతీర్థసేవకులకు ననృతవాదులకు వేదవిరుద్ధాచారులకు మాంసాహారులకు రణపరాఙ్ముఖులకు [2]నవిషయం బైనదాని నమరావతిం జొచ్చి తద్గోపురసమీపంబున ననవరతవిగళదవిరళమదజలకుల్యాభిరామం బై నిరంతరనిర్ఝరనీహారనగంబునుంబోలె నొప్పుచున్న యైరావతంబుఁ జూచుచు సురసిద్ధసాధ్యగణంబుతో గంధర్వకిన్నరగీయమానుం డగుచుఁ జనునప్పుడు. 350

క. [3]సకలర్తుకుసుమసౌరభ, సుకుమారోద్యానతరుల సుడియుచుఁ బ్రణయో
త్సుకుఁ డై పవనుఁడు పాండవు, నకు నభిముఖుఁ డయ్యెఁ దన్మనఃప్రియ మెసఁగన్.

క. నరుఁ డై నయాదిముని యని, హరిసుతుఁ డని హరిసహాయుఁ డని హరుచేతన్
వరములు వడసినవాఁ డని, సుర లెల్లను వచ్చి పార్థుఁ జూచిరి ప్రీతిన్. 352

వ. అర్జునుండు నయ్యమరావతీవిభవంబు సూచి హర్షించుచు నప్సరోగీయమానమంగళగీతమహితమానసుం డగుచు సిద్ధమునిగణాశీర్వాదంబులు సేకొనుచుం జని మాతలినిర్దేశంబున దివ్యరథావతీర్ణుం డై. 353

క. శతమఖునకు భువనావన,రతశీలున కఖిలదేవరాజర్షి సమ
న్వితునకు వజ్రాభీలో, న్నతపృథుభుజునకుఁ గృతప్రణాముం డయ్యెన్. 354

చ. అనిమిషనాథుఁడుం బ్రచలితాంగదతుంగభుజాయుగంబునం
దనయునిఁ గౌఁగిలించుకొని తత్క్షణజాతనితాంతసమ్మదం
బునఁ బులకాంకితాంగుఁ డయి మున్ను నిజాంకతలస్థుఁ జేసి య
త్యనఘు నిజాసనార్ధమున నాతని నుంచెఁ గరంబు నెమ్మితోన్. 355

క. లీలైరావతకుంభా, స్ఫాలనకర్కశకరములఁ బలుమరును మరు
త్పాలకుఁ డంటుచు నుండె గు, ణాలంకృతుఁ డైనపార్థునంగముఁ బ్రీతిన్. 356

1. గ. ధాతస్థలరుహా. 2. జ. నతిగహనం. 3. గ. జ. సకలర్తుసురభికుసుమిత.

వ. ఇట్లధికవిలాసంబుతో సురవిలాసినీకరకలితచారుచామీకరదండచామరసమీరా లోలకుంతలుం డగుచు సురరాజుతో నేకాసనంబున నున్నయప్పార్థుం బాకశాసను శాసనంబున దేవగంధర్వసిద్ధవిద్యాధరు లతిప్రీతి [1]నర్చించి రంత. 356

తే. [2](పాకశాసనుపనుపునఁ బార్థుఁ డొక్క, మణిమయం బైనమహనీయమందిరమున
నెలమి గంధర్వసంగీతహృద్యగోష్ఠి, నుండెఁ జెవులకు నుత్సవం బొందుచుండ.

వ. అంత సూర్యాస్తమయసమయంబునఁ జంద్రుం డుదయించి సాంద్రచంద్రికా విలాసంబున దిగ్వనితల నలంకరించుచుండ నిలింపపతిపంపున సొంపార నూర్వశి యర్జునసంగమకాంక్షం జేసి చంద్రికాధవళదుకూలంబు గట్టి మృగమదకర్పూర కుంకుమోన్మిశ్రితసుగంధం బలఁది వివిధసురభికుసుమవిసరంబులు ముడిచి మణి మయభూషణాలంకృత యై నిలుకడ వడసిన క్రొమ్మెఱుంగుఁదీఁగయుం బోలె మణి మయమంజీరఝుళంఝుళనినాదంబును గంకణఝుణఝుణత్కారంబును గటికలా పకింకిణీక్రేంకారంబును మదనాజ్ఞావాద్యఘోషంబునుం బోలె మ్రోయుచుండ మందగమనంబునఁ బురందరనందనుమందిరంబున కరుగుదెంచిన నప్పురుషసత్త ముండు భయభక్తిసంభ్రమంబులతోఁ బ్రత్యుత్థానంబును దండప్రణామంబునుం జేసి కరకమలంబులు మొగిచి యిట్లనియె. 358

క. ననుఁ బుత్త్రస్నేహంబున, మనమున మన్నించి శుభసమగ్రునిఁ జేయం
జనుదెంచితివి ముదమ్మున, జనయిత్రీ యేఁ గృతార్థజన్ముఁడ నైతిన్. 359

తే. అనిన నూర్వశి యిట్లను నాత్మనేత్ర, మధుపము లతనిసౌందర్యమధువు గ్రోలు
చుండఁ దమకంబుమీఱియనూనధర్మ, నిపుణుఁడగునర్జునునితోడ నెయ్యమొనర. 360

చ. అనుపమశౌర్య నీదుసముదగ్రగుణంబులు నారదాదిస
న్మునివరు లెల్లఁ జెప్పఁగఁ బ్రమోదమునన్ భవదీయసంగమం
బనిశముఁ గోరుచుం దగఁ బ్రియంబున వచ్చితి నేను గోరఁగా
నను జనయిత్రి యంచు నెకసాయముఁ బల్కెదు వక్రభాషలన్. 361

తే. నీకు నేనాఁటితల్లి నిజము సెపుమ, యమరలోకంబు వేశ్యల మైనమాకు
నిట్టితగవులు నడవ మహీనబాహు, వీర్య యిచ్చట వావియు వెదకఁజనునె. 362

వ. ఈలోకంబున వనితలుఁ బురుషులు విచ్చలవిడిఁ గ్రీడింతు రిచ్చటి కిది యనిం దితం బైనయాచారంబు నీవును ద్రిదివంబునకు వచ్చినయప్పుడ దివ్యపురుషుం డవు గావున నామనోరథంబు సఫలంబుగా మందారమంజరీమంజులమకరందపాన మత్తమధుకరగానమనోహరస్థలంబులను మేరుశైలకందరంబులను మందపవనం బులు గలనందనాదివనంబులయందును నితాంతకాంతవికసితకనకారవిందసమధిక

1. నగ్గించి. 2. ఈ కుండలీకరణములోని గ్రంథ మెల్ల ననఁగా 357-వ పద్యము మొదలుకొని 368-వ గద్యమువఱకుఁ గలయధికపాఠ మెల్లఁ, బ్రాఁతవ్రాఁత ప్రతుల నన్నిటఁ గానిపింపదు. కాన యిది ప్రక్షిప్తము గానోపు.

సౌరభసంవాసితమహానందకందంబు లైనమందాకినీతీరమణిమయవేదికలయందును జంద్రికాసుందరంబు లైనసికతాతలంబులను మఱియు నిర్జరవిహారస్థానంబుల ననవరతసురతకేళీసౌఖ్యాంబుధి నోలలార్చు మనిన నిర్వికారధైర్యధుర్యుం డై యర్జునుం డి ట్లనియె. 363

క. ఓహో యిమ్మెయి ధర్మ,ద్రోహోక్తులు వలుకఁ దగునె దోసం బది గా
దే హరి హరి మనమునఁ దగ, నూహింపక నన్నుఁ బలుకు టుచితమె నీకున్. 364

ఊర్వశి యర్జును నపుంసకునిఁగా శపించుట.

వ. [జగంబులు పుట్టింపను మనుపను సమయింపను గర్త లైనదేవతలకు నెట్లు నడచిన నెగ్గు లేదు నేను గర్మభూమిని జనియించి కర్మఠుండ నైతి నాకు నిచ్చటి యాచారం బుచితంబు గాదు మదీయవంశకర్త యైనపురూరవునకుఁ బత్ని వైన కారణంబునను బురందరునకుఁ బరిచర్య యొనర్చుటను నాకు జనని వగుట సందియంబు లేదు తల్లీ నన్నుం బుత్రవాత్సల్యంబునం జూడు మనిన మదనబాణపీడిత యై కోపారుణితనయనంబుల నర్జునుం జూచి యూర్వశి యేను గామించి వచ్చిన నామనోరథంబు విఫలంబుఁ జేసినవాఁడవు నీవు మర్త్యలోకంబున మానవర్జితుండ వై మానినీమధ్యంబున నపుంసకుండ వై యుండు మని శాపం బిచ్చి నిజగృహంబునకుఁ జనియె] నంతఁ బ్రభాతసమయంబునఁ దద్వృత్తాంతం బంతయు విని సురపతి కొడుకున కి ట్లనియె. 365

క. నీయట్టిధైర్యవంతుని, నేయుగముల నైనఁ గాన మెన్నండును ధ
ర్మాయత్తమతివి మునులకు, నీయింద్రియజయము గీర్తనీయము తండ్రీ. 366

తే. అనఘ యూర్వశి యిచ్చినయట్టిశాప, మనుభవింపంగవలయు నీ కవనియందు
నింక మీఁదుమూఁడవయేఁడు సత్య,సరణి నజ్ఞాతవాసంబు సలుప వలయు. 367

వ. అక్కాలంబున నీవు షండరూపంబునఁ బ్రచ్ఛన్నుండ వై రాజకన్యకలకు నృత్యంబు గఱపుచుండి తదంత్యంబున శాపమోక్షంబు వడయు మని యనుగ్రహించె నీయాఖ్యానంబు విన్నపుణ్యపురుషులు సకలదురితవిముక్తు లగుదు రని చెప్పి వైశంపాయనుండు జనమేజయున కి ట్లనియె.) 368

సీ. వజ్రాస్త్ర మాదిగా [1]వరదుఁ డై వివిధది,వ్యాస్త్రముల్ పార్థున కమర నిచ్చి
తత్ప్రయోగంబులుఁ దద్రహస్యంబులుఁ, దన్నివర్తనములుఁ దడయ కపుడు
దయ నుపదేశించి దారుణాహవములం, దవిజేయవీర్యుండ వగుము పేర్మి
నని మహాసౌహార్దుఁ డై చిత్రసేనుఁ డ,న్గంధర్వపతితోడ గారవమున

ఆ. వజ్రధరుఁడు గీతవాద్యనృత్యంబులు, గఱవఁ బంచెఁ బార్థుఁ గడఁగి యిట్టు
లమరనాథునొద్ద నర్జునుం డుండ నే, నేఁడు లరిగె నిట మహీతలమున. 369

వ. అంత నొక్కనాఁడు రోమశుం డనుమహాముని యింద్రునొద్దకు వచ్చి సురగణ

1. గ. వరదుండు దివ్యాస్త్ర, ములు పార్థునకు వేడ్క మొనయ నిచ్చి.

పూజితుం డై సురేంద్రుతో నేకాసనంబున నున్నయర్జునుం జూచి యాశ్చర్యం
బంది యింద్రున కి ట్లనియె. 370

క. కోరి యనేకయుగంబు ల, పారతపోయుక్తు లైనవారికిఁ బడయఁగ
దూరము నీసభ మఱి నీ, కారుణ్యం బింతకంటెఁ గడుదవ్వెందున్. 371

వ. అట్టియందు నీతో నొక్కట నేకాసనం బెక్కి నీరెండవమూర్తియుంబోలె నున్న యిమ్మనుజుం డెందులవాఁ డెవ్వఁ డనిన నమ్మునీంద్రునకు దేవేంద్రుం డి ట్లనియె.

క. నరుఁ డనుమహర్షి యీతఁడు, నరలోకమునందుఁ బుట్టె నాయంశమునన్
[1]గురుమతిఁ గౌంతేయుఁడు భా,సురతేజుఁ డుపేంద్రసఖుఁడు సువ్వె మునీంద్రా.

తరలము. శివుఁడు వీనికిఁ బ్రీతుఁ డై దయ సేసెఁ బాశుపతాస్త్రమీ
దివిజముఖ్యులతోడ నేనును దివ్యబాణము లిచ్చితిం
దివిరి యీతఁడు మత్ప్రియంబున దేవకార్యము దీర్పఁగా
సవినయస్థితి నున్నవాఁడు నిజప్రతాపబలోన్నతిన్. 374

వ. మఱియు వసుమతీఖ్యాతగర్వితు లైనసగరసుతులం దనదృష్టిదీవ దహనంబునం జేసి దహించినకపిలుం డనుమహాముని నారాయణుం డయ్యె నట్టినరనారాయణులు జగదుపకారులు జగతీభారావతరణ[2]కారణు లై దైత్యదానవవధార్థంబు మర్త్యంబునం బుట్టినవారు గావున. 375

క. దేవతలకు నపకారము, గావించినయన్నివాతకవచులఁ బాతా
ళావాసుల దానవుల మ,హావీరుఁడు వీఁ డభేద్యుఁ డై వధియించున్. 376

వ. అని తత్ప్రభావంబు సెప్పి యింద్రుండు రోమశున కి ట్లనియె మునీంద్రా నీవు మర్త్యలోకంబునకుం బోయి ధర్మజుం గని యతనికిం దత్సహోదరులకు సంతోషంబుగా నాయొద్దం బార్థుం డున్నకుశలవార్త యెఱింగించి భీష్మద్రోణకర్ణాది వీరుల నోర్చునట్టిదివ్యాస్త్రంబులు వడసె నతండు మాయొద్దకు వేగంబ వచ్చు వగవకుండుం డని చెప్పి నావచనంబున ధర్మజు నఖిలతీర్థసేవ సేయం బంపు మ ట్లయిన నపేతదురితుం డై యఖిలమహీరాజ్యంబు వడయు నతండు తీర్థాభిగమనంబు సేయునపుడు నీ వాతనికి సహాయుండవు గ మ్మని యింద్రుండు రోమశుం బనిచె నిట ధృతరాష్ట్రుం డర్జునదివ్యాస్త్రలాభంబుఁ బారాశర్యువలన నెఱింగి పరమవ్యాకులహృదయుం డై సంజయున కి ట్లనియె. 377

సీ. సురసమూహంబుతో సురరాజు నోడించి, ఖాండవం బెక్కటి కాల్చి యున్న
వీరున కఖిలాబ్ధివృతవసుంధరఁ గల, రాజుల నోర్చి పరాక్రమమున
నగ్రజు రాజసూయాధ్వర మునిచిన, యధికసమర్థున కర్జునునకుఁ
[3]బ్రబలసింహమునకుఁ బక్కెర వెట్టిన, యట్లు దేవతలు నెయ్యంబుతోడఁ
ఆ. బరముఁ దొట్టి పాశుపత మాదిగా దివ్య, శరము లిచ్చి రట్టి శౌర్య మెసఁగ

1. క. గురుపతి. 2. జ. కారణావతారు లై. 3. గ. బార్థసింహమునకు.

నట్టినరుఁడు యోధుఁ డై [1]యున్న పాండవ, వరులఁ జెనయునంతవారుఁ గలరె.

క. వారికి ధర్మువు దప్పని, వారికి ఋతవచను లైనవారికి విమలా
చారుల కెద్దియుఁ బడయఁగ, దూర మె పాండవులఁ బోలుదు రె వీరు లొరుల్.

వ. వారలతో విగ్రహించి దుర్యోధనుండు దనకుఁ దనబాంధవులకు సుహృజ్జనంబులకు హాని సేసికొనియె. 380

ఆ. పర్వతములు వజ్ర[2]పాతాహతిని బోక, తక్కునేని నింద్రతనయుదివ్య
నిశితబాణతతుల నిశ్శేష మగు [3]ననఁ, బరులసైన్య మెట్లు బ్రదుక నేర్చు. 381

వ. లయకాలోదితసహస్రకరుకిరణంబులం జరాచరంబులు దప్తంబు లగునట్లు పార్థుబాణంబులం జేసి దుర్యోధనాదులు దుస్సహతాపంబుఁ బొందుదు రని దుఃఖితుం డై నధృతరాష్ట్రునకు సంజయుం డి ట్లనియె. 382

క. ఈసున దుర్యోధనదు,శ్శాసను లాపాండవులకు సభలో నెగ్గుల్
సేసిన విని వారల నను,శాసింపఁగ వలవ దనఁగఁ జనదే నీకున్. 383

వ. నీయుపేక్షం జేసి దుర్యోధనదుర్ద్యూతపరాజితు లై రాజ్యంబు విడిచి పాండవు లరిగి కామ్యకవనంబున నున్నఁ గృష్ణుం డనేకరాజసమన్వితుం డై వారియొద్దకు వచ్చి నీకొడుకులు సేసిననికారంబునకుం గృష్ణాపరిభవంబునకు దుఃఖితుం డై కడు నలిగి మీకు నిట్లు సేసినదుర్యోధనాదుల దూషించి గజపురంబున ధర్మరాజు రాజ్యాభిషిక్తుం జేయుదు ననియు రాజసూయంబు సేయునాఁ డింద్రప్రస్థంబున నైనవిభూతికంటె విశేషవిభూతి గావింతు ననియు ద్రుపద సృంజయ కేకయ ధృష్టద్యుమ్న బలదేవ సాంబ సాత్యకిప్రభృతులసమక్షంబునం బలికి సత్యసమయు లైనపాండవులచేత సంరంభనివారితుం డై పార్థుసారథ్యంబునకుఁ బ్రార్థితుం డయ్యె నని వింటిమి.

క. పదుమూఁడేండ్లుం బోయినఁ, బదునా ల్గగు నేఁడు ఘనులు పాండవులు జగ
ద్విదితముగ నుత్సహింతురు, వదలక రణమునకుఁ గేశవపురస్కృతు లై. 385

క. వరములు వేల్పులచే దు, ష్కరతపమునఁ బడయుదురు జగంబున నొరు లీ
శ్వరుచే వరములు వడసెం, గరుణ ధనంజయుఁడు దనదుకార్ముకశక్తిన్. 386

వ. అయ్యర్జునుదివ్యశరసంఘాతంబును భీమసేనుచిత్రగదాఘాతంబును నీయుపేక్షానిర్ఘాతంబును గౌరవపరిక్షయంబునకుఁ గారణభూతంబు లనిన సంజయునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 387

క. వృద్ధని జాత్యంధుం డని, బుద్ధివిహీనుఁ డని నన్నుఁ బుత్త్రుఁడు బలద
ర్పోద్ధతుఁ డై మెచ్చఁ డసం, బద్ధంబు లె కాని వినఁడు పలికినపలుకుల్. 388

వ. దుర్యోధనుండు దుర్బుద్ధి యని యేమి సెప్పవలయు భీష్మద్రోణవిదురాదుల నాదరింపక కర్ణశకునుల నాప్తులం జేసికొని వారివచనంబుల నెగడు నే నేమి సేయుదు నని ధృతరాష్ట్రుండు మిన్నకుండె నిట పాండవులు పార్థు మసలుటకు దుఃఖితు లై.

---

1. క. యుండఁగాం... జెనయునట్టి. 2. ఖ. పాతహతిఁ బడక. 3. గ. (గాక•పరు... బ్రతుకుఁబోర.

ఉ. పాండవసింహ మర్జునుఁడు పాండుయశంబు వెలుంగు చుండ నా
ఖండలుఁ దొట్టి నిర్జరనికాయముచేత వరంబు గాంచి యె
న్నం డిట వచ్చునొక్కొ సుజనస్తుతు నాతనిఁ బ్రీతిఁ జూడ నె
న్నండొకొ కాంతు మంచును మనంబునఁ గోరుచు నుండి రెంతయున్. 390

వ. అట్టియవసరంబున యుధిష్ఠిరునకు భీముం డి ట్లనియె. 391

మధ్యాక్కర. నీనిదేశంబున నరిగి పార్థుండు నిష్ఠోఁ దపము
మానుగాఁ జేయుచు నున్నవాఁ డేల మసలెనో రాక
వాని ధర్మస్థితుఁ బాసి యున్నయివ్వర్షముల్ యుగస
మానంబు లైనవి మనకు నతనిసమాగమకాంక్ష. 392

వ. మఱి పాండవపాంచాలయాదవవీరులజీవనంబు లాతనియంద నిలిచినవి తదీయభుజాశ్రయబలంబునం బరుల జయించి ధరణీరాజ్యంబుఁ బరిగ్రహింత మని యున్నవారము గావునం గాలయాపనంబు సేయక యర్జునుం దోడ్కొని తేర జనార్దను రాఁ బనిచి నియోగింపుము. 393

మ. సమయాబ్దంబులకంటె ముందర మహోత్సాహంబునన్ బాహువి
క్రమ మొప్పన్ విజయుండు నేను నయి సంగ్రామంబులో నేకకా
లమునం దాధృతరాష్ట్రజాధముల నెల్లం జంపి భూచక్రరా
జ్యము సేకొందుము కౌరవేంద్ర మురజి[1]త్సఖ్యప్రసాదంబునన్. 394

వ. సత్యభంగభీతుండవు గావున నీ వింద యుండి పదుమూఁడేండ్లుం జలిపి పదంపడి కరిపురంబునకు వచ్చి రాజ్యాభిషిక్తుండ వగుము దుష్టద్యూతంబున మనరాజ్యం బపహరించినసుయోధనుండు సుచిరప్రతిష్ఠితుండు గాకుండ నిప్పుడ యద్దురాత్ము దూపింతుము నికృతిపరుల నికృతినచేసి నిర్జించినఁ బాపంబు లేదు సర్వప్రకారంబులను శత్రువుల జయించి రాజ్యంబు సేకొనుట రాజులకు విధిచోదితం బైనరాజధర్మంబ యనిన భీమసేనుమహారంభసంరంభంబునకు సంతోషించి ధర్మనందనుం డాతనిం దనపైకిం దిగిచికొని మూర్ధాఘ్రాణంబు సేసి యి ట్లనియె. 395

తే. అనలునకు గాడ్పు దోడైనయట్టు లింద్ర,తనయునకు నీవు దోడైన సోదరయ కాజిఁ
ఘోరరిపులకు బ్రదుకంగఁ బోల దైన, నరయ నిది కోపమునకు నవసరంబు. 396

క. పదుమూఁడేండ్లుం బోయినఁ, బదపడి పార్థుండు నీవుఁ బరనృపతుల దు
ర్మదుల వధియించి విజయా, స్పదబాహుల రగుఁడు ధర్మపరిరక్షకు లై. 397

వ. ఏ నెట్లును సత్యభంగంబు సేయుట కొడంబడ నోప నని ధర్మతనయుం డనుజు ననూనయించె నని జనమేజయునకు వైశంపాయనకథితం బైనపుణ్యకథ యతిరమణీయంబుగాను. 398

క. బిరుదాంకభీమ భీమే, శ్వరకృతనిత్యప్రసాద సౌజన్యగుణా

1. అ. త్సఖ్యాభియోగంబునన్.

భరణ పరగండభైరవ, పరనృపమణిమకుటఘటితపద విబుధనుతా. 399

ఉత్సాహము. రాజవంశరత్న రాజరాజ దేవ నిత్యల
క్ష్మీజయాభిరామ ధర్మమిత్ర మిత్రవిద్వదం
భోజవనపయోజమిత్ర భూరికీర్తికౌముదీ
రాజితత్రిలోక నిఖిలరాజలోకపూజితా. 400

గద్యము. ఇది సకలసుకవిజనవినుతనన్నయభట్టప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దారణ్యపర్వంబునందుఁ బాండవప్రవేశంబును, గిమ్మీరవధయును, కృష్ణపాంచాలాభిగమనంబును, సౌంభకాఖ్యానంబును, నింద్రకీలాభిగమనంబును, కైరాతంబును, నర్జునతపశ్చరణంబును, నీశ్వరుతోడ యుద్ధంబును, బరమేశ్వరుచేతఁ బాశుపతాస్త్రంబు వడయుటయును, లోకపాలసందర్శనంబును, స్వర్గగమనంబును, నూర్వశిశాపంబును, దేవతలవలన దివ్యాస్త్రలాభంబును, నన్నది ప్రథమాశ్వాసము. 401

శ్రీ

హరిహరహిరణ్యగర్భేభ్యో నమః.

శ్రీమదాంధ్రమహాభారతము

ఆరణ్యపర్వము, ద్వితీయాశ్వాసము.

రమ్య ధర్మనిత్య
ప్రారంభవిభాసి రాజపరమేశ్వర ఘో
రారిమదకుంభికుంభవి
దారణదారుణకృపాణదక్షిణహస్తా. 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నట్లు [1]శాంతవచనంబుల భీమసేనునకుం గోపాటోపోపశమనంబు సేయుచున్న ధర్మరాజునొద్దకు బృహదశ్వుం డనుమహాముని వచ్చి విధిదృష్టవిధానంబునం బూజితుం డయి విశ్రమించి యున్న యమ్మునివరునకు ధర్మతనయుం డధర్మపరు లయిన[2]పరులచేతం దమపడిననికారప్రకారం బంతయు నెఱింగించి యి ట్లనియె. 2

క. పుడమియు రాజ్యము బంధుల, విడిచి మృగావలులఁ గలిసి విపినంబులలోఁ
గడుకొని మా యట్లిడుమలఁ, బడిన[3]నరులు గలరె యొరులు పరమమునీంద్రా. 3

వ. అనిన నయ్యుధిష్ఠిరునకు బృహదశ్వుం డి ట్లనియె. 4

క. దేవసము లైనయనుజులఁ, తో విప్రులతో రథాలితో వచ్చి యర
ణ్యావాసము సేసెదు ధర, ణీవల్లభ నీవు ధర్మనిష్ఠితబుద్ధిన్. 5

క. నరనుతుఁడు దొల్లి నలుఁ డను, ధరణీశుఁడు జూద మాడి తనవిభవము పు
ష్కరుచేత నోటువడి యొక్కరుఁడుఁ గరం బిడుమఁ బడఁడె కాననభూమిన్. 6

ధర్మరాజునకు బృహదశ్వుఁడు నలోపాఖ్యానంబు సెప్పుట.

వ. అనిన నది యె ట్లని ధర్మనందనుం డడిగిన బృహదశ్వుం డి ట్లనియె నిషధేశ్వరుం డయినవీరసేనునికొడుకు నలుం డనువాఁ డనేకాక్షౌహిణీపతి యనవరతాక్షప్రియుం డజేయం బైనతనతేజంబున నెల్లరాజుల జయించి బ్రహ్మణ్యుం డయి బ్రహ్మోత్తరంబుగాఁ బ్రజాపాలనంబు సేయు చుండ. 7

1. క. సాంత్వనవచనంబుల. 2. జ. కౌరవులచేతం. 3. జ. నృపులు.

సీ. అట విదర్భాధిపుఁ డై నభీముం డను, వాఁ డనపత్యుఁ డై వ్రతము లోలిఁ
జలుపుచు దమనుఁ డనుమునిఁ బత్నియుఁ, దాను నుపాసించి తద్వరమున
దమయంతియనుకూఁతుఁ దమదాంతదమను ల,న్సుతులనుబడసె విశ్రుతగుణాఢ్యుఁ
డందుఁ గన్యారత్న మైనయాదమయంతి, యత్యంతకాంతిరూపాభిజాత్య

ఆ. విమలగుణసమృద్ధి వెలుఁగుచు సురసిద్ధ, సాధ్యకన్యలట్టిసఖులు నూర్వు
రొలసి తన్నుఁ గొలుచుచుండంగ మహి నొప్పు,చుండె నధికవిభవయుక్తిఁ జేసి. 8

వ. అంత. 9

క. నలుగుణములు దమయంతికి, నలునకు దమయంతిగుణగణంబులు జను లి
మ్ములఁ బొగడుట నిరువురకును, వెలసె మనోభవవికారవిభ్రమ మెదలన్. 10

వ. ఒక్కనాఁడు నలుఁడు దమయంతీగుణబద్ధచేతస్కుం డై మదనానలంబు [1]సహింప నోపక ప్రమదవనంబునఁ [2]గుమ్మరువాఁ డంతరిక్షకాంతాహారావళియుంబోలె హంసావళి యవనీతలంబున కవతరించిన. 11

ఆ. వీరసేనసుతుఁడు వీరుండు హంసల, నడ బెడంగుఁ జూచి నగుచు వాని
నెగచియెగచి యందునెగయకుండఁగ నొక్క,హంసఁ బట్టుకొనియె ననతిరయమున.

ఆ. దాని విడిచి పోనఁ గా నోప కఱచుచు, నంతరిక్షమునను హంస లెల్లఁ
బిండు గట్టి తిరుగుచుండె వాతోద్ధూత, శారదాభ్రశకలచయముఁ బోలె. 13

వ. అదియును దన కమ్మనుజేశ్వరుఁ డపాయంబు సేయుం గా వగచి మనుష్యవాక్యంబుల ని ట్లనియె నయ్యా యేను నీకుం బ్రియంబు సేసెద నీహృదయేశ్వరి యైన దమయంతిపాలికిం బోయి నీగుణంబులు దానికి వర్ణించి యక్కన్య యన్యుల నపేక్షింపక నియందు బద్ధానురాగ యగునట్లు గాఁ జేసెద. 14

క. అనిన విని హంసపలుకులు, దనహృదయంబునకు నమృతధారాపాతం
బునుబోలె నైన నృపనందనుఁ డనురక్తుఁ డయి విడిచెఁ దడయక దానిన్. 15

వ. హంసపిండుతో నదియును విదర్భాపురంబున కరిగి యం దుపవనంబున సఖీజనపరివృత యై యున్నదమయంతియంతికంబున వచ్చి విహరించుచుండె నంత వానిం జూచి పరమకౌతుకమ్మున. 16

తే. ఒండొరులఁ గడవంగ నయ్యువిద లెల్లఁ, బఱచి యొక్కొక్క [3]కలహంసఁ బట్టికొనఁగఁ
జెలువముగ నందు దమయంతిచేతఁ బట్టు,వడియె నలుచేతవిడువంగఁబడినహంస.

క. దమయంతికి నలునకు సం, గమకారణదూత యైనకలహంస మనో
జ్ఞమనుష్యవాక్యముల న,ద్దమయంతికి హర్ష మెసఁగఁ దా ని ట్లనియెన్. 18

వ. నీహృదయేశ్వరుం డైననలునొద్దనుండి వచ్చితి నపారపారావార[4]పర్యంతానంత మహీతలంబునందు నాచూడనిరాజు లెవ్వరు లేరు సర్వగుణసౌందర్యంబుల

1. గ. శమింప. 2. జ. నుండునంత నంతరిక్ష. 3. గ. హంసంబుఁ. 4. క. పర్యంతానంతసకల మహీతలంబునందు.

నెవ్వరు నలుం బోలరు. 19

తే. నీవు నలునకుఁ జేరి తద్దేవి వైనఁ, గాక నీసముజ్జ్వలరూపకాంతి విభవ
నిత్యసౌభాగ్య భాగ్యాభిజాత్య [1]భద్ర, లక్షణావలు లవి సఫలంబు లగునె. 20

వ. నీవు నారీరత్నంబ వాతండు పురుషరత్నంబు గావున మీయిద్దఱసమాగమం
[2]బనన్యశోభాకరం బగు ననిన విని సంప్రాప్తహృదయసమ్మద యై దమయంతి
దాని కిట్లనియె. 21

మధ్యాక్కర. ఆరాజుగుణములు నాకెఱింగించినట్టులు నన్ను
నారాజునకు నెఱింగించి కరుణ నాయందుఁ గావింపు
మారంగ ననుడు నిషధవిషయమునకు నరిగి యాహంస
వీరసేనజునకు దాని గుణరూపవిభవముల్ సెప్పె. 22

వ. అంత. 23

చ. నలదమయంతు లిద్దఱు మనఃప్రభవానలబాధ్యమాను లై
సలిపిరి దీర్ఘవాసరనిశల్ విలసన్నవనందనంబులన్
నలినదళంబులన్ మృదుమృణాళములన్ ఘనసారపాంసులం
దలిరులశయ్యలన్ సలిలధారలఁ జందనచారుచర్చలన్. 24

వ. ఇట్లిద్దఱు నన్యోన్యరూపగుణశ్రవణసంజాతప్రీతు లై యుండునంత నంతఃకరణ
సంతతమనోజాతసంతాపవివర్ణవదన యైనయాదమయంతిం జూచి భయసంభ్ర
మాక్రాంత లై సఖీజను లెల్ల నక్కోమలివృత్తాంతం బంతయు భీమున కెఱిం
గించి యిట్లనిరి. 25

సీ. కలహంస పలికినపలుకులు [3]గణియించు,వడి దానిపోయినవలన చూచుఁ
బలుకదు సఖులతోఁ గలితాంగి మిన్నక, యలయుచు నుండుఁ దా ననుదినంబుఁ
జారువిభూషణాహారవిహారశ,య్యాసనభోగంబు లందు విముఖి
యయి రేయుఁబగలు నిద్రయు [4]నోర్వ నెఱుఁగక,దమయంతి నలుఁ డను ధరణినాథు

ఆ. నంద బుద్ధి నిలిపి కందర్పబాధిత, యగుచు నున్న యది ధరాధినాథ
ధరణిపతుల నొరులకు నురుగుణాఢ్యుల విన, నొల్ల దెంతవిభవయుక్తు లయిన. 26

వ. అనిన విని భీముం డేమి సేయుదు నెవ్విధంబున నమ్మహీపతి నిట రావింపనగునో
యని చింతించుచు సంప్రాప్తయౌవన యైనకూఁతుం జూచి యప్పుడు. 27

క. ఆవైదర్భుఁడు నిఖిలధ, రావలయములోనఁ బరఁగురాజన్యుల నా
నావిషయాధీశ్వరులను, రావించెం దత్స్వయంవరవ్యాజమునన్. 28

క. మనుజేశ్వరు లెల్లను బో, రన దమయంతిస్వయంవరమునకు నొప్పం
జను దెంచిరి సైన్యస్యం,దనఘట్టన నవనితలము దల్లడపడఁగన్. 29

---

1. గ. పుణ్య, లక్ష. 2. జ. బనన్యసౌభాగ్యశోభనకరంబు. 3. క. గుణియించు.
4. జ. నోప్ప.

వ. ఆసమయంబునఁ బర్వతనారదు లనుపురాణమునులు భూలోకం బెల్లం గ్రుమ్మరి యింద్రలోకంబునకుం బోయిన నింద్రుండు వారిం బూజించి భూలోకంబున కుశలవార్త యడిగి యిది యెట్లు ధర్మపరిపాలనపరులై వీరులై రణనిహతులైనరాజు లక్షయలోకసుఖంబు లనుభవింప నతిథులై యిందులకు నింతకాలం బయ్యు రానికారణం బేమి యని యడిగిన నారదుం డి ట్లనియె. 30

క. నరసిద్ధసాధ్యవిద్యా, ధరసురకన్యకలకంటె దమయంతియ సుం
దరి దానిసుస్వయంవర, మరుదై వర్తిల్లుచున్న దది యిప్డు మహిన్. 31

క. అందులకు ధరణిఁ గలనృప, నందను లెల్లను ముదంబునం బోయెదు వే
డ్కం దమలోఁ [1]గలహంబును, గ్రందును లే కున్నవారు గడు నెయ్యమునన్.

వ. అనిన నింద్రుండును లోకపాలవరులును దదాలోకనకౌతుకంబునం (గనకరత్న)రమ్య దివ్యవిమానారూఢు లయి భూలోకంబునకు వచ్చి దమయంతీస్వయంవరంబునకుం బోయెడువాని నాదిత్యులలోన విష్ణుండునుంబోలెఁ దేజోధికుం డైనవాని ననన్యసాధారణరూపవిభవంబున రెండవమన్మథుండునుంబోనివాని నలుం గని యంతరిక్షంబున విమానంబులు నిలిపి భూతలంబునకు వచ్చి వాని కి ట్లనిరి. 33

సీ. నిత్యసత్యవ్రత నిషధేశ నీవు మా, కమరంగ దూత వై యభిమతంబు
సేయుము నావుడుఁ జెచ్చెర నట్టుల, చేయుదు మఱి నాకుఁ జెప్పుఁడు మీర
లెవ్వార లేను మీ కిష్టంబుగా దూత, నై యేమి సేయుదు ననిన నతని
కమరేశ్వరుం డిట్టు లనియె నే నింద్రుండ, వీరు దిక్పాలురు విదితయశులు
ఆ. ధరణి నొప్పుచున్న దమయంతిసుస్వయం, వరముఁ జూచువేడ్క వచ్చియున్న
వార మీవు [2]మమ్ము వారిజాక్షికి నెఱిం, గింపు నామధేయకీర్తనముల. 34

వ. అ ట్లయిన నక్కోమలి మాయందుఁ దనవలచినవాని వరియించు ననిన నింద్రునకుఁ గృతాంజలి యై నలుం డి ట్లనియె. 35

ఆ. ఎఱిఁగి యెఱిఁగి నన్ను [3]నేకార్థసముపేతుఁ, బాడియయ్య యిట్టి[4]పనికిఁ బనుప
ననిన నుత్సుకుండ వై యేల చేసెద, నంటి చేయ కుండ నగునె యింక. 36

ఆ. నిన్ను నిత్యసత్యనిరతుఁగా నెఱిఁగి యీ, కార్యమునకు వలను గలుగు టెఱిఁగి
పనుప వలసె దూతభావ ముపేక్షించి, దేవహితము దీనిఁ దీర్పవలయు. 37

వ. ఆయుధీయసురక్షితం బయినరాజగృహం బెట్లు సొర నగు నని శంకింప వలవదు దమయంతీనివేశంబు ప్రవేశించునపుడు ని న్నెవ్వరు వారింప నోడుదు రనిన శక్రవచనంబుల నశంకితుం డయి నలుం డప్పుడ విదర్భాపురంబునకుం బోయి యెక్కరుండ దమయంతీగృహంబు సొచ్చి. 38

---

1. అ. గలహంబులు గ్రందుగ. 2. గ. పోయి...మద్దీయకీర్తనముల. జ. పోయి...మదభిధానకీర్తనములు. 3. జ. నేకార్థసమచితుఁ. 4. గ. పనియుఁ.

నలుఁడు దమయంతియొద్దకు దేవదూత యై పోవుట.

సీ. హంసచేఁ దనవినినంతకంటెను రూప, విభవాతిశయమున [1]వెలయుదాని
సురకన్యకలయట్టిసురుచిరశతకన్య, కాళిచేఁ బరివృత యైనదాని
హృదయేశుఁ డైనత న్నప్పుడు విను చున్కి, నలయ కాశ్వాసిత యైనదాని
దమయంతిఁ జూచి కందర్పశరావిద్ధుఁ, డయ్యె నలుం డంత నతనిఁ జూచి
ఆ. యితఁ డపూర్వమనుజుఁ డెందుండి వచ్చెనో, యనుచు నదరిపడి లతాంగు లెల్ల
నాసనములు డిగ్గి యప్పు డభ్యుద్గత, లైరి మనములందు హర్ష మెసఁగ. 39
వ. అంత. 40
క. దమయంతి మనోభవనిభు, నమరేంద్రప్రతిము దినకరాభు [2]సుధాభా
సము వరుణసదృశు ధనదో, పము నశ్విసమాను నిషధపతిఁ జూచి నలున్. 41
క. వారిరుహనేత్ర మదన, ప్రేరిత యై లజ్జ యుడిపి భీతిల్లక బృం
దారకమూర్తికి రాజకు, మారున కిట్లనియె మందమందమృదూక్తిన్. 42
వ. నీవు మహానుభావుండ వెవ్వండ విందుల కేమికారణంబున నేకతంబ వచ్చితి విది యత్యుగ్రశాసనుం డైనమదీయజనకుచేత సురక్షితం బగుట నెవ్వరికిఁ జొర నశక్యంబు దీని నెవ్వరు నెఱుంగ కుండ నెవ్విధంబునం జొచ్చితివి నాకు మనోజవేదనావివర్ధనుండ వైనని తెఱం గెఱింగింపు మనిన దానికి నలుం డి ట్లనియె. 43
ఆ. ఏను దేవదూత [3]నింతి నలుం డను, వాఁడ నింద్ర దహన వరుణ యములు
నీస్వయంవరంబు నెమ్మితోఁ జూడంగ, నరుగుదెంచి నన్ను నబల మున్న. 44
క. నీయొద్దకుఁ బుత్తెంచిరి, మాయం దొక్కరు నభీష్టమతి వరియింపం
దోయజముఖిఁ బ్రార్థింపుము, మాయందఱకును బ్రియం బొనర్పుము ప్రీతిన్.
వ. అని పంచినఁ దత్ప్రభావంబున నన్యులచేత నలక్షితుండ నై వచ్చితి నింద్రాదులకుఁ బ్రియంబు సేయు మనిన నవనతవదన యై దమయంతి దొల్లి హంసచేత నలు విని వానియందు బద్ధానురాగ యై నవయుచున్నయది యప్పు డతని నలుంగా నెఱింగి తద్వచనశ్రవణదుఃఖాయమానమానస యగుచు ని ట్లనియె. 46
తరువోజ. [4]ఏ నేడ నింద్రాదు లేడ వారలకు నెప్పుడు మ్రొక్కుదు నేను నీధనమ
భునాథ నీగుణంబులు హంసచేతఁ బోలుపుగా విని మనంబున నిల్పియున్న
దాన భవన్నిమిత్తమున నిఖిలధారుణీనాథసార్థంబు [5]రావింపఁ
గా నిప్డు వలసె లోకఖ్యాతకీర్తి కరుణించి పతిబుద్ధిఁ గావింపు మిందు. 47
వ. నీవు దీని కొడంబడనినాఁడు రజ్జువిషాగ్నిజలంబులం బ్రాణపరిత్యాగంబు సేసికొందు ననిన దానిం జూచి నలుం డి ట్లనియె. 48

---

1. జ. వెలుఁగుదాని 2. గ. సుధాభృత్సము; అ. సుధారుక్సము. 3. జ. నిం తేల నలుఁ. 4. 'ఏ నేల యింద్రాదు • లేల' అనియే పెక్కుప్రతులు. 'ఏడకు' మాఱుగా 'ఏల' యనియే ప్రాచీనకవులు ప్రయోగించి యున్నారు. 5. క. జ. గావింప.

మత్తకోకిలము. భూరిసత్త్వులు సర్వలోకవిభుల్ విభూతిసమృద్ధు లి
ద్ధోరుతేజులు నిన్నుఁ గోరుచు నున్నవారు సురోత్తముల్
వారిపాదరజంబుఁ బోలనివాని నన్ను మనుష్య సం
సారిఁ గోరఁగఁ జన్నె నీకుఁ బ్రసన్నులై సుర లుండఁగాన్. 49

క. దేవతల కప్రియంబులు, గావించి మనుష్యు లధమగతు లగుదు రిలం
గావున వారి కభీష్టము, గావింపుము నన్నుఁ బ్రీతిఁ గావుము తరుణీ. 50

వ. అనిన దమయంతి నయనాంతర్గళితబాష్పకణకరాళకపోలయుగళ యగుచుం బెద్దయుం బ్రొద్దు చింతించి నీయభిప్రాయంబునకు నిరపాయం బయినయుపాయంబు గంటి నింద్రాదులు నాస్వయంవరంబునకు వచ్చెద రేని వారిసన్నిధిన నిన్ను వరియించెద నట్లయిన నీకు నిర్దోష(త్వం) బగు ననిన నలుండు లోకపాలురపాలికిం బోయి దమయంతికిం దనపలికినవిధంబును దనకు దమయంతి పలికినవిధంబును జెప్పె నంతఁ బుణ్యతిథినక్షత్రముహూర్తంబున దమయంతీస్వయంవరంబు ప్రవర్తిల్లిన. 51

ఆ. నలున కాని నలినదళనేత్ర వరియింప, దట్టి చూత మనుచు నమరవరులు
నలువురును గడంగి నలరూపమున వచ్చి, రాస్వయంవరమున కతిరయమున. 52

సీ. దమయంతి సితపుష్పదామాభిశోభిత, హస్తయై చనుదెంచి యంబుజాక్షి
యమ్మహోత్సవదర్శనాగతరాజన్య, నివహంబు నీక్షించి నెమ్మితోడ
నలువురు వేల్పులు నలుఁ దొట్టి యప్పుడే, కాకారులై యున్న నందు నలుని
నేర్పరింపఁగ నేర కింద్రాదులను నలు, నెఱుఁగునుపాయ మిం కెద్ది యొక్కొ

ఆ. యనుచు సంశయాకులాత్మయై సురలార, నలు నెఱుంగువిధము నాకుఁ జేయుఁ
డాత్మరూపధరుల రగుఁ డని పరిదేవ, నంబు సేసెఁ దనమనంబులోన. 53

వ. దేవతలు దానిపరిదేవనంబు విని కరుణించి యనిమిషలోచనంబులు నస్వేదగాత్రంబులు నొప్ప నవనీతలంబు ముట్టక యాసన్నులై నిలిచి రంత లోకపాలురును భూలోకంబునం గలరాజలోకంబు నవలోకించుచుండఁ బుణ్యశ్లోకుం డయిన నలు ధర్మవిధానంబున వరియించి దమయంతి తదీయస్కంధంబున సుగంధికుసుమదామకంబు వెట్టెన. 54

క. దేవతలసాధువాదము, తో విప్రాశీరవంబుతో బహుతూర్యా
రావంబులు సెలఁగెను బ్రా, రావారరవంబుఁ బోలె ననివార్యము లై. 55

నలుండు స్వయంవరలబ్ధ యైనదమయంతిం బెండ్లి యగుట.

వ. ఇట్లపూర్వస్వయంవరలబ్ధ యైనదమయంతి నత్యంతవిలాసంబుతో వివాహం బైన యానలునకు నింద్రుండు వానియజ్ఞంబులయందు నిజరూపంబుఁ జూపను నగ్నియు వరుణుండును వానివలచినచోటన యగ్నిజలంబు లుత్పాదింపను ధర్ముండు ధర్మువునంద వానిబుద్ధి వర్తిల్లను వరంబు లిచ్చి దేవలోకంబున కరుగువా రెదుర ద్వాపరంబుతో వచ్చుకలిం గని యెందులకుం బోయెద వని యడిగిన నింద్రా

దులకుఁ గలి యిట్లనియె. 56

తే. అవనిలో దమయంతీస్వయంవరంబు, విస్తరిల్లుట విని కడు వేడ్కతోడ
నేను దమయంతిచే వరియింపఁ బడుదు, నని తదర్థి నై యరిగెద నాసఁ జేసి. 57

వ. అనిన నందఱు నగి నీ వంచుల కేల పోయె దది మున్నదఱ నిర్వృత్తం బయ్యె నక్కో
మలి యొరుల నెవ్వరి మెచ్చక నలుం డనువాని వరియించె ననినం గలి కరం
బలిగి యన్నలునకు దమయంతికి రాజ్యవిభవపరిత్యాగంబును బరస్పరవియోగం
బునుం జేసెద నని నిశ్చయించి వాని నతిరతుంగా నెఱింగి యక్షంబులం జొచ్చి
యుండ ద్వాపరంబుం బనిచి నలుండును సేయు చున్న యశ్వమేధాదికానేకభూరి
దక్షిణమహాక్రతువులయు జపహోమదానాదివివిధపుణ్యకర్మంబులయుఁ గారణం
బునం జొర నవసరంబు గానక యంతరం బన్వేషించుచుఁ బెద్దకాలం బుండె
నొక్కనాఁ డతండు కృతమూత్రుం డయి జలోపస్పర్శనానంతరంబునం బాద
శౌచంబు సేయ మఱచి సంధ్యోపాసనంబు సేసిన నుపలబ్ధావసరుం డయి కలి
నలునందుఁ బ్రవేశించి పుష్కరుం డనువానిపాలికిం బోయి తన్నెఱింగించి నీవు
నలునితోఁ జూదం బాడి వాని రాజ్యంబును సర్వస్వంబును నోడిచికొ మ్మని చెప్పి
తానును వానికి వృషభుం డనుసహాయుం డయి యక్షంబులు గొని పుష్కరు
త్రో నొక్కటం జని నలుం గాంచి నీవు [1]మాతోఁ జూదం బాడు మనిన. 58

క. ద్యూతార్థము తత్కృతవా, హ్వయితుఁడ నై జూద మాడ కుండుట ధర్మా
పేతం బని యభిముఖుఁ డై, యాతనితో నలుఁడు జూద మాడఁ గడంగెన్. 59

క. కలధనము లెల్ల నోడుచు, నలయక జూదమున విజితుఁ డగు చుండె నిజా
ప్తులు వారించిన నుడుగక, నలుఁడు కలిప్రేరణంబునను హతమతి యై. 60

వ. ఇట్లనేకమాసంబులు దుర్వ్యసనాసక్తుం డయిన యన్నలుండు వివిధవస్తువాహననివ
హంబు లోడ్డి పుష్కరున కోటువడం బోయిన నెఱింగి పౌరబ్రాహ్మణప్రధానవరులు
దమయంతీపురస్కృతు లయి వచ్చి వారించి కలిసమావేశపరవశుం డైన యన్న
లుచేతం బ్రతిహతు లయి పలుకకుండి రంత దమయంతి చింతాక్రాంతచిత్త యై.

ఆ. ఎంత యోటువడిన నంతియు జూదంబు,నందుఁ దగులుఁ జలము నతిశయిల్లు
నేమి సేయుదాన నిది యెగ్గునకు మూల, మని లతాంగి దుఃఖితాత్మ యగుచు.

సీ. అక్షముల్ పుష్కరునందు వశ్యంబు లై, యునికియు నలునియం దొండువిధము
లగుటయు నెఱిఁగి నిజాధీశ్వరున కప, జయము గా లక్షించి సరసిజాక్షి
భర్తయనుజ్ఞ మున్ పడసి వార్ష్ణేయుఁ డన్, సారథిఁ బిలిచి యాస్యందనమున
నింద్రసేనుం డనునిజకుమారకు నింద్ర, సేన యనుకూఁతుఁ జెచ్చెరన తోడు

తే. కొని విదర్భ కరిగి గుఱుకొని మద్బంధు, జనులయొద్దఁ బెట్టి [2]చట్ట రమ్ము
యంచు నెమ్మిఁ బుచ్చె నాప్తపురోహిత, మంత్రిబాంధవాభిమతము [3]గాఁగ. 63

1. క. నాతో. 2. అ. పరగ; ఖ. చక్క. 3. జ. గూడ.

క. నలుఁడును ధరణీరాజ్యము, [1]దలఁగఁగ సర్వంబు నపహృతం బైనఁ గడుం
దలరి దమయంతిఁ దోడ్కొని, వెలువడియె నశేషరాజ్యవిభవచ్యుతుఁ డై. 64

తే. పురము వెలి మూఁ డహోరాత్రములు వసించి
యున్న నలుపాలి కెవ్వరు నోడి రరుగ
జనవిభుం డైన పుష్కరుశాసనమునఁ
గలికృతద్యూతవిద్వేషకారణమున. 65

వ. ఇట్లు సర్వజనసత్కారార్హుం డయ్యును నలుండు విధికృతంబున నెవ్వరివలనను సత్కారంబు గానక జలంబు లాహారంబుగాఁ దత్పురసమీపంబున దమయంతీద్వితీయుం డై యుండి బుభుక్షాపీడ సహింప నోపక హిరణ్యపక్షంబులతోఁ దమ ముందటఁ దిరుగుచున్న పక్షులం గని యవి భక్ష్యంబు లగు నని యప్పక్షులం బట్టికొన సమకట్టి తనకట్టినపుట్టంబు వానిపై వైచిన నవి పుట్టంబుతోన గగనంబున కెగసి నగుచు విగతవస్త్రుం డైన నలున కి ట్లనియె. 66

నలుండు దమయంతీసహితుం డై యడవికిఁ బోవుట.

తే. నీధనంబును రాజ్యంబు నికృతిఁ గొన్న, యక్షముల మేము నీవస్త్రమపహరింపఁ
బక్షిరూపుల మై వచ్చి పార్థివేంద్ర, యపహరించితి మని చెప్పి యరిగెఁ జదల.

వ. నలుండును వానిం జూచి విస్మయం బంది యీయక్షంబుల[2]ప్రకోపంబునం గాకేమి నా కిట్టి దయ్యె ననుచు దమయంతికట్టినపుట్టంబుచెఱంగు [3]గట్టికొనియె నట్లిద్దఱు నేకవస్త్రు లయి యొండొరులమొగంబులు సూచి దుఃఖించుచో నలుండు దమయంతి కి ట్లనియె. 68

క. ఇది దక్షిణాపథంబున, కిదియు విదర్భాపురమున కిది కోసల కి
య్యది యుజ్జయినికిఁ దెరువులు, మది నిన్నిటిలోన నరుగ మన కెద్ది యగున్ 69

క. అడవులలో నాతోఁ గడు, నిడుమలు వడ నోప వరుగు మిందుముఖీ యి
ప్పుడు నీబంధుజనంబుల, కడ కనవుడుఁ దరుణి శోకగద్గద యగుచున్. 70

ఆ. అతని కిట్టు లనియె నవనీశ నీవును, నేనుఁ జని విదర్భ నిష్టలీల
నుండుదము మృగాకులోగ్రవనంబుల, కరుగ నేల యిడుమ లంద నేల. 71

వ. అనిన విని నలుం డవనతాననుం డై నీచెప్పినట్ల విదర్భేశ్వరురాజ్యంబును మన రాజ్యంబ యేను దొల్లి యధికైశ్వర్యయుతుండ నై యందులకుం బోయి బంధుజనులకు హృదయానందంబు సేసి యిప్పు డివ్విధంబున సర్వస్వహీనుండ నై యెట్లు పోవ నేర్తు ననిన దమయంతి యి ట్లనియె. 72

తే. అధికదుఃఖరోగార్తున కౌషధంబు, సురుచిరంబుగ భార్యయ చూవె యొందు
నెనర భార్యాసమేతుఁ డై యున్నవాని, కెంత లయ్యును నాపద లెఱుకపడవు.

క. అలసినెడ డస్సినెడ నాఁకలి తృష్ణయు నైనయెడలఁ గడుకొని ధరణీ

1. ఖ. దలువ్రుగ. క. దలుపుగ. 2. అ. దోషంబునం. 3. క. గప్పికొనియె.

తలనాథ పురుషునకు ని, మ్ముల భార్యయ పాచుఁ జిత్తోమునదుఃఖంబుల్. 74

వ. కావున నిది [1]మదనుజీవిత యనియు ననువ్రత యనియు ననుకంపనీయ యనియు నన్ను విడువక నాయనుగమనంబునకు ననుమతుండవు గ మ్మనిన నట్ల చేయుచుఁ బ్రాణసమాన వైనని న్నేల విడుతు నోడ కుండు మని నలుండు దనదేవి నాశ్వాసించుచు నొక్కటఁ జని విజనం బైనవిపినంబున నొక్క సభం గని యందు విశ్రమించి పరుషధూళిధూసరస్థలంబున శయనించి మార్గశ్రమనిమీలితనయనుం డై దుఃఖంబునఁ గన్ను మొగుడ కున్న లేచి తనపాదంబులయంతికంబునఁ గ్లేశపరవశ యై నిద్రవోయెడుదమయంతిం జూచి. 75

సీ. ధరణిరాజ్యంబుతో ◦ ధన మెల్లఁ బరులచే, నపహృతం బగుటయు ◦ నాప్తమిత్త్ర
బంధుజనంబులుఁ ◦ బ్రకృతిజనంబులు, విడుచుటయును మహా◦విపినభూమిఁ
బత్నితోఁ దనపరి◦భ్రమియించుటయు నప్డు, దలఁచి శోకించి యి◦త్తరుణి దొల్లి
మృదుశయనంబున ◦ మెలఁతలు మెలపుతో, నడుగు లొత్తఁగ నిద్ర◦యనుభవించు

ఆ. కోమలాంగి యిపుడు ◦ గుఱుకొని పాంసుల, స్థలమునందు నిద్ర ◦ దగిలినదియుఁ
బంకజాక్షి నాకు ◦ భార్య యై యిట్టి దుఃఖంబు వొందె దైవఘటనఁ జేసి. 76

వ. ఏను దీనిదుఃఖంబుఁ జూడ నోప నెటయేనియుం బోయెద నిది నన్నుఁ గానక తన బంధులయొద్దకుం బోయి దుఃఖంబులం బొరయ కుండు నని విచారించి పోవ సమకట్టి యక్కోమలి మేలుకొనకుండ మెల్లన దానివస్త్రంబునం దర్ధంబు చించి తనకుం బరిధానంబు సేసికొని వెలువడి కొండొకనేల పోయి దమయంతియందు ఘనం బైనతననెయ్యం బనుతీఁగం ద్రెంప నేరక క్రమ్మఱి వచ్చి. 77

చ. కలి దమయంతిఁ బాప సమ◦కట్టు సతిం బతి వాయ నోపఁ డా
లలన సుదీర్ణసౌహృదబ◦లంబున నిట్టులు రెంటఁ జేసి య
న్నలుఁడు విమోహరజ్జులఁ బె◦నంగి గతాగతకారి యైన య
య్యేలయునుబోలె నూఱడక ◦ యెంతయుఁ బ్రొద్దు వినిశ్చితాత్ముఁ డై. 78

తే. చాల నొక్కర్తు నిక్కాన◦పాలు సేసి, నిష్ఠురుండ నై యే నెట్లు ◦ నేర్తుఁ బోవ
ననక కలిచేత నాకృష్టుఁ◦డై నలుఁడు, విగతకరుణుఁ డై దమయంతి◦విడిచి చనియె.

వ అంత దమయంతి మేలుకని తనపతిం గానక తనవస్త్రార్ధనికృంతనంబును జూచి లేచి నలుగడం బరికించి భయశోకవ్యాకులితచిత్త యయి. 80

సీ. హామహారాజ మ◦హామహీరక్షణ, దక్షదక్షిణబాహు◦దండ దండి
తారాతి నిషధరా◦జాగ్రణి న న్నిట్లు, వీతదయుండ వై ◦ విడిచి చనఁగఁ
దగునె నీ వెన్నఁడు ◦ ధర్మువు దప్పని, వాఁడవు సూనృత◦వ్రతరతుండ
వోడకు మని నన్ను ◦ నూఱడఁ బలికిన, పలు కిట్లు మఱవంగఁ ◦ బాడి [2]యగునె

---

1. క. మదధీనజీవిత ; ఖ. మదనుజీవిక. 2. అ. యయ్యా.

ఆ. పొదలలోన డాఁగి, [1]పొడసూప కిట్లేల, యున్న వాఁడ విట్టె యుగ్రభావ
మేల నీకు [2]వలసె [3]నెట వోదు నింకెట్లు, గాంతు నిన్ను నుగ్రకాననమున. 81
క. వగవఁగ సాంగోపాంగము, లగు నాలుగు వేదములయు నధ్యయనము పో
ల్పఁగ నొక సత్యముతో నెన, యగునే యెవ్వియును బోల నవి సత్యంబున్.
వ. ప్రాణసమానురాల వయినని న్నవశ్యంబును విడువ నని పలికితి సత్యప్రతిపాలనంబు సేయు మని ప్రలాపించుచుం దనయేకాకిత్వంబునకు నబలాభావంబునకుఁ బ్రతిపదన్యాసజాయమానకంటకమృగపన్నగభయంబునకు వగవక నిజనాథునసహాయత్వంబునకు దుస్సహక్షుత్పిపాసాశ్రమాకులత్వంబునకు వగచుచు. 83
క. అలయుచుఁ బులుఁగులయెలుఁగుల, కులుకుచు నుగ్రాతపమున కోపక వృక్షం
బులనీడల నిలుచుచు నెలుఁ, గులఁ బులులం జూచి భయముగొని వగ వగచున్.
క. ఏచిన[4]పొదలఁ బొరల్పడఁ, ద్రోచుచు ముండ్లకును నల్లఁ దోలఁగుచు దిక్కుల్
సూచుచుఁ దొడరుచుఁ దెళ్లుచు, లేచుచు లలితాంగి సంచలించుచు నరిగెన్. 85
వ. ఇట్లరుగుచున్న దమయంతి నంతికన్యస్తచరణ యైనదాని నాహారార్థి యయి యొక్కయజగరంబు వట్టికొనిన నక్కోమలి మెదల నేరక. 86
ఆ. ఇంక నైన నన్ను నేల యాలింపవు, నాకు శరణ మగుము నాథ యనుచు
నఱచుచున్న దానియాక్రందనధ్వని, వినుచు నొక్క యెఱుకు వేగ వచ్చి. 87
వ. తన [5]పట్టినసురియ నప్పెనుఁబామువదనంబు వ్రయ్యం దఱిగిన రాహుముఖవిముక్తయైనచంద్రరేఖయుంబోలె నజగరముఖంబువలన వెలువడినయాదమయంతి నాశ్వాసించి తత్సమీపసరోవరస్నాతను వన్యస్వాదుఫలాహారనుం గాఁ జేసి విగతశ్రమం గావించి నీ వెవ్వరిదాన వి ట్లేల యేకతంబ యిస్థానంబునకు వచ్చితని యడిగి మధురభాషిణి యైనయమ్మగువవలన నంతవృత్తాంతంబు నెఱింగి. 88
కవిరాజవిరాజితము. రజనికరాననఁ బీనపయోధరరాజిత రాజసుతన్ విలస
ద్గజపతిగామినిఁ జందనగంధిఁ బ్రకాశితకాంతిసమన్వితఁ బం
కజదళలోచనఁ జూచి కిరాతుఁడు కామనిశాతశరాహతుఁడై
నిజహృదయం బెఱిఁగించె లతాంగి కనింద్యచరిత్రకు వేడుకతోన్. 89
ఆ. అగ్నిశిఖయుఁబోలె నంటను డాయను, జూడ [6]రానియట్టిశుభచరిత్ర
నెఱుక లేనికఱకుటెఱుకు కపేక్షించెఁ గా, దనకు తనకు నాయువల్ప మైన. 90

దమయంతిశాపంబునం గిరాతుండు సచ్చుట.

వ. దమయంతియు వాని నలిగి చూచి యేను బతివ్రత నైతి నేని నిదురాత్ముం డైనకిరాతుం డిప్పుడ మృతుం డయ్యెడు మని శాపం బిచ్చిన నాఁ డప్పుడ యగ్నిదగ్ధం బైనవృక్షంబునుంబోలె విగతజీవుం డై పడియె నట్లు పరమపతివ్రతాగుణ

1. క. పొడ యేల సూప కి, ట్లున్న. 2. అ. నయ్యె. 3. జ. నెట వోయి తింకెట్లు. 4. జ. పొదలం బొడవడ. 5. క. కట్టినసురియ. 6. క. ఁ గాని.

ప్రభావంబున. 91

క. [1]బాల హృదయమున నృపశా, ర్దూలు నిజాధీశు నిలిపి దంష్ట్రోరగశా
ర్దూలాభీలమృగావలి, కోలిన భయ మంద కరిగె నుగ్రాటవిలోన్. 92

వ. మఱియును. 93

సీ. సహకార మత్ప్రియసహకారుఁ బున్నాగ, పున్నాగుఁ దిలక భూభువనతిలకుఁ
జందన బుధహరిచందనుఁ బుష్పితా, శోక సుహృజ్జనశోకదమను
వకుళ కులైకదీపకు విభీతక భయో, పేతారిహరు నలుఁ బ్రీతితోడఁ
గానరే కానలలోన లోకోత్తరు, నని మ్రానిమ్రానికి నరిగి యరిగి

ఆ. యడుగు నడుగు లెండఁ [2]బాడవాడఁ బొక్కి న, నిర్ఝరాంతరములనిలుచుఁబోలుచు
గిరులదరులయెడల [3]నురుగుహాగృహములఁ, దొంగి తొంగి చూచుఁ దోయజాక్షి.

వ. ఇట్లు దమయంతి నిజనాథు నన్వేషించుచు భీషణారణ్యంబునం దిరుగునది ముందట.

మత్తకోకిలము. వారిభక్షులు పర్ణభక్షులు వాయుభక్షులు శాకనీ
వారభక్షులు వృక్షమూలనివాసయుక్తులు నై తపం
బారఁ జేయుమహామునీంద్రులయాశ్రమం బెడఁ గాంచె నం
భోరుహాక్షి పురాసమార్జితపుణ్యకర్మఫలంబునన్. 96

వ. ఇట్లు మృగవ్యాళతస్కరకిరాతనిరంతరం బయినకాంతారంబునం బుణ్యనదీతీరంబున నొక్కమునిపల్లియం గని యందు వసిష్ఠవామదేవవాలఖిల్యభృగునారదసదృశు లైనమహామునులం గని నమస్కరించి యున్న నమ్మునులు దమయంతిం జూచి యచ్చెరువడి యవ్వా నీ వెవ్వరిదాన వివ్వనదేవతవో దేవభామినివో దివ్యంబైన తేజంబుతో నేల క్రుమ్మరియెద వనిన వారలకు దమయంతి యి ట్లనియె. 97

క. వినుఁ డేఁ బుణ్యశ్లోకుం, డనఁగ సదాయజ్ఞనిరతుఁ డనఁగ ధరిత్రిం
దనరిననలుభార్యను [4]స, జ్జననుత దమయంతి యనఁగ జరగినదానన్. 98

వ. విధివశంబున నన్నుం బాసి హృదయేశ్వరుం డెట యేనియుం బోయినఁ దదన్వేషణాసక్తచిత్త నై విపినపరిభ్రమణంబు సేసెద మీతపోవనంబునకు వచ్చి నలుండు భవత్పాదాభివందనకృతార్థుం డయి యెక్కడికిం బోయె నతనిపోయినసల నెఱుంగుదురేని నానతిండు కొన్నిదినంబులలోనఁ దద్దర్శనంబు సంభవిల్లనినాఁడు దేహంబు విడుతు నని యేడ్చుచున్నదానిం జూచి కరుణించి మును లి ట్లనిరి. 99

క. వనజాయతాక్షి కతిపయ, దినములలోఁ జూడఁ గాంతు తివిరి నలుని భూ
జననుతు నెప్పటియట్టుల, తనపురమున రాజ్యలీలఁ దనరెడివానిన్. 100

వ. మేము మాతపోదృష్టిం జూచితిమి దుఃఖింప కుండు మని తాపసులు దమయన్తి

1. క. గ. జ. బాలకి మనమున. 2. గ. బోడవడ. 3. అ. నురుగుహాంతరములఁ, 4. అ. నేఁ, బనుపడి... ఁ బరఁగినదానన్.

హోత్రంబులయు నపారఫలపుష్పతరునదీరమ్యతపోవనంబులయుఁ దోడ నదృ
శ్యు లైనం జూచి దమయంతి యిది కలయో నిక్కంబో యని విస్మయం
బందుచుం జని ముందట నొక్క చనుపం గని దాని జొచ్చునపు డందలిజనంబులు.

సీ. పాంసుజాలములు పైఁ బ్రాఁకినఁ గరము రూక్షము లగునూర్ధ్వాలకములదాని
నతిమలినం బైనయర్ధవస్త్రంబుచే, నావృతం బగుదేహయష్టిదాని
నాఁకలి తృష నిద్ర యలుపీని నెఱుఁగక, యున్మాదినియుఁ బోలె నున్నదాని
దమయంతిఁ జూచి కొందఱు పిశాచం బని, పఱచిరి కొందఱు భయము వొంది
ఆ. రందుఁ గొంద ఱధికహాస్యంబు సేసిరి, యడవి నేమి రోసె దనిరి కొంద
ఱవ్వ నీవు వేల్పవగు దని కొందఱు, మొగిన కేలు మొగిచి మ్రొక్కి రంత.

వ. దమయంతి సార్థవాహుం జూచి యిమ్మహాగహనంబున నిట్టిజనసంకులం బైన
సార్థంబు గానంబడియెడు నెట్టిపుణ్యంబో యని పల్కి మఱియు ని ట్లనియె. 103
క. ఏను నలుభార్యఁ బుణ్యవిహీనతఁ బతిఁ బాసి నవసి యేకాంతమ యీ
కానలఁ బరిభ్రమించెదఁ, గానరె మీ రమరసదృశుఁ గరుణాత్ము నలున్. 104
వ. అనిన దానికి సార్థవాహుండు శుచి యనువాఁ డి ట్లనియె. 105
క. నలుఁ గాన మివ్వనంబునఁ, గల వెప్పుడుఁ గాంతు ముగ్రకరులను సింహం
బుల ఋక్షంబుల నిది మ, ర్త్యుల కవిషయ మాతపంబు దూఱదు దీనన్. 106
వ. అనిన నిచ్చనుప యెట వోయెదు నని యడిగినఁ జేదిపతి యైనసుబాహుపురంబు
నకుం బోయెదు నని చెప్పిన నట్లేని మాతోడ వచ్చెద నని యప్పరమపతివ్రత
పతిదర్శనలాలస యై మునులపలుకులు తలఁచుచు సార్థంబుతో నరిగిన. 107
క. కడునేఁడ యెక్కనంతకు, నుడుగక యచ్చనుప నడచి యుగ్రాటవిలో
విడిసె బహుశీతజలముల, బెడఁ గగునొకచెఱువునొద్దఁ బెద్దయు డప్పిన్. 108
వ. అంత. 109
సీ. అర్ధరాత్రమునప్పు డంబుల కేతెంచె, గజయూథములు జలకాంక్షఁ జేసి
యంబుధి విమలతోయంబు లాస్వాదింపఁ, జనుదెంచుజలధరసమితియట్ల
యచ్చనుపలోన నిద్రాసక్తు లైనవా, రున్నతద్వీపములయుగ్రపాద
హతిఁ జేసి మర్దితు లైరి కొందఱు దంత, హతిఁ జేసి భిన్నాంగు లైరి కొంద
ఆ. ఱఱచి ప్రాణభీతిఁ బఱచి మహీజంబు, లెక్కి రంతఁ గొంద ఱుక్కడంగి
చనుప యిట్టిపాటఁ బెను పఱె యవినీతు, సిరియుఁ బోలె నడఁగి విరిసి చనియె.
వ. అట్టిసంక్షోభంబున మరణంబునకుఁ దప్పి దమయంతి యాత్మగతంబున. 111
ఆ. జీవితార్థు లైనజీవుల సుఖసుప్తు, లైనవారిఁ జంపె నఱవ నఱవ
మరణకాంక్ష నున్ననమగువఁ జంపను నను, మఱచె విధి కరంబు మందబుద్ధి. 112
సీ. ఇచ్చనుప్వంకఁ జని యివ్వనక్లేశంబుఁ, దలఁగుదు నని బుద్ధిఁ దలఁచి యున్న

నురుతరసార్థపయోరాశి హస్తియూ, థాగస్త్యుచే బీత యయ్యె నదియుఁ
దోలుమేనఁ జేసినదుష్కృతకీర్తియో, వగవక నాస్వయంవరమునాఁడు
సురవరు లర్థులై చూచుచు నుండఁగ, నలు వరియించిననాఁటియెగ్గు
ఆ. దలఁచి యిట్టియాపదలు సేసిరో వేల్పు, లమరకోపమునన యయ్యె నాకు
నివ్వియోగదుఃఖ మింకేమి సేయుదు, ననుచు వగచుచుండె నంబుజాక్షి.

దమయంతి సుబాహుపురంబు ప్రవేశించుట.

వ. ఇట్లు దుఃఖించుచు దమయంతి ప్రభాతంబ హతశేషులైనవారలతో ననవరత ప్రయాణంబులం జేదిపతిపురంబు సొచ్చి జనసంకులంబైనరాజమార్గంబు దఱియ వచ్చుచున్నదాని దినకరప్రభాపటలధూసరితప్రభాతచంద్రరేఖయుంబోలె దీప్తివిహీన యై డస్సియు రమ్యాకృతి యైనదానిఁ బ్రాసాదగత యైనరాజమాత దమయంతి దవ్వులం గని తనదాది కిట్లనియె. 114

తే. జీర్ణమై కడు మాసినచీర గట్టి, ధూళిధూసరాలకములు దూలు చుండ
నబల యున్మత్తవేషిణి యైనలచ్చి, కరణి నిట వచ్చుచున్నది కంటె దాని. 115

వ. అక్కోమలియందు నా కతిస్నేహంబై యున్నయది దానిం దోడ్కొని రమ్మనిన నదియు దమయంతిం దోడ్కొని రాజమాతయొద్దకుం జనిన నారాజమాతయు దానిం జూచి నీ వెవ్వరిదానవి ట్లెల్ల దుఃఖావేశవివశ వై యున్నదానవు చెప్పు మనిన దమయంతి యిట్లనియె. 116

మధ్యాక్కర. జితవైరి మత్పతి జూద మాడి నిర్జితుఁ డయి చనినఁ
బతితోడ నీడయుఁబోలె నేనును బాయక యరిగి
యతిబుభుక్షాతురుం డైనపతిచేత నవ్వ డైవాను
మతిఁజేసి వంచిత నైతి నెక్కచో మఱచి నిద్రించి. 117

వ. అంతనుండియు నమ్మహానుభావు నేకవస్త్రు ననికేతను నన్వేషించుచు సైరంధ్రీవృత్తంబు సేకొని వియోగానలంబునం గంది కందమూలఫలంబుల యాహారంబుగాఁ బొద్దువడినచోట నివాసంబుగా [1]మృగకులంబ సహవాసంబుగా వనంబులం బరిభ్రమించితి నని బాష్పజలంబులం బయోధరస్థలపరాగంబు పంకంబు సేయుచుఁ బలుక నేర కున్నయాదమయంతికి రాజమాత యిట్లనియె. 118

క. నీ వుండుము నాకడ నిం, దీవరదళనేత్ర నీపతిని రోయఁగ భూ
దేవోత్తములం బంచెద, నావుడు ని ట్లనియె భీమనందన నెమ్మిన్. 119

వ. ఏను సైరంధ్రి నయి యుండియు నుచ్ఛిష్టంబు ముట్టను బదధావనంబు సేయను బరపురుషులతోఁ బలుక నోపఁ బతి నన్వేషించుపొంటె నరిగెడుబ్రాహ్మణులతోఁ బలుకుదు నట్లయిన నీయొద్ద నుండుదు నొండువిధం బైన నుండ నేర ననిన నీ కిష్టం బైనవిధంబున నాయొద్దన యుండు మని దాని నతిగౌరవంబునం జేకొని

1. క. మృగంబుల సహాయంబుగా.

యుండఁ దనకూఁతు సునంద యనుదాని సమర్పించిన. 120

క. అలయక పుణ్యవ్రతములు, సలుపుచు సైరంధ్రి యనఁగఁ జైద్యేశుపురిన్
నలుదేవి యుండె నెదఁ బతిఁ, దలఁచుచు దుస్సహవియోగతాపార్దిత యై. 121

వ. అట నలుండు దమయంతిం బాసి దారుణారణ్యంబులో నరుగువాఁడు ముందట.

చ. అవిరళవిస్ఫులింగనివహంబుల నభ్రపథంబు నంటుచున్
దవదహనం బుదగ్రతరుదాహము సేయుచు నున్నఁ జూచి మా
నవపతి దానియంతరమునన్ వినియెన్ [1]నరనాథ నన్ను గా
రవమునఁ గావ వేగ యిట ర మ్మను నార్తమహానినాదమున్. 123

క. విని శంకింపక చెచ్చెర, వనఘుం డత్యుగ్రతరదవానలమధ్యం
బున కరిగి కనియె దీనా, నను మండలితాంగు నొక్కనాగకుమారున్. 124

వ. అన్నాగకుమారుండును నలునకుం గృతాంజలి యై యేను గర్కోటకుం డను
వాఁడ గర్వవశంబున నొక్కబ్రహ్మఋషి నుపాలంభించి తచ్ఛాపంబున [2]నెక్కడం
గదల నేరకున్నవాఁడ. 125

క. నాలుగుదిశలను దావ, [3]జ్వాలావలి గవిసె మ్రందిఁ జా నోప మహీ
పాలక నన్నొకసరసీ, కూలముఁ జేరంగ నెత్తికొని పొమ్ము దయన్. 126

నలుఁడు కర్కోటకునిచేత దష్టుం డగుట.

వ. నన్ను రక్షించిన నీకుం బ్రియంబు సేయ నోపుదు ననిన వాని నెత్తికొని పోవం జులుక నై యంగుష్ఠప్రమాణదేహుం డై యున్న నెత్తికొని నలుం డతిత్వరితగతి నరిగి [4]తాపవర్జితం బైనయొక్కసరోవరంబుసమీపంబున విడువం బోయిన నింకను బదియడుగు లరుగుము నీకు శ్రేయఃప్రాప్తిఁ జేసెద ననిన నడుగు లెన్నికొనుచు నరిగి పది యగునడుగునప్పు డప్పాముచేత దష్టుం డై తనరూపంబు విడిచి వికృత రూపంబుతో నున్న నన్నలునకు గర్కోటకుం డాత్మరూపంబు సూపి యిట్లనియె నయ్యా నీవు నాచేత విషపీడితుండ వైతి నని దుఃఖింప వలదు ని న్నొరు లెఱింగిన నెగ్గగుం గావున వికృతశరీరుం జేసితి నెంతకాలంబు నీశరీరంబున నా విషం బుండు నంతకాలంబును నీకు విషోరగరాక్షసపిశాచశత్రునివహంబువలని భయంబు లేదు సర్వసంగ్రామజయంబును భార్యాసంగమంబును నెప్పటి రాజ్యవిభవంబును నగు నీ కెప్పుడేని నిజరూపంబు సేకొన నిష్టం బయ్యె నప్పుడ నన్నుం దలంపు మీవస్త్రంబు నీయొద్దకు వచ్చు దీని ధరియించుడు నిజరూప ప్రాప్తి యగు నని వరం బిచ్చి వెండియు ని ట్లనియె. 127

మధ్యాక్కర. ఇలఁ బ్రసిద్ధుఁడు ఋతుపర్ణుఁ డనెడుమహీశుఁ డిక్ష్వాకు
కులజుండు నీకు సేవ్యుం డగు నతనిఁ గొలిచి యుం దుండు

1. జ. నలనాథ. 2. క. నొక్కడలం. 3. ఖ. గ. జ్వాలలు గవయంగఁ దొడఁగెఁ • జన నోప. 4. చ. దావవర్జితం.

నెలకొని యతనికి నశ్వహృదయ మనెడివిద్య యిచ్చి
వెలయ నతనిచేత నక్షహృదయ మనువిద్యఁ జేకొనుము. 128

వ. మఱియు బాహుకుం డనునామంబుతో [1]సూపకారవృత్తి నుండు మని హితోపదేశంబు సేసి కర్కోటకుం డదృశ్యుం డైనఁ దద్వచనంబున నలుం డయోధ్యాపురంబునకుం జని ఋతుపర్ణుం గని యేను బాహుకుం డనువాఁడ నశ్వశిక్షయందుఁ గుశలుండ నన్నసంస్కారంబుల శిల్పంబులఁ బెక్కువిధంబుల రచియింప నేర్తు భవత్సేవార్థి నై వచ్చితి ననిన ఋతుపర్ణుం డి ట్లనియె. 129

క. నాయొద్ద నుండుదేని మ, దీయ రథాశ్వములకును ద్రుతిని శీఘ్రముగాఁ
జేయుము నావుడు నట్టుల, చేయుదు నని నలుఁడు వాని సేవించెఁ దగన్. 130

వ. ఇట్లు ఋతుపర్ణునొద్ద నశ్వాధ్యక్షుం డయి దుష్టాశ్వంబుల వశంబుఁ జేయుచు నశ్వారోహకుల నారోహణంబుల శిక్షించుచు రసవంతంబులుగ నన్నసంస్కారంబులు సేయుచు ఋతుపర్ణుచేత నియుక్తు లయినవార్ష్ణేయజీవలులు దనకు సహాయులుగాఁ బ్రచ్ఛన్నుం డై యుండె నొక్కనాఁడు. 131

సీ. ఇభరాజగమన నీ వెందుల కరిగిత, త్వరుకుచాభోగ యెందున్నదాన
వబల యెవ్వరిచేత నడవులలోఁ బట్టు, వడి తలనాపేక్షఁ బఱచుచున్న
యుగ్రమృగంబులయుదరంబులో నున్న, దానవే నీతల్లిదండ్రులొద్ద
ధృతి నున్నదానవే దేశాంతరంబుల, నున్నదానవె యంచు నుదితమదన
ఆ. హతి విమోహితాత్ముఁ డై హృదయేశ్వరిఁ, దలఁచి రాత్రు లెల్లఁ [2]దాపమునను
నిద్ర లేక వంది నిట్టూర్పు లూర్చుచు, నుండె నలుఁడు శోక ముత్కటముగ.

వ. అతనిప్రలాపంబు విని యొక్కనాఁడు జీవలుం డాత్మగతంబున. 133

క. [3]అఱపొఱడుకుఱుచ చేతులు, నెఱవశరీరంబుఁ గలిగి యొరులకుఁ జూడం
గొఱగా కుండియు మన్మథు, [4]నెఱపులఁ బడియెడు నితండు [5]యువతీప్రీతిన్.

వ. వీనిచేతఁ దలంపంబడియెడువనిత వీనికంటె లెస్సది గాకున్నె యనుచు బాహుకు నొద్దకు వచ్చి నీతలంచుచున్నభార్యకు నీకు నేల వియోగం బయ్యె నని యడిగిన బాహుకుం డి ట్లనియె. 135

ఆ. నన్నుఁ జూచి నగరె నలినాక్షు [6]లేనేడ, విప్రయోగ మేడ వినవె తొల్లి
యేలయో యెఱుంగ నేను మందప్రజ్ఞుఁ, డనుభటుండు దనలోఁ దాంగిఁ బాసి. 136

వ. దాని నన్వేషించి యెందునుం గానక ప్రలాపించినం దత్ప్రలాపం బేను ననుకరించితి నని చెప్పి యి ట్లయోధ్యాపురంబున బాహుకనామంబుతో నలుం డుండె నంత

---

1. గ. జ. నూతవృత్తి. 2. ఘ. దాపసమున. 3. గ. అఱగొఱలు; జ. అఱదొడలు. 4. క. గ. నొఱపుల. 5. అ. యువతీప్రియుఁ డై. 6. 'లేనేల, విప్రయోగ మేల' అని పెక్కుప్రతుల' 'ఏడ'కు మాఱు 'ఏల' యని కనుపట్టెడిని.

నిట విదర్భేశ్వరుండు నలురాజ్యభ్రంశంబు విని కూఁతురు నల్లుండు నెట వోయిరో యెం దున్నవారో యని శోకించి. 137

క. వారల రోయఁగఁ బంచె న, పారబలుం డిష్టు లైనబ్రాహ్మణుల సదా
చారుల విద్వాంసుల స, త్కారంబులఁ దనిపి వారిఁ గడు నెయ్యమునన్. 138

వ. మఱియు నలదమయంతు లున్నచో టెఱింగి వచ్చినవారికి వేయిగద్యాణంబు లిత్తు ననియు వారలం దోడ్కొని వచ్చినవారికి గోసహస్రంబులు నగ్రహారంబులు నిత్తు ననియుఁ బలికి పంచిన. 139

చేదిపురంబున సుదేవుఁ డనుబ్రాహ్మణుఁడు దమయంతి నెఱుంగుట.

క. జగతీచక్రమునం గల, నగర మహాగ్రామ పక్కణంబులు గలయన్
జగతీదేవోత్తము లి, మ్ముగ రోసిరి నిఖిలదేశసీముల కరిగి వడిన్. 140

వ. అందు సుదేవుం డనుబ్రాహ్మణుండు చేదిపతి యైనసుబాహుపురంబునకుం జని పుణ్యాహంబు సేయింపం బోవుబ్రాహ్మణులతో రాజగృహంబు సొచ్చి యంతఃపురంబున సునందాసహిత యై యున్నదాని ధూమజాల[1]నిబద్ధం బైనయగ్నిప్రభయునుంబోలె నీలాభ్ర[2]సంవృతం బైనచంద్రరేఖయునుంబోలె బహుపంక[3]నిమగ్నం బైనమృణాళియునుంబోలె నేర్పడ కున్నను దదీయభ్రూయుగమధ్యగతం బైనసూక్ష్మలక్షణం బిమ్ముగా నిరీక్షించి దాని దమయంతిఁగా నెఱింగి యాత్మగతంబున నిది పతివియుక్త యై శుష్కప్రవాహ యైననదియునుంబోలె శూన్యకమల యైననళినియుంబోలె [4]నపేతభూజం బైనవనభూమియుంబోలె నొప్ప కుండియుఁ దనపతివ్రతాగుణంబున నొప్పుచున్నయది. 141

తే. అనపహార్యంబు తేజోమయంబు సర్వ, గుణములకు నలంకారంబు గురుతరంబు
భామలకుఁ బతిభక్తియ పరమ మైన, భూషణం బిట్టివే పెఱభూషణములు. 142

వ. రోహిణికిఁ జంద్రసమాగమంబునుంబోలె దీనికి భర్తృసమాగమం బెన్నం డయ్యెడునో తుల్యశీలవయోరూపాభిజాత్యు లైననలదమయంతు లొక్కట నుండం జూచి విదర్భేశ్వరుం డెన్నండు కృతార్థుం డయ్యెడునో యనుచు నల్లనల్లన దమయంతి కి ట్లనియె. 143

తే. అవ్వ నీతల్లిదండ్రుల కాత్మజులకు, బంధుజనులకుఁ గుశలంబు భామ నీదు
కుశల మెఱుఁగునంతకు వంతఁ గూరి వగచు, చున్నవారు వారికి వంత యుడుగు నింక.

వ. దేవీ యేను భవద్భ్రాతృసఖుండ సుదేవుం డనుబ్రాహ్మణుండ విదర్భేశ్వరుండు నీయున్నచో టెఱుంగం బెక్కండ్రు బ్రాహ్మణులం బుచ్చిన నిందులకు వచ్చి నా పుణ్యంబున నిన్నుం గంటి ననిన దమయంతి వాని నెఱింగి తనపుత్త్రులఁ దల్లిదండ్రుల బాంధవులం బ్రత్యేకంబ యడిగి యశ్రుజలంబు లురుల నేడ్చుచున్నఁ

1. గ. జ. నిబద్ధ యైన. 2. క. సంవృత యైన. 3. క. గ. నిమగ్న యైన. 4. గ. జ. నపేతచూతం బైన వనంబునుంబోలె.

జూచి యేలొకో యిప్పుడు సైరంధ్రి యేడ్చుచున్నయది యని సునంద తనజన
నికిం జెప్పి పుచ్చిన. 145

క. చనుదెంచె నంతిపురమున, వనితానివహంబుతోడ వారిజదళలో
చన రాజమాత నృపనం, దన యగుదమయంతికడకు దద్దయు వేడ్కన్. 146

వ. ఇట్లు వచ్చి తమలో మాటలాడుచున్న బ్రాహ్మణుని దమయంతిం జూచి రాజ
మాత బ్రాహ్మణుని కిట్లనియె నయ్యా యిది యెవ్వనికూఁతు రెవ్వనిభార్య
యేమికారణంబునం దనభర్తను బాంధవులనుం బాసి పుణ్యవ్రతంబులు సలుపు
చున్నయది నీ వెట్లెఱింగితి కోమలినామం బేమి యని యడిగిన సుదేవుం
డిట్లనియె. 147

మధ్యాక్కర. నలినాక్షి యిది విదర్భేశుతనయ పుణ్యశ్లోకుఁడైన
నలుదేవి దమయంతి సుమ్ము విధికారణంబున రాజ్య
చలితుఁడై నిజనాథుఁ డరిగినఁ దోనఁ జనియె నన్వార్త
వెలయంగ విని వారి రోయఁ బంచె భూవిభుఁడు బ్రాహ్మణుల. 148

వ. ఏ నిందులకు వచ్చి మీచేత సురక్షిత యై యున్నయిక్కోమలిం జూచి దీని
భ్రూమధ్యంబునం బద్మప్రభం బై విభూత్యర్థంబుగా విధాతృనిర్మితం బైనపుణ్య
లక్ష్మంబు పాంసుపటలచ్ఛన్నం బై యున్న నుపలక్షించి మారాజుపుత్త్రింగా నెఱిం
గితి ననిన సునంద శుద్ధోదకంబుల దాని భ్రూమధ్యంబు గడిగిన నది విస్పష్టం
బగుడు నందఱు నాశ్చర్యం బంది రంత. 149

సీ. ఆనందభరితాత్మ యై రాజమాత య, క్కమలాక్షిఁ బ్రీతితోఁ గౌఁగిలించి
కొని తల్లి నీవు నాకూఁతుర వేను నీ, జననియుఁ బేర్మి దశార్ణరాజ
తనయల మదియు వైదర్భేశుసతి యయ్యె, నే వీరబాహున కింతి నైతి
ననిన నయ్యవ్వకు నతివినయంబుతో, నలుదేవి మ్రొక్కి సునంద నెత్తి

ఆ. కొని కరంబు నెమ్మిఁ గొన్నిదినంబు లం, దుండి యిట్టు లనియె నొక్కనాఁడు
దేవి యిదియు నదియుఁ ధృతి నాకుఁ బుట్టిన,యిడ్డ కడుసుఖంబ యిందు నందు.

వ. అయినను దల్లిదండ్రుల ననుజుల నాత్మజులం జూడ వేడుక యైనది విదర్భకుం
బోయెద నాన తిమ్మని కృతాంజలి యైనదమయంతి నతిస్నేహంబున సుబాహు
జనని సుతప్రేషితబలంబుతో సువర్ణమణిమయవిమానోపమానయానంబున నునిచి
పుచ్చిన. 151

దమయంతి నలు నెడఁబాసి విదర్భాపురంబు సేరుట.

ఉ. భామ విదర్భ కేఁగి తనబంధుజనంబులయొద్ద నుండియుం
గోమలి దేహసౌఖ్యములఁ గోరక వెలి యై మలినార్ధవస్త్రముం
భూమిరజంబు నంగమునఁ బొల్పగు చుండఁగ నుండె జీవిత
స్వామి [1]నలేశుఁ జూచుదివసంబుల గోరుచు సువ్రతంబుతోన్, 152

వ. ఇట్లు భర్తృవియోగాతుర యై దమయంతి ప్రాణంబు ధరియింప నోపక యొక్క-
నాఁ డేకాంతంబునఁ దనజనని కి ట్లనియె. 153

క. శోకాపనోదిఁ బుణ్య, శ్లోకుని నలు రోయఁ బనుపు శుభచరితుఁ దదా
లోకనవిహీన నై పర, లోకకృతావాస నగుదు లోకం బెఱుఁగన్. 154

వ. అనిన నదియును గూఁతునభిప్రాయంబు భీమున కెఱింగించిన నాతండు నలుమా
ర్గణంబున ఋజుమార్గు లయినబ్రాహ్మణుల నియోగించినం దనపతి నన్వేషింప నరుగు
బ్రాహ్మణులకు దమయంతి యి ట్లనియె. 155

ఆ. నైషధేశ్వరుండు నలుఁ డిప్డు డసమర్థుఁ, డగుటఁ జేసి తన్ను నన్య లెఱుఁగ
కుండ నుండుఁ గాన [2]యును సభాంతరముల, [3]కరిగి యిట్టు లనుడు వరుస మీరు.

సీ. [4]నిత్యసత్యుండవు నీసతి వంచించి, దానివస్త్రార్ధంబు దఱిగి నీకుఁ
బరిధానముగఁ జేసి పాడియే పోవంగ, భార్య భర్తవ్య నాఁ బరఁగుధర్మ
మది మిథ్య యయ్యె నీయందు నీ కిట్టి, నిర్దయబుద్ధిఁ జేకొనఁ దగునె యట్టి
సాధ్వికిఁ గరుణఁ బ్రసన్నుండ వగు మని, యెల్లచోఁ బలికిన నెవ్వఁ డేనిఁ

ఆ. బలుకు వడఁగ నోడి ప్రతివచనం బిచ్చు, నతఁడు నలుఁడు గాఁ బ్రియంబుతోడ
నెఱిఁగి నన్ను నతని కెఱిఁగించి తోడ్కొని, రండు రానినాఁడు రం డెఱింగి.

వ. అని పంచినం బని పూని బ్రాహ్మణులు దమయంతి కఱపినపలుకు లెల్లసభలం
బలికి యెందునుం గానక వచ్చి రందుఁ బర్ణాదుం డనుబ్రాహ్మణుండు దమయంతి
కి ట్లనియె నే నయోధ్య కరిగి నీకఱపినపలుకు లెల్ల ఋతుపర్ణుసభం బలికిన
నొక్క-పురుషుండు కుఱుచచేతులవాఁడు ఋతుపర్ణు[5]నొద్ద నూఱుగద్యాణంబుల
జీవితంబువాఁడు శీఘ్రయానకుశలుండు సూదక్రియానిపుణుండు విరూపాంగుండు
బాహుకుం డనునశ్వశిక్షకుండు విని నన్ను నేకతంబ కనుంగొని వెలువెల నగుచు
దీర్ఘనిశ్వాసపురస్సరుం డై యి ట్లనియె. 158

ఆ. పురుషునందు దోషపుంజంబు గలిగిన, నెఱిఁగి యెక సహించు నేని భార్య
పురుషునం దభీష్టభోగంబు దేహాంత, రంబునందు ధర్మరతియుఁ బడయు 159

వ. అని యొం డెద్దియుం బలుకక తననివాసంబునకుం బోయె నని చెప్పిన విని పెద్ద
యుం బ్రొద్దు చింతించి నలుండు గానివాఁడు ప్రతివచనం బేల యిచ్చు నింకను
వలను గలవారలం బంచి యాతని నిమ్ముగా నెఱుంగ వలయు నని నిజజనని
యనుమతంబున సుదేవు రావించి వాని కి ట్లనియె. 160

క. స న్నెఱిఁగి తెచ్చినట్ల జగన్నుతు నలు నెఱిఁగి తెమ్ము కౌశలమున వి
[6]ద్వన్నుత సర్వసుగుణాసం, పన్నుండవు నీవ బుద్ధిఁ బరికింపంగన్. 161

1. క. నిజేశు. 2. అ. యీరు. 3. గ. కరిగి యరిగి యిట్టు, లనుఁడు మీరు. 4. జ. సత్యనిత్యుం డవు ♦ సతి నిట్లు. 5. ఖ. నందు...జీవితం బేలువాఁడు. 6. గ. ద్వన్నాథ సర్వగుణ.

క. అరుగు మయోధ్యకు దేశాం, తరవిప్రుఁడ వై రవిప్రతాపోన్నతు న
త్తరకోసలేశు భాంగా, సరినిం గను మనఘు నమరసము ఋతుపర్ణున్. 162

వ. మఱి విదర్భావిభుం డగుభీముండు నలు రోయం బంచి యెందునుం గానక యింకను దమయంతికిఁ బునస్స్వయంవరంబు రచియింపం బోయిన నందులకు భూవలయం బునం గలరాజు లెల్లను బోయెద రని యతిత్వరితంబుగా ఋతుపర్ణునకుం జెప్పు మని పంచిన సుదేవుం డయోధ్యానగరంబునకుం బోయి ఋతుపర్ణుం గాంచి విదర్భాపురంబున దమయంతీస్వయంవరం బెల్లియో యెల్లుండియో యయ్యెడు నని చెప్పిన విని ఋతుపర్ణుండు బాహుకుం జూచి నాకు దమయంతీస్వయంవరంబుఁ జూడ నొక్కనాఁటన విదర్భకుం బో వలయు నీయశ్వనైపుణ్యంబుఁ బ్రకాశింపు మనిన నట్ల చేయుదు నని నలుండు దనమనంబున దుఃఖించి. 163

ఆ. అడవిఁ దన్నుఁ బాసి యరిగిన నలిగి కా, కున్నె యిట్లు సేయ నువిద గడఁగె
నెట్లయేనిఁ గూర్తు రింతులు మా కని, విశ్వసించువారు వెడఁగు లెందు. 164

ఆ. సాధ్వి నాకుఁ గూర్చు సంతతి గలయది, చెలువ యిట్టు లేల చేయు నైన
నెఱుఁగ వలయు దీని నే ఋతుపర్ణుతోఁ, బోదు నని నలుండు బుద్ధిఁ దలఁచి.

వ. తొల్లి వార్ష్ణేయుండు దెచ్చినతనరథంబునందు నిజహయంబుల నాలక్ష్యమాణ శుభలక్షణంబులు మనోవాయువేగంబులు నైనవానిం బూన్చికొని వచ్చిన ఋతుపర్ణుం డారథం బెక్కినపుడు హయంబులు మ్రొగ్గినం జూచి యిప్పేదగుఱ్ఱంబు లతిదూరం బెట్లు పోవ నోపు నొండుగుఱ్ఱంబులం బూన్పు మనిన బాహుకుం డి ట్లనియె. 166

క. అవనీశ యీహయంబులు, పవనగతిం బఱచుఁ బ్రొద్దు వడ కుండఁగ నేఁ
డ విదర్భకు నవుడు విని, కువలయపతి మెచ్చి బాహుకున కి ట్లనియెన్. 167

వ. అట్లయిన నీహయతత్త్వకౌశలం బెఱింగి నీకు నభిమతం బొనరింతు నని రథం బెక్కి బాహుకవార్ష్ణేయసహితుం డయి యరుగువాఁడు. 168

మధ్యాక్కర. ఎదురను దవ్వులఁ జూచినపొడవు లెల్లఁ దత్క్షణమ
కదియఁగా నవ్వి యెంతయును దవ్వయి కనఁబడఁ బెఱుఁద
నిది దినేశ్వరురథమో యనూరుఁడో యితఁ డంచు నపుడు
హృదయమునను గడు విస్మయం బందె నిక్ష్వాకుకులుఁడు. 169

వ. వార్ష్ణేయుండును బాహుకురథంబు గడపునేర్పున కచ్చెరువడి యాత్మగతంబున. 170

క. ఈతండు శాలిహోత్రుఁడో, మాతలియో నలుఁడో యొరులు మానవులు జవో
పేతముగ నిట్లు రథహయ, నీతి యెఱుంగుదురె ధారుణీవలయమునన్. 171

వ. వయోవిద్యావైభవంబుల నితండు నలుం బోలియు వికృతరూపధరుం డయిన కారణం బేమియొ మహాపురుషులు దేవయుక్తు లై ప్రచ్ఛన్నవృత్తి నుండుదురు

వారి నెఱుంగం బోలునె యనుచుఁ జనునప్పుడు ఋతుపర్ణుండు దనయుత్తరీయంబు జాఱి భూతలంబుపయిం బడిన మలంగి చూచి బాహుకా వార్ష్ణేయుండు వోయి యుత్తరీయంబు దెచ్చునంతకు రథగమనం బించుక మందంబు సేయు మనిన బాహుకుండు నగి నీయుత్తరీయంబు వడినయెడ యిచ్చోటికి నొక్కయోజనంబు గలదు దాని వార్ష్ణేయుం డెట్లు దే నేర్చు నని రథగమనవేగమాహాత్మ్యంబు సెప్పుచు ననేకదేశంబులు గడచి చని యొక్కయెడ నగణ్యపర్ణఫలశాఖాలంకృతం బయినవిభీతకవృక్షంబు గని రంత ఋతుపర్ణుండు బాహుకున కి ట్లనియె. 172

ఆ. ఎల్లవారు నెఱుఁగ రెల్లవానిని భిన్న, విషయు లెల్లవారు విద్యలందుఁ
దొలఁగ కే నెఱుంగుదును దృష్టిమాత్రన, సకల మైనవస్తుచయముసంఖ్య. 173

వ. ఇవ్విభీతకంబున ఫలపర్ణసముదాయసంఖ్యఁ జెప్పెద విను మీరెండుశాఖలంగలపర్ణఫలంబులు పదివేలు నొక్కండు దక్కినశాఖలం గలయవి రెండువేలుం దొంబదే ననిన బాహుకుండు విని వీని నెన్ని కాని నిశ్చయింప నేర నని తనరథంబు నిలిపి యావృక్షం బాక్షణంబ యురులం ద్రోచి యవ్వైశాఖలం గలయాకులుం బండులు నెన్నిన ఋతుపర్ణుండు సెప్పినయన్ని యయిన నచ్చెరువడి యివ్విద్య నాకు నుపదేశింప వలయు నని యడిగిన ఋతుపర్ణుం డి ట్లనియె. 174

క. ఇది యక్షహృదయ మనఁగా, విదితం బగువిద్య దీని విధ్యుక్తముగా
మది నెఱుఁగునరుఁడు సంఖ్యా, విదుఁ డగు దుష్కృతకళంకవిషముక్తుఁ డగున్.

చ. సకలగుణప్రసిద్ధుఁ డగు సర్వహితుం డగుఁ జూవె యంచు బా
హుకునకుఁ బ్రీతితోడ విధియుక్తముగా నుపదేశ మిచ్చె న
త్యకుటిలబుద్ధి నక్షహృదయంబుఁ గరంబు రయంబుతో విద
ర్భకుఁ జనువేడ్కఁ జేసి ఋతుపర్ణుఁడు పూర్ణమనఃప్రసన్నుఁ డై. 176

వ. ఇట్లు నలుండు ఋతుపర్ణువలన నక్షహృదయంబు వడసి సంతుష్టుం డై నీకు నశ్వహృదయం బిచ్చెదఁ బరిగ్రహింపు మనిన ఋతుపర్ణుం డట్ల చేయుదు నది యుంతకు నీయంద యుండ నిమ్ము నావలసినప్పుడు గొందు ననియె నంత నయ్యక్షహృదయసామర్థ్యంబున నప్పుడు. 177

నలుండు గలిచేత విముక్తుం డయి విదర్భకుఁ బోవుట.

క. నలుఁ దొల్లి యాక్రమించిన, కలి కర్కోటకవిషంబు గ్రక్కుచు నొడలన్
వెలువడి నలునకు విహితాం, జలి యై తన్నెఱుఁగఁ జెప్పెఁ జంచలుఁ డగుచున్.

ఆ. వానిఁ జూచి నలుఁడు దా నల్గి శాప మీ, నున్నఁ గలి యెఱింగి నిన్నుఁ బొంది
యహివిషంబుచేత ననిశంబు దగ్ధుండ, నైతి నింక నాకు [1]నలుగ వలదు. 179

వ. నిన్నుం గీర్తించినజనంబులు నావలనిభయంబుఁ బొందరు నాకుం గరుణింపు మనిన

1. క. నై సహింపు.

నలుండు గోపం బుడిగెఁ గలియు నవ్విభీతకవృక్షంబు నాశ్రయించె నది మొద
లుగా విభీతకం బప్రశస్తం బయ్యె నట్లు నలుండు వికృతరూపమాత్రంబు దక్కఁ
దక్కినదుష్కృతంబులవలన విముక్తుం డై రథం బెక్కి యతివేగంబున ఋతుపర్ణ
వార్ష్ణేయసహితుం డై విదర్భకుం జనియె నంత నపరాహ్ణంబున. 180

క. మానుగ ఋతుపర్ణుఁడు భీ, మానుజ్ఞాతుఁ డయి చొచ్చె నాప్రోలు రథ
ధ్వానంబు మ్రోయు చుండఁగ, నానాదిఙ్ముఖములను ఘనధ్వనిపోలెన్. 181

సీ. దమయంతి యారథధ్వని విని యిది నలు, రథఘోష మని యనురాగ మొంది
నలు నిషధేశుఁ బుణ్యశ్లోకు లోకోప, కారకుఁ జూడంగఁ గంటి ననుచు
ఘనభుజుఁ జూడంగఁ గాననినాఁడు ద, ద్భుజపరిరంభణోద్భూతసుఖముఁ
బడయనినాఁడును బ్రాణముల్ విడుతు నే, నని తలంచుచుఁ గమలాయతాక్షి

ఆ. యారథాధిరూఢుఁ డై వచ్చు ఋతుపర్ణుఁ, జూచి యప్పు డధికశోకతప్త
యగుచు నుండె నంత నాఋతుపర్ణుండు, భీముఁ గాన వచ్చెఁ బ్రియముతోడ.

వ. భీముండును వానిం బూజించి యొక్కరమ్యహర్మ్యంబున విడియించిన ఋతు
పర్ణుం డప్పురంబున స్వయంవరం బనుశబ్దంబు మొదలుగా వినం గానక యాత్మ
గతంబున. 183

క. ధరణిఁ గలరాజు లిట యె, వ్వరు వచ్చినవారు లేరు వైదర్భి యొరుల
వరియింప నంతధర్మే, తరచరితయె యనుచు నుండెఁ దద్దయులజ్జన్. 184

వ. బాహుకుండును రథశాల రథాశ్వంబుల బంధించి రథసమీపంబున విశ్రమించి
యుండె నంత దమయంతి బాహుకవార్ష్ణేయులతోడ వచ్చినఋతుపర్ణుం జూచి
విఫలమనోరథ యై యుండ నోపక కేశిని యనుదానిం బిలిచి ఋతుపర్ణు న
యోధ్యాపతిం గా వార్ష్ణేయు సూతపుత్త్రుంగా నెఱింగితి బాహుకుం డనువాఁ
డెవ్వండో వానియందు నాహృదయంబు ముదితం బగు చున్నయది మనపర్ణాదు
నకుఁ బ్రతివచనం బిచ్చినవాఁడు వాఁడ [1]కావలయు వానికడకుం బోయి యెఱింగి
ర మ్మని పంచిన నది పోయి బాహుకుం గని దమయంతి నీకుశలం బడుగఁ
బుత్తెంచె నిందుల కేమికారణంబున వచ్చి తనిన దానికి బాహుకుం డి ట్లనియె.

క. ప్రియమున దమయంతిపున, స్స్వయంవరము సేయఁ గడఁగి సకలక్షత్త్రా
న్వయవీరుల రావించిన, నయనిధి ఋతుపర్ణుఁ డొక్కనాఁటన వేడ్కన్. 186

క. వినవె శతయోజనంబులు, సనుదెంచె నయోధ్యనుండి సరి నిందుల కా
తనిరథసారథి నై యే, నును వచ్చితి నతనితో మనోవేగమునన్. 187

వ. అనిన నూఁడవవాఁ డెవ్వఁ డని యడిగిన నక్కేశినికి బాహుకుం డి ట్లనియె. 188

1. కావున.

క. నలురథచోదకుఁ డతఁ డ, త్యలఘుఁడు వార్ష్ణేయనాముఁ డనవుడు వాఁ డ
న్నలభూపాలకుపోయిన, నల నెం డెఱుఁగునొకొ యనిన వాఁ డిట్లనియెన్. 189

వ. వార్ష్ణేయుండును నలుపుత్త్రుల విదర్భేశ్వరునొద్దఁ బెట్టి పోయి నడుమ నలురాజ్య [1]భ్రంశంబు విని ఋతుపర్ణుం గొలిచి యుండె నాతండును నలు నెఱుంగఁడు. 190

క. నలుతో నొక్కట నరిగిన, నలినాయతనేత్ర భీమనందన యొండెన్
నలుఁ డొండె నెఱుఁగుఁగా క,న్నలు నొరులకు నెఱుఁగఁ గారణముగలదె మహిన్.

వ. అనిన విని కేశిని యి ట్లనియె. 192

సీ. అడవిలో వస్త్రార్ధహారి యై దయ లేక, ప్రాణేశ్వరుఁడు దనుఁ బాసి చనిన
నాఁటివస్త్రార్ధంబు నలినాక్షి యిప్పుడుఁ, బరిధానముగఁ బాంసుపటలమలిన
మగు చున్నతనువుతో ననయంబు జడగొన్న, యలకావలులతోడ నవనితలము
శయనంబు గా ధర్మచారిణి దమయంతి, యనఘవ్రతం బిట్టు లాచరించు

ఆ. చున్న దనిన నవిరళోద్గతబాష్పపూ, ర్ణంబు లైనలోచనంబు లెఱుక
వడక యుండ వదనపద్మంబు వాంచి తా, [2]నెందువలను సూచుచుండె నలుఁడు.

వ. కేశినియును బాహుకుపలుకులు నాకారంబును దమయంతి కెఱింగించిన నది యాతని నలుం గా శంకించి యింకను వానికడ కేఁగుము వాఁడు ఋతుపర్ణువంటలవాఁడలె పచనసమయంబున వానిచరితం బిమ్ముగా నెఱింగి రమ్మని పంచిన నప్పుడ చని కేశినియు బాహుకునందు దైవమానుషనిమిత్తాద్భుతక్రియలు సూచి వచ్చి దమయంతి కి ట్లనియె. 194

కేశిని యనుదూతి దమయంతితో నలునిగుణంబులు సెప్పుట.

క. అతనిచరితంబు సెప్పఁగ, నతిమానుష మపగతప్రయాస మదృష్ట
శ్రుతపూర్వము పరమార్థము, యతనిని వేల్పనఁగ వలయు నంబుజనేత్రా. 195

సీ. వినవమ్మ తృణముష్టిఁ గొని వాఁడు వీచుడు, నం దగ్ని యుదయించి యతనివంట
లమరునంతకు నింధనము లపేక్షింపక, యుడుగక మండుచునుండు మఱియుఁ
గడఁకతో నంజుళ్లు గడుగంగ సమకట్టి, జల మపేక్షించుడు సంభవిల్లి
కుంభముల్ నిండి దివ్యాంభఃప్రవాహ మ,క్షయ మగుచుండుఁ దత్క్షణమ చూడ

ఆ. నతసికరతలద్వయ[3]యామర్దితంబు లై, కుఁదియును మహాసుగంధకుసుమ
తతులు దొంటియట్ల తనుకంపు విడువక, యుండు నతని తేజ మున్నతంబు. 196

వ. అనిన విని దమయంతి వెండియుఁ గేశినిం బంచి బాహుకువండిననంజుళ్లు దెప్పించి యాస్వాదించి బాహుకునందు నలులక్షణంబులు గలుగు టెఱింగియు నూఱడ నోపక వానిపాలికిఁ గొడుకునుం గూఁతునుం గేశినితోడం బుచ్చిన నక్కుమారులం జూచి. 197

1. క. భ్రష్టత్వంబు. 2. క. నొండుగడయుఁ జూచు. 3. ఖ. యావమర్దితము లై.

ఆ. వశముగాక బాష్పవారి యొల్కుచునుండఁ, గొడుకుఁ గూఁతు నెత్తికొని నలుండు
హర్షపులకితంబు లయిననిజాంకంబు, లందు వారి నునిచి యాదరమున. 198

వ. అక్కేశినిం జూచి యిక్కుమారు లిద్దఱు నాకొడుకునుం గూఁతునుం బోలిన వీరి
నెత్తికొని దుఃఖించితి నని తన్నేర్పడ కుండం బలికి దాని కిట్లనియె. 199

క. నీ విట పలుమఱు వచ్చుచుఁ, బోవుచు నున్కి గని చిత్తముల నొండుగ సం
భావింతు రితరజనములు, గావున రా వలవ దింకఁ గార్యార్థిని వై. 200

వ. ఏము దేశాంతరంబుననుండి వచ్చినయతిథులము నీకు మాతోడి దేమి యనినఁ గే
శిని గ్రమ్మఱి వచ్చి బాహుకుమార్గం బంతయు దమయంతికిం జెప్పిన నది [1]సంత
సించి నిజజనని కి ట్లనియె. 201

ఉ. సందియ మేల సర్వగుణసంపదఁ జూడఁగ బాహుకుండు భూ
వందితుఁ డైననైషధుఁ డవశ్యముఁ దా నగు నామనంబు నా
నందముఁ బొందు చున్నది ఘనంబుగ వాఁ డిట వచ్చువాఁడొ యే
నందుల కేఁగుదానను [2]రయంబున నాతని నిశ్చయింపఁగన్. 202

వ. అనిన నది యప్పుడ భీముననుమతంబున దమయంతియొద్దకు బాహుకు రావించిన.

క. చనుదెంచి యందు దీనా, నన నవిరళపంకమలిన నతగాత్రఁ దప
స్విని నతికృశ దమయంతిం, గనియె నలుం డుదితబాష్పకణకలితముఖన్. 204

క. దమయంతి నలునివికృతాం, గముఁ జూచియు నతని నన్యుఁ గా వగవక నె
య్యమునను లజ్జను [3]నతిసం, భ్రమమున వివశాత్మ యగుచుఁ బతి కిట్లనియెన్.

వ. విజనం బైనవిపినంబునందు నలసి నిద్రవోయినదాని నబల నతిసాధ్వి ననువ్రత
నగ్నిసన్నిధిఁ బాణిగ్రహణవిధిలబ్ధ యైనదానిం బాసి నలున ట్లొరులు నిర్దయు లై
యరిగినవారు లేరు. 206

క. సురవరుల నరివి తన్నుఁ గ, వరియించిననన్నుఁ బుత్త్రవతి నేలొకో చె
చ్చెర విడిచె నాతనికి ని, ష్కరుణున కే నేమి యెగ్గు గావించితినో. 207

వ. నిన్ను విడువ నోడ కుండు మని పలికిన యప్పలుకు లేల మఱచెనో యని శోకత
ప్తం బైనతనహృదయంబు దడుపుచున్నదియునుంబోలె బాష్పధారలం గుచమం
డలంబు దడుపుచు నున్నదమయంతిం జూచి శోకాకులుం డై నలుం డి ట్లనియె.

తే. కలిసమావిష్టమతి నయి కష్టవృత్తి, నట్టియిడుమలఁ బడితి నే నవి మదీయ
[4]తపముబలమున నీదుఃఖదాహమునను, నష్ట మై పోయెఁ గలి యిప్డు నన్ను విడిచి.

వ. ఏ నిందులకు నీతదర్థంబ వచ్చితి నది య ట్లుండె నన్ను ననురక్తు ననువ్రతుఁ దలం
పక యన్యాపేక్షం బునస్స్వయంవరంబు రచియించుట యిది కులస్త్రీధర్మంబు
గాదు రాజుల నెల్ల నీస్వయంవరంబునకు రావించుటం జేసి కాదె ఋతుపర్ణుండు

1. గ. చింతించి. 2. న•యంబున నాపని నిశ్చయింపుమా. 3. క. భయసం. 4. గ. తపముఫల
మున నీదుఃఖ•దహనమునను, నష్ట మై పోయె నిప్పుడు • నన్ను విడిచి.

ననిన వెఱచి కృతాంజలి యై దమయంతి యిట్లనియె. 210

తే. నిన్ను రోయంగ విప్రులు నెమ్మి నరిగి, పలికి రెల్లచో నాచేతఁ [1]బలుకఁబడియ
యందుఁ బర్ణాదుఁ డనువిప్రుఁ డయ్యయోధ్య, కేఁగి ప్రతివచనంబులు నెఱిఁగె నిన్ను. 211

వ. ఆపర్ణాదువలన నిన్నెఱింగినదాన నై నిన్నిట రావించు నుపాయంబు దలంచి యెల్లి దమయంతీద్వితీయస్వయంవరం బగు నని ఋతుపర్ణునందుఁ బ్రకాశింప సుదేవుం డనుబ్రాహ్మణుం బుత్తెంచితి. 212

క. నరవరుఁడు నలుఁడు గా కె, వ్వరు శతయోజనము లొక్కవాసరమున వ
త్తురు నరు లోరు లని దీనిం, బరికింపఁగఁ గడఁగి యిట్లు పంచితి నధిపా. 213

ఉ. ఏ [2]నొకపాపభావమును నెడ్దఁ దలంపక యుండునట్లుగా
నానతవైరి నీయడుగు లంటఁగ నోపుదు నట్టి దైన న
న్నీనలినాప్తుఁ డీయనలుఁ డీమృగలాంఛనుఁ డీసురోత్తముల్
జాను సెడంగ నీక్షణమ చంపరె కోపపరీతచిత్తు లై. 214

వ. అనుచున్నయవసరంబున నఖిలభూతాంతర్గతుఁ డయినవాయుభట్టారకుం డెల్లవారలు విన నాకాశంబుననుండి నలున కిట్లనియె. 215

చ. అమలచరిత్ర నిట్లు దమయంతిఁ బతివ్రతఁ బల్కెదే నృపో
త్తమ విను దీనియందు విదితం బగుశీలవిధిన్ సుధాంశుఁడుం
గమలహితుండు నేను నయి కాచితి మొక్కట మూఁడువర్షముల్
గొమరుగ దీనిఁ జేకొనుము కోమలి నీ కనురక్త నావుడున్. 216

క. కురిసె మరుద్వచనానం, తరమున సురపుష్పవృష్టి దడయక వించెన్
సురదుందుభినాదంబులు, గరము ప్రసన్నుఁ డయి వీచె గంధవహుండున్. 217

వ. ఇట్లెల్లవారికి నాశ్చర్యంబుగా వాయుదేవుండు దన్నెఱింగించి దమయంతిపతివ్రతాగుణంబులును బతియందులయకృత్రిమానురాగంబునుం జెప్పిన విని నలుండు పరమప్రమోదపరిపూర్ణహృదయుం డై తత్క్షణంబ కర్కోటకుం దలంచి వానియిచ్చినపుట్టంబు పైఁ బెట్టికొని నిజరూపంబు దాల్చిన. 218

నలుండు నిజరూపంబుతో దమయంతిం గూడుట.

ఉ. ఆయతబాహుఁ దప్తకనకాంచితవర్ణు మనోజరూపు నిం
ద్రాయితు సూర్యతేజు నిషధప్రభు నన్నలుఁ జూచి పద్మప
త్త్రాయతనేత్ర యప్డు దమయంతి గరంబు ముదంబు నొంది ల
క్ష్మీయుత యయ్యె బంధులకు మిత్రులకున్ హృదయప్రియంబుగన్. 219

వ. ఇట్లు సంగతు లైనయయ్యిరువురకు విరహపరితాపంబుతోడన శరీరమలినత్వంబు వాసెఁ బరస్పరానురాగంబుతోడన విభూషణవిశేషయోగంబులు విలసిల్లె నంత నంతయు విని భీముండు జాతసస్య యైనవసుధ తోయసంప్రాప్తి నాప్యాయిత యైన

1. జ. బనుపఁబడిన. 2. గ. జ. నతిపాపభావమున నెగ్గఁ.

శ్రీపాదకవి సార్వభౌములు, చె. వెం. శాస్త్రి గారిని ఎత్తి... గారు వకాల్తా!

ట్లజ్ఞాతచర్యం డైనతనపతిం బడసి పరమసంతుష్టహృదయ యై చంద్రుతోఁ గూడిన రాత్రియుంబోలెఁ బతిం గూడి యొప్పు చున్నదమయంతిం జూచి సంతసిల్లి తన పురంబునం దష్టశోభనంబులు దేవగృహంబులయందు విశేషపూజలు సేయించె నట్టిమహోత్సవం బెఱింగి ఋతుపర్ణుండు నలునొద్దకు వచ్చి నీవు నిఖిలలోకపూజ్యుం డ వయ్యును నాయొద్ద బాహుకుం డనంగఁ బ్రచ్ఛన్నవృత్తి నున్న నిన్ను నెఱుంగక నీచకర్మంబులందు నియోగించితి దీని క్షమియించునది యని నలుచేత సత్కృతుం డై యశ్వహృదయోపదేశంబు గొని యయోధ్యకుం జనియె నిట నలుండును విదర్భాపురంబున నొక్కమాసంబు నివాసంబు సేసి విదర్భేశ్వరు వీడ్కొని దమయంతి నంద పెట్టి యొక్క రథంబును బదియాఱేనుంగులును నేఁబది గుఱ్ఱంబులు నాఱునూఱు కాల్బలంబులుఁ దనకుఁ దోడుగా నిషధపురంబున కరిగి పుష్కరుం గని యి ట్లనియె. 220

క. దమయంతి రోయిగా జూ, దము నీతో నాడఁ గడఁగెదను ధరణీరా
జ్యము నీవు నాకు రో యిడు, మమరఁగ జూదంబు నీకు నప్రియ మేనిన్. 221

మత్తకోకిలము. వీరభోజ్యము సుమ్ము [1]రాజ్యము వింటె నీవును నేను దు
ర్వారవృత్తి రథంబు లెక్కి యమోఘవిక్రమ మేర్పడన్
భూరివీరరణం బొనర్తము పోర నోర్చినవాఁడ యి
ద్ధారుణీతలరాజ్యసంపదఁ దాల్చు వీరగుణోన్నతిన్. 222

వ. ఈరెంటిలో నీ కెయ్యది యిష్టంబు దాని నడంగు మనినం బుష్కరుండు రణంబు నందుఁ బరాజితుండు గావున నలుం దొల్లియు జూదంబున నోడిచినవాఁ డై యింకను నోడిచి దమయంతిం జేకొని కృతార్థుండ నగుదు నని సంతసిల్లి యే నోటువడితి నేని నఖిలమహీరాజ్యంబు నీయది నీ వోటువడితేని దమయంతి నాయది యని పలికి యొడ్డి నలుతో జూద మాడి యోటువడిన. 223

క. ఘనముగ జంబూద్వీపం, బునఁ గలవా రెల్ల నెఱుఁగఁ బుష్కరుచేతం
గొనియెం బునర్ద్యూతంబున, ననఘుఁడు నలుఁ డఖిలరాజ్య మత్యున్నతితోన్.

వ. ఇట్లు జూదంబునఁ బుష్కరు నోడిచి సకలమహీరాజ్యంబును జేకొని నలుండు వాని కి ట్లనియె. 225

క. కలిసంప్రాప్తుఁడ నై కడు, బల మెఱి నీచేతఁ దొల్లి బలవద్ద్యూత
చ్ఛలజితుఁడ నైతి నది నీ, బల మని గర్వింప వలదు బలవంతుఁడ వై. 226

వ. నీవు నాపితృవ్యపుత్త్రుండవు ని న్నెద్దియుం జేయ నోడకు పొ మ్మని పుష్కరు విడిచిపుచ్చి పుష్కలం బైనరాజ్యంబుతో నలుం డున్నంత. 227

క. భీమప్రస్థాపిత యయి, కోమలి దమయంతి పుత్త్రకులుఁ దానును ల
క్ష్మీమహిమ వెలుఁగు చుండఁగఁ, దామరసదళాక్షి వచ్చెఁ దనపతికడకున్. 228

1. ౙ. 'ధారుణి.

వ. అట్లు దనమనోవల్లభ యైనదమయంతిం గూడి నలుండు విధివిహితానేకాచరితమఖుండై శతమఖవిలాసంబుతో సకలరత్నయుతం బైనరత్నగర్భాధిరాజ్యంబు సేసెం గావున నక్షజితుండ నైతి నని వగవ వలదు నీవును దైవమానుషసంపన్నుండ వయి శత్రువుల జయించి సకలమహీసామ్రాజ్యంబు వడయుదు వని బృహదశ్వుండు ధర్మజునకు నక్షహృదయం బుపదేశించి. 229

ఫలశ్రుతి

సీ. ఇన్నలోపాఖ్యాన మెప్పుడు దత్తావ, ధాను లై వినువారు దవిలి సభలఁ
జదివెడువారును జగతీశ కలిదోష, నిర్ముక్తు లగుదురు నిఖిలపుణ్య
ఫలభాగు లగుదురు బహుపుత్త్రపౌత్త్రాయు, రారోగ్యధనయుక్తు లగుదు రెల్ల
విషములకును దుష్టవిషయంబులకు దూరు, లగుదురు ధర్మాత్ము లగుదు రుర్విఁ

ఆ. గడుఁ బ్రసిద్ధ మిదియుఁ గర్కోటకుని దమ, యంతిఁ బుణ్యమూర్తి యైననలుని
నుతచరిత్రుఁ డైనఋతుపర్ణుఁ గీర్తింపఁ, గలిభయంబు లెల్లఁ గ్రాఁగు నధిప. 230

ధర్మరాజునొద్దకు నారదమహాముని వచ్చుట.

వ. అని చెప్పి బృహదశ్వుం డరిగినం బాండవులు గాండీవిరాకయ [1]కోరుచుఁ దదాలోకనప్రీతి నుండునంత నంతరిక్షం బెల్లఁ దనతేజంబున వెలుంగుచుండ నారదుండు వచ్చి యనుజసహితుం డైనధర్మరాజుచేతం బూజితుం డై యిట్లనియె.

ఆ. ధర్మపుత్త్ర నీయుదారచరిత్రకు, ధర్మమతికిఁ దృప్తతముఁడ నైతి
నడుగు మిష్ట మెద్ది యనినఁ గృతాంజలి, యై మహీశుఁ డిట్టు లనియె భక్తి.

వ. మునీంద్రా నీవు తృప్తుండ వైనం ద్రిజగంబులకుం దృప్తి యగు నిన్నుం జూచి కృతార్థుండ నైతి నా కెప్పుడు నొక్కధర్మసందేహంబు గలదు దాని నిర్ణయించి యానతీ వలయు. 233

చ. ధరణిఁ బ్రదక్షిణంబుగ ముదంబునఁ గ్రుమ్మరి తీర్థసేవనా
పరు లగుచున్నధన్యులు శుభస్థితి నెట్టిఫలంబు నొందఁ గాం
తురు బహుతీర్థకీర్తనముతో నెఱిఁగింపుము దీని నావుడున్
నరవరుఁ డైనపార్థునకు నారదుఁ డిట్లని చెప్పెఁ బ్రీతితోన్. 234

క. [2]ధీరుఁడు భీష్ముఁడు గంగా, ద్వారమునం దొల్లి పితృహితమ్ముగ శుభక
ర్మారంభుఁ డగుచు నుండెను, దారుం డధ్యయనసంతతవ్రతపరుఁ డై. 235

వ. అతనిపితృదేవతాభక్తికిఁ బరమధర్మచరితంబునకు మెచ్చి తద్దర్శనాపేక్షం బులస్త్యుం డనుమహాముని వచ్చిన నతిభక్తుం డయి యాభీష్ముం డమ్మునిఁ గుశపీఠంబున నునిచి యర్ఘ్యపాద్యాదివిధులం బూజించి యతనియడుగులు తల నిడుకొని దక్షిణజానుస్పృష్టమహీతలుం డయి యేను భీష్ముండ భవద్దాసుండ నని ముకుళిత

1. చ. జ. కోరుచుండెఁ దదాలోకనప్రీతి నంతరిక్షం. 2. ఈ కందమునకుఁ బూర్వము, 'క. వినవయ్య నీవు నను వేఁడినప్రశ్నకు నుత్తరంబు నెందంబలరన్, వినిపింతు నీకు నభిమత, మనఘా నేఁ జేయువాఁడ నధికప్రీతిన్.' అని యచ్చుప్రతిని జూపట్టెడిని గాని వ్రాఁతప్రతులఁ గానిపింపదు.

హస్తుం డయి యున్న వానికిఁ బులస్త్యుం డి ట్లనియె. 236

క. పితృదేవభక్తిఁ బుణ్య, వ్రతచర్యను నీవ యెల్లవారికి నత్యు
న్నతుఁడవు గావున నీచే, ధృతిఁ గానఁగఁ బడితి నేఁ బ్రదీపితలేశా. 237

వ. నీయిష్టంబు సెప్పు మే నమోఘదర్శనుండ ననిన భీష్ముండు ముదితహృదయుం డై
మునీంద్రా నాయందు నీకుఁ బ్రసాదబుద్ధి గలదేనిఁ జెప్పు మని. 238

క. మనుజేంద్ర నన్ను నీ యడిగినయట్ల పులస్త్యుఁ బుణ్యకీర్తను గంగా
తనయుం డడిగిన నతనికి, ననఘచరిత్రునకు నిట్టు లని ముని సెప్పెన్. 239

సీ. కడఁగి బుద్ధీంద్రియకర్మేంద్రియంబుల, యందు సంయతచిత్తు లైనవారు
ధృతి నహంకారప్రతిగ్రహాపేక్షల, యందు [1]నివృత్తాత్ము లైనవారు
నల్పభోజనులు ననారంభకులు నయ్యు, నత్యంతసంతోషు లైనవారు
సత్యవ్రతులు శుభాచారు లక్రోధను, లగుచు ధర్మాన్వితు లైనవారు

ఆ. నఖిలతీర్థశతము లాడినఫలములు, నఖిలయజ్ఞవిధుల నైనఫలముఁ
బడయుదురు విహీనభాగ్య[2]దుష్కృతులకుఁ, బరమతీర్థసేవ బడయ నగునె. 240

క. తిల గో సువర్ణ దానంబులు నుపవాసములుఁ దీర్థములసేవయు ని
మ్ములఁ జేయనివారు దరిద్రులు నిరతము నగుదు రాత్మదోషముపేర్మిన్. 241

క. క్రతుఫలములు వడయఁగ దు, ర్గతులకు దొరకొనదు తీర్థగమనంబునఁ ద
త్క్రతుఫలము లందుదురు దు,ర్గతులును నిది మునులమతము గౌరవవృషభా. 242

వ. [3]తీర్థగమనఫలంబు యజ్ఞఫలంబులకు విశేషంబు వినుము. 243

చ. సమితవిరోధి పుష్కర మనంగ జగద్విదితంబు పుణ్యతీ
ర్థము మునిసిద్ధసేవ్యము ముదంబున నందుఁ బయోజసంభవుం
డమరులతోడ సన్నిహితుఁ డై వసియించుఁ ద్రిపుష్కరంబులున్
సమములు వాని నెప్పుడును [4]సంస్మృతి సేసినఁ బాయుఁ బాపముల్. 244

క. పదివేలకోట్లతీర్థము, లుదితము లై పుష్కరముల నుండు మునీంద్ర
త్రిదశవరు లందుఁ జేసిరి, మదిఁ గృతకృత్యు లయి తపము మఖములుఁ బ్రీతిన్.

వ. అందుఁ గృతస్నాను లై దేవర్షిపితృతర్పణంబులు సేసినవారు దశాశ్వమేధఫలం
బులు వడయుదురు కార్తికమాసంబున నొక్కదివసంబు పుష్కరసేవ సేయుటయు
నొకయేఁ డగ్నిహోత్రంబు వేల్చుటయు సమంబు. 246

క. అమరవరులందుఁ బురుషో, త్తముఁ డెట్లు విశేషుఁ డట్ల ధరణిం గలతీ
ర్థములందుఁ బుష్కరత్రిత, యము గరమువిశేష మభిమతార్థప్రద మై. 247

వ. పుష్కరంబునఁ బదియేండ్లు వసియించినవారికి సర్వక్రతుఫలంబును బ్రహ్మలోక
ప్రాప్తియు నగు మఱియు జంబూమార్గంబుఁ దండూలికాశ్రమం బగస్త్యసరం

1. జ. నప్రీతాత్మ. 2. క. దుఃఖితులకు. 3. క. తీర్థగమనంబు పుణ్యంబులకు విశేషంబు. 4. క. సన్నుతి; జ. సంస్తుతి.

బనుతీర్థంబు లాడి యశ్వమేధఫలంబు వడయుదురు కణ్వాశ్రమంబును ధర్మారణ్యం
బును యయాతిపతనంబును జూచిన సర్వపాపక్షయం బగు మహాకాళంబును
గోటితీర్థంబును నశ్వమేధఫలప్రదంబులు రుద్రవటం బనురుద్రస్థానంబున రుద్రుం
బూజ సేసి గణపతిత్వంబు వడయుదురు నర్మదాస్నానంబున దక్షిణసింధుస్నానంబు
నం జర్మణ్వతీతీర్థస్నానంబున నగ్నిష్టోమఫలంబు లగు. 248

క. అనవద్య వసిష్ఠాశ్రమ,మున నొకదివసంబు శాకమూలాశను లై
జను లుండి పడయుదురు బహు,ధనసంపద గోసహస్రదానఫలంబుల్. 249

వ. మఱి పింగళం బనుతీర్థంబు సేవించి శతకపిలగోదానఫలంబు వడయుదు రెందేని న
గ్నిదేవుండు ప్రత్యక్షుం డై యుండు నట్టిప్రభాసతీర్థం బాడి యగ్నిష్టోమాతిరాత్ర
ఫలంబు వడయుదురు దుర్వాసునకు విష్ణుదేవుండు వరం బిచ్చుటం జేసి వరదానం
బనం బరఁగినతీర్థం బాడియు సరస్వతీసాగరసంగమం బాడియు గోసహస్రదాన
ఫలంబు వడయుదురు. 250

క. ద్వారవతీపురమునఁ [1]బిం,డారక మనుతీర్థమున బెడం గై ముద్రా
కారంబు లై త్రిశూలా,కారము లై పంకజములు గానంగఁ బడున్. 251

వ. అందుఁ బరమేశ్వరుం బూజించి పాపవిముక్తు లగుదురు సాగరసింధుసంగమస్నా
తు లైనవారు నాకలోకగతు లగుదురు శంకుకర్ణేశ్వరంబున నీశ్వరుం బూజించి
దశాశ్వమేధఫలప్రాప్తు లగుదురు వసుద్వారంబును వసుసరంబు ననుతీర్థంబు లాడి
వసుప్రాప్తు లగుదురు సింధూత్తమస్నానంబున బహుసువర్ణదానఫలం బగు బ్రహ్మ
తుంగసేవనంబున బ్రహ్మలోకప్రాప్తి యగు శక్రకుమారీవిలోకనంబున శక్రలోక
గతి యగు శ్రీకుంజరంబునం బితామహునకు నమస్కరించియు సౌవర్ణరాజతం
బు లైనమత్స్యంబులు గల[2]విమలం బనుతీర్థం బాడియు వాసవసాయుజ్యంబు వడ
యుదురు మలహారం బనుతీర్థంబున నగ్నిదేవునకు నర్ఘ్యం బిచ్చిన నది యక్షయం బై
పితృదేవతలకుఁ దృప్తిఁ జేయు గోసహస్రదానంబునకు నశ్వమేధసహస్రంబునకు
విశేషంబు. 252

క. దేవిక యనుతీర్థంబున, దేవసమూహంబుతోడఁ ద్రిణయనుఁ డుండున్
సేవిత మై జనులకు నది, గావించు ననూనధర్మకామార్థంబుల్. 253

వ. అర్ధయోజనవిస్తృతం బై పంచయోజనాయామం బైనయద్దేవికానదియును గామా
ఖ్యంబును రుద్రతీర్థంబును యజనయాజనబ్రహ్మవాలుకంబులును బ్రహ్మాదిదేవతల
దీర్ఘసత్త్రస్థానం బైనదీర్ఘసత్త్రస్థానంబును సేవించినవారికి నిష్టసిద్ధి యగు వినశ
నం బనుతీర్థంబున నదృశ్యం బై మేరువునకుం బోవునెడ నాగోద్భేదశివోద్భేద
చమసోద్భేదంబుల నెందేని సరస్వతి గానంబడియె నట్టిసరస్వతియందు నభిషిక్తు లై
నవారు నాగలోకంబు వడయుదురు [3]శశరూపపుష్కరంబులు గలశశయానం బను

1. క. బృం, దార...ము•దంబున. 2. క. గ. కపిలం. 3. క. రసరూప...రసపానం బను.

తీర్థంబున స్నానంబును గోసహస్రదానంబును సమంబు. 254

మధ్యాక్కర. ఏ మేము మున్ను పూజింపుదుము రుద్రుఁ నిం దని వేడ్క
త్రో మునికోటి దా రున్న నీశుఁ డంతోఁ దొలఁకును బ్రీతి
గా మతిలోఁ గోటిరుద్రరూపముల్ ఁ గావించె నదియు
భూమిఁ బ్రసిద్ధమై రుద్రకోటి నాఁ ఁ బొలిచి వెలింగె. 255

వ. అందు రుద్రుఁ బూజ సేసి రుద్రలోకప్రాప్తు లగుదురు. 256

క. నరనుత నైమిశమునఁ బు, ష్కరముల మూఁటను జగత్ప్రకాశిత మై యి
ద్ధరణిఁ గురుక్షేత్రము దు, స్తరదురితౌఘముల కెల్లఁ దవ్వగు చుండున్. 257

తే. అమరలోకనివాసులఁ యంద్రు విబుధు, లాకురుక్షేత్రవాసులఁ నదియు వినఁగ
నుత్తమంబు దృషద్వతిఁ యుత్తరమునఁ, దపనతేజ సరస్వతిఁ దక్షిణమున. 258

వ. అక్కురుక్షేత్రశమంతపంచకంబులనడుమ రామహ్రదంబునడుమఁ బితామహు
నుత్తరవేది యనంబడు నట్టికురుక్షేత్రంబు మెట్టినవారికిఁ గురుక్షేత్రంబునకుం
బోయెద మనినవారికిఁ గురుక్షేత్రంబున వసియించెద మని తలంచినవారికి సర్వ
పాపక్షయం బగుఁ దదనంతరంబున విష్ణుస్థానంబున విష్ణువు నర్చించిన నశ్వమేధ
ఫలం బగుఁ బారిప్లవం బనుతీర్థ మాడి యగ్నిష్టోమఫలంబు వడయుదురు పృథివీ
తీర్థం బాడిన గోసహస్రదానఫలం బగు శాలూకిని యనుతీర్థం బాడిన దశాశ్వమే
ధం బాడిన గోసహస్రదానఫలంబ యగు సర్పితీర్థం బాడి యందుఁ దరంతకుం డను
ద్వారపాలకునిం జూచినవారి కిష్టసిద్ధి యగు నెందేని విష్ణుం డాదివరాహం బయ్యె
నట్టివరాహతీర్థం బాడినవారికి నగ్నిష్టోమఫలం బగు నశ్వినీతీర్థం బాడిన రూప
వంతు లగుదురు జయంతియందు సోమతీర్థస్నానంబును గృతశౌచతీర్థస్నానంబును
రాజసూయపౌండరీకసమంబు లగ్నివటంబున [1]ముంజవటంబున నీశ్వరుం బూజించి
గాణపత్యంబు వడయుదురు (యక్షిణీతీర్థ మాడి యిష్టఫలంబులు వడయుదురు)
కురుక్షేత్రద్వారంబుఁ బ్రదక్షిణంబు సేసినం బాపక్షయం బగు. 259

క. పేరుండు క్షత్రియులఁ దన, దారుణపరశువున జామదగ్న్యుఁడు రౌద్రా
కారుఁడు వధియించి తదీ, యారుణమున నేనుమడువుఁ లాపాదించెన్. 260

వ. అందుఁ బితృతర్పణంబు సేసినం బితృదేవత లాతనికిం బ్రత్యక్షం బయి నీ కిష్టం
బైనవరంబు వేఁడు మనినఁ బరశురాముండు వారల కిట్లనియె. 261

తే. క్షత్రవధ నైనపాపంబుఁ గాఁగ వలయుఁ, గడఁగి నాకును సద్గతిఁ గలుగ వలయు
నివియుఁ బుణ్యతీర్థంబులైఁ యిద్ధరిత్రిఁ, బరఁగుచుండంగ వలయు మీకరుణఁ జేసి. 262

వ. అని పితృదేవతలవరంబునం బుణ్యతీర్థంబులఁ జేసె నట్టిరామహ్రదంబు లాడినవా
రికి నశ్వమేధఫలం బగుఁ గాయశౌచం బనుతీర్థం బాడి కాయశుద్ధు లగుదు రెం

1. క. బంచవటంబున...యిష్టవరంబులు వడయుదురు.

దేని విష్ణుదేవుండు లోకంబుల నుద్ధరించె నట్టిలోకోద్ధారం బను తీర్థం బాడి కులం బుద్ధరింతురు శ్రీతీర్థం బాడి శ్రీమంతు లగుదురు కపిలాతీర్థం బాడి కపిలగోసహస్రదానఫలంబుఁ బడయుదురు సూర్యతీర్థం బాడి యం దుపవసించిన సూర్యలోకప్రాప్తు లగుదురు గోభవనం బనుతీర్థంబాడి గోసహస్రసమృద్ధు లగుదురు [1]శంఖినీతీర్థం బాడి యుత్తమరూపంబు నడయుదురు యక్షేంద్రతీర్థం బాడి తరండకుం డనుద్వారపాలకుం జూచినవారు సరస్వతీస్నాతు లైనవారలు నగ్నిష్టోమఫలంబు వడయుదురు మాతృతీర్థదర్శనంబునం బ్రజావృద్ధి యగు బ్రహ్మావర్తంబును శరవణంబునుం జూచిన సర్వవ్యాధివిముక్తు లగుదురు (శ్వావిల్లో)మాపహం బనుతీర్థంబునం దేకాదశతీర్థంబులు గల వందుఁ బ్రాణాయామంబు సేసినవిప్రులకు స్వలోమాపనయనం బగు నెఱుకుచేత నేయంబడి కృష్ణమృగంబు లెందేని నొక్కతీర్థంబు సొచ్చి మానుషత్వంబు వడసె నట్టిమానుషతీర్థం బాడి సర్వదురితవిముక్తు లై దేవత్వంబు వడయుదురు దానితూర్పున నొక్కయిరవున నాపగ యనుమహానదిం బితృతర్పణంబు సేసి పితృదేవోద్దేశంబున నొక్కబ్రాహ్మణునకుం గుడువం బెట్టినఁ గోటిబ్రాహ్మణులు గుడిచినఫలం బగుఁ బితృదేవతలు దృప్తియు నొందుదురు బ్రహ్మోదుంబరంబు సప్తర్షికుండంబుఁ గేదారంబునుం జూచి బ్రహ్మలోకంబు వడయుదురు కపిలకేదారంబుఁ జూచి పాపవిముక్తు లై యదృశ్యు లగుదురు సరకం బనుతీర్థం బాడి కృష్ణచతుర్దశినాఁ డీశ్వరుం బూజించి యెల్లకోర్కులం బడయుదురు మూఁడుకోట్లకూపహ్రదంబులు గలయిలాస్పదం బనుతీర్థం బాడి పితృతర్పణంబులు సేసినవారికి వాజపేయఫలం బగుఁ గిందానకింజప్యంబు లనుతీర్థంబులందుఁ జేసినదానజపంబు లక్షయంబు లగు నారదతీర్థంబైనయంబాజన్మంబునందుఁ బ్రాణత్యాగంబు సేసినవారు సర్వలోకంబులం బడయుదురు శుక్లదశమిం బుండరీకం బనుతీర్థం బాడి పౌండరీకఫలంబు వడయుదు రందు వైతరణీస్నాతు లై రుద్రునకు నమస్కరించి సర్వపాపవిముక్తు లగుదు రెందేని దేవత లనేకసహస్రవర్షంబులు దపంబుసేసి రట్టిఫలకీవనం బనుతీర్థం బాడి యగ్నిష్టోమాతిరాత్రఫలంబులు వడయుదురు ద్వైపాయనుం డనేకతీర్థంబులు మిశ్రీకరించుటం జేసి మిశ్రకం బనం బరఁగినతీర్థం బాడినవారికి సర్వతీర్థస్నానఫలం బగు వ్యాసవనంబును మనోజవంబును మధువటియు ననుతీర్థంబుల నాడిన గోసహస్రదానఫలంబు వడయుదురు కౌశికీదృషద్వతీసంగమంబున స్నాతు లై సర్వపాపవిముక్తు లగుదురు కిందత్తంబునఁ దిలప్రస్థదానంబు సేసి పితరులఋణంబు సీఁగుదు రహస్సుదినతీర్థంబుల నాడి సూర్యలోకప్రాప్తు లగుదురు మృగధూమంబున గంగాస్నాతు లై మహాదేవు నర్చించినమహాత్ము లశ్వమేధఫలంబు వడయుదురు వామనం బనుతీర్థం బాడి వామను నర్చించినవారు విష్ణులోకప్రాప్తు

1. క. శంఖినీతలద్వారంబున నరకాంతకుం డనుద్వార.

లగుదురు కులంపునం బనుతీర్థం బాడి కులంబు పవిత్రంబు సేయుదురు శ్రీకుం
జంబున సరస్వతీస్నాతు లై యగ్నిష్టోమఫలంబు వడయుదురు ఋషు లెందే
నుండి యాత్రాపరు లై కురుక్షేత్రంబునకుం బోదు రట్టినైమిశకుంజం బాడి
ఋషితృప్తి సేయుదురు బ్రహ్మతీర్థం బాడి వర్ణాంతరులు బ్రాహ్మణు లగుదురు
బ్రాహ్మణులు బ్రహ్మలోకప్రాప్తు లగుదురు. 263

సీ. అనఘుఁడు మంకణుం డనునొక్క బ్రహ్మర్షి, తనచేయి వ్రయ్యంగ దర్భఁ గొనిన
సాంద్ర మై శాకరసం బందు నిర్గతం, బగుడును హర్షించి యాడుచున్నఁ
జూచి సహింపక సురలును మునులును, హరుపాలి కరిగి దేవాదిదేవ
మునివృత్త మేవిధంబున నివృత్తం బగు, నట్లుగాఁ జేయు మీ వనిన హరుఁడు
ఆ. దపసిరూప మొప్ప ధరియించి యమ్ముని, కడకు వచ్చి యేమికారణమున
నాడె దేమివిస్మయం బిందుఁ జూచితి, చెప్ప నుచితమేనిఁ జెప్పు మనిన. 264

వ. నాకరంబున శాకరసంబు వెలువడిన విస్మితుండ నయి హర్షించి యాడెద ననిన నిది
యేమివిస్మయంబు దీనిం జూడు మని హరుండు తనయంగుష్ఠంబున నంగుళీతాడ
నంబు చేసిన నందుఁ హిమసన్నిభం బయినభస్మంబు వెలువడినం జూచి లజ్జితుం
డయి నీవు పరమేశ్వరుండ వని నమస్కరించి వేదమంత్రంబుల స్తుతియించి దేవా
నీప్రసాదంబున నాకుఁ దపోవర్ధనంబు గావలయు ననిన నమ్మునివరునకు నీశ్వ
రుండు గరుణించి నీకుఁ దపోవర్ధన మగు నేను నీయాశ్రమంబున నుండుదు
ననియె నట్టిసప్తసారస్వతతీర్థంబు లాడినవారికి సారస్వతసిద్ధి యగు బ్రహ్మాదిదేవతలచే
నధిష్ఠితంబు లయినయౌశనసతీర్థంబును గపాలమోచనంబు విశ్వామిత్రంబుఁ
గార్తికేయంబు ననియెడుతీర్థంబుల నాడి పాపవిముక్తు లయి బ్రహ్మలోకంబు
వడయుదురు. 265

క. వేదములయందు వినఁగఁ బృథూదకతీర్థంబ యుత్తమోత్తమము సురేం
ద్రాదిసురవరులకును వ్యాసాదిమహాయోగివరుల కాస్పద మగుటన్. 266

వ. అందు శరీరత్యాగంబు సేసినవారు పాపవిముక్తు లగుదురు సుకన్యాసరస్వతీసం
గమస్నాతు లయినవారు బ్రహ్మహత్యాదిపాతకంబులవలనఁ బాయుదురు దర్భనిర్మి
తం బయినయర్ధకీలతీర్థం బాడినశూద్రులు బ్రాహ్మణు లగుదురు బ్రాహ్మణులు పరమ
సిద్ధు లగుదురు శతంబును సహస్రంబు ననుతీర్థంబులందుఁ జేసినజపదానోపవాసం
బులు శతసహస్రగుణంబు లగు వేల్పు లెల్లం గుమారు సేనాపతింగా నెందే
నభిషేకించి రట్టితైజసం బనుతీర్థంబును దానితూర్పున నుండు [illegible]తీర్థంబును స్వర్గ
ద్వారం బనుతీర్థంబును జూచినవారికి స్వర్గద్వారంబు [illegible] బగు [illegible]
యనుతీర్థంబున శంకరనారాయణుల నర్చించి సర్వదుఃఖవిముక్తు లగుదురు [illegible]
పురంబుఁ బ్రదక్షిణంబుసేసి గోసహస్రదానఫలంబు [illegible]యుదురు గంగమడువున
నొక్కకూపంబున మూఁడుకోట్లతీర్థంబులు సన్నిహితంబు లయి యుండు [illegible]

V.R. NARLA MEMORIAL LIBRARY
D.P.R.I.
Acc. No.

కృతస్నాను లయినవారికి సర్వతీర్థస్నానఫలం బగు బదరీవనంబునందు వసిష్ఠాశ్రమంబునం ద్రిరాత్రంబులు బదరీఫలభక్షణంబు సేసి పాపవిముక్తు లగుదు రేకరాత్రం బనుతీర్థంబున నేకరాత్రోపవాసంబు సేసి బ్రహ్మలోకంబు వడయుదు రాదిత్యాశ్రమం బనువనంబున నాదిత్యుం బూజించి యాదిత్యలోకగతు లగుదురు దధీచతీర్థంబునం గన్యాశ్రమంబునందుఁ ద్రిరాత్రంబు వసియించినవారికి స్వర్గఫలం బగు. 267

క. జలరుహాసంభవుఁ డాదిగఁ, గలవేల్పులు ఋషులు సిద్ధగరుడోరగులున్
నెలనెల సేవింతురు భూ, తలమున సన్నిహతి యనఁగఁ దగుతీర్థంబున్. 268

వ. సూర్యగ్రహణంబున దాని నాడినవారు శతాశ్వమేధఫలంబు వడయుదురు ధర్ముండు దపంబు సేసినధర్మతీర్థం బాడి ధర్మశీలు రగుదురు జ్ఞానపావనంబును సౌగంధికంబు ననుతీర్థంబుల నాడినం జూచినం సర్వపాపవిముక్తు లగుదురు దేవశ్రవ యనుసరస్వతీహ్రదంబునందు వల్మీకంబున వెలువడుజలధార లాడి పితృతర్పణంబు సేసినవా రశ్వమేధఫలంబు వడయుదురు సుగంధయు శతకుంభయుఁ బంచయక్షయుఁ ద్రిశూలఖాతయు ననుతీర్థంబు లాడి దుర్గతులవలనం బాయుదురు తొల్లి పార్వతి యొండేని శాకాహారిణి యై దివ్యసహస్రవర్షంబులు తపంబుసేసె నట్టిశాకంభరీతీర్థం బాడి యొక్కదివసంబు శాకాహారు లయినవారు పండ్రెండేండ్లు శాకాహారతపంబు సలిపినవారిఫలంబు వడయుదురు సువర్ణాఖ్యం బనుతీర్థంబున రుద్రుం బూజించి రుద్రలోకగతు లగుదురు ధూమావతి యనుతీర్థంబును రథావర్తం బనుతీర్థంబును ధార యనుతీర్థంబు నాడి శోకవిముక్తు లగుదురు. 269

క. ధారుణిలోనను స్వర్గ, ద్వారం బయి ఋషినిషేవితం బగుగంగా
ద్వారం బాడినధన్యులఁ, జేరును శతకోటితీర్థసేవాఫలముల్. 270

వ. మఱియు సప్తగంగాసంగమంబును ద్రిగంగాసంగమంబును శక్రావర్తంబును గనస్థలంబును గంగాసరస్వతీసంగమంబు నాదిగాఁ గలపుణ్యతీర్థంబుల నాడి పుణ్యలోకంబులు వడయుదురు భద్రకర్ణేశ్వరంబున రుద్రపూజయు నరుంధతీవటంబును సింధుప్రభవంబును యమునాప్రభవంబు ననుపుణ్యతీర్థంబులసేవయు సర్వసిద్ధికరంబులు వేదిక యనుతీర్థంబును ఋషికుల్య యనుతీర్థంబును గృత్తికామఘతీర్థంబులును విద్యాతీర్థంబును వేతసిక యనుతీర్థంబునుం జూచి దురితంబులవలనం దొలంగుదురు బ్రహ్మతీర్థం బాడి పద్మవర్ణయానంబుల బ్రహ్మలోకగతు లగుదురు.

చ. సురుచిరకీర్తి నైమిశముఁ జూచినమాత్రన పాయుఁ బాపమ
చ్చెరువుగ నందు మాసము వసించి యనంతఫలంబు లొందఁ గాం
తురు బహుతీర్థసేవనముతోడ సమానము నైమిశంబు నం
దరుదుగ నొక్కనాఁడు శుచి యై యుపవాసము సేయఁ గాంచినన్. 272

వ. మఱియు గంగోద్భేదతీర్థంబు నిందీవరతీర్థంబు గంగాద్వారంబు నుశాపతితీర్థంబు

లనియెడుతీర్థంబుల నాడి వాజపేయఫలంబుఁ బడయుదురు బాహుద యనుతీర్థ
బాడిన ననేకసత్త్రయాగఫలం బగు నెందేని రాముండు స్వర్గగతుం డయ్యె నట్టిసర
యూప్రదేశంబున గోప్రతారం బాడియు దేవతలకు ఋషులకు యజ్ఞభూమి యయి
నతీరంబులు గలగోమతి నాడియు నశ్వమేధఫలంబు వడయుదురు కోటితీర్థంబునం
గుమారు నర్చించియు వారణాసియందు రుద్రు నర్చించియుఁ గపిలాహ్రదం బాడి
యు రాజసూయఫలప్రాప్తు లగుదురు మార్కండేయతీర్థం బయినగంగాగోమతీ
సంగమం బాడియు బ్రహ్మకల్పితం బయినయూపంబుఁ బ్రదక్షిణంబు సేసియు
వాజపేయఫలంబు వడయుదురు. 273

సీ. పలువురఁ గొడుకులఁ । బడయంగవలయు నం, దొక్కరుం డయినను । నోపి గయకు
నరుగునో యనియును । నశ్వమేధం బొప్పఁ, జేయునో యనియు న । శ్వేత మైన
యాంబోతు విడుచునో । యనియును గోరుదు, రనపత్యు లైనగృ । హస్థు లట్టి
గయ కేఁగి యుభయపక్షములు వసించినఁ, గడుఁబుణ్యు లుభయపక్షములవారి

ఆ. నుద్ధరింతు రట్టి । యొగిఁ బిండ మిడినవా, రనఘ పితృదయను । గృతార్థు లగుదు
రందు ఫల్గుతీర్థ । మాడినవారికిఁ, బరమసిద్ధితో శుభంబు పెరుఁగు. 274

వ. మఱి యక్షిణీతీర్థంబునందు జలపానంబు సేసి బ్రహ్మహత్యాదిదోషవిముక్తు లగు
దురు మణినాగం బనుతీర్థం బాడినవారికి నాశీవిషవిషంబు లొందవు గౌతమవనం
బునం దహల్యాహ్రదం బాడి యుదపానం బనుతీర్థం బాడియు నశ్వమేధఫలంబుఁ
బడయుదురు రాజర్షి జనకకూపం బాడి విష్ణులోకప్రాప్తు లగుదురు కంపనయు మ
హానదియు ననుతీర్థంబుల నాడినవారు పౌండరీకఫలంబు నొందుదురు దేవపుష్క
రిణిని మాహేశ్వరధారను మహేశ్వరపదంబున నాడిన నశ్వమేధఫలంబు వడయు
దురు తొల్లి కూర్మరూపుం డయినయసురచేతం గోటితీర్థంబు లపహృతంబు లయి
న వానిఁ దెచ్చి విష్ణుం డెందేని నిలిపె నట్టిమహేశ్వరపథం బనుతీర్థం బాడియు విష్ణు
స్థానం బయినసాలగ్రామం బనుతీర్థం బాడి విష్ణు నర్చించియు నందు సన్నిహితచతు
స్సముద్రం బయినకూపంబు నాడియు విష్ణులోకగతు లగుదురు భరతాశ్రమం
బునఁ జంపకారణ్యంబున దేవీసహితు నీశ్వరుం బూజించి మిత్రావరుణలోకంబు
వడయుదురు కన్యాసంబోద్యం బనుతీర్థంబునఁ గన్యాదానంబు సేసి యక్షయఫల
ప్రాప్తు లగుదురు దేవకూటం బనుతీర్థం బాడి బ్రహ్మలోకంబుఁ బడయుదు రెందే
ని విశ్వామిత్రుండు సిద్ధిం బొందె నట్టికౌశికహ్రదం బాడియుఁ గుమారవీరాశ్రమం
బున నొక్కమాసంబు వసియించియు నశ్వమేధఫలంబు వడయుదు రగ్నిధారయుఁ
బితామహసరంబునం బుట్టినకుమారధారయు నాడి త్రిరాత్రోపవాసంబు సేసి
నవారు బ్రహ్మహత్యాదిదోషవిముక్తు లగుదురు గౌరీశిఖరకుండం బాడిన నందినీ
కూపం బాడిన నశ్వమేధఫలం బగుఁ గాళికాకౌశికాసంగమంబునందుఁ ద్రిరా
త్రోపవాసంబు సేసినవారు సర్వపాపవిముక్తు లగుదు రూర్వశీతీర్థం బాడిన సర్వపూ

జార్వా లగుదురు గోకర్ణం బనుతీర్థం బాడి జాతిస్మరణంబు వడయుదురు సరస్వతీ తీర్థస్నాతు లయి వృషభద్వీపంబునం గుమారుఁ బూజించి దేవవిమానగతు లగుదురు నందయు నందాలకయుఁ గరతోయయును గంగాసాగరసంగమంబు నను తీర్థంబుల నాడి శతాశ్వమేధఫలంబు వడయుదురు శోణానర్మదాప్రభవంబును బదరీతీర్థంబును నాడి యాయుష్మంతు లగుదురు మహేంద్రంబును రామతీర్థంబును మతంగకేదారంబును వంశగుల్మంబు నను తీర్థంబుల నాడి యశ్వమేధఫలంబుఁ బడయుదురు. 275

తే. పరమ మైనతీర్థంబు శ్రీపర్వతంబు, నందు దేవహ్రదం బాడి యాదిదేవు
నీశు నర్చించి పడయుదు రిష్టఫలము, నశ్వమేధఫలంబును నవనిజనులు. 276

వ. తొల్లి శతక్రతుండు నూఱుక్రతువులు సేయుటం జేసి పవిత్రం బయినకృష్ణవేణి యందు దేవహ్రదం బాడిన సర్వపాపవినాశనం బగుఁ బాండ్యపర్వతంబునం గావేరీతీర్థంబును దుంగభద్రయు సముద్రతీరంబునఁ గన్యాతీర్థంబును నాడి యశ్వమేధఫలంబు వడయుదురు గాయత్రిస్థానంబునం ద్రిరాత్రంబు గాయత్రిజపంబుఁ జేసినవారికి జన్మదుఃఖంబులు లేవు పెన్నయనుమహానది నాడిన మయూరహంసవిమానగతు లగుదురు గోదావరీస్నానంబు సేసిన దశాశ్వమేధఫలంబు వడయుదురు పయోష్ణియు దండకారణ్యంబును శరభంగాశ్రమంబును జమదగ్నిసేవితం బయినశూర్పారకంబును సప్తగోదావరీతీర్థంబును నాడినపుణ్యులు పుణ్యలోకప్రాప్తు లగుదురు. 277

సీ. అసురులభయమున నడఁగినవేదంబు, లోంకారపూర్వ మై యుండ నాంగి
రసుఁ డుద్ధరించి సారస్వతప్రముఖులఁ, జదివించె నెందేని శాశ్వతముగ
నమరనియుక్తుఁ డై యజియించె నెందేని, భృగుఁ డెల్లవారికిఁ బేర్మి నట్టి
రమణీయతుంగకారణ్యంబు సూచిన, మాత్రన దురితకర్మంబు లెల్లఁ

తే. బాయుఁ గాలంజరం బనుపర్వతంబు, నందు దేవహ్రదం బాడి యభిమతములు
వడయుదురు మేధికంబు నాఁ బరఁగుతీర్థ, మాడి మేధాసమన్వితు లగుదు రెందు.

వ. మఱి చిత్రకూటంబున మందాకిని సేవించి పితృస్థానంబునం గుమారుం బూజించి జ్యేష్ఠమాసంబున రుద్రు నర్చించి రామనివాసంబున శృంగిబేరపురంబున గంగాస్నాతు లయి గంగాధరు నర్చించియు సర్వపాపవిముక్తు లగుదురు. 279

క. యాగశతంబులకంటెఁ బ్ర, యాగనివాసము విశేష మని సురలు మహా
యోగులు సిద్ధులు సాధ్యులు, నాగులు నం దుండుదురు మనఃప్రియ మెసఁగన్.

వ. అది ప్రజాపతియజ్ఞవేది గావున నందు మూఁ డగ్నికుండంబు లెప్పుడుఁ గానం బడు మఱి వేదంబులు యజ్ఞంబులు మూర్తిమంతంబు లై యఱువదికోట్ల పదివేలుతీర్థంబులు సన్నిహితంబు లై గంగాయమునాసంగమంబు సేవించి యుండు నందుఁ గృతస్నాను లైనవారు రాజసూయాశ్వమేధులయు సత్యవాదులయుఁ జతు

ర్వేదాధ్యయనులయుఁ బుణ్యలోకంబు వడయుదురు భోగవతియు వాసుకియు హం
సవ్రతంబు ననుతీర్థంబుల నాడి దశాశ్వమేధఫలంబు పడయుదురు. 281

క. విదితముగఁ దీర్థకీర్తనఁ, జదివినధన్యులకు వినినసజ్జనులకు న
భ్యుదయ మగు సర్వతీర్థస, [1]ముదయస్నానముల యాగముల ఫలము లగున్. 282

చ. వ్రతములు లేనివారు నుపవాసపరాఙ్ముఖు లైనవారు దు
రతులు విహీనశౌచులుఁ గ్రమంబునఁ దీర్థము లాడ నోప రా
తతగుణశాలి నీ వఖిలధర్మవిదుండవు గావునన్ శుభ
స్థితిఁ జని తీర్థసేవనము సేయుము నీకు నభీష్టసిద్ధిగన్. 283

వ. అని సకలతీర్థకథనంబు సెప్పినపులస్త్యువచనంబున భీష్ముండు దొల్లి యెల్లతీర్థం
బులు సేవించి కృతార్థుం డయ్యెఁ గావున నీవును దీర్థసేవ సేసి. 284

క. పూరుపురూరవులట్లు భ, గీరథరఘుపతులయట్లు కృతకృత్యుఁడ వై
ధారుణి రక్షింపుము వి, స్తారగుణాధార ధీర ధర్మతనూజా. 285

వ. రోమశుం డనుదేవర్షి దేవలోకంబుననుండి నీకడకు వచ్చుఁ దదుపదేశంబున
ధౌమ్యానుమతుండ వయి తీర్థసేవనఁ జేయు మని చెప్పి నారదుం డరిగిన నజాత
శత్రుండు ధౌమ్యుం జూచి యిట్లనియె. 286

చ. అలయక మాకు నందఱకు హర్నిశముం బ్రియకారి యైనయ
త్యలఘుపరాక్రమోన్నతు మహాభుజు నర్జును దివ్యసాయకం
బులు వడయంగ నెక్కరున పుచ్చితిఁ దద్దయు వేడ్క నెద్దియుం
దలఁపక యిప్డు తద్విరహితమ్మగు కామ్యక మొప్ప దయ్యెడిన్. 287

వ. అంబుదాగమనం బపేక్షించుచాతకంబులట్లు మన మందఱ మర్జునాగమనంబు
ప్రతీక్షించుచున్నవారము వాఁడునుం దనపూనినకార్యంబు నిర్వహించి కాని
నివృత్తుండు గాఁ డవశ్యంబును దివ్యాస్త్రంబులు వడసి యాతనివచ్చునంతకుఁ
దీర్థసేవ సేయుద మనినఁ గరంబు లగ్గగు నట్లు చేయుద మని. 288

రోమశమహాముని ధర్మరాజునొద్దకు వచ్చుట.

ఉ. నాలుగుదిక్కులందును వినన్ విదితం బగు చున్న పుణ్యతీ
ర్థాలితెఱం గెఱుంగఁగ మహాత్ముఁడు ధౌమ్యుఁ డజాతవైరి కం
దోలిన చెప్పుచున్నతఱి నొప్పఁగ రోమశుఁ డేఁగుదెంచె దే
జోలలితుండు నిర్మలయశుం డగుధర్మతనూజుపాలికిన్. 289

వ. ఇట్లు వచ్చినమహామునిని నతిభక్తి ననుజబ్రాహ్మణసహితుం డై ధర్మజుండు పూజించి
మునీంద్రా యెం దుండి వచ్చితి రని యడిగిన నాతనికి రోమశుం డి ట్లనియె. 290

తే. ఎల్లలోకంబులను జూచి యింద్రలోక, లోకనార్థి నై యే నింద్రలోకమునకుఁ
బోయి సురరాజుచేఁ బ్రీతిఁ బూజితుండ, నై మహీనాథ యందు నీయనుజు ననఘు.

1. క. ముదయంబులయందు స్నానములఫలమ యగున్.

ఉ. ఈసున నీశుఁ దొట్టి సుర లెల్ల నభీష్టవరంబు లిచ్చుటం
జేసి కృతార్థుఁ డైన కురుసింహము నూర్జితశౌర్యు నర్జునున్
భాసురతేజు విశ్వపరిపాలకుఁ డైన మహేంద్రుతోడ నే
కాసన మెక్కి యున్న మహిమాస్పదు నింద్రసమానుఁ జూచితిన్. 292

క. బలవంతు లైన భీష్మా, దుల నర్జునుఁ డోర్చు [1]నూర్జితుం డై మఱి పో
రులఁ గర్ణుండు పదాఱవ, కళకు సమానుండు గాఁడు కవ్వడితోడన్. 293

వ. అతని యున్నవిలాసంబు సూచి విస్మితుండ నయిన నాకు నింద్రుండు దత్ప్రభావంబు సెప్పి వీఁ డమృతసంభవం బయిన పాశుపతం బను దివ్యాస్త్రంబుఁ బరమేశ్వరుచేతను నాచేతను యమవరుణకుబేరాదులచేతను దివ్యాయుధంబులుఁ బడసె నితండు మనుష్యుండు గాఁడు దివ్యపురుషుం డన్యుల కశక్యం బయిన దేవకార్యంబు దీర్చి మసలక వచ్చు నని మర్త్యలోకంబునకుం బోయి భ్రాతృసహితుం డయిన ధర్మరాజునకుం జెప్పు మని వెండియు ని ట్లనియె. 294

క. నిరతముగఁ దీర్థసేవా, పరులకు శాంతాత్ములకుఁ దపస్వులకును దు
ష్కర మెద్దియు లే దని చె, చ్చెర ధర్మజుఁ దీర్థసేవ సేయింపు మొగిన్. 295

క. అని పనిచిన నమరేశ్వరు, పనిఁ దత్పార్శ్వమున నుండి పన్నుగ నిట యేఁ
జనుదెంచితి నీకార్యము, ధనంజయున కభిమతంబు ధరణీనాథా. 296

క. అనవద్య తీర్థసేవన, మును గపిలాస్వర్ణదానములు నుగ్రతపం
బును జేయనివారికిఁ బో, లునె పడయఁగ నేర్మి నుభయలోకసుఖంబుల్. 297

వ. ఏను దొల్లి భూమిం గల తీర్థంబు లెల్ల నినుమాఱు సూచితి నిప్పు డింద్రునియోగంబున నీతోడన వచ్చి యఖిలతీర్థసేవ సేసెద ననిన ధర్మజుం డతని కి ట్లనియె. 298

ఉ. నన్నుఁ దలంచి తీర్థగమనం బొనరింపఁగఁ బంచె నట్టి వి
ద్వన్నుత దేవవల్లభుఁడు దానఁ గృతార్థుఁడ నైతి దానిపై
నిన్ను సహాయుఁగాఁ బడసి నెమ్మి నశేషవిశేషతీర్థముల్
పన్నుగఁ జూడఁ గాంచి కడు భవ్యుఁడ నైతి [2]మహామునీశ్వరా. 299

ఆ. విజయుకుశలవార్త వేడుక నీచేత, వినినయంతకంటె విస్తరిల్లె
హృదయసంప్రమోద మీరెంట నా కంచుఁ, దద్ద సంతసిల్లె ధర్మసుతుఁడు.

వ. మునీంద్రా యేను దొల్లియు నారదధౌమ్యులవచనంబులం దీర్థగమనోన్ముఖుండ నయి యున్నవాఁడ నిప్పుడు భవన్నిదేశంబునం దీర్థసేవ సేసి కృతార్థుండ నగుదు నని కృతనిశ్చయుం డై భిక్షాభుజు లయిన బ్రాహ్మణులను యతులను రోమశువచనంబున నివర్తించి ధౌమ్యపురస్కృతకతిపయబ్రాహ్మణులతోఁ దనుజులుం దానును గృష్ణాసహితు లయి కామ్యకవనంబున మూఁడుదినంబులు వసియించి మార్గశీర్ష

1. క. నవిజితుం డై; గ. నపజితుం డై. 2. గ. మునీంద్ర నీదయన్.

మాసావసానంబునం దీర్థసేవార్థంబు గృతప్రస్థానుం డయినయుధిష్ఠిరునకు బ్రాహ్మణు లి ట్లనిరి. 301

ఉ. నీయనుజుల్ ధనుర్ధరు లనింద్యచరిత్రులు దీర్ఘ తీక్ష్ణకా
ర్షేయకపాణు లత్యమలకీర్తులు [1]గావఁగ రోమశుండు దే
జోయుతుఁ డెల్లతీర్థములుఁ జూపఁగఁ దీర్థము లాడువేడ్క ల
క్ష్మీయుత యిప్డు నిన్ననుగమింపఁగఁ గంటిమి పుణ్యసంపదన్. 302

వ. రాక్షసపిశాచశ్వాపదంబులకారణంబున నడవులలో నేకతంబ యరిగి తీర్థసేవ సేయ మాయట్టివారికి నశక్యంబు గావున మీతోడ వచ్చెద మని బ్రాహ్మణులు ధర్మరాజుచేత ననుజ్ఞాతు లై రంత. 303

క. పారాశర్యుఁడుఁ బర్వత, నారదులును బాండురాజనందనుల గుణో
దారుల ననఘులఁ దీర్థ, ప్రారంభులఁ గాన వచ్చి పరమప్రీతిన్. 304

క. వారలచేఁ బూజితు లై, భూరితపోధనులు లోకపూజ్యులు ధర్మ
ప్రారంభనిత్యమతులకు, వారల కి ట్లనిరి సత్యవచనులు గరుణన్. 305

వ. శారీరనియమంబులు మానుషవ్రతంబు లనంబడు, మనోబుద్ధిశౌచంబులు దేవవ్రతంబు లనంబడు నట్టిసామ్యవ్రతవిశేషంబులు సలుపుచు ఋజుమార్గులరై తీర్థంబులు సేవించునది తీర్థాభిగమనంబున మహాభిష నాభాగ భరత భగీరథ ముచుకుంద మాంధాతృ సగర సార్వభౌమాష్టక రోమపాదులయట్ల శత్రుజయంబును సర్వలోకసుఖంబులుం బడయుదురు రని చెప్పి మునివరులు మువ్వు రరిగి రంత నజాతశత్రుండు రోమశున కి ట్లనియె. 306

క. ధరణి నధార్మికు లగుకా, పురుషుల కభివర్ధనంబుఁ బుణ్యచరిత్రం
బరఁగెడుధార్మికులకు దు, ర్ధర మగునవివర్ధనంబుఁ దగునె మునీంద్రా. 307

వ. మఱియు నచేతనంబు లయ్యును గిరిసరిత్సరోవరంబులు పుణ్యతీర్థంబు లై జగత్పావనంబు లై జనులకు దురితాపహారంబు లయినకారణం బేమి యని యడిగిన నతనికి రోమశుం డి ట్లనియె. 308

రోమశుండు ధర్మరాజునకు ధర్మవిశేషంబులు సెప్పుట.

చ. వసుధ నధర్మవర్తు లగువారలవర్ధన మెన్నఁడుం సమం
జస మయి నిల్వ నేరదు భృశంబుగ నాశము వొందు దుర్మద
వ్యసను లధర్మవర్తనఁ బ్రవర్ధితు లయ్యును నేము చూడ రా
క్షసులును దైత్యదానవులుఁ గ్రాఁగరె తొల్లి సహస్రసంఖ్యలన్. 309

క. దేవతలు ధర్మవర్తులు, గావున నభివృద్ధిఁ బొంది ఘనముగ నిత్య
శ్రీవిభవాన్వితు లయి ధర, ణీవల్లభ యున్నవారు నిరుపమశక్తిన్. 310

1. క. గ. గావున.

క. ధర్మసుత ధార్తరాష్ట్రుల, ధార్మికులై పెఱిగి రేని దడయక విధిచే
నిర్మూలితు లగుదురు దు, ష్కర్మంబున నసురులట్ల కడు నస్థిరులై. 311

వ. అది యె ట్లనిన నధర్మవర్తులయందు దర్పంబు పుట్టు దర్పంబువలన మానంబు పుట్టు మానంబువలనఁ గ్రోధంబు పుట్టు క్రోధంబువలనం జేసి లజ్జయు వృత్తంబునుం జెడు [1]నష్టలజ్జావృత్తు లయినవారి నుపశమంబును లక్ష్మియు విడుచు. 312

క. మీ రమరసదృశులరు ధ, ర్మారంభవిశిష్టమతుల రగుటను సుచిర
శ్రీరమ్యుల రగుదురు విజి, తారాతుల రగుదు రుద్ధతాహవములలోన్. 313

వ. ధర్మవర్తు లైనదేవతలు ఋషులు నాశ్రయించుటం జేసి తీర్థంబులు పవిత్రంబు లై సర్వకామప్రదంబు లై వర్తిల్లుచుండుఁ దీర్థసేవను గ్రతువులను దానంబులను బ్రాహ్మణులదీవనలను జనులు సర్వదుఃఖవిముక్తు లయి శ్రేయఃప్రాప్తు లగుదు రని చెప్పిన నమ్మునివరువలన నొండుధర్మస్థితులు వించుఁ బాండవు లరిగి నైమిశంబు నశ్వతీర్థంబును గంగాఘోషంబును గన్యాతీర్థంబును గోమతియును బాహుదయును మహానదియును దేవయజనం బయినప్రయాగయు గంగాయమునాసంగమంబును నాడి యందు బ్రాహ్మణులకు గోహిరణ్యదానంబులు సేసి ప్రయాగం [2]గొన్నిదినంబు లుండి వేదవిదు లయినబ్రాహ్మణులవలన వేదార్థంబు లెఱుంగుచుఁ జని యనేకపుణ్యనదీసముద్భవం బయినగయపర్వతంబును రామసరంబును బ్రహ్మసరంబును వైవస్వతతీర్థంబునుం జూచి గయయందు నక్షయవటంబున నార్షేయం బైనవిధానంబునం జాతుర్మాస్యక్రతువులు సేసి ఋషులవలనం బుణ్యకథలు వినుచున్నయవసరంబున శమఠుం డనుమహాముని ధర్మరాజున కి ట్లనియె. 314

సీ. అనఘుం డమూర్తరయప్రియపుత్త్రుండు, గయుఁ డనురాజర్షి క్రతువు లిందు
బ్రహ్మసరంబునఁ బరఁగంగ మును చేసె, నాతనియజ్ఞంబులందు సకల
జనభుక్తశేషాన్నశైలంబు లిరువది, యే నగుసంఖ్య దా నెఱుఁగ నయ్యెఁ
దత్కృతక్రతుబహుదక్షిణాసంఖ్యయు, నుడుసికతాసంఖ్యయును నెఱుంగఁ

ఆ. గాదు జనుల కిట్టిగయునామమున గయ, యనఁగఁ బుణ్యతీర్థ మయ్యె నిదియుఁ
బితృహితార్థ మిందుఁ బిండప్రదానంబు, సేయఁ గనిన సిష్టసిద్ధి పెరుఁగు. 315

వ. అని చెప్పినశమఠువలన గయామాహాత్మ్యంబు విని యగస్త్యాశ్రమంబున కరిగి రంత ధర్మరాజు రోమశున కి ట్లనియె. 316

మధ్యాక్కర. వాతాపి యనువాని నెట్లు సంపె సోద్వంద్యుఁ డగస్త్యుఁ
డాతత తేజోధికుండు నా వినను నమ్మునినాథుఁ

---

1. క. లజ్జానివృత్తు. 2. 'గొన్నిదినంబు లుండి' అనుటకును 'వేదవిదు లయిన' అనుటకును నడుమ 'క. ఎలమిని ధర్మతనూజుఁడు, గులపావనుఁ డగుచు విప్రకోటుల కెల్లన్, వెలయఁగ నభీష్టవస్తువు, లలయక దానములు సేసె నభివాంఛితుఁ డై.' అని యొకానొకప్రతిం దప్పఁ బెక్కింటఁ గానిపింపదు.

ప్రీతిని దచ్చరితంబు వినఁగ నభీష్టమిం దనిన
నాతని కిట్లని చెప్పె రోమశుం డను ముని పేర్మి. 317

క. వీతభయుఁ డిల్వలుండును, వాతాపియు ననఁగఁ బరఁగువరదైత్యులు వి
ఖ్యాతబలులు నసియింతు ర, రాతిహరుల్ మణిమతీపురంబున నొప్పన్. 318

వ. అం దగ్రజుం డయినయిల్వలుం డొక్కబ్రాహ్మణు నతిభక్తి నర్చించి నాకు సకలకామసిద్ధికరం బగుమంత్రం బుపదేశింపు మని ప్రార్థించి విఫలప్రార్థనుం డై యలిగి తనతమ్ముఁ గామరూపధరు వాతాపి నపుడు మేషరూపంబు సేసి వధియించి వాని మాంసం బిమ్ముగాఁ వండించి దాని నావిప్రునకుఁ గుడువం బెట్టించి. 319

తే. విప్రుకడుపులో నున్నయసోదరు ననుజుఁ, బిలిచె ర మ్మని వాతాపి ప్రియముతోడ
జీవితుం డయి వాఁడు సోచ్చెరను విప్రు,కడుపు వ్రచ్చుచు వెలువడి క్రాఁచె విప్రు.

వ. అది మొదలుగా నిల్వలుండు దనకడకు నతిథు లై వచ్చువిప్రుల నిప్పాట నంతకుపురంబున కతిథులం జేయుచున్నంత నట యగస్త్యుండు బ్రహ్మచర్యాశ్రమంబునం బెద్దకాలం బుగ్రతపంబు సేయుచు వనంబునఁ బరిభ్రమించువాఁ డొక్కసల్లకీపల్లవంబున నధోముఖు లయి వ్రేలుచున్నతనపితరులం జూచి యివ్విధంబున మీ రున్నకారణం బేమి యని యడిగినఁ బితరు లి ట్లనిరి. 321

తే. అయ్య యేము నీపితరుల మధికనిష్ఠ, బ్రహ్మచారి వై నీవు తపంబు సేయు
చున్నవాఁడవు సంతతి కొల్ల కదియ, కారణంబుగ మా కూర్ధ్వగతియు లేదు.

వ. ఇంక నైనను నీవు వివాహం బై సంతానంబు వడసిన మాకుఁ బుణ్యగతి వడయ నగు ననిన నట్ల చేయుదు నని యగస్త్యుండు దనతపశ్శక్తిం జేసి పుత్రకాముం డై నవిదర్భరాజున కొక్కకూఁతుం బుట్టించిన నది లోపాముద్ర యనునామంబుతో జలంబులయందు నలినియునుంబోలె వినీతునందు లక్ష్మియుంబోలె నుద్యుక్తునందు విద్యయుంబోలెఁ బెరిఁగి యౌవనంబు దాల్చి రూపవతి యై వయోరూపంబుల ననురూప లయినకన్యకాశతంబుతో నొప్పుచున్నంత. 323

క. తరుణి నగస్త్యభయంబున, వరియింపఁగ నోడి రాజవరులు మనోజా
తురు లగుచుండిరి తగియెడు, వరు రోయుచు నుండె సుతకు వైదర్భుండున్. 324

వ. అంత నగస్త్యుండు విదర్భరాజుపాలికి వచ్చి నాకు లోపాముద్ర నిచ్చునది యనిన వైదర్భుం డాత్మగతంబున. 325

ఉ. నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులోఁ దపో
భారమునం గృశుం డయినబ్రాహ్మణుఁ డీలలితాంగిఁ బెండ్లి యై
నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులోఁ దపో
భారము దాల్చి యుండు మని పంపక మిన్నక యుండ నేర్చునే. 326

ఆ. ఎఱిఁగి యెఱిఁగి [1]దీని నెట్లీఁగ నగు భోగ, యోగ్య యైనయది పయోజనేత్ర

1. క. తపసి కట్టు లీ నగు భోగ, యోగ్య యైనయిప్పయోజనేత్ర.

యీనినాఁడు శాపమిచ్చుఁ గా కిమ్మని, యేల సైఁచు నింక నెట్టు లోర్వ.

వ. అని వైదర్భుండు దానునుం బత్నియు వగచు చున్న వారిపాలికి వచ్చి లోపాముద్ర యి ట్లనియె. 328

క. ఇమ్మునివరునకు నన్నుఁ బ్రి, యమ్మున నిచ్చునది మీకు నతిచింతాభా
ర మ్మేల యనిన నిరువురు, [1]నమ్ముదితకు సంతసిల్లి యధికవిభూతిన్. 329

అగస్త్యుండు లోపాముద్రను వివాహం బగుట.

వ. విధ్యుక్తంబుగా నక్కోమలి నగస్త్యునకు వివాహంబుఁ జేసిన నగస్త్యుండు లోపాముద్రం బరిగ్రహించి దానిదివ్యాంబరాభరణంబు లపనయించి వల్కలాజినధారిణిం జేసి ధర్మచారిణిం దోడ్కొని చని గంగాద్వారంబునం దపంబు సేయుచు నొక్కనాఁడు. 330

క. నీచతరనాభిఁ జపలవి, లోచనఁ బృథుజఘనచక్ర లోపాముద్రం
జూచి మునీంద్రుఁడు మన్మథ, గోచరుఁ డై దానిఁ బ్రీతిఁ గూడఁగఁ దివిరెన్. 331

వ. అదియును మునివరునభిప్రాయం బెఱింగి లజ్జించి ముకుళితకరాంబుజ యై యి ట్లనియె. 332

క. పతి పత్నిఁ బ్రజార్థముగా, ధృతిఁ బడయుట [2]యెందుఁ గలయదియ యైనను న
న్నతిరుచిరాంబరభూషా, న్వితఁ జేసి మనఃప్రియంబు నిర్మింపు దయన్. 333

క. మునినాథ నీవు నను లే, పనమాల్యవిభూషణప్రసన్నుఁడ వై నా
కొనరింపు మపత్యోత్పా, దన మీఋతువాసరములు దప్పక యుండన్. 334

వ. అనిన నాకుఁ దపోధనంబ కాని యొండుధనంబు లేదు నీకోరినవిధం బెట్లు సేయ నేర్తుఁ దపంబునం జేసి సర్వంబునుం బడయ నగు నంతేని నేను దపోవ్యయంబు సేయ నోప నని యగస్త్యుండు వసుభిక్షార్థి యై శ్రుతర్వుం డనురాజుపాలికిం బోయి వానిచేతం బూజితుం డయి యేను ధనార్థి నై వచ్చితి నీపోష్యజనపోషణంబునకు విఘాతంబు గాకుండ మిగులుధనంబు గల దేని నా కి మ్మని యడిగిన నతం డాయవ్యయంబులు సమంబు లగుటం జేసి మిగులు లేమి యెఱింగించిన వాఁడును దానును బ్రధ్నశ్వుం డనురాజుపాలికిం బోయిన నతండును నయ్యిరువురం బరమభక్తిం బూజించి తదాగమనప్రయోజనం [3]బెఱింగి తనయందుల నాయవ్యయంబులు సమంబు లగుట యెఱింగించిన. 335

క. ఇరువురఁ దోడ్కొని తానును, నరిగెం ద్రసదస్యుఁ డనుజనాధిపుకడకుం
గర మర్థితోడ నందఱఁ బురుకుత్సతనూజుఁ డతఁడు పూజించి వడిన్. 336

వ. వారలచెప్పినట్ల తననిర్వాహంబు సెప్పి త్రసదస్యుం డగస్త్యున కి ట్లనియె. 337

1. జ. నమ్మాటకు. 2. క. గ. జ. కృతులయందుఁ ♦ దెల్లమ యైనన్. 3. గ. బడిగివఁ దమవచ్చిన కార్యం బెఱింగించి యందుల నాయవ్యయంబులు సమంబు లగుట యెఱింగి.

క. ఇమ్మణిమతీపురంబునఁ, దమ్ముండును దాను నతిమోదంబున నుండున్
నెమ్మిని నిల్వలుఁ డనువాఁ, డిమ్మహి ధనవంతుఁ డతఁడ యెవ్వరికంటెన్. 338

వ. అతండు మనయభిమతంబు దీర్ప నోపు నని రాజర్షులు మువ్వురు మహర్షిం దోడ్కొని యిల్వలుపాలికిం జనిన నయ్యిల్వలుండును వారి నాతిథ్యవిధానంబుల నర్చించి వాతాపి నెప్పటియట్ల సంస్కరించి యగస్త్యుని కశనంబుగా సమర్పించిన.

తే. దాని నెఱిఁగి యమ్మువ్వురు ధరణిపతులు
మునివరేణ్యున కప్పుడు మ్రొక్కి యనిరి
విప్రవరులకు భక్ష్యమై వీనితమ్ముఁ
[1]డుదరములనుండి విప్రుల నాగిన చంపు. 340

చ. వలవదు వీనియింటఁ గుడువన్ మనకున్ ధన మిచ్చు నేని ని
మ్ములఁ గొని పోద మిప్పు డని ము న్నెఱిఁగించిన నమ్మునీంద్రుఁ డ
త్యలఘుఁడు వారిమాటకు భయంపడ కెంతయుఁ బ్రీతితోడ న
గ్గలముగఁ జేసె భోజనము కంఠముదాఁక [2]నకుంఠవీర్యుఁడై. 341

ఆ. ఇల్వలుండు ననుజు నెప్పటిక్రియఁ బిల్వ, నెఱిఁగి దాని నమ్మునీశ్వరుండు
గడుపుఁ దడవికొనుచుఁ గట్టనఁ ద్రేఁచిన, నసుర జీర్ణ మయ్యె నాక్షణంబ. 342

వ. ఇల్వలుండును మునివరుశక్తికి భయంపడి విషణ్ణుం డయ్యును బ్రసన్నుండపోలెఁ దనవంచన యేర్పడ కుండఁ గృతప్రణాముం డై తదాగమనప్రయోజనం బడిగిన వానికి నగస్త్యుం డి ట్లనియె. 343

సీ. ఈరాజవరులతో నేను ధనార్థి నై, వచ్చితి నీకు ద్రవ్యంబు గలుగు
టెఱిఁగి నాపుడు నటు లేని మా కభిమత, మెంత యంతియధన మిత్తు ననినఁ
బదివేలు మొదవులుఁ బదివేలగద్దియల్, పసిఁడియు నిమ్మహీపతుల కిమ్మ
యొక్కొక్కనికి మఱి యొక్కని కిచ్చిన, దానికి రెట్టి గోధనము నొక్క

ఆ. హేమమయరథంబు నిమ్ము నా కనిన ని
ల్వలుఁడు దక్షిణంబ తలఁచి యిచ్చె
నయ్యగస్త్యు చెప్పినంతధనంబు ము
వ్వురు మహీపతులకుఁ గరము నెమ్మి. 344

వ. మఱియు విరావ సురావము లనునశ్వంబులం బూన్చినసౌవర్ణరథంబును నిరువదివేల మొదవులు నిరువదివేలగద్దెలపసిండియు మునివరున కిచ్చినం దద్రథంబున. 345

క. మునివరనృపతులఁ దద్గో, ధనకాంచనతతులఁ దత్పతాకినులను నో
లిన తాల్చి యగస్త్యాశ్రమ, మునకుం దక్షిణమ రథ్యములు వడిఁ బఱచెన్. 346

---

1. గ. డుదర మగలించి 2. క, నకుంఠితాత్ముఁడై.

వ. రాజర్షులు నగస్త్యు వీడ్కొని చని రంత నగస్త్యుండు లోపాముద్ర కభిమతం బొనరించి. 347

మధ్యాక్కర. పదుండ్రఁ బోలెడుసుతుల నూర్వురఁ ఽ బడయంగ వలతొ
పదుండ్ర నూర్వుర కెన యగుసుతులఁ ఽ బడయంగ వలతొ
వదలక వేవురు సుతులఁ బడయఁగ ఽ వలతొ వేవురకుఁ
గదియంగ నుత్తము నొక్కరు వలతొ ఽ కమలాయతాక్షి. 348

వ. అనిన ముదితహృదయ యై లోపాముద్ర మునీంద్రున కిట్లనియె. 349

క. [1]వేవురఁ బోలెడువాని మ, హావీర్యగుణాఢ్యు నొక్కఁ ఽయాత్మజుఁ బడయం
గా వలతు నపేతగుణుల్, వేవురుసుతు లయ్యు నెందు ఽ విఫలమ కాదే. 350

వ. అనిన నీకోరినట్ల గుణవంతుం డయినకొడుకు నీకు జనియించు నని దానికి గర్భాధానంబు సేసి యగస్త్యుండు దపోవనంబున కరిగె నిట లోపాముద్రయు నేడేండ్లు గర్భంబు దాల్చె నంత నక్కోమలికి. 351

క. తనయుఁడు దృఢస్యుఁ డనఁగా, ననవద్యుఁడు వేదములు రహస్యంబులతో
నొనరఁగ జపంబు సేయుచు, నినతేజుఁడు వుట్టె భువన ఽ మెల్ల వెలుంగన్. 352

వ. వానికిం దేజస్వి యనుఋషి వుట్టి యపారం బైనయిధ్మభారంబు వహించుటం జేసి యిధ్మవాహుం డనం బరఁగె నిట్లగస్త్యుండు పుత్త్రపౌత్త్రవంతుం డయి తనపితరులం బుణ్యలోకగతులం జేసె నని వైశంపాయనుం డితిహాసక్రమం బతిరమ్యంబుగాను. 353

క. కలికాలభరత లక్ష్మీ, లలనాస్పద వీరగుణవిలాస విరోధి రల "మోరభైరవ"
ప్రళయాంతక నిఖిలమహీ, వలయోద్వహబాహువిష్ణువర్ధన [2]మూర్తీ. 354

పృథ్వీవృత్తము. సమస్తభువనాశ్రయా వినయసత్యనిత్యోదయా
సమీహితహితక్రియాస్థిరవిశాలకీర్తిప్రియా
[3]నమన్నృపకిరీటచుంబిచరణద్వయా సంతత
క్షమాభరణ రాజరాజ పరగండభేరుండకా. 355

గద్యము. ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బైనశ్రీమహాభారతంబునం దారణ్యపర్వంబున బృహదశ్వదర్శనంబును నలోపాఖ్యానంబును నారదాగమనంబును సకలతీర్థకీర్తనంబును రోమశుం డర్జునకుశలవార్తఁ జెప్పుటయు రోమశమహామునియుపదేశంబున ధర్మజుతీర్థాభిగమనంబును నగస్త్యుండు లోపాముద్రం బరిగ్రహించుటయు వాతాపిభక్షణంబును నన్నది ద్వితీయాశ్వాసము. 356

1. ఖ. దేవరఁ బోలెడు. 2. ఘ. దేవా. 3. 'నమన్నృపపదద్వయా దిగధినాథదత్తాభయా, క్షమాభరణ దిగ్జయా సుకవిజాలభాస్వద్దయా.' అని యొకప్రతి.

89

శ్రీ

హరిహరహిరణ్యగర్భేభ్యో నమః.

శ్రీమదాంధ్రమహాభారతము.

ఆరణ్యపర్వము, తృతీయాశ్వాసము.

మందిర బుధజనచిం
తామణి కోదండపార్థ ధర్మవిచారో
ద్దామ నలనృగభగీరథ
రామచరిత్రాభిరామ రాజనరేంద్రా. 1

అగస్త్యచరిత్రము.

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నట్లు ధర్మతనయుం డగస్త్యమాహాత్మ్యంబు విని వెండియుఁ దచ్చరిత్రంబు రోమశు నడిగిన నమ్ముని యిట్లనియె.

సీ. కృతయుగంబునఁ గాలకేయగణంబుతో, వృత్రుఁ డన్నసుర గర్వించి యమర
పతిఁ దొట్టి వేల్పుల బాధించుచున్నఁ, దద్భయమున నమరులు బ్రహ్మకడకుఁ
జని పోరిలో వృత్రుఁ జంప నుపాయ మెయ్యదియొ మా కానతి మ్మన నజుండు
దివిరి సరస్వతీతీరంబునందు నిశ్చింతుఁ డై తప మొప్పఁ జేయుచున్న

ఆ. యాదధీచుకడకు నరిగి వేఁడుం డని, యస్థు లిచ్చు మీకు నమ్మహాత్ముఁ
డవి జయించు వజ్ర మాదిగా నిఖిలది, వ్యాయుధంబు లై సురారివరుల. 3

వ. అందు వజ్రంబున నింద్రుండు వృత్రు వధియించు ననిన నమరులెల్లం గమలాసను శాసనంబున దధీచుపాలికిం జని కృతప్రణాము లై యిట్లనిరి. 4

క. భువనజనస్తుత నిజగా, రవ మెసఁగఁగ నమరపతిపురస్కృతు లగుని
ద్దివిజుల కెల్ల హితంబుగ, భవదస్థిచయంబు లిమ్ము పరమమునీంద్రా. 5

వ. అనిన విని దధీచుండు సంతసిల్లి కృతార్థుండ నైతి నని దేవహితార్థంబుగా నిజప్రాణంబులు విడిచె నమరు లెల్ల నమ్మహామునియస్థు లాయుధంబులుగాఁ బరిగ్రహించి రందు. 6

ఆ. త్వష్ట యంత నూఱుధారలు రమ్య మై, యనలకణకరాళ మైనవజ్ర
మొనరఁ జేసి దీన నోర్వుము దైత్యుల, ననుచు నిచ్చె దాని నమరపతికి. 7

వ. అవ్వజ్రంబున నింద్రుండు వృత్రు వధియించె నంత. 8

చ. అనుపమదివ్యశస్త్రధరు లైనయమర్త్యుల కాహవంబులో
మొనయక కాలకేయులు సముద్రముఁ జొచ్చి దివంబు లెల్ల న
వ్వనధి నడంగి యుండి బలవంతులు వెల్వడి రాత్రు లెల్ల భూ
జనులకు బాధ సేయుచు భృశంబుగ నుండిరి క్రూరచిత్తు లై. 9

వ. మఱియు విద్యాతపోయుక్తు లై ధర్మచరితు లైనవారికారణంబున జగంబు లపాయంబు నొందక సుఖం బున్నయవి గావున నట్టివారిన రోసి వధియించి జగంబుల కపాయంబు సేయుద మని యసురులు వసిష్ఠాశ్రమంబున నూటతొంబదియేడ్వురను జ్యవనాశ్రమంబున నూర్వురను భరద్వాజాశ్రమంబున నిరువదుండ్రనుం గాఁ బలువురు బ్రాహ్మణుల బ్రహ్మమయుల భక్షించి యిప్పాట ననవరతంబు నఖిల మునిగణాశ్రమంబుల కుపద్రవంబు సేయు చున్న. 10

దేవతలు వైకుంఠమునకుఁ బోయి విష్ణుని స్తుతియించుట.

క. యాగాదిపుణ్యకర్మ, త్యాగము మర్త్యమున నైనఁ దా రధికభయో
ద్వేగంబునఁ బురుహూతపు, రోగము లై యగ్నియమవరుణధనదాదుల్. 11

క. చని వైకుంఠంబునఁ బ్రభు, వనపతి వైకుంఠు గరుడవాహను విష్ణున్
దనుజవిభంజనుఁ గని యి, ట్లని రెంతయు భక్తితోఁ గృతాంజలు లగుచున్. 12

వ. దేవా నీవు వరాహరూపధరుండ వై మహీతలం బెత్తి నరసింహరూపంబు దాల్చి యాదిదైత్యు హిరణ్యకశిపు వధించి వామనుండ వై బలిం గట్టి యజ్ఞమూర్తి వై యజ్ఞవిఘ్నకరుం డైనజంభుం డనుదానవుం జంపి యండజజరాయుజస్వేదజోద్భిజంబు లనం బరఁగినచతుర్విధప్రజల రక్షించు చున్నజగద్రక్షకుండవు గావున నీకు విన్నపంబు సేసెద మిప్పుడు జగంబుల కైనయుపద్రవంబు చిత్తగింపుము. 13

సీ. కాలకేయులు మహాకాయులు పగలెల్ల, జలదుర్గబలమున జలధి నుండి
రే లెల్లఁ జని నలిరేఁగి మునీశ్వరా, శ్రమముల సద్ధర్మచారు లైన
బ్రాహ్మణప్రవరులఁ బాయక వధియింతు, రట్టిపాపాత్ములు నెయ్యుగముల
బ్రాహ్మణహింస యాపాదింతురే యది, వీరలవలనన వినఁగఁ బడియెఁ

ఆ. బరమసాధు లైనబ్రాహ్మణులకు బాధ, యగుడు మహికి బాధ యగు ధరిత్రి
కైనబాధఁ జేసి యఖిలలోకంబులుఁ, గరము బాధ నొందుఁ గమలనాభ. 14

వ. ఎట్లనిన వేదంబులు ధరియించి విప్రులు వేదచోదితంబు లైనపుణ్యకర్మంబులు విధియించుటం జేసి హవ్యకవ్యంబుల దేవతలుం బితరులుఁ దృప్తు లైన వారివలన నెల్లలోకంబులకు సుఖం బగుం గావున బ్రాహ్మణోపద్రవంబు పరిహరించి లోకంబులు రక్షింపు మనిన దేవతలకు విష్ణుదేవుం డి ట్లనియె. 15

మత్తకోకిలము. కాలకల్పులఁ గాలకేయులఁ గాలకాయుల భూరిర
త్నాలయస్థుల వీర్యవంతుల సర్ణవంబు సమస్తస

త్త్వాలి దోఁపఁగ నట్టివర్ణ విషయం బగుట వధియింపఁగాఁ
బోల దొండువిధంబునం బరిపూర్ణ వార్ధి[1]జలోన్నతిన్. 16

క. వరుణజలంబుల మిత్రా, వరుణాతనూజుండు వీర్యవంతుం డై చె
చ్చెరఁ ద్రావ నోపు [2]నిందఱు, నరుగుఁడు ప్రార్థింపుఁ డమ్మహాత్ము నగస్త్యున్. 17

వ. అనిన నమరు లెల్ల నగస్త్యుపాలికిం జని యమ్మునివరు స్తుతియించి యి ట్లనిరి. 18

క. అమరహితంబుగ జగదహి, తము దలుఁగుము పేర్మితో బుధస్తుతగుణ విం
ధ్యము దొల్లి పెరిఁగి జగదహి, తము సేసిన నీవ కావె తలఁగితి దానిన్. 19

వ. అని దేవత లెల్ల నగస్త్యుఁ గీర్తించి రనిన విని ధర్మజుం డిది యెట్లు వింధ్యం బేల పెరిఁగె దానిం బెరుఁగ కుండ నగస్త్యుం డెవ్విధంబున వారించె నని యడిగిన నాతనికి రోమశుం డి ట్లనియె. 20

అగస్త్యుఁడు వింధ్యంబు పెరుఁగ కుండ వారించుట.

ఉ. నెమ్మి నినుండు మేరుధరణీధరనాథుఁ బ్రదక్షిణంబుగాఁ
ద్రిమ్మరు చున్నఁ జూచి పటుదీధితికిం గర మల్గి వింధ్యశై
ల మ్మనియెన్ దినేంద్ర యచలప్రభు నన్నుఁ బ్రదక్షిణంబు ని
త్యమ్మును జేయ కేల మతి దప్పితి మేరువుఁ గొల్వ నేటికిన్. 21

వ. అని గర్వించి పలికిన నప్పర్వతంబునకు భానుం డి ట్లనియె. 22

క. అనవరతము విధియోగం, బున నేఁ ద్రిమ్మరుదు నమరభూధరముఁ బ్రియ
మ్మున నాత్మేచ్ఛ యొనర్పఁగఁ, జన దనవుడు నలిగి వింధ్యశైలం బంతన్. 23

క. ఇనశశితారాదులకుం, జన రా కుండంగఁ బెరిఁగి జలధరపథ మె
ల్లను గప్పి యుండె వింధ్యం, బనుపమ ముత్తుంగ మై సురాద్రిస్పర్ధన్. 24

క. రవిశశిగతు లుడుగుడు నిది, దివ మిది రాత్రి యని వసుమతీజనులకు న
ద్దివిజమునివరుల కెఱుఁగఁగ, నవగాఢం బయ్యె నంధ [3]మయ్యె జగంబుల్. 25

వ. ఇట్లు పెరిఁగినవింధ్యంబునొద్దకు వచ్చి వేల్పు లెల్ల దానివర్ధనంబు వారింప నోపక యగస్త్యుపాలికిం జని వింధ్యంబుపెక్కువ యెఱింగించి యి ట్లనిరి. 26

క. భువనవ్యవహారమునకు, వ్యవధానం బయ్యె వింధ్యవర్ధనమున న
ద్దివసకరరజనికరగతు, లవిహత మగునట్లు సేయు మనఘ మునీంద్రా. 27

వ. అని దేవతలు ప్రార్థించిన నగస్త్యుండు లోపాముద్రాసహితుం డై వింధ్యంబు సమీపంబునకు వచ్చి దానిచేతం బూజితుం డై యి ట్లనియె. 28

క. చనియెద దక్షిణదిశ కే, నొనరఁగఁ దెరు విమ్ము నాకు నుర్వీధర నీ
వనవుడు నట్టుల చేయుదు, నని పెరుఁగుట యుడిగె వింధ్య మతివినయముతోన్.

వ. భట్టారకా విజయంచేయుం డని భూమిసమాన మై యున్న దాని కగస్త్యుం డి ట్లనియె. 30

1. గ-బలోన్నతిన్. 2. జ. మీ రం, దరుగుఁడు. 3. క. మగుచు.

క. నామగిడి వచ్చునంతకు, భూమీధర యీప్రకారమున నుండుము నా
తో మైత్రిఁ జేయు మని లో, పాముద్రాధీశ్వరుండు పలికి ముదమునన్. 31

వ. దాని నెడంబఱిచి దక్షిణదిశకుం జని లోకంబులకు హితంబుగా నంద యుండె వింధ్యంబు నగస్త్యుండు మగిడి వచ్చునంతకుఁ బెరుఁగ నోడి యున్న దని యగస్త్య మాహాత్మ్యంబు ధర్మజునకుం జెప్పి వెండియు రోమశుం డి ట్లనియె. 32

ఆ. అమరు లెల్లఁ దన్ను నట్లు కీర్తించుచు, నున్నఁ జూచి మునిగణోత్తముండు
వారి నడిగె నేమి వచ్చితి రెఱిఁగింపుఁ, డని దయాళుఁ డై ప్రియంబుతోడ. 33

వ. అనిన. 34

చ. అమరులు గాలకేయకృత మైనజగద్భయ మెల్లఁ జెప్పి యు
త్తమమునినాథ తత్ప్రతివిధానము సేసి జగంబు గావఁ జి
త్తము గలదేని విభ్రమదభ్రితరంగమహార్ణవంబుఁ బా
నము దగఁ జేసి చేయుము ఘనంబుగ మాకు మనఃప్రమోదమున్. 35

క. ఆతోయధి నీచేత ని, పీతం బగుడుం గడంగి భీమాసురసం
ఘాతంబు దత్క్షణంబ ని, పాతింతుము దివ్యశస్త్రపటు[1]ఘాతములన్. 36

అగస్త్యుఁడు సముద్రోదకంబు పానంబు సేయుట.

వ. అనిన నగస్త్యుం డట్ల చేయుదు నని యమరవరుల కెల్ల సంతోషంబుగా నప్పుడు.

సీ. రంగదుత్తుంగతరంగహస్తంబుల, నాడెడునదివోలె నతులవేగ
వాతవిధూత మై [2]వల్లెడునదివోలెఁ, బర్వతకందరోపాంతతతులఁ
దొడరెడునదివోలె [3]ధ్రువఫేనవితతుల, నగియెడునదివోలె నాగనక్ర
మకరకులక్షుభ్యమాణ మై తద్బాధ, కోపనియదివోలె నుచ్చభీమ

ఆ. నినద మగుచు నున్ననీరధియొద్దకు, నమరగణముతో మహామునీంద్ర
గరుడఖచరసిద్ధగంధర్వపన్నగ, యక్షగణముతోడ నరుగుదెంచి. 38

ఉ. అందఱుఁ జూచు చుండఁగ మహాబ్ధిజలంబులఁ ద్రావె విష్టపా
నందకరుం డగస్త్యుఁ డఘనాశనుఁ డట్లు పయోధి రిక్త మై
నం దిమికూర్మకర్కటకనక్రభుజంగచయంబుతో భయం
బందుచుఁ గాలకేయులు బయల్పడి తోఁచిరి దానిలోపలన్. 39

వ. అంత. 40

క. గీర్వాణప్రభుఁ డాదిగ, గీర్వాణగణంబు గాలకేయులతోడన్
గర్వించి రణము సేసి ర, ఖర్వపరాక్రములు గడిమిఁ గడు నుద్ధతు లై. 41

క. అనిమిషదివ్యాయుధహతి, ననిఁ గొందఱు పడిరి కొంద ఱధికవిభీతిం
జని పాతాళముఁ జొచ్చిరి, దనుజులు దైత్యులును వీర్యదర్పచ్యుతు లై. 42

1. ఖ. గ. పాతములన్. 2. గ. యేతెంచునది; జ. వర్తిల్లునది. 3. క. ధృతఫే.

వ. ఇట్లు కాలకేయులం దొట్టి యసురుల నెల్ల నిశ్శేషంబుఁ జేసి జగంబులయుపద్రవం
బుడిపి దేవత లగస్త్యునిం గీర్తించి యి ట్లనిరి. 43

క. మునినాథ నీయనుగ్రహ, మున నిగ్రహ ముడిగె నఖిలభువనంబుల కి
వ్వనధిఁ బయఃపూర్ణముఁగా, నొనరింపుము నీవ కాని యొరు లోప రిలన్. 44

వ. ఇది యనేకసత్త్వాశ్రయంబు గావున రిక్తం బై యుండఁ దగ దనిన నగస్త్యుం
డి ట్లనియె. 45

సీ. మున్ను జీర్ణం బయ్యె మున్నీటినీరు నా, కడుపునం దే నింకఁ బడయ నేర
జలరాశి నిండంగ జల మొండు నావుడు, నమరులు మునులును గమలగర్భుఁ
గానంగఁ జని దేవ మీనాకరం బేమి, తెఱఁగున నిండు మా కెఱుఁగఁ జెపుమ
యని విన్నపంబు సేసినఁ బెద్దప్రొద్దు చిం, తించి వారలకు విరించి యనియె

ఆ. వనధిఁ బెద్దకాలమున భగీరథుఁ డను, వాఁడు నించుఁ గాని వసుధ నెరులు
పూని దీని నింపఁగా నోప రనవుడు, నమరవరులు మునులు నరిగి రనిన. 46

క. వనరాశి యేమికారణ, మున నెట్లు భగీరథుండు భూరిజలౌఘం
బున నించె దీనిఁ జెప్పుమ, యని యడిగిన ధర్మజునకు నమ్ముని సెప్పెన్. 47

భగీరథుండు సముద్రము జలముచే నించుట.

వ. తొల్లి యిక్ష్వాకువంశంబున సగరుం డనురాజు హైహయుల నిర్జించి నిఖిలమహీ
రాజ్యంబు సేయుచు నపుత్రకుం డై వైదర్భియు శైబ్యయు ననునిద్దఱు భార్యల
తోడం గైలాసంబున కరిగి యందు. 48

క. దక్షమఖక్షయకరు నిట, లాక్షజహుతభక్షభక్షితానంగు విరూ
పాక్షు మహోక్షధ్వజుఁ బ్ర, త్యక్షము గావించె నుగ్రతపమున బేర్మిన్. 49

తే. హరుఁడు వానికిఁ బ్రత్యక్షమయి వరంబు, వేఁడు మనవుడుఁ ద్రైలోక్యవిభుఁడ నాకు
దయ యొనర్పుము సంతానదాన మనుచు, వేఁడెఁ బుత్రార్థి యై కడువేడ్కతోడ.

వ. ఈశ్వరుండు వానికి వైదర్భియం దఱువదివేవురుగొడుకులును శైబ్యయం దొక్క
కొడుకుం గా వరం బిచ్చి యయ్యఱువదివేవురు నతిదర్పితు లై యేకకాలం
బునఁ గాలగోచరు లగుదు రనియు నయ్యొక్కకొడుకు వంశకర్త యగు నని
యుం జెప్పి యదృశ్యుం డైన. 51

క. కొడుకులఁ బలువురఁ బడసియుఁ, బడయనియట్టి దయి ధర్మపత్నులుఁ దానుం
గడుసంతసపడ కరిగెను, దడయక సగరుండు మగిడి తనపురమునకున్. 52

వ. అంతఁ గొంతకాలంబునకు నయ్యిద్దఱు గర్భిణు లైన నందు వైదర్భికి నొక్క
యలాబూఫలంబును శైబ్యకు నసమంజసుం డనుకొడుకునుం బుట్టిన. 53

ఆ. వరదుఁ డైనయీశువరమున నిది యొక్క, వదరు పుట్టె నెట్టివరమొ యనుచు
దానిఁ బాఱవైవఁ గా నున్న నాకాశ, వాణి యిట్టు లనియె వసుమతీశ. 54

1. 'నిశ్శేషంబు సేసి' అనియే యెల్లప్రతులు.

తే. సాహసం బిట్లు సేయంగఁ జనునె దీని, బీజములు ఘృతఘటములఁ బెట్టి రక్ష
సేయ మఱువది వేవు రూర్జితులు సుతులు, మేశువరమునఁ బుట్టుదు రిందు నీకు.
వ. అనినం దద్వచనానురూపంబు సేసి రక్షించుచున్న రన్నెలలకు. 56
క. సుతషష్టి[1]సహస్రకము, ద్గత మై వరిల్లి గగనగతిఁ బఱచి శత
క్రతులోకముఁ దొట్టి మదో, ద్ధతిఁ జేసె సమస్తలోకతతులకు బాధల్. 57
క. సగరసుతు లట్లు జగముల, కొగి బాధలు సేయుచున్న నోడి మరుత్వ
న్నగవరు లరిగిరి నాలుగు, మొగములు గలవేల్పుకడకు మునిసంఘముతోన్. 58
ఆ. వారిజాసనుండు వారలు వచ్చిన, విధ మెఱింగి మీకు వెఱవ నేల
సగరసుతులు దగ్ధు లగుదురు దర్పితు, లైనవారిపేర్మి యధ్రువంబు. 59
వ. అని కమలసంభవుం డానతిచ్చిన నరిగి యమరవరు లాదిగా నఖిలలోకనివాసు
లెల్ల సగరసుతపరిక్షయం బపేక్షించి యుండునంత. 60
సీ. అశ్వమేధంబు సేయంగ దీక్షితుఁ డయ్యె, సగరుండు వానియశ్వంబు సగర
తనయులచే రక్షితం బై వసుంధర, యెల్లఁ గ్రుమ్మరి తోయహీన మైన
జలధిలోపల నదృశ్యం బైనఁ గానక, సగరున కెఱిఁగించి సగరసుతులు
జనకుశాసనమునఁ జని భూతలమునందుఁ, దడయక రోసి పాతాళతలము
ఆ. నందు రోయఁ గడఁగి యఱువది వేవురు, నొక్కమొగిన ద్రొచ్చి రుదధిలోన
జలధిపంకమగ్నసత్త్వముల్ నిశితకు, ద్దాలహతి విదారితములు గాఁగ. 61
వ. ఇట్లు ద్రొచ్చి ద్రొచ్చి సగరసుతులు సముద్రపూర్వోత్తరదేశంబునం గపిలుం డను
మహామునియాశ్రమసమీపమునందుఁ దమగుఱ్ఱంబుఁ గని సంతోసిల్లి. 62
ఆ. అశ్వమేధమునకు నర్చితం బైనయీ, యశ్వరాజు నిట్టు లపహరించి
[2]ముచ్చుగొఱక యీసముద్రదేశంబున, నోట మెడఁద లేక యున్నవాఁడు. 63

సగరసుతులు గపిలమహామునికోపాగ్నిచే భస్మమగుట.

వ. అని కపిలుం బరిభవించిన నమ్మునివరుం డలిగి యనలశిఖలు దూల నతిఘోరదృ
ష్టిం జూచిన నప్పుడు సగరసుతు లందఱు భస్మం బైన. 64
క. వీరు లగుసగరతనయుల, దారుణదాహంబుఁ జూచి తడయక చని యం
భోరుహగర్భతనూజుఁడు, నారదుఁ డంతయును సగరునకు నెఱిఁగించెన్. 65
క. దాని విని సగరుఁ డురుశో, కానలదందహ్యమానుఁ డయ్యును నయ్యా
శానువచనంబు దలఁచి ధ, రానాథుఁడు శోక[3]భరపరావృత్తుం డై. 66
వ. అసమంజసపుత్త్రు నంశుమంతుం దనమనుమనిం జూచి యయ్యా నీయయ్య లఱు
వదివేవురు నొక్కటఁ గపిలకోపానలకబళితశరీరు లయిరి భవజ్జనకుం డతిక్రూరహృ
దయుం డై పౌరబాలకుల నకారణంబ వధియించి మహానదిలో వైచుచున్న

1. అ. ముచ్చుగోర. 2. క. సహస్రము త, ద్గత మై. 3. జ. భరపంరపశుం డయ్యెన్.

నెఱిఁగి పౌరజనాక్రోశంబునం దనుక్రోశపరుండ నై వాని విడిచితి. 67

క. కొడుకులనిధనమునకు నా, కడఁగినహయమేధమఖము గడచనమికి నేఁ
గడు దుఃఖితుండ నయ్యెదఁ, దడయక నీ విపుడు దీనిఁ దలుఁగుము కడఁకన్. 68

వ. అనిన నంశుమంతుం డాక్షణంబ చని సగరసుతఖాతద్వారంబున సముద్రంబు సొచ్చి యందు సూర్యసహస్రద్యుతి యై వెలుంగు చున్నకపిలమహామునికి నమస్కరించి నిజాగమనప్రయోజనం బెఱింగించినఁ గపిలుండును వానికిం గరుణించి యజ్ఞీయం బైనయశ్వంబు నిచ్చి యి ట్లనియె. 69

క. ఘనభుజ నీకారణమునఁ, జనఁ గాంతురు పుణ్యగతికి సాగరులు ముదం
బున సగరునకును బౌరకును, నొనరఁగ సుతసంతు లైనయాయుత్తములగతుల్. 70

వ. మఱియు నీచేత నుపనీతం బైనయీయాయశ్వంబున నశ్వమేధంబు సేసి సగరుండు గృతార్థుం డగు నీపౌత్త్రుం డైనభగీరథుచేతఁ దేరం బడియెడుగంగాజలౌఘంబులం జేసి సంసిక్తు లై సగరసుతులు స్వర్గగతు లగుదురు సముద్రంబు సంపూర్ణం బగు ననిన నంశుమంతుండు సంతుష్టుం డై కపిలప్రసాదంబున నశ్వంబుఁ దెచ్చి సగరున కిచ్చి కపిలువచనంబు నెఱింగించిన సగరుండు పుత్త్రశోకం బుడిగి యశ్వమేధంబు సేసి సముద్త్రుం దనకుఁ బుత్త్రుఁగాఁ గల్పించిన నది మొదలు సముద్రంబు సాగరంబు నాఁ బరఁగె నిట్లు సగరుండు పెద్దకాలంబు రాజ్యంబు సేసి నిజరాజ్యభారం బంశుమంతునందు సమర్పించి చనిన. 71

తే. తనపితామహునట్టుల ధరణి యేలి
యంశుమంతుండు నిజపుత్త్రుఁ డగుదిలీపు
నందు రాజ్యభారముఁ బూన్చి యఖిలలోక
పూజితుండు దపోవనంబునకుఁ జనియె. 72

వ. దిలీపుండును దనపితామహు లైనసాగరు లధోగతులు గా కుండ గంగావతరణంబు నందు యత్నంబు సేసి యశక్తుం డయ్యె. 73

చ. ప్రథితయశుఁ సుతుం బడసె భారసహిష్ణు మహారథుఁ భగీ
రథుఁ డనుచక్రవర్తి నపరాజితతేజు నిజాన్వవాయదు
ప్పృథివినివర్తకుఁ సకలపార్థివజైత్రు మహాబ్ధతాసుహృ
న్నథను సురాపగానయనసామర్థతపోగుణయుక్తు నుత్తమున్. 74

వ. ఆభగీరథు నపారభూభారధురంధరుం జేసి దిలీపుండు దపోవనంబున కరిగిన. 75

తే. కపిలుకోపాగ్నిఁ జేసి సాగరులు[1] గ్రాఁగి, రనియు గతిఁ గాన కున్నవారనియు నెఱిఁగి
వారలకు హిత మొనరింప [2]వగచి గంగఁ, దేరఁ గడఁగె వీరుండు భగీరథుండు.

వ. ఇట్లు భగీరథుండు గంగావతరణంబునందుఁ గృతనిశ్చయుం డై యరిగి బహువిధాకారధాతుమంతంబు లైనయుత్తుంగశృంగంబులను జలభరవినమ్రప్రబలబలాహక

1. క. గాలి. 2. క. వలసి గంగఁ, దేరఁ బూని కడంగె భగీరథుండు.

వ్యూహసంఛాదితశ్యామాయమానంబు లైనతుహినస్థలంబులను సిద్ధవిద్యాధరగంధర్వగీర్వాణమిథునసంసేవ్యమానంబు లైన నానారత్నకందరంబులను శుకపికపారావతశుక్లాపాంగసారంగశతపత్రపుత్రప్రియదాత్యూహవ్యూహశబ్దశబ్దాయమానంబు లైనతరువనరేఖలను సింహ శరభ శార్దూల శుండాల గోలాంగూల కోలాహలాన్వితంబు లైనగుహాగహ్వరంబులనుం జేసి రమణీయభయానకం బైనహిమవత్పర్వతంబున. 77

చ. సతతకృతోపవాసముల శాకఫలోదకమూలపారణ
వ్రతముల దేవపూజల నపారజపంబులఁ జేసి నిష్ఠతో
నతులతపంబు సేసె నమరాపగ నుర్వికిఁ దెచ్చువేడ్కతో
ధృతియుతుఁ డై దిలీపకులదీపుఁడు దివ్యసహస్రవర్షముల్. 78

వ. ఆభగీరథుతపంబునకు మెచ్చి గంగాదేవి ప్రత్యక్షం బై నీయిష్టంబు సెప్పు మనినం గృతాంజలి యై యి ట్లనియె. 79

సీ. తపనతేజుం డైనకపిలుకోపంబున, గతజీవు లై పుణ్యగతులయందు
విహితు లై మత్పితామహు లున్నవారు నీ, దగుపుణ్యజలముల సగరసుతులు
సిక్తు లై స్వర్గానుభుక్తిఁ బ్రాపింతురు, [1]గావున దేవి యిద్దేవపథము
నందుండి వసుమతి కొందంగఁ జనుదేర, వలయు నావుడు మహీవలయమునకు
ఆ. నేను వచ్చునపుడు నానిరంతరజలౌ, ఘంబు దాల్ప నీలకంఠుఁ డోపుఁ
గాని యొరులు దాల్పఁగా నోప రయ్యుమా,నాథుకరుణఁబడయు నన్నుఁ దాల్ప. 80

వ. అనిన గంగాదేవివచనంబునఁ గైలాసంబున కరిగి భగీరథుండు భగవంతు నంతకాంతకు నీశ్వరుగుఱించి పెద్దగాలంబు దపంబు సేసిన నీశ్వరుండు వానికి సన్నిహితుం డయి నీవు భూలోకంబునకు గంగావతరణంబు సేయు మేను గంగ ధరియించెద నని భగీరథుండు వెండియు గంగ నారాధించిన నాతనికిం గరుణించి. 81

మ. ఇలకుఁ గంగ తరంగసంహతులతో నేతెంచె నాకాంతరం
బులు నాకాశముఁ గప్పుచుం దగ మహాభూతప్రపంచంబుతోఁ
జెలు వై యుండఁగ దాని నీశ్వరుఁడు దాల్చెన్ సంగతోత్తుంగపిం
గళజూటాగ్రమునందుఁ బద్మదళసంకాశంబుగా లీలతోన్. 82

సీ. [2]సురమునిసిద్ధఖేచరవరుల్ వచ్చి య, చ్చెరు వంది చూడంగ హరుశిరంబు
నందుండి భువనైకవందిత సురనది, ధరణీతలంబున కరుగుదెంచి
కలహంసగతియు నిర్మలఫేనహాసంబు, నాకీర్ణమీనవిలోకనములు
నాలోలపవనవాచాలితకల్లోల, రసితమృదూక్తులు - నెసఁగు చుండఁ
తే. బ్రీతితో భగీరథుఁ డనుదూతచేత, నీత యై మహామునిపరిపీతరిక్త

1. క. గాన వేఁడెద దేవి ఘనపథంబు. 2. క. సురమునిసిద్ధశేఖరులు నచ్చెరు పడి, చూడంగ హరుజటాజూటసమితి, యందుండి.

మగుసరిత్పతిఁ గూడి యాసగరజులకు, హితముగా దాని నించె నాతతజలముల.

క. సాగరులకు సద్గతి గా, సాగరమున కట్లు సలిలసంపూర్ణముగా
భూగత యై భాగీరథి, భాగీరథకీర్తి భువనపంక్తుల నిలిపెన్. 84

వ. అని యిట్లు గంగావతరణంబును భగీరథుమాహాత్మ్యంబును రోమశుండు సెప్పిన విని ధర్మజుం డనుజసహితుం డై యరిగి నందయు నపరనందయును ననుమహానదులయందుఁ గృతస్నానుం డై హేమకూటంబున నుపలంబులవలన వెలువడు దహనంబున నాహూతంబు లై వచ్చుమేఘంబులను జూచి విస్మయం బంది దాని విధం బడిగిన వానికి రోమశుం డి ట్లనియె ఋషభకూటంబున ఋషభుం డను ముని యతికోపనుం డై యెవ్వరు పలికిన నపుడ యుగ్రానలాకారుం డై యుపలంబులవలన వెలువడుమేఘంబులం బిలిచి వారల వారించు దానం జేసి తపోదాన ధర్మ శమ దమరహితు లైనజనుల కది దురారోహంబు దేవతలు దేవదర్శను లైనఋషులు నమ్మునిం జూడ వత్తు రిందు దేవఋషులు యజ్ఞంబు సేసిన యజ్ఞభూములందుఁ గుశాకారంబు లైనదూర్వాంకురంబులు యూపాకారంబు లైన వృక్షంబులుఁ గానంబడు ననిన నాపుణ్యతీర్థంబున స్నానంబు సేసి యరుగుచున్న ధర్మరాజునకు రోమశుం డి ట్లనియె. 85

క. ఇది విశ్వామిత్రునియా, స్పద మిది కౌశికి యనంగఁ బరఁగినయది య
ల్లది ఋశ్యశృంగుఁ డనుముని, హ్రాద మనపుడు ధర్మతనయుఁ డమ్ముని కనియెన్.

రోమశుఁడు ధర్మజునకు ఋశ్యశృంగుచరిత్రము సెప్పుట.

వ. ఋశ్యశృంగుం డనుమునిజన్మంబును దచ్చరితంబును విన వలయు నది యె ట్లని యడిగిన రోమశుం డి ట్లనియెఁ దొల్లి కశ్యపపుత్త్రుం డగువిభాండకుం డనుముని వరుం డఖండితబ్రహ్మచర్యంబునం దపంబు సేయుచు నొక్కనాఁ డొక్కమడువున నీళ్లాడు చున్నయవసరంబున. 87

క. సురుచిరసురూపగుణసుం, దరి యూర్వశి యనులతాంగి తద్దర్శనగో
చర యగుడు నపుడ రేత, స్కరణం బమ్మునికి నయ్యెఁ గామకృతమునన్. 88

వ. అయ్యమోఘవీర్యంబుతో మిశ్రం బయినజలంబు నొక్క[1]మనుఁబెంటి త్రావి గర్భంబు దాల్చిన నందు ఋశ్యశృంగుం డనుకుమారుండు జన్మించి తండ్రినిం దదాశ్రమంబునుం గాని యొండుచో టెఱుంగక ఘోరతపంబు సేయు చున్నంత.

తే. బలియుఁ డంగాధిపతి రోమపాదుఁ డనఁగ, ధరణిఁ బరఁగినవీరుండు దనపురోహి
తాపరాధకృతమున బ్రాహ్మణులచేత, విడువఁబడినఁ దన్మహిఁ గనావృష్టి యయ్యె.

వ. దానికి వెఱచి యాతండు బ్రాహ్మణులఁ బరమభక్తి నుపాసించి యీయనావృష్టి దోషం బేమికారణంబున నయ్యె దీనికిం దగినప్రతీకారం బెద్ది యని యడిగిన వానికిం బ్రసన్ను లై బ్రాహ్మణు లి ట్లనిరి. 91

1. మన్నుఁబిడి.

క. కడు దర్పితుఁ డని నిన్నుఁ గ, విడిచిరి బ్రాహ్మణులు వారు ◦ విడుచుట నమరుల్
విడిచిరి దానన వర్షము, దడసె భవద్దేశమునకు ◦ ధరణీనాథా. 92

ఉ. శాంతుఁడు ఋశ్యశృంగుఁ డను సన్ముని యున్నయెడన్ ధరిత్రికిన్
సంతతవర్షణం బగు భృశం బగునట్టివరంబు దొల్లి వృ
త్రాంతకుచే దయం బడసె ◦ నమ్ముని గావున ఋశ్యశృంగు వే
దాంతనివేదిఁ రాఁ బనుపు ◦ మంగమహీశ్వర నేర్పురూపునన్. 93

వ. అనిన విని రోమపాదుండు దనచేసిన బ్రాహ్మణావమానంబునకుం దగిన ప్రాయ
శ్చిత్తంబుఁ జేసి బ్రాహ్మణవచనంబున నపుడ బుద్ధిమంతులతో విచారించి విదగ్ధ
వేశ్యాంగనలం బిలువం బంచి మీ నేర్పువిధంబుల ఋశ్యశృంగుం బ్రబోధించి
యిట తోడ్కొని రం డని పంచిన. 94

క. ఆవేశ్యాజను లధికర, పానవహభక్ష్యములు విలసదనులేపనమా
ల్యావళులుఁ గొనుచు నరిగిరి, నావాశ్రమమునకు నమరనారులలీలన్. 95

వ. అట విభాండకుండును యథాకాలం బగ్నిహోత్రంబు వేల్వం దనపుత్త్రు ఋశ్య
శృంగు సమర్పించి వన్యఫలాహరణార్థంబు వనంబున కరిగినయవసరంబున నం
దొక్కజరద్వేశ్య దనకూఁతు నభినవయౌవనవిలాసవిభాసిని నమ్మునిపుత్త్రుపాలికిం
బుచ్చిన దానిం జూచి ఋశ్యశృంగుండు సంభ్రమంబున. 96

ఋశ్యశృంగుఁడు వేశ్యను మునికుమారునిఁగా భావించుట.

మధ్యాక్కర. ఎందుండి వచ్చితి ఋషికుమార యే ◦ నెన్నఁడు నిట్టి
సుందరాకారు మునిసుతునిం దొల్లి ◦ చూచి యెఱుంగ
నిం దుండు మీ వని కృష్ణమృగచర్మ ◦ కృతకుశాసనము
నం దుండఁగాఁ బనిచె ఋషి యనుబుద్ధి ◦ నత్తన్విఁ బ్రీతి. 97

వ. మఱియు నర్ఘ్యపాద్యాదివిధులను వన్యస్వాదుఫలదానంబుల దాని కతిథిపూజ సేయ
నున్న నది యమ్మునివరున కి ట్లనియె. 98

క. మాయాశ్రమ మిందులకున్, న్యాయనిధీ మూఁడుయోజనంబులు గల దేఁ
బోయెద నీవును విజయం, చేయుమ యందులకుఁ జెలిమి ◦ సేయుము నాతోన్.

వ. అ ట్లని నీచేత సత్కారంబు గొందు ననిన ఋశ్యశృంగుం డట్లు సేయుదు నని
దాని నాతిథ్యవిధానంబునం బూజించి తనకు దానియిచ్చినదివ్యగంధమాల్యంబులు
ను సరసభక్ష్యపానంబులును విచిత్రవస్త్రంబులుం బరిగ్రహించిన నదియును. 100

క. మునిముందటఁ గందుకన, ర్తనమృదుగీతములయందుఁ ◦ దనకౌశల మె
ల్లను జూపి విరచితాలిం, గన యై మునిపతికి ముదము ◦ గావించె మదిన్. 101

వ. ఇట్లు ఋశ్యశృంగుం బ్రబోధించి వేశ్యాపుత్త్రి యరిగిన దానిపోయినవలను
సూచుచు ఋశ్యశృంగుం డగ్నిహోత్రంబు వేల్వక మఱచి విపరీతబుద్ధి యై
యున్న నంత నడవినుండి వన్యఫలంబులు గొని వచ్చి విభాండకుండు గొడుకుం

జూచి యిట్లు చింతాపరుండ వై యగ్నిహోత్రంబు వేల్వక కాలాతిక్రమ
ణంబు సేసె దనినఁ దండ్రికి ఋశ్యశృంగుం డి ట్లనియె. 102

సీ. కాంచనవర్ణుండు కడురూపవంతుండు, కమ్మనిజడలతో ఘనము లగుచు
నయనంబు వట్రువ లగు రెండుపిండంబు, లురమున విలసిల్లుచుండ నఱుత
వెలుఁగుచు జపమాల వ్రేలంగ నున్నవ, నడుమును వడఁకంగ నడచునపుడు
కలహంసకూజితకలనాద మెసఁగ నా, పాలికి [1] నేఁ డొక్కబ్రహ్మచారి

ఆ. వచ్చి పోయె వానివదనంబువలన వె, ల్వడుసుగంధిమధురభాషితంబు
పోలుచు వినఁగ సమదపుంస్కోకిలాలాప, చారు వగుచు హృదయసమ్మదముగ.

క. ఆఋషికుమారుకట్టిన, చీరలు నతిమృదులములు విచిత్రములు మనో
[2]హరము వానిబృహత్కటి, భారమునం దొక్కకనకపట్టము వెలుఁగున్. 104

క. [3]పవనసమీరితమధుసం, భవవివిధప్రసవసౌరభముఁ బోలి ముని
ప్రవరునితనువునయం దు, ద్భవ మై రమ్య మయి సౌరభము విలసిల్లున్. 105

వ. మఱియు నక్కుమారుం డొక్క యెఱ్ఱనిఫలంబు దనదక్షిణపాణితలంబున నందంద చఱచుచు నది నేలం బడి యెగయం బోయినవలనికి వ్రాలుచు వాతావధూతంబైన[4]బాలవృక్షంబునుంబోలె నొప్పుచున్న యమ్మునిపుత్త్రునందు నాహృదయంబు దద్దయుం దగిలినయది. 106

ఉ. నన్నును గౌఁగిలించుకొని నావదనంబునకుఁ నిజాస్య మా
సన్నముఁ జేసి యొక్కమృదుశబ్దము సేసె మనోహరంబుగా
నెన్నఁడు నట్టిశబ్దము మునీశ్వర మున్ విని యే నెఱుంగ న
య్యన్నవబ్రహ్మచారిముఖ మంబురుహంబుసమంబు సూడఁగన్. 107

వ. నాయిచ్చినవన్యస్వాదుఫలంబు [5]లారగింప కమ్మునికుమారుం డమృతోపమానంబు లైనఫలంబులు నతిమధురంబు లైనపానీయంబులు నాకు నిచ్చిన నుపయోగించితి.

క. తనచేతిపుష్పములఁ జ, ల్లిన నంతటఁ జెదరి యవి యళిప్రకరనిపే
వన మొప్పు నున్నయవి యి, వ్వనకుసుమము లట్లు గావు [6]వరగంధంబుల్. 109

వ. నాకు నమ్మునిపుత్త్రునాశ్రమంబునందు వానితో నొక్కటఁ దపంబు సేయు చుండ నిష్టం బనినఁ గొడుకుపలుకులు విని విభాండకుండు విస్మితుం డై తపస్విలతపంబులకు విఘ్నంబులు సేయ ననేకరూపు లయి రాక్షసులు వనంబునం గ్రుమ్మరుచుండుదురు తజ్జనదత్తంబు లయినపానీయంబు లపేయంబు లతిసుగంధు లయినకుసుమంబులు మునులకు వర్జనీయంబు లని కొడుకుం బ్రబోధించి యెప్పటియట్ల వన్యఫలంబులు దేర నరిగిన. 110

క. చనుదెంచి తరుణి మునినం, దనుచిత్తంబునకు వైకృతముఁ జేసె విలా

---

1. చ. నిం దొక్క. 2. గ. హారము లతనిబృహత్కచ... వ్రేలున్. 3. గ. పవనసమీహిత. 4. గ. ఫలవృక్షంబునుం. 5. గ. లాదరింపక. 6. అ. వరగంధములన్.

సినులసహాలాపసహా, సనసహాయానములు బంధుసమములు గావే. 111

వ. ఇట్లు ఋశ్యశృంగుండు విలాసినీమోహితుం డయి తండ్రి కెఱింగింపక [1]సచ్చరిత్రం
బయినతనయాశ్రమంబు విడిచి [2]మనుష్యయోగంబునం దగిలి యక్కోమలిపిఱుం
దన చని యంగదేశంబు సొచ్చి యందు రోమపాదునాదేశంబున రాజాశ్రయం
బనుభవనంబున నుండునంత. 112

మత్తకోకిలము. అమ్మునీశునివాసశక్తిఁ దదంగదేశమునందు మే
ఘమ్ము లెల్లవలంకులం గడుఁ గ్రమ్మి సర్వజనప్రమో
దమ్ముగాఁ బ్రభవద్బృహజ్జలధార లొప్పఁగ వృష్టిఁ జే
సె మ్మహానదిదీర్ఘికాసరసీనదంబులు నిండఁగాన్. 113

వ. ఇట్లు ఋశ్యశృంగు[3]నాగతంబున నంగవిషయంబున నవగ్రహదోషంబు నిరస్తం
బైన సంతసిల్లి రోమపాదుండు తనకూఁతు శాంత యనుదాని నత్యంతకాంతిమతి
నమ్మునివరునకు వివాహంబు సేసి. 114

క. అనుభోగయోగ్యములుగా, ధనరాసులు భూషణములు దాసీనివహం
బును గాంచనమయశయ్యా,సనములు ముని కిచ్చె హృదయసంతోషముగాన్.

విభాండకుఁడు ఋశ్యశృంగుని వెదకుచు వచ్చుట.

వ. మఱియు గోసహస్రంబు లనేకంబు లిచ్చి గోకులసంకులంబుగా [4]ఘోషంబులు దే
శంబుల నెల్ల నిలిపి నిత్యసత్కారంబుల ఋశ్యశృంగునకుఁ బ్రియంబు సేయుచుం
డె నంత నట విభాండకుండు దనయాశ్రమంబునఁ గొడుకుం గానక యెల్లదేశం
బులు రోయుచు నంగదేశంబునకు వచ్చి గోగణసంకీర్ణం బైనయొక్కఘోషంబు
నందు గోపసత్కృతుం డై యొక్కదివసంబు వసియించి యిది యెవరిఘోషం బని
గోపాలకుల నడిగిన వార లి ట్లనిరి. 116

క. యతినాథ వినవె యిది నీ; సుతుఘోషం బిదియ కాదు చూడ ననేకా
యతఘోషంబులు గల వు, న్నతగుణునకు ఋశ్యశృంగునకు నిద్ధరణిన్. 117

వ. అనిన విని విభాండకుండు సంతసిల్లి ఋశ్యశృంగుతొఱ్ఱుపట్ల విశ్రమించుచు రోమ
పాదుపురంబునకు వచ్చి యందు శాంతాసహితుం డైనఋశ్యశృంగుం జూచి సంతు
ష్టహృదయుం డై తనకొడుకుం గోడలిం దోడ్కొని నిజాశ్రమంబున కరిగె నందు
వసిష్ఠున కరుంధతియు నగస్త్యునకు లోపాముద్రయు మౌద్గల్యునకు నాలాయని యైన
యింద్రసేనయుంబోలెఁ దనకుఁ బరమభక్తియుక్త యై శాంత పరిచర్య సేయు
చుండ ఋశ్యశృంగుండు సుఖం బుండె నని చెప్పిన నాకౌశికహ్రదంబున నందఱు
నభిషిక్తు లై యేనూఱుమహానదులసంగమస్థానం బయినగంగాసాగరసంగమంబుఁ
జూచుచు సముద్రతీరంబునం జని కళింగదేశంబున వైతరణి యనుమహానదిం గని
రంత రోమశుండు ధర్మరాజున కి ట్లనియె. 118

1. గ. స్వచరితం బైన. 2. గ. పుణ్యయోగంబునం గదలి. 3. జ. ననుగ్రహంబున. 4. క. గోష్ఠంబులు.

క. మునిదేవవరులు యజ్ఞము, లొనరించిరి తొల్లి దీని యుత్తరతీరం
బున నిది పుణ్యాస్పద మై, తనరును యజ్ఞావభృథశీతస్నానములన్. 119

వ. మఱియు సకలయజ్ఞంబులయందును బ్రశస్తం బయినపశుభాగంబు పశుపతికి దేవ
తలును ఋషులు నిందుఁ గల్పించి రీతీర్థం బాడినవారు దేవయానగతు లగుదు
రనినం గృష్ణాసహితుం డై ధర్మతనయుండు దమ్ములుం దానును వైతరణీస్నా
నంబు సేసి రోమశుం జూచి మునీంద్రా నాకు భవత్ప్రసాదంబున నఖిలలోకంబు
లుం గనంబడియె వైఖానసులవేదాధ్యయనశబ్దంబులు వినంబడియె ననిన విస్మితుం
డై రోమశుండు వైఖానసులనివాసం బిందులకు ముప్పదివేలయోజనంబులు గలదు
వారలయధ్యయనశబ్దంబులు వింటివి గావున నీవు దివ్యుండ వంచు నరిగి యన
వరతఫలాలంకృతం బైనయొక్కవనంబు గని యిట్లనియె నిందుఁ దొల్లి స్వాయం
భువుం డైనవిశ్వకర్మ యజ్ఞంబు సేసి. 120

క. దక్షుఁ డయి యజ్ఞదక్షిణ, దక్షిణభూభాగ మెల్లఁ దా నిచ్చె నశే
షక్షితిధరవనములతో, నక్షయమతిఁ గశ్యపునకు నాత్విజ్యమునన్. 121

వ. దాని కలిగి భూదేవి కశ్యపునకుం బట్టీక రసాతలంబునకుం బోయినఁ దత్ప్రసా
దార్థి యై కశ్యపుం డుగ్రతపంబు సేసినం బ్రసన్న యై భూమిదేవి నీరిలోనుండి
వెలువడి వేదిరూపంబునం గశ్యపునకుఁ బొడసూపె నవ్వేది యిది సుమ్ము దీని నె
క్కినవారు వీర్యవంతు లగుదు రీమంత్రంబున దీని నెక్కుండు పెఱనాఁ డిది దా
నీక సముద్రంబు సొచ్చు నని యగ్నిర్మిత్రోయోని యనునివి యాదిగాఁ గలమం
త్రంబు లుపదేశించిన. 122

క. అనుజులుఁ దానును మునిశా, సనమున నవ్వేది యెక్కి సమధికవీర్యం
బున నొప్పె బ్రాహ్మణులదీ, వన లెసగఁగ ధర్మసుతుఁడు వాసవలీలన్. 123

క. ధరణీసురవరమునిగణ, పరివృతు లై యరిగి కనిరి పాండవులు వియ
చ్చరనిర్ఝరసేవితసుం, దరకందర మగుమహేంద్రధరణీధరమున్. 124

వ. అందులమహాతపోధనులకు నమస్కారసత్కారంబుల ననఘప్రియంబు సేసి ధర్మ
రాజి ట్లనియె. 125

తే. పరమమునులార యిగ్గిరిఁ బరశురాము, శుభచరిత్రుని మీ రెప్డు సూతు రట్టి
యమ్మహాభాగుమీచూచునవసరంబు, నందు మాకును జూడంగ నమరునొక్కొ.

వ. అనిన నమ్మునిసంఘంబులోన రామానుచరుం డయినయకృతవ్రణుం డనుముని
ధర్మరాజున కి ట్లనియె. 127

తే. ధర్మతనయ మీరాక మున్ రదఱ నెఱుంగు, జామదగ్న్యుండు నిర్మలజ్ఞానదృష్టి
ననఘ యెల్లి చతుర్దశి నమ్మహాత్ముఁ, జూతు రిమ్మును లీవును జూడు మిచట. 128

వ. అనిన ధర్మతనయుండు మహేంద్రంబున నారాత్రి వసియించి యకృతవ్రణు
ని ట్లని యడిగె. 129

క. భువనజనస్తుతుఁ డగుభా, ర్గవుచరితము వినఁగ నాకుఁ గడుఁ గౌతుకగౌ
రవ మైనది దాని ముని, ప్రవర యెఱిఁగింపు కర్ణపథరమ్యముగాన్. 130

అకృతవ్రణుండు ధర్మరాజునకుఁ బరశురామునిమహిమ సెప్పుట.

వ. అని యడిగినధర్మరాజునకు నకృతవ్రణుం డి ట్లని చెప్పెఁ దొల్లి కన్యాకుబ్జంబున గాధి యనురాజుకూఁతు సత్యవతి యనుదాని భృగుపుత్త్రుం డగుఋచీకుం డను మహాముని వివాహార్థి యై గాధి నడిగిన నమ్మునివరునకు వాఁ డి ట్లనియె. 131

సీ. ఒక్కకర్ణంబు నీలోత్పలశ్యామ మై, తను వెల్ల శశిహంసధవళ మైన
యిట్టిగుఱ్ఱములు వే యిక్కన్య కుంకు వి, ట్లీ నోపు దేని మునీంద్ర దీని
నమరంగఁ బెండిలి యగు మిది మాకుల, ధర్మంబు నావుడుఁ దరుణిఁ బెండ్లి
యగువేడ్క భార్గవుఁ డప్పుడ వరుణేంద్రు, పాలికిఁ జని వానిఁ బడసి తెచ్చె
ఆ. నవనినాథ గంగయందుఁ గన్యాకుబ్జ, పురవరంబునందుఁ బుట్టె నట్టి
హయసహస్ర మమల మై నాఁటఁగోలెను, నశ్వతీర్థ మనఁగ నయ్యె నదియు.

వ. ఋచీకుండును గాధికి నిచ్ఛాసమంబు లైనహయంబుల నిచ్చి వానికూఁతు సత్యవతిం బాణిగ్రహణవిధిం బరిగ్రహించి సుంఖబున్నఁ గన్యాకుబ్జంబునకు భృగుండు వచ్చి వారలచేతం బూజితుం డై కొడుకునుం గోడలిం జూచి సంతసిల్లి యొక్కనాఁడు కోడలి కి ట్లనియె. 133

క. లలితాంగి యేను నీగుణ, ముల కతిహృష్టుండ నైతి ముద మొనరఁగ ని
మ్మల నిచ్చెద వేఁడుము నీ, వలచువరం బనిన సత్యవతి యి ట్లనియెన్. 134

వ. దేవా నీప్రసాదంబున నాకొక్కకొడుకును మాయమ్మ కొక్కకొడుకు నుదయింప వలయు నని మ్రొక్కినం గరుణించి భృగుండు నీకోరినయట్ల యగు శుచిస్నాన లయి నీవు మేడిమ్రానిం గౌఁగిలింపుము నీజనని నశ్వత్థంబుఁ గౌఁగిలింపు మను మనిన నయ్యిద్దఱుఁ దదాలింగనవిపర్యాసంబు సేసిన నెఱింగి భృగుండు కోడలి కి ట్లనియె. 135

ఉ. పుత్త్రుఁడు నీకు బ్రహ్మకులపూజ్యుఁడు పుట్టియు వాఁడు దారుణ
క్షత్త్రచరిత్రుఁ డై పరఁగు [1]సత్త్వమునన్ మఱి నీసవిత్రికిన్
క్షత్త్రియుఁ డుద్భవిల్లియు నఘక్షయకారణుఁడున్ మహాతపః
పాత్త్రుఁడు నై ధృతిం బడయు బ్రాహ్మణభావము భూరితేజమున్. 136

వ. అనిన సత్యవతి కృతాంజలి యై [2]క్షత్త్రియాచారంబు దనపుత్త్రునకుం గాక పౌత్త్రున కగునట్లుగా శ్వశురువలన వరంబు వడసి కతిపయకాలంబునకు గర్భిణి యై. 137

క. ఆదిమునిచరిత్రుఁ బడసెఁ బ్ర, సాదసమన్వితు సుపుత్త్రు జమదగ్నిఁ జతు
ర్వేదంబులయందు ధను, ర్వేదమునందును నతిప్రవీణు మహాత్మున్. 138

1. క. గ. గర్భమునన్; జ. గర్వమునన్. 2. గ. క్షత్త్రియభావంబు.

వ. ఆజమదగ్ని ప్రసేనజితుం డనురాజకూఁతు రేణుక యనుదాని వివాహం బయి దానియందు రుమణ్వత్సుషేణ విశ్వావసు రాము లనువారి నల్వురు గొడుకులం బడసి వనంబున నుగ్రతపంబు సేయుచు నొక్కనాఁడు వన్యఫలంబులు దేరం గొడుకులు వోయిన రేణుక నారిపెఱుందన పోయి యొక్కసరోవరంబునందు సభార్యుం డయి జలక్రీడ లాడుచున్నవాని మార్తికావతపతి యగుచిత్రరథుం డనురాజుం జూచి కామమోహిత యై వ్యభిచరించిన దానిదుశ్చరితం బెఱింగి జమదగ్ని కోపోన్మాదపరవశుం డై. 139

క. తనయుల నలువురఁ గ్రమమునఁ, బనిచెఁ జమదగ్ని దనదుర్భార్య వధింపన్
జననీఘాతము పాతక, మని వారలు పలుక కుండి రవ్యవసితు లై. 140

క. కడు నలిగి యమ్మునీంద్రుఁడు, గొడుకులకును శాప మిచ్చె ఘోరాటవిలో
జడమతి మృగపక్షులయి, ట్లుడుగక యజ్ఞానవృత్తి నుండుం డనుచున్. 141

వ. మఱియు నిశితపరశుహస్తు రాముం జూచి దీని వధియింపు మని జమదగ్ని పంచిన వాఁడు గురువచనంబునం దల్లిం దత్క్షణంబున వధియించిన. 142

క. శమితనిజక్రోధుం డై, జమదగ్ని తనూజుసాహసమునకుఁ దనవా
క్యము లంఘింపమికిఁ బ్రస, న్నమనస్కుం డై తనూజునకు ని ట్లనియెన్. 143

వ. నావచనంబున నతిదుష్కరం బైనకార్యంబు సేసితి నీ కిష్టం బైనవాని నెల్లను వేఁడు మిచ్చెద ననిన రాముండు సంతుష్టహృదయుం డై మదీయజనని జీవించియుండను దద్వధదోషనిష్కృతియు సహోదరులు శాపవిముక్తు లయి యెప్పటియట్ల యుండను సమరంబుల నా కప్రతిహతశక్తియు దీర్ఘాయువుం గాఁ బ్రసాదింపుం డని తండ్రివలనం దనయభిమతంబులు వడసి యుండునంతఁ గొండొకకాలంబున. 144

చ. అమితబలుండు హైహయుఁ డహర్పతితేజుఁ డజేయబాహువి
క్రముఁడు సహస్రబాహుఁ డనఁ గా విదితుం డగువాఁడు తద్వనాం
తమున మృగవ్యఖిన్నుఁ డయి తా జమదగ్నిమహామునీంద్రునా
శ్రమమున కేఁగుదెంచె బహుసైన్యముతో నధికశ్రమార్తుఁ డై. 145

వ. అందు మునివరుచేతం బూజితుం డయ్యును వాఁడు దనరాజ్యమదంబున మెచ్చక యయ్యాశ్రమవాసుల కవమానంబు సేసి యందులవృక్షంబు లెల్ల విఱిచి జమదగ్ని హోమధేనువును దరుణవత్సంబుతోఁ గట్టి కొనిపోయిన నప్పు డవ్వనంబుననుండి సమిత్కుశఫలంబులు గొని వచ్చినరామునకు జమదగ్ని యి ట్లనియె. 146

క. వినవయ్య కార్తవీర్యుఁడు, మనధేనువుఁ బట్టికొని సమర్థుం డయి పె
ల్చన పోయె నేమి సేయుద, మనవుడు రాముండు విని మహాక్రోధమునన్. 147

క. గురువచనచోదితుం డై, సరభసగతి వానిపెఱుఁదఁ జని తద్బలముల్
శరవృష్టి ముంచి చంపె న, పరిమితలయకాలమేఘపటలము పోలెన్. 148

వ. మఱియును. 149

పరశురాముఁడు కార్తవీర్యునిఁ జంపుట.

చ. బలిమి నశేషలోకపరిభావిమహాద్భుతశౌర్యసంపదం
బొలుచుసహస్రబాహుకరముల్ కులిశాతినిశాతబాణధా
రల నతివీరుఁడై తునిమి రాముఁ డరాతులకుం భయంబుగాఁ
గలహములోన వాని నతిగర్వితుఁ జంపెఁ బరాక్రమోన్నతిన్. 150

వ. అంతం గార్తవీర్యునిపుత్త్రులు బద్ధవైరులై రామరహితం బయినజమదగ్న్యాశ్రమంబునకు వచ్చి యందు. 151

మ. మునులం దిట్టుచుఁ బుష్పవృక్షతతు లున్మూలించుచుం గ్రూరులై
యనవద్యుం జమదగ్నిఁ బట్టి బలిమిం హా రామ హా రామ యం
చును నాక్రోశము సేయుచుండఁగ మునుల్ శోకింప ధర్మాత్ము న
మ్మునిముఖ్యుం వధియించి రాగ్రహమహామోహాంధులై హైహయుల్. 152

చ. వఱలఁగ రాముఁ డంత ననవద్యుఁడు వచ్చి బహుప్రలాపయై
యఱచుచు నున్నతల్లిని గృతాంతవశస్థితుఁడైనతండ్రి నొ
క్కఱఁ గని తీవ్రశోకపరిఖేదహతుం డయి తత్ప్రకార మం
దెఱిఁగి మహార్తమేనియు సహింపఁగ నోపక కోపదీప్తుఁడై. 153

చ. అనఘు [1]ననాతతాయి గరుణాత్ముఁ బ్రశాంతు ననాగసుం మహా
మునివరుఁ జూచి చూచి యధముల్ వధియించిరి దీనఁ జేసి దు
ర్జను లగు చున్నక్షత్త్రియులఁ జంపుదు నంచుఁ బ్రతిజ్ఞ సేసె భూ
వినుతుఁడు జామదగ్న్యుఁ డతివీరుఁడు లోకభయంకరాకృతిన్. 154

వ. ఇట్లు కృతప్రతిజ్ఞుం డై క్షత్త్రియులనెల్ల వధియించి [2]దిగ్దంతిదంతార్గళాఘాటమహీచక్రంబు సాధించి విహితవివిధాధ్వరుం డై కశ్యపునకు నార్త్విజ్యదక్షిణగా నఖిలభూవలయంబు నిచ్చి నిస్సంగుం డై మహేంద్రపర్వతంబునం దపోనిత్యుం డై యున్నవాఁ డని పరశురామచరితంబు సెప్పిన విని ధర్మజుం డనుజబ్రాహ్మణసహితుం డై మునిగణోపదేశంబునం జతుర్దశినాఁడు పరశురాముం జూచి పరమభక్తిం బూజించి తత్ప్రీతిపూజితుం డై దక్షిణదిక్కునకుం జని. 155

క. భూవినుతం బై త్రిభువన, పావన మై త్ర్యంబకప్రభవ మైనజలా
ఘావలిఁ బవిత్ర మగుగో, దావరిఁ బుణ్యానదిఁ గనియె దక్షిణగంగన్. 156

శా. గోదేవక్షితిదేవభక్తిపరుఁ డై గోదావరీస్నాతుఁ డై
గోదానంబులు హేమదానములుఁ బెక్కుల్ రత్నదానంబులుం
భూదేవోత్తమపూజ సేయుచు జగత్పూజ్యుండు ధర్మాత్మజుం
డాదిత్యాభుఁ డనేకతీర్థశతసేవాసక్తిఁ బుణ్యాత్ముఁ డై. 157

వ. ద్రవిడదేశంబున నగస్త్యతీర్థం బాడి యందుఁ దొల్లి యర్జునుచేసినగోసహస్రదానా

---

1. నివీతరాగుఁ. 2. క. దిగ్దంతిదంతార్గళాభరణీభూతమహీ.

దివివిధదానంబులు విని వానిం బ్రశంసించుచుం జని శూర్పాకారం బనుతీర్థంబు నం బర్వతోత్సేధం బయినపరశురామవేదిం గని సముద్రతీరంబునకుం జని ప్రభాస తీర్థంబునం బండ్రెండు దినంబులు పంచాగ్నిమధ్యంబునం బవనాంబుభక్షుండు డై ధర్మజుండు దపంబు సేసిన. 158

ఆ. దాని నెఱిఁగి రామదామోదరులు వృష్ణి,వరులతోడఁ బ్రీతి నరుగుదెంచి
కనిరి సకలతీర్థగమనపథిక్లేశ, కృశులఁ బాండుసుతుల విశదయశుల. 159

క. చీరాజినధారుల నవి, కారతపోయశులఁ జూచి కడు దుఃఖితులై
వారిజదళాక్షి ద్రౌపది, నూరార్చి రుదారహితమృదూక్తుల నొప్పన్. 160

వ. వారికి ధర్మతనయుండు దమవనవాసతీర్థగమనాయాసంబును నర్జునుదివ్యాస్త్ర లాభంబును నింద్రునొద్ద నాతనియునికియుం జెప్పిన విని రాముండు కృష్ణాదులైన వృష్ణివరుల కి ట్లనియె. 161

సీ. మతిహీనుఁ డై తనసుతులపల్కులు విని, ధృతరాష్ట్రుఁ డీపాండుసుతులఁ బాప
భీరుల నపగతధారుణీరాజ్యులఁ, జేసి యుగ్రారణ్యవాసగతులఁ
గావించె నిది ధర్మువే విచారవిహీనుఁ, డయ్యె భీష్మాదులు నెయ్య మురివి
వారింపఁగా [1]దీని నేరర దృఢసత్య, రతులకు [2]దేవసన్మితుల కహిత

ఆ. మాచరించు చున్నసీచదుర్యోధనా, దులకు వర్ధనమును నలఘులైన
పాండునందనులకు దండితారుల కవ, ర్ధనము నిట్లు సేయఁ దగునె విధికి. 162

క. ధరణీతలంబు నిర్ధా, ర్తరాష్ట్రముగఁ జేసి యనఘు ధర్మైకధురం
ధరు ధర్మతనూజు వసుం, ధర కధిపతిఁ జేయ కుండఁ దగునే మనకున్. 163

వ. అనిన బలదేవునకు సాత్యకి యి ట్లనియె. 164

చ. అనుపమశౌర్యవంతులు ననంతబలాఢ్యులు నీవు నీజనా
ర్దనుఁడును సాంబసారణులు దర్పకవీరుఁడు నుండఁ బాండునం
దనులు సుయోధనాదులకృతంబున నిట్టు లనాథులట్ల యి
వ్వనమున నుండఁగాఁ దగునె వన్యఫలాశను లై విహీను లై. 165

తరలము. అహితచిత్తవిదారణక్రియలందుఁ బ్రౌఢము లై జగ
త్కుహర మంతయు మ్రోయు చుండఁగ ఘోరయాదవసైన్యస
న్నహనదుందుభినాదముల్ గగనంబు దిక్కులు నిండ దు
స్సహము లయ్యెడు ధార్తరాష్ట్రులసైన్యవీరభటాలికిన్. 166

మ. ఘనమై నీపృథుబాహులాంగలముఖాఘాతంబుతోడన్ జనా
ర్దనశార్ఙ్గచ్యుతసాయకావలియుఁ గంద ర్పేషుజాలంబు నీ
యనిరుద్ధోగ్రశిలీముఖాలియు మదీయాస్త్రౌఘముర్ ధార్తరా

1. గ. విన నేరఁడు. 2. క. దేవనిర్మితు.

ప్రనికాయోత్తమకాయఖండనపటిష్ఠం బయ్యెడుం బోరిలోన్. 167

వ. కేకయ సృంజయ పాంచాల వృష్ణి భోజాంధకవీరులుం గృష్ణానుమతు లయి యుద్ధంబున ధృతరాష్ట్రపుత్త్రులను భీష్మద్రోణకర్ణాదులను వధియింతురు ధర్మరాజు దమ్ములుం దానును సమయాబ్దంబులు సలిపి రాజ్యాభిషిక్తుం డగునంతకు నతిరథు నభిమన్యు నఖిలరాజ్యరక్షకుం జేసి యుండుద మనిన సాత్యకిపలుకుల కనుకూలుం డయి వాసుదేవుండు ధర్మరాజున కి ట్లనియె. 168

ఉ. ఈతనిపల్కినట్ల ధరణీశ్వర నీరిపులన్ మహాబలో
పేతులఁ బోరఁ జంపుద రభేద్యులు వీరలు మీకు భూతధా
త్రీతలరాజ్య [1]మెల్ల నగుఁ దెల్లము నావుడు ధర్మనందనుం
డాతతకీర్తి యి ట్లనియె నమ్మురవైరికి సీరపాణికిన్. 169

ఉ. మీదయ మాకుఁ గల్గఁగ నమిత్రుల నోర్చుట యేమిపెద్ద ధ
ర్మోదయనిత్యబుద్ధుల నుత్తమకీర్తుల నొప్పు ద్రోణభీ
ష్మాదులసన్నిధానమున నమ్మెయిఁ బల్కినపల్కు దప్పఁగాఁ
గా దని ధర్మనందనుఁడు గ్రమ్మఱిచెన్ యదువీరకోపముల్. 170

వ. యాదవులు పాండవుల వీడ్కొని పోయి రట పాండవులు సోమమిశ్రితతోయమైనపయోష్ణియందుఁ గృతస్నాను లయి యున్న నందు ధర్మరాజునకు రోమశుం డి ట్లనియె. 171

క. మనుజేంద్ర దీనితీరం,బున నృగుఁ డనురాజు యజ్ఞములఁ జేసిన నం
దనిమిషపతి తృప్తుం డై, దనుజుల నోర్చెనటె ఘోరతరశస్త్రములన్. 172

వ. మఱియు నింద తొల్లి [2]యాధూర్తరయసుం డైనగయుండు హిరణ్మయంబు లయినచషాలస్థాలీయూపచమసపాత్రీస్రుక్స్రువంబులును దేవస్థాపితంబు లయిన యూపంబులు నొప్ప నే డశ్వమేధంబులు సేసి యసంఖ్యాతంబు లయినధనంబుల ఋత్విజులను సదస్యులనుం బూజించి సువర్ణమయగోదానంబు లనేకంబులు బ్రాహ్మణుల కిచ్చి యక్షయంబు లయినయింద్రలోకసుఖంబులం బడసెఁ బయోష్ణియందుఁ గృతస్నాను లైనవారు దేవసాయుజ్యంబుఁ బడయుదు రని చెప్పుచుం జని నర్మదాస్నానంబుఁ జేసి వైదూర్యపర్వతంబుఁ గని రోమశుండు ధర్మరాజున కి ట్లనియె నిది త్రేతాద్వాపరసంధి యీసరోవరతీరంబు సంయాతియజ్ఞప్రదేశంబు మఱియు నిందు భృగుపుత్త్రుం డయినచ్యవనుండు సంయాతి యనురాజు కూఁతు సుకన్య యనుదాని వివాహం బయి వానియజ్ఞంబున నింద్రు [3]నాద

1. క. మేల నగు. 2. 'యాధూర్తరజసుం' డని మూలము. అయిన నిందు ద్వితీ. ఆశ్వా-318-వ పద్యమునఁ 'అనఘుం డధూర్తరయగప్రియపుత్త్రుండు, గయుఁ' డని యుండుటచే నిట యాధూర్తరయసుం డనఁబడియె. 3. క. గ. నారాధింపక.

తిరుపతి వేంకటకవులు

రింపక యాశ్వినుల సోమపీథులం జేసె ననిన నది యె ట్లని యడిగిన ధర్మజునకు
సౌకన్యాఖ్యానంబు సవిస్తరంబుగా రోమశుం డి ట్లనియె. 173

రోమశుఁడు ధర్మజునకు సౌకన్యాఖ్యానంబు చెప్పుట.

క. ఇక్ష్వాకులనిసమీపంబునఁ, బెక్కగు వేలేండ్లు తపము భృగుసుతుఁడు గరం
బక్కజముగ నొనరించెను, [1]వెక్కక యమనియమనిరతి వీరాసనుఁ డై. 174

క. అమ్మునిదేహము వల్మీ, కమ్మునఁ గప్పంగఁ బడి నికటవల్లీగు
ల్మములు పైఁ బ్రాఁకిన [2]నన, యమ్మును నేర్పడక యుండె నవ్వనభూమిన్. 175

వ. అంతం బెద్దగాలంబునకు సంయాతి యనురాజు దనచతుస్సహస్రదేవీనివహంబు
తోడఁ దత్సరోవరంబున విహరింప నరిగిన నాతనికూఁతురు సుకన్య యనునది
యిష్టసఖులతోఁ గ్రుమ్మరుచున్న నవ్వల్మీకంబునందు. 176

క. విద్యుల్లతాంగి భార్గవు, నుద్యన్నయనములు మెఱచుచున్నను విలస
త్ఖద్యోతద్యుతు లొకొ యని, సద్యస్సంజాతబుద్ధిసంభ్రమ యగుచున్. 177

వ. అప్పు డప్పుట్ట గ్రొప్పించిన నలిగి నిమీలితనయనుం డై చ్యవనుండు సంయాతి
సైన్యంబుల కెల్ల మూత్రపురీషనిరోధంబుఁ జేసిన నది దనసైన్యాపరాధంబున
నయ్యెఁ గా వగచి వాఁ డెల్లవారి నడిగి తత్కారణం బెఱుంగ నేరక చింతా
పరుం డై యున్నఁ దండ్రికడకు వచ్చి సుకన్య యి ట్లనియె. 178

తే. మిన్నమిడుగుఱు [3]లై రెండు మెఱచుచున్న
మెఱుఁగు లొకపుట్టలో నున్న నెఱుఁగ కేను
బుట్ట గ్రొప్పించి యారెంటి [4]పొడవుఁ గాన
కుడిగి వచ్చితి విస్మయపడి మనమున. 179

వ. ఈసైన్యనిరోధంబున కిది నిమిత్తం బగునో యనిన సంయాతి యప్పు డాపుట్ట
యొద్దకు వచ్చి యందుఁ దపఃక్లేశత్వగస్థిభూతశరీరు నతివృద్ధు భార్గవుం గని నమ
స్కరించి యి ట్లనియె. 180

క. అమితం బగుమీతపమున, హిమ యెఱుఁగక యిట్లు చేసె నిది దీని సహిం
పుము దయ మత్సైన్యనిరో, ధము వాపుము మెఱుక గలరె తరుణులు ధరణిన్.

వ. అనిన భార్గవుండు కరుణించి యతిశయరూపయౌవనగర్విత యైనయాకన్యకం
బరిగ్రహించి కాని క్షమింప ననిన సంయాతి తనకూఁతు నమ్మునివరున కిచ్చి నిజ
సైన్యనిరోధంబుఁ బాచికొని చనిన. 182

ఆ. పతికిఁ బరమభక్తిఁ బరిచర్య సేయుచు, నొనరఁగా సుకన్య యుండు నంత
నాలతాంగికడకు నాశ్వినుల్ వచ్చి త, న్మెఱుఁగఁ జెప్పి దాని కిట్టు లనిరి. 183

వ. అవ్వా నీ వెవ్వనికూఁతుర వెవ్వనిభార్య వని యడిగిన నేను సంయాతికూఁతుర
భార్గవుం డయినచ్యవనునిభార్య నని చెప్పిన విని వారలు నగి యక్కటా యిట్టి

1. గ. వెక్కస మగునియమ. 2. జ. గాఁ, యమ్మును. 3. గ. లట్టులై • మెఱసి రెండు. 4. జ. పొలుపు.

రూపవిభవంబులు వడసి కామభోగబాహ్యుఁ డయినవృద్ధు భార్గవుని వరియించి నీజవ్వనం బెల్ల వృథ చేసి తింక నైనను నీవయోరూపంబులకుం దగినవరు వరియింపు మేము వానిఁ దెచ్చెద మనిన నప్పలుకులు సహింపక సుకన్య యాశ్వినుల కి ట్లనియె. 184

ఆ. చ్యవనునందు నాకు సంతతప్రీతి యై, యుండ నిట్లు పలుకు టుచిత మగునె
యని నిజేశ్వరునకు నప్పుడ వారల, పలుకు లెల్లఁ జెప్పెఁ బంకజాక్షి. 185

వ. చ్యవనుండు దానిపతివ్రతాత్వంబునకు సంతోసిల్లి వారలపలుకుల కొడంబడు మని పంచిన నది పతిచేత ననుజ్ఞాత యై చని నాకు నవయౌవనవరుం గావింపుం డనిన నాశ్వినులప్పు డక్కొలను సొచ్చిరి భార్గవుండును వారితోడ సరఃప్రవేశంబు సేసె ని ట్లమ్మువ్వురు నవయౌవను లయి సుకన్యకడకు వచ్చి నిలిచి మాయందు నీవలచువానిని వరియింపు మనిన నది తనపతి యైనభార్గవుని వరియించె నంత నయ్యాశ్వినుల కతిప్రీతుం డయి చ్యవనుం డి ట్లనియె. 186

చ్యవనుఁ డాశ్వినుల సోమపీథులఁ జేయుట.

తే. ఏను మీకారణంబున నిపుడు లబ్ధ, యౌవనుండ నై ధన్యుండ నైతి మిమ్ము
సోమపీథులఁ జేసెద సురలరాజు, సూచు చుండఁగ సంయాతిసుక్రతువున. 187

వ. అని చెప్పిన నాశ్వినులు సంతసిల్లి యరిగి రట సంయాతి భార్గవుజరాభారపరిత్యాగంబు విని విస్మితుం డై యల్లునిం గూఁతుం జూడ వచ్చిన నాతని సత్కృతుం జేసి భార్గవుం డి ట్లనియె. 188

క. విదితముగ నిన్నుఁ జేయిం, చెదఁ గ్రతువు ధరాధినాథ చేయుము నీ క
భ్యుదయం బగు సంభారస, ముదయము సమకట్టు మనిన మునివచనమునన్. 189

క. అనఘుఁడు సంయాతి మఖం, బొనరించె విధిప్రయోగయుతముగ నం దా
శ్వినులకు సోమం బీఁ బో, యిన భృగుపుత్రునకు నలిగి యింద్రుం డనియెన్.

క. వీ రిద్దఱు సోమార్హులు, గా రమరులవెజ్జు లిది యకర్తవ్యము బృం
దారకులు గానివారికి, [1]నారింపక సోమ మిచ్చువారుం గలరే. 191

వ. అనిన నింద్రువచనం బాదరింపక చ్యవనుం డాశ్వినుల సోమపీథులం జేసిన దాని సహింపక యింద్రుం డలిగి. 192

క. జృంభించి వజ్ర మెత్తిన, జంభాంతకు వజ్రయుతభుజస్తంభమ్మున్
స్తంభించి యతనిఁ బటుసం, రంభంబునఁ జంపఁ గడఁగి రౌద్రాకృతితోన్. 193

క. చ్యవనుఁడు వేల్చిన నం దు, ద్భ[2]వ మయ్యె నపారఘోరబలయుతుఁడు మహా
జవుఁడు మదుం డనురాక్షసుఁ, డవనిచరద్యుచరభీకరాకారుం డై. 194

వ. ఇ ట్లుద్భవించి దశసహస్రయోజనాయామంబు లైనబాహుదండంబులయు శతశతయోజనాయామంబు లైనచతుర్దంష్ట్రలయు దశయోజనాయామంబు లైనదశనం

1. గ. వారింపఁగ. 2. క. వ మై కృత్యకుఁ డపారంబల; గ. వించెఁ గృత్య యనివార్యంబల.

బులయు శశిరవిమండలసదృశంబు లైననయనంబులయుఁ గాలాగ్నిసన్నిభం బైన వక్త్రంబును దిగ్వ్యాపనభోభాగసంకటం బైనశరీరంబునుం దోడ భూమి నొక్కహనువును దివంబున నొక్కహనువునుగా వదనగహ్వరంబు దెఱచి జగజ్జన[1]సంగ్రసనవ్యగ్రసంచలనం బైనదీర్ఘజిహ్వా నధరోష్ఠపుటంబు నాకుచు నత్యుగ్రనాదంబున దిక్కులు వ్రచ్చుచు వచ్చుమహారాక్షసునిం జూచి సురేంద్రుండు వెఱచి భార్గవస్తంభితభుజుండు గావున వాని నెద్దియుం జేయ నేరక చ్యవనునొద్దకు వచ్చి కృతాంజలియై మునీంద్రా నీతపోవీర్యమహారంభంబు మిథ్య యగునే యాశ్వినులు నేఁడు మొదలుగా సోమార్హు లగుదురు నీవు నాకుఁ బ్రసన్నుండ వై క్షమింపు మనిన.

క. మునినాథునలుకతోడన, యనిమిషపతివజ్రయుతమహాభుజసంస్తం
భన ముడిగె నంత భృగునం,దను వీడ్కొని యింద్రుఁ డరిగెఁ దనపురమునకున్.

వ. అమ్మదరాక్షసుండు నాక్షణంబ చ్యవనునుపదేశంబున మద్యస్త్రీమృగయాక్షంబుల నాశ్రయించె నాశ్వినులు సోమపీథు లై దివంబున కరిగి రిట భార్గవుం డైనచ్యవనుండు తనతపోమహత్త్వంబు నందుఁ బ్రకాశింపఁజేయుటం జేసి నాఁటంగోలె నది యార్చీకపర్వతంబు నాఁ బరఁగె నని రోమశుండు సెప్పిన నందులఁ బుణ్యసరోవరంబునం గృతస్నాను లై పాండవు లరిగి యంత శాంతనుశునకనరనారాయణవిధాతృతపోవనస్థానం బై దేవర్షినివాసం బైనసైంధవారణ్యంబునం జంద్రసరోవరంబునందు రోమశనియుక్తు లై చరువులు చేసి యతిథులం బూజించి చని యమునానదిం గని రంత వారలకు రోమశుం డి ట్లనియె. 197

మాంధాతృచరిత్రము.

క. ఇది యమున యనుమహానది, త్రిదశనదీనిభము దీనితీరమున జగ
ద్విదితుఁడు మాంధాతృఁడు సం,పదఁ గ్రతువులఁ జేసెఁ దొల్లి బహువత్సరముల్.

వ. అనిన మాంధాతృజన్మంబును వానిచరితంబును విన వలతుం జెప్పు మని యడిగిన ధర్మరాజునకు రోమశుం డి ట్లనియె. 199

ఉ. వీడున నశ్వమేధములు వే యొనరించినధర్మశీలుఁ డి
క్ష్వాకుకులోద్భవుండు బలవంతుఁ డనంతయశుం డవార్యవీ
ర్యాకరుఁ డుత్తముండు యువనాశ్వుఁ డపత్యము లేమిఁ జేసి దుః
ఖాకులుఁ డై ప్రధానవరులందు సమర్పితరాజ్యభారుఁ డై. 200

వ. భృగునాశ్రమంబునకుం జని పుత్త్రకాముం డై పెద్దకాలం బమ్ముని నుపాసించిన నయ్యువనాశ్వునకుం గరుణించి భృగుండు పుత్త్రకామేష్టిఁ జేసి యందు మంత్త్రపూతజలపూరితం బైనకలశంబు వడసి దాని రక్షించి యుండ ఋత్విజులం బంచిన.

ఆ. రాత్రి జాగరణభరశ్రాంతు లై వారు, నిద్రఁ బొంది యుండ నీరువట్టి
ధారుణీశ్వరుండు తన్మంత్రకలశోద, కంబు లెల్ల ద్రావెఁ గడుపు నిండ. 202

1. క. సంత్రాసనవ్యగ్ర.

వ. దాని నెఱింగి భృగుండు యువనాశ్వుం జూచి నీకుఁ బుత్త్రార్థంబుగా మదీయ తపోవీర్యలబ్ధం బైనయిమ్మంత్రజలంబు నీభార్య కీ నున్నచో నీ వధికపిపాసాపరుండ వయి యుపయోగించి యకర్తవ్యంబుఁ జేసితి దైవకృతం బెవ్వరికిఁ దప్పింప నశక్యంబు దీనంజేసి నీకు గర్భం బై యింద్రసదృశుం డైనపుత్త్రుం డుద్భవించు ననిన విని యువనాశ్వుండు దనపురంబునకుఁ జని యున్నంత నూఱేండ్లకు యువనాశ్వు వామభాగంబు భేదించుకొని బాలార్కతేజుం డైనబాలకుండు వెలువడిన నక్కొడుకుం జూడ నింద్రుండు వచ్చి వానివదనంబున నిజప్రదేశినిఁ బెట్టి యమృతమయం బగుదీనిం ద్రావు మనిన నింద్రువచనంబున నమరు లెల్ల నక్కుమారునకు మాంధాతృం డనునామంబుఁ జేసి రట్లు సురేంద్రసంవర్ధితుం డై. 203

తే. ధ్యానమాత్రనచేసి వేదములు సర్వ, శాస్త్రములు ధనుర్వేదము సకలదివ్య
సాయకప్రయోగంబులుఁ జట్ట వచ్చి, పొందె మాంధాతృఁ ద్రిభువనపూజ్యతేజ.

వ. మఱియు నమ్మాంధాతృండు మహేంద్రుచేత మహామహీరాజ్యంబున కభిషిక్తుం డై చక్రవర్తియై శక్రునర్ధాసనం బెక్కి యాజగవం బనుధనువును దివ్యాస్త్రంబులు నభేద్యకవచంబును ధరియించి నిఖిలలోకజైత్రుం డై సంపూర్ణదక్షిణక్రతువు లనేకంబులు చేసి పద్మసంఖ్యలు గోదానంబుల బ్రాహ్మణులం దనిపి నిజశాసనంబునఁ ప్రజల నెల్ల నిలిపి. 205

మధ్యాక్కర. భూమి కనావృష్టి యైనఁ గడు నల్గి పురుహూతుతోడ
భీమసంగ్రామంబుఁ జేసెఁ దనదివ్యపృథుసాయకముల
సామజావలి నేయునట్లు మేఘసంచయముల నేసి
భూమికిఁ గురియించె వర్షములు సస్యముల్ వృద్ధిఁ బొంద. 206

వ. ఇది యమ్మాంధాతృదేవయజనస్థానంబు మఱి యిక్కురుక్షేత్రంబునందు సరస్వతీతీరంబున సోమకుం డనువాఁడు యజ్ఞంబుఁ జేసి పుత్త్రశతంబుఁ బడసె ననిన నది యెట్లని ధర్మజుం డడిగిన రోమశుం డి ట్లనియె. 207

సోమకుం డనురాజర్షి చరిత్రము.

క. సోమకుఁ డనురాజర్షి మ, హామఖ మొనరించి జంతుఁ డనునొక్కసుతుఁ
భూమీశ పడసె నాతని, భామలు నూర్వురును గొడుకుఁ బరమప్రీతిన్. 208

క. తమతమపుత్త్రుఁడ కాఁ జి, త్తములం జేకొని దయం బృథగ్భావము లే
క ముదంబునఁ బెంచిరి లో, కమునజనుల్ చోద్య మందఁగాఁ గడువేడ్కన్. 209

వ. ఒక్కనాఁ డబ్బాలకుకురువు చీమ గుట్టినఁ దద్వేదన సహింప నోపక యేడ్చుచున్న వానికడకుఁ దల్లు లందఱుఁ బఱతెంచి యేడ్చిన నయ్యాక్రందనధ్వని విని సంభ్రమించి సోమకుం డంతఃపురంబునకుం జని కొడుకు నూఱార్చి సభాస్థితుండై మంత్రులకు ఋత్విజులకు ని ట్లనియె. 210

ఆ. కోరి యొక్కకొడుకుఁ గొడుకుఁగా నే నెట్లు, నమ్మి యుండనేర్తు నాకు సతులు

పశువధించి అనవచ్చా? 'పశువధింబు' ఉన్నదేమరి!

శతము గలిగియుండ సంతాన మల్ప మై, యునికి మీకుఁ జూడ ననుచితమగునె.

వ. అనిన వానికి ఋత్విజుం డిట్లనియె. 212

తే. ధరణినాథ నీభార్యాశతంబునందుఁ, బరఁగ నూర్వురు పుత్రులఁ బడయ నీకు
నభిమతం బేనిఁ దగుఁ దగదనక నీవు, కడఁగి మాచేయఁ బంచిన క్రతువు సేయు.

వ. ఈజంతుం బశువుగా వధించి తద్వపాహవ్యంబుల హవ్యవాహునిం దనిపిన దాన
నీనూర్వురుభార్యలకు నూర్వురుకొడుకులు పుట్టుదు రం దగ్రజుం డైనజంతుండు
సౌవర్ణలక్షణలక్షితసవ్యపార్శ్వుం డై యుదయించు నని చెప్పి ఋత్విజుండు సోమ
కునిచేత ననుజ్ఞాతుం డై. 214

క. తనయుఁ బశువఁజేచి తద్వపఁ, గొని వేల్చినఁ జూచి యార్తకురరీనాదం
బున నేడ్చిరి కడు నడలుగఁ, దనుమధ్యలు నూర్వురును సుతస్నేహమునన్. 215

క. ఇమ్ముగఁ దద్ధూమాఘ్రా, ణమ్మున గర్భములు దాల్చి నాతులు నవమా
సమ్ములు నిండుడుఁ గనిరి ము, దమ్మున జంతుప్రముఖసుతప్రకరమ్మున్. 216

వ. అందు జంతునకు నందఱు నెప్పటియట్ల తల్లులు సమస్నేహ లై యుండం బుత్రులు
నూర్వురుం బెరిఁగి సమర్థు లై యున్నఁ బెద్దకాలంబునకు ఋత్విజుండు పరలోక
గతుం డై ఘోరనరకానలంబున నెరియుచు నుండె నంత సోమకుండును దేహ
త్యాగంబు సేసి యమరలోకంబున కరుగువాఁడు ముందట నరకానలపచ్య
మానుం డయ్యెడుఋత్విజుం జూచి యి ట్లేల తీవ్రదుఃఖోపహతుండ వైతి వని
యడిగిన వాఁ డి ట్లనియె. 217

ఆ. అవనినాథ నీకు నార్త్విజ్య మొనరించి, చూవె యిట్టినరకపావకమునఁ
బడినవాఁడ నీకు బహుపుణ్యలోకముల్, గలవు నన్నుఁ గావవలయుఁ గరుణ.

వ. అనిన సోమకుండు ధర్మరాజుపాలికిం జని తచ్ఛాసనంబునం బుణ్యలోకంబులకుం
బోవు చుండి యి ట్లనియె. 219

క. నాకారణమున ఋత్విజుఁ, డేకాంతమ నరకగతికి నేఁగెను వానిం
దోకొని పోయెద నని శుభ, లోకంబున కరిగెఁ ద్రిదశలోకస్తుతుఁ డై. 220

వ. ఇట్లు యజ్ఞపుత్రుం డైనసోమకుండు దనతపోయజ్ఞఫలంబున ఋత్విజు నరకవిము
క్తుం జేసి పుణ్యలోకగతుం డయ్యె నిందుఁ దొల్లి ప్రజాపతి సహస్రవార్షికం బైన
యిష్టాకృతం బనుసత్రయాగంబుఁ జేసె నాభాగుం డైనయంబరీషుం డిందు యజ్ఞం
బులం జేసి పరమసిద్ధికిం జనియె నిది నహుషుయజ్ఞదేశం బిందు దశపద్మసంఖ్యాధనం
బుల నాతండు సదస్యులం బూజించె నిది సార్వభౌమయజ్ఞస్థానం బిది యయాతియ
జ్ఞాయతనంబు వానిసవనంబున కింద్రుండు వచ్చె నిది రామహ్రదం బిది నరనారా
యణాశ్రమం బిది ప్లక్షావతరణం బనుయమునాతీర్థం బిందు దేవతలును ఋషు
లును సారస్వతయాగంబుఁ జేసి రిది దేవర్షి యైనసంవర్తుచేత రక్షితం బిందు భరతుం
డనేకయాగంబులు సేసి సర్వలోకంబులుం జూచె నీవు నిందుఁ గృతస్నానుండ వై

సర్వలోకంబులుం జూడు మనిన ననుజసహితుం డై ధర్మతనయుం డత్తీర్థంబున స్నానంబుఁ జేసి రోమశున కి ట్లనియె. 221

శా. [1]దేవర్షిద్విజరాజలోకములు నాదిత్యాశ్విలోకంబులున్
దేవాధీశ్వరుఁ జూచితిన్ మఱియు నద్దేవేంద్రునొద్దన్ సగాం
డీవోద్దామమహాభుజార్గళుఁ గిరీటిన్ సవ్యసాచిన్ జయ
శ్రీవిభ్రాజితుఁ బార్థుఁ జూచితి [2]జగత్సేవ్యా మునీంద్రోత్తమా. 222

వ. అనిన రోమశుండు వెండియు ధర్మరాజున కి ట్లనియె. 223

క. ఇది దక్షుముఖస్థానం, బిదియు సరస్వతి యనంగ నిలఁ బరఁగుమహా
నది యిందుఁ ద్రిదశతతితోఁ, ద్రిదశజ్యేష్ఠుండు సేసెఁ దివిరి మఖంబుల్. 224

వ. ఇది పంచయోజనప్రమాణం బైనప్రజాపతియజ్ఞవేది యిందు దేహత్యాగంబుఁ జేసి మర్త్యు లమర్త్యత్వంబుం బొందుదురు తొల్లి సరస్వతి నిషధదేశంబున భూమి సొచ్చి యిచ్చమసోద్భేదంబునందుఁ గానంబడియె నిది సిద్ధతీర్థం బిందు లోపాముద్ర నగస్త్యుండు ప్రతిగ్రహించె. 225

తే. ఇదియు విష్ణుపదంబు దా నిది విపాశ, యిదియుఁ గాశ్మీరమండలం బిది నిరస్త
మిదియు మానసద్వారమిం దిందునంశ, పరశురాముండు మును హంసపథముఁ జేసె.

శిబి యనురాజర్షిచరిత్రంబు రోమశుఁడు ధర్మజునకుఁ జెప్పుట.

వ. ఇక్కొలనం జైత్రమాసంబునందు మహామునులచేతం బూజితుం డై యుమాసహితుం డీశ్వరుండు వారికిం బ్రత్యక్షుం బగుటయు నరుంధతీసహితుం డై వసిష్ఠుం డిందుల వసియించె నిది భృగుతుంగం బనుపర్వతం బిందు నుశీనరపతి శిబి యనువాఁడు దొల్లి యజ్ఞంబు సేయుచున్న నింద్రాగ్నులు వానిమహాగుణంబు లెఱుంగ వేఁడి యింద్రుండు శ్యేనం బైన నగ్ని కపోతం బై శ్యేనభయంబునఁ బఱతెంచి శిబిమఱువు సొచ్చిన దాని నెగిచికొని వచ్చి శ్యేనంబు శిబి కి ట్లనియె.

ఆ. నిన్ను సత్యనిత్యనిర్మలుఁ గా విందు, నట్టినీకుఁ బాడి యయ్యె యిప్పు
డతిబుభుక్షితుండ నై యున్ననాకు నా, హారవిఘ్న మిట్టు లాచరింప. 228

వ. సర్వభూతంబులు నాహారంబునన జీవించి వర్ధిల్లు నిది నాకు భక్ష్యంబు గాని నాఁడు బుభుక్షావేదనం జేసి ప్రాణవియోగం బగు నట్లయిన నాపుత్త్రులు భార్యయు జీవింప నేర రొక్కకపోతంబు రక్షించి పెక్కుజీవంబులకు హింస సేయుట ధర్మవిరోధంబు. 229

క. ధర్మజ్ఞు లైనపురుషులు, ధర్మువునకు బాధ సేయుధర్మువు నైనన్
ధర్మముగా మదిఁ దలఁపరు, ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్. 230

వ. ఇక్కపోతంబు నాకు వేదవిహితం బైనయాహారంబు "శ్యేనాః కపోతాన్ ఖాద

1. క. గ. దేవాదిద్యుచరాహిలోకములు నాదిత్యాశ్వినీలోకముల్. 2. క. జగత్సేవ్యన్.

యన్తి" యనువేదవచనంబు గలదు గావున దీని నాహారంబుగా నిమ్మనిన దానికి శిబి యిట్లనియె. 231

తే. ప్రాణభయమునవచ్చియిప్పక్షినన్ను, నాశ్రయించె నాశ్రితు నెట్టియధముఁడయిన
విడువఁ డనిన నే నెట్లువిడుతు దీని, నాశ్రితత్యాగ మిది ధర్మ మగునె చెపుమ.

వ. నీవు పక్షి వయ్యును ధర్మ మెఱింగినట్లు పలికితి శరణాగతపరిత్యాగంబు సేయుట కంటె మిక్కిలి యధర్మంబొం డెద్ది నీయాఁకలి దీనన కాని యొంట నుపశమింపదే నీయత్నం బాహారార్థం బేని నిప్పు డివ్వనంబున మృగమహిషవరాహఖగమాంసంబులు దీనికంటె మిక్కిలిగాఁ బెట్టెద నిక్కపోతంబుపలనియాగ్రహం బుడుగుము దీని నే నెట్లును విడువ ననిన శ్యేనం బి ట్లనియె. 233

ఆ. నాకు విహితభక్షణం బిది యిప్పక్షిఁ, బూని కావ నీకు బుద్ధియేని
నవనినాథ దీనియంత నీమాంసంబు, దూఁచి నాకుఁ బెట్టు తొలఁగ కిపుడ. 234

చ. అనిన ననుగ్రహించితి మహావిహగోత్తమ యంచు సంతసం
బున శిబి తత్క్షణంబ యసిపుత్రిక నాత్మశరీరకర్తనం
బనఘుఁడు సేసి చేసి తనయంగములం గలమాంస మెల్లఁ బె
ట్టినను గపోతభాగమ కడిందిగ డిందుచు నుండె నత్తులన్. 235

క. దానికి నచ్చెరువడి ధర, ణీనాథుఁడు తనువునందు నెత్తురు దొరుఁగం
దాన తుల యెక్క నంతఁ, వానిగుణోన్నతికి మెచ్చి వాసవదహనుల్. 236

వ. శ్యేనకపోతరూపంబులు విడిచి తమనిజరూపంబులఁ జూపి నీధైర్యశౌర్యాదిగుణంబు లనన్యసాధారణంబులు గావున నీకీర్తి నిత్యం బై శబ్దబ్రహ్మంబు గలయంతకాలంబును వర్తిల్లుచు నుండెడు మని శిబికి వరం బిచ్చి యింద్రాగ్నులు చని రిది యమ్మహాపురుషుపుణ్యస్థానంబు మఱియు ననవరతఫలవృక్షంబులు గలయిది యౌద్దాలకి యైనశ్వేతకేతుతపోవనం బిందు సరస్వతి మనుష్యస్త్రీరూపధారిణి యై శ్వేతకేతుని సేవించె మాతులభాగినేయు లైనయష్టావక్ర శ్వేతకేతు లింద యుగ్రతపంబుఁ జేసి రనిన నం దష్టావక్రుమాహాత్మ్యంబు విన వలతు నని యడిగిన యుధిష్ఠిరునకు రోమశుం డి ట్లనియెఁ దొల్లి యేకపాదుం డనుమునివరుండు తనవిద్యావిభవంబున సుజాత యనుదాని వివాహం బై వనంబున ఘోరతపంబు చేయుచు ననవరతంబును శిష్యుల వేదంబులు చదివించుచున్నఁ బెద్దకాలంబునకు సుజాత గర్భిణి యైనఁ దద్గర్భంబున నున్నయర్భకుం డొక్కనాఁడు తండ్రి కి ట్లనియె. 237

రోమశుఁడు ధర్మజునకు నష్టావక్రుచరితంబు చెప్పుట.

క. ఎడఁబడక యహోరాత్రులు, వడిఁ గొని చదివింప నిట్లు వలయునె శిష్యుల్
గడు నిద్రలేమి నెంతయు, జడమతు లై చదువు దప్పఁ జదువుచు నుండన్. 238

వ. అని యుపాలంభించి పలికిన నలిగి యేకపాదుండు నీ వధ్యయనంబునకు వక్రంబుగాఁ బలికితివి గావున నెనిమిదివంకలు గల శరీరంబుతో జన్మింపు మని కొడుకు

నకు శాపం బిచ్చిన. 239

ఆ. అగ్నికల్పుఁ డై మహాత్ముఁడు కడుపునఁ, బెరుఁగుచుండె నంత సరసిజాక్షి
ప్రసవకాల మైనఁ బతి [1]తో నొక్కనాఁ డిట్లు, లనియెఁ బ్రసవభారమునకు వెఱచి. 240

క. ధరణిం గడుం బేదవారును, బురిటికి ఘృతతైలధాన్యములఁ జెచ్చెర ముం
దర సంగ్రహింతు రవి మన, కరుదుగ నతిదుర్లభంబు లర్థము లేమిన్. 241

వ. ఏమి సేయుదు నెవ్విధంబున నీ ప్రసవక్లేశంబువలనం బాయుదు ననిన నేకపాదుండు ధనార్థి యయి జనకరాజుపాలికిం జని వానియజ్ఞంబునందు వరుణపుత్త్రుం డైన వందితో వివాదంబు సేసి యోటువడి జలమజ్జితుం డై యున్న నిట సుజాత ప్రసూతి యై యష్టావక్రుం గనియెఁ దత్కాలంబున నుద్దాలకుభార్య శ్వేతకేతుం గనియె నిట్లు మాతులభాగినేయు లిద్దఱు సవయస్కు లై పెరిఁగి పండ్రెండేండ్లొక్కట నుద్దాలకుతోఁ జదివి యధ్యయనశూరు లై రందు. 242

తే. తండ్రి యనుచు నుద్దాలకుం దనకుం గరము, ప్రీతితో శ్వేతకేతుని భ్రాత యనుచు
ననఘచరితుం డష్టావక్రుం డనుదినంబు, నొం డెఱుంగక సుఖలీల నుండు నంత.

వ. ఒక్కనాఁ డుద్దాలకుకురు వెక్కి యున్నయష్టావక్రుం జూచి శ్వేతకేతుండు సహింపక నీ వేల మాయయ్యకురు వెక్కి యుండెదీవు వోయి మీయయ్యకురు వెక్కు మని చేయి పట్టి యీడ్చిన నేడ్చుచుం దల్లికడకుం జని యష్టావక్రుం డి ట్లనియె. 244

క. మాయయ్య యెవ్వ రెక్కడఁ, బోయిరి సెప్పు మని తెల్లముగ నడిగి తప
శ్శ్రీయుతుఁడు దండ్రికడకుం, బోయెం దనమామ నెయ్యమునం దోడ్కొనుచున్.

వ. ఇట్లష్టావక్రుండు దానును శ్వేతకేతుండును జనకరాజుయజ్ఞంబునకుం జని యందు ద్వారికనివారితుం [3]డై మూకాంధబధిరపంగుస్త్రీబ్రాహ్మణప్రవేశం బగుచున్న యీరాజద్వారంబున మమ్ము విద్వాంసుల బ్రాహ్మణుల నేల వారించి తనిన ద్వారికుం డి ట్లనియె. 246

క. అలఘు లగువృద్ధవిద్వాం, సులకు మహాయాజ్ఞికులకుం జొర నర్హం బై
విలసిల్లుయజ్ఞసభ సార, వలవదు చనుం డీరు చిఱుతవారల రనినన్. 247

క. అలయక యేండ్లు గడుం బ, ల్కులు జీవించుట నర గలుగుటయుం దగువృ
ద్ధులలక్షణమే జ్ఞానము, గలఁ డేని బాలుఁ డయినను గడువృద్ధు మహిన్. 248

వ. కృతాధ్యయనశీలుం డై యాచారపరుం డైనవాఁడు బాలుం డయ్యును సర్వజనసమ్మాననీయుం డగుసభాయోగ్యుండు బాలు రని మమ్ము నవమానింపనలవ దేము జనకరాజసదనంబున దర్పితు లైనవేదవాదులతో వాదంబు సేయ సమకట్టి వచ్చిన వార మనిన ద్వారికుండు వారి నప్పుడు జనకరాజానుమతుం డై లబ్ధప్రవే

1. చ. తో నొక్కవేళ యి, ట్లనియె. 2. క. యల్లు. 3. గ. లై.

శులం జేసె నంత. 249

సీ. జనకభూపాలునిసంప్రశ్నముల కెల్ల, నేర్పడ నుత్తరం బిచ్చి వాని
సభయందు భూసురసంఘమధ్యంబున, వరుణపుత్త్రుం డైనవందితోడ
వాదంబు చేసి గర్వంబున నాతని, నోడిచి తద్విజితు లై యొదిగి యున్న
ధరణీసురులఁ దనతండ్రితో నిగ్రహ,ముక్తులఁ జేసి సన్మునికుమారుఁ
తే. డధికతేజుఁ డష్టావక్రుఁ [1]డధికలోక,పూజితుం డైనజనకుచేఁ బూజ లంది
యేకపాదుఁ డోడ్కొని పేర్మి నేఁగుదెంచె, బుధనుతుండు నిజాశ్రమంబునకు నొప్ప.

వ. అని చెప్పుచు నరిగి యిది సమంగ యనుపుణ్యనది యిందు భరతుండు రాజ్యాభి
షిక్తుఁ డయ్యెఁ దొల్లి యింద్రుండు దీనిజలోపస్పర్శనంబున లక్ష్మీప్రాప్తుం డయ్యె నిది
మైనాకకుక్షి యిం దదితి పుత్త్రార్థిని యై తపంబు సేసె నిది ఋషిదైవతం బైనకనఖ
లనగం (బిది గంగానది) యిందు సనత్కుమారుండు సిద్ధిం బొందె నిది యుష్ణిగంగ
యిందుఁ గృతస్నాను లైనం గృతార్థు లగుదు రిది రైభ్యాశ్రమం బిది భరద్వాజా
శ్రమం బిందు భరద్వాజసుతుండు యవక్రీతుండు తపోవిద్యాగర్వంబున నపగత
జీవుం డయ్యె ననిన నది యెట్లని ధర్మతనయుం డడిగిన రోమశుం డి ట్లనియె. 251

రోమశుఁడు ధర్మరాజునకు యవక్రీతుచరిత్రంబు చెప్పుట.

క. అలఘులు రైభ్యభరద్వా, జులు దమలో సుహృదు లై విశుద్ధతపోని
శ్చలితమతు లివ్వనంబున, నొలసి తపం బొప్పఁ జేయుచుండిరి నెమ్మిన్. 252

వ. అందు రైభ్యుండు కృతాధ్యయనశూరు లైనయర్వావసుపరావసు లనుతనయిద్దఱు
పుత్త్రులతో విద్వత్పూజితుం డై యున్న వానిం జూచి సహింప నోపక భరద్వాజసు
తుఁడు యవక్రీతుండు తపోబలంబున నఖిలవేదశాస్త్రాగమంబులు పడయుదు నని
సమిద్ధం బైనయగ్నియందు [2]ధాయ్య సంధించుచు నుగ్రతపంబు సేయుచున్న
దాని సహింప నోపక యింద్రుండు వానియొద్దకు వచ్చి నీ వేమి యుద్దేశించి యుగ్ర
తపంబుఁ జేసెద వనిన శక్రునకు యవక్రీతుం డి ట్లనియె. 253

ఆ. చదువకయును నాకు సర్వవేదంబులు, సర్వశాస్త్రములును సంభవిల్ల
వలయు నని తలంచి వదలక నిష్ఠతో, నుగ్రతపముఁ జేయుచున్నవాఁడ. 254

వ. అనిన వాని కింద్రుం డి ట్లనియె. 255

క. గురుముఖమునఁ బడయక దు, ష్కరతపమునఁ జేసి పడయఁ గాఁ బడువిద్యల్
పరమార్థము మదమును మ, త్సరమును గావించు నెట్టిసాధుల కైనన్. 256

వ. ఇది విద్యోపార్జనంబున కుపాయంబు గా దని వారించి వాసవుఁ డరిగిన నుడుగక
యవక్రీతుం డెప్పటియట్ల తపంబుఁ జేయుచున్నఁ దదీయతపస్తప్యమానుం డై
వృద్ధశ్రవుండు వృద్ధవిప్రరూపంబు ధరియించి యశక్తుం డై శోషించినశరీరంబు

---

1. గ. దఖిలవిప్ర. 2. క. గ. సాన్నాయ్యంబు సంధించుచు.

తోడ సికతాముష్టిపరంపర నపారగంభీరగంగాప్రవాహంబునందు సేతుబంధంబు చేయుచున్న నవ్విప్రుం జూచి యవక్రీతుండు నగుచు నిట్లనియె. 257

క. శతవర్షవృద్ధుఁడవు నీ, వతికృశుఁడ వశక్య నైనయర్థమునం [1]దా
సిత మేల సేసి కడు దు, ర్గతి వైతిం కెన్నఁ డిది సమాప్తిం బొందున్. 258

వ. అనిన విని యింద్రుండు వానిం జూచి యేను నీయట్ల యఘటమానం బైనయర్థంబునందు యత్నంబుఁ జేసెద నని నిజరూపంబుఁ జూపి యిట్లు నిరర్థకప్రయాసం బేల చేసె దుడుగు మనిన నే నెట్లు నుడుగ నాయభిమతంబు సఫలంబు సేయవలయు నని యవక్రీతుండు శక్రువలనం దనయభిప్రాయంబు వడసి తత్ప్రకారంబుఁ దండ్రికిం జెప్పిన విని భరద్వాజుఁడు కొడుకుగర్వంబు సహింపక వేదగీత లైనగాథలయర్థంబు వానికి నిట్లని చెప్పె. 259

సీ. బాలధి యనుమునిప్రవరుండు పుత్త్రశో, కాపన్నుఁ డై ఘోర మగుతపంబుఁ
జేసి వేల్పులదయఁ జిరజీవిగాఁ బుత్త్రుఁ, బడసె మేధావి నాఁ బరఁగువాని
వాఁడు నాయుష్యగర్వమున మునీంద్రుల, నెవ్వరి మెచ్చక యేఁగి యొక్క
ధనుషాక్షుఁ డనుతపోధనునొద్ద గర్వించి, పలికిన నలిగి తపస్వి వాని

ఆ. నంతకాంతికమున కరుగంగఁ జేసె గ, ర్వంబు చెట్ట యెట్టివారి కైనఁ
గ్రాఁచుఁ దత్క్షణంబ గర్వంబు గర్వంబు, నెడిచి యున్నవాఁడ యుత్తముండు.

వ. కావున నీవు గర్వంబు విడిచి యకోపనుండ వై పరమశాంతు లైనరైభ్యకొడుకుల తోడ నిర్మత్సరుండ వయి యుండు మనిన నట్లు సేయుదు నాకు రైభ్యుండు భవత్సమానుండ యని యవక్రీతుండు తనవిద్యావిభవంబు మునిసభల విస్తరించుచు నొక్కనాఁడు రైభ్యాశ్రమంబునకుం జని యందు. 261

ఉ. కోమలకీరషట్చరణకోకిలనాదమనోహరంబు ను
ద్దామవసంతపుష్ప[2]భరితక్షితిజప్రకరంబు నైనయా
రామమునందుఁ జూచె మునిరాజకుమారుఁడు రైభ్యకోడలిం
దామరసాక్షిఁ గృష్ణ యనుదానిఁ బరావసుభార్యఁ బ్రీతితోన్. 262

ఆ. దానిఁ జూచి మదనతప్తుఁ డై తనయభి, ప్రాయ మెఱుఁగఁ జెప్పెఁ బంకజాక్షి
కదియు శాపభీతి నప్పటి కొడఁబడి, నట్లు పలికి పెలుచ నరుగుదెంచి. 263

క. తమమామకుఁ దద్వృత్తాం, తము నంతను దెలియఁ జెప్పె తరుణి విలోలా
క్షములందు బాష్పసలిలోద్గమముగఁ దల వాంచి యుండెఁ గడుఁ గోపమునన్.

వ. రైభ్యుండు నయ్యవక్రీతున కలిగి నిజకోపానలశిఖాయమానైకజటావలుంచనకరుం డై హుతాశనునందు వేల్చి యయ్యగ్నికుండంబునందు. 265

క. లలితాంగిఁ బడసెఁ దనకో, డలిరూపముకంటెఁ గడు బోడం గగురూపో
జ్జ్వలకాంతి గలుగుదానిం, బొలఁతుక నెక్కర్తుఁ దనతపోవీర్యమునన్. 266

---

1. క. ఆస్థితి యేల. 2. జ. ఫలిత.

వ. మఱియు నొక్కజట యవలుంచించి వేల్చిన నందు వికృతదంష్ట్రాకరాళం బైన ముఖంబుతో శూలహస్తుం డైనయొక్కరాక్షసుండు పుట్టె నయ్యిద్దఱు ముకుళీకృతహస్తు లై మాకుం బని యేమి యని యడిగిన నవినీతుం డైనయవక్రీతు వధియింపుం డని పంచిన. 267

క. ఆతరుణి మున్ను చని మద, నాతురఁ డై [1]విగతచేష్టుఁ ♦ డై యున్నయవ
క్రీతుకరకమండలువుం, బ్రీతిఁ బ్రబోధించి కొనియె ♦ బెడఁగుగ నంతన్. 268

క. అపహృష్టకమండలుఁ డై, యపవిత్రుం డగుటఁ జేసి ♦ యధికతపోవీ
ర్యపరిక్షయ మగుడును నా, తపస్విసుతు రాక్షసుండు ♦ తడయక తాఁకెన్. 269

వ. వానికి వెఱచి పఱచి యవక్రీతుండు కొలంకులకు మహానదులకుం జొచ్చిన నవి శుష్కంబు లైనఁ దనజనకునగ్నిహోత్రంబుఁ జొచ్చునంత. 270

ఆ. మునికుమారు నెగచికొని వచ్చి నిశితశూ, లాయుధమునఁ బొడిచి ♦ యాసురమున
రక్కసుండు చంపి ♦ యక్కాంతయును దాను, నరిగె రైభ్యుకడకు ♦ నాక్షణంబ.

వ. రైభ్యుండును వానికి భార్యగాఁ గృత్తి నిచ్చె నంత నిట భరద్వాజుండు వనంబున నుండి వచ్చి తొల్లి తన కెప్పుడుం బ్రత్యుత్థానంబుఁ జేయునగ్ను లప్పు డడంగి యున్న నచ్చెరుపడి గృహపాలకుం డైనశూద్రువలన నంతవృత్తాంతం బెఱింగి నిహతుం డైనపుత్త్రుం జూచి దుఃఖితుం డై. 272

ఆ. రైభ్యుఁ డధికకోపపరతుఁ డంటి నమ్ముని, యాశ్రమంబు దెసకు ♦ నరుగ వలవ
దంటి వినఁగ నొల్ల ♦ వైతి నాపలుకులు, గర్వితునకు బుద్ధి ♦ గాన నగునె. 273

వ. అని ప్రలాపించుచు భరద్వాజుండు వాని దహించి పుత్రశోకదహనంబు సహింప నోపక తద్దహనంబున దేహత్యాగంబుఁ జేసె నంత బృహద్ద్యుమ్నుం డనురాజు సత్రయాగంబుఁ జేయుచుండి రైభ్యపుత్త్రుల నర్వావసుపరావసులం దనకు ఋత్విజులంగా వరియించిన నయ్యిరువురు దండ్రిచే ననుజ్ఞాతు లై వానియజ్ఞంబు నడపుచుండి యొక్కనాఁడు పరావసుండు నిజాశ్రమంబునకు వచ్చువాఁడు వేగుఁబోకచీకఁటి నేకతంబ తనకు నెదురుగా వచ్చురైభ్యు నెఱుంగక మృగంబ కా వగచి నిజప్రాణభయంబున వధియించి పదంపడి యెఱింగి పరమదుఃఖితుం డై ప్రేతకార్యంబులు దీర్చి బృహద్ద్యుమ్నుసత్రంబునకు వచ్చి తనచేసినపితృఘాతం బగ్రజునకుం జెప్పి యిట్లనియె. 274

తే. [2]నీవు దీని నొక్కరుఁడవు ♦ నిర్వహింప, నోప వే నొక్కరుండ నయ్యును గడంగి
నడప నోపుదుఁ గావున ♦ నాతదర్థ, మాచరింపుము బ్రహ్మహత్యావ్రతంబు. 275

వ. అనిన నర్వావసుం డట్లు సేయుదు నని బ్రహ్మహత్యావ్రతంబులు సలుపుచుండెఁ

1. క. వికృతచిత్తుఁ ♦ డై. 2 గ. 'ఏను దీని నడపఁ ♦ గా నోప నొక్కఁడ, నీవు పూని తాల్చి ♦ నిర్వహింపు, నడప నోపు దీవు ♦ నాకుఁగాను దదర్థ, మలయ కాచరింపు ♦ హత్యావ్రతము.' అని పాఠాంతరము.

బరావసుండును నొక్కరుండ సత్రయాగంబు జరుపుచుండె నంత నర్వావసుండు బ్రహ్మహత్యాప్రాయశ్చిత్తంబులఁ జేసి యాసత్రయాగంబునకు వచ్చిన వానిం జూచి పరావసుండు బృహద్ద్యుమ్నున కిట్లనియె. 276

క. ఇమ్ముని నీయజ్ఞాయతనమ్ముఁ బ్రవేశింపఁ దగఁడు నరనాయక యు
గ్రమ్ముగఁ జలిపెడు శుభకా, ర్యమ్ములకుం బాసి బ్రహ్మహత్యావ్రతముల్. 277

వ. అనవుడు బృహద్ద్యుమ్నప్రేరితు లయినజనులచేత నుత్సార్యమాణుం డయి యర్వావసుం డనియెఁ బరావసుండు గాని యేను బ్రహ్మఘాతకుండఁ గాను వానిని వ్రతంబు సలిపి తత్పాతకవిముక్తుఁ జేసితి నని చెప్పినయర్వావసుయథార్థకథనంబునకు మెచ్చి యగ్నిపురోగము లైనదేవతలు వాని కిట్లనిరి. 278

దేవత లర్వావసునకు మెచ్చి కోరినవరంబు లెల్ల నిచ్చుట.

తే. తమ్ముచేసినదురితముల్ దలఁగఁ బూని, ధర్మబుద్ధి వై వ్రతములు పేర్మిఁ జలిపి
తనకు నీకు నభీష్టంబు లైనవరము, లడుగు మిచ్చెద మీ మెచ్చు గడవ నగునె.

వ. అనినఁ దనతండ్రియు భరద్వాజుండును యవక్రీతుండు నెప్పటియట్ల జీవించి యుండను నిజజనకుండు పరావసుచేత నిహతుం డగుట వాని విస్మరింపను వలయు నని ప్రార్థించి దేవతలవరంబున నర్వావసుండు రైభ్యభరద్వాజయవక్రీతుల సంజీవితులం జేసిన నద్దేవతలకు యవక్రీతుం డిట్లనియె. 280

తే. ఏను వేదశాస్త్రముల నెఱిఁగి వ్రతము, లెల్లఁ జలిపి యారైభ్యుచే హింసితుండ
నైతి నాకంటె రైభ్యున కధికశక్తి, యైన తెఱఁ గెట్టు లనిన ని ట్లనిరి సురలు.

క. గురుశుశ్రూష యొనర్చుచుఁ, బరమక్లేశమునఁ జేసి పడసినవిద్యల్
స్ఫురియించుఁ గాక గురుముఖ, విరహితముగఁ బడసినవియు వెలయునె యెందున్.

వ. నీవు గురుముఖంబునం బడయక యొండువిధంబునం బడయుటం జేసి నీయధ్యయనశ్రుతంబులు నిర్వీర్యంబు లయ్యె గురుశుశ్రూషాసంతోషకరుం డై రైభ్యుండు బ్రహ్మజ్ఞానం బుపార్జించెం గావున నాతం డిట్టిశక్తి వడసె నని దేవతలు దివంబున కరిగి రిది యవక్రీతునివాసం బిందు వసియించినవారు దురితవిముక్తు లగుదు రిది కాలశైలం బిది సప్తవిధం బైనగంగ యిది మనుష్యుల కగోచరం బింద యుండి సమాధిశౌచప్రయత్నపరు లై చూడుం డిది మందరనగం బిందు నానాప్రహరణపాణు లై యష్టాశీతిసహస్రగంధర్వులు కిన్నరకింపురుషసుపర్వులు సురేంద్రుం గొలిచి పోయెద రిందుల కాఱుయోజనంబులు. గలదు కైలాసపర్వతం బందుఁ గుబేరుం డుండు నని రోమశుండు సెప్పినం బాండవులు కృతసమాధిశీలు రై వాని నెల్లం జూచి రంత నంతకసుతుండు భీమున కిట్లనియె. 283

సీ. దుర్గమం బైనయీదుర్గమార్గంబున, నడవంగ నేర మున్నతరథముల
నింద్రసేనాదుల నీధౌమ్యవిప్రుల, ద్రుపదతనూజను దోడికొనుచు
సహదేవుఁడును నీవు చట్టన గ్రమ్మఱుఁ, డేనును నకులుండు నేఁగి రోమ

శాదేశమునఁ జేసి యఖిలతీర్థంబులు, నాడి వచ్చెదము మాకయరుగు దెంచు
ఆ. నంత కెంతయును బ్రయత్నంబులోఁ గృష్ణఁ, గాచియుండుఁ డనిన ఘనుఁడు భీముఁ
డనియె నిట్టిరాక్షసాకీర్ణవనములో, నిన్నుఁ బాయఁ గలమె నిమిష మేని. 284

చ. అనఘచరిత్ర నర్జును మహాభుజు నొక్కనిఁ బాసి వంతఁ బొం
దినయెడ నిట్టిచోట సహదేవుఁడు నేనును గృష్ణయుం జగ
జ్జననుత నిన్నుఁ బాసిన నసహ్యతరం బగుతీవ్రతాపవే
దన యగు నీకు మాకు నుచితంబె పరస్పరభేద మెన్నఁడున్. 285

క. కడు డస్సి నడవ నోపని, యెడ నీకమలాయతాక్షి నీకవలను నేఁ
దడయక [1]నయింతు నాయలు, కడ నిడుకొని పఱతు నెట్టిగహనాంతములన్. 286

వ. ఈరథంబులతోఁ బోవ నిమ్ము గాదేని వీని నింద్రసేనాదుల నొండెనిం బెట్టి పోద మనిన రోమశుం డిట్లనియె. 287

క. అతులతపోవీర్యబలో, న్నతిఁ బోదము గంధమాదనంబునకు సమా
గతు నందుఁ గాంతు మర్జును, నతివీరు నుదారు [2]సురగణార్చితుఁ బార్థున్. 288

వ. అనిన నందఱు సంతసిల్లి యరుగువారు ముందర ననేకగజహయరథసనాథం బై యపారకిరాతబలసంకులం బైనదానిఁ బుళిందాధిపతి యైనసుబాహుపురంబుఁ గని యందు వానిచేతం బూజితు లై తమరథసూతహయనివహంబుల నింద్రసేనాదిభృత్యులను సుబాహునొద్దం బెట్టి పాదచారు లై పాంచాలిని బ్రాహ్మణులను రక్షించికొని గంధమాదనంబున కభిముఖు లై యరిగి రంత ధర్మతనయుండు భీమున కిట్లనియె. 289

సీ. అలిగి వజ్రాయుధు నైనను బోరిలో, నోర్వంగ నోపునత్యుగ్రవీరు
జవమునఁ బవనుఁ దేజంబున నాదిత్యుఁ, బోలినవాని నంభోజనేత్రు
నాయతబాహుఁ గృతాస్త్రు సింహస్కంధు, సర్వధనుర్ధరాచార్యు విజయు
నిత్యశుమాన్వితు నీతమ్ము నర్జును, శుభగుణసుందరుఁ జూచునంత
ఆ. కధికతాపతప్త మైనది నాచిత్త, మెనర నతనితోడ [3]నొకట నునికి
యెన్నఁడొకొ మనకు నిందఱ కగునాతఁ, డేల మసలెనొక్కొ యిన్నియేండ్లు.

మ. అనుచుం బార్థవిలోకనంబు నెడలో నర్థింపఁగా ధర్మజుం
డనవద్యుల్ గడు వేడ్కతో నరిగి తా రప్పాండవుల్ గంధమా
దనశైలేంద్రముఁ గాంచి రున్నతబృహద్ధాతుస్థలీసంహతిం
ఘనసంధ్యాగమశంక సన్మునులకుం గావించుదానిం మహిన్. 291

క. నానావర్ణశిలావిహా, గానేకమృగాభిరామ మై భూనారీ
నానాభరణవిభూషిత, పీనోన్నతకుచముఁ బోలె వెలిఁగెడుదానిన్. 292

1. క. యఱకడ నిడుకొని, కడఁకం గొనివత్తు మిమ్ము. 2. జ. సురుగుణాన్వితుఁ. 3. క. నొక్కట నికి.

పాండవులు గంధమాదనపర్వతంబునకుం బోవుట.

క. లలితాచ్ఛస్ఫటికశిలా, తలములపైఁ బాఱువిమలతరనిర్ఝరిణీ
జలపూరము లనుతారో, ల్లలదురుహారాలి నుజ్జ్వలం బగుదానిన్. 293

ఉ. వారలు గంధమాదన మహావార్యబలాఢ్యులు సొచ్చుచో మహా
మారుత మప్డు వీచె నహితమద్యుతిమార్గము దిఙ్ముఖంబులన్
భూరుహపత్త్రమిశ్రమయి భూరిపరాగము గప్పఁగా ధరి
త్రీరుహశాఖలున్ విఱిగి త్రెళ్ళఁగ గుల్మలతాలి చాల్పడన్. 294

చ. కడువడి గాడ్పుచే విఱువఁగాఁ బడి త్రెళ్ళుమహీరుహాళిచ
ప్పుడు విని యందఱున్ బెదరి భూమిపయిన్ గగనం[1]బు డగ్గఱం
బడియెనొ శైలశృంగములు భగ్నము లయ్యెనొ యంచు [2]ధూళి నె
క్కుడఁ జన నేర కొండొరులఁ గానక యుండిరి సంచలాత్ములై. 295

వ. ఇట్లు మహారేణుపటలం బంధకారంబునుంబోలె నీరంధ్రంబై కప్పినఁ దరువిటప లతాగుల్మంబులు కరతలంబులం బాయం ద్రోచుచు విశాలదృఢతరుమూలంబు లాశ్రయించి యగ్నిహోత్రంబులతో ధౌమ్యధర్మజసహదేవు లొక్కచోట నుద్యద్గదాకార్ముకుం డైనభీమసేనుండును ద్రౌపదియు నొక్కచోట రోమశుండును నకులుండును బ్రాహ్మణులు నొక్కచోటను గా నందఱు వేఱువేఱ యుండిరంత. 296

చ. కురిసెఁ బ్రచండవృష్టి ఘనఘోషము లెల్లకెలంకులన్ భయం
కరములుగాఁ గరాళకరకాతతు లొప్పఁ దటిల్లతాళి వి
స్ఫురితముగాఁ బ్రపూర్ణజలపూరము తద్గిరికుంజభూరిని
ర్ఝరతటినీ[3]తటీనికటసాలచయంబు విమూలితంబుగన్. 297

వ. అట్లు గాడ్పుతోడివాన పెద్దయుంబ్రొద్దు కురిసి యుడిగిన నందఱు నొక్కచోటికి వచ్చి యెప్పటియట్ల యరుగునెడ నతివిషమశిలాసంకటపథంబున నడవనేరక ద్రౌపది తొడరి పడి మూర్ఛిత యైనం బవనతనయుం డక్కోమలి నెత్తికొని యజినాస్తరణంబుపయిం బెట్టి కదళీదళంబుల వీచుచున్నం గవలు దానిపల్లవతామ్రపాదతలంబు లాయుధాభ్యాసవశంబునం గిణీభూతంబు లయినతమకరతలంబులం జేసి మెత్తన యొత్తుచుండి రట్టియవసరంబున ద్రౌపదిం జూచి దుఃఖితుం డయి ధర్మతనయుం డి ట్లనియె. 298

అక్కర. అరుణసరోరుహదళమృదులంబు లైనయిత్తరుణి
చరణతలంబులు గొడిగరాలపైఁ జనుచునికిఁ జేసి
పరుసంబు లై కడు నెఱ్ఱ నైనవి పద్మాయతాక్షి
పరఁగ నాకారణమున నిట్టిదుఃఖభారము దాల్చె. 299

---

1. గ. బుదగ్రతం. 2. క. ఖ. దూలి యెక్కుడ. 3. జ. నికాయతటసాల.

సీ. సముచితంబుగ మృదుశయనతలంబున, శయనించు నిత్తన్వి సదమలాంగి
పరుసంపుతాలపైఁ బడి తీవ్ర వేదనఁ, బొందినయది మహాపురుషు లైన
పాండవులకుఁ బ్రియభార్యయై నాపుత్త్రి, సుఖముండు నని యెడ సోమకుండు
పాయక సంతోషపడి యుండుఁ గాకున్నె, యని విలాపించు నయ్యమతనూజు.
ఆ. నుచితవచనరచన నూరార్చి రప్పుడు, ధౌమ్యుఁదొట్టి సకలధరణిసురులు
మూర్ఛ దేఱె నంత ముదిత ద్రౌపది శీత, మందపవనసేవ్యమాన యగుచు. 300
వ. అంత దాని నాశ్వాసించి ధర్మరాజు భీమున కి ట్లనియె. 301
క. ఈరాజపుత్త్రిఁ దోడ్కొని, దారుణపాషాణదుష్పథంబులఁ జనఁగా
నేర దిది నడువ నోపదు, భూరిభుజా యనిన ననిలపుత్త్రుం డంతన్. 302
క. అగ్రజననుమతమున న, త్యుగ్రనిశాచరసమేతు నుడుమార్గగు వీ
రాగ్రణి ఘటోత్కచుం దన, యగ్రసుతుం దలఁచె ధీరు హైడింబేయున్. 303
క. అతఁడును రాక్షససైన్యా, న్వితుఁ డై తత్క్షణమ వచ్చి నిర్జరవరస
మ్మితులకుఁ బ్రణమిల్లెం దన, పితృవరులకు బ్రాహ్మణులకుఁ బెద్దయు భక్తిన్. 304
వ. ఇట్లు మ్రొక్కి పని యే మని ముకుళితహస్తుం డయి తనముందట నున్నకొడుకుఁ
గౌఁగిలించుకొని భీముండు వాని కి ట్లనియె. 305
తే. అబల యిది భవన్మాత నిత్యాధ్వగమన, ఖిన్న యైనది గజరాజఖేలగమన
దీని నీ వెత్తికొని చను దెమ్ము మాస, మీపమున నని సుతు నియమించె నపుడు.
వ. వాఁడును బితృవచనచోదితుం డై యిమ్మార్గం బతిపరుషశిలావిషమంబు పాద
చారుల కగమ్యంబు గావున మి మ్మిందఱ నెత్తికొని యాశ్రమంబున నరిగెద నని
ధౌమ్యపాండవద్రౌపదులం దా నెత్తుకొని బ్రాహ్మణుల నెత్తికొనం దనరాక్షసబలం
బులం బంచె రోమశుండు సిద్ధగతి నరిగె ని ట్లందఱు గగనమార్గంబునం జని
గంగాతీరంబున నరనారాయణాశ్రమం బైనబదరీవనంబుఁ గని రాక్షసస్కంధావతీర్ణు
లై యందు. 307
క. లలితమధుస్రవఫలములు, విలసితమృదుపత్రతతులు వృత్తస్కంధం
బులు నవిచలితచ్ఛాయలు, గలబదరీతరులఁ జూచి కడువిస్మితు లై. 308
వ. సురసిద్ధమునిసేవితం బయినభాగీరథిం జూచి యందుఁ గృతస్నాను లయి నియమవ్ర
తంబులు సలుపుచు సమాధియోగంబున మైనాకశైలంబును హిరణ్యశిఖరంబును
బిందుసరస్సునుం జూచి బదరీవనంబునం దాఱుదివసంబులు నివాసంబు సేసి యుం
డునంత నొక్కనాఁడు. 309
చ. అలఘులు గంధమాదనమహాధరణీధరసానురత్నవే
దులఁ బవమాననందనుఁడు ద్రోవదియున్ విహరించు చున్నచో
లలితసహస్రపత్రకమలంబు సమీరవిధూత మై మహీ
తలముపయిన్ వడిం బడియెఁ దద్దయుఁ బొల్పుగ వారిముందటన్. 310

వ. ఆసౌగంధికకమలంబుఁ జూచి దానియపూర్వరమణీయత్వంబునకు ననన్యకుసుమసాధారణం బయినసౌరభ్యంబునకు నోటువడి ద్రుపదరాజపుత్త్రి ముదితచిత్త యై యక్కటా యిది యొక్కపువ్వ యయ్యు నపూర్వం బై మనోనయనానందకరం బైనది యిట్టికుసుమంబులు కడుం బెక్కులు గావలవదె యవి కుఱంగటం గల వేనిఁ దెచ్చి యిచ్చి నాకు మనఃప్రియంబుఁ జేయు మని యప్పుడ యప్పువ్వు ధర్మరాజుకడకుం గొనిపోయె నిట (భీముండు) దానియభిమతంబుఁ జేయం గడంగి రుక్మపృష్ఠం బైనధనుశ్శ్రేష్ఠంబును నాశీవిషోపమానంబు లైనబాణంబులు ధరియించి యక్కమలంబు దెచ్చినగాడ్పున కభిముఖుండై గాడ్పుపట్టి గంధమాదనంబున వివిధరత్నబంధురకందరకదళీషండదర్శనంబులను మందారమందిరసుగంధిగంధవహస్పర్శనంబులను నళికులకోకిలాలాపశ్రవణంబులను సర్వర్తుకుసుమసురుచిరగంధాఘ్రాణంబులను నతిమధురఫలాస్వాదనంబులను బద్ధప్రమోదహృదయుం డగుచుఁ దన కెదిరి వచ్చుమృగంబులం దాఁకి గజంబు నెత్తి గజంబుపై వైచుచు సింహంబు నెత్తి సింహంబుపై వైచుచు నల్పమృగంబులం గరతలప్రహారంబులం బ్రహరించుచు.

భీముఁడు సౌగంధికహరణార్థంబు పోవుట.

సీ. గమనవేగంబున ద్రుమలతాజాలసం, చాలన సేయుచు శైలగుహల
నడఁగి యదృశ్యులై కడువేడ్కతోఁ దన్నుఁ, జూచు ఖేచరసిద్ధసురభుజంగ
గరుడగంధర్వకిన్నరకామినులచేత, మానుగా నభివీక్ష్యమాణుఁ డగుచు
మ్రాఁకులు విఱుచుచు వీఁకతోఁ దీవలఁ, బెఱుకుచుఁ బదహతిఁ బృథునగేంద్ర
ఆ. మద్రువ నున్నతంబు లయినెడ లెక్కుచు మదగజంబువోలె మధ్యముండు
పవనవైనతేయపటుజవయుక్తుఁ డై, యరిగె గంధమాదనాంతరమున. 312

వ. ఇట్లరుగువాఁడు నిజసింహనాదశ్రవణపరిత్రస్తంబు లై యెగసి పఱచుపక్షులయార్ద్రపక్షంబులఁ జూచి ముందట నాసన్నంబునం గొలను గలుగ వలయు నని యుపలక్షించి యతిత్వరితగతిం జని చని పవనవశపరిచలితతలీరుహపనసతమాలతాలహింతాలవిశాలకదళీదళవీజ్యమానశీతలజలపరిపూర్ణం బైనయొక్కసరోవరంబుఁ గని యందుఁ గృతావగాహుం డై నవనలినదళమృణాళవలయాలంకృతుం డగుచు దాని వెలువడి యనేకయోజనవిస్తారాయామరమణీయం బైనకదళీషండంబుఁ జొచ్చి యందు శంఖధ్వానంబుఁ జేసిన. 313

క. ఆశంఖరవంబు మహో, గ్రాశనినిర్ఘోషభీమ మై దిక్కులు నా
కాశంబు నిండె నంత గు, హాశయునుం డైనహనుమ యనుకపి వెలుచన్. 314

క. దాని విని బెదరి లేచి మ, హానాదం బిది మనఃప్రియం బయ్యె మదీ
యానుజుశంఖధ్వానము, దా నగు నని యెఱిఁగి హృష్టతనురుహుఁ డగుచున్. 315

వ. భీమునకు మార్గనిరోధంబుగా మహావృక్షంబు లురలం ద్రోచి యేకాయనపథం

బున కడ్డంబ శయనించి లాంగూలలీలాచాలనంబుఁ జేసిన. 316

క. గోలాంగూలోత్తములాం, గూలస్ఫోటనరవంబు ఘోరం బై వా
చాలతఁ జేసె నశేషమ్ము, గాలి భయం బంద గిరిగుహాముఖములకున్. 317

వ. అయ్యపూర్వధ్వని విని భీముండు విస్మితుం డయి చని కదళీషండమధ్యంబున నొక్క విశాలశిలాతలంబుపయి శయనించినవాని. 318

సీ. హ్రస్వపీనగ్రీవు [1]నవనతాయతహను, నతిచపలస్వభావాభిరాముఁ
దనుమధ్యకటిచక్రు దహనకణాకార, [2]తామ్రాక్షు నతిదృఢదశనకరజుఁ
బృథులవిద్యుత్పుంజ[3]పింగాంగు నత్తుంగ, దృఢవృత్తు నక్షీణదీర్ఘబాహు
నూర్ధ్వలాంగూల మత్యున్నతధ్వజలీలఁ, గ్రాలుచు నుండ నేకాంతయోగ

ఆ. నిద్ర నున్నధర్మనిర్మలు హనుమంతుఁ, జూచి పాండురాజసుతుఁడు వాని
నిద్రఁ దెలుపఁ గడఁగి [4]నిజసత్త్వ మేర్పడ, సింహనాద మొప్పఁ జేసె డాసి. 319

వ. హనుమంతుండును మెల్లమెల్లన మేల్కని జృంభసంభృతజలార్ద్రసంచలవిలోచనుం డగుచు ననాదరంబున నాతనిం జూచి యి ట్లనియె. 320

తే. అతిజరారోగభరమున నలసి [5]యొలసి, యొదిఁగి సుఖనిద్ర మై నిట్టు లున్నవానిఁ
గడుమదంబున నేమియుఁ గరుణలేక, యేల బోధించి తయ్య నీ వెఱిఁగి యెఱిఁగి.

వ. తిర్యగ్జాతులు ధర్మ వెఱుంగవు గాక సర్వభూతదయాస్వరూపం బైనధర్మ వెఱింగెడువారు మనుష్యుల కారె యిట్టిమనుష్యజన్మంబు వడసి వృద్ధోపసేవ సేయవు గా కేమి ధర్మ వెఱుంగక నిర్దయుండ వై మాబోఁటిపేదమృగంబులకు భయంబుగ గర్జిలితి వీ వెవ్వండవు మనుష్యగోచరంబు గానియివ్వనంబున కేల వచ్చితి సిద్ధగతి లేనివారి కిట వోవ నశక్యం బమృతకల్పంబు లైనయీఫలమూలంబు లుపయోగించి క్రమ్మఱుము నీయందు బద్ధస్నేహుండఁ గాన బుద్ధి సెప్పితి నాపలుకులు చేకొను మనిన భీముం డి ట్లనియె. 322

తే. క్షత్రియప్రవరుండ విఖ్యాతబలుఁడఁ, బాండుతనయుండ గొంతిగర్భంబునందు
వాయువరమునఁ బుట్టినవాఁడ నన్ను, భీముఁ డండ్రు భూజనులు కపిప్రభుండ. 323

వ. ఏ నిక్కడఁ గార్యార్థి నై పోయెద నాకుం దెరు విమ్మానినాఁడు దొల్లి శతయోజనవిస్తారం బయినసముద్రంబు లంఘించి లంకకుం బోయినహనుమంతునట్ల నిన్ను నీ పర్వతంబు లంఘించి పోదు ననిన హనుమంతుఁ డతం డేమికారణంబున సముద్రలంఘనంబుఁ జేసె నెఱుంగు దేనిం జెప్పు మనిన వానికి భీముం డి ట్లనియె. 324

క. అలఘుయశుం డిక్ష్వాకుని, కులవీరుఁడు రాఘవుండు గురువచనంబుం
జలుప వనవాసి యై తన, లలనం గోల్పడియె నట్టె లంకేశ్వరుచేన్. 325

---

1. గ. నచలితాయత. 2. గ. తామ్రోష్ఠు నతికృశదశన. 3. అ. పింగాక్షు. 4. నిజరూప మేర్పడ.
5. చ. ‘యున్న, వాని నీతోడఁబుట్టిన • వాని నన్ను, నొనర సుఖనిద్ర మై నిట్టు • లున్నవాని, నేల బోధించితయ్య నీ • వెఱిఁగి యెఱిఁగి.’

క. సీతాన్వేషణపరులై, నీతిఁ గపిప్రవరు లరిగి ✽ నిరతంబుగ సం
పాతి యనుపక్షిచేత మ, హీతనయావార్త లెల్ల ✽ నెఱిఁగి కడంకన్. 326

క. వారలు వారిధి గడవఁగ, నేరక తా రున్నయెడ న్రనిలసత్త్వమునన్
వారిధి లంఘించె మహా, వీరుఁడు హనుమంతుఁ డనఁగ ✽ వినుఁ గపీంద్రా. 327

వ. ఏను హనుమంతునంతియబలపరాక్రమంబులు గలవాఁడ నాపౌరుషంబుఁ జూపు దునే యనిన నవ్వ క్తహాసముఖుం డగుచు నన్నా యేను ముదిసినవాఁడ లేవ నోపం బోయెదవేని నాతోఁకం బాయం ద్రోచి పొ మ్మనిన మెచ్చక తనవామకరంబున నెత్తం బోయి వశంబు గాక. 328

ఉ. ఏపున రెండుచేతులను ✽ నిమ్ముగఁ బట్టి యమర్చి యెత్తఁగా
నోపక [1]మొగ్గతిల్లఁబడి ✽ యుద్గతఘర్మజలార్ద్రదేహుఁ డై
కాపురుషుండుఁబోలె నిజ✽గర్వము దక్కి యడంగి యుండెఁ జిం
తాపరుఁ డై వృకోదరుఁడు ✽ తద్దయు లజ్జ నధోముఖంబుతోన్. 329

వ. ఇట్లక్కపివరులాంగూలంబుఁ గదల్ప నోపక భీముండు కృతప్రణాముం డయి ని న్నెఱుంగక నాపలికినదురుక్తంబులు సహింప వలయు నీవు కపిరూపధరుండ వైన సిద్ధుండవో గంధర్వుండవో దేవవరుండవో నా కెఱింగింపు మనిన హనుమంతుండు భీముం జూచి నగుచు నేను కేసరిక్షేత్రంబున వాయుభట్టారకునకుం బుట్టినవాఁడ నీచెప్పినహనుమంతుండ నీవు నాయనుజుండవు దొల్లి రఘుకులేశ్వరుం డయిన రామదేవుండు రావణుం డనురాక్షసుచేత నపహృతభార్యుం డయి సుగ్రీవాది వానరుల నసంఖ్యాతసంఖ్యులవారిం దనకు సహాయులం జేసికొని సేతుబంధనంబున సముద్రంబు లంఘించి సమరంబున రావణు వధియించి యందు [2]నాకెలసము మెచ్చి. 330

మధ్యాక్కర. నరసురస్తుత్యమై యెంతకాలంబు ✽ నాకీర్తి నిలుచు
నిరతంబుగా నంతకాలమున్ నీవు ✽ నిత్యుండ వగుచుఁ
బరఁగు మని వరముఁ దగ దయుంజేసి ✽ ప్రభుఁ డుర్వి యెల్ల
సరిఁ బదునొక్కండువేల యేం డ్లేలి ✽ చనియెను దివికి. 331

వ. అనిన విని భీముండు వాని నప్పుడు హనుమంతుంగా నెఱింగి సంతసిల్లి వెండియు నమస్కరించి భవద్దర్శనంబునం గృతార్థుండ నయితి నని యి ట్లనియె. 332

ఆ. బలిముఖుండ దయయుఁ ✽ గలవేనిఁ దొల్లి య, ర్ణవము గడచి చనిన✽నాఁటినీదు
రూపుఁ జూడ వలతుఁ ✽ జూపు నా కనవుడు, వాని కిట్టు లనియె ✽ వానరుండు.

క. అక్కాలంబునరూపం, బిక్కాలమునందుఁ జూప ✽ నెట్లగుఁ గాలం
బొక్కవిధంబున నుండక, పెక్కు[3]ప్రకారముల నుండు ✽ భిన్నావస్థన్. 334

1. క. గ. ప్రోఁకరిల్లఁబడి. 2. క. ఖ. నాఖేలనము. 3. జ. వికారముల.

వ. దానం జేసి కృతత్రేతాద్వాపరకలియుగంబులసంఖ్యలు వేలువేలై యందుల చరాచరభూతంబులు భిన్నప్రకారంబులై వర్తిల్లు ననిన నయ్యాయుగంబుల[1]యాచారవర్తనంబులు నా కేర్పడం జెప్పు మనిన భీమునకు హనుమంతుం డి ట్లనియె.

భీమునకు హనుమంతుండు చతుర్యుగాచారవర్తనంబులను దెలుపుట.

తే. కృతమకాని కర్తవ్యంబు గృతయుగంబు, నందు లేదు చతుష్పాదమగుచు ధర్మ
మనఘ వర్తిల్లు నచ్యుతుం డయ్యుగమున, శుక్లవర్ణుఁడై ప్రజలఁ గాచుచు వెలుంగు.

వ. అది సనాతనధర్మసనాథం బందుల బ్రహ్మక్షత్త్రియవైశ్యశూద్రు లేకవేదక్రియాయోగ్యులై యకామఫలసంయోగంబునఁ బుణ్యలోకంబులు వడయుదు రందు నసూయాభిచారదర్పపైశున్యవిగ్రహక్రోధమదమత్సరభయసంతాపవ్యాధిప్రజాక్షయేంద్రియక్షయంబులు లేవు మఱియుఁ ద్రేతాయుగంబునందుఁ ద్రిపాదంబై ధర్మువు వర్తిల్లు నందు జనులు నిత్యసత్యప్రవర్తనులై యజ్ఞతపోదానాదిక్రియల వర్తింతు రందు రక్తవర్ణుం డయి విష్ణుభట్టారకుండు ప్రజారక్షణంబుఁ జేయు.

తే. ద్వాపరంబున రెండుపాదములఁ జేసి, నడచు ధర్మువు వేదముల్ నాల్గుదెఱఁగు
లై ప్రవర్తిల్లు వేదశాస్త్రార్థచోది, తంబులై [2]సర్వకర్మముల్ ధరణిఁ బరఁగు.

తే. సత్యపరిహీణులగుదురు జనులు గామ, కాములై చేయుదురు బహుక్రతువు లోలి
నందుఁ ద్రైలోక్యవందితుం డచ్యుతుండు, కృష్ణవర్ణుఁడై జగము రక్షించు మఱియు.

క. కలియుగమునందు ధర్మము, బల మఱి వర్తిల్లు నేకపాదంబున నం
దలఘుఁడు కృష్ణుఁడు జగతీ, వలయము రక్షించుఁ బీతవర్ణుం డగుచున్. 340

వ. అందులజనులు తమోగుణయుక్తు లయి కామక్రోధాదిదోషవశంబునం దమ్మెఱుంగక యధర్మవర్తు లగుదు రందుఁ జేసినతపోదానాదికర్మంబులు స్వల్పంబు లయ్యును బహుఫలంబు లగు నని యుగవర్తనప్రకారంబులఁ జెప్పి నీ కిష్టావాప్తి యయ్యెడు నరుగు మనిన భీముం డి ట్లనియె. 341

హనుమంతుఁడు భీమునకుఁ దనపూర్వరూపంబుఁ జూపుట.

క. నీనాఁటితనువుఁ జూచియ, కాని యవశ్యంబు పోవఁ గావునఁ గపినా
థా నాకుఁ జూపు మనవుడు, వానికిఁ [3]దనరూపుఁ జూపె వానరుఁ డంతన్. 342

చ. అతులితమై ద్వితీయకనకాద్రి యొకో యిది నా నిజాంగము
చ్ఛ్రితముగఁ బెంచి పుచ్ఛమునఁ జేసి దిగంతము లందు చున్న యు
న్నతుఁ గపినాథుఁ జూచి కురునందనుఁ డప్పు నిమీలితాక్షుఁడై
మతి నతివిస్మితుం డగుచు మారుతి కి ట్లనియెన్ భయంబునన్. 343

క. అతిభీషణ మిది యత్యు, ద్భుత మోహో చాలు భూనభోమధ్యవ్యా
పిత మయ్యె భవద్దేహో, యతత్వ ముపసంహరింపు మనవుడుఁ గపియున్. 344

1. గ. యాచారభూచారవర్తన. 2. అ. ధర్మకామముల్. 3. క. దనపాడవు.

క. తనయెప్పటిరూపముఁ జే, కొని దీనికి నినుమడుం గొఁగుం బ్రతిబలముం
గనినప్పుడు నారూపం, బనుపమముగ ననిన హనుమ కనిలజుఁ డనియెన్. 345

ఉ. ఉన్నతిఁ బూని నీవు బలియుం డగురావణు నశ్రమంబునం
బన్నుగఁ జంప నోపుదటు బాహుబలాఢ్యుడ [1]విట్టియున్నతుల్
నిన్ను సహాయుఁగాఁ బడసి నిర్మలకీర్తియుతుండు రాఘవుం
డన్నరభోజనాన్వయము నాజి వధించుట యేమి చోద్యమే. 346

వ. అనిన వాని కతిప్రీతిమంతుం డయి హనుమంతుం డిట్లనియె నయ్యా నీవు సౌగంధికసరోవరంబునకుం బోయెద వే నందు సాహసంబు సేయ వలవ దది యక్షరాక్షసరక్షితం బై దేవతోపభోగయోగ్యం బై యుండు దేవతలు బలిహోమనమస్కారంబుల మంత్రతంత్రంబులం జేసి భక్తిసాధ్యులుగాని సాహసక్రియాసాధ్యులు గారు. నీవు నిజధర్మనిష్ఠితుండ వై పరమధర్మంబు లెఱుంగునది యెందేని హీనబుద్ధులు విమోహింతు రట్టిధర్మాధర్మవిభాగంబు లెఱుంగువిద్వాంసుల నుపాసించి శుభాచారుండవు గావలయు నాచారంబున ధర్మంబు పుట్టు ధర్మంబువలన వేదప్రతిష్ఠ యగు వేదంబులం జేసి యజ్ఞంబులు ప్రవర్తిల్లు నట్టియజ్ఞంబువలన దేవతలు తృప్తు లగుదురు. 347

ఆ. కార్యసిద్ధిఁ బొంది కాలంబు దేశంబు, నెఱిఁగి బుద్ధిమంతు లెల్లప్రొద్దు
సాహసంబు విడిచి సామాద్యుపాయప్ర, యుక్తి చేయుదురు యథోచితముగ.

వ. మఱియు సర్వకార్యంబులు మంత్రమూలంబులు గావున విద్వాంసు లై [2]వృద్ధు లైనవారలతో మంత్రంబుఁ జేయునది బాలకులయు నధికశ్రీదర్పితులయు లుబ్ధులయు లఘుజనంబును దోడ మంత్రంబు సేయ వలదు. 349

తే. జనులు నిగ్రహానుగ్రహాశక్తుఁ డైన, రాజుశాసనమునఁ జేసి రమణతోడ
నోలిఁ దమతమమర్యాద లొక్కనాఁడుఁ, దప్ప నోడుదు రిమ్మహీతలమునందు.

వ. నీవు నిగ్రహానుగ్రహసమర్థుండవు గావున నీ కెల్లవారును వశ్యు లగుదురు నిన్నుఁ జూచుటం జేసి నానయనంబులు సఫలం బయ్యె నీ కెద్ది యిష్టంబు దానిం జేసెద.

మత్తకోకిలము. మీకు నెగ్గొనరించి యున్నయమిత్రుల్ [3]హతబుద్ధులం
జీకురాజుతనూజులం గురుసింహ నీకుఁ బ్రియంబుగా
నేకమాత్రన పోరిలో వధియించి నాగపురంబు నా
నాకులాద్రిశిలావలీగహనంబు సేయుదు నావుడున్. 352

మత్తకోకిలము. ఇంతయుం గపినాథ నీ కిది యేమిపెద్ద మహాహవా
భ్యంతరంబున నుద్ధతప్రతిపక్షవీరుల నేమ ని
ర్జింతు మెవ్వరు మాకు మీఁదయఁ జేసి మార్కొనునంతయు

1. క. విట్టియుద్ధతుల్. 2. గ. ప్రబుద్ధు. 3. హతబంధుల్.

త్యంతవీరులు [1]లేరు భూవిదితప్రతాపబలోద్ధతిన్. 353

వ. అనిన విని భీమసేనునకు హనుమంతుం డిట్లనియె నన్ను [2]రణాంతరంబునం దలంచు నది నీయందు సౌహృదంబున నాహవంబులో నతిరథుం డైనయర్జునురథధ్వజంబు నం దుండి మీబలపరాక్రమంబులం జూతు నని భీముం గౌఁగిలించుకొని వానికి సౌగంధికసరోవరమార్గంబుఁ జూపి హనుమంతుం డంతర్హితుం డయినఁ దదాలింగన(ంబున) విగతశ్రముండును విపులజవశక్తియుక్తుండును నై భీమసేనుండు. 354

సీ. వారిధారల ననివారితనిర్గళ, ద్దానధారలఁ దటోద్దామములను
దశనధామంబులకు నశనిఘోషంబుల, ఘోరబృంహితబృహద్ఘోషణముల
నివి ఘనబృందంబు లివి గజయూథంబు, లని విచారింపంగ నక్కజంబు
లై లలితోత్తుంగశైలకుంజంబులఁ, ద్రిమ్మరుజలధరద్విరదతతుల

ఆ. విస్మయంబుతోడ వీక్షించుచుం జని, రజతగిరిసమీపరమ్యభూమి
నక్కుబేరువనమునందు సౌగంధిక, కమలవనముఁ గనియె ఘనభుజుండు. 355

క. అంచలహేమాంబుజమక, రందరసామోదమృదులతరశ్వసనుం డా
నందంబుఁ జేసెఁ దనప్రియ, నందనునకు భీమసేనునకు నభిముఖుఁ డై. 356

వ. అంత. 357

క. వీరుం డై సౌగంధిక, వారిజములు గొనఁగ నిట్లు వచ్చినవానిన్
భూరిపరాక్రము భీమును, దారగదాహస్తుఁ జూచి తా రుద్ధతు లై. 358

వ. దాని రక్షించి యున్నపదివేవురురాక్షసు లాక్షణంబ విచిత్రాయుధపరిచ్ఛదు లై పఱతెంచి వీఁ డొక్కవిపరీతపురుషుం డాయుధంబులు ధరించినవాఁ డజినంబులు గట్టినవాఁ డధికతేజస్వి తపస్వివేషధరుం డిందులకు వచ్చినవాఁ డని యచ్చెరు వందుచు భీమసేనుం డాయ వచ్చి యి ట్లనిరి. 359

తరలము. ఇది కుబేరవనంబు దీనికి నెవ్వరుం జనుదేర నో
డుదురు నీ విట వచ్చి యేల కొడుం బ్రమాదముఁ జేసి తిం
దుదితతేజుఁడు క్రీడ లాడుచు నుండు నింతులుఁ దాను స
మ్మదముతోడఁ గుబేరుఁ డీరుచిరమత్సరోజవనంబునన్. 360

వ. దీనితీరంబున దేవర్షిగణంబులు దేవతార్చనంబులఁ జేయుదు రిందులజలంబు లమృతోపమానంబులు మఱి వైడూర్యనాళంబు లై యపూర్వసౌరభంబు లైన కనకకమలంబులు గలుగుటం జేసి యక్షరాక్షసాక్షౌహిణీరక్షితం బగు దీనిమహిమం బెఱుంగక యింతదూరంబు వచ్చినవీరుం డెవ్వండ వేమికారణంబున వచ్చి తనిన వారికి భీముం డి ట్లనియె. 361

మత్తకోకిలము. ఏను పాండుసుతుండ భీముఁడ నిద్ధతేజుఁడ ధర్మరా
జానుజన్ముఁడ ద్రౌపదీహృదయప్రియం బొనరింపఁగాఁ

---

1. గ. మేరుభూవలయప్రతాపబలోన్నతిన్. 2. క. కదనాంతరంబునం.

బూని యిక్కమలాకరంబునఁ బుష్పముల్ గొన వచ్చితిన్
వీనిఁ గొందు నవశ్యమున్ సురవీరు లడ్డము వచ్చినన్. 362

వ. అనిన వార లిట్లని రయ్యా నీవు దివ్యపురుషుండ వీసౌగంధికకమలంబులు గొని యెదేనిఁ గుబేరున కెఱింగించి తదాదేశంబునఁ గొనుము నీవు ధర్మజానుజుండవు గావున నీకు ధర్మపథంబు తప్పం జన దనిన రాక్షసులఁ గటాక్షదృష్టిం జూచి భీమసేనుం డిట్లనియె. 363

క. గిరినిర్ఝరములఁ బుట్టిన, సరసిజవన మిదియు సర్వసామాన్యము గా
కరుదుగ నొకరునియదియే, పరఁగఁ గుబేరుండు దీనిఁ బడసెనె మొదలన్. 364

తే. ఉత్తమక్షత్త్రియుం డేల యొరుల నడిగి, వేఁడువాఁ డగుఁ దనభుజావిక్రమమున
నన్యధనము లుపార్జించి యర్థిజనుల, కిచ్చుఁ గీర్తి దిక్కుల వెలయించుఁ గాక.

భీముఁడు యక్షరాక్షసులతో యుద్ధంబు సేయుట.

వ. నాకు మిమ్మును మీకుబేరుం బ్రార్థించి కాని యిక్కొలనిపువ్వులు గొనం గాదొకో యని భీముండు రాక్షసుల నాదరింపక సౌగంధికవనంబు సొచ్చి కనక కమలంబులు గొని యుత్తమవీర్యవంతంబు లైనతత్సలిలంబు లుపయోగించి యనంతబలసంపన్నుం డై యున్న నాతనిం జూచి రాక్షసు లలిగి యుద్యతాయుధహస్తు లై తాఁకిన భీముండును భీకరాకారంబున. 366

చ. తనగదఁ జేసి రాక్షసులదారుణశస్త్రచయంబు నశ్రమం
బున నతివీరుఁ డై నిలిపి ఘోర నిశాచరులన్ బడల్పడన్
ఘనభుజదండచండహతిఁ గ్రాఁచిన నుక్కఱి రక్కసుల్ కుబే
రున కెఱిఁగింపఁ బాఱిరి సరోషవృకోదరభీమకర్మముల్. 367

వ. కుబేరుండును బాంచాలీప్రియకరం బైనపవనతనయుపరాక్రమారంభంబు విని మెచ్చి వాని నుపేక్షించె నట్లు భీమసేనుండును రాక్షససేన నోడించి సౌగంధికకమలంబులు గొని తత్తీరకుసుమితలతాపాదపవనంబున విహరించుచున్నంత నట.

క. వడిఁ బడియెఁ బిడుగు లుడుగక, వడఁకె మహీతలము పాంసువర్షము గురిసెం
గడు నెఱ్ఱనయ్యె దిశ లే, ర్పడ కుండె నినుండు తిమిరపటలావృతుఁ డై. 369

వ. ఇట్టి మహోత్పాతంబు లుపలక్షించి విస్మితుం డై ధర్మతనయుం డివి భీమాహవపిశునంబు లై కానంబడియె నేమఱకుండవలయు నని నాలుగు దిక్కులుం జూచి భీమసేనుం గానక తనసమీపంబున నున్నపాంచాలి కిట్లనియె. 370

క. ప్రియసాహసుండు భీముఁడు, భయవిరహితుఁ డెందుఁ బోయె బహురాక్షససం
శ్రయ మిగ్గిరి గంధర్వా, న్వయసేవ్యం బేకచరుఁడు వాఁ డెయ్యెడలన్. 371

ఆ. భూరిభుజుఁడు దానె పోయెనో నీ వెట, యేని పుచ్చితో నిజేచ్ఛ నతని
నని యజాతశత్రుఁ డడిగినఁ బతికిఁ బాంచాలి యిట్టు లనియె సంభ్రమమున.

మధ్యాక్కర. ధరణీశ నీకు నాయిచ్చినపసిఁడితామరపువ్వు

గురువాయువశమున వచ్చినను దానిఁ గొని యిట్టిపువ్వు
లరుదు గాన కలంగటం గలిగెనేని నర్థిఁ దె మ్మనిన
నరిగె నీశానుదిక్కునకు నీయనుజుఁ డనిలవేగమున. 373

వ. అనిన నట్లని నందఱము వానిపోయినవలనం బోవుద మని యెప్పటియట్ల రాక్షస బలసమన్వితుం డై గగనగతి నరిగి సౌగంధికతీరంబున. 374

చ. అతులబలాఢ్యు నుద్ధతగదాయతబాహుఁ బటుప్రతాపవ
ర్ధితయశుఁ బాండునందనుఁ దదీయమహోగ్రగదానిఘాతదా
రితపృథుయక్షరాక్షసశరీరచయంబులుఁ జూచి విస్మయ
స్మితముఖు లైరి బ్రాహ్మణసమేతులు ధర్మసుతాదు లచ్చటన్. 375

వ. భీమసేనుండును ధౌమ్యధర్మజరోమశులకు మ్రొక్కి తనకు మ్రొక్కినకవలఁ గౌఁగి లించుకొని వైడూర్యనాళంబు లైనకనకకమలంబులు ద్రౌపది కిచ్చి యున్నంత నాతనికి ధర్మరాజి ట్లనియె. 376

ఆ. చనునె నీకు నిట్టిసాహసక్రియఁ జేయ, నెల్లవారికంటె నెఱుక గలవు
గురుభుజుండ నాకుఁ గూర్తేనిఁ జేయకు, మయ్య యిట్టిచెయ్వు లనఘ యింక.

వ. అని కఱపి యి ట్లందఱుం గుబేరోద్యానవనంబున విహరించు చున్నంతఁ దద్రక్షకు లైనయక్షులు వచ్చి. 378

క. దేవర్షి యైనరోమశు, దేవేంద్రసమాను నయ్యుధిష్ఠిరు నవనీ
దేవోత్తములం గని విన, యావనతులు భక్తి నిట్టు లని రందఱకున్. 379

వ. మీ రిందు మసల వల దిది యక్షరాక్షసప్రచారఘోరం బనిన నం దుండ నొల్లక పాండవులు తత్సమీపంబున నివాసంబుఁ జేసికొని రాక్షసబలంబుతో ఘటోత్కచుఁ బోవం బనిచి యుండునంత జటాసురుం డనురాక్షసుండు బ్రాహ్మణరూపధరుం డై యేను వేదవిదుండ ధనుర్వేదవిదుం డైనపరశురాముశిష్యుండ ననుచుం బాండవుల సేవించు చున్నంత నొక్కనాఁడు. 380

ఆ. మృగవిరోధిబలుఁడు మృగయావినోదార్థ, మడవి కనిలతనయుఁ డరిగినట్టి
యవసరమున నజ్జటాసురుఁ డాసురా, కారవికృతరూపకంబుఁ దాల్చి. 381

క. చనుదెంచి ద్రౌపదిని యమ, తనూజు నకులుం దదాయుధంబులతోఁ బె
ల్చన యెత్తికొని మహాజవ, మునఁ బఱచె మహీసురోత్తములు భయ మందన్.

వ. అంత సహదేవుండు భీమునిం బిలుచుచు వనంబున కరిగె నిట ధర్మతనయుం డధర్మవర్తి యైనయసురకి ట్లనియె. 383

క. దేవాసురాదు లిం దుప, జీవింతురు మనుజులను విశేషసుఖంబుల్
గావించుచు నమ్మనుజులఁ, గావం గలవార మేము గారవయుక్తిన్. 384

వ. ఇట్టిమాకపకారంబు సేయుట నీకు లగ్గు గాదు నీవు ధర్మ వెఱుంగవు విశ్వసించినవారికిం దనకుఁ గుడువం బెట్టినవారికి నెగ్గు సేయుట కడుం బాపంబు గావున.

-జటాసురవధ పర్వ 66.

మధ్యాక్కఱ. మాయావి మాయాయుధములు మాకిచ్చి । మాతోఁ రణమ్ము
సేయు మివ్విధమునఁ బోవఁ దగ దంచుఁ । జిక్కనై యసుర
నాయతబాహుఁడు గరము భరముగా । నదిమె ధర్మజుఁడు
[1]మాయమార్గుఁ డగువానిగమనంబు । మందమై యుండ. 386

వ. ఇట్లు ధర్మజనిబిడపీడనవేదనాభరంబున విగతవేగుండై యరుగుజటాసురున కడ్డంబు వచ్చి సహదేవుం డిట్లనియె. 387

క. నన్నెఱుఁగవె పాండవుఁడఁ బ్ర, సన్నయశోవీర్యబలుఁడ । సహదేవుఁడ న
త్యున్నతి యేర్పడ నిప్పుడ, నిన్నోర్చెదఁ [2]జిక్కనెదిరి । నిలువుము నాతోన్. 388

భీముఁడు జటాసురునితోఁ యుద్ధంబు సేయుట.

వ. అను చున్నయవసరంబున ననిలసుతుం డనిలవేగంబున నరుగుదెంచి జటాసురుచేత నిగృహీతులై గగనగతిం జనుధర్మజనకులద్రౌపదులను మహీతలగతుండైన సహదేవుం జూచి యయ్యసుర కిట్లనియె. 389

తే. అతిథివై వచ్చి నీవు మా । యందుఁ గుడిచి, యసురవై యిట్ల యెగ్గు । సేయంగనగునె
యెందుఁ గుడిచినచోటికి । నెగ్గు సేయ, రెట్టిదుర్జను లైనను । నెఱుక విడిచి. 390

వ. నీవు బుద్ధి గలవేని వీరిని విడిచి నీప్రాణంబులు రక్షించుకొను మట్లు గాని నాఁడు బక హిడింబ కిమ్మీరులం జంపినట్ల శ్రమంబునం జంపుదు ననిన విని జటాసురుండు వారల విడిచి భీమసేనున కభిముఖుండై. 391

క. రయమున నీచేత నిహతు, లయినసురారాతులకు [3]రణాంతరమున నీ
దయినరుధిరమున నుదక, క్రియఁ జేసెద బక హిడింబ । కిమ్మీరులకున్. 392

క. అనుచుఁ గడు నలిగి మారుత, తనయు మహాబాహు నసుర । దాఁకె మరున్నం
దనున కెడ సొచ్చి మాద్రీ, తనయులు తత్క్షణమ వానిఁ । దాఁకిరి వీఁకన్. 393

సీ. వారల నిద్దఱ । వారించి భీముండు, దాఁకె జటాసురు । వీఁకతోడ
భీమాసురులకు సం । గ్రామంబు గడు ఘోర, మయ్యె నిర్మూలంబు । లయ్యె వారి
యూరుఘట్టనముల । ధారుణీరుహములు, పదఘట్టనములఁ గ్ర । క్కదలె ధరణి
భూరుహపాణు లై । పోరి యాసన్నభూ, రుహములు వొలిసిన । బృహదుదగ్ర
ఆ. శిలలఁ గొంతసేపు । చెలఁగి పోరాడి రొం, డొరులు పెనఁగి పట్టి । పరుష భంగి
నుగ్రు లైనవాలి । సుగ్రీవు లట్టుల, యుద్ధ మొప్పఁ జేసి । రిద్దబలులు. 394

క. భీమాసురవీరుల ము, ష్టాముష్టిరణచ్ఛటచ్ఛటాశబ్దం బు
ద్దామం బై తద్విపిన మ, హామృగపక్షులకు నతిభయానక మయ్యెన్. 395

ఆ. అంత భీమసేనుఁ । డంతకాకారుఁ డై
వాని బలవిహీనుఁ । గా నెఱింగి

1. అ. మాయావి యగువానిగమనవేగంబు, 2. క. జిక్కఁ బోర. 3. జ. రణాంతంబున.

తడయ కపుడు వానికి మెడ గ్రుంగఁ బిడికిటఁ
బొడిచె నసుర ముడిఁగి పడియెఁ బుడమి. 396

వ. ఇట్లు నిర్ఘాతపాతితనీలగిరిశృంగంబునుంబోలె నేలం బడినజటాసురకళేబరం బెత్తి యొక్కవిశాలపరుషపాషాణంబుపై జర్జరితంబుగా వైచి వానిం గాలగోచరుం గాఁ జేసినవాయుపుత్త్రుపరాక్రమంబు ధౌమ్యరోమశాదిమహీసురవరులు వర్ణించి రని వైశంపాయనకథితం బైనకథ రమ్యంబుగ. 397

క. భూపకులతిలక నృపవి, ద్యాపారగ నిత్యసత్యశోధనధన్య దయా
లాపచతురాస్య ధర్మ,వ్యాపారవిభాసి విష్ణువర్ధననృపతీ. 398

వసంతతిలకము. [1]శ్రీరమ్య రాజకులశేఖర రాజరాజా
భూరిప్రతాపపరిభూతవిరోధివర్గా
హారాహిరాజవరహంసతుషారకుంద
స్ఫారద్యశఃప్రసరపాండురితత్రిలోకా. 399

గద్యము. ఇది సకలసుకవిజనవినుతనన్నయభట్టప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దారణ్యపర్వంబున దధీచకథయును నగస్త్యమాహాత్మ్యంబును భగీరథుప్రయత్నంబునుం గంగావతరణంబును ఋశ్యశృంగుచరిత్రంబును బరశురాముచరిత్రంబును గార్తవీర్యవధయును రామకృష్ణాదులయాగమనంబును సౌకన్యాఖ్యానంబును జ్యవనుండు శర్యాతియజ్ఞంబున నాశ్వినుల సోమపీథులం జేసి వారిచేత జవ్వనంబు వడయుటయు మాంధాతృజన్మంబును సోమకుండు యజ్ఞంబుఁ జేసి పుత్త్రశతంబు వడయుటయు జంతూపాఖ్యానంబును శ్యేనకపోతంబు లై యింద్రాగ్నులు శిబిమాంసంబు గొనుటయు నష్టావక్రమాహాత్మ్యంబును రైభ్యయవక్రీతులసంవాదంబును భీముండు సౌగంధికహరణార్థం బరుగుటయు హనుమద్దర్శనంబును రామాయణకథయును భీముండు గంధమాదనంబునం దుండుకొలనికిం బోయి యక్షరాక్షసుల వధియించుటయు గంధమాదనంబున నందఱుం గూడుటయు జటాసురవధయు నన్నది తృతీయాశ్వాసము. 400

~~~~~~

ఉ. 1. 'రాజకులాగ్రగణ్య మృగ•రాజపరాక్రమ రాజరాజ వి
భ్రాజితశుభ్రకీర్తిపరి•పాండురసర్వదిగంతరాళ భూ
రాజిముఖోపలబ్ధవిజ•యప్రమదాశ్రితబాహుదండ ని
స్త్రైజిత వైరివీర కుల•దీప బుధప్రియ విష్ణువర్ధనా.

తోటకము. ధరణీశ నిరంతర•దానయశః, పరిపూర్ణదిగంతర • భానునిభా
కరుణాకర నిర్మల•కాంతియుతా, శరణాగతరక్షక • సత్యనిధీ.'

అని యధికముగా రెండుపద్యంబులు కొన్నిప్రతులఁ గనుపట్టుచున్నవి.
~~~~~~

శ్రీ

హరిహరహిరణ్యగర్భేభ్యో నమః

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము, చతుర్థాశ్వాసము.

రాజరాజ [1]దేవతు
షారసుధాహారహీరసన్నిభకీర్తీ
శ్రీరమణ [2]రాజవిద్యా
పారగ కోదండపార్థ పార్థివతిలకా. 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నట్లు పాండవులు నరనారాయణాశ్రమంబునఁ గొన్నిదినంబు లుండ నొక్కనాఁడు ధర్మతనయుండు దమ్ములకి ట్లనియె. 2

మధ్యాక్కర. ఏనేఁడు లగు దెంచె నర్జునుం డేఁగి యింత కేతెంచుఁ
బూని దివ్యాస్త్రముల్ వడసి యమ్మహాభుజు భూరిసత్త్వ
నానతరిపువర్గుఁ జూడఁ గాంతు మిం కదంచు బ్రాహ్మణుల
తో నేఁగె నుత్తరము మించి ధర్మనిత్యుఁడు ధర్మజుండు. 3

వ. ఇట్లు గంధమాదనపుణ్యతీర్థావలోకనపరు లయి పాండవు లరిగి పదునేడగుదివసంబున వృషపర్వుం డనురాజర్షియాశ్రమంబు గని యం దతిప్రీతి నాతనిచేతఁ బూజితు లయి యేడుదివసంబులు వసియించి బ్రాహ్మణుల నెల్ల నం దుండ నియమించి వృషపర్వోపదిష్టమార్గంబున ధౌమ్యలోమశప్రభృతికతిపయబ్రాహ్మణులతోఁ జని యష్టమదివసంబున. 4

క. విమలస్ఫాటికహాటక, రమణీయదరీనిరంతరశ్వేతనగేం
ద్రము మాల్యవంతమును ను, త్తమచరితులు సూచు చరిగి తద్విపినమునన్. 5

క. చలదళిపుంస్కోకిలకుల, కలరవముఖరితలతాంతకమ్రఫలాళీ
లలితమహీరుహమాలా, ఖిలితోద్దేశముల విశ్రమించుచు లీలన్. 6

వ. అందు విహరించుచుండ నొక్కనాఁడు శ్వేతకి యనుపుణ్యనదివలన మారుతానీతంబు లై సువర్ణమయంబు లయి తమముందటం బడినపంచవర్ణసురభికుసుమం

---

1. క. కులవిస్తార. 2. అ. ధనుర్విద్యా.

బులం జూచి యందఱు విస్మయం బంది రంత నేకాంతంబ యొక్క శశికాంత
శిలాతలంబుపయి నున్న భీమసేనునకు ద్రుపదరాజపుత్త్రి యిట్లనియె. 7

క. ప్రకటముగఁ దొంటిసౌగం, ధికకనకాబ్జములకంటె దివ్యసుగంధా
ధికకుసుమము లివి దద్దయు, సుకుమారము లిట్టివానిఁ జూచి యెఱుంగన్. 8

వ. ఇక్కుసుమంబులు నాకుఁ దెచ్చి యిచ్చి మనఃప్రియంబు సేయు మనిన విని భీముం
డు తత్క్షణంబ చని బహుతాళసమున్నతం బయిన గిరిశృంగం బెక్కి యందు
[1]వివిధరత్నరశ్మిరమ్యవేశ్మపరివృతం బయిన వైశ్రవణునివాసంబు గని శంఖధ్మానంబు
సేసిన. 9

క. దాని విని యక్షరాక్షస, సేనలు పఱతెంచి భీమసేను మహాసే
నానీసన్నిభుఁ దాఁకిరి, నానాయుధధరులు దారుణధ్వను లెసఁగన్. 10

క. వాయుసుతప్రేరితశిత, సాయకముఖదళితరాక్షసప్రకరబృహ
త్కాయాభ్రగళితశోణిత, తోయములన్ ధరణిధరనదులు గడు నిండెన్. 11

ఉ. ఉక్కఱి యిట్లు మధ్యమమహోగ్రశరంబులు దాఁకి నోర్వ కా
రక్కసు లెల్ల నాహవపరాఙ్ముఖు లైనఁ గడంగి భీముఁ దా
నెక్కటి దాఁకె డిక్కరి సహింపక [2]సింహముఁ దాఁకునట్లు లం
దక్కజుఁ డుద్యతాయతగదాయుధుఁ డై మణిమంతుఁ డచ్చటన్. 12

క. ఆరాక్షసు నతివీరుఁ గు, బేరసఖుం బవనసుతుఁ డభేద్యుఁడు నిజదు
ర్వారతరశాతసాయక, ధారావర్షమునఁ గప్పెఁ దారుణభంగిన్. 13

క. గద దీర్చి భీముమీఁదను, వదలక మణిమంతుఁ డలిగి వైచిన నది వి
ద్యుదినప్రభానిభం బై, పదిదిశలును వెలుఁగ భీముపయిఁ బఱతెంచెన్. 14

వ. [3]అమ్మహాసాధనంబునకు మనంబున బెగడక. 15

క. దానిఁ దననిశితబాణవి, తానంబున జర్జరీకృతముఁ జేసె మరు
త్సూనుఁడు గుహ్యకరాక్షస, సేనల కెల్లను భయంబు సేయుచు నలుకన్. 16

క. ఘనుఁ డమ్మణిమంతుఁడు కాం, చనదండోద్భాసి యైనశక్తి మరున్నం
దనుమీఁద వైచె నది యా, తనిభుజపార్శ్వమ్ము [4]దాఁకి ధారుణిఁ బడియెన్. 17

చ. గదఁ గొని భీముఁ డంత్యలయకాలకృతాంతుఁడపోలె నేల గ్ర
క్కదల నదల్చి నిల్చిన నకంపితుఁ డై మణిమంతుఁ డాజిదు
ర్మదుఁడు త్రిశూల మెత్తికొని మధ్యముపై ననలస్ఫులింగముల్
స్పెదరఁగ వైచె దానిఁ [5]జెఱిచెఁ ఘనుఁ డగ్గదఁ జేసి భీముఁడున్. 18

వ. ఇట్లు తనశక్తిశూలంబులు శక్తివిహీనంబు లయి పడినం బరిత్యక్తమదుం డై
మణిమంతుం డంతరిక్షంబున కెగసిన. 19

---

1. అ. వివిధరత్నరచితరమ్యప్రాకారపరివృత. 2. గ. కేసరిమీఁద నెత్తున, ట్లక్కజు. 3. ఈవచనము కొక్కిట లేదు. 4. గ. గొనుచు. 5. క. గ. జడిసెఁ.

క. పోవకు పోవకు మనుచు మ, హావీరుఁడు గద యమర్చి యమ్మణిమంతుఁ
లావఱఁగ వైచె నగ్గద, తో వాఁడును బడియెఁ బ్రతిహతుం డై నేలన్. 20

క. పోర మణిమంతుఁ డిట్లు స, మీరణసుతుచేతఁ [1]బ్రాప్తమృతి యై పడినన్
వారక పఱచిరి భయమున, నారాక్షసు లార్తనాదు లై తూర్పునకున్. 21

వ. అట ధర్మరాజు భీమసేనుపోయినవలను ద్రౌపదిచే నెఱింగి యార్ష్టిషేణుం డను మునివరునాశ్రమంబున ధౌమ్యద్రౌపదీప్రభృతులం బెట్టి రోమశనకులసహదేవయుతుం డై తద్గిరిశృంగం బెక్కి కుబేరసదనసమీపంబున నిజగదాఘాతపాతితమణిమదాదిరాక్షసదారుణరణమధ్యంబున నున్నమధ్యమునొద్దకుం జనియె నంత.

క. హతశేషు లైనరాక్షసు, లతిరయమునఁ బాఱి చెప్పి రప్పుడ యలకా
పతికి సవిస్తరముగ నిజ, మతిఁ బవనజువిక్రమంబు మణిమద్వధయున్. 23

వ. దాని విని కుబేరుండు విస్మితహృదయుం డై యాత్మగతంబున. 24

క. తలఁకక మును సౌగంధిక, ములు గొని యిప్పుడును దర్పమున నిందులపు
వ్వులు గొని మణిమత్ప్రభృతులఁ, బలువుర వధియించె నెట్టిబలియుఁడొ యనుచున్.

వ. సురగరుడగంధర్వయక్షరాక్షససహితుం డయి యక్షప్రభుం డరుగుదెంచి పాండవులం గని వారిలో గదాకృపాణబాణాసనధరుం డయి రణకాంక్ష నున్నమహావీరు మారుతాత్మజుం జూచి పరమప్రీతచిత్తుం డయి యున్న. 26

ఆ. అక్కుబేరునకు మహామతుల్ పాండవుల్, మ్రొక్కి రంత ధర్మమూర్తి యైన
ధర్మతనయుఁ జూచి తద్దయు దయతోడ, నిట్టు లనియెఁ గిన్నరేశ్వరుండు. 27

వ. అయ్యా నీయనుజుండు మత్ప్రియసఖుం డైనమణిమంతు వధియించి నా కపకారంబు సేసె నని లజ్జింప వలవ దది యగస్త్యశాపనిమిత్తంబున నయ్యె నని భీమసేను డాయం బిలిచి నీచేసినసాహసంబు నా కుపకారంబు గావున నిన్ను మెచ్చితి ననిన నక్కుబేరునకుం గృతాంజలి యయి ధర్మతనయుం డిట్లనియె. 28

ఆ. ఇట్టిశాప మమ్మునీంద్రుండు దా నేల, యిచ్చె దాని నాకు నెఱుఁగఁ జెప్పు
మనిన విస్తరించి యమరాజసుతునకు, నక్కుబేరుఁ డిట్టు లనుచుఁ జెప్పె. 29

వ. తొల్లి కుశవతి యనుపుణ్యనదీతీరంబున నమరు లెల్ల సత్త్రయాగంబు సేయుచుండి నన్ను రావించిన నేనును బుష్పకవిమానారూఢుండ నై శతమహాపద్మసంఖ్యలయక్షరాక్షసబలంబులతో గగనగతి నందులకుఁ బోవునెడ నూర్ధ్వబాహుం డై యమునాతీరంబున నుగ్రతపంబు సేయుచున్నయగస్త్యమహామునిమీఁద నాప్రియసఖుం డైనమణిమంతుం డెఱుంగక నిష్ఠీవనంబు సేసిన నలిగి చూచి యమ్మునివరుండు నా కిట్లనియె. 30

ఆ. నీవు సూచుచుండ నీయిష్టుఁ డిమ్మణి, మంతుఁ డిపుడు దనదుమదముపేర్మి

1. క. ప్రాప్తమృత్యుం డైనన్.

నన్ను నుఱికి యుమిసెఁ నామీఁద నిట్టి[1]యి, ద్దనుజుఁ డీల్గు నొక్కఁమనుజుచేత.

వ. మఱియు నీయక్షరాక్షసబలంబులును వానిచేతన నిహతంబు లగు నీదురితంబు దద్దర్శనంబునం బాయు ననియెం గావున [2]నిట్టిశాపంబునకు నీయనుజుండు నిష్కృతి యయ్యె నని చెప్పి వెండియు ని ట్లనియె నయ్యా ధృతియును దాక్ష్యంబును దేశంబును గాలంబును బరాక్రమంబు ననుపంచవిధంబు లైనలోకతంత్రవిధానంబు లెఱింగినసత్త్రియుండు ధర్మవిదుం డై ధరణీచక్రంబు నిర్వక్రంబుగా రక్షించి పుణ్యలోకంబు వడయుఁ దత్కార్యవిశేషంబు లెఱుంగక వృథారంభుం డై సాహసంబున వర్తిల్లువానికిం బాతకం బగుట నిశ్చయంబు. 32

క. కావున నీతమ్ము మరు, ద్దేవాత్మజు సాహసైకధృతి గాకుండన్
భూవల్లభ శిక్షింపుము, నీవిమలజ్ఞానధర్మనిష్ఠితబుద్ధిన్. 33

వ. నిన్నును నీతమ్ములను ధర్మానిలశక్రాశ్వినులు రక్షించినట్ల యే నెప్పుడు రక్షింతు నానియోగంబున మత్పరిచారకులు మీకు నిత్యంబును నన్నపానాదులు దెచ్చి యిచ్చుచుండ నార్ష్టిషేణాశ్రమంబున నెక్కపక్షంబు వసియించునది. 34

సీ. మానితయశుఁడు భీమానుజుం డర్జునుం, డమరులచేత దివ్యాస్త్రతతులు
వడసి దేవేశ్వరుకడ నున్నవాఁ డాతఁ, డుపకారి యయ్యె దేవోత్తమునకు
[3]సప్తమేధాధ్వరప్రాప్తపుణ్యుఁడు ధర్మ, మతి భవత్ప్రపితామహుఁడు ఘనుఁడు
శంతనుఁ డతనిచేఁ సంతర్పితుం డయ్యె, గుఱుకొని మీ దైనకుశల మడిగె

ఆ. నరుగుదెంచు నింతఁ గయ్యర్జునుండు మీ, కభిమతార్థసిద్ధిఁ యగుఁ బ్రసిద్ధ
మని యెఱుంగఁ జెప్పిఁ యలకాధినాథుండు, యక్షగణముతోడఁ నరిగె నంత.

వ. ఇట్లు ధర్మరాజు కుబేరాదేశంబున నార్ష్టిషేణాశ్రమంబున నుండునంత నాతనికి నొక్కనాఁడు ధౌమ్యుండు నిజాంగుళి నుత్తరదిగ్భాగంబు సూపుచు ని ట్లనియె. 36

క. అదె మందరనగ మక్కడ, యదె మేరునగేంద్ర మమ్మహాశైలమునె
న్నిదిదిక్కుల వసియింతురు, త్రిదశేంద్రుం దొట్టి యష్టదిక్పాలవరుల్. 37

చ. కనకగిరిం బ్రదక్షిణముగా శశిభాస్కరతారకాగణం
బనవరతంబుఁ ద్రిమ్మరు మహామునిసప్తకమండలంబుతో
ననఘ తదీయతుంగశిఖరాగ్రమునందుఁ బయోరుహాసన
త్రినయనవిష్ణు లుండుదురుఁ దేవగణంబులు గొల్చుచుండఁగన్. 38

వ. అని చెప్పుచుండఁ బాండవు లం దొక్కమాసంబు నివాసంబు సేసి రంత. 39

ఉ. అంబర మాత్మదీప్తినివహంబున నొప్పఁగ మాతలిప్రయు
క్తం బగుదివ్యకాంచనరథంబుఁ జలచ్చపలాంశుపుంజర

---

1. జ. దు, ర్మదుఁడు నీల్గు. 2. క. నిట్టిశాపఫలంబునకు నీయనుజుండు నిమిత్తం బయ్యె. 3. ఆ. సప్తాశ్వమేధసంప్రాప్తపుణ్యుఁడు.

మ్యం బగుదాని నెక్కి ధృతిమందరుఁ డింద్రసుతుండు నాకలో
కంబుననుండి వచ్చెఁ బ్రవికాసితతేజుఁ డినప్రకాశుఁ డై. 40

వ. ఇట్లు చనుదెంచి ధనంజయుండు రోమశధౌమ్యధర్మజభీమసేనులపాదంబులకుం బరమభక్తి మ్రొక్కి తనకు వినయవినమితోత్తమాంగు లయినకవల నెత్తికొని ద్రౌపదీహృదయనయనారవిందంబుల కానందంబు సేయుచున్నంత నందఱు సంతోసిల్లి మాతలి నతిప్రీతిఁ బూజించిన నతండును దదీయరథంబు గొని దివంబున కరిగె నట్టియవసరంబున. 41

క. దిననాథుఁ డస్తగిరిఁ బొం, దినఁ జీకటిఁ బాచి యాత్మతేజమున దిగం
గనల విభూషించుచు రజ, నినాథకలహంస గగననిమ్నగ నొప్పెన్. 42

వ. ఆరాత్రి యర్జునుం డనుజుల నందఱ నొద్దఁ బెట్టుకొని యిష్టపూర్వకథలు సెప్పుచు శయనించె నంతఁ బ్రభాతంబ సిద్ధమునిగణంబులయు రోమశధౌమ్యులయుఁ దమ్ములయుఁ దోడ ధర్మతనయుండు సుఖోపవిష్టుం డై యున్నంత. 43

ఇంద్రుండు పాండవులయొద్దకు వచ్చుట.

సీ. బోరన సురదుందుభులనినాదంబులు, గిన్నరగంధర్వగీతరవము
లెసఁగ సహస్రసూర్యేందుమండలములు, వోలె విమానముల్ పొలిచి వెలుఁగఁ
బాండవాలోకనపరుఁ డై సహస్రాక్షుఁ, డమరగణంబుతో నమ్మహాద్రి
కేతెంచెఁ బ్రీతి నయ్యింద్రున కందఱు, నంత నభ్యుద్గతు లైరి పాండ
ఆ. వాగ్రజుండు దాను ననుజులు నింద్రుపా, దాంబుజముల కెఱఁగి యధికభక్తి
[1]శాస్త్రదృష్టి నధికసత్కారవిధులఁ బూ, జించె నమరఖచరసిద్ధపూజ్యు. 44

వ. ఇంద్రుండును వారల నందఱ హితమధురవచనంబుల నభినందించుచుఁ దదంతికస్థితు నధికతపోయుక్తు ధనంజయుం జూపి ధర్మజున కిట్లనియె. 45

క. ఘనుఁ డీపార్థుఁడు నావల, నను దివ్యాస్త్రప్రయోగనయనిపుణుం డై
దనుజుల నివాతకవచుల, ననిఁ జంపి సురాలికిం బ్రియం బొనరించెన్. 46

క. ఈతఁడు పరాక్రమమున న, రాతుల వధియించి యిద్ధరారాజ్యము వి
ఖ్యాతముగ నిచ్చు నీకు మ, హాతేజుఁ డజయ్యవీర్యుఁ డని నెవ్వరికిన్. 47

క. అని చెప్పి యనిమిషప్రభుఁ, డనిమిషనివహంబుతోడ నమరావతికిం
జనియె నిజాలోకనమున, కనఘులు పాండవులు హర్ష మందుచు నుండన్. 48

మధ్యాక్కర. ఘనముగ నమరేంద్రపాండుసుతసమాగమ మొక్కయేడు
దనరంగ బ్రహ్మచర్యవ్రతస్థు లై తగిలి నిత్యంబు
వినినపుణ్యాత్ములును జదివినవారు వినుము నూఱేండ్లు
నొనర జీవింతు రత్యంతసత్కాంతియుక్తు లై ధరణి. 49

వ. ఇట్లు సురేంద్రుం డరిగిన ధర్మతనయుం డర్జునుం జూచి పరమానందనిర్భరహృ

1. క. శాస్త్రవిధివిశిష్టసత్కార.

దయుం డై యి ట్లనియె. 50

సీ. హరుఁ డాదిగాఁ గల్గునమరగణంబుచేఁ, బడసి దివ్యాస్త్రముల్ । పరమ మైన
యుపకార మమరుల । కొనరించె నీపార్థుఁ, డని నాకుఁ జెప్పె వృత్తాంతకుండు
దివ్యాస్త్రలాభమ్ము । దేవేంద్రునకుఁ బ్రీతి, గా వేల్పులకు నుపకారి వైన
విధము మాకు వినంగ । వేడు కైనది చెప్పు, మని తన్ను నడిగిన । నగ్రజునకు
ఆ. నగ్రజన్మపూజ్యు । లగుధౌమ్యరోమశ, ప్రభృతివరులయొద్దఁ । బాండవేయుఁ
డసదృశప్రభావుఁ । డతివీరుఁ డర్జునుఁ, డాత్మచరిత మిట్టు । లనుచుఁ జెప్పె. 51

వ. ఏను భవదధిష్ఠితవిద్యాప్రభావంబున తపోనియుక్తుండ నై హిమవంతంబునకుం జని యందు నాముందట వృద్ధబ్రాహ్మణుం డై యున్నవృద్ధశ్రవుం గని తదుపదేశంబున నీశ్వరుగుఱించి యుగ్రతపంబు సేసిన నీశ్వరుండు కిరాతరూపధరుం డై నాతోడ నతిఘోరయుద్ధంబు సేసి నాకుఁ బ్రసన్నుం డై నిజరూపంబుఁ జూపి పాశుపతాస్త్రంబుఁ బ్రసాదించె ననంతరంబ యింద్రాదిదేవతలవలన నైంద్రాగ్నేయ యామ్య రాక్షస వరుణ వాయవ్య కుబేర గాంధర్వ పైశాచ బ్రాహ్మ్యంబు లనం బరఁగుదివ్యాస్త్రంబులు వడసి మహేంద్రానుగ్రహంబున మాతలిప్రయుక్తం బైన దివ్యరథం బెక్కి యీశరీరంబుతోడన యమరావతి కరిగి యం దమరేంద్రు నాచార్యుఁగా వరించి తత్ప్రసాదంబున దివ్యాస్త్రంబులప్రయోగంబును నుపసంహారంబును నావృత్తియుఁ బ్రాయశ్చిత్తంబును బ్రతిఘాతంబులును నేర్చిన నాకు సంతోసిల్లి సురేంద్రుం డి ట్లనియె. 52

క. నీ వఖిలశస్త్రనిపుణుఁడవు, గావున ని న్నాజి నోర్వఁ । గా నోప రొరుల్
దేవతలకు బ్రాహ్మణులకుఁ, గావింపు హితంబు దీనఁ । గడు సిద్ధి యగున్. 53

క. నాకు గురుదక్షిణార్థము, నాకహితార్థంబుగా జనస్తుతబుద్ధిం
జేకొని నాపనిచినపనిఁ, బ్రాకటముగఁ జేయు మహితోభంజనశక్తిన్. 54

తే. జలధికుక్షిలోనుండి ధీరులు నివాత,కవచు లన మూఁడుకోట్లదానవులు బలిమిఁ
త్రిదశులకు బాధ సేయు చుండుదురు వారు, నిహతు లగుదురు నీచేత మహితకీర్తి.

వ. అని తనతొడిగినయిద్దివ్యభూషణంబుల నిమ్మకిరీటంబున నన్ను విభూషితుం జేసి స్పర్శరూపం బైనయీయభేద్యకవచంబు నిచ్చి యజరం బయినయిగ్గొనయంబు గాండీవంబునం దాన [illegible] పదివేల హంసమయూరవర్ణమానసీయహయంబులం బూనినరథంబు మాతలిప్రయుక్తం బైనదాని నెక్కం బనిచి నివాతకవచవధార్థం బరుగు మని నియోగించిన నింద్రు వీడ్కొని చను చున్న నాతో దేవత లి ట్లనిరి.

ఉ. ఈరథ మెక్కి తొల్లి యమరేంద్రుఁ డనేకసహస్రసంఖ్య దే
వారుల వృత్రశంబరబలాదుల నుద్ధతులన్ జయించె నీ
రారివిభేది నీవును బలాఢ్యుఁడ వై వధియింపు ముగ్రమా
యారతులన్ నివాతకవచాసురులన్ సమరాంతరంబునన్. 57

వ. అని నాకు దేవదత్తం బను శంఖం బిచ్చిన నేనును మాతలిసహితంబుగా రథం బెక్కి యతిత్వరితగతి నరిగి. 58

అర్జునుఁడు నివాతకవచు లనురాక్షసుల జయించినకథ.

క. ఫేనపదూర్మిచయంబుల, నానావిధమీనకూర్మనక్రంబుల శై
లానుకృతి నొప్పుచున్న మ, హానీరధిఁ గంటి నేను నమ్మాతలియున్. 59

వ. ఆసముద్రోదరంబున విశాలాట్టాలకప్రతోళికాలంకృతం బయినపురంబుఁ గని తద్ద్వారంబున శంఖధ్వానంబు సేసిన నది సకలదిఙ్మహీధరగుహాకుహరాంతరంబులం బ్రతిశబ్దజననం బయిన దాని విని యలిగి యద్దానవులు నానావిధాయుధసన్నద్ధు లయి నిజకాయనికాయకాళిమతమోభూతభువను లగుచు వచ్చి నా రథంబుఁ బరివేష్టించి. 60

క. ఉరుశస్త్రవృష్టి నాపైఁ, గురిసినఁ దత్క్షణమ యొక్కొక్కనిపయి నేనున్
వరుసఁ బది సేసి బాణము, లరుదుగ నేసితి మహాభయంకరభంగిన్. 61

క. దనుజులు మదీయరథమా, ర్గనిరోధముగాఁ బ్రచండకాండప్రకరం
బునఁ గప్పిరి రోదోంతర, మనిమిషులును ఋషులుఁ జూచి యద్భుత మందన్. 62

క. కడుభయమున మాతలి చే, డ్పడి రథచోదనమునం దపాటవుఁ డైనన్
వడి నేన రథము గడపుచుఁ, దడయన యేసితిఁ గడంగి దానవులపయిన్. 63

వ. మాతలి నన్నుం జూచి సంతోసిల్లె నంత. 64

చ. అతులరణాంతరంబున నిరంతరమత్పటుబాణదారితో
చ్ఛ్రితదనుజాంగనిర్గళదసృగ్జలధారలు సూడ నొప్పె నా
తతగిరిశృంగసంగదళితప్రచలజ్జలవాహజాలసం
తతగళదంబుధారలవిధంబున నంబర మెల్లఁ గప్పుచున్. 65

వ. అంత నయ్యసురులు మాయాయుద్ధంబు సేయ సమకట్టి నామీఁద వర్షాస్త్రంబు లేసిన. 66

క. బలరిపుఁడు నాకు నిచ్చిన, యలఘునిశాతముఖశోషణాస్త్రంబు విని
ర్గళదవిరళజలధారా, వలి నెల్లం దత్క్షణంబు వట్టఁగఁ జేసెన్. 67

సీ. అద్దానవులు దారుణాశ్మవర్షంబు పైఁ, గురిసిన నవి నన్నుఁ దెరలఁ గప్పె
నేనును గులిశాస్త్ర మేసి పాషాణముల్, నుఱుము గావించితి నుఱుక వెండి
యసురులు నామీఁద ననలాస్త్ర మలుకమై, నేసిన గాడ్పుతో మోసి యగ్ని
కణములు నాపైని గవిసిన నేనును, సలిలాస్త్రమున దానిబల మడంచి
ఆ. యున్నఁ దిమిరబాణ ముగ్రంబుగా వార, లేసి రంత దిక్కు లెల్లఁ గప్పె
నంధకారమగ్నుఁ డై స్ఖలియించి మా, తలి ప్రతోద మెడలి ధరణిఁ బడియె.

క. తురగములు పఱవ నేరక, వరూథవహనంబునందు వంధ్యము లయ్యెన్
సురసారథి ననుఁ గానక, హరినందన యెందుఁ బోయి తని కడు భీతిన్. 69

క. అమృతనిమిత్తంబున ము, న్నమరాసురయుద్ధ మయ్యె నది యింత భయ
భీమజనకము గా దిది యు, గ్రము దనుజు లవార్యవీర్యగర్వితు లగుటన్. 70
తే. బ్రహ్మచేత [1]నిర్మింపఁగఁ బడినభువన, సంప్లవం బిది నావుడు సంగరమున
సంచలింపక నాభుజశక్తిఁ జూచు, చుండు మని యప్డు మాతలి [2]నూఱడించి.
ఉ. వాసరనాయకుం దలఁచి వజ్రివరంబున సూర్యబాణ మే
నేసిన నింద్రుఁ దొట్టి సుర లెంతయు సంతస మందఁగా జగ
త్త్రాసితమిస్రరాశి నిహతంబుగ దిక్కులు తెల్లగా మహా
గ్రాసురు లాహవంబున భయంపడ మాతలి మెచ్చి యార్వఁగాన్. 72
క. గాండీవముక్తదారుణ, కాండవిఖండీకృతాపఘను లై దనుజుల్
భండనమున [3]బడలుపడం, గొండలు పడినట్లు పడిరి కుతలం బద్రువన్. 73
వ. ఇట్లు నివాతకవచులు మదీయదివ్యాస్త్రనిహతు లై మహీతలంబుపయిం బడిన నట
యసురకాంతలయాక్రందనధ్వను లాకసం బద్రువ నెక్కొనఁ బురంబున నెగసె
నంత నద్దానవపురంబుఁ బురందరుపురంబుకంటె సుందరం బైనదానిం జూచి
మాతలికి నిట్లంటి. 74
క. నిరుపమరత్ననిరంతర, వరగృహముల నొప్పి సుఖనివాసం బగుని
ప్పురి నుండ నొల్ల కొండొక, పురి నుండఁగ నేల వలసెఁ బురుహూతునకున్. 75
వ. అనిన నాకు మాతలి యిట్లనియె. 76
సీ. అసురులవలన భయం బైనయపుడు వే, ల్పులకు సేమంబుగా బలవిరోధి
యీప్రోలు జలధిలో నిమ్ముగ నిర్మించె, దనుజులు పదపడి వనజగర్భు
వలనఁ దపోవీర్యవంతు లై యిం దుండ, నమరులచేతఁ గయ్యమున నజితు
లై యుండఁ బడసిన నమరేంద్రుఁ డెఱిఁగి త, ద్విజయార్థముగఁ బంచె విజయ నిన్ను
ఆ. నమరులకు నసాధ్యు లసురవీరులు వీరి, నీవ యోర్చి తనుచు నెమ్మితోడ
నన్ను సంస్తుతించి నరనాథ మాతలి, గడఁగి యపుడు రథముఁ గ్రమ్మఱించె. 77
వ. ఇట్లు నివాతకవచులం జంపి క్రమ్మఱి వచ్చువాఁడ నాముందట నొక్కతపోవనం
బును నతివిచిత్రం బైనపురంబునుం గని యిది యెవ్వరిపురం బని యడిగిన నాకు
మాతలి యిట్లనియె. 78
క. వినవె పులోమయుఁ గాలక, యును ననఁగా నిరువు రసురయువతులు కమలా
సను నారాధించిరి తప, మున దివ్యసహస్రవర్షములు గడునిష్ఠన్. 79
క. కనకమయ మైనయీప్రో, లును దమసుతు లాహవంబులో నమరులచే
త నవధ్యులుఁ గాఁ దగ న, వ్వనజజుచేఁ బడసి రసురవనితలు గరుణన్. 80
వ. ఇది హిరణ్యపురం బిందుఁ బౌలోమకాలకేయు లనునసురు (లఱువదివే) లుండుదురు

1. క. గ. జ. నిర్మింపఁగఁబడని; 'నిర్మింపఁగఁబడిన' అని మూలము. 2. క. గ. నుండఁ బంచి.
3. అ. వడిజేవుఱుఁగొండలు.

వా రమరులచేత నవధ్యు లనిన నట్లేని వారిపయిం బోదము రథంబు వఱపు మని యేను మాతలిం బంచిన. 81

చ. అతఁడును సప్తమారుతరయంబున దివ్యరథంబుఁ దత్సురా
హితపురిభూరివప్రముపయిం బఱపెఁ సురవైరు లంత ను
ద్ధతు లయి ప్రోలు వెల్వడి రథంబుల షష్టిసహస్రకంబుతో
శతమఖబుద్ధిఁ జేసి కడు౯ సైఁపక తాఁకిరి నన్ను నల్కతోన్. 82

వ. ఏనును వారలయఱువదివేలరథంబులకు గతినిరోధంబుగా వితతవృక్షశిలాప్రభవంబు లయినదివ్యబాణంబు లేసిన నసురులు మాయాయుద్ధనిబద్ధబుద్ధు లై తమపురంబుతోడన దివంబున కెగసి మదీయమార్గణార్గళనిరుద్ధమార్గు లై నేలం బడిన వీరల నెందువిధంబున నోర్వఁగా దని. 83

ఉ. ఉరగఫణాగ్రరత్నకిరణోల్లసదుగ్రభుజంగ వృషాంకు శం
కరు శశిఖండమండితశిఖండు శివుఁ హృదయాంబుజంబునం
దిరముగ నిల్పి పాశుపతదివ్యశరం బరిఁబోసి యేసితిఁ
సురరిపుకోటిమీఁద సురసూతుఁడు మాతలి మెచ్చి యార్వఁగన్. 84

వ. ఆదివ్యాస్త్రప్రభావంబున సింహశరభశార్దూలశుండాలమహిషమహోక్షయక్షరాక్షసపిశాచపన్నగగంధర్వరూపంబు లుద్భవిల్లి యసురుల నెల్ల విగతాసులం జేసిన.

క. వంచనయును మాయయు మా, యించి పరాక్రాంతి నయ్యుమేశాస్త్రమునం
గ్రంచఱ నంతకుపురి కేఁ, గించితిఁ బౌలోమకాలకేయాసురులన్. 86

వ. ఇట్లు హిరణ్యపురనివాసులం గృతాంతపురనివాసులం జేసి వచ్చి వాసవునకు మ్రొక్కిన వాసవుండును నివాతకవచ పౌలోమ కాలకేయులవధప్రపంచంబు మాతలివలన విని సంతోసిల్లి నా కి ట్లనియె. 87

చ. సురలకుఁ బ్రీతి సేసితి వసుంధర కేఁగుము నిన్ను నీసహో
దరులు నిరంతరంబును ముదంబునఁ జూడఁగఁ గోరుచున్నవా
రరిమదభేది నీకు విషమాజిముఖంబున మార్కొనంగ నో
పరు నరు లెవ్వరుఁ హరి కిభంబులు మార్కొనునయ్య యెయ్యెడన్. 88

క. ద్రోణద్రోణజకృపగీ, ర్వాణనదీజాంగపతు లవశ్యమును భవ
ద్బాణతతిఁ జేసి సమర, క్షోణిం బరిక్షీణబలు లగుదు రపజితు లై. 89

క. అనిన నమరేంద్రు వీడ్కొని, చనుదెంచితి నని కిరీటి౯ శతమఖులోకం
బునఁ దనచేసినవిధ మ, త్యనఘుం డేర్పడఁగఁ జెప్పె౯ నందఱు వినఁగన్. 90

వ. ధర్మరాజును దమ్ముఁడు సేసినమహాసంరంభంబునకుఁ జతురంభోధిపర్యంతమహీరాజ్యం బప్పుడ తనకు సంప్రాప్తం బైనంతియ సంతోసిల్లి. 91

ఆ. దివ్యబాణములు తదీయప్రయోగముల్, మాకుఁ జూపు మనిన౯ మఘవసుతుఁడు
వేఱువేఱ చూపె౯ వేలుపు లిచ్చిన, యస్త్రశస్త్రములు నిజాగ్రజునకు. 92

వ. మఱియును. 93

చ. సురవిశిఖప్రయోగములు సూపఁ దొడంగిన నేల దిర్దిరం
దిరిగెఁ బయోనిధుల్ గలఁగె దిగ్గజముల్ మద మేది కుందె భా
స్కరరుచి మాసెఁ బావకశిఖాతతి[1]తోన యడంగె గాడ్పు లం
బరమున నిల్చి రీశ్వరుఁడు బ్రహ్మయు నాదిగ వేల్పు లందఱున్. 94

వ. అంత సురగణచోదితుం డైననారదుం డర్జునుపాలికి వచ్చి యి ట్లనియె. 95

తే. ఎదురు లేక దివ్యాస్త్రంబు లిట్లు నీకుఁ, బాడియే ప్రయోగింపఁగఁ బాండుపుత్త్ర
సిద్ధ మివి యధిష్ఠానవర్జితములయ్యె, నేని మూఁడులోకములు దహించు మాత్ర.

వ. అని యర్జును వారించి నారదుం డరిగిన నమరు లెల్ల నిజస్థానంబుల కరిగి రిట్లు పాండవులు పదిమాసంబు లుండునంత నొక్కనాఁ డమరకన్యకలు వచ్చి యర్జునున కి ట్లనిరి. 97

తే. వనములందును బం డ్రెండు వత్సరమ్ము, లలయ[2]కజ్ఞాతవాస మేకాబ్దకంబు
పూని నిర్విఘ్నవృత్తిఁ జేల్పుదురు మీరు, [3]పగఱ నిర్జింతు రాహవాభ్యంతరమున.

తే. నీపరాక్రమబలమున నిఖిలధరణి, రాజ్యభారంబు నీధర్మరాజు దాల్చు
రఘుకులాధీశ్వరుం డైనరామకీర్తి, యట్ల నీకీర్తి త్రిజగంబులందుఁ బర్వు. 99

వ. అని యాదేశించి దేవకన్యకలు వోయిన నిట దేవర్షి యైనరోమశుండు ధర్మరాజునకు ధర్మానుశాసనంబు సేసి దివంబున కరిగె నంతఁ బాండవు లెప్పటియట్ల ఘటోత్కచసేనాసీతు లై క్రమ్మఱ వృషపర్వనివాసంబు సూచుచు బదరీవనంబున నొక్కరాత్రి వసియించి సుబాహుపురంబునకు వచ్చి యందుఁ దమపరిచారకు లైనయింద్రసేనప్రముఖులం గూడికొని నిజరథారూఢు లై ఘటోత్కచుం బోవం బనిచి హిమవత్పర్వతంబునందు దేవర్షిబ్రహ్మర్షియజ్ఞప్రదేశంబుల ననేకవిధయూపంబులు సూచుచు నొక్కవర్షం బుండి రంత నొక్కనాఁడు. 100

అజగరోపాఖ్యానము.

క. మృగయార్థ మరిగి హిమవన్నగభూములయందుఁ బవననందనుఁ డొకప
న్నగుచేతఁ బట్టువడి యి, మ్ముగ ధర్మతనూజుచేత మోక్షితుఁ డయ్యెన్. 101

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 102

మధ్యాక్కర. పదివేలగజములబలము గలవాఁడు పౌలస్త్యుతోడఁ
గదనంబుఁ జేసి యనేకయక్షరాక్షసుల నిర్జించి
యుదితశౌర్యోన్నతుం డైనవాఁడు వృకోదరుఁ డేల
పదపడి నిగృహీతుఁ డయ్యెఁ దా నొక్కపన్నగుచేత. 103

వ. అనిన విని వైశంపాయనుం డి ట్లని చెప్పె నట్లు భీముం డొక్కండ హిమవదుత్తుం

1. క. లోన నడంగె. 2. గ. కజ్ఞాతచర్యయుం ♦ దబ్దమొకటి. 3. క. పగతసంబున పిప్పపా♦భ్యంతరమున.

గశృంగోపాంతకాంతారంబుల మృగయాభ్రాంతిఁ బరిభ్రమించుచు నతిశ్రాంతుం
డయి తత్ప్రదేశంబున. 104

మ. [1]అశనాయావివృతాస్యగహ్వరుఁ గృతాంతాకారు నిశ్వాసధూ
మశిఖాధూసరితా[2]గ్రదగ్ధతరుగుల్మవ్రాతు హారిద్రవ
ర్ణశరీరున్ భృశరూక్షదర్శను మహానాగప్రభుం గాంచె న
ర్ధశశాంకద్యుతిహారిదారుణచతుర్దంష్ట్రున్ జగత్త్రాసకున్. 105

వ. అమ్మహాజగరం బామిషార్థి యై భీముం బట్టికొని వానిభుజయుగళంబుఁ దనముఖం
బున నంగంబులు నిజాంగంబున బంధించిన నాగాయుతబలుం డయ్యును దదంగ
సంగంబున దుర్బలుం డై మెలంగ నేరక భీముం డప్పాముబలవీర్యంబులకు విస్మిం
తుం డయి యిది ప్రకృతిసర్పంబు గా దెద్దేనియు నొక్కయద్భుతరూపం బని
విచారించుచు దాని కి ట్లనియె. 106

మత్తకోకిలము. ఏను భీముఁడఁ బాండవేయుఁడ నిద్ధతేజుఁడ ధర్మరా
జానుజుండఁ బిశాచపన్నగయక్షరాక్షసవీరులం
బూని పోరుల నోర్వ నోపెడుభూరిసత్త్వుఁడ నాగపం
చాననాదులఁ బట్టి [3]త్రుంచుననంతబాహుబలాఢ్యుఁడన్. 107

ఆ. ఇట్టి నన్నుఁ బట్టి యిప్పాట బంధించు, నట్టిశక్తి యెట్టు లయ్యె నీకు
నిది నిసర్గశక్తియే వరదానసం, సిద్ధి నైనయదియొ చెప్పు మనిన. 108

వ. అదియును దివ్యజ్ఞాని యయ్యును దనపూర్వస్మృతి సెడకుండ వరంబుఁ గాంచుటం జేసి
వాని కి ట్లనియె. 109

క. ఇది నావరలాభంబున, నుదయించినశక్తి యెట్టియున్నతబలసం
పదు లయినజీవులును నా, కెదురుచు బలహీను లగుదు రివ్విపినమునన్. 110

ఆ. ఎదురఁ బడినవాని వదలక శార్దూల, శరభసామజాదిసత్త్వతతులఁ
బట్టి తినుచు నున్నయట్టినా కిప్పుడు, భక్ష్య మైతి వీవు పాండుపుత్త్ర. 111

ఆ. శక్రపదవిఁ బొంది సద్బ్రాహ్మణుల కవ, మాన మేను జేసి మదముపేరి
ననఘ యిట్లు లైతి నం దొక్కమునివరు, శాపశక్తిఁ దొంటిశక్తి దఱిఁగె. 112

వ. అని దుఃఖించినభుజంగమంబునకు భీముం డి ట్లనియె. 113

క. కడుకొని కడుదుఃఖము లై, నెడ నుచితమె యాత్మనింద యెయ్యెడల మనం
బడలక యేకాకృతి నె, ప్పుడు నుండుట సూవె పురుషుపురుషార్థ మిలన్. 114

ధర్మరాజు భీమసేనుని వెదకఁ బోవుట.

వ. కావునఁ బురుషకారంబునం జేసి దైవంబు నివర్తింప నెవ్వ రోపుదు రేను మహా
బలుండ నయ్యును భవద్గృహీతుండ నై యిట్టియవస్థం బొందితి నాత్మత్యాగంబు
నకు వగవ నపగతరాజ్యానుభోగు లై మద్భ్రాతృవరులు దుర్గమం బైనయిప్పర్వ

1. క. అశనాశావివృతా. 2. క. తాగ్రభాగ. 3. గ. త్రుచ్చు; అ. త్రచ్చు.

తంబునం గ్రుమ్మరుచున్నవారు నన్నుం గానక యెంత దుఃఖింతురో యని వగచెద నను చున్నంత నిట ధర్మతనయుండు దీప్తం బైనశివారుతంబు విని యతిశంకిత చిత్తుం డయి యనంతరంబ తనదక్షిణభుజాస్పందనం బుపలక్షించి మీఁద లగ్గగు నంచు ననుజమధ్యంబున ననిలజుం గానక యర్జునుం గవలను గృష్ణారక్షణార్థంబు గా నియోగించి ధౌమ్యపురోగమభూసురవరులతో భీము రోయుచుం దదీయపాద తలలలితహలకులిశకలశాదిలక్షణలక్షితం బైనపాంసుపథంబునం జని ముందట.

క. గిరిశిఖరాభోగబృహ, [1]త్ఖరభుజగశరీరవేష్టితశరీరుం డై
భరమునఁ గదలఁగ నేరక, పరమశ్రమ మడర నున్నపవనతనూజున్. 116

క. కని యాత్మగతంబున ని, య్యనిలజుఁ డొకపాముచేత [2]నదె వేష్టితుఁ డై
తనచేష్ట దఱఁగి ప్రాకృత, జనుక్రియ ని ట్లున్నవాఁ[3]డు సామాన్యమునన్. 117

వ. ఇది యేమి యాశ్చర్యం బొక్కొ యనుచు ననిలజుం జూచి దుఃఖితుం డై ధర్మజుం డయ్యజగరంబున కి ట్లనియె నయ్యా నీవు సర్పరూపంబుఁ దాల్చినదైత్యుండవో దేవతవో యేను యుధిష్ఠిరుండ ని న్నడిగెద నిమ్మహాభుజు నాయనుజు నామిషార్థి వై పట్టితేని నీకు బుభుక్షానివృత్తి యగున ట్లుగాఁ జాలినంతమృగమాంసంబుఁ బెట్టెద వీని విడువు మనిన ధర్మజునకు నయ్యజగరం బి ట్లనియె. 118

సీ. వినవయ్య నహుషుఁ డన్ జనపతి నేను మీ, పూర్వజులకు నట పూర్వజుండ
[4]ననఘ సుత్రామున కైన యగువాఁడ నై, శ్వర్యగర్వంబున నార్యవృత్తి
విడిచి వివేకంబు సెడి సహస్రోత్తమ, బ్రాహ్మణకృత మైనబ్రహ్మరథము
నెక్కి బ్రాహ్మణులకు నక్కజం బగునవ, మానంబు సేసిన దాన నాకుఁ

ఆ. గలశభవుఁ డగస్త్యుఁ డలిగి యత్యుగ్రాహి, వగు మనియును శాప మొగిన యిచ్చె
మునివరేణ్యు శాపమునఁ జేసి యిప్పాట, నవయుచున్నవాఁడ నాఁటఁగోలె. 119

వ. విధివిలసితంబు పేర్మి నీ కే మని చెప్పుదు. 120

చ. చదివితి నెల్ల వేదములు [5]సత్క్రియఁ జేసితి నూఱుయజ్ఞముల్
విదితముగా సురేంద్రపదవిస్థితిఁ బొందితి దుర్మదంబునం
దుదిఁ బెనుఁబాము నై యధికదుఃఖితుఁ డైతి సుఖంబు దుఃఖముం
వదలక చేయుచోట బలవద్విధి కేమి భరంబు సెప్పుమా. 121

వ. అయ్యగస్త్యుచేత నిట్లు శాపగ్రస్తుండ నై శక్రాసనంబువలనం బాసి యిట వచ్చుచు నుండి మునీంద్రా నాకుఁ బూర్వస్మృతి సెడకుండను బలవంతంబు లైనసత్త్వంబులు నన్ను ముట్టుచు బలహీనంబులుగాను శాపవిమోక్షంబున కుపాయంబును బ్రసాదింపు మని కృతాంజలి నై యున్న నాకుం గరుణించి మునివరుండు నా వేఁడిన వరంబు లిచ్చి యి ట్లనియె. 122

---

1. గ. త్తరభుజగ. 2. అ. నవిచేష్టితుఁడై. 3. గ. డసామర్థ్యమునన్. 4. చ. జనసుత సోమునకైన. 5. చ. సన్మతిఁ.

క. క్రమమున నీచేసినప్ర, శ్నములకుఁ బ్రత్యుత్తరంబు సన్మతి నత్యు
త్తముఁ డెవ్వఁ డిచ్చు నతనిక, తమునను శాపాంత మగు బుధస్తుత నీకున్. 123

వ. అది దీర్ఘకాలంబునకుం గాని కా దనియె నేనును దద్వచనం బిచ్చ నమ్మి పెద్దకాలం బియ్యడవి నున్నవాఁడ నేఁడు నీతమ్ముఁడు దుష్టకాలప్రాప్తుం డై నాకు భక్ష్యం బయ్యె నోపుదేని నాప్రశ్నములకుఁ బ్రత్యుత్తరం బిచ్చి వీని విడిపించుకొ మ్మనిన ధర్మజుం డి ట్లనియె. 124

క. నీయడిగినయర్థాభి, ప్రాయములకు నుత్తరంబు పరువడిఁ జెప్పన్
ధీయుత బ్రాహ్మణులకుఁ గా, కాయతమతు లయ్యు నోరుల కవి విషయములే.

ధర్మరాజు నహుషప్రశ్నంబులకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట.

వ. అయినను నానేర్చువిధంబునం జెప్పెద నడుగు మనిన నజగరం బి ట్లనియె. 126

ఆ. ఘనుఁడ యేగుణములు గలవాఁడు బ్రాహ్మణుం, డతని నెఱుఁగఁదగినయట్టివస్తు
వెద్ది దీని నాకు నెఱిఁగింపు మనిన ని, ట్లనియుఁ జెప్పెఁ బాండవాగ్రజుండు. 127

సీ. సత్యక్షమాదమశౌచదయాతపో, దానశీలంబు లెందేనిఁ గాన
నగు నట్టివాఁడు బ్రాహ్మణుఁ డగు సుఖము దుఃఖంబు నైనెడ విమోహమునుబొంద
కునికియ వానికి నుత్తమం బగు వేద్య, మనిన నీచెప్పినయగ్గుణములు
క్రియ శూద్రునందుఁ గల్గిన నతం డుత్తమ, ద్విజుఁడు గా నేర్చునే నిజము విడిచి

ఆ. యట్టు లయిన బ్రాహ్మణాదివర్ణవిభాగ, మెట్లు గలుగు నయ్య హీను లధికు
లనువివేక మది యపార్థకం బగుఁ గాదె, యనిన ననియె నంతకాత్మజుండు. 128

వ. ప్రమాదంబున వర్ణసంకరం బయినప్పుడు వర్ణపరీక్షార్థంబుగా బ్రాహ్మణాదులకు వృత్తంబు వేఱువేఱ స్వాయంభువుం డైనమనువు సెప్పె సత్యాదిగుణంబులు శూద్రునందు గలిగె నేని వాఁడు సచ్ఛూద్రుం డగుఁ గాక బ్రాహ్మణుండు గా నేర్చునే యవియు బ్రాహ్మణునందు లేనివాఁడు శూద్రుండ యనంబడుం గావున వృత్తంబుల యుత్తమంబులు. 129

తే. విత్తహీనుండు వెండియు వివిధవిధుల, విత్తవంతుండు గా నేర్చు వృత్తహీనుఁ
డైనవాఁడు విహీనుండ యండ్రు గాన, విత్తరక్షకుఁ గడు మేలు వృత్తరక్ష. 130

వ. అనిన నజగరం బి ట్లనియె. 131

తే. అప్రియం బొగిఁ జేసియు ననృతవాది, యయ్యు హింస గావింపనియమ్మహాత్ముఁ
డేఁగు సుగతికి నం డ్రదియె ట్లహింస, యనఘ యింతవిశేష మెట్లయ్యెఁ జెపుమ.

వ. అనిన ధర్మతనయుం డి ట్లనియె దానంబును బ్రియంబుచేఁతయును సత్యంబును నహింసయు నను నివి నాలుగును సమానంబుల. యయినను నహింసయ విశేషం బె ట్లనిన దేవమనుష్యతిర్యగ్యోను లనియెడుమూఁడుగతులయందును మనుష్యుండు దానాదిగుణంబులు గలిగి యహింసాపరుం డయినవాఁడు దేవగతి

వడయు విపరీతుం డై తిర్యగ్యోనులఁ బొందు నని యిట్లు తనచేసిన ప్రశ్నం బులకుఁ బ్రత్యుత్తరంబులు పలికినధర్మనందనున కతిప్రీతుం డై భీమసేనుని విడిచి శాపవిముక్తుం డై దివ్యరూపంబు సేకొని యున్ననహుషుం జూచి ధర్మతనయుండు సంతోసిల్లి యతనివలన నధ్యాత్మరహస్యంబు నిమ్ముగా నెఱింగి యుధిష్ఠిరుండు వృకోదరుం దోడ్కొని నిజాశ్రమంబునకు వచ్చి యున్నంత. 133

క. ఖరకిరణతాపమున నురు, తరదవదాహమున శోషితము లైనవనాం
తరతరుతతి కాప్యాయన, కర మై వర్షాగమంబు గడు బెడఁ గయ్యెన్. 134

క. నాలుగువలఁకుల నవఘన, జాలంబులు [1]వ్రాలి కురిసె ఝుంఝూనిలవే
గాలోలము లై బహుల, స్థూలపయోధార లోలిఁ దుములంబులుగాన్. 135

క. ఘనతరనైశతమం బొక్కొ, యనఁగ ఘనాఘనతమిస్ర మవిరళ మై క
ప్పిన జనులకు వస్తువిభా, వన మొక్కొకమాటు గలిగె వైద్యుతరుచులన్. 136

చ. అరు దగుతత్పయోదసమయంబున నొక్కట విస్తరిల్లె నం
బరమున నంబుదధ్వనియుఁ బల్వలభూముల భూరిదర్దురో
త్కరరవముల్ మహీరుహాశిఖండములందు శిఖండితాండవాం
తరమదమంజులస్వన [2]ముదారత రమ్యము లై వనంబునన్. 137

చ. దళితనవీనకందళకదంబకదంబకకేతకీరజో
మిళితసుగంధబంధురసమీరణుఁ డర్కసఖుం డూఁచు చుండఁగా
నులియుచు మొల్లగుత్తు లనుసనుమ్యొల లొప్పఁగ నెక్కి యూఁగె ను
ల్లలదళినీకులంబు మృదులధ్వనిగీతము విస్తరించుచున్. 138

క. సురచాపచిత్రగగన, [3]స్ఫురణం బురణించు నట్లు భూవనిత నిరం
తరచిత్రిత యై యొప్పెను, సురుచిరనవతృణశిలీంధ్రసురగోపములన్. 139

వ. తత్సమయానంతరంబున. 140

ఉ. భూసతికిం దివంబునకుఁ బొ ల్పెసఁగంగ శరత్సమాగమం
బాసకలప్రమోదకర మై విలసిల్లె మహర్షిమండలో
పాసితరాజహంసగతిభాసిప్రసన్నసరస్వతీకమ
జ్జాసనశోభితం బగుచు నబ్జజయానముతో సమాన మై. 141

ఉ. శారదరాత్రు లుజ్జ్వలలసత్తరతారకహారపఙ్క్తులం
జారుతరంబు లయ్యె వికసన్నవకైరవగంధబంధురో
దారసమీరసౌరభము దాల్చి సుధాంశు[4]వికీర్యమాణక
ర్పూరపరాగపాండురుచిపూరములం బరిపూరితంబు లై. 142

నన్నయభట్టకవిత్వము సంపూర్ణము.

---

1. గ. వ్రేలి. 2. గ. ముదారతరం బగుచున్ వన. 3. క.గ. స్ఫురణ విడంబించునట్లు. 4. చ.జ.విసార్యమాణ.

☞ ఇక్కడనుండి యెఱ్ఱాప్రెగ్గడకవిత్వము.

చ. స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరి వోయి నిరస్తనీరదా
వరణము లై దళత్కమలవైభవజృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంససారసమధువ్రతనిస్వనముల్ సెలంగఁగాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడఁగన్. 143

శా. దానాంభఃపటలంబునం బృథుపయోధారావలిం దాల్చి గ
ర్జానిర్ఘోషము బృంహితచ్ఛలనఁ బ్రచ్ఛాదించి ప్రావృట్పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతన్ డిగ్గె నాఁ
గా నొప్పారె మదోత్కటద్విరదసంఘంబుల్ వనాంతంబునన్. 144

క. కలనీలకంఠకోలా, హలలీలలు సెందె రాజహంసకులములం
దిలకించె సప్తపర్ణా, వలి [1]విగళితకుసుమకుటజవాటికల గెడన్. 145

మ. అతిగాంభీర్యవిభూతి నేకచులుకాహంకారని శ్శేషశో
షితపాథోధిపయస్కుఁ డైనముని దోఁచెం బుణ్యతేజోమయా
కృతి నయ్యామ్యదిగంతవీథిఁ బ్రకటక్రీడాకళాగర్వగ
ర్జితమండూకకళంకితాంబుశుచితా[2]సిద్ధిప్రదాచార్యుఁ డై. 146

తే. విశదశారదాంబుదపరివేష్టనమునఁ, బొలుచుగగనంబు ప్రతిబింబమో యనంగ
వికచకాశవనీపరివేష్టనమున, నతిశయిల్లె నిర్మలకమలాకరములు. 147

వ. అట్టిశారదాగమంబున నుత్ఫుల్లకమలకల్హారకేసరకరాళకలితకల్లోలమాలినియు ననేకమునిలోకసతతసంసేవ్యమానవిపులపులినోత్సంగయు నిరంతరతీరవానీరవనమండలీవిలసితయు నాకాశసంకాశవిశదసలిలయు నైనమహాసరస్వతీనది ననుదినస్నానపానాదివిశేషంబులం బరితోషంబు నొందుచుఁ బాండునందను లమ్మరుభూమిం గొన్నిదినంబులు వసియించి తదనంతరంబ ధౌమ్యాదిభూసురవరులు నింద్రసేనాదిమూలభృత్యులుఁ దోడ నరుగుదేరఁ గామ్యకవనంబునకు వచ్చి యచ్చటిమునులచేత నభినందితు లై యందు సముచితవర్తనంబుల నుండునంత నొక్కనాఁడు.

క. వాసవనందనసఖుఁ డగు, భూసురుఁ డొకఁ డరుగుదెంచి భూవినుతగుణో
ద్భాసితు ధర్మజు విప్రస, భాసీనుం గాంచి యిట్టు లనియెం బ్రీతిన్. 149

చ. జనవర నీవుఁ దమ్ములును సమ్మద మొందఁగ నివ్వనంబునం
దునికి ధ్రువంబుగా విని మహోజ్జ్వలతేజుఁడు దేవకీసుతుం
డనఘుఁడు మిమ్ముఁ జూచుటకు నై యిట వచ్చుచు నున్నవాఁడు మీ
కును ననిశంబుఁ దా హితము గోరుచు నుండు నతండు నెయ్యుఁ డై. 150

వ. మఱియు ననేకయుగసహస్రజీవియు నప్రమేయతపఃప్రభావభావియు వినుతవిధేయుండు నగుమార్కండేయుండును భవదీయదర్శనార్థం బీక్షణంబ చనుదెంచు

1. క. గ. వికసితకుసుమ-కూట-కుంజ•వాటికలయెడన్. 2. గ. సిద్ధవ్రతాచార్యుఁ డై.

ననిచెప్పినయనంతరముహూర్తంబున. 151

శ్రీకృష్ణుఁడు సత్యభామతోడఁ బాండవులయొద్దకు వచ్చుట.

సీ. శైబ్యసుగ్రీవాదిజవనాశ్వయుక్తమై, యాబద్ధనూత్నరత్నాంశుపటల
భాసితంబై చారుపతగపతాకావి, భూషితగగనమై పోలుపు మీఱు
దివ్యరథంబున దేవకీసుతుఁడు ప్రి, యంబున సత్యభామాన్వితముగఁ
దరళసౌదామినీదామసముజ్జ్వల, ధారాధరోత్సంగతలమునందు
ఆ. శచియుఁ దాను వెలుఁగుశతమఖుండునుబోలె, నరుగుదెంచె ఘనరథాంగనేమి
విపులఘోషతాండవితబర్హిశబ్దశ, బ్దాయమానవనవిభాగుఁ డగుచు. 152
వ. ఇట్లు వచ్చి వాసుదేవుండు రథావతరణంబు సేసి ధర్మనందనున కభివందనం బాచ
రించి భీమార్జుననకులసహదేవులం గౌఁగిలించుకొని ద్రౌపది గారవించి ధౌమ్యాది
మహీసురులచేత నభినందితుం డయ్యె నంతఁ గౌంతేయాగ్రజుండు గదాగ్రజునకు
నర్ఘ్యాదిసత్కారంబులు నిర్వర్తించి తమ్ములుం దానును విప్రజనంబులు నతనిం
బరివేష్టించి యుండె నప్పుడు కృష్ణుండు ధనంజయుం దనచేరువ నునిచికొని చిర
కాలదర్శనోల్లాసితంబు లైనయాలోకనంబుల నతనియాకారం బత్యాదరంబున
నభినందించుచు ధర్మరాజున కిట్లనియె. 153
సీ. భాగ్యంబు గాదె యీపార్థుండు హరుఁ డాది, యైననిర్జరసమూహంబువలన
నెలమిఁ గృతాస్త్రుఁ డై యేతెంచు టరయంగ, ధన్యుండ వై తీవు ధర్మతనయ
నీధర్మనిష్ఠయు నీతపంబును జూవె, యింతకుఁ గారణం బిద్ధచరిత
రాజ్యంబుకంటెను రాజేంద్ర ధర్మంబ, యిష్టమై పరఁగు నీ కెల్లనాఁడు
తే. వేదవేదాంగవిదుఁడవు వివిధయజ్ఞ, కర్త వైతి ధనుర్వేదకర్మఠుఁడవు
ధరణి యెల్ల నేలెడిరాజధర్మ మమర, సులభ మయ్యె నీ కిహపరశోభనములు.
చ. దమమును సత్యయుక్తియును ధైర్యనిరూఢియు నిత్యతృప్తియుఁ
శమమును నీకు నైజములు సన్మతి నర్థవశంబుఁ గామలో
భములును బొంద వట్లగుటఁ బార్థివకుంజర ధర్మరాజనా
మమునఁ ద్రిలోకపూజ్యమహిమం బొగ డొందెద [1]విఖ్యాధంబునన్. 155
వ. అని పలికి వెండియు. 156
శా. ద్యూతవ్యాజమునన్ సభాంగణములో దుర్యోధనుం డట్లు దు
ర్నీతిం గూరి యొనర్చినట్టియఘముల్ నిష్కంపధైర్యోన్నమ
[2]చ్చేతస్సారుఁడ వైననీ కొకనికిం జెల్లెన్ సహింపంగ వి
ఖ్యాతక్షాంతులు లేరె ధార్మికులు నీకక్కం బిట్టిరే యెవ్వరున్. 157
ఉ. ఉల్లము [3]సత్యసంయమము నూనినవాఁడవు నీవు విక్రమం
బొల్లమిఁ గౌరవాధములయుద్ధతి మైమెయిఁ జెల్లెఁ గాక యొం

1. గ. వెల్లకాలముఁ. 2. జ. చేతగస్సారుఁడ. 3. క. సత్యసంశయము ♦ నూనినవాఁ డటు నీవు.

డెల్లను నేల నీదుమది నించుకకిన్క జనించినఁ మహీ
వల్లభ యప్డు రూపఱదె వారక వైరికులంబు సర్వమున్. 158

చ. వినుతభవ[1]న్ని దేశ మనువేల యలంఘ్యము గాన [2]యిమ్మెయిఁ
ఘనభుజవీచివిభ్రమవికాసముఁ జూపక నిల్చెఁ గాక స
జ్జనసుత చూడ నీయనుజసాగరముల్ దఱితోఁడ విద్విష
జ్జనలయ[3]కారు లై కడఁగి సర్వజగంబుల నాక్రమింపవే. 159

ఉ. అంధకవృష్ణిభోజకుకురాన్వయభూపతు లెల్ల నీదెసన్
బాంధవసౌహృదప్రణయభక్తివిశేషము లొప్ప నీమనో
గ్రంథి యడంగఁ జేయ నెసకంబునఁ బూనినవారు లోభమో
హాంధులు ధార్తరాష్ట్రులు జనాధిప మార్కొనువారె వారలన్. 160

క. చతురంభోధిపరీత, క్షితితలసామ్రాజ్యలక్ష్మికిం బతివి జగ
న్నుత నీవ [4]నీవు దలఁచిన, నతిదుష్కర మెందు లేదనర్గళమహిమన్. 161

వ. అనిన సంతోసిల్లి కుంతీనందనుండు దేవకీనందనుతోడ దేవా యెవ్విధంబున నైన నల్పావశిష్టం బైనయివ్వనవాసంబును నజ్ఞాతవర్తనంబును జల్పి లోకనింద్యంబు గానివిక్రమంబునం బగఱ జయింపఁ గోరెదము దీని నంతయు నిర్వహించు భారంబు నీయదియ నీశరణంబు సొచ్చినమాకుం బరమశోభనంబు లగుట నిశ్చయంబు గాదె యనియె నప్పుడు కృష్ణుండు నిజసమీపంబున నున్నపాంచాలిం జూచి యి ట్లనియె. 162

సీ. నీపుత్రు లేవురు నీరజలోచన, యదుకుమారులుఁ దారు ముదముతోడ
ననుపమస్నేహసమాహృతహృదయు లై, కరిహయారోహణాచరితఁ దగిలి
యాడుచు వివిధశస్త్రాస్త్రవిశేషముల్, గఱచుచు నొం డెల్ల మఱచి యున్న
వారు ప్రద్యుమ్నుండు వారికి దివ్యాస్త్ర,జాతంబు లెల్లను బ్రీతి నొసఁగెఁ
ఆ. దన్వి యాసుభద్ర దనపుత్త్రకంటె నీ, తనయులందుఁ గూర్మిఁ దనరఁ జేయు
నూఱడిల్లు మింక నుజ్జ్వలోన్నతులఁ బెం, పారఁ గాల మనతిదూర మయ్యె.

మార్కండేయుం డనుమహాముని పాండవులయొద్దకు వచ్చుట.

వ. అని యాశ్వాసించుసమయంబునం బరమతపోవృద్ధుం డయినమార్కండేయుండు సనుదెంచినం గృష్ణుండును బాండవులు నతని నెదుర్కొని యథోక్తవిధులం బూజించిరి మునీంద్రుండును వారిని బ్రత్యేకంబ కుశలంబు లడిగెఁ దదనంతరంబ యందఱు నాసీను లై యున్నయెడఁ బాండవహితార్థి యై వనజోదరుం డమ్ముని వరున కి ట్లనియె. 164

ఉ. ఏనును బాండునందనులు నిమ్మునిముఖ్యులు నిప్డు లోకస

1. ఘ. న్నియోగ. 2. ఖ. యెమ్మెయిన్. 3. జ. గ. కాలు లై కడఁగు • సర్వజగంబులు నాక్రమింపఁగన్. 4. జ. నీతలంపున.

మ్మానితవాక్య నీ దయినమంజులవాగమృతప్రవాహముల్
వీనుల దోయిలించుచును వేడుకఁ గ్రోలికొనంగ నాత్మలం
బూనెద మస్మదీప్సితము పూర్ణము సేయఁగ సర్వ మెమ్మెయిన్. 165

వ. కావున. 166

క. దేవనర దేవధరణీ, దేవచరిత్రములు భర్తృదేవత లన నా
భావినుత లయినసతులప్ర, భావము లెఱిఁగింపు మోలిఁ బ్రస్ఫుటములుగాన్. 167

వ. అని యడుగుచున్నయెడ నారదుం డేఁగుదెంచిన నందఱుఁ బ్రత్యుద్గతు లయి ప్రణమిల్లి యాతని నుచితపీఠంబున నునిచి యుచితసత్కారంబులం బ్రీతునిం జేసిన నమ్మహాముని మార్కండేయునిం జూచి కృష్ణపాండవప్రియహితార్థంబుగాఁ బరమపుణ్యకథాకథనం బొనరింతువు గాక యని పలికి వారల నామంత్రణంబు సేసి నిజేచ్ఛం జనియెఁ దదనంతరంబ ధర్మతనయుండు మార్కండేయున కిట్లనియె.

సీ. కడఁగి ధర్మముతోడ నడచుచు నే మిట్లు, దందడిదుఃఖంబుఁ బొందుటయును
నేపున నెప్పుడు పాపంబు సేయుచు, ధృతరాష్ట్రజులు సుఖోన్నతు లగుటయుఁ
గని యవ్విపర్యయమునకు నే నూహింతుఁ, బాయక నరుఁ డిప్డు సేయుకర్మ
మున[1]ఫలమిందుఁబొందునో పరలోకంబు, నందుఁబొందునె యిందునందుఁ గనునె

ఆ. విశ్వకర్త యైనయీశ్వరునిన కాని, పురుషుఁ గర్మఫలము పొరయ కున్నె
యొడలితోడఁ గృతము వెడలిపోవునె యిది, దెలియవలయు నాకు నలఘుపుణ్య.

వ. ఇంతయు నెఱింగింప నీవ యర్హుండ వనినఁ బరమజ్ఞాననిధి యైనయత్తపోనిధి యతని కిట్లనియెఁ దొల్లి విధాత ప్రథమకల్పంబున నత్యంతనిర్మలంబులును ధర్మతంత్రంబులు నైనశరీరంబులు సృజియించె నట్లు పుట్టింపఁబడినయామనుష్యులు మహాసత్త్వసంపన్నులు సత్యవాదులు సత్యసంకల్పులు బ్రహ్మభూతాత్ములు స్వచ్ఛందజీవులు నై దేవయానంబుల విహరించుచు ననాయాసంబున నధికఫలసిద్ధిం బొందుచు సర్వజ్ఞు లై విగతమత్సరు లై బహుసహస్రసంతాను లై బహుసంవత్సరాయుష్యు లై వర్తిల్లుచుండి రంతఁ గాలాంతరంబునం గామక్రోధాదిగుణంబులు దమ్ముం బొందుటయు మాయాప్రవర్తను లై దేవతలచేత విడువంబడి యల్పాయువులు నల్పబలశరీరసత్త్వులును దరిద్రులును నిష్ఫలారంభులును బహురోగపీడితులు నాస్తికులును నై యొండొరుల మెచ్చక దురితంబులు సేయుచుఁ దిర్యగ్యోనులం బుట్టుచు నరకాగ్నులం [2]గ్రాఁగుచు గతాగతభ్రమణంబుల నలయం దొడంగి రిట్లు దిరుగుచున్నసంసారచక్రంబునందు. 170

చ. మనుజులు పుణ్యపాపములు మానక యిం దొనరించుచుం దుదిం
దనువు దొఱంగి పోవునెడఁ దప్పవు నీడయపోలెఁ గర్మముల్

1. జ. గ. ఫల మిందుఁ బొందునో ♦ పరమందుఁ బొందునో, యటు గాక యిందును ♦ నందుఁ గనునో. 2. జ. కాల్చుచు.

వెనుకన యేఁగి భూరిసుఖవిశ్రుతియుం బటుదుఃఖదైన్యముం
దనుకఁగఁ జేయుఁ గ్రమ్మఱఁగఁ దాన యొనర్చు భవంబు దేహికిన్. 171

క. విను మనుజున కెవ్విధమునఁ, దనచేసినసుకృతదుష్కృతంబులు నెఱయం
దన కనుభవింపఁ బాలివి, తనువు సెడుం గాని కర్మతతి సెడ దనఘా. 172

వ. మఱియు నున్ననిదర్శనంబులు సెప్పెద. 173

క. ఈలోకమ యొరుఁ గొందఱ, కాలోకమ కొందఱకు నిహంబును బరమున్
మే లగుఁ గొందఱ కధిపా, యేలోకము లేదు వినవె యిలఁ గొందఱకున్. 174

వ. అది యెట్లనిన. 175

చ. ధనములు సాలఁ గల్గి సతతంబును నింద్రియవాంఛ సల్పుచున్
మనమున నెన్నఁడున్ సుకృతమార్గము పొంతను బోక లోభమో
హనియతబుద్ధులై తిరుగునట్టిజనుల్ పరలోకసౌఖ్యముల్
గనుటకు నేర [1]రిక్కడి సుఖంబులు మే లయి తోఁచు వారికిన్. 176

మ. ఉపవాసవ్రతసంతతాధ్యయనతీర్థోపాసనాదిక్రియై
కపరత్వంబునఁ జేసి యైహికము దుఃఖప్రాయమై పోవఁగా
విపులానందముఁ బొందఁ గల్గుఁ దుది నావిర్భూతభోగైకలో
లుపబుద్ధిం జిరపుణ్యశీలురకు నాలోకంబునన్ భూవరా. 177

ఉ. ధర్మము పల్కుచుం దగిలి ధర్మపథంబునఁ జేసి యర్థముం
జేర్చియుఁ గాంచి ధర్మవిధిఁ బెండ్లియునై ప్రజలన్ సృజించి స
త్కర్మములం బ్రశస్తములుగాఁ గ్రతువుల్ వొనరించుసజ్జనుల్
ధర్మజ యిందు నందును ముదంబునఁ గాంతు రభీష్టసంపదల్. 178

ఆ. సత్యమును శమంబు శౌచంబు లేక నా, స్తిక్యమును నిషిద్ధసేవనంబుఁ
గలిగి తిరుగుదుష్టకష్టజనశ్రేణి, పొలియు నుభయలోకములకుఁ గాక. 179

వ. ఇది మనుష్యులకర్మగతిప్రకారంబు. 180

చ. జననుత మీరు దివ్యులరు సమ్మతి దేవహితార్థ మిమ్మహిన్
జననము నొందినారరు ప్రశస్తపరాక్రమలీలఁ జేర్చి యిం
క నఖిలశత్రునిర్మథనకర్మ [2]మొనర్చి మహీభరంబు దీ
ర్చి నియతిఁ బెక్కుజన్మములు సేసి భజింతురు దేవభావముల్. 181

మార్కండేయుఁడు ధర్మజునకు బ్రాహ్మణప్రభావంబు సెప్పుట.

వ. అనిన విని ధర్మనందనుండు బ్రాహ్మణప్రభావంబు విన వలతుం జెప్పవే యనిన మార్కండేయుం డి ట్లని చెప్పఁ దొల్లి హైహయవంశోద్భవుం డైనధుంధుమారుం డనుపేరిరాజకుమారుండు మృగయాసక్తుం డై వనంబునఁ గ్రుమ్మరువాఁ డొక్కయెడం దృణలతాగుల్మమధ్యంబునం గృష్ణాజినోత్తరీయుం డయి యున్నవాని

1. జ. రిప్పటి. 2. గ. ములం జయశీలవృత్తిఁ దీర్చి.

నొక్కవిప్రు దవ్వులం గని మృగం బనుబుద్ధిం జేసి బాణం బేసి డాయం జని [1]నిజశర చ్ఛిన్నుం డయినయతనిం జూచి యత్యంతదుఃఖితుం డయి పురంబునకుం బోయి నిజవంశవృద్ధు లైనహైహయుల కంతవృత్తాంతంబునుం జెప్పి వారిం దోడ్కొని వచ్చి యవ్విప్రకళేబరంబు సూపిన. 182

తే. వార లందఱు వందురి కె వగచియచటి, కతిసమీపంబునను దార్క్ష్యుం డనుమునీంద్రు
నాశ్రమం బున్న నయ్యెడ కె కరిగి కనిరి, దేవమునిసిద్ధలోకప్రకీర్తుఁ దార్క్ష్యు.

క. కని భక్తి మ్రొక్కుటయు న, య్యనఘుఁడు దీవించి వారి కె కర్హమగుపూ
జనము లొనరింపఁ బంచెం, దనశిష్యులఁ బరమ[2]సంశ్రితనపరుండు దయన్. 184

వ. హైహయులు నమ్మునీంద్రునకు సాష్టాంగదండప్రణామంబులు సేసి మహాత్మా యిక్కుమారుండు మృగయాసక్తుం డై వచ్చి యింతకు మున్న యివ్వనంబున నొక్క బ్రాహ్మణుం గృష్ణాజినావృతు నతిశ్రాంతుం బాపంబునం జేసి మృగం బనుబుద్ధి నేసిన నతండు మృతుం డయ్యె నేము మహాపాతకదూషితుల మైతిమి గావున మీచేయు సత్కారంబుల కర్హులము గా మిప్పాపంబున కెయ్యది నిష్కృతి యనిన నవ్వాచంయముఁ దార్క్ష్యుం డి ట్లనియె. 185

క. వినుఁ డెన్నఁడు మాయాశ్రమ, మున నెవ్వారలకు లేవు కె భూరిభయవ్యా
ధినిరోధమృత్యుదోషా, ద్యనేకదుఃఖములు త్రిజగదాశ్చర్యముగన్. 186

వ. అని పలికి తనపుత్త్రు నధికతపోబలసమన్వితుం జూపి. 187

క. ఈతఁ డగునె మీబాలకు, చేత నిహతుఁ డైనవాఁడు కె సెప్పఁ డనుడు వా
రాతఁడ తమమునుచూచిన, యాతం డగుటకు మహాద్భుతాత్ముకు లగుచున్. 188

క. మృతుఁ డయి క్రమ్మఱ సంజీ, వితుఁ డయ్యె నితండు కరము విస్మయ మిది భూ
నుత యిట్టిమహిమకలిమికిఁ, గత మెయ్యది యానతిమ్ము కె కారుణ్యమునన్. 189

వ. అని యడిగినఁ దార్క్ష్యుం డి ట్లనియె. 190

శా. ఆలస్యం బొకయింత లేదు శుచి యాహారంబు నిత్యక్రియా
జాలం బేమఱ మర్చనీయు లతిథుల్ కె సత్యంబ పల్కం బడుఁ
మే లౌశాంతియు బ్రహ్మచర్యమును నేమిం దాల్తు మ ట్లాట నె
క్కాలంబుం బటుమృత్యురోగభయశంకం బొంద మే మిమ్ములన్. 191

వ. ఇది యస్మదీయప్రభావమూలంబు మీకుఁ బాతకభయంబు వలవ దరుగుం డని నం దార్క్ష్యుని వీడ్కొని హైహయులు నిజనివాసంబులకుం జనిరి భరతవంశోత్తమ యిట్టిదియ బ్రాహ్మణప్రభావం బని మఱియు మార్కండేయుండు బ్రహ్మక్షత్త్రి స్వరూపనిదర్శనం బయినయితిహాసం బొక్కటి సెప్పెద విను మని ధర్మరాజున కి ట్లనియె. 192

చ. వినుతచరిత్రుఁ డత్రి యనువిప్రవరుండు తపం బొనర్పఁ గా

---

1. గ. నిశ్చేతనుం డయిన. 2. గ. సంశ్రితవ్రతుఁడు.

ననమున కేఁగు చుండి తన కనాతిఁ గనుంగొని యిట్లనుం దపం
బున కిదె యేను బూని వనభూమికిఁ బోవుచు నున్నవాఁడ నో
వనరుహనేత్ర నీవు నట వచ్చెదొ పుత్త్రులయొద్ద నుండెదో. 193

చ. అనుటయు భార్య యిట్లనియె నక్కట పుత్త్రులకుం గుటుంబభా
వన యగువృత్తి యెల్లను ధ్రువంబుగఁ జేయక యాశ్రమాంతరం
బునకు మహాత్మ నీకు నిటు వోవుట ధర్మువు గాదు వైన్యభూ
జనపతి యిచ్చు నర్థులకుఁ జాలఁగ నర్థము వేఁడు మవ్విభున్. 194

వ. అనినం గొండొక విచారించి భార్యపలుకులు ధర్మయుక్తంబు లగుటకు సంతో
షించి యమ్మహాద్విజుం డప్పుడ చని యశ్వమేధాధ్వరదీక్షితుం డయి విప్రులకు న
పారధనంబు లిచ్చు చున్నవైన్యుం గని యాశీర్వాదపురస్సరంబుగా నిట్లనియె.

ఉ. నీవ విధాత వింద్రుఁడవు నీవ సమస్తజనేశ్వరుండవుఁ
నీవ యశేషధర్మములు నీవ యెఱుంగుదు నిన్నుఁ బోలఁగా
నీవసుధాతలంబున మహీశ్వరు లెవ్వరు లేరు సన్మునీం
ద్రావలి యెప్డు నిన్నుఁ గొనియాడుఁ బరిస్ఫుటవాక్యభంగులన్. 196

చ. అని పలుకంగ గౌతమమహాముని యచ్చటనుండి యంతయుఁ
విని కలుషించి యేల యిటు వీఁకను నో [1]రఱువంగఁ బ్రేలె దీ
జనపతియే విధాతయును శక్రుఁడు నీశుఁడు నర్థకాంక్షివై
మనమున శంక లేక యొకమానవు నింత నుతింప నేటికిన్. 197

అత్రిగౌతములపరస్పరసంవాదము.

వ. అనుటయు నత్రి యిట్లనియె. 198

ఉ. ఊరక మీఱ నాడెదవు యుక్తమయుక్తము నాత్మఁ జూడఁగా
నేరవు సర్వలోకముల నిర్మలనీతిపరాక్రమంబు లొ
ప్పారఁగ నేలి ధర్మముల కన్నిటికిం గుదురై వెలుంగుధా
త్రీరమణుండు మేటిగ నుతించుట వోలదె నాకు నిమ్మెయిన్. 199

వ. అని యధిక్షేపించిన గౌతముండు. 200

ఆ. కలయ నరలు వచ్చి తల తెల్ల నైనంతఁ, జేసి యెట్లు నీకుఁ జేరు నెఱుక
జ్ఞానవృద్ధుఁ డైనవానిమాటలు గదా,సభలఁ జెల్లు నార్యజనుల కెక్క. 201

వ. అని తొడంగి యయ్యిరువురు మహానాదంబుగా వాదంబు సేయు చుండఁ గాశ్యప
నామధేయుం డైనముని సభాసదు లైనమునులం జూచి వీరలవాదు మనచేతఁ
జక్కంబడ నేరదు సకలధర్మజ్ఞుం డయినసనత్కుమారు నడుగుద మనిన నాసద
స్యు లందఱు సనత్కుమారుపాలికిం జని యత్రిగౌతములవివాదంబు తెఱం గెఱిం
గించిన నతండు వారి కిట్లనియె. 202

---

1. 'ఱరువంగ' నని పెక్కుప్రతులు.

ఉ. అత్త్రి నిజంబ పల్కెఁ దగు నాతనివాక్యము ధర్మయుక్తమీ
ధాత్రి సమస్తముర్ బృహదుదగ్రభుజాగ్రమునందుఁ దాల్చుస
త్క్షత్త్రియుఁ డెల్లవారలను గావను బోలఁ బ్రభుండు గావునర్
శత్రునిషూదనుం డతఁడె శక్రుఁడు నీశ్వరుఁడుర్ విధాతయున్. 203

క. జనులకు నెల్లను బూజ్యుఁడు, జనపాలుం డతనిమహితశాసనమున స
జ్జనులును మునులును సద్విధిఁ, జనువారలు గాని కడవఁ జనఁ దగ దెపుడున్.

వ. క్షత్త్రియప్రభావం బే మన వచ్చు విరాట్సమ్రాడ్యుధాజిత్సత్యమన్యుండు సత్య
జీవుండు సత్యధర్ముండు ననుభవ్యనామంబులు పార్థివుం గొనియాడుఁ దొల్లి యధ
ర్మంబునకు వెఱచి బ్రాహ్మణులు నిజతేజోబలంబులు క్షత్త్రంబున నిక్షేపించిరి నాఁ
టంగోలె బ్రాహ్మ్యంబువలన క్షత్త్రంబు ప్రవర్తిల్లుచుండు బ్రహ్మక్షత్త్రంబులు పర
స్పరసంశ్రయంబులు వెలిగా వర్తింపనేరవు క్షత్త్రియుండు బ్రాహ్మణసంసేవనం
బునం దేజోనిరూఢుం డయి యాదిత్యుండు చీఁకటి నడంచునట్లు దురితంబుల
నడంచు నట్లగుటం జేసి క్షత్త్రియుండు సర్వాధికుం డగుట నిశ్చయం బనిన నమ్మును
లందఱుఁ జని వైన్యునకుఁ దత్ప్రకారం బెఱింగించిన నాభూవరుం డత్రిం జూచి.

క. నను నెల్లజనులకంటెను, ఘనుఁ డని కొనియాడి తీవు కడునిజముగఁ గా
వున నీదెసఁ [1]బ్రీతుఁడ నై, కొను మిచ్చెద నీకుఁ గోటికోటిధనంబుల్. 206

క. అని యిష్టధనము లిచ్చినఁ, గొని వచ్చి మునీశ్వరుండు గొడుకులకుఁ బ్రియం
బునఁ బంచి యిచ్చి యిమ్ములఁ, జనియె వనంబునకు ధర్మసంహితబుద్ధిన్. 207

వ. అని చెప్పి మార్కండేయుండు పాండవేయునితో వెండియు నిట్లను 'సరస్వతీగీత'
యనునితిహాసం బొకటి సెప్పెద నందు విశిష్టధర్మంబు లెఱుఁగ నగుఁ దొల్లి
తార్క్ష్యుం డనుమునివరుండు భారతి నారాధించి తనకు నద్దేవి ప్రత్యక్షం బగు
టయు నిట్లని యడిగె. 208

క. పురుషున కెయ్యది ధర్మువు, పురుషుం డెద్దానఁ బరమపుణ్యాత్ముఁ డై
చిరపుణ్యగతులు వడయును, దిరముగ నవి యానతిమ్ము దేవీ నాకున్. 209

వ. అనిన నతనికి నప్పరమేశ్వరి యిట్లనియె. 210

మ. ధృతి వేదంబులు నాలుగుం జదివి భూదేవుండు నానాధ్వర
వ్రతుఁ డై యుండెడు నట్టిపుణ్యుఁ డమరావాసంబునం దుండు ను
న్నతవృత్తస్తనభార[2]మంథరమరున్నారీపరీరంభసం
భృతరోమాంచసమంచితాంగుఁ డగుచుం బెక్కేండ్లు సంప్రీతితోన్. 211

సీ. మే లగుక్రేపుతోఁ బాలు సాలఁగఁ గల్గి, లాలితం బగుతోలుచూలి మొదవుఁ
బాత్త్రభూతుం డైన శ్రోత్త్రియునకు నిచ్చు, సదమలచరితుఁ డమ్మొదవుమేన
నెన్నిరోమము లుండు నన్నివే లేండ్లును, సురలోకసౌఖ్యవిస్ఫురణ నొందు

1. అ. నిదె ప్రీతుఁడ నయితిం, గొను... నేను గోటిధనంబుల్. 2. క. గ. బంధురమరు.

భారంబునకుఁ జాలి భూరిసత్త్వాఢ్య మై, బిరు దైనయెద్దు భూసురున కిచ్చి
ఆ. నరుఁడు ధేనుదశక మిర వొంద నిచ్చిన, ఫలము వడయు మఱియు వలువురలొసఁగి
చంద్రలోకమునకు సంప్రీతుఁ డై చనుఁ, గనక మిచ్చి నాకమునకు నరుగు. 212
క. కృతమతి వై యే డేఁడులు, ఘృతమున హుతవహునిఁ బ్రీతి నొందించినను
వ్రతుఁ డీరేడుతరంబుల, పితరులఁ గొని దివికి నేఁగుఁ బెం పెసలారన్. 213
క. సతతంబును శుచి వై దే, వతలఁ బ్రదీప్తాగ్నియందు వదలక సంత
ర్పితులుగఁ జేసి పడయు నం, చితముగ గోలోకవాసచిరసౌఖ్యంబుల్. 214

వ. "అగ్నిహోత్రం బస్మదాత్మకం" బని యెఱుంగుము। సకలయజ్ఞంబులయందుఁ గల్గింపంబడువిశిష్టద్రవ్యంబు లన్నియు మదీయంబులు। నేను మహానీయం బైనయగ్నిహోత్రముఖంబునఁ బ్రభవింతు। నాత్మజ్ఞు లైనమహాత్ములకు నఖిలసంశయచ్ఛేదంబు సేయుదు। ననవరతతపస్స్వాధ్యాయదానవ్రతపరాయణు లైనతపోధను లెందేని విగతశోకు లై చరియింతు, రట్టిది మామకం బైనపరమపదంబు, వినుము, ప్రచురమధుక్షీరతోయంబులును శర్కరాసైకతంబులును మాంసాపూపప్రకరతీరంబులును బాయసకర్దమంబులు నైనయేఱు లనేకంబు లుత్పాదించి యింద్రాగ్నిప్రముఖు లయినదివిజులకుఁ దృప్తి సేసి యజనశీలురు పెక్కండ్లు మత్పదంబుం బ్రాపింతు రని చెప్పినఁ దార్క్ష్యుండు కృతాంజలి వై. 215

ఉ. అంబ నవాంబుజోజ్జ్వలకరాంబుజ శారదచంద్రచంద్రికా
డంబరచారుమూర్తి [1]ప్రకటస్ఫుటభూషణరత్న[2]రోచిరా
చుంబితదిగ్విభాగ శ్రుతిసూక్తవివిక్తనిజప్రభావ భా
వాంబరవీథివిశ్రుతవిహార ననుం గృపఁ జూడు భారతీ. 216

వ. అని వినుతించి కృతార్థుం డయ్యె నని చెప్పిన విని పాండుపుత్త్రుండు ముకుళితహస్తుం డై మునీంద్రా వైవస్వతమను వెత్తెఱంగునం బ్రభావసంపన్నుం డయ్యెఁ జెప్పవే యనిన మార్కండేయుం డి ట్లనియె. 217

క. విను చాక్షుషమన్వంతర, మున వైవస్వతుఁడు పరమపుణ్యుండు దపం
బొనరించె నిరాహారత, ననుపమధైర్యుండు దశసహస్రాబ్దంబుల్. 218
ఆ. అనఘుఁ డూర్ధ్వబాహుఁ డై యేకపాదంబు, నందు నిలిచి బదరికాశ్రమమునఁ
జలిపె మఱియుఁ బెక్కుసంవత్సరంబులు, సకలజనులుఁ దన్ను సంస్తుతింప. 219

మార్కండేయుండు ధర్మరాజునకు వైవస్వతువృత్తాంతంబును దెల్పుట.

వ. ఆవైవస్వతుం డొక్కనాఁడు కృతస్నానుం డయి జలాశయతీరంబున నున్నంత నొక్కమత్స్యంబు జలంబులదరికిం జనుదెంచి యి ట్లనియె నయ్యా యేను గడు నల్పమత్స్యంబ నగుటం జేసి బలవంతంబు లగుజలచరంబులవలన నాకుఁ దద్దయు భయంబు గలిగి యుండు నిమ్మడువు మహామత్స్యసంకులంబు గావున నపాయంబు వొంద కుండ న న్నుద్ధరించి యొండెడం బెట్టవే యేను నీకుఁ బ్రత్యుపకారంబు

1. క. ముకుటస్ఫుట; గ. చ. జ. వికటస్ఫుట. 2. క. మాలికా; జ. దీపికా.

సేయ నోపుదు ననిన విస్మితుం డై యతం డమ్మీను నెత్తికొని పోయి యొక్క
నూతియందు విడిచి దానిం బలుమాఱు నరసికొని యుండె నదియును గ్రమం
బున వర్ధిల్లి యొక్కనాఁ డమ్మనువున కి ట్లనియె. 220

ఆ. అనఘ నీప్రయత్నమున నాశరీరంబు, పొదలె నిందు నాకు మెదల నెడము
సాల దట్లు గాన మేలుగ నొండొక, యెడకుఁ గొంచుఁ బొమ్ము కడఁగి నన్ను.

వ. అనిన నతం డాజలచరంబుఁ గైకొని పోయి యొక్క బావియందు విడిచిన నది యె
ప్పటియట్ల యక్కజంబుగాఁ బొదలి తనకు నవ్వాపియందు నవకాశం బపర్యాప్తం
బగుటం జెప్పి యతనిచేత గంగమడువున విడువంబడి కాలక్రమంబున నచ్చోటఁ
దిరుగం బట్టు చాలకున్న నతం డెత్తికొని పోయి సముద్రంబునం బెట్టిన నది వాని
కి ట్లనియె. 222

క. ఉపకారం బొనరించితి, కృపతో నీ విట్లు నాకుఁ గృతమతి వై ప్ర
త్యుపకారం బొనరించెద, విపులగుణాభరణ తెలియ విను నాపలుకుల్. 223

తే. తడవు లేదింక నిఖిలభూతములుఁ బ్రళయ, మొందెనున్నవి యిప్పుడొండొండఁ బొంగి
కలయఁ బాఱుఁ బయోధు లుగ్రముగఁ బుణ్య, చరిత యిదియ మన్వంతరసంధియందు.

వ. కావున నీవు దృఢరజ్జుబంధనంబును సకలధనధాన్యసహితంబును గా నొక్క పేరోడ
గావించి సప్తమునిసహితుండ వై దాని నెక్కి సముద్రంబు దఱిసి నన్నుం దలంచు
నది యేనును ఘనశృంగశోభితం బయినరూపంబునఁ బొడసూపి మీకు మే లొనరిం
చెద నని యమ్మత్స్యంబు సనియె వైవస్వతుండును దదుక్తప్రకారంబున నోడ
నిర్మించి సకలబీజంబులు సంగ్రహించి సప్తమునిసహితంబుగాఁ గృతారోహణుం
డై పయోధి దఱియం దొడంగె నంత. 225

మ. మతి వైవస్వతుచేఁ దలంపఁబడి యమ్మత్స్యంబు దోఁతెంచె నా
యతశృంగోన్నతమూర్తి నాతఁడు దదాజ్ఞాయత్తుఁ డై తచ్ఛిరో
గతశృంగాగ్రమునం దగిల్చె నతిదీర్ఘం బైనపాశంబు న
ద్భుతవేగంబున నోడ నీడ్చె నది యంభోరాశిమధ్యంబునన్. 226

వ. తదనంతరంబ. 227

సీ. గరుసులు గడవంగఁ [1]గదలి యల్లల్లన, యొత్తుచు నెడముల నుత్తరించి
వేడుకఁ జేతులు విచ్చి యాడెడునట్లు, లోలోర్మిపంక్తులఁ గ్రాలి క్రాలి
ప్రచురహాసస్ఫూర్తి పచరించు[2]విధమున, నురుఫేనరోచులఁ దెరలు గవిసి
యురవడి వర్ధిల్లు చున్నజలంబుచేఁ, బొంగారి దెస లెల్ల మ్రింగికొనుచుఁ

ఆ. ప్రబలవిలయకాల[3]పటురయబహుళస, మీరణౌఘదుర్నివార మగుచు
నుగ్రభంగిగాఁ బయోనిధు లొక్కటఁ, బెల్లు రేఁగి జగము [4]వెల్లివొడిచె. 228

---

1. క. గెరలి. 2. చ. చాడ్పునఁ, దిరుగుఫేనంబుల • దిశలు. 3. చ. జ. బహుళసమీరస, మీరి
తౌఘదుర్ని. 4. చ. లెల్లఁ బొదవె.

వ. ఇట్లులోకం బెల్ల నేకార్ణవం బైన నమ్మత్స్యంబు దజ్జలాంతరంబున ననేకసహస్రవర్షం
బు లవ్వోడం దిగుచుచుఁ బదంపడి యప్పెనువెల్లి యల్ల నల్లఁ దిగిచి పోవం దొ
డంగు నెడం దుహినగిరిశృంగసమీపంబున నవ్వోడ నిలిపి వారలతోడ. 229

తే. ఈనగంబుశృంగంబున నిపుడు మీరు, గట్టుఁ డివ్వోడ ననిన నాక్షణము వారు
నట్ల చేసిరి విను మమ్మహాద్రిశృంగ, మనఘ నౌబంధనం బన నవనిఁ బరఁగె.

క. మనుసహితు లైనమునులం, గనుఁగొని యమ్మీను గరము గారవమున ని
ట్లనుఁ బ్రళయంబునకీడునఁ, జన కుండఁగ మీరు రక్ష సలిపితిఁ గరుణన్. 231

క. మునులార యేను విశ్వం,బునకుఁ బ్రథమకర్త యగు ప్రభుఁడ వాత్సల్యం
బున మత్స్య మైనరూపం, బున నిమ్మెయి నిన్నిచందములఁ జన వలసెన్. 232

వ. మీరు నిర్భయుల రై చరియించునది మఱియు నిమ్మనువును సదేవాసురమానుషం
బైనజగం బఖిలంబును సృజియించు మత్ప్రసాదంబున నితనికిఁ బరమజ్ఞానోదయం
బగు నని చెప్పి యయ్యాదిమత్స్యం బదృశ్యం బయ్యె వైవస్వతుండును మఱియు
నధికతపంబు సేసి సకలచరాచరంబుల సృజియించె. 233

క. పరమం బగు వైవస్వతు, చరితం బతిభక్తి వినినఁ జదివినను మహా
దురితంబు లడఁగు జనులకు, నిరవుగ సిద్ధించు ననఘ యిహపరసుఖముల్. 234

వ. అనిన నమ్మేదినీశ్వరుం డమ్మునీశ్వరునకుఁ బ్రణతుం డై యి ట్లనియె. 235

క. పరమేష్ఠికల్పుఁడవు ని, ర్భరభూరితపః[1] ప్రభావపరిపూర్ణుఁడ వ
చ్చెరువు భవన్మాహాత్మ్యము, సురమునిలోకప్రణామశోభితచరణా. 236

క. ఎడలి యఖిలాండకోటియుఁ, జెడునప్పుడు చెడక బ్రదికి జీవించెద వే
ర్పడ జగములు గ్రమ్మఱఁ గలి, గెడునప్పుడు సూచెదవు వికృతిరహితుఁడ వై. 237

చ. తొడరి చరాచరప్రతతితో జగ మింతయు వార్ధి దొట్టిన
ప్పుడు లలితాబ్జపీఠమునఁ బొల్చుచతుర్ముఖుఁ బద్మగర్భుఁ బెం
పడర భజించె దీవు జగదాదిజుఁ డైన ప్రభుండు నీయెడం
గడు ననురక్తుఁ డై యొసఁగెఁ గాదె మునీశ్వర యీప్రభావమున్. 238

క. జగముల నెల్లను మ్రింగెడు, జగదంతకుమాళి వామచరణం బిడఁ బె
ల్లగురోగజరాభరముం, దిగ విడువఁగఁ జెల్లె నీకుఁ ద్రిభువనవినుతా. 239

వ. సకలచరాచరోత్పత్తిస్థితివిలయప్రకారంబులు నీకుం బెక్కుమారులు ప్రత్యక్షంబు
లయి కానంబడి యుండుఁ గావున ని న్నడిగెద లోకంబులు విలయకాలంబున నెట్టి
భంగి యగు నెఱింగింపు మనిన మార్కండేయుం డి ట్లనియె. 240

మార్కండేయుండు ధర్మరాజునకుఁ బ్రళయప్రకారంబు సెప్పుట.

సీ. శాశ్వతు నఖిలభూతేశ్వరు నవ్యయు, నాదిదేవుని జగదాదిజన్ము
నాదిమధ్యాంతవిచ్ఛేదవిదూరు నా, [2]శ్చర్యకారణకర్మధుర్యు నజరు

1. గ. ప్రబోధ. 2. చ. శ్చర్యకారణు ధర్మధుర్యు.

గురుఁడు నీకిష్టసఖుండుఁ బెగ్గడయు నై, వెలుఁగొందుచున్న యీయలఘుపుణ్య
లాలితదీర్ఘవిశాలసితేక్షణుఁ, గనకవర్ణాంబరు వనజనాభు
ఆ. నింద్రనీలవర్ణు నింద్రాదిసురగణ,వినుతుఁ గృష్ణుఁ గరము వినయ మొప్పఁ
దలఁచి యితనియాజ్ఞ దలకొని యెఱిఁగింతు, వినుము వరుసతోడ మనుజనాథ.
వ. కృతత్రేతాద్వాపరకలినామంబు లయినయుగంబులు నాలుగును బండ్రెండువేల
దివ్యవర్షంబులం బర్యవసితంబు లగు నియ్యుగంబులు నాలుగు నొక్కమహాయు
గం బనం బరఁగు మహాయుగసహస్రపర్యంతం బైనకాలంబు బ్రహ్మకు నొక్క
దివసం బనంబడుఁ దద్దినసావసానంబునందు శతవార్షికం బైనయనావృష్టిదోషంబు
ప్రవర్తిల్లు నప్పుడు. 242
ఆ. సప్తహయుఁడు మూర్తిసప్తకంబు ధరించి, కరము వేఁడి మిగులు కరము లొప్ప
నదనదీజలములు నుదధిజలంబులుఁ, బీల్చి జగము లెల్లఁ బేల్చుఁ గడఁగి.. 243
చ. దినకరతిగ్మతేజము ప్రదీప్తహుతాశనుఁ డయ్యుగాంతసం
జనితమహాసమీరణవశంబునఁ బేర్చి నగవ్రజంబుతో
మనుజులతోడ నిర్జరసమాజముతోడ భుజంగపంక్తితో
దనుజులతో జగత్త్రియము దత్క్షణమాత్ర [1]నొనర్చు నీఱుగాన్. 244
వ. తదనంతరంబ. 245
మ. సితపీతారుణనీల[2]హింగులరుచుల్ స్నిగ్ధంబు లై యుద్యతా పింగుల
యతవిద్యుల్లలితంబు లై ఘనగిరీంద్రాకారఘోరంబు లై
తతనిర్ఘాతనిపాతభీమభిదురధ్వానంబు లై సంతతో
ద్ధుతసంవర్తవలాహకంబులు వెసం దోఁతెంచు దిగ్భిత్తులన్. 246
ఉ. పెల్లుగఁ [3]గూరుతజ్జలముపెక్కువ నొక్కట నమ్మహానలం
బెల్లను నాఱిపోవుఁ బృథివీశ్వర యేఱులు నబ్ధులున్ వెసం
దొల్లిటియట్ల నిండుఁ బటుతోయదసంఘము లంతఁ బోక గ
ర్జిల్లుచు వెండియుం గురియుఁ జిత్రముగాఁగ ననేకకాలముల్. 247
శా. ధారాపాతనితాంతవేగమున నిద్ధాత్రీతలం బాహతం
బై రూపేది మునుంగుఁ దోయములలో నత్యంతగంభీరవాః
పూరం బంతయు ముంచి మించుటయు దిగ్భూమీనభోభాగముల్
వేరూపింపఁగ రాకయుండఁ దమముల్ వేష్టించుఁ ద్రైలోక్యమున్. 248
తే. అంతఁ బరమేష్ఠిచోదిత మైనయొక్క, మారుతము నలి రేఁగి దుర్వారభంగి
విలయకాలవిశృంఖలవిపులవారి, ధరచయంబుల నెల్లను విరియ నడఁచు. 249
క. ఆమారుతంబు గ్రోలి పి, తామహుఁ డంతయును ఘోరతమ మగుసలిల
స్తోమంబునందు నడుమం, దామరపై నిదురవోవుఁ దద్దయు నెమ్మిన్. 250

1. చ. నసేర్చు. 2. జ. పింగరుచు లై. 3. క. బాఱు.

వ. ఇట్టికల్పాంతంబు లనేకంబులు సనియె నింకఁ గా నున్నవి యనేకంబులు విను మతీ
తకల్పాంతసమయంబున నేను బ్రబలాంధకారంబున నేదెసయుం గానక యొక్కరుం
డన యత్యంతభయాతురుండ నగుచుం బెద్దకాలంబు పరిభ్రమించు చుండ నొక్క
తఱి నయ్యుదకమధ్యంబున నత్యున్నతం బయినవటభూరుహంబు గానంబడియె
మఱియుఁ దదీయపర్ణపర్యంకంబునందు. 251

క. కమనీయజలదవర్ణుని, హిమకరబింబాస్యు నుద్యదినతేజుఁ బ్రమో
దమునఁ బవళించువానిం; గుమారు నొక్కరునిఁ గుసుమకోమలుఁ గంటిన్. 252

వ. కని విస్మితుండ నై యాత్మగతంబున. 253

క. లోకంబులు దెగటాఱఁగ, నేకార్ణవ మైనయిచట నిబ్బాలుఁ డితం
డేకతమున నిద్రించుచు, నేకతమున నున్నవాఁడొ యెవ్వాఁ డగునో. 254

తే. అని తలంచుచు నల్లన యక్కుమారుఁ, జేరఁ బోయిన నాతండు సితసరోజ
రేఖ [1]దలకొనఁగా నలరించెఁ గన్ను, లవధరించెను నను లోచనాంచలముల. 255

వ. తదనంతరంబ గంభీరమధురస్వరంబున నిట్లను నయ్యా నిన్ను నతిశ్రాంతుంగా
నెఱింగితిఁ గొండొకసేపు విశ్రమింప వలతేని నవకాశం బిచ్చెద నాశరీరంబు ప్రవే
శించి సుఖంబున శయనింపు మని తనవదనంబు వివృతంబుగాఁ జేసిన నేనును
[2]బలాత్కారక్షిప్తుఁడుంబోలెఁ బరవశుండ నై తన్మార్గంబున నతనియుదరంబుఁ
బ్రవేశించి యందు. 256

సీ. గంగాదినదులతోఁ గనకశైలాదిభూ, ధరములతో సముద్రములతోడ
వివిధపత్తనవనద్వీపవర్షములతో, బహుకర్మరతు లైనప్రజలతోడఁ
బక్షిమృగవ్యాళపశుసంఘములతోడఁ, దద్దయు నొప్పారుధాత్రిఁ గంటి
సూర్యేందుతారకాజ్యోతిరుజ్జ్వల మైన, గగనంబుఁ బవనమార్గములుఁ గంటి

తే. శక్రవరుణయమాదినిర్జరసమేత, మైననాకంబుఁ గంటి మహాహియక్ష
రాక్షసాసురవిద్యాధరప్రముఖులఁ, గంటి వేయేల సకలలోకములుఁ గంటి. 257

చ. అరుదుగ నమ్మహాత్మునిమహోజఠరాంతరభూమి నాఱువ
త్సరములయంతకాలము వసం బఱి త్రిమ్మరితిం గడంగి య
ప్పురుసున నెందుఁ గా ల్గొనఁగఁ బట్టదు చిత్తము భీతి మీఱఁ ద
త్పరమతి [3]నంత నక్కపటబాలుపదంబులు సంస్మరించితిన్. 258

వ. ఇట్లు శరణ్యవరేణ్యుం డైనకారుణ్యనిధి నద్దేవుం దలంచు చుండ నతండు నన్నుం
దనవదనానిలవేగంబునం జేసి వెలువరించె నంత నెప్పటియట్ల మహావటవిటపి
శయనుం డైనయబ్బాలు నాలోకించితి నంత. 259

క. కనుఁగొని [4]యల్లనినవ్వునఁ, దనవదనము వింత చెన్ను దలకొనఁగా ని

1. గ. దలకొనఁగా నడరించె; జ. దలకొన సిరి నలరించుకన్ను, లమరఁ జూచెను. 2. చ. బలాత్కారక్షిప్తశరీరుండ నై తన్మార్గ. 3. చ. నయ్యు. 4. జ. నను నెలనవ్వున.

ట్లను నబ్బాలుఁడు విశ్రమ, మొనరించితె యనఘ యస్మదుదరములోనన్. 260

వ. అనిన నేనును సంభ్రమంబున నతనిం జేర నరిగి కెందామరరేకులం దెగడునంగుళంబులు గలిగి తరుణకిసలయసుకుమారంబు లయినతచ్చరణకమలంబులు శిరంబునం జేర్చి దేవా దేవరప్రసాదంబున నత్యాశ్చర్యకారణం బైనసకలచరాచరభూతప్రపంచంబుఁ జూచితి భవదీయమాయాప్రభావంబు భావింప నేరకున్నవాఁడ.

శా. ఈయేకార్ణవ మీవటక్షితిరుహం బీపర్ణపర్యంక మి
ట్లె యొప్పారుచు నుండఁగా నుదరభాగైకప్రదేశంబునం
దీయీరేడుజగంబులుం మెలఁగఁగా నిట్లున్న బాలత్వ మే
నేయందంబున నిశ్చయించి సుఖి నై యే పారుదుం జెప్పవే. 262

క. నా దైనయాశ్రితత్వము, నీ దగుచిత్తమునఁ గల్మి నియతమ యేనిన్
సాదరఫణితుల నన్నవ, సాదితసమ్మోహుఁగాఁ బ్రసాదింపు తగన్. 263

నారాయణుఁడు మార్కండేయునకుఁ దనప్రభావంబు సెప్పుట.

క. అని యేను వేఁడికొనుటయు, ఘనతరకరుణారసానుకలితహృదయుఁ డై
తనదివ్యమహిమ యి ట్లని, వనజాక్షుఁడు సెప్పె గారవంబున నాకున్. 264

ఆ. అనఘ దేవతలును మునులును నాదైన,మహిమఁ దెలియ లేరు మహితబుద్ధి
నతులపుణ్యమతివి పితృభక్తుఁడవు గాన, యెలమి నీకుఁ జెప్పవలసెఁ దెలియ. 265

క. నారము లండ్రు జలము లిం, పారఁగ నారములు నాకు నయనం బగుటన్
నారాయణుఁ డను పేరన, పారనిగమఫణితులందుఁ బరఁగుదుఁ బేర్మిన్. 266

తే. అట్టినారాయణాఖ్యుండ నైననేను, శాశ్వతుండ నై ప్రభుఁడ నై సకలజగము
నోలిఁ బుట్టింతుఁ బాలింతు నుచితవేళ, సంహరింతుఁ జిదానందశాలి నగుచు.

మత్తకోకిలము. అంబుజాసనుఁ డింద్రుఁ డీశ్వరుఁ డంతకుండు ధనేశ్వరుం
డంబుధీశుఁడు లోనుగా సురలస్మదాకృతు లుర్వి పా
దంబు లగ్ని ముఖంబు సూర్యసుధాకరుల్ నయనంబు లీ
యంబరంబు శరీర మే నిటు లద్భుతాకృతి నుండుదున్. 268

చ. అతులితదక్షిణాన్వితమహాధ్వరసంఘము లే నొనర్చితిం
జతురమనీషితాప్రచురసౌఖ్యులు భూసురముఖ్యు లంచిత
వ్రతులు మహీపతుల్ సుగుణవశ్యులు వైశ్యులు భక్తి నన్ను సం
తతమును గొల్తు రీక్షితి నుదాత్తమహాక్రతుకర్మశీలు రై. 269

చ. విలయపయోధిమగ్న మగువిశ్వమహీవలయంబు దొల్లి యే
నలఘువరాహవిగ్రహుఁడ నై వెస నెత్తితి శేషమూర్తి నై
లలితఫణాసహస్రకములావునఁ దాల్తు నశేషధాత్రియుం
జలనిధినిమ్నగానగలసన్నగరీవనమండలంబుతోన్. 270

క. బాడబదహనుఁడ నై వడి, నేడుసముద్రములజలము లేఁ గ్రోలుదు నీ

లేదుజగంబులు విలయమునఁ, గూడెడు నెడఁ దజ్జలంబు గొనకొని విడుతున్. 271

చ. వదనభుజోరుపాదముల వర్ణచతుష్టయమున్ యుగాదియం
దొదవ సృజింతు ఋగ్యజుస్సూక్తులు సామము నయ్యథర్వమున్
విదితముగా మదీయముఖవీథుల నుద్భవ మొందు నన్నియుం
దుదిఁ బరివర్తనక్రమవిధూతము లై ననుఁ జేరుఁ గ్రమ్మఱన్. 272

క. అనహంకృతు లక్రోధను, లనసూయులు సంగరహితు లధ్యాత్మవిదుల్
ఘనసత్త్వాత్మకులు మహా, మునులు ననుం గొల్తు రెప్డు మోక్షాపేక్షన్. 273

తే. అఖిలనక్షత్రతారాగ్రహములు గగన, పవనదిశలును మత్స్వరూపములు వినవె
సకలరత్నాకరంబులు శయ్య గాఁగ, నిత్యసుఖలీలమై శయనింతు నేను. 274

క. దానము సత్యంబు తపో, జ్ఞానాహింస లనఁ బరఁగుసాత్త్వికగుణసం
తానముఁ గామక్రోధా, జ్ఞానంబులు మన్మయములు సంయమివర్యా. 275

క. విను మింకఁ బెక్కుమాటలఁ, బని యేటికి జగమునందుఁ బ్రకటితముగఁ గ
ల్గినయదియు నేన లేనిది, యును నే నని నిశ్చితముగ నూహింపు మదిన్. 276

ఉ. ఎప్పుడు ధర్మహాని యగు నెప్పు డధర్మము మీఱుఁ గ్రూరు లై
యెప్పుడు దైత్యు లుబ్బుదురు హీనతఁ బొందుదు రెప్డు వేల్పు లే
నప్పుడు సత్కులీనులగృహంబుల నుద్భవ మొంది లీలమై
నెప్పటియట్ల నిల్పుదు సురేంద్రుల నంచితధర్మపద్ధతిన్. 277

క. సితరక్తనీలపీత, ద్యుతివిలసితరూపములఁ జతుర్యుగముల నేఁ
గృతమతిఁ జరియించి సమం, చితధర్మస్థాపనంబు సేయుదు ననఘా. 278

మత్తకోకిలము. కాలచక్రము నిర్వికల్పము గాఁగ నే నొనరింతు ను
స్ఖలితక్రమవిక్రమైకసమృద్ధి నై లయవిక్రియా
వేళ నింతయు సంహరింతుఁ బ్రవృద్ధయోగబలోల్లస
త్కాలరూపము దాల్చి దుర్వహగర్వనిర్వహబుద్ధి నై. 279

క. నాతెఱఁ గంతయు నిప్పుడు, చేతోముద మొదవ నీకుఁ జెప్పితిఁ ద్రిజగ
ద్ధాత యగుపితామహుఁడును, జాతుఁడు నాయొడలఁ జక్క సగ మని కనుమీ.

వ. నారాయణాభిధానుండ నైనయేను బాలరూపంబున శంఖచక్రగదాధరుండ నై యేకార్ణవంబునందు మహాయుగసహస్రమయం బయినకాలంబున యోగనిద్రాపరవశుండ నై యుండుదు నిట్టిదారుణకల్పాంతంబు సూచి నీవు భీతుండ వగుటెఱింగి నీవలనియనుగ్రహంబున నాత్మగుప్తంబు లైనసకలలోకంబులు నీకుం గనునట్టితెఱంగుఁ గావించితి నింక నిశ్శంకహృదయుండ వయి వలసినయెడం జరియింపుము మదీయనాభికమలకర్ణికాశయనుం డయి యున్న చతురాననుండు మేల్కని సృజియించులోకంబు లేర్పడం జూచెద వని యానతిచ్చి యద్దేవుం డంతట నంతర్హితుం డయ్యె నత్యంతవిచిత్రం బైనయీవృత్తాంతం బంతయు నాకు

ననుభవగోచరం బైనయది. 281

శా. నా కష్టెఁ బొడసూపెఁ దాను గృపతో నాఁ డందు నేఁ డియ్యెడన్
నీకున్ గాదిలిచుట్ట మై సచివుఁ డై నెయ్యంబు నై యున్నపు
ణ్యాకారుం గమలాయతాక్షుఁ గరుణైకాయత్తు సత్యోత్తమ
శ్లోకుం గృష్ణునిఁ గంటి నాసుకృతముల్ శోభిల్లెఁ బక్వంబు లై. 282

క. ఈదేవదేవుకరుణం, గాదే కురునాథ నిర్వికారుఁడ నై నిః
ఖేదుఁడ నై యుండుదు దే, వాదివివిధభూతవిలయ మయ్యెడునపుడున్. 283

తే. అనఘ యిద్దేవుసన్నిధి యగుటఁ గాదె, నాకుఁ బూర్వవర్తనకథనంబునందు
బోధమిప్పుడుగల్గె నిప్పుణ్యుఁ బరమ, పురుషుఁ బ్రభవిష్ణుఁ గృష్ణుని శరణుసొరుము.

మార్కండేయుఁడు ధర్మరాజునకుఁ గలియుగధర్మంబులు సెప్పుట.

వ. అనిన విని ధర్మనందనుం డనుజసహితుం డై కృష్ణునిం బ్రశంసావచనంబుల నభి
నందించి మార్కండేయుం జూచి మునీంద్రా భవత్ప్రసాదంబున నత్యద్భుతకథా
శ్రవణపరితోషితుల మైతిమి కలియుగంబున సకలధర్మలోపం బగు నని చెప్పి
దురు తత్ప్రకారం బెఱింగింపవే యనిన నతం డతని కిట్లనియె. 285

క. కృతయుగంబునందు ధర్మువు, చతురంశంబులను బరఁగఁ జనుఁ ద్రేతాది
త్రితయమున నొక్కఁ డొకఁ డుగఁ, బ్రతియుగమునఁ దఱుఁగఁ దొడఁగుఁ బాళులువరుసన్.

వ. అట్లగుటం జేసి ధర్మంబు చరమయుగంబునఁ గరంబు దుర్లభం బయి పాదమాత్రా
వశిష్టం బయి యుండుఁ దత్ప్రవర్తనం బాకర్ణింపుము. 287

సీ. సత్యంబు నరులకు సంక్షిప్త మగు సత్య, హాని నాయువు గడు నఱిగి పోవు
నాయువు దఱిఁగిన నల్పంబు లగు విద్య, లల్పవిద్యుల విమోహంబు మిగులు
మోహంబువలనఁ బైముసరు లోభంబు లో, భావేశమునఁ గామ మగ్గలించుఁ
గామంబు పెంపునఁ గడఁగుఁ గ్రోధంబు క్రో, ధంబున వైర మెంతయును బెరుఁగు

ఆ. వైరమున నశేషవర్ణులు నన్యోన్య, పీడ సేయుచును విభిన్నబుద్ధి
నొక్కఁ డొకని మేర నుండక వర్ణసం, కరము సేయఁ గలరు కలియుగమున.

క. జపనియమస్వాధ్యాయ, ప్రపంచములు విడువఁ గలుగు బ్రాహ్మణులు జనా
ధిప శూద్రులు విపులతపః, కుపితులు గాఁ గలరు వినవె కలికాలమునన్. 289

మ. వివిధవ్యాఘ్రమృగోరగాకులము లై విస్తీర్ణ శూన్యాటవీ
నివహాభీలము లై యరాజకము లై నిర్మూలధర్మంబు లై
ద్రవిడాభీరతురుష్కబర్బరపుళిందవ్యాప్తిదుష్టంబు లై
భువిలో నెల్లెడఁ బాడగున్ జనపదంబుల్ దద్యుగాంతంబునన్. 290

క. క్షత్త్రియజాతులు శూద్రచ, రిత్రంబున శౌర్యమును సిరియుఁ దేజంబున్
మైత్రియును లేక చెదరి ధ, రిత్రీశ్వర శూన్యు లై చరించెదరు ధరన్. 291

క. రసగంధద్రవ్యంబులు, పస చెడు సస్యంబు లల్పఫలము లగు మహిం

బసిఁపాఁడి దఱుఁగుఁ దరువులఁ, గుసుమఫలంబులును గరముఁ గొంచెంబులగున్.

క. అరులు మిగులఁ గొని రాజులు, నరులకు నెంతయును భయ మొనర్తురు ధరణీ
సురులు గడఁగి వాణిజ్యముఁ, గరిసనమును జేయఁగలరు కలికాలమునన్. 293

సీ. పాషండదర్శనబహుళంబు లై యుండు, వర్ణాశ్రమంబులు వసుమతీశ
తవిలి శరీరంబుఁ దద్దయుఁ బోషింతురు, పుణ్యఫలంబులు బొంకు లనుచుఁ
గాలంబుతోఁ గూడఁ గల్గవు వానలు, పొల్లు లై బీజముల్ పొలిసి పోవుఁ
గ్రయవిక్రయంబులఁ గపటంబు దఱచగుఁ, గడఁగి యిల్లడసొమ్ము లడఁచికొండ్రు

ఆ. సాధుచరితు లైన జనులు దుర్గతుల రోఁ, గములఁ దెగుదు రల్పకాలమునన
పాపపరులు లగ్గుఁ బరమాయువును నరోఁ,గతయు సిరియుఁ బొందఁ గాంతు రెందు.

క. ఉఱవగు[1]నారుగపంటలు, గొఱియలపాఁడియును దఱచగుం బురుషులకుం
దెఱవల చుట్టము లయ్యెద, రెఱచియ భుజియింతు రర్థి నెల్లజనంబుల్. 295

క. పితృదైవతకార్యంబుల, నితరేతరభోక్త లగుదు రెల్లయెడలఁ గు
త్సితదేశకాలపాత్ర, ప్రతతియ వర్తించు దైవపైతృకవిధులన్. 296

క. హేతుప్రత్యయవాదవి, చేతసులై వేదనింద సేయుచును మఖ
వ్రాతంబులు వ్రతములుఁ జెడఁ, బాతురు దుర్మార్గకర్మపరు లై విప్రుల్. 297

మ. వనితాదుర్బలదీనబంధుజనసర్వస్వాపహారుల్ సుహృ
జ్జనమాతాపితృపుత్త్రహంతలు యదృచ్ఛాకర్మశీలుర్ ధరఁ
జనసంపూజితు లై చరింతురు వినష్టశ్రీకు లై విప్రులా
జనులం జేరి పరిగ్రహించెద రవజ్ఞాపూర్వదుర్వృత్తముల్. 298

మ. ధరణీరక్షణ మాచరింపక నృపుల్ దర్పంబునం బశ్యతో
హరు లై సాధుల దోఁచి చేకుఱుతదీయస్త్రీధనక్షేత్రముల్
హరియింపం గలవారు దారుణతరం బై పెల్లు చెల్లుం బర
స్పరవైరంబు ధరాతలేంద్రులకు విశ్వప్రాణినాశంబుగన్. 299

క. సుతుఁ డవమానించు జనకుఁ, బతి నవమానించు భార్య పడఁతులుఁ బతులఁ
మతి నొండొరువుల మెచ్చక, సతతముఁ జరియింతు రిష్టసంచారములన్. 300

క. నడవవు దేవపితృక్రియ, లుడుగును వేదార్థసమ్యగుపదేశంబుల్
గడఁగు [3]మహామోహతమము, పుడమి సమస్తంబుఁ గుజనభూయిష్ఠ మగున్.

సీ. పదియాఱువర్షముల్ పరమాయు వయ్యెడు, ధరణీశ కలియుగాంతమున వినవె
యేడు నెన్మిదియును నేండ్లప్రాయంబునఁ బ్రజ లుద్భవింతురు భామినులకు
ద్రవిణవిహీను లై దాత యొక్కఁడు లేక, యన్యోన్యతస్కరు లగుదు రెందు
నెఱిఁగెడువారును నెంతయుఁ గ్రూరు లై, చెనసి పాపంబు సేసెదరు సూవె

తే. యన్నవిక్రయ మొనరింతు రఖిలజనులు, వేదవిక్రయు లగుదురు విప్రవరులు

1. క. గ. జ. నారికపంటలు. 2. గ. దోఁచి. 3. క. సు మోహతమంబులు.

న్యాయోనుల యగుదురు పద్మముఖులు, కష్టతర మైనయక్కలికాలవేళ.

తరువోజ.

ఉక్కున శూద్రులు క్రూరులై కవిసి యొండొండ పెక్కండ్రు నుఱికి చంపుటయు
దిక్కెవ్వరును లేక దీనులై వసుమతీసురుల్ నాలుగు దెసలఁ బాఱెదరు
మ్రుక్కడిచోరులు ముట్టి నిశ్శేషముగ ధనావలిఁ గొని మొగి వధింపంగ
స్రుక్కి కాకులయట్లు శూన్యులై చెదరి సాంపఱి యడవులు సొత్తురు జనులు.

క. శ్రుతిధర్మంబులు శూద్రులు, ప్రతిభం జెప్పంగ వినుచు బ్రాహ్మణజాతుల్
ధృతి సెడి తత్సేవకులై, యతినిందితకర్మకారు లయ్యెద రధిపా. 304

మత్తకోకిలము. దేవతాయతనంబులుం జగతీసురావసథంబులుం
బావనాశ్రమభూములుం జెడి పాడగుం శుభవృక్షవ
ల్లీవనంబులు నాశ మొందుఁ గలిప్రచారమునందు దు
స్త్రీవిహారము మద్యపానముఁ జెల్లుఁ బెల్లుగ నెల్లెడన్. 305

క. గురుఁ గొనియాడఁడు శిష్యుఁడు, గురుఁడును శిష్యునెడ వంచకుం డగు మది నొం
డొరువుల నొల్లరు బంధులు, పొరిఁబొరిఁ గఱవులగుఁ బ్రజకుఁ బాడము నుభయముల్.

తే. ఇవ్విధంబున ధర్మంబు లెల్ల నపగ, తమునఁ బడ జను లెల్లను దల్లడిల్ల
బహువిధోత్పాతములు పుట్టుఁ బార్థివేంద్ర, కడఁగి తత్కలికాలసంక్షయమునందు

క. క్రమమున రాష్ట్రములును నగ, రములును నాశంబు నొందు రక్షాచ్యుతులై
భ్రమియింతురు జను లతిదు, ర్గమగిరిసరిదంతికములఁ గడు నాతురులై. 308

కలియుగంబున విష్ణుఁడు గల్కిరూపంబున ధర్మంబు ప్రతిష్ఠించుట.

వ. అంతఁ గలియుగాంతంబునందు భువనవిదితం బయిన శంబళగ్రామంబున విష్ణుయశుం డను పేర విష్ణుండు కల్క్యాత్మకుం డయి జనియించి సంస్మరణమాత్రన వేదశాస్త్రంబులును సమస్తశస్త్రాస్త్రవిశేషంబులు నధిగమించి సార్వభౌముం డయి. 309

మధ్యాక్కర. అసదృశతేజుఁడు బ్రాహ్మణానీకసహితుఁడై కడఁగి
వసుమతియందు నధర్మవర్తులై యున్నమ్లేచ్ఛులను
మసలక నిజశక్తిఁ జేసి మడియించి ధర్మంబు నిలిపి
వసునిభుం డొనరించుఁ బేర్మి వాజిమేధము నిష్ఠ యొప్ప. 310

క. ఘనుఁ డిల యెల్లను బ్రాహ్మణ, ధనముగ భాగించి యిచ్చి ధర్మయశోవ
ర్ధనుఁడై వార్ధకమున న, త్యనఘుండు దపోవనంబునందు వసించున్. 311

వ. అతనిచేతం బ్రతిష్ఠితం బయిన ధర్మంబు ననుసరించి బ్రాహ్మణాదివర్ణంబులు సమర్యాదంబులై వర్తింపం గలయవి దానఁ జేసి కృతయుగంబు ప్రాప్తం బగు నందు.

శా. ఆరామప్రజచైత్యసద్మవనదేవాగారసౌమ్యంబులై
భూరిబ్రహ్మతపస్విసంకులములై పుణ్యాధ్వరారంభసం

భారోదారము లై నితాంతఫలితభ్రాజిష్ణుసస్యంబు లై
యారూఢస్థితి నెల్లదేశములు నొప్పారుం బ్రకాశంబుగన్. 313

క. సమయముతోడఁ గురియువర్షములు గరము తేజ మెక్కి చరియించు నవ
శ్రీములై గ్రహంబు లారోగ్యము సౌఖ్యము సమధికముగఁ గలుగు నరులకున్.

వ. ఇది కృతయుగప్రవర్తనంబు త్రేతాద్వాపరయుగద్వితయంబునందును ధర్మంబ
వర్తిల్లు నిట్టితెఱంగునం గాలగతు లనేకంబులు నాకుం బ్రత్యక్షసిద్ధంబు లయ్యె
నీ వడిగినయతీతానాగతంబు లయినవిశేషంబు లెఱింగించితి నింక నొక్కహి
తోపదేశంబు సేసెద నాకర్ణింపుము. 315

క. ధరణీసురులకు నెప్పుడుఁ, గరముప్రియము సేయు మయ్య కౌరవవంశో
త్తర విప్రులు సంతుష్టిం, బొరసినఁ జేకుఱు నశేషపుణ్యఫలంబుల్. 316

సీ. సకలభూతములందు సదయాత్ముఁడవు గమ్ము, పాలింపు ప్రజల నీప్రజలఁ బోలె
వితతవృద్ధాచారవేది వై ధర్మంబు, సలుపుము దురితవర్జనము సేయు
[1]మెఱుఁగమిఁ బాప మొక్కించుక దొడరినఁ, జట్ట సంప్రతికారశాలి వగుము
గర్వంబు విడువుము గరము ప్రియంబును, నిజమునుగా వచోనియతి నడపు

తే. కాలగతు లెల్ల నెఱిఁగి యస్ఖలితబోధ, యుక్తుఁడవుగమ్ము భరతవంశోద్భవుఁడవు
నీవు గావున నత్యంత,నిర్మలుఁడవు, ప్రాజ్ఞుఁడవు నీకు వేఱ చెప్పంగ నేల. 317

వ. అనిన విని మునీంద్రా నీయానతిచ్చినవాక్యంబు లన్నియు నవహితుండ నై వింటి
నింతకు మున్ను నాయొపిన తెఱంగున లోభమాత్సర్యాదిదుర్గుణంబులు పరిహ
రింతు నింకను భవదుక్తం బైనధర్మశాసనంబును బ్రయత్నంబునం బాలిం
చెద నని యతనికి యుధిష్ఠిరుండు ప్రణమిల్లి మఱియును బ్రాహ్మణప్రభావంబు
వినువాఁ డై యతనిం బ్రార్థించినఁ దద్విషయం బైనయితిహాసం బతనికి నమ్మహా
ముని యి ట్లని చెప్పె. 318

మార్కండేయుఁడు ధర్మరాజునకు బ్రాహ్మణప్రభావంబు సెప్పుట.

చ. ఘనుఁడు పరిక్షితుం డనఁ బ్రకాశితుఁ డై నమహీవిభుండు భా
నునిభుఁడు భానువంశ్యుఁడు వినూతనకీర్తి యయోధ్య యేలువాఁ
డనుపముఁ డొక్కనాఁడు మృగయారతుఁ డై [2]చరియించెఁ గానన
మ్మున నొకరుండ యిమ్ముల నపూర్వజవప్రగ్రహయాధిరూఢుఁ డై. 319

వ. ఇవ్విధంబునం జెక్కుమృగంబుల పథియించుచుఁ గ్రమ్మరువాఁ డొక్కయెడ.

ఆ. మదగజాభిరామమృదులయానం బొప్ప,నల్లఁ బొలయుచును లతాంతరములఁ
గరము లీలఁ గమ్మవిరులు గోయుచునున్న,పువ్వుఁబోఁడి నొక్కపొలఁతిఁ గనియె.

క. కని యంతఁ గదిసి యాకా, మినియొప్పులఁ జూడ్కి దగుల మీఱినతమకం

1. క. మెఱుఁగనిపాప. 2. జ. చరియించుచుండెఁ గా, వనమున నొక్కరుం డయి తెంపర్చిన
వాఁడు హయాధిరూఢుఁ డై.

బున ననిమిషలోచనుఁ డై, జననాథుఁడు మదనబాణసంహతిఁ దూలెన్. 322

వ. అదియును నతిసుందరం బై నతదీయమూర్తివిభవంబునకు మెచ్చి సాభిప్రాయం బుగా నవలోకించె నంత నమ్మహీకాంతుం డక్కాంత కి ట్లనియె. 323

ఉ. ఎవ్వరిదాన వంబుజదళేక్షణ యేకత మిట్టు లేల నీ
వివ్వనభూమియందుఁ జరియించెదు నావుడు దండ్రి పంపునం
దివ్వనభూమియందుఁ జరియించెద నద్వరుఁ గోరుకన్య నే
నెవ్వరిదానఁ గా వలయు నేర్పడఁ జెప్పుము రాజనందనా. 324

వ. అనిన దానిప్రగల్భవచనంబులకు నధికవిలోలుం డై భూపాలుండు దనయభిలాషం బెఱింగించిన నమ్మగువ నన్నెన్నండును జలవిహారంబునకుఁ జొనుప కుండునది య ట్లయిన నిన్ను వరియించెద ననిన వాఁడును దత్సమయంబున గొండంబడి దానిం దోడ్కొని పురంబునకుం జనుదెంచి యిష్టసుఖతత్పరుం డయి యుండె నంత నొక్కనాఁడు శరత్సమయంబునందు. 325

చ. అతులితపుష్పపల్లవఫలాన్వితభూరుహభూరివల్లరీ
వితతముఁ జారు కైరవకవీనసరోరుహషండమండలా
యతసరసీమనోహరము నై నపురోపవనంబునన్ సము
న్నతవిభవుండు వాసభవనంబు లొనర్పఁగఁ బంచి యిమ్ములన్. 326

క. దేవీసహితంబుగఁ బృథ్వీవరుఁ డవ్వనమునందు విహరించె ఘనాం తావసరవాసరంబుల, భావితపద్మవనపవనపరిచితుఁ డగుచున్. 327

వ. అంత నొక్కనాఁడు నితాంతఘర్మజలకణకరాలితశరీరుం డై ప్రియాసమేతంబుగా వాసగృహంబు వెలువడి తత్సమీపంబున నతిమనోహరం బయినకమలాకరంబు గని దానితీరంబున నయ్యుగ్మలి నునిచి దాను గృతావగాహుం డై. 328

క. మే లై యున్నది జలము వి, శాలనయన చెమట యొడలఁ జయ్యన దేహ
తాళన మొనరింపు మనిన, నాలేమ దరస్మితాననాంబుజ యగుచున్. 329

ఆ. మడుఁగు సొచ్చి మునిఁగి మాయమై పోయిన, నద్భుతాత్ముఁ డగుచు నవనివిభుఁడు
మడుఁగు గలయ వెదకి మానినిఁ గానక, జలము లెల్ల వెడలఁ జల్లెఁ గడఁగి. 330

వ. ఇట్లు నల్లియందు మండూకంబు లనేకంబు లున్నం జూచి యివి మత్ప్రియాంగ నను మ్రింగినవి గా కేమి యని కలుషించి యనుచరులం బిలిచి నాకుఁ బ్రియం బు సేయ వలసినవారు గలిగినం బుడమిం గలకప్పల నెల్లం బొడ వడంచునది యని పంచిన నలుదిక్కులకుం జని తదీయకింకరవర్గంబు. 331

చ. కొలఁకుల వాఁగులన్ నదులఁ గ్రోవుల బావుల నిర్ఝరంబులం
గలయఁగ రోసి రోసి వడిఁ గప్పలఁ గుప్పలుగా వధించుచో
నలుగుల మందుభేకనివహంబు గనుంగొని భేకనాయకుం
డలఘుతపస్విరూపమున నానృపుపాలికి వచ్చి యి ట్లనున్. 332

ఉ. అక్కట లోక మెల్ల నగ నాఱడికప్పలఁ జంప దీన నీ
కెక్కడి పెంపు గల్గుఁ బృథివీశ్వర కోపము డింపు కప్పలం
జక్కనిచూడ్కిఁ జూడు మిది చాల నధర్మము నావుఁడున్ విభుం
డెక్కడిమాట నామదికి నెగ్గొనరించెఁ గడంగి భేకముల్. 333

క. నా యిష్టవనిత మ్రింగిన, మాయపుఁబుర్వు లివి పేని మడియింతు మునీం
ద్రా యరుగుము నీ వనుటయు, నాయన యత్యంతదుఃఖితాత్ముం డగుచున్.

వ. ఏను మండూకనాయకుండ నాయు వనువాఁడ నమ్మగువ నాకూఁతురు సుశోభన యనునది దానిచేత ననేకులు బేలుపడిరి నీ వెంతవాఁడ వనిన నప్పరిక్షితుం డట్లేని నాకు నమ్మెలఁతుకఁ దెచ్చి యొప్పింపవలయునని ప్రార్థించిన నతండు నవ్వుచు నవ్వా మనయనం దనతలంపున రావించి యారాజునకు నిచ్చి దానిం జూచి కోపించి నీవు గడుంజెట్టవు ప్రసిద్ధు లగురాజులం జెక్కుండ్రం [1]బెనవెట్టితివి గావున నీకుం బుట్టెడుకొడుకులు గపటవర్తను లయ్యెదు మని కూఁతు శపియించి మండూకరాజు నిజేచ్ఛం జనియెఁ బరిక్షితుండును సంప్రాప్తమనోరథుం డయి సుశోభన యందుఁ గ్రమంబున శలుండును దలుండును వలుండును ననుమువ్వురుగొడుకులం బడసి యం దగ్రజుం డయినశలు నభిషిక్తుం జేసి తపోవనంబున కరిగె నంత.

క. శలుఁ డొక్కనాఁడు కనకో, జ్జ్వల మగురథ మెక్కి వేఁటకని పెక్కుమృగం
బులఁ జంపఁగ నొక్కమృగం, బలఘుతరశరాగ్రవిద్ధ మై వెసఁ బఱచెన్. 336

ఆ. ఇట్లు వఱచుటయును నెంతయురయమున, నమ్మృగంబు వెనుక నరిగి యరిగి
యెయిద లేక ధారుణీశుండు సారథి, బదరి తేరు వేగ పఱవు మనియె. 337

సీ. అనవుడు సూతుఁ డిట్లను దేవ మన మెంత, దఱిమిన మృగము దద్దయు జవంబు
గలదు రథ్యంబులు గడుకొని కూడంగఁ, జాలవు వలవనిజాలి యేల
మన తేరిహరులు వామ్యము లైన నమ్మృగ, మగపడు లే కున్న నలవి గాదు
నా విని వామ్యముల్ నాఁగ నెవ్వనిహయంబులు సెప్పుమనియె నక్ష్మావిభుండు

తే. వామదేవమహామునివరునిహరులు, వామ్యములు నాఁగఁ జనునని వాఁడు సెప్పె
నతనియాశ్రమ మెచ్చట నచటికిపుడ, తేరు వోవని మ్మనియె ధాత్రీవిభుండు.

వ. వాఁడును రథంబు సత్వరంబుగా వామదేవునాశ్రమంబునకుం బఱపినం జని యాతం డాతపోనిధిం గని నమస్కరించి మునీంద్రా నాచేత నేటువడి యొక్క మృగంబు రయంబునం బఱచె నమ్మృగంబు నెయిది వధియింప వలయు భవదీయ హయంబుల నీవె యనిన నతండు నీవు కృతకార్యుండ వై మాహయంబులం దడయక యొప్పింపవలయు న ట్లయినం గొనిపొమ్మనిన వల్లె యని వామ్యంబులం గొని రథయుక్తంబులం గావించి తదీయజవంబునకు మెచ్చుచు ముహూర్తమాత్రంబునఁ గూడ ముట్టి యమ్మృగంబు సమయించి మగిడి నిజపురంబునకు వచ్చి.

క. 1. జిక్కులం బెట్టితివి.

మత్తకోకిలము. రాజయోగ్యము లైనయీహయరత్నముల్ జవసత్త్వవి
భ్రాజితంబులు వాని కేటికిఁ బాలువానికి నంచు నా
రాజు రాజసబుద్ధి నంతిపురంబునం దిడఁ బంచె న
వ్వాజియుగ్మము వేడ్క నూనినవాఁడు దోస మెఱుంగునే. 340

వ. అట వామదేవుండును దనయశ్వంబుల శలుండు గొని పోయి మగుడ నొప్పింపక తడయుటయు నాత్మగతంబున. 341

తే. రాజపుత్త్రుండు బలియుండు రాజసుండుఁ, గొండుకాతండు వేడుకఁ గొనుచు నరిగె
నశ్వములఁ గ్రమ్మఱఁగ నిత్తు ననువిచార, మెవ్విధంబున నతనికి నేల కలుగు.

వ. అని శంకించి నిజశిష్యుం డాత్రేయుం డనువానిం జూచి శలుండు మనవామ్యంబులం గొనిపోయి యొక్కమాసం బగుడెంచె వాఁడును దనయంతఁ దెచ్చుట గలుగ నేరదు నీ వరిగి మనతురంగరత్నంబులం గొని రమ్మని పంచిన నతం డప్పుడ కదలి యయోధ్యకుం బోయి. 343

క. మనుజపతిఁ గాంచి యాతఁడు, మునిపతి పుత్తేర నధిపముఖ్య యిచటి కేఁ
జనుదెంచితి మాహయముల, నెనసిన నెయ్యంబుతోడ ని మ్మనియెఁ దగన్. 344

క. అనవుడు శలుఁ డి ట్లనియెం, జను నినుఁ బుత్తేర నతఁడు సాలుదు వీవుం
గొనిపోవఁ దురంగంబులఁ, జను మీఁదుర్భాషితములు సైఁపవు మాకున్. 345

వ. అనిన నమ్మునికుమారుండు గ్రమ్మఱి చని గురునకు నవ్విధం బెఱింగించిన వామదేవుండు క్రోధపరీతచేతస్కుం డై శలునిపాలి కరిగి యి ట్లనియె. 346

క. ఇమ్ము నరేశ్వర మాతుర, గమ్ముల నీకార్య మయ్యెఁ గాదే కడులో
భమ్మున నొండ్లవి సొమ్ములు, రమ్మనిన వచ్చునే యెరవు సత మగునే. 347

క. పరధనహరణము దురితము, పరికింపుము వరుణుచేతిపాశంబుల ని
ష్ఠురముగఁ గట్టువడకు ని, ర్భరనరకకృశానుశిఖలఁ బడకుము మీఁదన్. 348

చ. అనుటయు నాతఁ డి ట్లనియె నాఱడివిప్రుల కేల యశ్వముల్
ఘనతరసత్త్వమూర్తు లనఁ గాఁ దగు నెడ్లను రెంటి నిచ్చెదన్
విను మటు గాక బల్లిదపువేసడముల్ వల తేని నిత్తుఁ గై
కొనుము కడంగి వామ్యములఁ గోరక పొ మ్మృషియాన లేటికిన్. 349

క. అనిన నిది యేటిమాటలు, వినువారలు నవ్వ నకట విప్రులధనముల్
గొని వేఱ యొండు నిచ్చెద, నను టిది యేనాఁటిచందమని ముని పెలుచన్. 350

క. పలుకుటయు నలిగి శలుఁ డీ, ప్పలుగుదపసి నంటఁ గట్టి పటుశూలములం
బొలియింపుఁ డనుచు భీకర, బలుల నియోగించెఁ దనదుపార్శ్వజనములన్. 351

వ. అంతయుం జూచి వామదేవుండు ఘనరోషభీషణప్రహాసదుర్నిరీక్షణరూక్షముఖుం డగుటయు నాక్షణంబ ఘోరాకారులగు రాక్షసు లనేకులు పుట్టి నిశాతశూలంబుల నాభూపాలుం బొడిచి కాలగోచరుం జేసిరి మునీంద్రుండు నిజేచ్ఛం జనియెఁ దద

నతరంబ శలానుజుండు దలుం డనువాఁడు నిజరాజ్యపట్టబద్ధుండై సుఖం బుండఁ
గొంతకాలంబునకు వామదేవుండు సనుదెంచి వానిం గని మహాత్మా నీవు ధర్మ
పరుండవు ధర్మువు దప్ప నోడు దేని నాహయంబుల నిమ్మనుటయు దలుం డలిగి
నిజసమీపంబున నున్న సారథిం జూచి యిట్లనియె. 352

సీ. కడుఁ గ్రొవ్వి తేఁకువ సెడియె నీపాఱుండు, వీఁకమై నిప్పుడు వీనిఁ బొమ్ము
ప్రయ్యంగఁ జేసెదఁ జయ్యన విషదిగ్ధ, సాయకమును శరాసమ్ముఁ దెమ్ము
నావుడు నమ్మహీదేవుండు నగుచు ని, ట్లనియె న న్నేయఁ దె మ్మనినవిశిఖ
మంతఃపురమ్మున సంతసంబున నున్న, ఘను భవత్సుతుఁ దున్మఁ గాక యిపుడ

తే. యనఁగఁ దదనంతరంబ ఘోరాస్త్రనిహతుఁ
డయినయబ్బాలుఁ గొంచు హాహారవంబు
లెసఁగ నంతిపురంబువా రెల్ల వచ్చి
రది ధ్రువంబుగఁ గనియును నవ్విభుండు. 353

వ. కోపాటోపావేశమానవిగ్రహుం డగుచుఁ దనదురాగ్రహంబు విడువక తనసమీప
వర్తులం జూచి. 354

మ. వినుఁడీ సర్వజనంబులుం గడఁగి యీవిప్రుఁ దురాలాపు దు
ర్జనునిం దున్మెద నస్మదీయకమహాచాపోగ్రనిర్ముక్తబా
ణనిపాతచ్ఛిదురాంగరక్తజలశోణక్షోణిసంసుప్తుఁ గాఁ
గనుఁడీ యీదురితాత్ము నంచు నతిశీఘ్రప్రాప్తకోదండుఁ డై. 355

క. శర మరిఁ బోయుటయును ద, త్కరయుగ్మము బాణకార్ముకంబులతోఁ జె
చ్చెర సంస్తంభము నొందుడు, నరనాథుఁడు విస్మయోపనతమానసుఁ డై. 356

క. పుల్లవడి చలము రోషముఁ, బొల్లయునై చనఁగఁ గొంతప్రొద్దు మొగమునఁ
వెల్లఁదనము గదుర నిలిచి, యెల్లజనులు వినఁగ మఱియు నిట్లని పలికెన్. 357

ఉ. ఆడితిఁ బెక్కుమాట లవి యన్నియు వమ్మయి పోయె నస్త్రసం
తాడనశక్తి గీడ్పడియెఁ దథ్యము బ్రాహ్మణశక్తి యెక్కుడే
నోడుదు వామదేవునకు నోజనసంఘములార సజ్జనా
మ్రేడితకీర్తి నిమ్ముని నమిత్రనిషూదను నాశ్రయించెదన్. 358

వ. అని యివ్విధంబున నతం డేటు దప్పిన జోహారు వెట్టుటయుఁ దదీయబంధుమిత్ర
జనంబులు భయసంభ్రమంబులతో నమ్మునినాథు శరణుసొచ్చి యనునయించినఁ
బ్రసన్నుం డై యమ్మహాత్ముండు దత్కరయుగస్తంభనంబు మాన ననుగ్రహించి
తదీయనందనుప్రాణంబు లొసంగె నంత నమ్మహీకాంతుండు నిజభార్యాబంధుజన
సహితంబుగా నతనికిఁ బ్రణమిల్లి హయంబులఁ దెచ్చి యొప్పించినం గైకొని
వామదేవుం డరిగె నిట్టిది బ్రాహ్మణప్రభావం బని చెప్పిన విని. 359

క. మునిపతికి మ్రొక్కి కుంతీ, తనయుఁడు మీకంటె వృద్ధతముఁ డగుపురుషుం

డనఘా కలఁడె జగమ్మున, నని యడిగిన నాతఁ డిట్టు లని యెఱిఁగించెన్. 360

క. ఘనుఁ డింద్రద్యుమ్నుం డను, జనపతి గలఁ డాతఁ డింద్రసదనమున ముదం
బున నుండఁగ బహుకాలం, బున నాతనికీర్తి లోకమున మాఁయుటయున్. 361

మార్కండేయుఁడు ధర్మజునకు నింద్రద్యుమ్నుచరిత్రము సెప్పుట.

తే. అమరు లిచ్చోట నుండ లేవరుగు మనుచు, నుర్విఁ ద్రోచిన నతఁడు నాయున్నకడకు
నర్థిఁ జనుదెంచి యిట్లను ననఘ నన్ను, నిద్ధపుణ్యు నింద్రద్యుమ్ను నెఱుఁగుదయ్య.

సీ. అనుడు నిట్లంటి నే నయ్య నిన్నెఱుంగంగఁ, జాలన య్యెడ హిమశైలశృంగ
వాసియై యుండు ప్రావారకర్ణుం డను, పేరిఘూకము గడుఁ బెద్దయదియు
నాకంటె నిన్ను నిర్ణయముగ నెఱుఁగుఁ బొ,మ్మనుటయు నన్నురమ్మనియె నతఁడు
ఘనరసాయనగుటికాప్రయోగంబున, దేహతాపంబు వర్తిల్లె నిందుఁ

తే. గడఁగి రాఁ జాల నేనంటిఁ గడఁగి యన్న, రేంద్రుఁ డశ్వమై ననుఁ బ్రీతి నెత్తికొనుచు
నయ్యులూకముపాలికి నరిగి నన్ను, నడిగినట్టుల దానిఁ దా నడుగుటయును.

వ. అదియునుం గొండొకసేపు దలపోసి చూచి యేను నిక్కువంబుగా నిన్నెఱుంగ
నేర నింద్రద్యుమ్నుం బనుకొలనియందు నాళీకజంఘుం డను పేరిబకవల్లభుండు
వసియించు నవ్విహంగంబు నాకుఁ బెద్ద నిన్నెఱుంగు నరుగు మనిన నమ్మనుజపతి
నాతోడ నయ్యులూకంబు మోచికొని నాళీకజంఘునొద్దకుం జని తన పేరు సెప్పి
నన్నెఱుంగుదే యనిన నదియు నేనిన్నెఱుంగం జాల నాకంటెఁ జిరకాలజీవి
యైనయకూపారుం డనుకచ్ఛపంబు గల దదియును నిక్కొలన నుండు నజ్జలచరము
నిన్నెఱుంగం జాలు నడిగి చూతము గాక యని యక్కుమారంబుఁ బేర్కొని యిది
యొక్కసందేహంబు నిర్ణయించుటకయి యీయార్యజనంబులు నిన్నుగుఱించి
వచ్చినవారు నీవు సను దేర వలయు నని వేఁడుటయును. 364

తే. కొలను వెలువడి చనుదెంచెఁ గూర్మవిభుఁడు
వార లడిగి రింద్రద్యుమ్నధారుణీశు
నెఱుఁగుదే యన నదియు నొక్కింతసేపు
దలఁచుకొని కన్నుఁగవ నశ్రుజలము లొలుక. 365

వ. ఎలుంగు రాల్పడ వారలం గనుంగొని యిట్లనియె. 366

ఉ. అక్కట నే నెఱుంగనె మహాగుణభూషణు నమ్మహాత్ము న
న్నిక్కడఁ బెక్కుమాఱులు ననేకభయంబులఁ బొంద కుండఁగా
నక్కటికంబుతోడఁ దగ నాతఁడు గైకొని కాచెఁ గాదె పెం
పెక్కినయన్నరోత్తముని నెన్నఁటికిన్ మఱవంగ వచ్చునే. 367

తే. అమ్మహాత్ముండు బహువిధయజ్ఞదక్షి,ణార్థముగ విప్రవరులకు నర్థి నిచ్చు
గోగణంబులగొరిజల గ్రొస్సి యయ్యెఁ, గాదె యీసరోవరము జగన్నుతముగ.

వ. అనినయనంతరంబ దేవదూతలు విమానంబు గొనుచుఁ జనుదెంచి యింద్ర

దుమ్మునం గని మహాత్మా నీకీర్తి జగంబునందు శాశ్వతం బై నిలిచె నీకుఁ ద్రిదివ
నివాసంబు సుస్థిరం బయ్యె నరుగు దెమ్ము విమానం బెక్కు మని మఱియును. 369

క. తనకీర్తి యెంతకాలము, వినఁబడు నిజ్జగమునందు వెలయఁగ నందాఁ
కను బుణ్యలోకసౌఖ్యం, బున నెంతయు నుల్లసిల్లుఁ బురుషుం డనఘా. 370

వ. అనుటయు నమ్మహీకాంతుండు దివిజకింకరులం జూచి యిమ్ముదుసలితాపసుని
వృద్ధవిహంగంబును గార్యార్థంబు సహాయులుగాఁ దెచ్చితి వీరిని నిజస్థానంబుల
నునిచి వచ్చెద నించుక నిలువుం డని వారిచేత ననుజ్ఞాతుం డయి నన్నును
నులూకంబును నెప్పటినెలవులం బెట్టి తానును దేవయానంబునఁ బుణ్యలోకం
బున కరిగె నని చెప్పినఁ బ్రీతుం డై పృథానందనుండు. 371

క. నీకంటె వృద్ధతముల గు, ణాకర యెఱిఁగించి తిది మహాద్భుత మని సు
శ్లోకుఁడు మునివరునకుఁ బు, ణ్యాకృతికిఁ గృతప్రణాముఁ డై కడు భక్తిన్.

మార్కండేయుఁడు ధర్మరాజునకుఁ గువలాశ్వచరిత్రము సెప్పుట.

వ. మునీంద్రా యిక్ష్వాకువంశోద్భవుం డైన కువలాశ్వునకు ధుంధుమారుం డను పే
రెట్లు గలిగెఁ జెప్పవే యని యడిగిన నతం డి ట్లనియె. 373

ఉ. శంకరసన్నిభుండు జనశంకరసత్కరుణాకరుం డనా
తంకుఁ డుదంకుఁ డన్ముని గృతస్థితి నై మరుభూమియందు ని
శ్శంకమతిన్ వసించి యనిశంబును నవ్యయు నచ్యుతున్ మనః
పంకజవేదిపై నిడి తపం బొనరించె ననేకవర్షముల్. 374

తే. అతనిభక్తికిఁ బ్రియ మంది యాదిదేవుఁ, డంబుజాక్షుఁ డధోక్షజుఁ డక్షరుండు
గరుణఁ బ్రత్యక్షమగుటయుఁ గనియతండు, ప్రణతియొనరించియిట్లని ప్రస్తుతించె.

మత్తకోకిలము. దేవదేవ శ్రుతిప్రమాణవిధేయ మాధవ జంగమ
స్థావరాత్మక మైనలోకము సర్వమున్ భవదీయమా
యావిధేయము విశ్వరూపుఁడ వవ్యయుండవు నీవ స
ద్భావసుస్థితి నిన్నెఱింగినఁ బాయుఁ బాపము లచ్యుతా. 376

చ. అనిమిషసిద్ధసంయమివిహంగభుజంగసముఖ్యు లెల్ల ని
న్ననిశముఁ గొల్చి నీదయఁ గృతార్థతఁ బొందుదు రెందు నీవు నె
మ్మనమున సంతసిల్లుదు సమస్తజగంబులు శాంతిఁ బొందు నీ
కినుకకు మాఱు లేదు శివకీర్తన యీభువనత్రయంబునన్. 377

మత్తకోకిలము. విక్రమత్రయలీల నోలిన విష్టపత్రితయంబుఁ బె
ల్లాక్రమించితి క్రూరు లైన సురారివీరులఁ బ్రస్ఫుర
చ్చక్రవిక్రమకేళిఁ ద్రుంచితి సర్వయజ్ఞఫలావహ
ప్రక్రియాత్ముఁడ వీవు నిశ్చలభావభవ్య జనార్దనా. 378

వ. అని మఱియుం బెక్కుభంగులం బ్రస్తుతించినం గరుణించి పాంచజన్యధరుండు

వరం బడుగు మనుటయు నుదంకుండు దేవా భవదీయదివ్యరూపంబుఁ బ్రత్యక్షం బుగాఁ గంటి నింతకంటెను మిగులువరం బెయ్యది గలదై నను నామనంబు నిత్యంబును సత్యధర్మశమంబులయందుఁ దిరంబై నీయందు దృఢభక్తికంబు గావలయు నిదియ నాకు వరంబనుటయు న ద్దేవుండు నీకోరినయట్ల యిచ్చితి మత్ప్రసాదంబున నీకుం బరమజ్ఞానయోగంబును సిద్ధించుం ద్రిలోకహితం బైనకార్యం బొక్కటి నీచేత సాధితం బయ్యెడు నది యెయ్యది యనిన వినుము ధుంధుం డను దానవుండు జగంబుల కుపద్రవంబు సేయంగలవాఁడు తద్వధార్థం బై నీవు బృహదశ్వసూనుం డైనకువలాశ్వు నుద్యుక్తుం జేసెద వన్న రేంద్రుండు మత్ప్రసాదలబ్ధం బైనయోగ బలంబునను భవన్నియోగబలంబుననుం జేసి యయ్యసురం బరిమార్ప సమర్థుం డగు నవ్విశేషంబునకు నీవలన నఖిలలోకంబులు సంతసిల్లెడు నని పలికి విష్ణు దేవుం డంతర్హితుం డయ్యె నుదంకుండును బూర్వప్రకారంబునం దపంబు సేయుచుండె మఱియును. 379

సీ. అనఘుఁ డిక్ష్వాకుఁ డేలెయఖిలభూచక్రంబు, నేలి నాకమునకు నేఁగుటయును
నతనినందనుఁడు శశాదుండు రా జయ్యె, వాఁడు కకుత్స్థుఁ డన్వానిఁ గనియె
నతఁ డనేననుఁ డను నాత్మజుఁ బడసె నా,పృథివీపతికిఁ బుట్టెఁ బృథుఁ డనంగఁ
బృథుఁడు విశ్వకుఁ డను పేరిపుత్త్రుని గాంచె, నతనికి జనియించె నార్ద్రుఁ డనఁగ
తే. నార్ద్రునకుఁ బుట్టె యువనాశ్వుఁ డనుతనూజుఁ
డతనికిని బుట్టె శ్రావస్తి యనువిభుండు
దత్సుతుఁడు బృహదశ్వుఁ డాధరణిపతికి
నుగ్రతేజుండు గువలాశ్వుఁ డుదయ మయ్యె. 380

వ. అక్కువలాశ్వునకు నఖిలాస్త్రశస్త్రవిద్యావిశారదులు నధికసత్త్వసంపన్నులు నైన పుత్త్రు లేకవింశతిసహస్రంబులు వుట్టి రంత బృహదశ్వుండు నిజపుత్త్రుకుం గువలాశ్వుం బ్రాప్తసంతానుఁ నత్యంతధర్మాన్వితు నఖిలమహీరాజ్యభారధౌరేయుంగా నభిషేకించి తపోవనంబునకుఁ బోవ సమకట్టి యయోధ్యానగరంబు వెలువడు నవసరంబున నవ్వార్త విని యుదంకుండు సనుదెంచి బృహదశ్వున కిట్లనియె.

ఉ. నీవు ప్రజాభిరక్షణము నెమ్మి నొనర్పు మరణ్యభూమికిం
బోవఁగ నేల రాజులకు భూప్రజఁ గాచుటఁ బోల ధర్మముల్
భూవర కల్గునే యడవిఁ బోయి వసించినఁ గాని కాదె ర
క్షావిధిఁ గాదె సద్గతులు గాంచిరి తొల్లిటిరాజముఖ్యులున్. 382

క. నీరక్షణంబుకతమున, ధారుణి మముబోఁటిసాధుతపసులు నిత్య
ప్రారంభధర్మకర్మో, దారు లగుట యదియు నీదుధర్మము గాదే. 383

వ. విను మొక్కయద్భుతంబు సెప్పెద మధుకైటభు లనం బ్రఖ్యాతు లైనయసురుల తనయుండు ధుంధుం డనువాఁడు మహాబలపరాక్రమసంపన్నుం డై నిజతపో

బలంబునం బితామహునివలన వరంబు వడసి దేవదానవగంధర్వాదులకు నజ
య్యుండై చరియించుచుండు నయ్యసుర యిపుడు మదీయాశ్రమసమీపంబున
బహుయోజనవిస్తీర్ణం బగుసముద్రవాలుకాపులినతలంబునందు మహావివరంబు
గావించుకొని సుఖంబున నిద్రించుచున్నవాఁడు వాలుకాంతర్హితశరీరుండై న
వానివదననిశ్వాసపవనంబు సధూమదహనజ్వాలాభీలం బయి సంవత్సరంబున
కొక్కమాఱు వెలువడి భూనభోంతరం బెల్లను నిరంతరసికతారజఃపటలంబు
దూఁటుకొనం జేయుఁ దదీయవేగంబునఁ దత్సమీపభూమిశైలకాననంబు లేడు
దినంబులదాఁకఁ గంపించుచుండు నిట్టిదారుణత్వంబుకతంబున మాకు మా
యాశ్రమంబున నుండుట సంకటంబు గావున నద్దురాత్ము వధియించి మాకును
లోకంబులకును బ్రియంబు సేసి కృతకృత్యుండవై మఱితపోవనంబునకరుగుము.

తే. ఎవ్వఁ డమ్మహాసురు వధియించుపనికిఁ, బూను నతనికి నాత్మీయభూరిశక్తి [డు.
యిచ్చి జయ మిత్తునని యానతిచ్చె నధిప, యాదరమున నాతోడఁ జక్రాయుధుం

వ. కావున. 386

చ. అతులితవిష్ణుశక్తిసముపాహితమూర్తివి గమ్ము లెమ్ము సం
తతభుజశక్తి నిట్టియవధాన మొనర్పఁగ నీవ కాని యీ
క్షితి నితరుండు లేఁ డధికకీర్తియుఁ బుణ్యముఁ జేరు నిన్ను నూ
ర్జితగుణ యింతపట్టుఁ దగఁ జేయుము గావుము లోక మంతయున్. 387

వ. అనినం గృతాంజలి యై యుదంకునకు బృహదశ్వుం డిట్లనియె. 388

క. విమలమతి నస్త్రసన్న్యా, సముఁ జేసితిఁ దప మొనర్ప సమకట్టితి నిం
క మునీంద్ర తపోవనగమ, నము దప్పదు నాకు వినుఁడు నావిన్నపమున్. 389

చ. అనఘుఁడు మత్సుతుండు గువలాశ్వుఁడు వీఁడె మహాబలుండు స
జ్జనహితకారి ధైర్యనిధి సంభృతకీర్తి భవత్ప్రియార్థమై
జననుత యమ్మహాసురునిఁ జంపుట కోపు నవార్యశౌర్యవ
ర్ధను లగుచున్నపుత్త్రులును దాను నభేద్యభుజావిభూతితోన్. 390

వ. నాకు ననుజ్ఞ యీవలయు నని యక్కార్యంబునకుఁ బుత్త్రు సమర్పించి యమ్ముని
చేత నభినందితుం డై బృహదశ్వుండు దపోవనంబున కరిగె ననిన విని ధర్మనంద
నుండు మార్కండేయునితో ధుంధుండు మధుకైటభులపుత్త్రుం డని చెప్పితి
రమ్మధుకైటభు లెక్కాలంబువా రేమిక్రమంబున నెవ్వరిచేత నేమై రని యడి
గిన నతండు ధర్మనందనున కిట్లనియె. 391

మార్కండేయుఁడు ధర్మజునకు మధుకైటభుల చరితము చెప్పుట.

సీ. అధిప తొల్లి జగత్త్రయంబు నేకార్ణవ, మై యుండఁగా నప్డు హరి యొకండ
భాసురభోగీంద్రపర్యంకమున భవ్య, యోగనిద్రాసుఖయుక్తి నలర
నతిదీర్ఘ మగుకాల మరిగెఁ బదంపడి, దైత్యు లిద్దఱు మహోదాత్తబలులు

మధుకైటభులు నాఁగ। మథితశాత్రవు లేఁగు, డెంచి యప్పరమాత్ము। దివ్యనాభి
ఆ. కమలమున వెలుఁగు జ।గత్పితామహుఁ గని, దర్పరోషమతిని। దలర ప్రేయ
నతఁడు భీతి నొంది। యాక్రోశ మొనరించె, నాదిపురుష నన్ను। నరయు మనుచు.
ఉ. ఆ తెఱఁ గాత్మఁ గాంచి కమ।లాక్షుఁడు మేల్కని ఘోరవిక్రమా
పేతుల దైత్యసింహుల న।పేతభయాత్ములఁ జూచి మీర లి
ట్లీతని నుక్కనం బఱుప। నేల భవద్బలశౌర్యయుక్తికిం
బ్రీతుఁడ నైతిఁ జెచ్చెర న।భీష్టవరంబులు వేఁడుఁ డిచ్చెదన్. 393
తే. అనినఁ గలకల నవ్వి య।య్యసురవరులు, నీవు మా కేమి యిచ్చెదు। నీక మేము
వరము లిచ్చెద మడుగుము। వలచితేని, ననిన వారల కిట్లను। నవ్విభుండు. 394
క. సత్యవ్రతులార వరం, బత్యంతప్రీతి మిమ్ము। నడిగెద లోక
ప్రీత్యర్థముగా నాచే, మృత్యువునం బొందుఁ డిపుడు। మీర లిరువురున్. 395
వ. అనిన వార లొండొరుల మొగంబులు సూచి యాచక్రధరున కిట్లనిరి. 396
చ. నగి నగి యేనియున్ విను జ।నార్దన యెన్నఁడు బొంకు పల్క మ
[1]త్యగణితవిక్రమోరుబల।ధైర్యసమగ్రుల మెల్లభంగిఁ గా
లగతి దొలంగఁ ద్రోవఁగఁ ద।లం బగునే యగుఁ గాక నీకు మె
చ్చుగ నిదె ప్రాణ మిచ్చెదము। స్రుక్కము చావున కాత్మ నేమియున్. 397
ఆ. చంపె దేని మమ్ము। జలములు లేనిదే,శమునఁ జంప వలయుఁ। గమలనాభ
నిక్క మింతవట్టు। నీచేతఁ బడయంగఁ, దగుదు మనిన నగుచు। నగధరుండు.
వ. త్రైలోక్యంబును జలమయం బగుట నాలోకించి. 399
క. పరమేశుఁడు దనయూరులు, పరపుగ నొనరించి వాని।పైఁ దచ్చిరముల్
పరుషతరశితసుదర్శన, ఖరధారానిహతిఁ జేసి। క్రక్కునఁ దునిమెన్. 400
తే. పరఁగ నమ్మధుకైటభా।సురులసుతుఁడు, సువ్వె ధరణీశ ధుంధుఁడన్। శూరవరుఁడు
వాఁడు వరగర్వమునఁ జేసి। వాఁడిమిగిలి, యమరపతిఁ దొట్టివేల్పుల।నభిభవించు.
వ. అని చెప్పి యమ్మునీంద్రుం డిట్లనియె నట్లు బృహదశ్వుచేత ననుజ్ఞాతుం డై కువ
లాశ్వుండు శుభదినంబున నుదంకపురస్సరంబుగాఁ గృతప్రస్థానుం డై. 402
తరలము. దనుజనిర్మథనైకతత్పర।తావిజృంభణ మొప్ప స
ద్వినుత తేజుఁడు ఘోరసంగర।విభ్రమోత్సవలీలమై
ఘనభుజాబలభూరిదుర్వహ।గర్వసంగ్రహు లైననం
దను లనేకసహస్రసంఖ్యులు। దన్నుఁ గొల్వ నుదగ్రుఁ డై. 403
మ. చతురంగధ్వజినీపదప్రవిహతిన్। సర్వంసహాచక్ర మా
తతకంపంబుగ నేఁగె నప్పుడు దగన్। దైత్యారి యారాజునం
దతులం బైన[2]నిజాంశశక్తి సొనిపెన్। హర్షించి రింద్రాదిదే

1. గ. త్యగణితధైర్యవిక్రమబల।లైకసమగ్రుల. 2. క.గ. నిజాత్మశక్తి.

వతలున్ సన్మునిముఖ్యులున్ నృపతి నైశ్వర్యోన్నతుం జేయుచున్. 404

ఆ. మొరసె దివ్యతూర్యములు నందనద్రుమ, సురభికుసుమవృష్టి గురిసెఁ గలయ
నప్రతీతభంగి యగుమందపవనవి, చేష్టితంబు గర మభీష్ట మయ్యె. 405

క. గగనమున సురవిమానము, లగణితముగఁ గ్రందుకొనియె ననుకూలము లై
మృగపక్షితతులు శోభన, మగు తేర్పడఁ జెప్పె నజ్జనాధిపుయాత్రన్. 406

వ. ఇట్లు సని కువలాశ్వుండు సముద్రతీరంబున విడిసి నిజపుత్త్రుల నానాసహస్రసంఖ్య
లగువారల నవారితజవసత్త్వులం దద్వాలుకాపులినఖననంబు సేయ నియోగించిన.

మ. నరనాథోత్తమునందనుల్ గడఁగి నానాశూలకుద్దాలము
ద్గరకాష్ఠాదుల నయ్యుదగ్రసికతౌఘం బంతయున్ సప్తవా
సరముల్ వాయక పాయ గ్రొచ్చి నడుమన్ సంసుప్తుఁడై యున్నయా
సురవైరిం గని రుగ్రనిశ్వసననిష్ఠ్యూతాగ్నికీలావృతున్. 408

చ. అడరి నిశాతపట్టిసగదాసిపరశ్వధశూలహస్తు లై
తడఁబడ వార లందఱును దానవుదేహము వీఁక వ్రేసియుం
బొడిచియు నొంప నెంతయును బ్రొద్దున కయ్యసురాధముండు బి
ట్టొడలు గదల్చి నీల్గి వివృతోగ్రముఖుం డయి యావులించినన్. 409

ఉ. బోరన విస్ఫులింగములు వొడ్మఁగఁ దన్ముఖనేత్రనాసికా
ద్వారములందు వెల్వడియె దారుణవహ్నిశిఖాకలాపముల్
వారక యందు మ్రంది రనివార్యులు రాజకుమారు లందఱున్
ఘోరత సాగరుల్ గపిలుకోపమునందు నశించుచాడ్పునన్. 410

వ. ఇట్లు దృఢాశ్వకపిలాశ్వచంద్రాశ్వులు దక్క దక్కినకొడుకు లందఱుఁ బొడవ
డంగినఁ గినుకం గువలాశ్వుండు సంహారసమయసప్తాశ్వుండునుంబోలె నుజ్జ్వలుం
డయి కదియుటయు నద్దానవుండు క్రోధసంరంభంబున సముత్థితుం డై యొక్క
శూలం బెత్తికొని కదిసె నప్పు డమ్మహీవిభుండు దదీయదేహజనితం బై యుండు
చున్నయగ్ని నాత్మీయయోగవిద్యా[1]మహాప్రభవం బగుజలప్రవాహంబునం
బ్రశాంతంబు గావించి బ్రహ్మాస్త్రంబు ప్రయోగించిన. 411

క. ఆదివ్యాస్త్రజ్వలనము, భూదిగ్గగనములు నిండి పొదివి మహోగ్రం
బై దానవుఘనదేహము, బూదిగ నొనరించెఁ జిత్రముగ నొకమాత్రన్. 412

వ. అంత. 413

క. సురశత్రుఁ డైనధుంధునిఁ, బరిమార్చితి నీవు జగదభయకారివి భూ
వర ధుంధుమారుఁ డనఁగాఁ, బరఁగు మనిరి సురలు మునులుఁ బార్థివముఖ్యా.

వ. ఇట్లు ప్రసన్ను లై యింద్రాదిదేవతలు దక్కటిసంయమిప్రముఖులు నమ్మహీ
వరు నభినందించి నీ కెయ్యది యిష్టంబు సెప్పు మనిన నతండు బ్రాహ్మణభక్తియు

1. అ. మహాప్రభావం బనుజలప్రవాహ.

ననవరతదానశీలతయు విష్ణునితోడిసఖ్యంబును (దనుజునివలన మృతు లయిన తనసుతులు గలుగను) వరంబులుగాఁ దనకుఁ గోరిన నట్ల యొసంగి వార లందఱు నిజనివాసంబులకుం జని రంతఁ గువలాశ్వుండును విజయోల్లాసభాసితుం డై యుదంకు నిజాశ్రమంబున కనిచి తనపురంబున కరిగి [1]వారాంగనానృత్యగానవిశేషంబు లాలోకించుచు రాజధానిం బ్రవేశించి సముజ్జ్వలసామ్రాజ్యసౌఖ్యంబులం బరఁగు చుండె నని మార్కండేయుండు ధర్మరాజునకుఁ గువలాశ్వుండు ధుంధుమారుం డై నవిధంబు సెప్పె నని వైశంపాయనుండు జనమేజయున కెఱింగించిన తెఱంగు. 415

క. చరమయుగచలితధర్మ, స్థిరీకరణచతురచరిత ధీగుణలీలా
పరికరపరిచితనయావి, స్తర వితరణవివరణైకదానవినోదా. 416

మాలిని. కరివరహరికూర్మక్ష్మాధరాధీశతుల్యోద్ధరణగుణధురీణోద్దండబాహార్గళాగ్ర
స్ఫురితనిఖిలగోత్రాభోగభాగైకభోగా, దరణసుఖితమూర్తిధర్మతంత్రానువర్తీ.

గద్యము. ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దారణ్యపర్వంబున యక్షయుద్ధంబును గుబేరదర్శనంబును నర్జునాగమనంబును బాండవులకడ కింద్రుండు సనుదెంచుటయు నర్జునుండు నివాతకవచకాలకేయపౌలోమవధప్రకారం బెఱింగించుటయు నాజగరంబును బాండవులు గామ్యకవనంబునకు వచ్చుటయుఁ గృష్ణమార్కండేయాగమనంబును బ్రాహ్మణప్రభావకథనంబును సరస్వతీగీతయు వైవస్వతుచరితంబును గల్పాంతప్రకారంబును యుగధర్మకీర్తనంబును వామ్యాశ్వహరణంబును నింద్రద్యుమ్నోపాఖ్యానంబును ధుంధుమారచరితంబును నన్నది చతుర్థాశ్వాసము. 418

1. 'వారాం...ప్రవేశించి' యిది వ్రాఁతప్రతుల లేదు.

226

శ్రీ

హరిహరహిరణ్యగర్భేభ్యో నమః.

శ్రీమదాంధ్రమహాభారతము

ఆరణ్యపర్వము, పంచమాశ్వాసము.

యువతీప్రియ నృపనా
రాయణబిరుదాంక భీమ రమణీయగుణా
శ్రీయుత నిర్మలధర్మప
రాయణ రవితేజ రాజరాజనరేంద్రా. 1

ధర్మజునకు మార్కండేయుఁడు పుత్త్రున కుండఁదగుగుణంబులం దెల్పుట.

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నట్లు బహుభంగుల మార్కండేయుండు వివరింపం బుణ్యకథావిశేషంబులు విని సంతుష్టహృదయుండై కౌంతేయపూర్వజుండు మఱియు నమ్మునీంద్రున కిట్లనియె. 2

సీ. సమధికదర్పదుర్జయము లై నిగిడెడు, నింద్రియంబులఁ గుదియించి తెచ్చి
మనసుపొందున నిడి మన సహంకారంబు, పజ్జకుఁ బాపి సద్భక్తియుక్తి
నెరయంగ ననిశంబు నిజభర్తృశుశ్రూష, యందు సమాహిత లైనవనిత
యఖిలలోకోత్కృష్ట యని మెచ్చు నూహింతు, నరయఁ బతివ్రత లైనవారి

తే. చరిత మత్యంతధర్మసూక్ష్మంబుఁ గరము, దుష్కరంబును గాదె నిర్ధూతదురిత
యట్లు గావున విన వేడ్క యయ్యెఁ జెప్పవలయుఁ బుణ్యసతీప్రభావంబు నాకు.

వ. మఱియుఁ దల్లిదండ్రు లిరువురయందును బుత్త్రనిమిత్తం బైనయాయాసం బెవ్వరి కెక్కుడు వారలయెడం బుత్త్రుం డెట్టివాఁడు గావలయు హీనయోనిజాతుండైన పురుషుం డేమి తెఱంగునడవడిం బరమధార్మికులలోకంబులు వడయు నివియును వివరింప నీవ యర్హుండ వనిన నమ్మహాముని యమ్మహీపతి కిట్లనియె. 4

సీ. జతనంబు మిగుల మాసములు దొమ్మిది యుదరంబునం గరముభరంబుతోడ
భరియించి పదపడి ప్రాణసంశయదశ, నొంది పుత్త్రునిఁ గాంచు నోనరఁ దల్లి
తపములు యజ్ఞముల్ దానముల్ వ్రతములు, దేవతాసజ్జనసేవనములుఁ
గావించుఁ బుత్త్రునిఁ గామించి జనకుఁ డిట్లిరువురపాటును సరియె తలఁపఁ

తే. దనయుఁ గని తల్లిదండ్రులు దమకు నతఁడు, భక్తుఁ డగుటకు ధర్మార్థసక్తుఁ డగుట

కాసపడుదురు విను మఱికయాన సిద్ధిఁ, బొందఁ జేయునతఁడ[1]చు వ్వోకనందనుండు.

క. జననియు జనకుఁడు నెవ్వని, యనువర్తనమునఁ బ్రియంబు నందుదు రెదఁ ద
త్తనయుఁడు ధర్మముఁ గీర్తియు, ననూనముగఁ బొందఁబడయు ననఘయగతులన్.

మార్కండేయుఁడు ధర్మజునకుఁ బతివ్రతామాహాత్మ్యంబు సెప్పుట.

వ. మఱియు నిజభర్తృశుశ్రూషయందు నిత్యాసక్తయయినపతివ్రతకు నఖిలయజ్ఞదానతపఃఫలంబులు సులభంబు లగునొక్కయితిహాసంబు సెప్పెద నందు నీ యడిగినయర్థంబు లన్నియుఁ దేటపడు నాకర్ణింపుము కౌశికుం డనుబ్రాహ్మణుండు ధర్మతపశ్శీలుండు సంతతాధ్యయనతత్పరుం డయి యొక్కశిష్టగ్రామంబున నుండు నతం డొక్కనాఁడు గ్రామసమీపంబునం దొక్కవృక్షమూలంబున నాసీనుం డై వేదంబులు గుణియించుచుండం దదీయశాఖాగతం బై నకొక్కెర యొక్కం డాత నిపై రెట్ట వెట్టిన నమ్మహాద్విజుం డలిగి చూచుటయు నది యప్పుడ నిశ్చేతనం బై నేలం బడినం గనుంగొని యతండు. 7

క. అక్కట నాహృదయము గడు, నక్కటికము లేనిదయ్యె ననిమిత్తమ యీ
కొక్కెర నిటు సేసితి నా, కెక్కడిశాంతి యని వికలహృదయుం డగుచున్. 8

వ. పెక్కుభంగుల వగచి మధ్యాహ్నం బగుటయుఁ గృతాహ్నికవిధానుం డై గ్రామంబున కరిగి యందు శుచు లైనవిప్రగృహంబుల కరిగి భిక్షాచరణంబు సేయుచు నం దొక్కపుణ్యగృహంబువాకిట నిలిచి భిక్షాం దేహి యనుటయు నాయింటి యవ్వయు నతిసంభ్రమంబున భిక్ష యిడుటకుం బాత్రశోధనంబు సేయునెడ. 9

ఉ. ఆయెలనాఁగభర్త గడు నాఁకటఁ దూలుచు వచ్చె వచ్చినం
దోయజనేత్ర సంభ్రమముతోఁ దగుపీఠము వెట్టి పాద్యముం
బాయక మజ్జనక్రియయు భక్తి నొనర్చి ప్రియోక్తు లొప్పఁగా
నాయనఁ బ్రీతుఁ జేసె రుచిరాన్నరసంబుల నింతి చెచ్చెరన్. 10

చ. కుడిచినపిమ్మటం గుసుమకోమలి విస్తృతసంస్తరంబుగా
నొడికపుసెజ్జ సేసి ప్రియుఁ డొయ్యన యందు శయింపఁ దమ్ములం
బిడి చరణంబు లొత్తి మదిఁ బేక్షణ యంతటిలోఁ దలంచె ము
న్నడరఁగ భిక్షకై నిలిచినట్టిమహీసురముఖ్యు నాత్మలోన్. 11

వ. ఇట్లు దలంచి భిక్ష గొనుచుం జనుదెంచిన నమ్మగువం జూచి కౌశికుండు రోషరంజితలోచనుం డగుచు నిట్లనియె. 12

క. అడిగినయప్పుడ చెచ్చెరఁ, గడపినఁ బో నవ్వ నేను గడుదుర్మతి వై
పడఁతి నను నిలిపి భైక్షం, బిడక కడుఁ నవజ్ఞ సేసి తేల ముదమునన్. 13

చ. అనినఁ బతివ్రతాతిలక మాతని కిట్లను నయ్య మత్ప్రియుం
డనుపమితక్షుధాచలితుఁ డై చనుదెంచిన భక్తి నమ్మహా

1. క. గ. చెల్వంనందనుండు.

త్మునకు సపర్య సేయుచు మిమ్ముఁ మదిలోనఁ దలంపఁ జాల నై
తి నిదియుఁ దప్పుగాఁ గొనక ధీరత యొప్ప సహింపఁగాఁ దగున్. 14

వ. అనిన నమ్మహీదేవుం డప్పతివ్రత కిట్లనియె. 15

ఉ. నీమగఁ డంత యెక్కుడె మనీషులు భూసురు లింత తక్కువే
కోమలి యేల యిట్లు గడుఁ గ్రొవ్వునఁ గానవు లోకవంద్యులన్
భూమిసురేంద్రులన్ దివిజపుంగవుఁ డాదిగ భక్తిఁ గొల్చుచో
నేమిట నొక్కొ వారు గడు నెల్లిద మై రిటు నీకు నిచ్చటన్. 16

క. అవమానితు లై ధరణీ, దివిజులు క్రోధాగ్నిశిఖల దీపించి మహా
ద్రివనద్వీపంబులతో, నవని నయినఁ బొడ వడంతు రప్రతికారుల్. 17

వ. నీ వింత నెఱుంగ నొల్లవైతివి గా కేమి యనిన నయ్యంగన యిట్లనియె. 18

సీ. దేవతాసములు భూదేవతావరు లయ్య, యేను దన్మాహాత్మ్య మెఱుఁగనయ్య
యొకవిప్రుఁ డలిగి పయోనిధిజలము ల, పేయముల్ గాఁగ శపింపఁ డెట్లు
దండకవిషయంబు దగ్ధంబు సేయండె, యలుకమై నొక్కమహాద్విజుండు
వాతాపి యనుదైత్యవరుమ్రింగియఱిగించు,కొనఁడెభూదేవుఁడొక్కరుఁడుగినిసి
తే. ధరణి మఱియును బెక్కువిధంబులందు,బ్రహ్మవిదులైనబ్రాహ్మణప్రభులమహిమ
వినమె యెఱిఁగియెఱింగి సద్వినుతచరిత,కొఱవిగొని వెఱ్ఱినే తలగ్రోఁకికొనఁగ.

వ. నా తెఱంగు సెప్పెద నాకర్ణింపుము. 20

తే. పతియచూవె నాపాలికిఁబరమదైవ, మేను వాఙ్మనఃక్రియలఁదద్ధితమ యెపుడుఁ
గోరియొనరింతు [1]దీని మిగులఁగ నొండు,ధర్మువులు గాన నెందును దలఁచిచూచి.

వ. నీ వతిక్రోధనుండ వగుటయు నెఱుంగుదు నీకోపంబున నొక్కకొక్కెర నిహతం
బయ్యెం గాదె యిది మదీయపాతివ్రత్యమహిమం జేసి కాంచితిం గాన క్రోధంబు
గొనియాడుట లగ్గు గా దని యిట్లనియె. 22

తే. క్రోధమోహనామకులైన ఘోరశత్రు, లిరువు రెరియించుచుండుదు రెపుడు నంత
రంగ మయ్యుభయంబు నడంగ కున్నఁ, గలదె యూరక బ్రాహ్మణ్యగౌరవంబు.

సీ. ఎవ్వఁడు సత్యంబు సెప్పుడుఁ బల్కు హిం, సావిదూరుఁడు గురుజనహితార్థి
యింద్రియంబుల నోర్చి యెల్లవారలఁ దన, యట్ల కాఁ జూచు ధర్మాభిరతుఁడు
గామంబు దగులండు కర్మంబు లాఱును, సముచితసంప్రయోజ్యత నొనర్చు
నట్టిపుణ్యాత్ముని ననఘు బ్రాహ్మణుఁ డని, యనిశంబుఁ గీర్తింతు రమరవర్యు
ఆ. లార్జవంబు శమము నధ్యయనంబును, బరమధనము సువ్వె బ్రాహ్మణునకు
ధర్మగతికి నవియ తగుసాధనంబులు, వేదవిహితముఖ్యవిధులు [2]నెనయె. 24

వ. ధర్మంబు బహుమార్గదృష్టం బయి సూక్ష్మం బయి యుండు నీవు కేవలస్వాధ్యాయ
పరుండవు గాని ధర్మసూక్ష్మత యెఱుంగవు గావునం దడయక మిథిలానగరంబున

1. చ. నివి నాకుఁ గొనకొనంగ, ధర్మములుగాఁగ నుండుదుఁ,దలఁచి చూడ. 2. అ.నివియ.

కరుగు మందు జితేంద్రియుండును సత్యవాదియు మాతాపితృభక్తుండును నయిన వాఁడు ధర్మవ్యాధుం డనుకిరాతుండు నీకు నఖిలధర్మంబులు నెఱింగించి సంశయచ్ఛేదంబు సేయు నాదెసం బ్రసన్నుండ వగునది వనితలకుం బరిజ్ఞానంబు లేదు గావున నా రెట్టియపరాధంబు సేసినను సహింపవలయుఁ గదా యనినఁ గౌశికుం డి ట్లనియె. 25

క. నను దూఱం దగు నీకత, మున నాచిత్తము ప్రశాంతిఁ జేరఁ బురంధ్రీ
జనవినుత పోయి వచ్చెద, ననుపమశోభనసమృద్ధు లయ్యెడు నీకున్. 26

కౌశికుం డను బ్రాహ్మణుఁడు ధర్మవ్యాధునియొద్దకుఁ బోవుట.

వ. అని యాక్షణంబ యమ్మహాద్విజుండు ధర్మవ్యాధదర్శనలాలసుండై కదలి పతివ్రత యెఱుకకు విస్మయం బందుచుఁ దన్నుం గృతాపరాధునిం గాఁ దలంచుచు ననేక నగరగ్రామంబు లతిక్రమించి చని యనుపమానశోభాసనాథం బయినమిథిలానగరంబు సొచ్చి రాజమార్గంబు దఱిసి యచ్చటిజనంబుల ధర్మవ్యాధుం డున్నయెడ నడిగి వా రెఱింగింప నట యేఁగి ముందట నల్పమృగమాంసఖండంబు లంగడిం బచరించి యమ్ముచున్నవాని ననవరతవిక్రయాగతజనసమావృతు నక్కిరాతుం గని యతిజుగుప్సితం బయినసూనాపణంబు సేర నొల్లక తొలంగి యొక్కయెడ నుండె నంత. 27

ఆ. వాఁడు నతనిరాక పోఁడిగ నిజబుద్ధి, నెఱిఁగి యతనియున్నయెడకు వచ్చి
పరమభక్తి మ్రొక్కి ధరణీసురేశ్వరుఁ, గుశల మడిగి ప్రియముగొనలునిగుడ.

చ. అనఘనితంబినీతిలక మైనపతివ్రత నాతెఱంగు సె
ప్పినఁ జనుదెంచి తీవు ననుఁ బ్రీతిఁ గనుంగొన నీమనోరథం
బును మదిలో నెఱుంగుదుఁ బ్రమోదముఁ బొందితి రమ్ము మద్గృహం
బున కని పల్కి తోడుకొనిపోయె నతండు మహీసురోత్తమున్. 29

వ. కౌశికుండును ధర్మవ్యాధు నెఱుక కచ్చెరువంది పతివ్రతయెఱుకయుం దలంచి యిది రెం డవునాశ్చర్యంబు గంటి పొమ్మని తలంచుచుఁ దదీయభవనంబున కరిగి వాని చేతం బూజితుం డయి యిష్టకథాప్రసంగంబున నుండి యతని కి ట్లనియె. 30

తే. నీవు గడు ధర్మవిదుఁడవు జీవహింస, జీవనంబుగ నడచుట శిష్టపథమె
యకటయీఘోరకర్మంబునకు మదీయ, బుద్ధి దద్దయు దుఃఖంబు వొందెనిపుడు.

వ. అనుటయు లుబ్ధకుం డి ట్లనియె బ్రాహ్మణులకుఁ దపస్స్వాధ్యాయసత్యబ్రహ్మచర్యంబులును రాజులకు దండనీతియు వైశ్యులకుఁ గృషిపశుపాలనవాణిజ్యంబులును శూద్రులకు శుశ్రూషయు నెట్లు పరమధర్మం బయి చెల్లు నట్ల మాకును [1]మృగరూపజీవనంబు పరమధర్మంబు విశేషించి యిది వంశక్రమాగతం బయిన యాచారం బదియునుం గాక యీదేశంబునకు రాజైనజనకుండు నిజధర్మతత్పరుం డయి సకలవర్ణరక్షణంబు వదల కుండునట్లు గాన [2]యాత్మకర్మంబులు

1. అ. మృగమాంసోపజీవనంబు, 2. అ. యాత్మవర్ణాచారధర్మంబులు.

విడుచువానిం దనపుత్త్రు నైనను దండితుం జేయుఁ గావున నేనును నిజకర్మపరి
త్యాగంబు సేయ నోడుదు నీదృశప్రవర్తనుండ నయ్యును. 32

తే. జీవహింస యెన్నండును జేయ ననఘ, యొరులు సంపి తెచ్చినమాంస మొనర విలిచి
తగినవెల కమ్మి బ్రదుకుదుఁ దద్ధనమున, నమల మాంసంబు శాంతియ సాధనంబు.

చ. వినయము విస్తరిల్ల గురువృద్ధజనాతిథివిప్రదేవతా
ర్చన లొనరింతు [1]సత్యమును శౌచము నేమఱ నీగి మన్నసం
దనుపుదు భృత్యబంధుతతిఁ దాల్మి వహింతు ననూయఁ జేయ నెం
దును మదిఁ దృష్ణ సొన్పఁ బరదోషకథావిముఖుండ నెప్పుడున్. 34

క. సతతోపవాసనియమ, వ్రతములఁ జరియింతు నేకవనితాప్రియుఁడన్
ఋతుకాలరతుండ నిందా, స్తుతులందు మనంబు నాకుఁ దుల్యత నుండున్. 35

వ. అట్లగుటం జేసి హీనయోనిజుండ నయ్యును నిర్మలుండ నైతిం బ్రసంగవశం
బున నింత సెప్ప వలసె నీవు ధర్మబోధార్థంబు నాయున్నయెడకుం జనుదెంచితి
గావున నీకు ధర్మవిశేషంబు లెఱింగించెద నవధానతత్పరుండ వయి యాక
ర్ణింపుము. 36

క. తనకులధర్మము విడువక, మనుట పరమధర్మ మండ్రు మాన్యులు చిత్తం
బునఁ గృప గలుగుట ముఖ్యపుఁ, బని సైరణ వలయు నఖిలభావములందున్. 37

ఆ. విడువ వలయు సకలవిషయవాంఛలయందు, విడువఁ బోలు గుణము వెదకి యెందుఁ
గాన నైరి బుధులు గలదు పరిత్యాగ, శీలునకు నసాధ్యసిద్ధి యెందు. 38

సీ. సత్యహితాలాపచతురత యర్థంబు, సంతతసుజనపూజనము వలయు
విను కామసంరంభవిద్వేషములఁ జేసి, మతి గలంగినను ధర్మంబు దప్పఁ
ద్రొక్కక నడచు టత్యుత్తమసరణి య, ప్రియములయందును బ్రియములందు
దైన్యహర్షంబులఁ దగులక యున్నట్టి, కల్యాణవర్తనకాంక్ష లెస్స

తే. యెగ్గు సేసినవారికి హితము సేఁత, యార్యజనములు గీర్తింతు రన్యదోష
కారి [2]దనపాపమునఁ దాన కాలి పోవు, వేఱ వానికిఁ గీడు గావింప నేల. 39

క. ధార్మికులు సలుపునుత్తమ, కర్మముఁ జెడ నాడు నాస్తికజనము విను మా
దుర్మతుల తెఱఁగు గనికొని, ధర్మము నెడఁ బ్రీతి వదలఁ దగదు బుధునకున్. 40

క. మదిమఱపునఁ బాపము దన, కొదవుటయును బిదప వగచి యొకసగమును నే
నిది సేయ నింక ననియెడు, మదిఁ బెఱసగ మైన నరుఁడు మలుఁగు నఘంబున్.

తే. పాపములకెల్ల నెక్కుడు పాతకములు, సువ్వె క్రోధలోభంబులు సువ్రతాత్మ
వాని రెంటి జయించినవాఁడుగాని, యెందుఁ బరమధార్మికుఁ డనియెన్నఁబడఁడు

వ. శిష్టచరితంబులు గానిమార్గంబులు గొన్ని తృణసంవృతంబు లైన కూపంబులుం
బోలెఁ గపటధర్మసంవృతంబు లై యుండు వాని దవ్వులన పరిత్యజించి శిష్టా

1. గ. నిత్యమును. 2. చ. జ. దనదోషమునఁ. 3. గ. జ. యొక్కసగంబు, న్నది... బెఱ
సగ మైన నరుడు మాఁగవలయున్.

చారంబుల నడచుట ధర్మలక్షణం బనినం గౌశికుండు శిష్టాచారంబు లెయ్యవి
యెఱింగింపు మనుటయు ధర్మవ్యాధుం డి ట్లనియె. 43

సీ. దానంబు సత్యంబుఁ దపము యజ్ఞము నార్జవముఁ గామలోభాదివర్జనంబు
గురుజనశుశ్రూషక్రోధరాహిత్యంబు, దమము సంతోష మధ్యయననిరతి
దాంభికత్వము లేమి దైన్యంబువారయమి, యనసూయయనహంక్రియాభియుక్తి
దలఁపంగ నాద్యమై తనరుధర్మ మెప్డుఁ, గొనియాట నాస్తికగోష్ఠిఁ జనమి
తే. శీలసంరక్ష తీర్థసంసేవ శౌచ, మఖిలభూతంబులందు దయార్ద్రతఁ దగుట
మితహితోక్తులు సంశ్రితమిత్త్రగుప్తి, యిన్నియును శిష్టచరితంబు లిద్ధచరిత.

క. విను శిష్టచరిత గైకొని, యనపాయత నడవ నడవ నంతఃకరణం
బునఁ బొదలునట్టిసమ్మద, మనఘా దుర్లభము సూవె యన్యపథములన్. 45

వ. కావున శిష్టాచారనియతిం జేసి గురుశుశ్రూష సలిపి కృతాధ్యయనుండవై పరమ
జ్ఞానపరిపక్వంబైనచిత్తంబుతోడం గామక్రోధమహామకరసంకీర్ణయు విషయజల
పరిపూర్ణయు నైనమోహమహానది నస్ఖలితధైర్యం బను తెప్పం జేసి యశ్రమం
బున నిస్తరించి కృతార్థుండ వగు మని మఱియు ని ట్లనియె. 46

క. క్రమమున శిష్టాచార, క్రమ మెఱుఁగఁగ ధర్మమునకుఁ గడు వాటం బై
విమలం బగుఁ జిత్తము స, త్యమును నహింసయును దనకుఁ దావలములుగాన్.

ఆ. విను మహింస ధర్మవితతి కెల్లను మేటి, యదియు సత్యయుక్త మైన వెలయు
ననఘ శిష్టచరితలందు సత్యము కడు, నధిక మనిరి శ్రుతుల నరసి బుధులు. 48

తే. వేదవిహితంబులును శాస్త్రవిహితములును, శిష్టచరితంబులును ననఁ జెప్పనొప్పి
ధర్మములుమూఁడువిధములఁ దనరుచుండుఁ, గడఁగి యిన్నియు సద్గతికారణములు.

మ. అనయంబుం [1]శ్రుతవంతుఁ డై వినుతశిష్టాచారమార్గంబులం
జనుపుణ్యాత్ముఁడు దుర్గముల్ గడచి ప్రజ్ఞాహర్మ్యసంరూఢుఁ డై
కనుచుండుం బటుమోహపంకజలమగ్నం బైనలోకంబు వీఁ
క [1]నధోభాగమునందు డిందికడు దుఃఖం బొందఁగా నవ్వుచున్. 50

ధర్మవ్యాధుఁడు గౌశికున కహింసాస్వరూపంబు సెప్పుట.

వ. అని పలికి ధర్మవ్యాధుండు మఱియు ని ట్లనియె నయ్యా నీవు దొలుత నావర్త
నంబు గనుంగొని యిది హింసాబహుళంబు గాదె యని పలికితివి దాని కేను
దగుతెఱంగు సెప్పితి నది య ట్లుండె హింస యిట్టిది యహింస యిట్టి దని
విభాగింప నెవ్వరికి నేర నగు. 51

క. [3]మును తమచేసినకర్మం, బునఁ జూవె నశించుభూతములు సంపెడువాఁ
డు నిమిత్తమాత్ర మింతయె, యని చెప్పఁగ వినమె యంచితాచారులచేన్.

వ. అదియునుం గాక. 53

1. అ. శమవంతుఁ డై. 2. క. నభోభాగమునందు నుండి. 3. క. గ. తనతనచేసిన.

క. ఫలమూలౌషధిశాకం, బులుఁ బశుమృగతతులు భక్ష్యములుగా భూతం
బుల కజుఁడు సేసె ననియ, స్ఖలితంబుగ మ్రోయు శ్రుతులుఁ గా దన వశమే.

సీ. అనఘ యౌశీనరుం డగుశిబి నిజగాత్ర, హింస నింద్రాగ్నుల కిడఁడె మాంస
మతనికి లే దయ్యె నయ్యు యుత్తమగతి, రంతిదేవుం డనురాజు దొల్లి
యనుదినంబును గోసహస్రద్వయంబుఁ దా, వధియింపఁడే వేయివత్సరములు
దురిత మమ్మహితాత్ముఁ దొడరెనే వేదార్థ,నిరతు లైయత్యంతనియతు లైన

తే. ధారుణీసురముఖ్యు లధ్వరములందుఁ, బశు వరింపరే పశువులు బరమపుణ్య
గతులుగలుగవె వారికిఁగడఁగి యగ్ను,లధికమాంసార్థు లని శ్రుతులందువినమె.

క. పితృదైవతకార్యములం, దతిభక్తిని మాంస మిడుట యర్హ మనియుఁ ద
త్పితృదైవశేషములు స, న్మతి భోజ్యము లనియు మునులమతములు గావే. 56

మ. హలికుం డెంతయు నోజతో దునుఁగ సీరాగ్రంబునం జోఁకి ప్రా
ణు లనేకంబులు సచ్చు హింస యది యౌనో కాదొ వే యేల మ
ర్త్యులు నేలం జరియించుచోఁ బదములం ద్రొక్కంబడుం బెక్కుజం
తులు హింసావిధి గా దనంగ వశమే దోషజ్ఞ యూహింపుమా. 57

చ. సలిలము లుర్వి యాకసము సర్వము జంతుమయంబు గావునం
గలుగు నవశ్యముఁ సకలకర్మములందును హింస హింసకుం
దొలఁగిన దేహయాత్రయును దుర్ఘట మైనటు లుండు నింతయుం
దలఁపరు హింస సేయ మని తారు చరింతురు గొంద ఱిమ్మహిన్. 58

క. పనివడి యహింస వ్రతముగఁ,గొని వనమున నున్న మునులకుం దొడరదె హిం
సనము తరుమూలఫలశా, కనిపీడన మదియు హింస గా దొకొ తలఁపన్. 59

తే. హింస సేయనివాఁడు లేఁ డిజ్జగమున, నొక్కఁ డైనను దమతమయోపినట్లు
హింస తెరువున కెడగల్గియేఁగవలయు,నదియ చూవెయహింస నా నతిశయిల్లు.

వ. ధర్మంబు బహుప్రకారం బై యుండుఁదదీయసూక్ష్మగతి దురవబోధంబు గావున శ్రుతిప్రమాణంబులవలనను వృద్ధాచారనిదర్శనంబులను నెఱింగికొనునది. 61

ఉ. భూతహితంబుగాఁ బలుకుబొంకును సత్యఫలంబు నిచ్చుఁ ద
ద్భూతభయాస్పదం బగుప్రభూతపుసత్యము బొంకునట్ల ప్రా
ణాతురుఁ డైనచోఁ బరిణయంబునయందును బల్కుబొంకు స
త్యాతిశయంబ యండ్రు మహితాత్మక యిట్టివి ధర్మసూక్ష్మముల్. 62

వ. అని తెలిపి మఱియు నతండు. 63

క. ఒప్పెడునది యైనను గడు, నొప్పనియది యైన నిజకులోచితపథముం
దప్పఁ దగ దండ్రు ధార్మికు, లప్పని నిజభాగ్యవిహిత మని యుండఁ దగున్. 64

క. విను పూర్వకర్మఫలములు, దనకు వశము గాక పొందుఁ దఱితో వానిం
గనికొన నేరక మూఢుఁడు, దన కాపద యైనచోట దైవము దూఱున్. 65

తే. కార్యఫలములయెడఁ దానకర్తననుట, కడు నెఱుంగమిఁ జువ్వె లోకకర్తయేనిఁ
దగిలి తన దైనకార్యజాతంబు నెల్లఁ, జెడక ఫలియించునట్లుగాఁ జేయ రాదె.
వ. అది యెట్లంటేని. 67
సీ. నీతిమంతులు ధర్మనిరతులు దక్షులు, నగువారు సేయుకార్యములు గొన్ని
సిద్ధిఁ బొందవు దుష్టచిత్తులుఁ గ్రూరు లై, చేయఁ గొన్ని విశేషసిద్ధిఁ బొందు
నూరక యుండంగ నొందుఁ గొందఱ విపు,లార్థముల్ గొంద ఱాయాసపడియు
నిష్ఫలారంభు లై నిలుతురు గొందఱు, పేదవారికిఁ బ్రజ పెల్లు వొడము
తే. నర్థవంతులు గొందఱ కర్థి నధిక,దానములు ధర్మములు సువ్రతములుఁ జేయుఁ
బ్రజలు పుట్టరువిను మట్టిభంగి సుమ్ము,కర్మఫల మాత్మతంత్రంబు గాక యుండు.
క. పురుషుఁడు కర్మాధీనత, నరుగక తనవశము యనిన నాపదలు రుజల్
మరణంబును నివి యేమియుఁ,బొరయక యుండంగ బ్రదుకఁ బోలదె చెపుమా.
ఆ. కర్మవశతఁ జూవె కలుగు దేహము దేహ, వర్తనంబు కర్మవశతఁ బుట్టు
దేహపాత మైన దేహస్థుఁ డగుజీవుఁ, డరుగుఁ గర్మవిహిత మైనయెడకు. 70
వ. అనినం గౌశికుండు జీవుం డెట్టివాఁ డని యడిగిన లుబ్ధకుం డి ట్లనియె. 71

ధర్మవ్యాధుఁడు గౌశికునకు జీవలక్షణంబులు సెప్పుట.

క. విను జీవుండు సనాతనుఁ, డనఘుఁడు నిజకర్మవశత నధ్రువదేహం
బునఁ బొందు దేహపాతం, బున నెప్పుడుఁ జెడఁ డతండు భూసురవర్యా. 72
క. ఈయొడలు విడిచి వేఱొక, కాయముఁ గైకొని శరీరి గర్మవశగతిం
బోయి సుఖదుఃఖములు గనుఁ,బాయక వెండియును దేహబంధముఁ బొందున్.
వ. అనిన విని బ్రాహ్మణుండు లుబ్ధకునితోడం బుణ్యపాపానురూపంబు లయిన దేహ
బంధంబు లెట్టి వనిన వాఁ డి ట్లనియె. 74
చ. స్థిర మగుపుణ్యకర్మమున దేవభవం బగుఁ బుణ్యపాపసం
కరమున మానుషత్వ మగుఁ గల్మషముల్ పశుకీటభావముం
బొరయఁగఁ జేయు నిప్పగిదిఁ బుట్టుచుఁ జచ్చుచు మోహవార్ధిలోఁ
దిరుగుచు నుండుఁ గాని యొకతీరము సేరఁడు జీవుఁ డెన్నఁడున్. 75
చ. ఇది సకలంబుఁ గాంచి బుధుఁ డెన్నఁడుఁ బాపముపొంతఁ బోక ని
ర్మదనిరహంక్రియాత్ముఁడును మత్సరదూరుఁడు నై చరించు బెం
పొదవఁగ ధర్మమార్గమున నొయ్యన ధర్మముతీ పెఱింగి తా
వదలఁడు తత్క్రియావిధము వారక యెక్కుడొనర్చు ధర్మముల్. 76
చ. చిరముగ ధర్మముల్ నడపఁ జిత్తము దేఱుఁ బ్రసన్నచిత్తుఁ డై
పరువడి నింద్రియార్థములభంగులు రిత్తలు గా నెఱింగి చె
చ్చెర నవి యంతవట్టు నిరసించి తపోధనసత్యశీలతం
బరిణతి నొందుఁ బొందుఁ బిదపం బరమార్థపదప్రభావమున్. 77

వ. అనిన నమ్మహాద్విజుం డమ్మహామతి కి ట్లనియె. 78

ఆ. ఇంద్రియంబు లనఁగ నెయ్యవి యవి నిగ్ర, హింప కున్నఁ బాపమేమి దొడరు
వాని నిగ్రహించు వానికి నగుఫలం, బెట్టి దనిన నాతఁ డిట్టు లనియె. 79

క. విను విషయజ్ఞానమునకు, ననయంబును మనసు మూల మది కామక్రో
ధనిరూఢ మగుచుఁ బురుషుని, ననిశము నెలయించు నింద్రియార్థంబులకున్.

సీ. ఇంద్రియార్థంబుల కెలసినపురుషుండు, గాఢరాగంబునఁ గరఁగు చుండు
రాగంబువలనఁ దీరం బగు లోభంబు, లోభి యై కరుణకు లోను గాఁడు
మఱి సముద్ధతవృత్తి మరగుఁ బాపక్రియఁ, దగువారు సెప్పెడితగవు వినఁడు
కుజనులదెసఁ బ్రీతి గొలుపుఁ దుల్యంబులు గా కుండు వాఙ్మనఃకర్మభంగు

ఆ. లిహమునందుఁ బుణ్యహీనుఁడై చెడిపోవుఁ, బరమునందు దుఃఖభరమునొందుఁ
గాన యింద్రియార్థగతిఁ బోక సాధుసం, సర్గఁ జేసి సుగతిఁ జనుట యొప్పు. 81

వ. ఇంద్రియంబు లన నెయ్యవి యనియు నింద్రియజయసిద్ధియు నీవు న న్నడిగితివి తత్ప్రకారంబు బ్రహ్మవిద్యావిషయంబు మాబోఁటివారికి నవాచ్యం బై యుండు నై నను నీవు బ్రాహ్మణప్రవరుండవు గావున సద్బ్రాహ్మణప్రియం బవశ్యకర్తవ్యంబు పరమబ్రహ్మవిదు లయినబ్రాహ్మణవరులకు నమస్కరించి బ్రహ్మవిద్యాప్రపంచం బెఱింగించెద నవధానపరుండ వై యాకర్ణింపుము. 82

తే. అంబరము వాయువగ్ని దోయమ్ము ధరణి, భూతపంచక మిదిక్రమంబున మహాత్మ
శబ్దసంస్పర్శరూపరసములు గంధ, సంయుతంబుగ భూతపంచకగుణములు. 83

క. ఒనరఁగ నాకస మాదిగ, ననులోమముతోడ నిమ్మహాభూతము లే
నునుబుట్టు నొకటికొక్కటి, యనయముఁ బ్రతిలోమగతి లయంబునఁ బొందున్.

వ. శ్రోత్రంబును ద్వక్కును జక్షువును జిహ్వయు ఘ్రాణంబును నను నియ్యైనగు నింద్రియంబులు శబ్దస్పర్శరూపరసగంధంబు లింద్రియవిషయంబు లయియుండు నింద్రియపంచకంబునకు షష్ఠం బై మనస్సు ప్రకాశిల్లు సప్తమాష్టమంబు లై బుద్ధియు నహంకారంబును వర్తిల్లు సత్త్వంబును రజస్సును దమస్సును గుణంబు లై యుండు నీచెప్పంబడినమహాభూతపంచకప్రపంచం బంతయు నవ్యక్తం బనుతత్త్వంబునం దావిర్భావతిరోధానంబులం బొందు చుండు. 85

క. అవ్యక్తతత్త్వ మరయఁగ, నవ్యక్తం బయ్యు [1]నిట్టి దై లక్ష్య మగున్
సువ్యక్తేంద్రియభూతా, దివ్యవహారార్థలింగదృష్టాకృతి యై. 86

వ. అని చెప్పి మఱియు ని ట్లనియె. 87

తే. అనఘ శబ్దాదివిషయంబులందుఁ దగిలి
యిచ్చఁ జరియించు నెప్పుడు నింద్రియములు
బుధుఁడు దత్స్వభావముఁ దనబుద్ధి నెఱిఁగి

1. క. నిట్టు లాలక్ష్య మగున్.

యేమఱక వానిఁ దగఁ గుదియింప వలయు. 88

ఉ. ధీరుఁడు నిర్జితేంద్రియుఁడు దెల్లముగాఁ దనుఁ గాంచు భూతవి
స్తారనిరూఢమైనపరతత్త్వముగాఁ దనయందు భూతవి
స్తారము నెల్లఁ గాంచు సతతస్ఫుటదర్శనుఁడై [1]సమగ్రచి
త్సారముఁ బొంది నిర్మలతపంబులయందుఁ జలింపఁ డెప్పుడున్. 89

క. తప మనఁగ సకలవిషయ, వ్యాపేత మగునట్టిబుద్ధివైభవము సుమీ
తపమున సుస్థిరుఁ డగుయో, గపరునకుం గలవె యొండుకర్తవ్యంబుల్. 90

క. స్వర్గనరకంబు లింద్రియ, వర్గసమాచరణమునన వచ్చును వినవే
స్వర్గ మగుఁ దన్నివారణ, దుర్గతి యగుఁ దన్నిరోధదుర్బలతమెయిన్. 91

చ. అరదము దేహ మింద్రియము లశ్వము లాత్ముఁడు సూతుఁ డమ్మహా
తురగచయంబు ధైర్య మనుతోరపుఁబగ్గముల న్దృఢంబుగా
నురవడిఁ బోక యుండ వెర పొప్పఁగఁ బట్టినవాఁడు [2]సేమపుం
దెరువున నేఁగు నప్పరమధీరుఁడు సువ్వె యుదారుఁ డెయ్యెడన్. 92

తే. ఇంద్రియంబులు దివిచినయెడ పాఱుచుండు మన సెప్డుఁ దద్వేగమునుపరున్న
నడలి చెడి పోవు బుద్ధి యుద్దీర్ణపవన,హతిఁ బయోనిధిలోఁ గలము మవియునట్లు.

క. ఏ నింద్రియములు మనసును, బూని తనవశంబ మైనఁ బురుషుండు [3]సదా
ధ్యానసమాధిసమగ్రుఁడు, వానిం గీర్తింతు రమరవరులు మునులున్. 94

వ. అనిన నవ్విప్రుండు సత్త్వరజస్తమోగుణంబుల తెఱం గెఱింగింపు మనిన నెఱు
కి ట్లనియె. 95

క. అతినిందితము దమోగుణ, మతిమోహమయంబు సత్త్వ మనయంబుఁ బ్రకా
శత నొప్పు నుభయగుణమి, శ్రతఁ బరఁగు రజోగుణంబు సన్నుతచరితా. 96

మ. అసుఖాకారత నిద్ర దైన్యము విమోహం బక్షమత్వంబుఁ దా
మసభావంబులు రాగలోభజడతామానంబు లూహింప రా
జసవృత్తంబులు ధైర్యశాంతికరుణా[illegible]షవిద్యాదు లిం
పెసఁగన్ సాత్త్వికచేష్టితంబులు నిజం బిట్లాత్మఁ గన్గొన్నియున్. 97

చ. అనఘుఁడు సాత్త్వికుం డగుమహాత్ముఁడు బోధనిరూఢి [4]సర్వముం
గనికొని లోకవృత్తములు గావని రోసి సమస్తసంగభం
గనిరతుఁడై తొలంగు మమకారవికార మహంక్రియాచ్యుతిం
బనుపడి సంయమప్రకటభావన నుత్తమశాంతి గైకొనున్. 98

వ. సత్త్వగుణనిబద్ధుం డగునేని శూద్రుండైనను జన్మాంతరంబున వైశ్యత్వంబు
నొంది క్రమంబున రాజభూసురభావంబులు భజించి భవవిముక్తుం డగు నని
చెప్పిన నమ్మహీదేవుం డమ్మహానుభావు నభినందించి. 99

1. క. సమగ్రవిస్ఫారత. 2. అ. స్వర్గపుం. 3. క. గ. చ. గదా. 4. అ. దత్త్వముం.

తే. దేహమున ధాతుసంశ్రయదీప్తుఁ డగుచు, వహ్ని యెట్లుండు శారీరవాయువులకు
నెలవు లెయ్య వెయ్యవి నాకు నిశ్చయముగఁ, జెప్పు మనుటయు నిట్లని చెప్పె నతఁడు.
సీ. మూర్ధదేశమునకు వర్ధితం బై పర్వు, నాత్మాగ్ని నాభి దదాశ్రయంబు
శిరమునఁ బావకాంతరమునఁ జరియించుఁ, బ్రాణుండు భూతాత్మభావుఁ డతఁడు
వరుసఁ బ్రాణాపాను లిరువురు నయ్యగ్ని, వెలిఁగింతు రనపేతవృత్తు లగుచు
గుదవస్తితలము లాస్పదములుగా వహ్ని,పరిగతుం డగుచు నపానుఁ డుండుఁ
తే. గడఁగి విణ్మూత్రనిర్గమకారి యతఁడు, కర్మబలయత్నకారి నై కంఠతలము
నందు దానుండు వర్తించు నఖిలదేహ, సంధులందును వ్యానుండు సంచరించు.
క. విను ప్రాణాపానులు న, య్యానలుఁడుఁ బ్రాపుగ సమానుఁ డన్నరసవిపా
చనుఁ డగుచు నోష్ఠదేశం, బున నుండును సకలధాతుపోషకవృత్తిన్. 102
క. ఇది పరమయోగిదర్శన, విదితం బిప్పాటఁ బవనవిదు లైన మునుల్
వదలక యభ్యాసవిధిన్, ముదమున ధరియింతు రాత్మమూర్ధతలమునన్. 103
వ. ప్రాణాపానసమాహితుం డై సకలదేహంబులందును జరియించుచున్న పావకుండు
[1]జీవాత్ముండు గా నెఱుంగు మతఁడు జలంబుల నున్న కమలపత్త్రంబునుం బోలె
దేహంబునం దుండియు నిర్లేపస్వరూపదీపితుం డయి వెలుంగుచుండు నిట్టి
జీవాత్ముండ కదా పరమాత్ముండు. 104
క. చేతనరహితక్షేత్రముఁ, జేతనముం బొరయఁ జేయు జీవాత్మ దశో
పేతుఁడు పరమాత్ముఁడు వి, ఖ్యాతుఁడు త్రైలోక్యసంప్రకల్పనుఁ డనఘా. 105
క. భూతములయందు వెలిఁగెడు, భూతాత్ముని నెఱుఁగుదురు ప్రబుద్ధులు నిత్య
జ్యోతిర్మయు నవ్యయు న, ద్వైతం బగుబుద్ధి సూక్ష్మధర్మమువలనన్. 106
వ. [2]అని మఱియుఁ గౌశికునకు ధర్మవ్యాధుండు బ్రహ్మవిద్యాప్రభావంబు తెఱఁగు
సంప్రయోగరహస్యంబు దెలియ నిట్లనియె. !07
సీ. తెలివి నొందినబుద్ధి గలమహాత్ముండు శు, భాశుభకర్మములందుఁ జొరఁడు
క్రమమున సౌఖ్యదుఃఖము లాదిగా నశే,షద్వంద్వములయందు సమత నుండు
విను మట్టిపుణ్యున కొనరింప వలయుకా, ర్యం బెఱింగించెద ననుదినంబు
నియతాశియును జితేంద్రియుఁడు నై పూర్వరా,త్రమ్మున నపరరాత్రమ్మునందు
తే. యోగధారణనిరతుఁ డై యుండవలయు, నపుడు బోధదీపంబున నాత్మ నాత్మ
యందుఁ గనుచు నివాతదీపానుకారి,యై వెలుంగుచు నమృతమయత్వ మొందు.
క. కామంబును గ్రోధంబును, నేమఱక జయింప వలయు నెల్లవిధములన్
ధీమహిత యిదియ సతత, క్షేమంకర మైనపథము కృతబుద్ధులకున్. 109
క. నిత్యముఁ గర్మియుఁ గర్మఫ, లత్యాగియు నగుట లెస్స లౌల్యవియోగం

1. క. శివాత్ముండుగా. 2. ఈవచనంబు వ్రాఁతప్రతుల నెల్లఁ గనుపట్టదు.

బత్త్యుత్తమయోగము ద, త్ప్రత్యయలక్ష్యుండు సూవె బ్రాహ్మణుఁడు మహిన్.

చ. అరయఁగ జీవితంబు గడు నధ్రువ మింత యెఱింగి యాత్మ నె
వ్వరిదెసఁ గీడు రోయక ధ్రువం బగుమైత్త్రి భజించి సత్కృపా
నిరతుఁడు నిష్పరిగ్రహుఁడు నిత్యతపస్వియు నిత్యతృప్తుఁడుం
బరమశమాస్పదుండు నగుబ్రాహ్మణుఁ డొందు సనాతనస్థితిన్. 111

వ. నీ వడిగినయఖిలధర్మంబులు సంక్షేపరూపంబున నెఱింగించితి నింక నెయ్యది విన వల తనినం గౌశికుండు మహాత్మా విన వలయునవి యెల్లను విశదంబుగా వింటిం బ్రబుద్ధుండ నైతి నీవు సర్వజ్ఞుండ వగుట దెల్లం బయ్యె ననిన ధర్మవ్యాధుం డతని కి ట్లనియె. 112

క. ఏ నిమ్మెయి నుత్తమవి, జ్ఞానోన్నతి వడయుటకు నిజం బగుమూలం
బై నది గల దొకధర్మము, భూనుత యది నీకు దృష్టముగ నెఱిఁగింతున్. 113

వ. అభ్యంతరగృహంబునకు రమ్మని యతనిం దోడ్కొని చని మనోహరం బై చతుశ్శాలం బై వివిధసౌరభసంవాసితం బై నహర్మ్యంబునందు మహితాసనాసీను లైనవారిం దనజననీజనకుల నభిమతాహారపరితోషితులఁ బరమాంబరాభరణగంధమాల్యాలంకృతమూర్తుల నతనికిం జూపి తానును దత్పాదప్రణామంబు సేసి వారలఁ గుశలం బడిగిన నయ్యిరువురుం బుత్త్రున కి ట్లనిరి. 114

సీ. అన్న కుమార నీయట్టిసత్పుత్త్రుండు, గలుగ మా కేమిటఁ గడమ సెపుమ
నీచేయుధర్మంబు నీకుఁ దో డయ్యెడుఁ, బరమాయురర్థసంపదలుఁ గనుము
నీచరిత్రంబున నిఖిలవంశముఁ బవి, త్రిత మయ్యె మానుషదేహ మేల
ధరియించితో కాని తత్త్వ మారయఁ బర, దేవత వీవు సందియము వలదు

తే. వాఙ్మనఃకర్మములఁ బితృవత్సలత్వ, మొక్కరూపుగఁ జలుపుచు నున్నయట్టి
సద్గుణాకరు ని న్నెన్ని జామదగ్న్య, నొకని నెన్నంగఁ దగుఁ గాక యొరులు గలరె.

వ. అని పలికి రప్పుడు ధర్మవ్యాధుండు వారికిం గౌశికుం జూపి యీమహాత్ముండు మనలఁ (బరమానందంబునం) జూచువేడ్క నిట వచ్చె ననిన నావృద్ధు లతనికి నర్హసత్కారంబులు గావించినం గైకొని యతండు వారలఁ గుశలం బడిగె నంత న వ్విప్రునకు లుబ్ధకుం డి ట్లనియె. 116

సీ. జననుత వీరు నాజననియు జనకుండుఁ, జూవె వీరలకు శుశ్రూష సేసి
యిట్టిపరిజ్ఞాన మేను బ్రాపించితి, నమరులఁ బూజింతు రర్థి నెల్ల
వారును నొండుదైవంబుల నెఱుఁగ నీ, వృద్ధులు నాపాలివేల్పు [1]లనుచుఁ
గమనీయఫలపుష్పగంధభూషణవస్త్ర, ములు మనోహరభక్ష్యభోజ్యములును

తే. వీరి కెపుడు నివేదింతు వేడ్కఁ బుత్త్ర, దారసహితుండ నై నియతముగ సేవ

1. క. గ. లనఘ.

యాచరింతును వేదముల్ యజ్ఞములు [1]వ్ర,తంబులును వీరనాకను తలఁపుదృఢము.

తే. జనని జనకుఁడు సద్గురుఁ డనలుఁ డాత్మఁ, డనఁగ నియ్యేవురును నేగృహస్థుచేత
సుగతివాంఛఁ బ్రసాదితులగుదు రట్టి,వాఁడ చూవె ధర్మాత్ముండు వసుధమీఁద.

వ. అని చెప్పి యిట్లనియెఁ బతివ్రతపనుపునం జేసి నీవు ధర్మజ్ఞానార్థంబు నాయున్న యెడకుం జనుదెంచిన నప్పతివ్రతవలనియనుగ్రహంబున నీకు నెల్లవియు నెఱింగించితిఁ గాని నీదెస నాదుచిత్తంబు ప్రియంపడి యుండదు నీచేసినయకార్యం బొక్కటి గల దది యెయ్యది యనిన. 119

ఉ. ఎంతయు వృద్ధులై తమకు నీ వొకరుండవ తెప్ప గాఁగ న
త్యంతముదంబునన్ బ్రదుకు తల్లిని దండ్రిని నుజ్జగించి ని
శ్చింతుఁడవై సదాధ్యయనశీలత వారియనుజ్ఞ లేక యే
కాంతమ యిమ్ములన్ వెడలి తక్కట నీవు కరంబు క్రూరతన్. 120

ఆ. నీకు వగచి వగచి నిర్భిన్నహృదయులై, విగతచక్షులైరి వినవె వార
లరిగి యింకనైన సమ్ముదుసల్లయు, దగ్రశోకవహ్ని నార్పవయ్య. 121

క. నీయధ్యయనమ్మును సుకృ, తాయాసము నిష్ఫలంబులై చను గురుసే
వాయుక్తి లేక తక్కినఁ, జేయుము నాపలుకు మేలు సేకుఱు నీకున్. 122

వ. అనినఁ గౌశికుం డతని కిట్లనియె. 123

క. ఇది యట్టిద నీచెప్పిన, సదమలహితవాక్యభంగి సకలము వింటిన్
వదలక యిమ్మెయిఁ జరియిం, చెద గురుజనములకుఁ బ్రీతిఁ జేసెద ననఘా. 124

క. నా దైవభాగ్యవశమునఁ, గాదే నీతోడిచెలిమి గలిగెం బరమా
హ్లాదమనస్కుఁడ నైతి శు, భోదయముల కెల్ల నింక యుక్తుఁడ నైతిన్. 125

క. పాపకృతం బగుదుర్గతిఁ, బ్రోపుఁ గనక యుండ నను బ్రబోధాధికలీ
లాపరిణతుఁ గావించితి, నాపాలిటివేల్పు వీవు నరనుతచరితా. 126

చ. అనుపమ మెట్టివారలకు నందదు ధర్మపథంబు ధాత్రిలో
విను పదివేవురం దొకఁడు విశ్రుతధర్మపరాయణుండు గ
ల్గునొ కలుగండొ సందియము గోరి సనాతనధర్మ మీఁది యె
వ్వనికిని నీకుఁబోలె బుధవత్సల యిట్లు చరింప వచ్చునే. 127

చ. నిను నొకశూద్రుఁగాఁ దలఁప నేర గుణాకర నీచరిత్రముం
గన మది నద్భుతం బొలసెఁ గావున నెయ్యది కారణంబుగా
నొనరఁగ నిట్టిజన్మమును నొందితి చెప్పుము భూతభావివ
ర్తనములయందు నీకు విదితంబులు గానివి గల్గ వెమ్మెయిన్. 128

వ. అనిన నతనికి ధర్మవ్యాధుం డిట్లనియె. 129

---

1. అ. ను, వ్రతములును వీర నా కను వ్రతము దృఢము.

ధర్మవ్యాధుఁడు గౌశికునకుఁ దనపూర్వజన్మవృత్తాంతంబు సెప్పుట.

క. జననుత నీ వెయ్యది యడిగినఁ దెలుపుట నా కవశ్య|కృత్యము గాదే
విను చెప్పెదఁ బూర్వభవం,బున నే నొకబ్రాహ్మణుండఁ | బుణ్యచరితుఁడన్.

వ. వేదవేదాంగపారంగతుండనై యుండుదు నాకుం బ్రియసఖుండైన యొక్కరా
జపుత్త్రుతోడిసంగతిం జేసి ధనుర్వేదంబు నభ్యసించితి నొక్కనాఁ డమ్మహీపతి
వేఁట వోయిన నేనును నతనితోడన చని వనంబునం బెక్కుమృగంబుల నేయు
చుండ నం దొక్కబాణంబు దృణలతాంతరితదేహుం డైన మునివరు నొక్కరుం
దాఁకిన నతండు హా యనుచుం బడియె నంత నేనును. 131

ఆ. డాయఁ బోయి తీవ్ర|సాయకవిద్ధుఁ డై, పొరలుచున్న విప్ర|వరునిఁ జూచి
తలఁకి యనునయంపుఁ|బలుకులు వలికినఁ, గినిసి యిట్టు లనియె | మునివరుండు.

ఆ. బ్రాహ్మణుండ వయ్యుఁ | బాపప్రవృత్తివై, శూద్రకర్మమునకుఁ | జొచ్చి తీవు
గాన నిక్కువము మృ|గవ్యాధజన్ముండ,వగుము మీఁద ననియె | ననిన నేను.

చ. ఎఱుఁగక తప్పు సేసితి స|హింపఁగదే కడు దుర్భవంబునం
బఱుపకు మయ్య నావుడుఁ గృ|పన్ మునినాథుఁడు దప్ప దివ్విధం
బెఱుకకులంబునందు జని|యించియు ధర్మువు లెల్ల నిమ్ముగా
నెఱిఁగెదు తల్లిదండ్రులకు | నెంతయుభక్తి యొనర్తు ప్రీతితోన్. 134

వ. గురుశుశ్రూషం జేసి నీకుఁ బరమశోభనం బగు జాతిస్మరత్వంబునుం గలుగు
నపరజన్మంబునం బరమబ్రాహ్మణుండ వయ్యెద వని యనుగ్రహించిన నవ్విప్రుని
దేహంబునందు నాటినబాణంబు మెత్తన వెలికి యతనిం దదీయాశ్రమంబునకుం
జేర్చితి నాచేసినపుణ్యంబున నమ్మహాత్ముండు నపాయంబు వొందం డయ్యె నాకు
నిట్టిజన్మంబు నొంద వలసె నని చెప్పినం గౌశికుం డిట్లనియె. 135

తే. జన్మ మిట్టిది చరితంబు|చంద మిట్టి దెన్నఁడును నిట్టిచోద్య మే|నెందుఁ జూడ
నింక జన్మాంతరముదాఁక | నేల యిపుడ,పుణ్యచరితమై నీవు వి|ప్రుఁడవె కావె.

ఆ. పాపవర్తనుండు | బ్రాహ్మణుం డయ్యును, నిజము శూద్రుకంటె | నీచతముఁడు
సత్యశౌచధర్మ|శాలి శూద్రుం డయ్యు, నతఁడు సద్ద్విజుండ | యనిరి మునులు.

క. అనయంబు నాత్మకర్మం,బున నతినీచ మగుభవముఁ | బొంద 'వలసెనే
యని నీవు నిరంతరమును, మనమున దుఃఖింప వలదు | మహితచరిత్రా. 138

చ. నిజగుణదోషకర్మముల | నెట్టన మేలును గీడు వచ్చుఁ ద
త్ప్రజనితసౌఖ్యదుఃఖములఁ | బ్రాజ్ఞులు దుల్యమనస్కులై మనో
రుజలును దేహజంబు లగు|రోగములున్ హితధర్మకర్మభే
షజములఁ జేసి పాపుదురు | సర్వము సాత్త్వికదృష్టిఁ జూచుచున్. 139

క. ప్రియములు వాయుటయును న,ప్రియములు వెసఁబొందుటయును|బెల్లుగ నగుఁ ద
త్క్రియలందు మూఢమతికిహృ,దయతాపము వాయ దెపుడుఁ|దరికొనుచుండున్.

తే. వగతు మన్న నెవ్వారికి వగవఁ జనదు, చిత్తమున నేమిటికి సంతసింపఁగాదు
కాన గతమునందును ననాగతమునందు, వగవ రార్యులు సంతోషవంతులగుచు.

క. వగపునఁ దేజోహీనుం, డగు నాత్మహితక్రియలకు నశక్తుఁ డగు న
వ్వగపు దొఱఁగి యుద్యోగము, దగఁ జేయఁగఁ గలుగు నంచితములగుశుభముల్.

వ. కావున భూతంబులసదసత్ప్రకారంబులు గనికొని ధీరుండ వై యుండు మనిన నాధర్మవ్యాధుండు మహాత్మా నీచెప్పినయంతవట్టు నిదర్శనంబులుగాఁ గొని యేను నిర్వేదుండ నై భవిష్యత్కాలసద్భావంబునందు సమాహితుండ నై యుండువాఁడ ననియె నంత నాభూదేవుండు. 143

చ. అతులితపుణ్యమూర్తివి కృతార్థుఁడ వెందును నీవు ధర్మమూ
ర్జితముగ నెప్పు డేమఱక చేయుచు నుండుము నిత్యశోభన
స్థితి వెలుఁగొందు మేను భవదీయసమాగతిఁ జేసి ధర్మసు
స్థితమతి నైతి నన్ను మఱతింపు గుణాకర పోయి వచ్చెదన్. 144

వ. అని వానికిం బ్రదక్షిణంబు సేసి వీడ్కొని చని కౌశికుండు నిజజననీజనకుల కతిభక్తి శుశ్రూష సేసి కృతార్థుం డయ్యెం బాండవోత్తమా నీయడిగిన తెఱంగునం బతివ్రతామాహాత్మ్యంబును బితృశుశ్రూషావిశేషంబును హీనవర్ణుం డయిన వాఁడు ధర్మంబు సలుపునుపాయంబును జెప్పితి ననిన విని ధర్మతనయుండు సంతసిలి మఱియు మార్కండేయు నిట్లని యడిగె. 145

తే. అగ్ని దేవుండు దొల్లి మహాతపంబు, సేసె ననఁ విందు నది యేల చేసె ననఘ
యంగిరసుఁ డేమికతమున నగ్ని యయ్యె, నగ్ను లెన్నిభేదంబుల నతిశయిల్లు.

మార్కండేయుఁడు ధర్మజునకు నంగిరసుం డగ్ని యైన తెఱంగు సెప్పుట.

వ. ఇంతయు విన వలతు ననిన నమ్మహాముని యిట్లని చెప్పె నగ్నిదేవుండు దేవతల తోడియలుకం జేసి హవ్యంబులు వహింప నొల్లక వనంబునకుం జని బహుకాలంబు ఘోరతపంబు సేయుచు నత్యంతకృశుం డై యాత్మగతంబున. 147

చ. అలుకమెయిం దొడంగి విపినాంతరభూమికి వచ్చి యిట్లు నే
వెలుఁగక యున్నచో భువనవృత్తము సర్వము నిల్చు నిల్చినన్
జలరుహసూతి వేఱొకనిఁ జయ్యన నగ్నిపదంబునందుఁ దా
నిలుపక యున్నె నే నిచట నిల్చుట పోలదు పోయెదన్ వెసన్. 148

వ. అని తలంచి తపంబు సాలించి నిజపదంబున కున్ముఖుం డయి చని చని యంతకు మున్న బ్రహ్మనియోగంబునం ద్రిలోకంబులకు నగ్ని యై వెలుంగుచున్నవాని నధికతపోవిజృంభితు నంగిరసుం గని భయంపడి యెప్పటియట్ల మగిడి పోవునెడ నంగిరసుం డతనిపాలికిం జనుదెంచి యిట్లనియె. 149

చ. అనఘ జగత్త్రయార్చితుఁడ వై తిమిరాపహరుండ వై తగన్
వనరుహగర్భుచేఁ బ్రథమవహ్నిపథంబునఁ గల్పితుండ వై

తనరుదు నీవు నీ దగుపదంబున నే నిటు లుండ నోడుదుర్
ఘనముగ నీవు నీపదము గైకొనవే యవికల్పభావనన్. 150

వ. అనిన నగ్నిదేవుం డిట్లనియె. 151

క. విను నాకీర్తి జగంబులఁ, బొనుఁగుపడియె నీవు భువనపూజితవృత్తిం
బనుపడితి గానఁ దగు నీ, యనలపదవి నీక నారు నలవడ దింకన్. 152

వ. నీవు ప్రథమాగ్నివై యుండు మేను ద్వితీయం బగుప్రాజాపత్యవహ్నినై వర్తించెద ననిన నంగిరసుండు దేవా యిట్లానతీవలదు ప్రథమాగ్నిత్వంబు నీవకైకొని నన్ను నీకుం బ్రథమపుత్త్రుం గా నాదరింపు మనినం బావకుండు దాని కొడంబడియె నివ్విధంబున నంగిరసుఁ డగ్నికి నగ్రతనయుం డై యగ్నిసారూప్యంబునం దేజరిల్లె నయ్యంగిరసునకు శివ యనుదానికి బృహత్కీర్తియు బృహజ్జ్యోతియు బృహద్బ్రహ్మయు బృహన్మనసుండును బృహన్మంత్రుండును బృహద్భానుండును బృహస్పతియును నన నేడ్వురుగొడుకులు మఱియు భానుమతియును రాకయు సినీవాలియుఁ గుహువు నర్చిష్మతియు మహిష్మతియు మహామతియు నన నేడ్వురు గూఁతులుం బుట్టిరి. 153

క. తనయుఁడు బృహస్పతికి న, త్యనఘుఁడు శంయుండు వుట్టె యాగంబులలో
మును హవిషాజ్యమ్మును దాఁ, గొనియెడువాఁ డయ్యె నధికగుణయుక్తిమెయిన్.

వ. ఆశంయునకు ధర్మపత్నియైనసత్యకు భరద్వాజుండును భరతుండును నా నిరువురు గొడుకులు వుట్టి రందు భరతునకు భారతుం డనుకొడుకును భారతి యనుకూఁతురుం బుట్టిరి భరద్వాజునకు వీర యనుదానికి వీరుండు వుట్టె. 155

క. వానికి సరయువునకుఁ బటు, భానుం డై వుట్టె సుతుఁడు భానుఁ డనఁగ నా
భానునకు నిశ్చ్యవనుఁ డనఁ, గా నాత్మజుఁ డుద్భవించెఁ గడు నుజ్జ్వలుఁడై. 156

చ. అతనికిఁ బుట్టెఁ బుత్త్రుఁడు నిరంతర తేజుఁ డుదారకీర్తి ని
ష్కృతి యను పేరివాఁడు విను కిల్బిషభాజను లైనమానవుల్
సతతము నాకృశాను నతిసక్తమనస్స్థితిఁ గొల్చి దోషని
ష్కృతి దగఁ గాంతు రట్లగుటఁ గీర్తిత మయ్యెఁ దదాఖ్య వానికిన్. 157

క. ఘనుఁడు రుజస్కరుఁ డనఁగా, జనియించెను నాతనికి రుజస్కరునకు న
త్యనుపమకాంతిపరుం డై, జనియించెం గ్రోధుఁ డనఁగ జనవరతిలకా. 158

వ. ఆక్రోధునకు రసుండు వుట్టె రసునకు స్వాహా యనుకన్యకయుం గాముం డనుకొడుకునుం బుట్టిరి కామునకు నమోఘుండు వుట్టె నమోఘునకు నుక్థుండు వుట్టె మఱియుం గాశ్యపుండును వాసిష్ఠుండును బ్రాణుండును నాంగిరసుండును జ్యవనుండును నను నా లేవురు తేజస్వి యైనకొడుకుం బడయుదు మని యనేకవర్షంబులు ఘోరతపంబు సేసి మహావ్యాహృతిస్మరణంబు సేయుచున్నంత. 159

చ. అనలముచాయ మస్తకము నర్కనిభం బగుబాహుయుగ్మమున్

గనకసముజ్జ్వలంబు లగు కన్నులుఁ జర్మము కృష్ణవర్ణతం
దనరినజంఘలుం గలయు దాత్తపుదేహము దేజరిల్లఁగా
దనయుఁడు పుట్టె వారలకుఁ దద్దయు నద్భుత మందె లోకముల్. 160

వ. ఇట్లు పుట్టినయప్పావకుండు పంచజనప్రభవుండు గావునం బాంచజన్యుం డనుపే రం బ్రసిద్ధుం డై దశసహస్రవర్షంబులు దపంబు సేసి నిజమస్తకంబున బృహద్ర థంతరు లనువారలను వదనంబున హరిని నాభియందు శివుని బలంబున నింద్రు నిం బ్రాణంబుల వాయ్వగ్నులను బాహుయుగదంతపుటంబుల విశ్వభూతంబుల సృజియించె మఱియును. 161

క. తపుఁ డనువహ్ని నిరంతర, తపోనిరూఢుఁ డయి పంచదశపుత్త్రుల న
త్యపరిమిత ఘోరతేజో, విపులాత్ములఁ గనియెఁ గపటవృత్తినిపుణులన్. 162

వ. ఆపదియేవురు సుభీముండు నతిభీముండును భీముండును భీమబలుండును నతిబ లుండు ననువా రొక్క మొగియును సుమిత్త్రుండును మిత్త్రవంతుండును మిత్త్రజ్ఞుం డును మిత్త్రవర్ధనుండును మిత్త్రధర్మయు ననువా రొక్కమొగియును సురప్ర వీరుండును వీరుండును సువేషుండును సువర్చసుండును సురహంతయు ననువా రొక్కమొగియునుగా నిట్లు మూఁడుమొత్తంబు లై యజమానులయజ్ఞఫలంబు లపహరించుచుండుదురు తత్ప్రశాంత్యర్థం బై యాగంబులందు నగ్నిచయనంబు సేయు నది. 163

తే. అధిప విహగాకృతుల నొప్పు నగ్నిచయన, ములయుదగ్రపతౌఘాతములను విప్ర
వరులమంత్రఘోషములను వారు నిహతు, లై భయంపడి చేరరు యజ్ఞభూమి.

వ. తపుండు మఱియు సకలయజ్ఞభాగభుజు లైనపుత్త్రుల నేవురం గనియె నం దగ్రజుండు. 165

సీ. వైశ్వానరుం డను వహ్ని చాతుర్మాస్య, విధులందు భూసుర వితతిచేతఁ
బర్జన్యసహితుఁడై పరమార్చనముఁ గాంచు,నధిపరెం డగునాతఁ డఖిలమునకుఁ
బ్రభుఁడు దానై విశ్వపతి యన విలసిల్లు,వినుము మూఁడగువాఁడు విశ్వమునకు
నాత్ముఁ డై విశ్వకుం డన నొప్పు నాలవు,నతఁడు భూతములయాహారవితతి

తే. వెలయఁ బక్వము సేయుట విశ్వభుక్కు, నాఁగఁ బెంపొందు గోపతి నామధేయుఁ
డై సమస్తధర్మక్రియలందు హేతు, వై ప్రశస్తి వహించు నే నవుసతండు.

వ. మఱియు భానుం డనువహ్నికి భానుపుత్త్రి యైనబృహద్భాసయందు బలదుండును మన్యుమంతుండును ధృతిమంతుండును నాగ్రయణుండును నగ్నియు సోముండు ను నన నార్వురు గొడుకులు నిశ యనుకాంతురుం బుట్టిరి సకలతపః ఫలంబులు నిర్వహించుట కయి పురందరుండు మనునామధేయుం డయినకొడుకుం బడసె నమ్మనువు భానుపుత్త్రి యైననిశాకన్యం బెండ్లి యై ప్రాజాపత్యుం డనుపేరఁ బరఁగి పరమబ్రాహ్మణులచేత నర్చితుం డయ్యె నివ్విధంబున ననేకవహ్నులు సకలధర్మ

సాధకు లై వెలింగిరి దక్షిణాగ్నిప్రముఖు లయినవహ్నులు వాయుహతిం జేసి య
న్యోన్యసంస్పృష్టంబు లయ్యెనేనియు రజస్వలాదిసంకరంబులం బొరసెనేనియు
మృతకజాతకాదిసంస్పర్శనంబునం బొందెనేనియుఁ దత్ప్రాయశ్చిత్తార్థం బై య
ష్టాకపాలేష్టి సేయ వలయు నని చెప్పి మఱియు మార్కండేయుం డి ట్లనియెఁ.

క. ఆపుఁ డనువహ్ని యతులిత, రూప యయినముదిత యనుతరుణియందు జగ
ద్దీపకు నపార తేజు మ, హాపూజ్యుం గనియెఁ నగ్ని నద్భుతనామున్. 168

చ. అతఁడు త్రిలోకతంత్రము నిరంతర మై చన నిర్వహించుచుఁ
శతమఖుఁ డాది యైనసురసంతతికిం బ్రియ మొప్ప హవ్యముల్
సతతము మోచి యిచ్చుచు భృశం బగుతద్భర మోర్వలేక సు
వ్రతనిరతుం డధర్వుఁ డనువానికి ని ట్లను నాదరంబుతోన్. 169

వ. ఏను దుర్బలుండ నైతి నీవు దేవతలకు హవ్యంబులు మోచి యి మ్మని వానిం బంచి
తాను సముద్రంబు సొచ్చి యందు దాఁగుటయు దేవత లధర్వముఖుం డున్నయెడ
రోయం దొడంగిన నబ్ధిచరంబు లైనమత్స్యంబులు సురలకు నగ్ని దేవుండు జలధి
నుండుట సెప్పుటయుం గనలి యనలుండు మీలం జూచి జనంబులు మిమ్ము నిర్ద
యు లై వధియింతురు గావుత మని శాపం బిచ్చె నప్పుడు. 170

ఆ. హవ్యవహనమునకు నమరోత్తములు దన్ను, వేయువిధుల నోలసి వేఁడుకొనిన
నెట్లు నియ్యకొనక యెంతయు విసిగి స, మీరసఖుఁడు దనదుమేను విడిచె.

వ. ఇట్లు సంత్యక్తశరీరుం డై ధరాతలంబు ప్రవేశించుటయు నతనిచేత విడువంబడిన
దేహంబువలనం బూయంబున గంధకంబు నస్థుల దేవదారువును శ్లేష్మంబున స్ఫటి
కంబును బిత్తంబున మరకతంబును వాతంబునఁ గృష్ణశిలయు నఖంబుల నభ్ర
కంబును స్నాయుసంచయంబునం బ్రవాళంబునుం బుట్టె నతండు భూగర్భస్థితుం
డై ఘోరతపంబు సేయుచున్నంతి భృగ్వంగిరఃప్రముఖు లయినమహామునులు
నిజతపోబలంబున నతనికి నాప్యాయనంబు సేయుటయుఁ దేజస్వి యై ధరణి వెలు
వడి వచ్చి యమ్మహాత్ముం డమ్మహామునులం జూచి తదీయతేజంబు దనకు దుస్స
హం బగుటయు భయంపడి క్రమ్మఱ నంబుధి సొచ్చి యడంగిన. 172

క. విను జననాయక సంయమి, జనములు వహ్నిపని యంతఁ జాలించి ప్రియం
బున నంచితవిధిసంగ్రహ, మునకై పూజించి రధికపుణ్యు నధర్వున్. 173

వ. అయ్యధర్వాగ్ని తేజంబును న మ్మును లతనికిం జేయుబహుమానంబునుం దన్ముఖం
బున నమరులు దృప్తు లగు చునికియుం జూచి సహింపక పావకుండు సకలభూ
తంబులుఁ జూచు చుండ నంబుధి వెలువడి వచ్చి నిఖిలలోకహితార్థంబుగా
నెప్పటియట్ల హవ్యవహత్వంబు నంగీకరించె నిట్లనేకశాఖం బయినయగ్నివంశంబు
ప్రశంసాభాజనం బయ్యె నగ్ను లెంద ఱైననుం దదాత్మ యైన తేజం బొక్కటి
య యని చెప్పిన సంతసిల్లి యమ్మహామునికి ధర్మతనయుం డి ట్లనియె. 174

క. మునినాథ మహాసేనుం, డనలునకుం గృత్తికలకు ౹ హరునకు సుతుఁ డై
ననిమిత్త మేమి తెఱఁగో, విన వలతుం జెప్పవే స౹విస్తరభణితిన్. 175

వ. అనిన మార్కండేయుం డతని కి ట్లని చెప్పెఁ దొల్లి దైత్యులతోడ రణంబు సేసి యోటువడి దేవగణసహితుం డై దేవేంద్రుండు దొలంగి పోయి దానవుల నోర్వ నోపునట్టిమహాసత్త్వుం డగుసేనాపతి నెందుఁ బడయుదునొకో యని యొక్కనాఁడు మానసం బనుశైలంబునకుం జని యం దొక్కయెడ నొక్కరుండ కార్యచింతాపరుం డై యున్నయెడ. 176

తే. ఒక్కదనుజాధముఁడు మొఱ౹యో కడంగి, నన్నుఁ జెఱఁగొని పోయెడు౹నన్నలార
యెవ్వ రిట విడిపింపరే ౹ యింతవట్టు, పుణ్యమునఁ బోవ రయ్య కా౹రుణ్యబుద్ధి.

వ. అని యిట్లు సువ్యక్తం బై నవనితావిలాపంబు వీతెంచినం బురందరుండు నిజాంతరంగంబు గరుణాతరంగితం బగుటయు నోడ కోడ కిదె యేను వచ్చితి ననుచు నద్దిక్కునకు నడచి ముందట నతిభయంకరాకారుం బటుగదాహస్తు నప్రచలితవిద్యుల్లతారుచిరమూర్తి యైనదాని నొక్కకన్నియుం గొని గగనతలంబునం బఱచువానిం బ్రబలవలాహకవినీలదేహుఁ గేశి యనుదానవుం గని సరభసుం డై. 178

ఇంద్రుఁడు కేశి యనురాక్షసునిఁ బాఱఁ దోలుట.

ఉ. ఓరి దురాత్మ యీయబల ౹ నోడక యేటికిఁ బట్టినాఁడ వం
భోరుహనేత్ర విడ్వు మెట ౹ వోయినఁ బ్రాణము గొందు నింకఁ బ్ర
స్ఫారమహీధరప్రకర౹భంగవిహారధురీణ ముగ్రదై
త్యారుణరంజితాశ్రి కులి౹శాస్త్రము సు మ్మిదె యంచు డాసినన్. 179

మత్తకోకిలము. ఘోరవిక్రముఁ డైన కేశియుఁ ౹ గ్రోధఘూర్ణితచిత్తుఁ డై
ధీరుఁ డుక్కున నిల్చి యగ్గద ౹ దీర్చి వాసవు వైచె న
వ్వీరుఁ డుర్వ గద చూర్ణితంబుగ ౹ వ్రేసె నాసురభంగిఁ బొం
గారి దారుణవజ్రపాతర౹యంబునం బటుహస్తుఁ డై. 180

ఆ. అసుర వీఁక నొకమ౹హాచలశృంగంబు, విఱిచి వైచె నమర౹విభునిమీఁద
గోత్రవైరి ఘోర౹కులిశాభిహతి వ్రయ్య, నడిచె దానిఁ జదల ౹ నవరు లెగయ.

వ. ఇట్లు దనసాధనంబులు విఫలంబు లైనం దలంకి దానవుం డక్కన్నియను దిగవిడిచి పఱచిన నింద్రుండు దానిం జేరం జని నీ వెవ్వరిదాన వీరక్కసుచేత నెట్లు పట్టువడితనిన నడి యతని కి ట్లనియె నయ్యా యే నరిష్టనేమి యనుప్రజాపతికూఁతుర దేవసేన యనుదాన దైత్యసేన చెల్లియల నేనును మాయప్పయుం గేళికౌతుకంబునఁ దండ్రి యనుమతంబు వడసి సఖీజనసహితంబుగా వెడలి యిమ్మానసనగంబు సానుదేశంబులం గ్రుమ్మరుచుండం గేశినామధేయుం డైనయీయసురాధముండు.

క. పలుమాఱు వచ్చి తనదు, ర్విలసితములు సూపు మాకు ౹ వేడుకతోడం

బలుకును మేలమునఁ జెనకఁ, దలఁచుఁ గదియ మదనకదనదళితహృదయుఁడై.
తే. వానిచేష్ట లన్నియు దైత్యసేన కభిమ
తంబులై యుండు నాకు నెంతయును దుస్స
హముల యమ్మెయి వినవె యక్కమలనయనఁ
గోరి దానవుఁ డెలయించికొంచుఁ జనియె 184
తే. అంతఁ బోక వెండియు వచ్చియింత సేసె,నద్దురాత్ముఁడు నన్ను మీరైదై నకరుణఁ
దొడరిదుఃఖసాగరమునఁబడుట దప్పె,నని నసయ్యింద్రుఁడనియెనయ్యతివఁజూచి.
క. విను దక్షతనూజలు మా, జననియు మీతల్లియును నిజంబుగ మా కీ
వనుజ వయితి వనజానన, యొనరంగా వేఁడు నీకు నొకవర మిత్తున్. 186
వ. అనిన దేవసేన దేవేంద్రున కి ట్లనియె. 187
తే. అనఘమాతండ్రి యొక్కనాఁడతిముదమున,నన్ను నుపలాలనము సేసినాతినీవు
ప్రథితపౌరుషుఁడగుభర్తఁ బడయుదనియె, నట్టివానిన నీవు నాకరయవలయు.
చ. అనిమిషదానవేంద్రులకు నైన నజయ్యుఁడు నుగ్రవైరిభం
జనుఁడు త్రిలోకరక్షణవశంవదుఁడున్ భవదిష్టమిత్త్రుఁడున్
ఘనగుణకీర్తనుండు నగు కాంతునిఁ గోరెద నామనోరథం
బు నెరయ సంఘటించి సురపుంగవ నన్నుఁ గృతార్థఁ జేయవే. 189
వ. అనిన నింద్రుండు దీనికం బతి యెవ్వం డగునొకో యని కొండొక విచారించు
నెడ నమ్ముహూర్తంబు రౌద్రనామకం బయి సోమసూర్యసంగమకారణం బయిన
యమావాస్యాముఖంబై యుండం బూర్వసంధ్యారాగరక్తాంబుదప్రతిబింబపటల
పాటలితోదకం బైనజలనిధిసమీపంబున నమరాసురసమరసంకులంబుగా నరు
ణకిరణుం డుదయించుచుండఁదత్కాలంబున భృగ్వంగిరఃప్రముఖు లైన మునులు
వేల్చుహవ్యంబులు మోచికొని హవ్యవహనుండు సూర్యమండలంబు ప్రవేశించు
చుండం గనుంగొని యిది సూర్యసోమాగ్నిసమాగమం బయినరౌద్రనామక
ముహూర్తంబు గావున సూర్యసోమాగ్ని తేజంబున జనియించినవాఁడు దీనికిఁ బ్రి
యుండు గావలయు నని మనంబున నిశ్చయించి యతం డాక్షణంబ. 190
క. బాలం దోడ్కొని యబ్జజు, పాలికిఁ జని మ్రొక్కి త్రిదశపాలుఁడు దేవా
యీలలనకుఁ దగువరునిఁ గృ, పాలుఁడ వై యొసఁగు మనినఁబద్మజుఁడనియెన్.
ఉ. దీపితవిక్రమాస్పదుఁడు దీనికి వల్లభుఁ డయ్యెడుం ద్రిలో
కీపరిరక్షణక్షముఁడు కీర్తితమూర్తి యొకండు వాఁడ మీ
యాపద లెల్లఁ బాపుటకు నై ధృతిఁ బూను నశేషదేవసే
నాపతిభావమున్ విబుధనాయక శీఘ్రమ భావ్య మింతయున్. 192
వ. అనినం బ్రీతుం డై పితామహు వీడ్కొని యింద్రుండు సనియెఁ దదనంతరంబ
వసిష్ఠప్రముఖు లైన సప్తమహామునులు లమావాస్యాహోమంబు సేయు సమకట్టి

అమరు లందఱు నందు హవిర్భాగంబులు గొనుటకు నాసన్ను లగుటయు. 193

క. ఆహవనీయముఖంబున, నాహూతుం డై హుతాశుఁ డమ్మును లిడఁగా
నాహుతులు గొని దివిజసం, దోహమునకు వరుస నొసఁగఁ దొడఁగెం బ్రీతిన్.

సీ. ఆసమయంబున నమ్మునీంద్రులభార్య, లందఱు సుస్నాన పొందఁ జేసి
రమణీయమాల్యాంబరవిభూషణాద్యలం, కారంబు లొనరించి గారవమునఁ
జనుదెంచి పతులకు సమ్మతిం బరిచర్య, సేయుచు మెలఁగంగ వాయుసఖుఁడు
మెలఁతలవాలిక మెఱుఁగుఁగన్నులయొప్పుఁ, దెలినవ్వుమొగములవిలసనంబు

తే. నడబెడంగులు సన్నపునడుములందు, వెలయువళులభావంబులు వలుఁదచన్నుఁ
గవల[1]నిక్కును నేర్పడఁ గని కరంగి, మదనమార్గణవిదళితహృదయుఁ డయ్యె.

వ. ఇట్లు వికలేంద్రియుం డై వైశ్వానరుం డమ్మునిపత్నులయందుఁ దగిలినడెందంబు మగిడింప నేరక వారలం గదియ నప్పళించి గార్హపత్యకుండంబునం దావేశించి.

చ. అతివలు దన్నుఁ జేరుటకు నాసపడుం బొరిఁ జేరుచోట నా
యతవిలసచ్ఛిఖాగ్రముల నల్లన వారల నంటుఁ గౌతుకం
బతిశయ మై తదంగలత లాదటఁ గౌఁగిటఁ జేర్పఁ గోరుఁ గం
పితధృతి యై కలంగఁబడుఁ బెల్లగురాగరసంబు ముంపఁగాన్. 197

వ. అంత నమ్మునీంద్రులహోమవిధి సమాప్తం బగుటయు జాతవేదుండు మదనవేదనాభరంబు సహింపనోపక నిర్జనం బయినవనంబునకుం జని మునిపత్నీసమాగమంబు దుర్లభంబుగా వగచి వెగడంది శరీరంబు దిగవిడువ సమకట్టు నెడఁ దదీయవల్లభ యైన స్వాహాదేవి [1]దత్ప్రకారం బంతయు నెఱింగి యతనికిం బ్రియంబు సేయునది యై సప్తమునులలో నంగిరసుభార్య శివ యనుదానిరూపంబు గైకొనిచని యేకతంబ యున్నహుతాశనుం గనుంగొని యి ట్లనియె. 198

తే. అంగిరసుభార్య నేను శివాభిధాన, ననఘ నాకును నాతోడియంగనలకు
ననుదినంబును నతిమనోహరవిలాస, మైననీమూర్తిపైఁ గోర్కి యడరి యుండు.

ఉ. నీమదిచంద మిట్టి దని నిక్క మెఱుంగక నే మజస్రముం
గామశరాహతిం గలఁగి కాఱియ వొందుదు మాత్మలందు నీ
కామము మాదెసం గలిమి కౌతుకచేష్టలయం దెఱింగి యు
ద్దామమనోరథప్రచలితస్థితి నందఱముం గ్రమంబునన్. 200

చ. నినుఁ గవయం దలంచి యిట నెమ్మి మెయిం జనుదెంచినార మిం
పునఁ జెలు లెల్లఁ దొల్త ననుఁ బొమ్మని పంచిన వచ్చితిన్ మనం
బనవరతానురాగమున నంగజ[2]కేళి భజింపు మింక నో
డని యెడ సేసితేని కుసుమాస్త్రుఁడు సైఁపఁడు నన్నుఁ బావకా. 201

వ. అనిన సంతసిల్లి యగ్నిదేవుండు దానిం గైకొనియె నదియును నతని నభిమత

1. క. వీఁకయు. 2. జ. లీల.

భోగంబులం బ్రీతునిం జేసి తదీయ తేజోధాతువు ధరియించి యచ్చోటు వాసి యాతఁడుం బగరుడియై గగనంబునకు నెగసి యతిత్వరితగమనంబున శ్వేతపర్వతం బునకుం జని యం దొక్కయెడ శరవణస్తంబసంవృతం బైనకాంచనకుండంబు నందు నిజభర్తృశుక్లంబు సంగ్రహించి మఱియును. 202

క. మునిపత్నులరూపులు గై, కొని వరుసన్ వచ్చి పుష్పకోమలి ప్రియుఁ బ్రీ
తునిఁ జేయుచు రేతస్కం, దన మొనరించుచును వచ్చెఁ దత్కలశమునన్. 203

తే. విను పతివ్రతాతిలక మై వెలయునట్టి, యయ్యరుంధతిరూపంబు నలవరింప
నెట్లు నేరద కానియయ్యింతి యున్న, యువిద లార్వురరూపులు నొనరఁదాల్చె.

వ. ఇవ్విధంబున నాఱుమాఱులు ప్రస్కందితం బైనయగ్నితేజంబున. 205

కుమారస్వామియవతారము.

క. ఆదిత్యనిభుఁడు విపుల, ద్వాదశబాహుండు షడ్వదనుఁ డఖిలదిశా
రోదోంతరంబు వెలుఁగ మ,హోదారుం డాకుమారుఁ డుదయం బయ్యెన్.

వ. ఇట్లు శుక్లపక్షంబునం బాడ్యమియందు వీర్యనిషేకంబును విదియయందు గర్భ వ్యక్తియుఁ దదియయందు శరీరమాత్రావిర్భావంబునుం జతుర్థియందు సకలావ యవసంపూర్ణతయు నై యుదయించినకుమారుండు పంచమియందు సముత్థితా కారుం డై పేర్చి త్రిపురదహనసాధనం బైనహరుకార్ముకం బమ్మహీధరంబునందు నిక్షిప్తం బై యున్నదానిం బుచ్చికొని గుణధ్వని సేసిన నమ్మహాధ్వని విని కలుషించి యైరావతసుప్రతీకంబు లనుదిగ్గజంబు లయ్యగ్నిభవుమీఁదం బఱతెంచిన నమ్మ హాభుజుం డారెంటెనిం జెనఁచి పట్టి రెండుచేతుల ధరియించి తనసహజం బైనశక్తి యొక్కకేలం గ్రీడార్థకలితం బైనకుక్కుటం బొక్కకేలను బరిపూర్యమాణనిన దం బైనశంఖంబు గరద్వయంబునం దాల్చి హస్తయుగళంబున గగనంబు వ్రేయు చుం బాణియుగ్మంబు వక్త్రంబుల నిడికొని బాల్యోచితంబు లైనయంగుళీచర్వ ణంబులు పొరిఁబొరి నొనరించుచు నిశితసాయకంబునం గ్రౌంచపర్వతవిభేదనంబు సేసి పటుశక్తిపాతంబున శ్వేతశైలశృంగభంగంబు గావించి చెలంగి యాఱు ముఖంబుల నొక్కపెట్ట యార్చినం బ్రళయభైరవారావభీషణం బైనతదా ఘోషణంబున. 207

మ. కులశైలంబులు [1]గ్రక్కదం గదలె దిక్కుల్ వ్రయ్య లయ్యెన్ మహీ
వలయం బంతయు [2]జిఱ్ఱనం దిరిగె దేవవ్రాతముల్ సాధ్వసా
కులతం బొందెఁ బయోధు లన్నియును సంక్షోభించె సప్తాశ్వస
ప్తులు బిట్టుల్కి రథంబు నల్దెసలకుం బో నీడ్చె నుద్భ్రాంతి మైన్. 208

క. అట్టిమహోత్పాతంబులు, పుట్టినఁ గని మునులు లోకములకు శుభముగాఁ
జట్టన శాంతికవిధుల, ప్పట్టున నొనరించి రాత్మభావనపరు లై. 209

1. అ. గ్రక్కునం. 2. క. దిద్దిరం.

వ. ఆసమయంబునం జైత్రరథవననివాసు లైనజను లందఱుం గూడి యంగిరఃప్రముఖమునీంద్రులభార్యలకు నగ్ని దేవువలనం బుట్టినబాలుండు లోకంబులకు నిట్టియనర్థంబు సేయం దొడంగెనని యాక్రోశించిన నయ్యపవాదంబునకు రోసి యాసప్తమునులలోన వసిష్ఠుండు దక్కం దక్కినయార్వురుం దమవనితలం బరిత్యజించిరి మఱియును గొందఱు జనులు వీ రేమి సేయుదు రిన్ని పోకలం బోయినది వహ్నిభార్యయ కాక యని పలుకం జొచ్చి రంత నమ్మహామునులపాలికిఁ బావకాంగన సనుదెంచి యి ట్లనియె. 210

క. వినుఁ డేను వహ్నివలనం, గనినకుమారుండు వాఁడు కడు నిజ మిది మీవనితలకుం బని గా దిటు, సనునే కులసతుల విడువ సత్పురుషులకున్. 211

వ. అని యెంత సెప్పిన వారొడంబడరైరి తదనంతరంబ విశ్వామిత్రుండు గుమారుకడ కరిగి యద్దేవుశరణంబు సొచ్చి వివిధవాక్యంబులం బ్రస్తుతించి తదాదేశంబున నతనికి జాతకర్మాదివిధు లొనరించిన నది యంతయు నెఱింగి యమరు లెల్ల నమరేంద్రుం గానం జని యి ట్లనిరి. 212

ఉ. దారుణశౌర్యధుర్యుఁ డతిదర్పితచిత్తుఁడు వహ్నిసూనుఁ డ
వ్వీరుఁడు నిన్నుఁ గైకొనక వీఁకమెయిం జనుదెంచు నిష్ఠురు
ర్వారత నీపదంబు గొనువాంఛ నవశ్యముఁ గాన యింతలో
నీరస మెత్తి వాని వధియింపుము చెచ్చెర విక్రమోన్నతిన్. 213

వ. అట్లయిన నీకు నింద్రత్వంబు శాశ్వతం బగు నేమును బ్రదుకుదుము లోకంబు లవ్యాకులంబులగు ననినం బురందరుం డప్పుడ సప్తమాతృకలం బిలిచి మీరు సని వహ్నిసంభవుం డైనకుమారు సమయించి నాకుఁ బ్రియంబు సేయుండని పంచినం బనిపూని వారు ఘోరంబుగా నతనిపై నడరి తదీయతేజోవిశేషంబునకు భయం బంది యతని శరణంబు సొచ్చి యేము లోకమాతలము మాయందు నీవు మాతృభావంబు సేయ నర్హుండ వనినం గుమారుండు వారి నభినందించి చేకొనియె నంత నగ్నియు నిజపుత్త్రుపాలికి వచ్చి యతనిచేతం బూజితుం డయి తదీయరక్షాపరత్వంబున నిలిచె మాతృగణంబు క్రోధంబునం బుట్టినయది లోహితాస్య యనుభామిని కుమారునకు దాది యై యుపలాలనంబు సేయుచుండె నఖిలభూతగణంబులుం బఱతెంచి క్రౌంచారిం బరివేష్టించె నది యంతయు విని కలుషించి. 214

ఇంద్రుఁడు కుమారస్వామిపై నెత్తివచ్చుట.

ఉ. స్కందునిమీఁద నెత్తి బలగర్వితుఁ డై నడతెంచె నుద్భట
స్యందనసామజాశ్వభటసంకులసైన్యసమగ్రదేవతా
బృందసమేతుఁ డై భువనభీకరసంగరకాంక్ష నింద్రుఁ డ
స్పందితశౌర్యుఁ డగ్నికణపాతభయంకరవజ్రహస్తుఁ డై. 215

వ. అంత. 216

తరలము. తరళదీధితిపుంజనిర్భరదారుణాయుధపాణు లై
తెరలఁ ద్రోచి దివౌకసుల్ పఱతెంచి యార్చుచుఁ దాఁకి రా
శరవణోద్భవు నాతఁడుం దగ సంభ్రమస్ఫుటరోషవి
స్ఫురితనిష్ఠురహాసజృంభణమూర్తి వహించినఁ జెచ్చెరన్. 217

తే. అతనిముఖగహ్వరంబుల నద్భుతముగ, నుగ్రదహనశిఖావళు లుద్భవించి
వేల్పుమూఁకల నరికట్టి వేల్వఁ దొడఁగె, నంత నెంతయుసంభ్రాంతులగుచుసురలు.

క. నీకింకరులము మమ్ముం, జేకొని కృపఁ గావు మనుచు శిఖనందను న
స్తోకబలు శరణు వేఁడినఁ, జేకొని దాహాభయ ముడుగఁ జేసె నతండున్.

వ. ఇట్లు దేవతలు కుమారు నాశ్రయించినం జూచి బలసూదనుండు క్రోధఘూర్ణిత
నయనుండై యతనిమీఁద వజ్రంబు వైచిన నది తదీయదక్షిణపార్శ్వంబుఁ దాఁ
కిన నం దొక్కపురుషుండు గాంచనవర్ణుండును శక్తిధరుండును మేషవదనుండు నై
విశాఖుం డనుపేరం బ్రభవించె మఱియును గన్యాకుమారగణంబు లనేకంబులు
పుట్టె నది యెల్లనుం గని జనితభయుం డై హరిహయుం డగ్నిసంభవు నభయం
బని కొలిచె నంత నమరులు సంతసిల్లి సింహనాదంబులు సెలంగ షణ్ముఖశత
మఖులం బరివేష్టించి రని చెప్పి వెండియు మార్కండేయుం డి ట్లనియె. 220

సీ. అయ్యగ్నిసంభవు నాయతోన్నతబాహు, నాముక్తకవచుఁ దేజోమహిష్ఠు
నాలోహితాంబరు హారికుండలకర్ణుఁ, గనకరత్నోజ్జ్వలఘనకిరీటు
సంపూర్ణయౌవను సర్వలక్షణయుక్తుఁ, గని యనురాగిల్లి కమలనిలయ
సాకారయై వచ్చి యఖిలంబుఁ జూడంగ, సితపద్మహస్తయై యతనిఁ బొందె

ఆ. శ్రీసమేతుఁ డై విశేషకాంతిస్ఫూర్తి, నొలసి పూర్ణచంద్రుచెలువు దాల్చి
యున్నవానిఁ జూచి రుత్ఫుల్లలోచన, కుముదు లగుచు మునులు నమరవరులు.

వ. అంత షష్ఠదివసంబు సంప్రాప్తం బయ్యె నందు మహామును లందఱు మహాసేను
నతిభక్తిం బూజించి కృతాంజలు లై యి ట్లనిరి. 222

ఉ. పుట్టినయాఱునాళ్లకున పొంపిరివోయి జగంబు లన్నియుం
దట్టుఁడ వై జయించితి ముదంబున నీదుమహత్త్వ మెంతయుం
జిట్టలు గాదె యిట్టియవిశేషయుఁడ వింద్రపదంబు నీక కాఁ
బట్టము గట్టి యేలుము కృపార్ద్ర మము నెల్లను వహ్నిసంభవా. 223

వ. అనినం గ్రౌంచారి వారలం జూచి యింద్రపదవి నుండువారి కెయ్యది కరణీయం
బని యడుగుటయు వా రి ట్లనిరి. 224

మ. బలమున్ దేజము నించి లోకముఁ గృపం బాలించు టర్కేందుభూ
జలతేజఃపవనాంబరంబులకు నస్థైర్యంబు గా కుండ ని
శ్చలశక్తిస్థితి నీగి శిష్టజనరక్షాదుష్టశిక్షానమా
కలనం బింద్రపదస్థుఁ డౌనతనికిం గర్తవ్యముల్ షణ్ముఖా. 225

చ. అనునెడ నిందుఁ డిట్లనియెఁ నట్లయినం గడు లెస్స దేవ నీ
వనిమిషనాయకత్వమునకయం దభిషిక్తుఁడవై ముదంబుతో
ననుఁ బనిగొమ్ము నీదుకరుణాదృష్టిఁ గొల్లను దీటి యుండెదన్
ఘనతరశౌర్యసారుఁడవు గావున నర్హుఁడ వింద్రలక్ష్మికిన్. 226

వ. ఏను దేవేంద్రపదవి నుండ నోడుదు నెట్లనిన భవదీయతేజోవిశేషంబులు సూచి విస్మితులై కొందఱు నీకు నింద్రపదవియందు వేడ్కపుట్టునట్లుగా నేమేనిం జెప్పి నావలనం గొఱగామి కల్పించి నీకును నాకును భేదంబు సేయం జూతురు దానం జేసి నీవు కుపితుండవై నాయెడం గృప దప్పిన నెవ్వారికి వారింప నలవి గాదు లోకభయంకరం బైన విగ్రహంబు ప్రవర్తిల్లుఁ గావున నవశ్యంబును దివిజరాజ్యం బు నీక యొప్పించితి మమ్మెల్ల నేలికొమ్మనినం గుమారుండు నవ్వుచు నిట్లనియె.

ఉ. అట్టిది యేల పుట్టు నమరాధిప నీవు జగత్ప్రభుండవై
యిట్టల మైన తేజము వహించి సుఖంబున నుండు మేను నీ
చుట్టమనై భుజాబలముసొంపున నీకెలసంబు దీర్చెదం
జట్టన నన్నుఁ బంపుము భృశంబుగ నెయ్యది కార్యమిత్తఱిన్. 228

చ. అనవుడు సంతసిల్లి యతఁ డాతని కిట్లను నట్టులైన నీ
పనుపున నేను సత్యహితభాషణ యింద్రపదంబునందు ని
ల్చి నెగడువాఁడనైతి సురసేనల కెల్లను నాయకుండవై
ఘనభుజ నీవు సత్కృప జగద్భయనోదన మాచరింపవే. 229

వ. అనినఁ గుమారుండు మరుత్పతి కిట్లనియె. 230

ఉ. నీకుఁ బ్రియంబుగా భవదనీకినికిం బతి నయ్యెదన్ భుజో
త్సేకపటుప్రతాపము లజేయములై వెనుపొందఁ బేర్చి ఘో యసు
రాకృతులై సనీరిపుల నందఱఁ దున్మెద సర్వలోకర
క్షాకరదైవబుద్ధి నవికల్పుఁడ నయ్యెదఁ గట్టు పట్టమున్. 231

వ. అనిన నతిప్రీతుం డగుచుఁ బురుహూతుండు సకలమునిగణసమేతుం డయి తత్క్షణంబ కుమారునకు నఖిలదేవసేనాధిపత్యంబునం దభిషేకం బొనరించె మునివరులజయజయశబ్దంబులు నమరులసింహనాదంబులుం గిన్నరగంధర్వగానంబులు మంగళతూర్యరావంబులు నప్సరోనర్తనంబులుఁ గల్పతరుకుసుమవర్షంబులు సమకాలప్రవృత్తంబు లయ్యెం బరార్ధ్యభూషణమణిప్రభాలంకృతం బైన కుమారుమౌళిభాగంబున నుజ్జ్వలం బైన ధవళాతపత్త్రంబు సురగిరిశిఖరోపరిగతం బగు శరచ్చంద్రబింబంబు ననుకరించుచుండె నట్టియెడ. 232

ఈశ్వరుండు కుమారస్వామియొద్దకు వచ్చుట.

శా. నానాసిద్ధగణంబు గొల్వఁ బరమానందంబునం జంద్రరే
ఖానద్ధాంచితమౌళి భూరిభుజగాకల్పోజ్జ్వలాకారుఁ డీ

శానుం డానతశంకరుండు గిరిజాసంయుక్తుఁడై వచ్చెఁ ద
త్సేనానిం బ్రియసూను షణ్ముఖుని వీక్షింపంగఁ బ్రేమంబుతోన్. 233

వ. ఇట్లువచ్చి మహాదేవుండు మహాసేనుం గౌఁగిలించుకొని యతనికి విశ్వకర్మనిర్మితంబును హేమమయంబును నయినపుష్పమాలిక యొసంగె నని చెప్పి మార్కండేయుండు పాండవేయున కిట్లనియె వినుము రుద్రుండు మున్ను నిజవీర్యంబు వహ్నియందు సంగ్రహించినఁ దత్తేజోవిశేషంబునం జేసి పావకుండు గుమారు నుత్పాదించె నదియునుంగాక యగ్ని రుద్రుం డని వేదవిదు లైనవిప్రులవలన వినంబడు నట్లగుటం గుమారుండు వహ్నిసంభవుండును రుద్రసూనుండును నని చెప్పంబడియె నగ్నిభామిని కృత్తికాఖ్య లైనమునిపత్ను లార్వురరూపంబులు గైకొని ప్రియసమాగమంబునలిపి శ్వేతశైలంబున రేతస్కందంబుసేయుటం బ్రభవించినవాఁడు గావునఁ గార్తికేయస్కందనామంబులం బరఁగె నని చెప్పి యిట్లనియె.

తే. అప్పు డింద్రుండు మున్ను దా నబ్జభవుని, యోగమున సురక్షితముగ నునిచినట్టి
దేవసేనకుఁ గన్యకాతిలకమునకుఁ, జెలువముగ నలంకారంబు సేయఁ బనిచి.

వ. సముచితప్రకారంబున నచ్చటికిఁ దెప్పించి కుమారుం జూచి యిక్కన్నియ భవదర్థంబై పరమేష్ఠిచేత సృజియింపంబడియెం గావున నివ్వరవర్ణినిం బరిగ్రహింపు మనిన నప్పార్వతీనందనుండు మందస్మితసుందరవదనారవిందుం డయి యమ్ముహూర్తంబునందు. 236

ఉ. మానితవిక్రమోజ్జ్వలుఁడు మంగళతూర్యనినాద మొప్పఁ దే
జోనిధి వహ్నిసాక్షిగ విశుద్ధవిధిజ్ఞుఁడు దేవమంత్రి మం
త్రానుగమం బొనర్పఁగఁ బ్రియం బెసలార వరించెఁ జారుప
ద్మానన దేవసేనఁ గరియానఁ గరగ్రహణప్రయుక్తితోన్. 237

ఆ. గుహుఁడు దేవసేనఁ గోరి పెండ్లియు నైన, యాదినంబు షష్ఠి యగుటఁ జేసి
యర్చనీయ మయ్యె నాదివసంబు లో, కముల కెల్లఁ గరము గౌరవమున.

క. ఏదినమునందు షణ్ముఖు, శ్రీదేవి వరించెఁ గమలచిహ్నితకర యై
యాదివసము పంచమి లో, కాదరణీయంబు లక్ష్మి కాస్పద మయ్యెన్. 239

వ. ఇట్లు విహితమంగళాచారుం డయినకుమారుపాలికిం జనుదెంచి నిజభర్తలచేతం బరిత్యక్త లైనమునిభార్య లార్వురు నధికదైన్యవివర్ణవదన లై యిట్లనిరి. 240

చ. కనుకనిఁ గూడి దుర్జనులు గానక చూడక యేము హవ్యవా
హనునకు నిన్నుఁ గంటి మని యాడిన [1]నందుల కోడి మమ్ముఁ జ
య్యనఁ బతు లుజ్జగించిరి ప్రియంబున నింకిట నీవు మాకు నం
దనుఁడవు మమ్ముఁ బ్రోవ విహితంబు గుమారక నీ కవశ్యమున్. 241

తే. పుణ్యలోకంబులకుఁ బాసి పొక్కుచున్న, మమ్ముఁ జేకొని కరుణాసమగ్రబుద్ధిఁ

---

1. క.|నిందకు|నోడి.

బుణ్యగతియందునిలుపుము । పుత్త్రభావ, దృష్టి వెలయ మాయలమట । దీర్పవయ్య.
క. అనినఁ గుమారుఁడు వినయం, బున నిట్లను నేను మీకుఁ । బుత్త్రుఁడ మీరల్
ననుఁ గన్నతల్లులరు వినుఁ, డనుమానం బేల మీప్రి । యం బొనరింతున్. 243
సీ. అనుచుఁ జేరువ నున్న । యనిమిషపతిఁ జూచి, వీరికిఁ దగుపదం । బారయంగ
వలయు నావుడు బల । వైరి యిట్లనుఁ జంద్రు, సతులైనయాదక్ష । సుతలలోన
రోహిణిపొరువున । రుచి నొప్పనభిజిత్తు, నా నొక్కచుక్క దాఁ । బూని యిప్పు
డందఱికంటె న । త్యంతవల్లభ నేన, యగుదుఁ జంద్రున కని । వగచి యర్థిఁ
ఆ. దపము సేయ నరిగెఁ । దత్పదం బదిరిత్త, యున్నయదియు వీరి । కనుపుమచట
ననిన వారిఁ బ్రీతి । నతఁడు వీడ్కొలిపినఁ, గడఁగి వారు సనిరి । గగనమునకు.
వ. నాఁటంగోలెఁ గృత్తిక లార్వురు నగ్నిదైవత్యం బనం బరఁగునక్షత్రంబై దివంబున వెలింగిరి తదనంతరంబ స్వాహాదేవి యేతెంచి కుమారుంగని నీవు మత్పుత్త్రుండవు నిత్యంబును నేను నీపాల వసియింప వలతు ననినం బ్రీతుండై యాతండట్లకాక నీవు మత్సమీపంబున నుండి యేనును నీకోడలుం గొనియాడం బ్రియంబున నుండు మనియె నప్పుడు కుమారమాతృకలు హవిషయుఁ గాళియుఁ గౌశికయు నుద్ధతయు శారికయు నార్యయు వైధాత్రియు ననువార లేడ్వురుం గుమారుముందట నిలిచి యిట్లనిరి. 245
ఉ. మమ్ము జగత్త్రయంబునకు । మాతలఁగా నొనరింపు [1]మిష్ట ము
న్నిమ్ముల నొప్పమాతృకల । కెక్కుడు గావుత మేము సర్వలో
కమ్ములఁ దొంటిమాతృకలఁ । గైకొన కుండుటయుం బ్రియంబుతో
ను మ్మనిశంబుఁ గొల్చుటయు । మాకు వరంబుగ నిమ్ము షణ్ముఖా. 246

కుమారస్వామి సప్తమాతృకల బాలగ్రహంబులఁ జేయుట.

ఆ. అనిన నగుచు నాతఁ । డట్లేల వారల, పేర్మి మాన్పఁ దగవె । ప్రీతి నొందు
వరము వేఁడుఁ డిత్తు । వదలక యనుడు నా, స్కందమాత లనిరి । గారవమున.
క. అగుఁ గాక యేమి యే మీ, జగములఁ గలశిశువులకు న । జస్రముఁ బీడల్
దగ నొనరించుచు నీకృప, నెగడెద మివ్వరము మాకు । నీ వొసఁగఁ దగున్.
వ. అనినం గార్తికేయుం డిట్లనియె. 249
క. అక్కట కీడు దలంచితి, రిక్కార్యము దగవె యైన । నిచ్చితి మీకున్
మ్రొక్కినఁ గొల్చిన వేఁడిన, నక్కటికముతోడఁ గావుఁ । డమ్మ శిశువులన్.
క. పాయక పదియాఱేఁడుల, ప్రాయమునందాఁక నరుల । బాధింపుఁడు మీ
రాయతమదంశజనితు న, జేయు నొకని మీకు రక్షఁ । జేయం బనుతున్. 251
వ. అని పలికి యమ్మహాసేనుండు నిజదేహంబునం గాంచనవర్ణుం డైనపురుషు నొక్కరు నుత్పాదించిన వాఁడునుం బుట్టునప్పుడ యాఁకలిం దగిలి తిరిగి నేలం బడి మూర్ఛి

1. క. మిష్టముక్.

తుండై నం గుమారుండు వానికిఁ జైతన్యం బొసంగె నతండును స్కందాపస్మారం
బను పేరి గ్రహం బై మాతృకాగణరక్షకుం డయ్యె మఱియు శకునిమాత యైన
వినతయు దైత్యమాత యైనదితియు గోమాత యైనసురభియు శునకమాత యైన
సరమయు వృక్షమాత యైనకరంజయు సర్పమాత యైనకద్రువయుఁ గుమారు
దాది యైనలోహితాస్యయుమాతృగణసమన్వితలై గర్భపీడనంబును శిశుపీడనం
బునుం జేయుచు మనుష్యులవలన బలిమంత్రోపహారదానతర్పణంబులఁ దృప్తిం
బొంది బాలురకు నాయురారోగ్యసుఖంబుల నొసంగుదురు షోడశవర్షంబుల
మీఁదఁ గొన్ని గ్రహంబులు గలవు చెప్పెద వినుము. 252

సీ. నిద్రించుతఱి నొండె నెరయ మేల్కనియున్న, తఱి నొండె సురసముదయముఁ గాంచి
భ్రమసినపలుకులు పలుకుమానవుఁ బొందు, నదియ దేవగ్రహ మని యెఱుంగు
నది శయానుం డయ్యు నాసీనుఁ డయ్యుఁ బి, తృశ్రేణిఁ గని యున్మదించె నేని
నది పితృగ్రహము భ్రాంతాత్ముఁడై నరుఁడు గం, ధర్వులఁ గనిన గాంధర్వమనియుఁ

తే. బరఁగు గ్రహము చోకదికాలపర్యయమున, గదిరి భ్రమియించె నేని యక్షగ్రహంబు
వాతపైత్త్యాదివికృతులవలన బుద్ధి, దప్పుటయు నొక్కగ్రహవైకృతంబ యండ్రు.

క. విను పెబ్బదియేం డ్లగుదాఁ, కను మానవులకు గ్రహోపఘాతంబులు గ
ల్గు ననంతరంబ గ్రహముల, పని వలవదు ముదిమి యెల్లపనులకుఁ జాలున్.

క. నియతి గలిగి యింద్రియముల, జయించి శుచు లైన శాంతిసంపన్నులకుఁ
భయ మొనరింపఁగ లేవ, వ్యయపుణ్య గ్రహము లేయవస్థలయందున్. 255

వ. మఱియు నొక్కటి సెప్పెద. 256

ఆ. ఆదిదేవుఁ డగుమహాదేవుమీఁద నె, వ్వానిమనసు భక్తివైభవమున
నుల్లసిల్లు నతని నెల్లకార్యముల డ, గ్గఱవు సూవె గ్రహవికారకృతులు. 257

వ. అని చెప్పి మార్కండేయుం డి ట్లనియె నట్లు గుహుండు గ్రహంబుల నియోగిం
చు నెడ నగ్నివల్లభ యల్లన యతనిం జేర నరిగి యి ట్లనియె. 258

తే. పుత్త్ర విను మేను దక్షునిపుత్త్రి నన్నుఁ, బావకున కిచ్చె మాతండ్రి బాల్యమునను
నన్ను నతఁ డంత యొల్లఁడు నాకుఁ బతికి, నెపుడు నెడ లేనిపొందుగా నీవొనర్పు.

వ. అనిన నగ్నిభవుండు మహాద్విజులు వహ్నియందు హవ్యంబులు స్వాహాకారకలి
తంబు లయినమంత్రంబుల నొసంగువారు దానం జేసి నీకుఁ బ్రియునితోడి నిత్య
సహవాసంబు సిద్ధించు ననియె నప్పుడు సకలమునిగణసమేతుం డై చనుదెంచి
కమలాసనుండు మహాసేను నభినందించి యంతకు మున్న సన్నిహితుం డై యున్న
మహాదేవు దెసఁ జూచి యతని కి ట్లనియె. 260

ఆ. అనఘ వీఁడె త్రిపురహరుఁడు త్రిలోచనుం, డిదె త్రిలోకమాత హిమనగేంద్ర
తనయ వీరు నీకుఁ దల్లియుఁ దండ్రియుఁ, జువ్వె వీరిఁ గొల్వు సుచిరభక్తి. 261

---

1. అ. బమ్మరించె నేని.

వ. అగ్నిదేవునియందును దదీయభార్యయందును దారు నిజయోగబలంబునం జేసి యావేశించి (శుక్లంబు వెట్టుటం జేసి) యాదంపతులు లోకహితార్థంబుగా నిన్నుం గని రని చెప్పినఁ బార్వతీనందనుండు సానందహృదయుం డయి సకలలోకగురువులైన పార్వతీపరమేశ్వరులం బూజించి సంస్తుతించె నంత నింద్రుండు గార్తికేయునకు నైరావణభూషణం బైన ఘంటాద్వయంబు నొసంగిన సం దొక్కటి కుమారుండు గైకొని యొక్కటి విశాఖున కిచ్చెం బదంపడి. 262

ఈశ్వరుండు గుమారసహితుం డై భద్రవటంబు సేరుట.

మ. తనయుం గౌఁగిటఁ జేర్చుచున్ వరుస మూర్ధఘ్రాణముం జేయుచున్
జనితానందమనస్కుఁ డై గిరిసుతాసంయుక్తుఁ డీశానుఁ డ
య్యనఘుం దోడ్కొని భద్రకేసరిసహస్రాంచద్రథారూఢుఁ డై
చనియెన్ భద్రవటస్థలంబునకు నైశ్వర్యం బవార్యంబుగన్. 263

వ. అమ్మహాదేవుముందట ననేకయక్షగణపరివృతుండును బుష్పకాధిరూఢుండును నై కుబేరుండును వెనుకదెస నమరగణసమన్వితుండును నైరావణోల్లాసియు నై వాసవుండును దక్షిణపక్షంబునం బ్రబలరక్షోయక్షరక్షితుండై యమోఘనామధేయుండై నయక్షోత్తముండును గృతపరికరు లైన వసురుద్రాదిత్యులును దాపలిపక్కంబున నతిభయంకరవ్యాధిమృత్యుపరివేష్టితుం డై పితృపతియును వివిధయాదోనివహనాథుం డయిన వరుణుండును నడచిరి మఱియు మూర్తిమంతంబు లై శూలపట్టిసగదాముసలాదికంబు లైన యద్దేవు నాయుధంబులుఁ గమండలుప్రముఖోపకరణంబులుం జనియె నయ్యాదిదేవునకు నాసన్నుం డయి చంద్రుండు ధవళాతపత్రంబు ధరియించె ననిలాగ్నులు చామరహస్తు లై కొల్చిరి విద్యయు సావిత్రియు గాంధారియుఁ గేశినియు నను దేవాంగనలు దాక్షాయణిం గొల్చి చనిరి త్రిలోచనసఖుం డై నపింగళుం డను యక్షుండు వృషభకేతనంబు దాల్చె నివ్విధంబున నభిరామవిభవోదారుం డై కుమారగురుండు భద్రవటంబు సేర నరిగి యచ్చటఁ గుమారుం జాచి యిట్లనియె. 264

తే. సప్తమం బైన మారుతస్కంధమునకుఁ, బతివి గమ్ము కుమార దేవతల కెపుడుఁ
గార్య మొదవినఁ జేకొని[1] కడఁకఁ దీర్పు, మనిశమును మత్పదధ్యానఘనుఁడ వగుము.

కుమారస్వామి మహిషాసురుం జంపుట.

క. చనుము శుభంబుల నొందుము, తనూజ యని కౌఁగిలించి తద్దయుఁ బ్రేమం
బున నతని వీడుకొలుపఁగ, ననఘ మహోత్పాతములు రయంబునఁ బొడమెన్.

ఆ. దెసలు మండె ధరణి దిర్దిరఁ దిరిగె న,భంబు మ్రోసె వడఁకెఁ బర్వతములు
జగము ఘోరతిమిరసంవృత మయ్యె ని, ర్జరులమనము లెల్ల [2]సంభ్రమించె.

వ. తదనంతరంబ. 268

1. క. కడిమి నెఱపు. 2. చ. సంచలించె.

మ. ఘనశస్త్రాస్త్రమహోజ్జ్వలంబు చతురంగవ్యాప్తభామండలం
బు నితాంతోద్ధతఘోరఘోషబధిరీభూతాఖిలాశాముఖం
బనిరోధోద్ధతవేగ ముగ్రదనుజేంద్రానీక మేతెంచె నీ
సున నీశానముఖామరప్రతతిపైఁ శుంభద్భుజారంభ మై. 270

వ. ఇట్లు మహిషాసురసంరక్షితం బయినదానవసైన్యంబు పఱతెంచి చుట్టు ముట్టి యసంఖ్యసాయకంబులు గదాఖడ్గముసలపరిఘశతఘ్నీప్రముఖానేకప్రహరణంబులు ప్రయోగించి నిమిషమాత్రంబున ననిమిషసైన్యంబునం బ్రచురమాతంగతురంగరథికపదాతిప్రకరంబులం బరిమార్చినం గార్చిచ్చు పొదివినం బఱచుమృగంబులుం బోలె నమరులు సమరవిముఖు లై తొలంగం బాఱినం జూచి నముచిసూదనుండు సింహనాదంబు సేయుచు నెలుం గెత్తి సురగణంబుల కిట్లనియె.

చ. వలవదు సంభ్రమంబు గరువంబుగ నియ్యెడ నెల్లవారు నే
ర్పలవడ వాహనంబులు మహాస్త్రములుఁ సమకట్టి క్రమ్మఱుం
డలవునఁ దున్మి వైచెదఁ దురాత్ముల దైత్యుల నేను గల్గఁగాఁ
దలరఁగ నేల మీకు ధృతిఁ దాల్చుఁడు నిల్చుఁడు గెల్వుఁ డుక్కునన్. 271

ఆ. అనినఁ బోక నిల్చి [1]యాహితోత్సాహులై, సకలవాహనాస్త్రశస్త్రచయము
లలవరించి పేర్చి యార్చి తాఁకిరి వసు, రుద్రసాధ్యముఖ[2]మరుత్ప్రవరులు. 272

మ. అమరానీకవిసృజ్యమానబహుశస్త్రాస్త్రాహతిచ్ఛిన్నదే
హము లై ఘోరమదేభముల్ బహులరక్తాక్తంబు లై తూలెఁ దీ
వ్రమహావాతనిపాతజాతరభసవ్యాధూతసంధ్యారుణా
భ్రములో నా నవశంబు లై యొఱలుచుం బ్రత్యర్థిసైన్యంబులన్. 273

మ. పురుహూతాగ్రసరప్రభూతబలసంభూతాస్త్రనిర్ఘాత మై
తిరిగెఁ [3]బమ్మరి దైత్యవాహినుల నుద్వృత్తాశ్వకశ్రేణి వి
స్ఫురితోత్పాతసమీరవేగవిముఖీభూతాకృతిం దూలుభీ
కరరత్నాకరజాతసంతతతరంగవ్రాతముం బోలుచున్. 274

చ. అడరుచు దేవసైన్యవిశిఖాగ్నిశిఖావలి చుట్టు ముట్టినం
గడువడి దానవధ్వజినిఁ గల్గురథప్రముఖంబు లన్నియుం
బొడిపొడి యయ్యె నుగ్రతరభూరిదవానల మెల్లదిక్కులం
బొడమిన వట్టికట్టియలప్రోవులు రూపఱుమాడ్కిఁ దోఁపఁగన్. 275

శా. గీర్వాణప్రవిముక్తబాణపటలక్రీడావిలూనంబు లై
గర్వోన్నద్ధసురారిశీర్షములు వీఁకఁ డొల్లెఁ గల్పచ్ఛిదా
[4]నిర్విక్తాంబుదమండలోద్గతమహానిర్ఘాతపాతావధూ

---

1. క. యాహవోత్సాహు లై. 2. జ. వ • రూథివరులు. 3. క. బెంపతి 4. జ. నిర్వాతా.

తోర్వీభృద్ఘనగండశైలములతో నూహింపఁ దుల్యంబులై. 276

వ. ఇట్లు నిహన్యమానంబు లగుచు దైత్యసైన్యంబులు నిలువ నోర్వక నలుదెసలం జెదరిన నొదరి యదల్చి మహిషాసురుం డొక్క మహాశైలంబు పెఱికి యిరుగేల నమర్చికొని యమరులమీఁదం గవిసినం గని జనితోత్సాహంబై నసురానీకం బతనిం గూడికొని భేరీనిస్సాణపణవాదితూర్యరవంబులు సింహనాదంబులుఁ జెలంగం గడంగిన నింద్రాదిసురులును బెలుచ సంగరోన్ముఖులై నిలిచిన. 277

క. మహిషుఁడు బల మేర్పడ న, మ్మహీధరముఁ వైచె నయ్యమరసైన్యముపై
మహి సంచలింపఁగా దశ, సహస్రయోధవరు లపుడు [1]చదిసిరి దానన్. 278

ఉ. అంతయుఁ జూచి యెంతయు భయంబున నింద్రునిఁ దొట్టి నిర్జరుల్
భ్రాంతమనస్కులై తిరుగఁబడ్డ నుదంచితఘోరమూర్తియై
యంతకశౌర్యుఁ డాదనుజుఁ డంత దిగంతము దూలఁ గిట్టి కా
లాంతకుఁడై నరుద్రునిరథాగ్రము చెచ్చెరఁ బట్టె నుద్ధతిన్. 279

చ. హరుఁ డదె చిక్కె నింక ససురాధిపుచేఁ దెగు నంచుఁ బొంగి భీ
కరముగ దైత్యు లార్వఁగ జగత్త్రితయంబును గంప మొందఁగాఁ
దెరలి మునీశ్వరుల్ గరము దీనతఁ బొందఁగ మందహాసభా
సురముఖుఁడై పురారి నిజసూనుఁ గుమారునిఁ జూచి యిట్లనున్. 280

ఉ. చూచితె వీనిసాహసము శూరత మద్రథరోధి యయ్యె ని
న్నీచుఁ గృతాపరాధు నవినీతు గతాయువు మృత్యుదేవికిన్
గోచరుఁ జేయు మిప్డు రణకోవిద నావుడు షణ్ముఖుండు గో
త్రాచలసన్నిభుండు మదనాంతకుమాటకుఁ బొంగి యుక్కునన్. 281

ఉ. లోహితరత్నభూషణుఁడు లోహితమాల్యధరుండు విస్ఫుర
ల్లోహితలోచనుండు నవలోహితవస్త్రుఁడు లోహితాస్యుఁడై
యాహవకేళికిం గడఁగునప్పుడు సూడఁగ నొప్పె లోకని
ర్దాహసమిద్ధనూతనపతంగుఁడపోలె రథాధిరూఢుఁడై. 282

ఉ. ఆతని నుగ్రతేజు నిటలాక్షతనూభవుఁ జూచి నిర్జర
వ్రాతము భీతిఁ బో విడిచి వారక ధీరత నిల్చె నంత ని
ర్ధాతవిరోధి వైరివధదోహలియై వడి వైచెఁ దీవ్రని
ర్ఘాతముతోడఁ బుట్టు వనఁ గాఁ దగు నుజ్జ్వలశక్తి దైత్యుపైన్. 283

క. దారుణకల్పాంతాగ్ని స, మారంభము దోఁప నమ్మహాస్త్రంబు రయం
బారంగ నడరి దివిజేం, ద్రారాతిం బొడివి భస్మితాంగునిఁ జేసెన్. 284

వ. ఇవ్విధంబున మహిషాసురుం బరిమార్చి కుమారుండు మఱియు నమ్మహాశక్తిం బునఃపునఃప్రయోగంబు గావించుచు ననేకదైత్యదానవశతసహస్రంబుల వధి

1. క. సమసిరి.

యించె నద్దేవునిపారిషదగణంబుం గవిసి యసురులం దునిమి తూటాడి తదీయ
రక్తపానమాంసఖాదనంబులు సేసి మత్తిల్లి యాడుచుం బాడుచునతనిం గొనియా
డుచు విహరించె నిట్లు వైరులం బొలియించి తిమిరంబు విరియించినతిమిరవైరి
యుంబోలె వెలుంగుచున్న కార్తికేయు నజేయుం జేర నరుగుదెంచి దేవేంద్రుం
డతనిం గౌఁగిటం జేర్చి యిట్లనియె. 285

చ. కమలభవప్రదత్తవరగర్వితుఁడై మముఁ జీరికిం గొనం
డమితపరాక్రముండు దనుజాధిపుఁ డీతఁడు నీమహోగ్రకో
ప[1]మునదవాగ్నియందు శలభంబునుబోలె నశించె వీనికిన్
సము లగువారు వెండియును జచ్చిరి నూర్వురు దైత్యు లీయనిన్. 286

క. లోకత్రయంబునందును, నీకీర్తి వెలింగె నమరనికరము నేనున్
నీకింకరులము గుణర, త్నాకర రక్షింపు మమ్ము ననిశంబుఁ గృపన్. 287

వ. అని పలికె నప్పుడు పార్వతీసుందరుండు నిజనందనుఁ బునఃపునరాలింగనంబుల నభి
నందించి పురందరప్రముఖులం జూచి యిక్కుమారునందు నాయందు నెట్లట్ల
సభక్తికచిత్తులరై వర్తిల్లుం డనియాజ్ఞాపించి యనంతరంబ భద్రవటంబునకుం జని
యె నమరులు ప్రమదంబునం దమతమనివాసంబులకుం జని రివ్విధంబున. 288

ఉ. ఒక్కదినంబునంద బలియుండు సుగారుల నెల్లఁ దున్మి పెం
పెక్కె దయార్ద్రుఁడై యభయ మిచ్చె జగంబుల కెల్ల షణ్ముఖుం
డిక్కథ భక్తితో వినిన నెప్పుడుఁ గీర్తన సేసినన్ జనుల్
నిక్కము సర్వదోషముల నీఁగి భజింతురు భవ్యభద్రముల్. 289

క. అని మార్కండేయుండు సెప్పినఁ బాండవులు సంతుష్టహృదయులై యమ్మహాత్మునిం
బ్రశంసించిరి వా రివ్విధంబున నభీష్టకథాగోష్ఠిం బ్రవర్తిల్లు నెడఁ గృష్ణవల్లభ యైన
సత్యభామయుం బాంచాలియు నేకతంబ యొక్కయెడఁ బ్రియసల్లాపసంసక్తలై
యుండి రప్పుడు సత్యభామ ద్రౌపది కిట్లనియె. 290

సత్యాద్రౌపదీసంవాదము.

సీ. నీప్రియభర్తలు నిర్మలచరితులఁ, బ్రకట తేజుల లోకపాలవిభులఁ
బార్థుల నీ వేకభంగిన వదలక, చెలువ యెబ్భంగి భజింతు దగిలి
యొక్కఁ డొక్కనికంటె నువిద నీ కేవురు, ననురక్తు లగుట యత్యద్భుతంబు
నగుమొగంబుల కాని నాతి నీదెస నెప్డుఁ, బతులకుఁ [2]గింకిరిపాటు లేదు
తే. వ్రతము పెంపొ మంత్రౌషధవైభవంబొ, సరసనైపథ్యకర్మకౌశలమొ చతుర
విభ్రమోల్లాసరేఖయొ వెలఁది నీవి, శేషసౌభాగ్యహేతువు సెపుమ నాకు.

క. ఏనును నీవలస నిజము, గా నిది యంతయును నెఱిఁగి కమలదళాక్షుం
బూని వశగతునిఁ జేసి య, నూనస్నేహానుభోగయుక్తిఁ [3]దలిర్తున్. 292

1. క. మనుదవాగ్ని. 2. చ. జ. గింకటిపాటు. 3. క. దలింతున్.

క. అని యడిగిన మది నించుక, గినుక వొడమ నడఁచుకొనుచుఁ గృష్ణ మృదులహా
సిని యగుచుఁ గృష్ణభామినిఁ, గనుఁగొని యిట్లనియె నిర్వికారాకృతి యై. 293

క. నను నిట్లు దుష్టవనితా, జనమునటులు గాఁ దలంపఁ జనునే నీకున్
మన సొప్పగు పురుషోత్తము, వనితవు గాఁ దగవు నీవు వనరుహనయనా. 294

వ. అని మేలంపుఁజందంబున దానివివేకవిహీనత యెఱుకపడ నాడి పాంచాలి మఱియు
ని ట్లనియె. 295

చ. అలయక మంత్రతంత్రవివిధౌషధభంగులఁ జేసి యెంతయున్
వలతురు నాథు లంట మగువా కడు బేలతనంబు దాన యున్
గలిగిన ప్రేమయుం బొలియుఁ గాని యొకండును సిద్ధిఁ బొంద ద
ప్పొలఁతులతోడిమన్కి యహిపొత్తుగఁ జూచు విభుం డెఱింగినన్. 296

చ. మగువ యొనర్చువశ్యవిధి మందులు మాయలు నొందుచంద మై
మగనికిఁ దెచ్చు రోగములు మానక మూకజడాదిభావముల్
మొగి నొనరించు నద్దురితముల్ దన చేసినచేత లై తుదిన్
జగమున కెక్కు నిందయును సద్గతిహానియు వచ్చు నింతికిన్. 297

క. కావునఁ బతులకు నెప్పుడుఁ, గావింపం దగదు కపటకర్మంబులు ద
ద్భావ మెఱిఁగి యనువర్తిని, యై వనిత చరింప నదియ యగు నెల్లవియున్.

వ. పాండవులయెడ నే నెట్టిదాన నై యిట్టిసౌభాగ్యంబు నందితి నది నీకు నెఱింగిం
చెద నేర్పడ వినుము. 299

సీ. పతు లాత్మ నొండొక్కపడఁతులఁ గలసిన, నలుగ నెయ్యెడల నహంకరింప
మదముఁ బ్రమాదంబు మాని వారికిఁ జిత్త, మేకముఖంబుగ నెల్లప్రొద్దు
భక్తి సేయుదుఁ జూపుఁ బలుకును గోర్కియుఁ, జెయ్వును వింతగాఁ జేయ నెపుడు
నమరగంధర్వయక్షాదులం దైనను, బురుషు నన్యునిఁ దృణంబుగఁ దలంతు

తే. స్నానభోజనశయనాదిసంప్రయోగ, మర్థిఁ బతులకు మున్నెందు నాచరింపఁ
బతులు వచ్చిన నాసనపాద్యవిధుల, భక్తితో నేన కావింతుఁ బనుప నొరులఁ

చ. తగియెడువేళలందు నియతంబుగ మజ్జనభోజనక్రియల్
దగ నొడఁగూర్తు భర్తలకు ధాన్యధనంబులు రిత్తమై వ్యయం
బగుటకు నోర్వ నెప్పుడు గృహస్థలభాండవిశోధనంబు లి
మ్ముగ నొకనాఁడు నేమఱఁ బ్రమోదము సల్పుదు బంధుకోటికిన్. 301

క. [1]పలుమాఱుం దలవాకిట, మెలఁగుట యసతీజనైకమిత్త్రత కలహం
బుల కెలయుట నగుపలుకులఁ, జెలుచ నగుట నాకుఁ గానిపేరివి మగువా. 302

క. పతు లిచ్చమెయిఁ బ్రవాస, స్థితు లైనం బుష్పగంధదీప్తాభరణ
ప్రతతి ధరియింపఁ దగ్గత, మతి నగుచుఁ దదాగమంబ మదిఁ గాంక్షింతున్.

1. క. పలుమఱుఁ దలవాకిటికిని.

ఒడికము = ఉపాయం, యుక్తం, మనోజ్ఞం।

ఉ. అత్తకు భక్తి గల్గి మది నాయమ సెప్పినమాడ్కి [1]జీవికా
వృత్తము లావహింతు గురువిప్రసురాతిథిపూజనంబు ల
త్యుత్తమభక్తి నేన తగ నోపి యొనర్తుఁ బ్రియంబుఁ దాల్మియు
మెత్తఁదనంబు సంతతము మేలుగఁ దాల్తు సమస్తభంగులన్. 304

క. కడుమృదువు లనుచుఁ దేఁకువ, సెడి యెపుడుఁ జరింప భరతసింహులు గోపం
బడరిన నాశీవిషముల, వడువునఁ గ్రూరు లని వెఱపు వదలక కొల్తున్. 305

సీ. మాయత్తఁ బృథ్వీసమానఁ బృథాదేవిఁ, గుంతిభోజాత్మజఁ గోమలాంగి
సతతంబు భోజనస్నానాదికములయం, దిమ్ముగఁ బరిచర్య యేన చేసి
సంప్రీతఁ జేయుదు జనవంద్యుఁ డగుధర్మ, తనయునిబంతి నిత్యంబుఁ బసిఁడి
పళ్లెరంబులఁ గుడ్చుబ్రాహ్మణు లతిపుణ్యు, లెనిమిదివేలు సమిద్ధమతులు

తే. యతులు పదివేలు వారల కనుదినంబు, నన్నపానంబు లర్హసహాయ నగుచు
నొడికముగ నేన కావింతునుచితవస్త్ర,భూషణాదులఁ బరితోషముగ నొనర్తు.

వ. మఱియు ధర్మరాజునగరియందుఁ గనకమణిమయభూషణాలంకృతు లయినపరిచారకులు నూఱువేలు రేయును బగలును బాత్రహస్తులై యభ్యాగతభోజనంబు లొడఁగూర్చువారు నందఱు కలరు వీరెల్లనిట్టిట్టి మెలఁకువ మెలంగుదురని తత్కృతాకృతంబు లేన యెఱుంగుదు నిరంతరమదధారాతరంగితకపోలంబులయినభద్రగజశతసహస్రంబులుఁ బ్రభూతజవసత్త్వసన్నుతంబు లయినయుత్తమాశ్వశతసహస్రంబులుం గలవు వానికి నన్నింటికి నిత్యోచితంబు లైనఖాద్యంబు లొనరింపను బాలింపను దగినవారి నేన నియమింతు నఖండభాండాగారపూరితంబు లైనయగణ్యమణికనకాదివస్తువులును బ్రతిదినవిహితంబు లయినయాయవ్యయంబులు నాయెఱుంగనియవియు లేవు గోపాలజనంబులు దుదిగాఁగలసకలభృత్యజనంబుల జీవితంబుల నరసి యేన నడపుదుం బరమయశోధను లగుపాండునందనులు నిజకుటుంబభారంబు సర్వంబును నాయంద సమర్పించి తారు నిర్భరులై యిష్టవిహారంబుల నుండుదు రేనెల్లవెంటల నప్రమత్తనై వర్తింతు. 307

ఆ. వేగ జాము గలుగ వెడనిద్రఁ బొందుదుఁ, గాని రాజ్యభారకార్యయుక్తి
నజ్జనయున నాకు నాహారనిద్రల, కెడయు లేదు సువ్వె యెల్లప్రొద్దు. 308

ఆ. ఇట్టివర్తనముల నెపుడుఁ బాండవులకుఁ, దగిలి ప్రియము సేయఁదగితిఁ గాని
మగువ నీవు సెప్పు మందులు[2]మంత్రంబు,లింద్రజాలములును నే నెఱుంగ.

వ. అనిన విని లజ్జాకలితచిత్త యగుచు సత్యభామ పాండవభామిని కిట్లనియె. 310

క. ఏ నెఱుఁగమి నిట్లడిగితి, నానేరమి సైఁప వలయు నగవుగఁ గొనుమీ
మానిని నాపలుకులు స, న్మానితము భవచ్చరిత్రమహిమ ధరిత్రిన్. 311

వ. అనినం బాంచాలి మందస్మితానన యగుచు నది యట్లు కాక యని పలికి మఱియు

1. జ. ఁ జేటికా. 2. క. మాకులు; గ. మాయలు నిం.

నిట్లనియె. 312

⊷ ద్రౌపది సత్యభామకుఁ బతివ్రతాధర్మంబులు సెప్పుట. ⊶

క. పతిమనసు నాఁచికొనియెడు, చతురోపాయంబు నీకుఁ జపలాక్షీ సుని
శ్చితమతిఁ జెప్పెద విను మూ, ర్జితమును ధర్మాన్వితము సుశీలంబును గాన్.

చ. పతిఁ గడవంగ దైవతము భామల కెందును లేదు ప్రీతుఁడై
పతి గరుణించెనేనిఁ [1]గులభామిని భాసురభూషణాంబరా
న్వితధనధాన్యగౌరవము విశ్రుతసంతతియుర్వి యశంబు స
ద్గతియును గల్గు నొందుమెయిఁ గల్గునె యిన్ని తెఱంగు లారయన్. 314

ఆ. కరము దుఃఖపడినఁ గాని యెక్కింతసౌ, ఖ్యంబు ధర్మగతియుఁ గలుగ దెందుఁ
జూడు మబల భర్తృశుశ్రూషఫలము సం, తతసుఖంబు నంద ధర్మ వాదవు.

క. కావున నిత్యము సమ్య, గ్భావము ప్రేమంబు వెరవు భక్తియుఁ బ్రియముం
గావింపుము నీ ప్రియునెడ, భావ మెఱిఁగి యతఁడు దాన పైపడి మరగున్.

మ. వనజాక్షుండు గడంగి నీదగుగృహద్వారంబు సేరంగ వ
చ్చె ననంగా విని లెమ్ము సంభ్రమముతోఁ జెన్నొందునభ్యంతరం
బునకుర్విం వచ్చిన నాసనాదికరణంబుల్ దీర్పఁ దత్తజ్జనం
బు నియోగించితి నంచు నుండక ప్రియంబుల్ సేయు మీవుం దగన్. 317

చ. తివిరి మురారి నీకుఁ గడుఁ దీవుగఁ జెప్పినపల్కు గల్గినం
గువలయనేత్ర నీమనసు [2]గూడినవారికి నైన నెప్డుఁ జె
ప్ప వలదు దాన నొండొకనెపంబు ఘటింతు రెఱింగి రేని నీ
సవతులు కృష్ణుబుద్ధి విరసం బగు నీదెసఁ దత్ప్రియుక్తిచేన్. 318

చ. పతికి ననుంగులైనతగుబంధుల మిత్త్రుల భోజనాదిస
త్కృతముల నాదరించుచు నకృత్రిమభక్తివిశేషసంతతో
త్థితమతి వై చరింపుము తదీయహితేతరవృత్తులైనవా
రతివ భవత్సుహృజ్జనము లైనను గైకొన కుండు మేర్పడన్. 319

క. విను ప్రద్యుమ్నాదిభవ, త్తనయులగడ నైన నేకతంబున నేకా
సనమున నుండుట దూష్యం,బని యెఱుఁగుము సతులచరిత లతిదుష్కరముల్.

క. కులవతులును సతులును ని,ర్మలమతులును నయినయట్టిమగువలతోడం
జెలిమి యొనరించునది దు,ర్విలసితవనితాభియుక్తి విడువుము తరుణీ. 321

వ. ఇది నీకుఁ బరమసౌభాగ్యమూలం బయినయుపాయం బనినం బ్రీతచిత్త యై
సత్యభామ యిట్లనియె. 322

సీ. నీవు ధర్మజ్ఞవు దేవసన్నిభులు నీ, భర్తలు మహనీయకీర్తిధనులు
ధైర్యతేజోబలశౌర్యసంపన్నులు, గావున వీరికి నేవిధమున

1. క. గలభాషిణి. 2. క. గూరినవారికి.

ధారుణీరాజ్యంబు సేరెదుఁ దడయక, మీ కెగ్గు సేసినలోకనింద్య
చరితుండు కౌరవధరణీశువనితలు, దిక్కు లేక లమటం బొక్కుచుండఁ
తే. గని ముదంబునఁ బొందెదు వనిత నీవు, సుతుల నత్యంతనిర్మలమతుల శౌర్య
యుతులఁ గాంచినసద్గుణాన్వితవు వగవ, వలదు చిత్తంబులో నీకు జలజనయన.

వ. ప్రతివింధ్యాదు లయిననీపుత్త్రు లేవురు నిప్పుడు వచ్చి యదుపురంబున నున్నవారు వారికి నొక్కటం గొఱంత లేదు రుక్మిణియు సుభద్రయుఁ దక్కినవారలు నక్కుమారులయెడం దమకొడుకులకంటె గారవంబు సేయుదురు వారిదెస నిశ్చింతవు గమ్మనియె నయ్యవసరంబునం గృష్ణుండు పాండవుల వీడ్కొని మార్కండేయాది విప్రజనంబు నామంత్రణంబు సేసి గమనోన్ముఖుం డగుటయు సత్యభామ యాజ్ఞసేనిం గౌఁగిలించుకొని సగౌరవంబుగా వీడ్కొనియె నంత వాసుదేవుండును బ్రియాసహితంబుగా రథారూఢుం డై ద్వారవతీపురంబున కరిగె మార్కండేయుండును బాండవేయుల నాశ్వాసించి నిజాశ్రమంబునకుం జనియె నని చెప్పిన వైశంపాయనునకు జనమేజయుం డి ట్లనియె. 324

క. వనముల ని ట్లనిశంబును, ఘనతరదుఃఖానుభవవి[1]కల్పితు లగుచున్
మనుజోత్తము లప్పార్థులు, జననుత యట మీఁద నెట్లు [2]సలిపిరి చెపుమా. 325

వ. అనిన నమ్మునీశ్వరుం డిట్లని చెప్పెఁ గృష్ణుండు సనినయనంతరంబ పాండవులు గామ్యకవననివాసంబు పరిత్యజించి యనేకవనశైలనదనదీవిశేషంబు లాలోకించుచు ద్వైతవనంబునకుం జని రట్టియెడం గరిపురంబున నుండి యొక్కబ్రాహ్మణుండు సరసకథాకథనకుశలుండు సనుదెంచి కౌంతేయులం గని యుచితసల్లాపంబు సేసి మగిడి ధృతరాష్ట్రుపాలికిం జనిన నమ్మహీపాలుండు పాండవులకుశలం బడుగుటయు నవ్విప్రుండు వా రేవురు ననవరతశీతవాతాతపకర్శితాంగులై బహుదుఃఖసాగరంబున మునింగియున్నవా రనియును వీరనాథయయ్యును ననాథయుంబోలెఁ బాంచాలి పరమశోకార్త యై యున్నది యనియుం జెప్పిన విని వైచిత్రవీర్యుండు విషణ్ణహృదయుం డై కన్నీరు దొరుఁగం గొండొకసేపు వలుక కుండి పదంపడి నిట్టూర్పు నిగిడించి గద్గదకంఠుం డగుచు ని ట్లనియె. 326

ధృతరాష్ట్రుఁడు పాండవులవనవాసక్లేశంబునకు దుఃఖించుట.

క. నాచేసినకీడునఁ గడు, నీచుం డగునాతనూజు నేరమి నిమ్మై
నోచెల్ల పార్థులకుఁ బు, ణ్యాచారుల కెందు లేనియాపద వచ్చెన్. 327

క. నాపెద్దకొడుకు ధర్మజుఁ, గాపురుషవిదూరు ధీరుఁ గౌరవకులసం
దీపకు నివ్విధమున సం, తాపితుఁ గాఁ జేసెనే విధాతృఁ డదయుఁ డై. 328

చ. అమలనివాతసౌధములయందు మనోజ్ఞమరాళతూలత
ల్పముల శయించి రేపులు శుభస్థితి మాగధసూతగీతనా

1. అ. కంపితు లగుచున్. 2. అ. చరియించిరొకో.

దములఁ బ్రమోదముం బొరయు[1]ధర్మసుతుండె కఠోరభూమిభా
గమున శయించి మేల్కను సృగాలనినాదవికీర్ణకర్ణుఁడై. 329

క. నాగాయుతసత్త్వుఁడు ది, గ్నాగాయతహస్తుఁ డనిలనందనుఁడు మహో
ద్వేగాత్ముఁ డగుచు డస్సిన, నాగము క్రియ నుండ కున్నె నవసి వనమునన్.

ఉ. అన్నలుఁ దమ్ములుం సతియు నార్తిమెయిం బహుదుఃఖమగ్నులై
యున్న తెఱంగు సూచి విజయుండు యుధిష్ఠిరవాక్యబద్ధుఁడై
సన్నుతుఁ డుగ్రపన్నగముచాడ్పున రోఁజుచుఁ గ్రోధశోకవే
గోన్నతి నాత్మ నేమనుచు నుండునొ నాసుతుతప్పు లెన్నుచున్. 331

క. అక్కట మృదుగాత్రులు గడుఁ, జిక్కని[1]మనుసులు కుమారసింహులు గవలిం
పెక్కినసుఖముల కర్హులు, స్రుక్కి నవయు నోర్చియునికి చోద్యం బరయన్. 332

వ. అని పలికి వెండియు. 333

చ. అనుపమ తేజుఁ డున్నతభుజాగ్రుఁ డుదగ్రుఁడు వైరినిగ్రహం
డనఘుఁడు వాయుసూనుఁడు నిజాగ్రజుచేసినసత్యపాశబం
ధనమునఁ జిక్కి తత్సమయతత్పరుఁడై యిట్టు ఘోరదుఃఖవే
దనములు సైఁచెఁ గాని మదిఁ దద్దయుఁ గ్రోధమయంబు వానికిన్. 334

సీ. శకునికైతవము దుశ్శాసనుచేసిన, దుష్కర్మమును గర్ణుతులువతనము
దుర్యోధనుని దైనదుర్నయంబును జిత్తమున గిరిశల్యముల్ వ్రాలె నలఁప
దావాగ్ని తెఱఁగున దరికొని క్రోధంబు, వనవాస మనియెడివాయుగతుల
నంత కంతకుఁ బేర్చి యవయవంబుల నెల్ల, మండంగ నెప్పుడు మధ్యముండు
ఆ. మొగము జేవుఱింప ముడివడుబొమలతో, నవుడు గఱచుచును భయంకరముగ
నున్నరూపు వాయకుండు నామది వాఁడ. [2]మిత్తి నాదుపుత్త్రమిత్త్రతతికి. 335

క. అంతకసుతుహృదయంబున, నంత గలుగ నేర దలుక యర్జునుమదిలో
నంత గలుగ దమ్మారుతి, యంతకనిభుఁ డధికరోషుఁ డనవరతంబున్. 336

తే. అర్జునానిలప్రేరితంబగుచుఁ బేర్చి, వాయుతనయుదవాగ్ని దుర్వారభంగిఁ
గర్ణసౌబలసహితముగా మదీయ, పుత్త్రశతకాననము వెసఁ బొదువ కున్నె.

క. అగుఁ గాక కర్మఫలములు, దగఁ గుడువక పోవ వశమె దైవకృతంబుల్
మగుడునె కౌరవ్యులకుం, దెగుకాలం బయ్యె వగపు తెరు విం కేలా. 338

క. ఏను వల దన్న జూదము, మానదె సుతుదుర్నయంబు మగిడింపక దు
ర్మానమునఁ గులక్షయసం, ధానమునకుఁ దొడఁగితిని విధాతృని చెయిదిన్. 339

తే. రాత్రి తెగుదల దినవేల రాక యుండు, దినము తెగుదల రాత్రి యేతేర కున్నె
పరఁగ సుఖదుఃఖములు గాలపర్యయమున, నెందు మనుజులఁ బొందక యేల యుడుగు.

---

1. క. జ. ధర్మసుతుండటె కానభూమిభా. 2. 'మనిసి' యనియును మనుష్యవాచకము గలదు. 'మానుసుల్ మనుసులు' ఆంధ్రభాషార్ణవము. 3. క. గ. మృత్యు.

ఉ. మేలున సంతసిల్లునెడ మేకొని యాపద లొందు నాపదల్
దూలఁగఁ బూని సౌఖ్యములు దోఁచుఁ గృతంబులు దప్ప వెమ్మెయిం
బోలఁగ నింతయుం గని ప్రబుద్ధమనస్కులు ఖేదమోదని
ర్గాళితధైర్యసాగరులు [1]గాక సుఖింతురు సర్వకాలమున్. 341

చ. సిరికిఁ దొలంగి కానల వసించి కృశించినపార్థుఁ డట్టె ని
ర్జరులవరంబునం బరమసమ్మదలీల మహాస్త్రలాభవి
స్ఫురణముఁ బొంది యద్దివికిఁ బోయి శరీరముతోన క్రమ్మఱన్
ధరణికి వచ్చె నిట్టివి గదా వివిధాద్భుతకర్మపాకముల్. 342

క. గాండీవము విల్లఁట యా, ఖండలనందనుఁడు విల్లు గలవాఁ డఁట త
త్కాండంబులు దివ్యములఁట, యెండేటికి నతనిధనము యుర్వియు సిరియున్.

వ. అని ధృతరాష్ట్రుండు [2]బహువిధంబు లగుపలుకులు వలుక విని దుర్యోధనుండు శకునిం జూచి యీరా జేల యింతభీతుం డయ్యె ననుచు నతండును దానును గర్ణసహితుం డై యొక్కవివిక్తప్రదేశంబునకుం జని కార్యాలోచనంబున నున్నయెడం గర్ణుం డి ట్లనియె. 344

సీ. పాలితశౌర్యులు పాండవేయులు దుఃఖ, శీలు రై యడవులపాలు వడిరి
ధరణీశ తొల్లి యింద్రప్రస్థపురమున, ధర్మనందనుపాలఁ బేర్మితోడ
శోభిల్లుచున్నవిశ్రుతలక్ష్మి నీబుద్ధి, బలమున నిన్నుఁ జెం పొలయఁ బొందెఁ
బరువడి దక్షిణపశ్చిమోత్తరపూర్వ, దేశస్థు లయినమహీశు లెల్ల
తే. నీక యరిగాఁపు లై రిపుడు నిఖిలజలధి, [3]శైలకాననద్వీపవిశాల మయిన
మహిసమస్తంబు నేలుము మహిమ యెసఁగ, లీల నింద్రుండు సురలోక మేలునట్లు.

కర్ణశకునిదుర్యోధనులు మంతనంబు సేయుట.

ఉ. జానపదుల్ పురీజనులు సంతతముం బ్రమదం బెలర్ప నీ
దైనశుభోదయంబ హృదయంబులఁ గోరుచు నున్నవారు స
మ్మానము నొంది కౌరవసమాజము నిన్ను భజించె భూరితే
జోనిధి వై వెలింగెదవు సూర్యునిచాడ్పున నీవ యుమ్మహిన్. 346

వ. పాండవు లిప్పుడు పరమదుఃఖార్తు లగుచు ద్వైతవనసరోవరసమీపంబున నున్నవా రని వింటిమి నీవు సకలసామ్రాజ్యవిభవంబు మెఱసి చని యందు నీ తేజంబు ఘర్మసమయంబునాఁటితపను తేజం బై పగతురకన్నులు గమర నతిదుస్సహం బగునట్లుగాఁ జేయుము తొల్లి నహుషపుత్త్రుం డయినయయాతియుంబోలె నుజ్జ్వలుండ వై యున్ననిన్నుం జూచి పాండవులు హృదయభేదంబుగా వగచెదరు మిత్త్రజనమోదంబును శత్రుజనఖేదంబునుం గదా సంపదలకుం దగియెడుఫలంబు.

1. క. గాన. 2. క. బహువిధంబులం బలుకుపలుకు. 3. జ. కాననద్వీపవిశ్రుత • మైనయట్టి.

క. ధనధాన్యపుత్త్రబాంధవ, జనలాభంబులును దలఁపఁ జాల సరిగావు సుఖం
బునఁ దాను దనరి శత్రులు, ఘనతరదుఃఖముల నుండఁ గని యలరుటకున్.
ఉ. నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులో విప
ద్భారము నొంది వందురిన ఫల్గును నుజ్జ్వలరాజ్యవైభవో
దారుల మై కనుంగొనుముదంబునఁ బొందఁగఁ గాంచుకంటె నిం
పారఁగ నొండు గల్గునె కృతార్థత యెందును గౌరవేశ్వరా. 349
తే. అతులసౌభాగ్యభోగసమగ్రమహిమ
నొప్పు చున్ననీదేవులయొప్పు సూచి
ధృతి దఱఁగి తన్నుఁ దాన నిందించుకొనుచు
హృదయమునఁ బాండవాంగన యెరియ వలదె. 350
వ. అనిన నిది యొప్పు నని నాగకేతనుండు సంప్రీతుం డై కొండొక విచారించి
రాధేయుం జూచి యి ట్లనియె. 351
క. నాతలఁపును నిట్టిద నీ, వీతెఱఁగెఱిఁగించి తిది యభీష్టము మన మా
ద్వైతవనంబున కరుగుట, భూతలపతి యనుమతింపఁ బోలఁడు మదిలోన్.
తే. అందుఁ బాండవు లుండుట యాంబికేయుఁ
డెఱుఁగు మన మవ్వనంబున కేఁగుటయును
గడఁగి పార్థులతోడివిగ్రహముకొఱక
యని యవశ్యంబు వారించు నతఁడు మనల. 353
వ. అదియునుం గాక. 354
చ. ఉరుతరవిక్రమాఢ్యు లనియర్జు మహానీయతపోవిశేషను
స్థిరు లనియుం బృథాసుతులదిక్కునఁ దద్దయు భీతుఁ డై నిరం
తరమును మానవేంద్రుఁ డెదఁ దాపము నొందుచు నుండు వింటె యి
క్కురువిభుఁ డింత సేపు గడుఁ గూర్చి విలాపము సేసె వారికిన్. 355
వ. అతనియొద్ద నుండి విదురుండును వారిన పెట్టుచోటు గానక పొగడుచుండు జూ
దంబునాఁటనుండియు విదురుండు పాండవపక్షపాతి యగుట డెల్లం బయ్యె మనవి
చారించినయిక్కార్యంబు చిన్నసన్న యెఱింగెనేనియు నాతం డెల్లభంగులవిఘ్నం
బు సేయుం గావున నిది యంతయు రహస్యంబుగా నొనరించికొని ధృతరాష్ట్రుండు
దీని కనుమతించుతెఱం గెయ్యది యట్టియుపాయంబు నీవును శకునియు నూ
హించునది మనము రేపకడ వచ్చి కురుపితామహుం డై నభీష్మునిఁ గురువంశో
త్తముం డై నధృతరాష్ట్రుని నొడంబఱిచి వెడలుద మని వారి వీడ్కొలిపి దుర్యో
ధనుం డభ్యంతరగృహంబున కరిగి యారాత్రి సముచితప్రకారంబునఁ గడపెఁ
బ్రభాతం బగుటయుఁ గర్ణుండు దుర్యోధనుకడకుం జని యి ట్లనియె. 356
ఉ. భూతలనాథ యే నొకటి పోల నుపాయము గంటి నిప్పు డా

ద్వైతవనంబునందు విదితంబుగ నున్నవి గోకదంబముల్
ప్రీతిగఁ దద్విలోకనము పేరఁ జనం దగు ధారుణీశ్వరుం
డీతెఱఁ గైనఁ బొమ్మను నభీష్టముఁ జేకుఱు నెల్లభంగులన్. 357
క. నా విని సుబలతనూజుఁడు, దేవా నీయాన యేను దెల్లంబుగ రే
యీ వెరవె నెమ్మనమ్మున, భావించితి ననియె నంతఁ బ్రహసితముఖులై. 358
వ. ఒండొరులచెయి పఱచి నవ్వుచు నమ్ముువ్వురుం దక్షిణంబ సమంగనామధేయుం
డయినగోపాలకు నొక్కనిం [1]గఱపికొని ధృతరాష్ట్రుపాలికిం జని సముచితప్రసంగ
సేవావిశేషంబుల నమ్మహీవిభు సుముఖుం జేసి యనంతరంబ దేవా ద్వైతవనంబు
నందులకీలారంబుననుండి వీఁడె యొక్కగోపకుండు వచ్చె ననిన నతండును వాని
కభిముఖుండై పసులసేమ మేమి యని యడుగుటయు వాఁ డిట్లనియె. 359

కర్ణసౌబలులు ధృతరాష్ట్రుచేత ఘోషయాత్ర కనుజ్ఞ గొనుట.

ఉ. ద్వైతవనంబునట్టిసుఖవాసము గోవుల కెందు లేదు ధా
త్రీతలనాథ యిప్పుడు ప్రదీప్తములై సతతంబుఁ బేర్చి గో
వ్రాతభయంకరంబు లగువాలుమృగంబులు సంచరించు మీ
కా తెఱఁ గెల్లఁ జెప్పుటకునై యిట వచ్చితి నేను జెచ్చెరన్. 360
వ. అనినయనంతరంబ కర్ణసౌబలులు ధృతరాష్ట్రుతోడ దేవా యట్లయినం దడయక
దుష్టమృగనాశనంబును గోగణసంరక్షణంబును జేయుటకు భవత్సూను దుర్యోధ
ను నియోగింపు మనిన నతండు గొండొక విచారించి యిట్లనియె. 361
మ. తగు గోరక్ష యొనర్ప దుష్టమృగవిధ్వంసంబు నూహింప మే
లగు నైనన్ వినుఁ డవ్వనాంతరమునం దాసక్తిమై నున్నవా
రు గరిష్ఠాత్ములు పాండురాజతనయుల్ రూఢప్రతాపాఢ్యు ల
ట్లగుటన్ మీగమనంబు నామదిఁ బ్రియంబై తోఁప దెబ్భంగులన్. 362
చ. వనమున నోసి వందురినవా రని వారల మీ రవశ్యముం
జెనకఁ దలంతు రప్పురుషసింహులు భూరితపోనిధుల్ మనం
బునఁ గలుషించి రేనియుఁ దపోమహిమన్ మిము నిర్దహింతు రొం
డె నతులితాస్త్రశక్తిని వడిం దునుమాడుదు రాజి నందఱన్. 363
క. మున్నును మీచేతఁ గడున్, బన్నము వడి నొచ్చినారు పార్థులు మిమ్ముం
గన్నంత నలుగ కుండునె, పన్నగరిపుసన్నిభుండు పవనజుఁ డాత్మన్. 364
వ. అదియునుం గాక. 365
చ. ఒకరుఁడ ధాత్రి యంతయును నోర్చెఁ గృతాస్త్రుఁడు గాక యుండియుం
బ్రకటితబాహువిక్రముఁడు ఫల్గునుఁ డిప్డు మహేంద్రుపాల న
త్యకుటిలదివ్యబాణయుతుఁడై యెలమిం జనుదెంచె నట్టివా

1. జ. గలపికొని.

నికి నెదురంగ శక్య మగునే రణభూముల నింక నేరికిన్. 366

తే. చెనసి మీరు వారికిఁ గీడు సేయుటయును, వారు మీ కెగ్గు సేఁతయు నవగవ మేలు
గాదు వలసిన ఘోషరక్షణ మొనర్పఁ, దగినవారలఁ బుత్తము దడయ కందు.
వ. అని యొడంబడ కున్న నయ్యాంబికేయునకు శకుని యిట్లనియె. 368
ఉ. పాలితవిక్రమోన్నతులు పాండుతనూజులు వారి కప్రియం
బేల యొనర్తు మే మధిప యే మటు సేసితి మేనియుం బ్రతి
జ్ఞాలలితుండు ధర్మజుఁడు సత్యము దప్పనె తమ్ము లేల త
చ్ఛీల మతిక్రమింతు రిది సిద్ధము నమ్ముము నెమ్మనంబునన్. 369
క. మాకును జిత్తంబుల మృగ, యాకౌతుక మతిశయిల్లినది గోగణర
క్షాకరణము కార్యం బటె, యేకీడును నేల పొందు నిందు మహీశా. 370
క. అనిన నతండును గొండొక, మనమునఁ జింతించి బుద్ధిమంతులరై గో
ధనము నరసి తడయక రం, డని వారికి నెట్టకేల కనుమతి యిచ్చెన్. 371
ఆ. ఆక్షణంబ కౌతుకాతిశయవ్యగ్ర, హృదయుఁడై నఫణధరేంద్రకేతు
నాజ్ఞఁ గరిపురంబునం దెల్ల ఘోషింపఁ, బడియె ఘోషయాత్ర ప్రకటలీల.

దుర్యోధనుఁడు ఘోషయాత్ర వోవుట.

సీ. అంతఁ బ్రహృష్టాత్ముఁ డై లలితాంబరా, భరణాంగరాగవిస్ఫురితమూర్తి
నొప్పారి విభుఁడు సహోదరులును గర్ణ, గాంధారులును బ్రియబాంధవులును
సముచితవాహనసైన్యమేతులై, కొలువంగ వెడలె నుజ్జ్వలవిభూతి
నాందోళికాదివాహనములఁ దత్ప్రియ, ప్రమదలు బహుసహస్రములు సనిరి
ఆ. కడఁగి పౌరు లెల్లఁ గైసేసి పడఁతులుఁ, దారు నడచి రతిముదంబుతోడఁ
బ్రకటశకటవైశ్యపణ్యాంగనాదిసం, కులము నుల్లసిల్లె ఘోషయాత్ర. 373
వ. మఱియు నమ్మహీపతిపయనంబున కనురూపంబుగా నెనిమిదివేలు రథంబులు ముప్పదివే లేనుంగులుఁ దొంబదివేలు గుఱ్ఱంబులు శతసహస్రసంఖ్య కాల్బలంబుం గలమహాసైన్యంబుతోడ నడచె మృగయాకుశలు లైన మృగయులు విటవిదూషక వందివైతాళికాదిజను లనేకు లనుగమించి రిట్లు గవ్యూతిమాత్రం బగు నేల యరిగి యచ్చట విడిసి యద్దినశేషంబును రాత్రియుం గడపి మఱునాఁడు వివిధగిరిగహనంబు లతిక్రమించి ఘోషంబు లున్నవనంబు సొచ్చి యం దొక్కరమణీయప్రదేశంబున శిబిరంబు గావించి యమ్మనుజేంద్రుండు. 374
సీ. నానాసహస్రసంఖ్యానంబులై సంత, తానందవిగతభయత్వలీల
నక్కాననమున నేదిక్కు సూచిన నతి, సంకులంబుగఁ గుందశంఖచంద్ర
హారనీహారడిండీరపటీరము, క్తాహారహీరసంకాశములును
గాదంబకాలేయకాదంబినీనీల, జాలతమాలికాసన్నిభములు
తే. ప్రౌఢబంధూకపల్లవభాసితములు, వికచకాంచనచంపకవిస్ఫుటములు

నైనవర్ణంబు లొప్ప నేత్రాభిరామ, భంగి నలరారుగోకదంబములఁ గనియె.

వ. కని తదీయసమృద్ధికి సంతసిల్లుచు గోపాలజనంబులు సవినయంబుగాఁ దన్నుం గాంచిన నాదరించి వారు దనకు నగ్గోవులపేళ్లును లక్షణంబులు నేర్పడ నెఱింగించుచుండఁ బేరువేర వత్సంబులు వత్సతరంబులు మహోక్షంబులు ధేనువులు దర్శకంబులు మొదలైనగోవిశేషంబుల నాలోకించుచు నయ్యైవిధంబులఁ బసికిం దగినరక్షణంబు గావింప నర్హజనంబుల సవిశేషంబుగా నియోగించి మఱియును. 376

క. గోపాలసమన్వితుఁ డై, యాపాలమునఁ దిరిగి గోరసాస్వాదనలీ
లాపరితృప్తి నెలర్చె న, హీపాలుఁడు నెమ్మితోడ నిష్టులుఁ దానున్. 377

వ. తదనంతరంబ గాయకనర్తకాదులు వందిమాగధజనంబులుం గనిన నాదరించి వారికి నభిమతధనంబు లొసంగి మృగయావినోదంబునకుం దొడంగి. 378

మ. హరిణవ్రాతములం గలంచుచు నుదగ్రానేకపశ్రేణిఁ జె
చ్చెర బంధించుచు నుగ్రసింహనివహోచ్ఛేదైక[1]సంక్రీడబం
ధురతం బేర్చుచుఁ బ్రస్ఫురన్మహిషశార్దూలోద్ధతక్రోడని
ర్భరపాతంబు లొనర్చుచుం దిరిగె భూపశ్రేష్ఠుఁ డక్కానలోన్. 379

వ. మఱియు ననవరతసురభిసరసీరుహప్రకరపరికీర్ణంబు లగుజలాశయంబు లాలోకించుచు నతిమనోహరప్రసూనఫలభరితపాదపవనాభ్యంతరంబుల విహరించుచు మన్మథమయూరమధుకరకీరకోకిలాలాపకోలాహలంబు లాకర్ణించుచుఁ గ్రమంబునం బరిజనసమన్వితుం డై ధార్తరాష్ట్రుండు ద్వైతవనసరోవరంబు సేరం జనియె నంత నట ధర్మనందనుండు తత్సమీపంబున మునిజనసహాయుం డై వన్యంబు లగుఫలమూలవిశేషంబులు సాధనంబులుగా సద్యస్కందం బనుయజ్ఞంబు సేయుచుండె నప్పుడు దుర్యోధనుండు నిజభృత్యజనులు నక్కొలనిదరిం గ్రీడాగృహంబులు నిర్మింప నియోగించిన. 380

క. వారును సంభ్రమమున న, వ్వారిరుహాకరముపొంత నవలక క్రీడా
గారములు గట్టఁ దొడఁగుడు, వారించుచుఁ బాఱుతెంచి వడి గంధర్వుల్. 381

వ. ఇది చిత్రసేనుం డనుగంధర్వపతికిం గ్రీడార్థంబు కల్పితం బైనది గావున మీరిక్కొలను సేరక తొలంగి పోవునది యనిన వారు మగుడం జని దుర్యోధనునకుఁ జెప్పుటయు నతండు రణదుర్మదు లైనసైనికులం గొందఱం బంచిన నరిగి వారలు గంధర్వుల కి ట్లనిరి. 382

మ. బలియుం డాధృతరాష్ట్రసూనుఁడు మహాబాహుండు దుర్యోధనుం
డలఘుం డీకమలాకరంబునకుఁ గ్రీడార్థంబు గౌతూహలం
బెలయంగాఁ బ్రియకామినీసహితుఁ డై యేతెంచు చున్నాఁడు మీ

1. అ. సక్రోధ.

ర్వుల దిం దుండఁ దొలంగి పొం డనవుడుం । వా రుద్ధతక్రోధు లై. 383
వ. ఒండొరుల మొగంబులు సూచి పెలుచ నవ్వి వారల కిట్లనిరి. 384
క. ఎదిరిం దన్ను నెఱుంగఁడు, మదమునఁ బ్రాణంబుఁ దనదు । మానముఁ గోల్పో
మదిఁ దలఁచినాఁడు మీ నృపుఁ, డిది యేటికిఁ జెనఁటిచెయ్వు । రిన్నియు నిచటన్.
వ. బుద్ధిమంతుఁ డై యూరక చనుట లెస్స యనుం డనినం గ్రమ్మఱి చని వారు కురుపతికిం దద్వచనంబుల తెఱం గంతయుం జెప్పుటయు నతండు రోషావేశవివశుం డై తమ్ముల దొరలం జూచి మీ రిందఱు మీమీ సైన్యంబులతోడం గూడి కడంగి దుర్వినీతు లైనగంధర్వులగర్వంబు మాన్పి సరోవరం బాక్రమించునది వారికి సహాయుం డయి సురగణసమేతంబుగ నింద్రుండు సనుదెంచె నేనియు నవలీల జయించునది యని నియోగించిన. 386
క. అతులచతురంగసేనా, న్వితు లయి ధృతరాష్ట్రసుతులు । నిరతిశయరయో
ద్ధతసింహనాదబధిరీ, కృతదిఙ్ముఖు లగుచుఁ జనిరి । గినుక యెలర్పన్. 387
వ. ఇట్లు సనుదెంచు కురువీరుల కడ్డంబు వచ్చి కొందఱు గంధర్వులు ప్రియపూర్వకంబుగా నిట యేల వచ్చెదరు మీకు మాతోడి విద్వేషం బేటికి నిలువుం డనినం బెలుచ నార్చి సేనాగ్రచరులు వారలమీఁదం బ్రచురశస్త్రాస్త్రపాతంబు సేయం దొడంగినం దొలంగి చని యాగంధర్వు లాక్షణంబ చిత్రసేనునకు నంతయుఁ జెప్పిపుచ్చినం బ్రబలరోషరంజితాననుం డై యతండు. 388
క. చనుఁడు రయంబున నాదు, ర్జనులం గౌరవులఁ బొదివి । సమయింపుఁడు మీ
రని బహుసహస్రసంఖ్యులఁ, బనిచెను గంధర్వవరులఁ । బ్రకటితబలులన్. 389
వ. ఇట్లు పనిచిన. 390
ఉ. ఆయతకుంతకార్ముకగ । దాసిపరశ్వధశూలపట్టిసా
ద్యాయుధఘోరహస్తులు గు । లాచల [1]తుంగతనుల్ ప్రచండతే
జోయుతు లాపియచ్చరులు । శూరత మై నడతెంచి బల్విడిం
గో యని తాఁకి రుగ్రరణ । కోవిదు లై కురురాజసైన్యమున్. 391
వ. ఇవ్విధంబున గంధర్వులు బెట్టిదంబుగాఁ గిట్టి నొప్పింపం దొడంగినం గలంగి దుశ్శాసనాదికౌరవులు ససైన్యంబుగాఁ దెరలి దుర్యోధనుచేరువకుం బఱచినఁ గర్ణుం డొక్కరుండ సుస్థిరుం డయి నిలిచి గంధర్వుల నిలువరించి భల్లార్ధచంద్రప్రముఖ బహులబాణపాతంబులం దదీయదేహంబులు ఖండించుచు నిమిషమాత్రంబునఁ జిత్రసేనుసైనికశతంబుల రూపుమాపుటయు మఱియుం బైపై గంధర్వులు శతసహస్రసంఖ్యులు తోఁతెంచినం బృథివి యెల్లను గంధర్వమయం బైన ట్లుండె నప్పుడు. 392
చ. శకునియుఁ దమ్ములుం బ్రబల । సైన్యముతో నడతేర నాహవ్రా

1 క. శృంగ. 2. గ. సాహసోత్సుక.

త్సుకమతి యై సుయోధనుఁడు । సూతతనూజునియున్నచోటికిం
బ్రకటభుజోగ్రతం గడఁగి । బల్విడిఁ దద్రిపుకోటి దాఁకినన్
సకలజగద్భయంకరలసత్సమరోత్సవ మయ్యె నయ్యెడన్. 393

క. కొండొకసేపునకు మహో, ద్దండనృపానేక ఘోరతరవిశిఖవ్యా
ఖండితశరీరు లై ధృతి, ఖండితముగఁ బల్లటిలిరి । గంధర్వు లనిన్. 394

చిత్రసేనుం డనుగంధర్వరాజు దుర్యోధనునితో యుద్ధము సేయుట.

క. గంధర్వులు దెరలుట విని, గంధర్వవిభుండు క్రోధకలుపితమతి యై
గంధగజముచందమున మ, దాంధగతిం గవిసెఁ గౌరవానీకముపై. 395

వ. ఇట్లు గవిసి చిత్రసేనుండు. 396

శా. మాయాసంగరకోవిదుండు వికసన్మాయాస్త్రజాలంబులన్
వాయువ్యాప్తి యడంగ నర్కకిరణవ్రాతంబు రుద్ధంబుగాఁ
జేయం జొచ్చినఁ ద్రెళ్ళెఁ దేరులు కరుల్ । శీర్ణంబు లయ్యెన్ దళ
త్కాయం బయ్యె హయాలి గూలిరి నరుల్ । కౌరవ్యసైన్యంబునన్. 397

క. పొదలి యొకని కొక్కనికిని, [1]బదుగురు పదుగురుగఁ గవిసి । పౌరవసేనం
బొదివి సమయింపఁ దొడఁగిరి, వదలక గంధర్వు లని నవార్యోద్ధతు లై. 398

వ. అవ్వియచ్చరులవిక్రమంబునకు నోర్వక బెదరి చెదరి కురురాజసైన్యంబు ధర్మనందనుం డున్నకందువకుఁ బాఱం దొడంగె నప్పుడు రాధేయుం డజేయుం డై కులశైలంబునుంబోలెఁ దరలక నిలిచి గంధర్వులు గురియుశరవర్షంబున మునుఁగుచుఁ దనయోపినంత పెనంగుచుండె సోదరసౌబలసహాయుం డై దుర్యోధనుండు కర్ణసాహాయ్యంబు వదలక నిలిచె నంత ననంతసత్త్వు లైన గంధర్వు లనేకులు సుట్టు ముట్టి. 399

ఉ. కొందఱు సూతు నశ్వములఁ । గొందఱు గొందఱు చాపదండముం
గొందఱు చక్రయుగ్మకముఁ । గొందఱు విస్ఫురితాతపత్రముం
గొందఱు కూబరంబు మఱికొందఱు కేతువుఁ గొంద ఱక్షమున్
దండడిఁ ద్రుస్సివైచి విరథత్వ మొనర్చిరి సూతసూతికిన్. 400

వ. ఇట్లు విరథుం డయి కర్ణుండు వికర్ణురథం బెక్కి రణభూమికిం దొలంగి చనియె దుర్యోధనుండు విముఖుండు గాక పరబలంబు మార్కొని పెనంగం దొడంగినం గినిసి చిత్రసేనుండు వానిం దలపడి తదీయస్యందనంబు రాధేయురథంబునట్లు భగ్నంబుగాఁ జేయించి విరథుం డగునమ్మహీవిభుం గేశాకర్షణంబున నేలం బడవైచి పెడకేలు గట్టి సింహనాదంబు సేసినం దక్కినగంధర్వులుం గనుకనిం [2]బఱచి యతనివనితాజనంబులను దత్సోదరు లగుదుశ్శాసన దుర్విషహ దుర్ముఖ వివింశతి చిత్రసేన విందానువిందులను దత్తనూభవులను దదీయమంత్రులను బట్టి బంధించి

1. గ. బదుండ్రును బదుండ్రు గవిసి. 2. చ. జెర్చి.

చిత్రసేనున కోప్పించి రంతఁ బెఱకౌరవులును వారలు సమాత్యులుం జెదరి
యాక్రోశించుచుం బఱచి ధర్మపుత్త్రు శరణు సొచ్చి యి ట్లనిరి. 401
మ. ఘనబాహాబలదుర్నివారమహిమన్ । గంధర్వవీరుల్ సుయో
ధనుఁ దత్కాంతలఁ దత్సహోదరుల బం।ధప్రాప్తులం జేసి కై
కొని వే పోవుచు నున్నవా రదె రిపు।క్షోభంబు గావించి నీ
యనుజవ్రాతముఁ గావవే కరుణ నిం।డారంగ రాజోత్తమా. 402
వ. అని కృతాంజలు లై పలుకుచున్న వారిం జూచి భీమసేనుండు ప్రహసితాననుం
డగుచు ధర్మపుత్త్రున కి ట్లనియె. 403
ఆ. మనకుఁ జులుక నయ్యె।మనచేయుపనియ గం,ధర్వవరులు గూడి । తగ నొనర్చి
రింత లెస్స యగునె । యేభారమును లేక, యూరకుండ మనల।నొందె జయము.
తే. పుట్టుఁగల్లరి యై పాప।ములకు నెల్ల, దిట్ట యై లోకములచేతఁ । దిట్టువడిన
కట్టెఁడికి నిట్టికష్టంబు।గా నొనర్చి, తగ విధాతృఁడు చతురుఁ డై । నెగడె నేఁడు.
మ. విపరీతస్థితి నొంది ఘోరవిపినో।ర్వీవాసు లై నిత్యదుః
ఖపరాధీనతఁ దూలి రంచు మనలన్ । గర్వాంధితస్వాంతుఁ డై
యపలాపింపఁగ వచ్చి దుర్ణయపరుం । డాధార్తరాష్ట్రుండు దో
షపరీతాత్ముఁడు దత్ఫలంబు గుడిచెన్ । సత్యంబు సామాత్యుఁ డై. 406
వ. వానిదెసం గృప సేయ వల దనిన ననుజునకు నగ్రజుం డి ట్లనియె. 407
క. అకట యిది పరుషవాక్యము, లకు సమయమె శరణు సొచ్చి । లఘుభావముతో
వికలగతి నున్న కౌరవ, నికరమునకుఁ గరుణ సేయ । నీకుం దగదే. 408
వ. ఏకాన్వయజాతు లైనవారికి నర్థనిమిత్తంబయిన భేదం బొక్కొక్కమాటు వర్తిల్లు
నంతన చేసి సహజస్నేహంబు దప్ప నేరదు జ్ఞాతిజనంబులు దమలో నెట్టివా రైన
నొప్పుం గాని యన్యులవలనం బరిభవంబు దొడరినప్పుడు దా రొండొరులఁ
జేకొన కునికి లోకనింద్యంబు దుర్యోధనుండు దుర్వినీతుం డైనను సభార్యుం
డయి పరులచేతం బట్టువడియె దీని నుపేక్షించిన మనకుం గులహాని యగు నిది
యునుం గాక శరణాగతరక్షణంబు రాజమాత్రంబువాని కెల్ల ధర్మంబు నీయట్టి
బాహుబలసంపన్నునకు నిట్టిసుకర్మంబు కర్తవ్యం బని వేఱ చెప్ప నేల లెమ్ము
నీవును నీతమ్ములు నిమ్ముల రథంబు లెక్కి సర్వాయుధసన్నద్ధు లై చని సుయో
ధనుచెఱ దలఁగుం డనినఁ బవననందనుండు ధర్మనందనున కి ట్లనియె. 409
సీ. అనుమాన మొక్కింత।యును లేక యలిగి జ,లంబులఁ ద్రోచె వి।షంబు వెట్టె
గృహదాహ మొనరించె । విహితదురోదర,కపటుఁ డై రాజ్యంబు।నపహరించె
జను లెల్లఁ జూడంగ।వనజాక్షిఁ బాంచాలిఁ,దల వట్టి యీడ్పించె।వలువ లొలువఁ
బనిచెఁ బుట్టినకోలె।మనకు నక్కట సుయో,ధనుఁ డెగ్గు సేయని।దినముఁ గలదె
ఆ. వానిచేత లొకటి।యేనియుఁ దలఁపవు, నీవు మనుజనాథ । కేవలంపుఁ

గరుణ పూని యుండుఁ దరయ నెప్పుడు నిట్టు, లైన మనకుఁ గార్యహాని గాదె.

వ. అని పూర్వవైరస్మరణకలుషితుం డై పలికిన నతనికి నజాతశత్రుండు సాంత్వన
పూర్వకంబుగా నిట్లనియె. 411

ఆ. కావరయ్య యనినఁ గరము దుర్బలుఁ డైనఁ, జెనసి యోపినంత సేయు ననిన
నూరకుండు నయ్య యుత్తమశూరుండు, దీనజనులయున్న తెఱఁగు సూచి.

క. శరణం బని వచ్చిన భీ, కరశత్రుని నయినఁ బ్రీతిఁ గావఁగ వలయుం
గరుణాపరుల తెఱం గిది, యరవుగ సరి గావు దీని కేధర్మంబుల్. 413

వ. ధృతరాష్ట్రసూనుండు భవదీయబలశౌర్యంబుల పేర్మి యెఱుంగుం గావునఁ దన్ను
నవశ్యంబును విడిపింతు రని మనదెస బద్ధాశుం డై యుండు నిది మనకుఁ బుణ్యం
బును గీర్తియుం జేకొనుసమయంబు నిన్నింత నిర్బంధింప వలవ దేన యరుగుదు
నిప్పుడు యజ్ఞదీక్షితుండ నై యున్నవాఁడఁ గావున నాకుం జనరాదు మీరు వేగ
చని గంధర్వులం బ్రియపూర్వకంబుగా ననునయించి సుయోధను విడిపించునది
సామవచనంబులం దీరకున్నఁ బరాక్రమంబున నైనం బ్రతివీరుల నోర్చి కార్యంబు
దీర్చునది నాచేయుజన్నంబు సఫలంబు సేయుం డనిన భీముం డెట్టకేనియు నియ్య
కొనియె నర్జునుండును ధర్మరాజుపనుపు గైకొని కురురాజుచెఱ దలఁగఁ బ్రతిజ్ఞ
సేసె నకులసహదేవులు నుత్సాహసమేతు లయి రన్నలువురు నాముక్తకవచులు
నాబద్ధతూణీరులు నాకలితకార్ముకులు నారూఢరథులు నయి యగ్రజు వీడ్కొని
యతిత్వరితగతి నడచినం గౌరవసైన్యం బంతయు వారిం గూడుకొని సింహ
నాదంబులు సెలంగం జనియె నిట్లరిగి వారలు గంధమాదనంబునకయి చను
చున్నయవ్వియచ్చరానీకంబుం గూడ ముట్టిన. 414

భీమార్జుననకులసహదేవులు గంధర్వులతో యుద్ధంబు సేయుట.

క. కని గంధర్వులు గ్రమ్మఱి, ఘనులం బాండవుల నగ్నికల్పులఁ దేజో
ధనుల నమరేంద్రసదృశుల, ననఘుల మార్కొనిరి ప్రకటితాటోపమునన్. 415

ఉ. అగ్రజువాక్యముల్ దలఁచి యర్జునుఁ డప్పుడు వారితోడ న
త్యుగ్రత దక్కి యెంతయుఁ బ్రియోక్తుల నిట్లను మీరు మాయెడన్
విగ్రహ మేల నెయ్యమున విడ్వుఁడు కౌరవరాజుఁ బార్థివ
ప్రాగ్రసరుండు ధర్మసుతుపన్పిది మీకు నలంఘ్య మిత్తఱిన్. 416

వ. అనిన నతనికి గంధర్వు లిట్లనిరి. 417

తే. ధర్మజుఁడు మాకుఁ బ్రభుఁడె యాధర్మతనయు
నాజ్ఞ నేమేల యొనరింతు మనిమిషేంద్రుఁ
డొక్కరుఁడ మమ్ము శాసింప నొడయఁ డన్యు
లెందు నెవ్వ రైనను భయ మేమి మాకు. 418

వ. అనిన వివ్వచ్చుం డవ్వియచ్చరుల నుపలక్షించి మును మున్న తెగువకుం జొరనేల

యని ప్రియంబును ధర్మంబునుం గాఁ బలికితి నెట్లును మీరు సామసాధ్యులరు
గా కునికిఁ దోఁచు చున్నయది గావున నుగ్రం బయినవిగ్రహంబున దుర్యోధను
విడిపింతు నని వారలమీఁద నిశితవిశిఖప్రకరంబులు ప్రయోగించె నాగంధర్వులు
నతనిపైఁ బటుబాణవర్షంబులు గురిసి రిట్లానలువురకు ననేకగంధర్వశతసహ
స్రంబులతో నతిఘోరసమరం బయ్యె నందు 419

తరలము. కదిసి యర్జును తేరు భగ్నముగా నొనర్పఁ దలంచి పె
ల్లొదవి ఖేచరకోటి గ్రమ్ముటయుం బురందరనందనుం
డదయుఁడై పదిలత్వలం బ్రళయాగ్నికల్పుల దివ్యులం
గదనశూరుల నిర్దహించెఁ బ్రకాండదివ్యశరార్చులన్. 420

మహాస్రగ్ధర. ఘనకోదండోగ్రమౌర్వీక్వణ మఖిలనభోగహ్వరాభోగభాగం
బున నాపూర్ణంబుగా నుబ్బునఁ గవలు మరుత్పుత్త్రుఁడుం దీవ్రనారా
చనితాంతాపాతలీలాసరభసగతులై శత్రువీరవ్రజంబుం
దునుమం దచ్ఛోణితంబుల్ దొరిఁగి మడువులై తొట్టె నయ్యుద్ధభూమిన్.

వ. ఇట్లు కౌంతేయులచేతం బీడితులై గంధర్వులు దుర్యోధనాదులఁ జెఱ లేమఱక
కొనుచు గగనంబునకు నెగసి త్రోఁచి పోవ నుంకించిన నెఱింగి సవ్యసాచి రయం
బున నతినిబిడబాణజాలంబులం జేసి దిఙ్నభోమార్గంబులు నీరంధ్రంబులు గాఁ
గప్పిన నగ్గగనచరులు వలలోనం జిక్కినపులుఁగులుం బోలెఁ బోవ నేరక శర
పంజరంబునం జిక్కియు నుక్కు సెడక యన్నలువురమీఁద వివిధాయుధపరంప
రలు ప్రయోగించిన. 422

మ. అవి యెల్లం దునుమాడి క్రీడి ఘనరోషాభీలుఁడై శాతభ
ల్లవితానం బడరించినం దలలు డొల్లం గాయముల్ మింటనుం
డి వడిం గుంభినిఁ గూలఁ గా రుధిరవృష్టిం గాలువల్ వాఱఁగా
దివి గంధర్వులక్రం దడంగె జగ ముద్వేగంబునం బొందఁగన్. 423

వ. మఱియు నర్జునప్రయుక్తం బయినయాగ్నేయాస్త్రంబు దావాగ్ని నీరసవిపి
నంబు దహించుతెఱంగున గంధర్వనివహంబు నీఱు సేయం దొడంగినం గినిసి
చిత్రసేనుండు భీమసేనానుజుమీఁదం బటుగదాదండంబు వైచిన నతండు
దాని నేడుదునియలుగా నేయుటయు గంధర్వరాజు మాయాబలంబున నంత
ర్హితుం డై. 424

క. నలువురు పార్థుల నత్యు, జ్జ్వలశర[1]వర్షముల ముంచి జలధరముక్రియం
జెలుచన గర్జిల్లుచు [2]ను, క్కలుఁడయి తనవిక్రమంబుఁ గడఁకయుఁ జూపెన్.
ఆ. దాని నుఱక యింద్రసూనుండు గాండీవి, శబ్దవేధు లయినసాయకములఁ

1. క. గ. వేగముల. 2. అ. ను, క్కలుఁడై; వ్రాఁతప్రతుల 'నుక్కలుఁడై' యని యున్నది.

జిత్రసేనుసర్వగాత్రంబు భేదించి, యొక్కమాత్రలోన నుడిపెఁ గడఁక. 426

వ. ఇట్లు నొచ్చి గంధర్వనాయకుండు రణసంరంభంబు విడిచి యర్జునుం జేరం జని [1]తనపొడ సూపినిలిచిన నవ్వీరుండును నాత్మసఖుం డయినఖేచరపతి తెఱంగుసూచి సంహృతాస్త్రుండయ్యె వృకోదరాదులును సమరవిరామంబు నొందిరి వార లం దఱుఁ దమతమరథంబులమీఁదన యుండి యొండొరులఁ గుశలంబు లడిగి రప్పు డర్జునుండు చిత్రసేనున కిట్లనియె. 427

క. వీరోత్తమ నీకిమ్మెయి, వైరము దగు నయ్య కౌరవప్రకరముతోఁ
గౌరవపతి విడువుము త, ద్దారానుజసుతసమన్వితంబుగ నెమ్మిన్. 428

వ. అనిన నతం డర్జునున కిట్లనియె. 429

సీ. ఈదురాత్ముఁడు మిమ్ము నివ్వనంబున నితాం,తాయాసపీడితు లైనవారిఁ
బరమధర్మాత్ముల భార్యాసమేతుల, నపహసింపఁ దలంచి యరుగుదెంచె
నింతయు నెఱిఁగి సురేంద్రుండు గలుషించి, యనుజవధూసహాయాన్వితముగఁ
బాపవర్తను వీనిఁ బట్టి తె మ్మని నన్నుఁ, బనిచిన వచ్చితిఁ బార్థ వినవె

తే. శక్రుపాలికి నిదె కొని చనుచునున్న, వాఁడ నీ వింక నొం డనవలదు నిలుము
మత్సఖుండవు గావున మత్సరంబు, నలుకయును లేదు నీదెస ననఘ నాకు.

తే. అనిన నర్జునుఁ డతని కిట్లనియె నీసు
యోధనుఁడు మాకు వినుము సహోదరుండు
గాన యీతని విడుచుట కర్జ మిదియ
ధర్మజున కెంతయును బ్రమోదంబు సేఁత. 431

చ. అమరవరేణ్యుప న్పయిన నావల నెయ్యది యైన నిప్డు ధ
ర్మమహితుఁ డైన ధర్మజుసమక్షమునం దెఱిఁగించి యాతఁ డే
క్రమమున నెద్ది సెప్పె నది గైకొని చేయుము నీవు మత్ప్రియా
ర్థము చను దెమ్ము నావుడును దాని కొడంబడి చిత్రసేనుఁడున్. 432

చిత్రసేనుఁడు ధర్మరాజుకునొద్దకు వచ్చి దుర్యోధను విడిచిపెట్టి పోవుట.

వ. వారలుం దానును ధర్మజుకడకుం జనిన నయ్యజాతశత్రుండు చిత్రసేను నతిప్రియంబునం బూజించి మహాత్మా యీసుయోధనుండు సానుజామాత్యుం డయి మీచేత వధియింపం బడ కునికి మే లయ్యె మీకారణంబున మావంశంబునకు నొండొక్కహాని వొంద దయ్యె వీఁ డెట్టియపరాధంబు సేసినను నది యంతయు సహించి మాకుం గా వీని విడువ వలయు నని ప్రార్థించిన నతం డట్లు కాక యని దుర్యోధనాదుల నందఱ విడిచి పాండుపుత్త్రుల నామంత్రణంబు సేసి దివంబున కరిగి తత్ప్రకారంబు సకలంబును నింద్రునకు నివేదించిన నింద్రుండును సమరనిహతు లయినగంధర్వుల నమృతవృష్టిం జేసి బ్రదికించె నిట యుధిష్ఠిరుండును

1. క. తనపొడవు.

ధార్తరాష్ట్రునకు బంధమోక్షణంబు గావించి వాని కిట్లనియె. 433

ఉ. ఎన్నఁడు నిట్టిసాహసము ♦ లింక నొనర్పకు మయ్య దుర్జనుం
డన్నన సాహసక్రియలయందుఁ గడంగి నశించుఁ గావునం
గ్రన్నన తమ్ములన్ దొరలఁ ♦ గైకొని యిమ్ములఁ బొమ్ము వీటికిన్
సన్నుత దీని కొండొకవి♦షాదముఁ బొందకుమీ మనంబునన్. 434

వ. అని బుద్ధి సెప్పి వీడ్కొలిపిన నతండును దీనాననుం డగుచుం జనియె ననుజ
సహితుం డయినధర్మతనయుధార్మికత్వంబు ధౌమ్యాదిభూసురులును దబాశ్రమ
వాసు లయినమహామునులును బహువిధంబులఁ బ్రస్తుతించి రని వైశంపాయన
వర్ణితం బయినకథావిశేషంబు సవిస్తరంబుగా. 435

క. రాజకులతిలక భువనవి, రాజితసితకీర్తి దివిజ♦రాజవిభవ ని
ర్వ్యాజపరాక్రమ సకలధ, రాజనసంపూజ్య ధర్మ♦రక్షణదక్షా. 436

స్రగ్విణి. సర్వలోకాశ్రయా ♦ సౌమ్యభావోదయా
నిర్వికారాకృతీ ♦ నిత్యసత్యోన్నతీ
గర్వితోద్యద్భుజా♦కల్పకల్లోల్లస
త్సర్వసర్వంసహా♦చక్ర చక్రాయుధా. 437

గద్యము. ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బయినశ్రీమహాభారతంబునం
దారణ్యపర్వంబునఁ బతివ్రతాచరిత్రంబును ధర్మవ్యాధుండు గౌశికునకుఁ బరమ
ధర్మం బెఱింగించుటయు నగ్నివంశానుకీర్తనంబును గుమారోత్పత్తియు సత్యా
ద్రౌపదీసంవాదంబును బాండవులు ద్వైతవనంబునకుం జనుటయు ధృతరాష్ట్ర
వాక్యంబులును దుర్యోధనాదులమంత్రంబున ఘోషయాత్రయుఁ గౌరవగం
ధర్వయుద్ధంబును దుర్యోధనాదులు గంధర్వులచేతం బట్టువడుటయు నర్జునుండు
వారల విడిపించుటయు నన్నది పంచమాశ్వాసము. 438

శ్రీ

హరిహరహిరణ్యగర్భేభ్యో నమః.

శ్రీ మ దాం ధ్ర మ హా భా ర త ము

ఆ ర ణ్య ప ర్వ ము, ష ష్ఠా శ్వా స ము.

లలితమూర్తి సుమహా
చ్చాళుక్యవరేణ్య పుణ్యచారిత్ర విచి
త్రాలంకారోజ్జ్వల[1]కవి
తాలాపకలాప సంతతాస్మేరమతీ. 1

దుర్యోధనునివిషాదము.

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె న ట్లతిమానుషం బైనయర్జు నుపరాక్రమంబును నత్యంతదైన్యాస్పదం బగుదుర్యోధనుపరాభవంబును నాకర్ణించి విస్మయజుగుప్సాకలితమానసుం డగుచు జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 2

చ. అనిశముఁ బాండుపుత్త్రులకు నప్రియకార్యము లోయునట్టిదు
ర్జనుఁడు సుయోధనుం డటులు శత్త్రులచే నవమానితుండుఁ బే
ర్చినకృప నొప్పు చున్నకురుసింహులచేత విమోక్షితుండు నై
మనమున లజ్జ లేక మునిమండన యెమ్మెయి నేఁగె వీటికిన్. 3

మత్తకోకిలము. మేనఁ బ్రాణము దాల్చి భంగము ద్రింగి యెప్పటిచాడ్పు నై
మానవేంద్రుఁడ నేను దద్దయు మాని నక్తలఁ పాత్మలోఁ
పూను టాతని కెట్లు గల్గఁగఁ బోలు నారయ నద్భుతం
బై నతచ్చరితంబు సెప్పుమ యంతయుం బరిపాటితోన్. 4

వ. అని యడిగిన నమ్మహాముని యిట్లను నట్లు కౌంతేయులచేత [2]బంధమోక్షితుండై దుర్యోధనుండు లజ్జాకజ్జలితహృదయుం డగుచుఁ జెదరినసేనలం గూడుకొని కొంత దవ్వరిగి యొక్కసమతలంబునం బటమందిరవిరచనంబు నిర్వర్తించి యభ్యంతరమందిరమ్మున నొక్కరుండును దల్పంబుపయిం బడి చింతాపరవశత్వంబు నొంది రాహుకబళనకలుషితుం డై నరోహిణీపతియునుంబోలె విషాదవివర్ణుం డయి యు

1. అ. కలితాలాప. 2. గ. జ. లబ్ధమోక్షుం డై.

న్నఁ గర్ణుండు వచ్చి సముచితంబుగాఁ గని యన్నరేంద్రున కిట్లనియె. 5

చ. మనుజవరేణ్య చూడ నతిమానుష మమ్మెయిఁ గయ్య మెందుఁ గ
ల్గునె పటువిక్రమాన్వితులఁ గ్రోధనిబద్ధులఁ గామరూపులం
జెనయఁగ వచ్చునే ఖచరసింహుల నేరికి నట్టివారి నే
పునఁ దునుమాడి గెల్చితి విభూతి యెలర్పఁగ నీవుఁ దమ్ములున్. 6

ఉ. అప్పుడు నీవు సూడఁగ ననంతము లై ఖచరేంద్రసైన్యముల్
గప్పె ననేకసాయకనికాయముల న్వడి నన్ను నేనునుం
[1]గుప్పనఁగూర లేసి రిపుకోటి వధించితి నంతలోన న
న్నొప్పరికించె సైన్యతతి యొక్కఁడ నై రణభూమి నొచ్చితిన్. 7

వ. ఆలోనన విరథుండ నై వికర్ణురథం బెక్కి న నది సమరప్రదేశంబునకుఁ దొలంగఁ బఱచె దేవా నీవు బలవిక్రమాతిశయంబులం బ్రతివీరుల నోర్చి యక్షతుండ వై యుండుట గనుంగొని కృతార్థుండ నైతి నిట్టిపరాక్రమంబు సేసినవా రిజ్జగంబున నెవ్వరు గల రిది యత్యద్భుతం బనినం గౌరవేశ్వరుం డాత్మగతంబున నీతండు మత్ప్రకారం బెఱుంగక యిట్లు వలికెం గా కేమి యని లజ్జితుం డగుచు రాధేయున కిట్లనియె. 8

సీ. అనఘ తమ్ములు నేను నంబరచరకోటిఁ, దలపడి పోరంగ బలయుగంబుఁ
జచ్చియు నొచ్చియుఁ జలమునఁ బెనఁగె నా, సమయంబునందు విక్రమ మెలర్ప
గంధర్వపతితోడఁ గలిగెఁ గయ్యము నాకు, నాతనిశరములచేత నాజి
నేను నొచ్చితి వేయు నేల భార్యానుజ, సుతమిత్త్రజనసమన్వితము గాఁగ

తే. నన్నుఁ జెఱగొని గంధర్వనాయకుండు, నెగసె దివమున కప్పుడు బెగడి చెదరి
పఱచి మనవార లెల్లను బాండుసుతుల, శరణు సొచ్చిరి దైన్యసంభరితు లగుచు.

ఉ. వారలయార్తిఁ జూచి జనవంద్యుఁడు ధర్మసుతుండు దమ్ములన్
భూరిబలాఢ్యులం బరమపుణ్యుఁడు నన్ విడిపింపఁ బంచె న
వ్వీరులు నుక్కునం గవిసి [2]వీఁకను ఖేచరకోటిఁ దొత్తనిం
పారఁ బ్రియోక్తులం [3]దెలచి రంతటఁ దీరద కార్య మెమ్మెయిన్. 10

ఆ. అంతఁ దెగువఁజేసి యంతకాకారు లై, భీమపార్థయములు భీమబలులు
ఖచరవరులమీఁదఁ బ్రచురబాణౌఘముల్, గురిసి రాహవమునఁ బరుషభంగి.

వ. తదీయబాణపాతంబుల నొచ్చి గంధర్వులు మమ్ముం గొనుచు గగనంబునం బఱచిన నర్జునుండు వారికిం బోవ రాకుండ నతినిబిడబాణజాలంబుల నంబరమార్గంబు నిరోధించినం జిత్రసేనుండు దనప్రియసఖుం డై నశతమఖసుతుం జేర నరిగి కుశలం బడిగిన నర్జునుండునుం బ్రీతుం డై వాని ననునయించి యీదుర్యోధనుండు మాతోడంబుట్టువు గావున నితని విడువ వలయు ననిన నాగంధర్వనాయకుండు. 12

1. గ. జ. గుప్పలుగూర లేసి. 2. అ. వేగమ. 3. అ. తెలిపి.

క. మనదుర్మంత్రిత మంతయు, ఘనుఁ డప్పార్థునకుఁ జెప్పి । ఘనభుజ యిది యిం
ద్రునిపను పగుట నవశ్యం, బును నీతని విడువ ననియె । భూరిబలుండున్. 13

క. కడు లజ్జయు దైన్యంబును, నడరి ముసుఁగువడఁగ నాకు । నాత్మగతమునం
బుడమి వివరంబు లేదే, యడఁగెద నన్నట్టి దయ్యె । నప్పుడు కర్ణా. 14

వ. అంతం గాంగేయులు గంధర్వులం దోడ్కొని ధర్మరాజుపాలికిం జని మనదు
ర్మంత్రంబుకతంబున బంధగోచరుండ నయిననన్ను నయ్యజాతశత్రుముందట నివే
దించిన నతండు విడిచి పుత్తెంచె నిది మదీయవృత్తాంతంబు. 15

క. ఒవ్వనివారలయెదురన, యివ్విధమున భంగపడితి । నే నింక జనుల్
నవ్వఁగ [1]నేటి బ్రదుకుగా, నివ్వసుమతి యేలువాఁడ । నెట్లు చరింతున్. 16

ఉ. అక్కట యమ్మహారణముకందు వియచ్చరకోటితోడఁ జే
రుక్కునఁ బోరి యేను మృతి । నొందఁగ నేరన [2]యట్టులైన నీ
తక్కువపాటు లేక ప్రమదంబున దేవపదంబు నొందుదుర్
మిక్కిలి యైనకీర్తియును । మేదినియందు వెలుంగు నిత్యమై. 17

దుర్యోధనుండు ప్రాయోపవేశంబు సేయఁ బూనుట.

వ. కావున నిట్టిదురవస్థపాలైతి నేను బ్రాయోపవేశంబునఁ బ్రాణపరిత్యాగంబుఁ
జేసెద మీ రిండఱు దుశ్శాసనుం బురస్కరించుకొని పురంబున కరుగునది మిత్త్రు
లకుఁ బ్రమోదంబును శత్త్రులకు నిర్వేదనంబునుం జేయుచు మనునట్టియేను బోఁ
డిమి సెడి పగతురచేత శిరస్తాడనంబు సేయం బడి సిగ్గు వడక బంధుజనంబులలోని
కేమని యరుగుదు నాంబికేయుం గని యేమని పలుకుదుఁ గురువృద్ధు లయిన
భీష్మ బాహ్లికులయు నాచార్యు లయినకృపద్రోణులయు సమ్ముఖంబున నెట్లు నిలు
తుఁ బరజనులుం బౌరులుం బురోహితులు నన్నుం గనిన నేమని సంభాషింతు నిది
యాత్మదోషంబున నైనయపాయంబు నా కవశ్యభోక్తవ్యంబు. 18

క. విను దుర్వినయాత్మకుఁ డగు, జనుఁ డుజ్జ్వల మైనసిరియు । సద్విద్యయుఁ గ
ల్గిన నందు మెలఁగ నేరక, చెనఁటి తెఱంగునకుఁ జొచ్చి । చెడి పోవుఁ దుదిన్. 19

క. అకటకట యిట్టికష్టము, నకు వచ్చితినయ్య యేను । నన్నెఱ వైరి
ప్రకరము లనిఁ బట్టినఁ గృప, నొకరుఁడు విడిపించె దైవ । మోపదె యెట్లున్. 20

క. మానము సెడియును నిమ్మై, మేనం బ్రాణంబు లెట్లు । మేకొని తాల్తుం
గాన యిది నిశ్చయముగాఁ, బూనితి నా తెగువ మాన్పఁ । బోల దొకనికిన్. 21

వ. అని పలికి సమీపగతుం డైన దుశ్శాసను నాలోకించి యమ్మహీపాలుం డిట్లనియె.

సీ. అన్న దుశ్శాసన । నిన్ను రాజ్యమునకుఁ, బట్టంబు గట్టెదఁ । బతివి గమ్ము
శకునికర్ణులు దీర్పఁ । బ్రకటవసుంధరా, వలయ మంతయు మహోజ్జ్వలత నేలు
భ్రాతృవర్గమునకుఁ । బ్రీతి సేయుము బంధు, జనులఁ బోషింపుము । సద్ద్విజులకు

1. అ. నేటికి బ్రదుకఁగ, నివ్వసుమతి యేల ప్రాణ మెట్లు భరింతున్. 2. క. గ. జ. యట్టిదైన.

నుత్తమంబుగఁ దగువృత్తులు సెల్లింపు, గురుజనంబుల భక్తిఁగొలువు మెపుడు

తే. నింద్రుఁ డమరగణంబుల నేలునట్లు, ధరణిపతుల నేలుము బాహుదర్ప మొప్పఁ
బగఱ నుక్కడఁగింపుము పరమమిత్త్రు, లైనశూరులఁ గొనియాడు మర్హభంగి.

వ. అనిన నమ్మాట దనహృదయంబునకు నిశితశూలం బయిన నతండు నిలువ
నోపక యగ్రజుపాదంబులపయిం బడి దేవా యిట్లానతీఁ దగదు నాకుం బ్ర
సన్నుండ వగు మని నిజనేత్రజలంబులం దదీయచరణయుగళం బభిషేకించుచు
ని ట్లనియె. 24

చ. అవని విదీర్ణ మైనను హిమాద్రి చలించుట గల్గినన్ మహా
ర్ణవ మది యింకినన్ దివసనాథుఁడుఁ జంద్రుఁడుఁ దేజ మేదినం
గువలయనాథ నీకు నొకకుత్సితభావముఁ గల్గ నేర్చునే
భవదుపయోగ్య మైననృప[1]భావము నాకు వహింప శక్యమే. 25

క. హితు లైనవారిఁ బ్రోచుచు, సతతంబును రిపుల నెల్లఁ జమరుచు నిఖిల
క్షితితలము నీవ యేలుము, శతసంవత్సరము లధికజయశీలుఁడ వై. 26

వ. అనుచు నయ్యువరాజు దుఃఖాతిభారవిహ్వలుం డై యెలుంగెత్తి యేడ్చిన నయ్య
న్నయుం గన్నీరొలుక నూరకుండె నప్పుడు కర్ణుండు వారలం జూచి యిట్లేల
బాలిశులుంబోలె నేడ్చెదరు ధైర్యంబులు ధరియించి శోకవ్యసనంబులు విడువుం
డు శోకశీలురం జూచి పగతురు సంతసిల్లుదురు శోకశీలురకుఁ బైపై శోకంబులు
వొందు నని దుర్యోధనుం జేర్కొని యిట్లనియె. 27

క. ఒకయల్పమనుజుక్రియ సో, మకులోత్తమ నీకు నిట్లు మహనీయసుఖ
ప్రకృతి యగునిజశరీరం, బకట విడువఁ దలఁప నగునె [2]యవిహితబుద్ధిన్. 28

తే. శోకమగ్నుండ వగునిన్నుఁ జూచి యిప్పు, డధిప నీతమ్ములును నేను నధికదుఃఖ
వహ్నిఁ బాల్పడ మయ్యె మావలనఁ గరుణ, గలిగి తేర్పవె యిందఱఁ గౌరవేంద్ర.

వ. పాండవులచేత విముక్తుండ నైతి నని వగచె దంతియ కాని నీకుం గార్యగతియందు
వివేకంబు పాల దదియెట్లనిన నేరాజురాజ్యంబున నిశ్చింతులయి జనులు దమతమ
జీవనంబుల వర్తింతు రారాజునకు నట్టిజనులు బంట్లుగావునఁ దారమ్మహీపతికిం దీఱ
మి గల్గినచోట్ల నెల్లనుం దమపౌరుషంబులు నెఱపవలయుఁ గొంతేయులు నీదేశం
బుననుండి నీయాజ్ఞవలనం గృతారంభు లై యున్నవా రగుటం జేసి వారు నీకింక
రులు నీకు నై నయక్కఱ దీర్చుట వారి కర్హకృత్యంబు దీని కింత వగవ నేల యది
యునుం గాక పాండవులు జూదంబునాఁడ నీకు దాసు లైరి తదీయంబు లైనమ
ణికనకాదివస్తువులును భవదధీనంబు లై యున్నయవి వారు నిన్నుం గొలిచియుం
డుట లేకుండెనేనియు నింతటికెలసంబు దీర్పనేనియు వలదే యిది యంతయు
నూహించి వలవనివగలం బొగులక లెమ్ము పురంబునకు నడవుము నామాట వినక

1. గ. జ. భారము. 2. క. గ. జ. యవహిత.

నిర్బంధపరుండ వై తేనియు నిన్నే మన వచ్చు నిందఱము నీపోయినగతిన పోవం గలవారము నీవు లోకంబుచేత నగుఁబాటును బొందెద వింతియ యని కర్ణుండు సెప్పిన విని దుర్యోధనుండు వెండియుం బ్రాయోపవేశంబునందు నిశ్చయంబు వదల కున్నం గనుంగొని శకుని యిట్లనియె. 30

క. కర్ణునియాడినమాటలు, నిర్ణయమున కింత యొప్పకనే యిప్పలుకుల్
కర్ణంబులఁ జొనుపుము దుః ఖార్ణవపారంబుఁ బొందు మవనీనాథా. 31

తరలము. కడఁగి బుద్ధిబలంబునం దయకంటకంబుగఁ జేసి యేఁ
బుడమిరాజ్యము సర్వముం దగఁ బుచ్చి యిచ్చిన నిమ్ములం
గుడువ నేరక దీని నిచ్చటఁ గూలఁ దన్ని శరీరముం
విడుతుఁ గా కని నిశ్చయించెదు వెఱ్ఱి వైతె నరేశ్వరా. 32

ఆ. నీకు వృద్ధసేవ లేకున్కి యిప్పుడు, నాకుఁ దెల్ల మయ్యెఁ బ్రాకటముగఁ
గోపమును మనోనుతాపంబుఁ బొందుచోఁ, ధీరుఁ డపుడ [1]యడఁపనేర వలదె.

తే. పిఱికితనము నేమఱుటయు [2]నోఱవతనము, [3]మెత్తఁబాటునఁ గార్యంబునన త్తెఱంగు
నేరమియు విషయంబులఁ గూరుటయును, గలుగుపతికి నుండదు సిరి దొలఁగిపోవు.

వ. కావునఁ గార్యజ్ఞుండ వగుము కార్యజ్ఞానం బెట్టి దనిన. 35

ఉ. కౌరవనాథ నీకు నుపకారము సేసిరి పాండవేయు ల
వ్వీరులయందు నెయ్యమును వేడ్కయు [4]నొప్పఁగ నీ వభీష్టస
త్కారము సేత యుక్త మగుఁ గాక ప్రియంపడ నర్హ మైనచో
దారుణశోకవహ్నిపరితాపముఁ బొందుట యిప్డు ధర్మమే. 36

చ. కృతము దలంచి చిత్తమునఁ గిల్బిష మంతయు నుజ్జగించి స
మ్మతులఁ బృథాతనూజుల నమానుష తేజులఁ బిల్వఁ బంచి త
త్పితృధన మైనరాజ్యము నభీష్టముగాఁ దగ నిమ్ము నీకు నీ
క్షితివలయంబునం బరమకీర్తియుఁ బుణ్యముఁ గల్గు భూవరా. 37

క. వారలు నీతోఁబుట్టువు, లీరాజ్యము మీరు వారు నేకం బై పెం
పారఁగ నేలుఁడు దీనం, గౌరవకులనాథ సౌఖ్యగౌరవ మొందున్. 38

వ. అని శకుని సెప్పుచుండ నగ్గాంధారీనందనుండు నిజచరణసమీపంబునం బడియున్న దుశ్శాసనుఁ గ్రుచ్చి యెత్తి మూర్ధాఘ్రాణంబు సేసి కర్ణసౌబలులం జూచి మీ రేల నన్నుఁ గారించెదరు ధర్మైశ్వర్యధనభోగంబులందు నా కభిలాషంబు లేదు ప్రాయోపవేశంబునందుఁ గృతనిశ్చయుండ నైతి మీ [illegible] నొండువిధంబులు సేయక యూరక మీ వలయు నెడకుం బొం డనిన వారలు దేవా [illegible] యయ్యె నేని మే మెందుఁ జేరెదము నీతోడి వారము [illegible]

1. గ. యడుప. 2. చ. దెఱవతనము; గ. మఱువతనము. 3. అ. మెత్తఁబాటును [illegible] నెత్తెఱంగు. 4. అ. నొప్ప నభీష్టవస్తుసత్కారము.

V.R. NARLA MEMORIAL LIBRARY ★ V.R. NARLA D.P.R.I. Acc. No.

హితుండు పశ్చిమాచలసమీపగతుం డగుటయు నన్నరనాథుండు సురలోకగమన కుతూహలి యై శుచిస్నానంబు సేసి వల్కలంబులు ధరించి సంధ్యాసమయ సముచితంబు లగుకరణీయంబులు నిర్వర్తించి వివిక్తదేశంబునందు దర్భాస్తరణంబున నాసీనుం డై వాగ్నియతుం డై. 39

క. క్రమమున బాహ్యేంద్రియకర్మము లెల్లను వదల విడిచి మహితసమాధి
[1]క్రమదశ నుండె నివాత, స్తిమితం బై వెలుఁగుచున్న దీపముపోలెన్. 40

ప్రాయోపవిష్టుం డైనదుర్యోధనునిఁ గృత్య పాతాళంబునకుఁ గొనిపోవుట.

సీ. ఆసమయమున ముకన్నమ కేంద్రవిజితు లై, యహిలోకమున నున్న యసురవరులు
ధృతరాష్ట్రనందను తెగువ యెఱింగి యా, త్మీయపక్షక్షయస్థితికి వగచి
యాతనిఁ బిలిపింప నప్పుడు శుక్రాదు, లైనభూసురసమూహములచేత
వేల్మి వెట్టించిన వేగంబ యొకకృత్య, వెలువడి భీషణవికృతమూర్తి
ఆ. యేమిపనులు గలిగె నెఱిఁగింపుఁ డనిన వా, రిచటి కిపుడు కౌరవేంద్రు ననఘు
నుజ్జ్వలాంగు నాసుయోధనుఁ దెమ్ము ప్రా, యోపవేశనమున నున్నవాని. 41

వ. అని పనిచినం గృత్యయు నాక్షణంబ చని ప్రాయోపవిష్టుం డై యున్నదుర్యోధను గ్రుచ్చి యెత్తికొని రసాతలంబునకుం దెచ్చి దైత్యులకు సమర్పించినం బ్రీతు లై వారు వానిం గౌఁగిలించుకొని కుశలం బడిగి యిట్లని రయ్యా నీవు శూరుండవు శూరజనరక్షితుండవు భరతకులోద్భవుండ విట్టిసాహసం బేల చేసితివి మఱి యాత్మఘాతుకునకు లోకంబున నిందయు హీనతయు దుర్గతియుం బ్రాపించు లోకవిరుద్ధంబు లై మూలఘాతంబు లైనకార్యంబులయందు నీయట్టిబుద్ధిమంతులు ప్రవర్తిల్లుదు రే యట్లు గావున నీ వఖిలధర్మార్థయశోభోగనాశం బై నయీదుర్విచారంబు విడువుము ధైర్యంబును బ్రతాపంబును బాటింపుము శత్రుజనభంజనంబు సేయుము నీవు మనుష్యమాత్రుండవు గావు నీపూర్వజన్మప్రకారంబు సెప్పెద మాకర్ణింపుము. 42

ఉ. ఏము తపంబు సేసి పరమేశ్వరు నీశ్వరుఁ బార్వతీమనః
కాముకుఁ గామవైరి నవికారుఁ బురాంతకుఁ బ్రీతుఁ జేసినం
గామితదాయి యైనశితికంఠుఁడు నిన్ను సృజించి యిచ్చె ను
ద్దామదయావిధేయుఁడు ముదంబున మాకు నధీశ్వరుండుగాన్. 43

ఉ. నీ దగుపూర్వదేహము వినిర్మలవజ్రశిలావిశేషసం
పాదిత మస్త్రశస్త్ర[2]పరిపాతనభేద్యము గాదు నిత్యని
ర్భేదము పుష్పకోమలము ఖేచరభూచరకామినీమనో
హ్లాదన మట్లు గాన భవుఁ డర్థి నొనర్చె నుమాసమేతుఁ డై. 44

ఉ. నీవు ధరిత్రిఁ బుట్టుటయు నీకు సహాయము సేయఁ గోరి నా

1. క. క్రమదర్శి యై నివాత... దీపముఁబోలెన్. 2. జ. పాతనభేద్యము.

నావిధదైత్యదానవగణంబులు రాజకులంబులందు స
ద్భావన నుద్భవించెఁ బటుబాహులు దివ్యమహాస్త్రకోవిదుల్
ద్రావితవైరు లుర్వి భగదత్తపురస్సరు లైనవీరు లై. 45

వ. భీష్మద్రోణకృపాదులు గొందఱు దేవాంశసంభవు లైనను దదీయభావంబులు రాక్షసావేశంబు నొందెడు దానం జేసి వారు నిర్దయు లై విమూఢులుంబోలె నన్యోన్యపరుషంబులు వలుకుచు నలుక మిగులం బుత్త్రపౌత్త్రమిత్త్రభ్రాతృశిష్యగురుబాలవృద్ధజనభేదంబులు విచారింపక సమరంబు సేసి దివ్యంబులు మానుషంబులు నైన వివిధాస్త్రశస్త్రంబులఁ బాండవపక్షక్షయంబు గావింపం గలవారు పాండవులు బంధుస్నేహంబు విడిచి తెగువకుం జొచ్చి నీచేత నిహతు లగుదురు నీమనంబున బీభత్సువలనిభయంబు గొంత గలదు దాని నెఱింగి నేమునుం దగునుపాయంబు దలంచితి మది యె ట్లనినఁ గృష్ణుచేతం జచ్చిననరకాసురునంశంబు గర్ణునావేశింపంగలయది తత్కారణంబునం గృష్ణార్జునులతోడ బద్ధవైరుం డై యవ్వీరుండు నిజదివ్యాస్త్రంబులం గృష్ణుల నిద్దఱ నిర్దహించు నివ్విధం బెఱింగి యింద్రుండు పాండవరక్షణార్థంబు వచ్చి కర్ణుకవచకుండలంబులు కపటరూపంబున నపహరింపం గలవాఁడు మఱియును. 46

క. క్షితి సంశప్తకు లనఁగా, శతలక్షసహస్రసంఖ్య జనియించిరి ద
ర్పితు లై దనుజులు దద్బల, తతిచే సమరమున నింద్రతనయుఁడు సిక్కున్. 47

తరలము. నిహతకంటక మైనయిద్ధరణీతలం బఖిలంబు నీ
మహితశాసనగోచరం బగుమానవేంద్ర ప్రసన్నతా
మహిమ నొందుము నీవ తేపవు మాకు నిండఱకుం గురూ
ద్వహ విషాదము వొందఁ బాడియె దైత్యపక్షభయంబు గాన్. 48

మ. చను మిం కొండుదలంపు మాను మని యాశ్వాసించి వానిం బునః
పునరాలింగన మాచరించి యెలమిం బూజించి దైత్యోత్తముల్
జననాథోత్తము వీడుకొల్పిరి తదాజ్ఞం జేసి యాకృత్యయు
మును దాఁ దెచ్చినచోటఁ బెట్టె నధిపుం మోదంబు సంధిల్లఁగాన్. 49

ఉ. అంత సుయోధనుండు హృదయంబున విస్మయ మంది యంతవృ
త్తాంతము స్వప్నవృత్తముక్రియం దలపోసి నిజంబ కాఁగ న
త్యంతము నిశ్చయించుచుఁ బృథాసుతులం సమరంబులోన ని
ర్జింతున కాక యంచు వికసిల్లె దురాశయభగ్నబుద్ధి యై. 50

క. విను జనమేజయ పౌరవ, జనవిభుఁ డబ్బంగి రాత్రిచరితం బగున
ద్దనుజసమాభాషణ మె, వ్వనికి నెఱింగింప కుండు వాఁ డయ్యె మదిన్. 51

వ. అంతఁ బ్రభాతం బగుటయు రాధేయుండు సుయోధనుపాలికిం జని (రహస్యంబున) హేతుమద్వాక్యంబుల నతని కి ట్లనియె. 52

ఉ. చచ్చినపిమ్మటం గడిఁది×శత్రుల నోర్వఁగ వచ్చునే శుభం
బిచ్చునె చావు లెందును న×రేశ్వర యాఁటడి చత్తు నంట దా
మెచ్చగు నయ్య యెవ్వరికి × మేనికి జీవము గల్గుచోన వెం
పచ్చుగ సిద్ధిఁ బొందు విజ×యార్థసుఖంబులు మర్త్యకోటికిన్. 53
ఉ. కావున శోకదైన్యముల×కాలము గా దిది లెమ్ము విక్రమ
శ్రీ విలసిల్లు మంచుఁ గురు×సింహుని సింహసమానుఁ జారుశ
య్యావివశాంగు నంగపతి × యాదటతో నిరుగేల గ్రుచ్చి సం
భావన నెత్తుచుం బ్రణయ×భాషల వెండియు వాని కిట్లనున్. 54
క. మది నర్జునుఁ జూచి భయం, బొదవినయది నీకు వాని × నుగ్రరణమునం
బదునాలవయేఁడు జయిం, చెద నాయుధ మంటి ప్రతిన × సేసితి నధిపా. 55

దుర్యోధనుండు ప్రాయోపవేశము మాని కరిపురంబునకుఁ బోవుట.

చ. అనవుఁడుఁ దద్ప్రతిజ్ఞయు సు×రారులవాక్యములుం దలంచి య
జ్జనపతి గాఢనిశ్చయవ×శంవదుఁ డై శయనంబు డిగ్గి చ
య్యనఁ బయనంబు సేయుఁ డని × యప్పు డమాత్యులఁ బంచి యిమ్ములన్
దినముఖకృత్యముల్ సలిపి × దీపితుఁ డై వెడలెం బ్రియంబుతోన్. 56
వ. అయ్యవసరంబున. 57
చ. రయవిచలత్తురంగమత×రంగముల న్మదనాగనక్రసం
చయములఁ జంచలచ్ఛటుల×సైనికమత్స్యముల న్మహోన్నతం
బయి కురురాజచంద్రునుద×యంబునఁ దద్దయుఁ బొంగెఁ బ్రస్ఫుర
ద్భయదమనోహరప్రకట×భంగులఁ దద్భటవార్ధి యుద్ధతిన్. 58
ఉ. చామరపుండరీకవిల×సత్సితకేతుపతాకలం గురు
గ్రామణియాత్ర నెంతయును × గాంతి వహించె నభంబు శారదో
ద్దామమరాళమండలసి×తస్ఫుటపద్మవనీపరిస్ఫుర
త్తామరసాకరంబువవి×ధంబున భూచరనేత్రపర్వ మై. 59
వ. ఇట్లు దుర్యోధనుండు గర్ణసౌబలసమేతుం డై దుశ్శాసనాద్యనుజగణంబునుం దక్కినయమాత్యగణంబులుం గొలువఁ జెలువు మిగులం జని కరిపురంబు ప్రవేశించి సముచితవ్యాపారంబుల నుండునంత నొక్కనాఁడు మంత్రిజనపరివేష్టితుం డై యున్న యారాజునకు భీష్ముం డిట్లనియె. 60
మ. హితు లై పెద్దలు బుద్ధి సెప్పఁగఁ గ్రియాహీనుండ వై త్రోచి పో
యితి దుష్టాత్ములఁ గూడి దానికి ఫలం × బె ట్లయ్యెనో చూచితే
గతవిద్వేషుఁడు ధర్మనందనుఁడు గ×ల్లం బట్టి యిప్పాట దు
ర్గతికిం దప్పితి గాక చిక్కితి గదా × గంధర్వుచే నాజిలోన్. 61
ఉ. నీవును దమ్ములు న్సుతులు × నెయ్యురు వైరులచే గృహీతు లై

పోవఁగఁ బాఱిపోయెఁ గడుఁ । [1]బొల్లఁదనంబున సూతపుత్త్రుఁ డీ
[2]కావరుఁ గష్టచిత్తు నధి।కంబుగ నమ్ముదు నీవు వీనిబా
హావిభవంబు గయ్యమున । నక్కడఁ జూచితె కన్నులారఁగన్. 62

ఉ. ఆయతబాహు లుగ్రబలు । లార్యులు పార్థులు వారిభూరిశౌ
ర్యాయుధనైపుణక్రియల।యందుఁ బదాఱవపాలుఁ బోలఁ డీ
వాయపురజ్జులాఁ డధిప । వారలచందము వీనిచందముం
నీయెడ నిక్కమై తెలిసె।నే ఖచరేంద్రులపోరిలోపలన్. 63

క. కులమును సిరియును జెఱుపక, యలఘుస్థితి నింక నైన । నప్పాండవులం
గలసి మనవయ్య నా దగు, పలుకు వినఁ గదయ్య హితముఁ । బథ్యముఁ జుమ్మీ.

వ. అనిన భీష్మువచనంబులదెస ననాదరంబు సేసి దుర్యోధనుండు కర్ణసౌబలులం
జూచి నవ్వుచు వారలుం దమ్ములుం దోడన చన నక్కడ వాసి చనియె భీష్ముండును
లజ్జితుండై నిజగృహంబున కరిగె నంతఁ గౌరవేశ్వరుండు గ్రమ్మఱి యెప్పటిచోటికిం
జనుదెంచి మంత్రులతోడ మంతనం బుండి మన కెయ్యది కర్తవ్యం బెయ్యది సేసి
నఁ దేజోలాభంబు లగు నని యడిగినఁ గర్ణుండు దేవా నీ కింక నేవిచారమ్ములు
నేల నిష్కంటకం బైనయీపృథివి సకలంబునుం బాలించుచు మహేంద్రమ
హిమతోడ నఖిలసుఖంబులు ననుభవింతు గాకనినం బ్రీతుండై యతండు వాని
కిట్లనియె. 65

క. నీయట్టివీరవరుఁడు స, హాయుం డటె పడయరాని । యదియుం గలదే
ధీయుత నా కెయ్యదియును, బాయక విను మింక నొక్క । పని దెల్లముగాన్. 66

తే. ధర్మజుఁడు రాజసూయంబుఁ । బేర్మిఁ జేసి, నంతనుండియు నమ్మహి।తాధ్వరమున
యం దభిప్రాయమైయుండు।నొండ నాకు, నమ్మఖంబు సేయింపవే । యనఘ నన్ను.

వ. అనినం గర్ణుండు కౌరవపతి కిట్లనియె. 68

క. అగుఁ గాక యేమి యిప్పుడు, జగతిం గలనృపతు లెల్ల । జనవర నీ కి
మ్ముగ వశవర్తుల కావునఁ, దగ నుద్యోగింపు మిపుడు । తత్క్రతువిధికిన్. 69

ఉ. రాజులఁ బిల్వఁ బంపుము ధ।రాసురసంఘము నామతింపు పే
రోజ నుదాత్తయజ్ఞగృహ।యూపతతుల్ సమకట్టఁ బంపు వి
భ్రాజితభక్ష్యభోజ్యవిధి।భవ్యపదార్థము లానయింపు మ
వ్యాజవిభూతిమై నమర।వల్లభుచాడ్పునఁ జేయు జన్నమున్. 70

వ. అనిన సంతోషిల్లి కురుపతి యప్పుడ పురోహితునిం బిలిపించి రాజసూయ
యజ్ఞంబు సంపూర్ణదక్షిణంబుగాఁ జేయ వలయుఁ దత్ప్రయోగవిశేషంబులకు
మీరు సాలి యుండునది యనినం బురోహితుండు దగినవిద్వజ్జనంబులతోడ విచా
రించి దుర్యోధనున కిట్లనియె. 71

---

1. అ. బొల్లఁదనంబున. 2. క. కావలు.

చ. జనవర నీకుఁ బాండవులు । శత్రులు గావున నీవు వారి నో
ర్చిన మఱి కాక మున్న యిటు । సేయఁగ శక్యమె రాజసూయముర్
వినుము దగంగ నిప్పటికి । వేఱొక యజ్ఞము సేయు మిమ్ములం
బనుపుము తత్క్రియావివిధ । భంగులకుం దగువారి వేగమైన్. 72

తే. రాజసూయంబునట్టిద । రాజవర్య, వైష్ణవం బనుయాగంబు । వాసుదేవుఁ
డిమ్మఖము సేసెఁ దొల్లి య । భీష్ట మిదియ, చేయు నిర్విఘ్నముగ నిది । సెల్లు నీకు.

క. అనిన నిది వ్రాలు నని య, జ్జననాథుఁడు సూతతనయ । సౌబలులు ప్రియం
బున ననుమతింప నభిమత, వినుతాధ్వరసంప్రయోగ । విహితోద్యముఁ డై. 74

క. తనయుద్యోగము జననీ, జనకులనును ద్రోణవిదుర । శాంతనవకృపా
దినిఖిలమాన్యజనమ్ముల, కును దగ నెఱిఁగించి భరత । కుంజరుఁ డెలమిన్. 75

దుర్యోధనుఁడు వైష్ణవం బనుయజ్ఞంబు సేయుట.

వ. వారిచేత ననుజ్ఞాతుం డయి నగరసమీపంబున నొక్క పుణ్యస్థలంబునం దఖిల యజ్ఞగృహంబులు నతిరమణీయంబులు గాఁ జేయించి యజ్ఞోపకరణంబులును సమస్తవస్తువిశేషంబులును సమకట్ట నియోగించి శుభదినంబునం బరమబ్రాహ్మణ సహాయుం డై దీక్షాశోభనంబు వహించె నంత. 76

ఆ. అఖిలదేశవాసు । లైనరాజులను బ, విత్రచరితు లైన । విప్రవరుల
నర్థిఁ బిలువ దూత । లరిగిరి కౌరవే, శ్వరునియాజ్ఞఁ జేసి । సమ్మదమున. 77

వ. అం దొక్క దూతం బిలిచి దుశ్శాసనుండు నీవు ద్వైతవనంబునకుం జని పాండవుల ను దదాశ్రమవాసు లయినభూసురులను గౌరవేశ్వరునధ్వరంబునకుఁ బిలువు మని పనిచిన వాఁడునుం జని ధర్మజుం గని యి ట్లనియె. 78

ఉ. వీరుఁడు కౌరవుండు నిజ । విక్రమలబ్ధసమున్నతార్థసం
భారముల న్మహాధ్వర మ । పారబలుం డొనరించుచుండి పెం
పారఁగ నిన్నుఁ దమ్ముల మ । హాద్విజులం బిలువంగఁ బంచె ధా
త్రీరమణేశ నెమ్మిఁ జను । దెమ్ము తదధ్వరముం గనుంగొనన్. 79

వ. అనిన ధర్మజుండు (మందస్మితాననుం డై) వానికి ట్లనియె. 80

చ. అనఘుఁడు ధార్తరాష్ట్రుఁడు మ । హాధ్వరకర్మధురీణుఁ డయ్యె నా
విని ప్రియ మందెఁ జిత్తము ప । విత్రిత మయ్యెఁ గులంబు వింటె యై
నను దగ నేము వూనినఘ । నం బగు వూనికి దీర్ప కెవ్విధం
బున నట రా నొడంబడము । భూవరుతో నిది సెప్పు మేర్పడన్. 81

వ. అనియె నప్పుడు భీమసేనుం డాదూతం జూచి యోరి వినుము పదుమూఁడగు నేఁటికడపటఁ బాండవాగ్రజుండు దీప్తం బగుశస్త్రాస్త్రదహనంబునందు ధార్తరాష్ట్ర సుతశతంబును బశువరించి వేల్చి రణసత్త్రంబు సేయుటకు నై వచ్చుం గాని యందాఁకం జను దెంచుట గలుగ దని యాదుర్యోధను నెదురన వా యొడక

చెప్పు మనిన వాఁడును మగిడి చని ధర్మనందనుప్రియవచనంబులును వృకోదరు
నిష్ఠురోక్తులును ధార్తరాష్ట్రుల కెఱింగించెఁ దదనంతరంబ. 82

క. చనుదెంచిరి కౌరవశా, సనమున ధరణిఁ గలసకలజనపతులును స
న్మునులును సమస్తజనులును, ఘనభుజుజన్నంబుఁ జూడఁ గరిపురమునకున్. 83

వ. వారి కెల్లను దగినసత్కారంబులు సేయను బాత్రదానంబులు గావింపను ధృత
రాష్ట్రుండు విదురుం బనిచె నివ్విధంబునఁ బ్రసిద్ధదక్షిణాన్వితం బై ప్రభూతాన్న
పానసంతర్పితసకలజనం బై యభిమతాంబరాభరణపరిపూజితభూసురప్రకరం బై
యథాకాలవిహితకర్మకలాపం బై యథాశాస్త్రీయం బై వైష్ణవయాగంబు
నిర్విఘ్నంబుగఁ బరిసమాప్తం బగుటయు. 84

క. అవభృథశోభితుఁ డై కౌ, రవముఖ్యుఁడు భూరికనకరత్నతతుల భూ
దివిజులఁ బూజించి నృపుల, వివిధవిధుల సత్కరించి వీడ్కొలిపెఁ దగన్. 85

వ. అట్టియెడ నధ్వరోత్సవాగతు లైనజను లనేకులు ధృతరాష్ట్రనందనుసమ్ముఖంబున
ని ట్లనిరి. 86

క. జనపతు లెవ్వరు నివ్విధ, మున నిర్విఘ్నముగ నఖిలభూజనసమ్మో
దనముగఁ జేసిరె సత్క్రతు, వనఘ భవత్పుణ్యమహిమ మాశ్చర్య మిలన్.

శా. సారోదారవిభూతిమై మును హరిశ్చంద్రుం డొనర్చెం గృపా
పారీణుం డయి రాజసూయ మది సెప్పన్ వింటి మయ్యజ్ఞముం
గౌరవ్యోత్తముఁ డైనధర్మసుతుఁడుం గావింపఁగాఁ గంటి మే
మా రెండున్ సరి గావు నీమఖముతో నత్యున్నతిన్ భూవరా. 88

క. ఈజన్న మొనర్చియ కా, దే జగదావర్తికీర్తిదీపితు లై య
వ్యాజసురలోకసుఖముల, భ్రాజిల్లిరి రఘుయయాతిభరతాదినృపుల్. 89

తే. అని నుతింపంగ మఱియును నందుఁ గొంద, ఱయ్యుధిష్ఠిరురాజసూయంబుచిదుర
పాలిఁ బోల దీమఖము వైభవసమృద్ధి, నని తలంచిరి నిజహృదయంబులందు.

వ. అనంతరంబ నిరంతరానంద (మంద) మందాయమానమానసుం డగుచు మాన
వేశ్వరుండు దమ్ములు దొరలు బంధుజనంబులుం బరివేష్టింపఁ బౌరజనదత్తాశీర్వాద
జయజయ(శబ్ద)శబ్దాయమానదిగ్విభాగుం డగుచుఁ బుణ్యాంగనాకరకలితలలితాక్ష
తవిక్షేపంబులును బటువందిమాగధసంకీర్తనంబులును గైకొనుచుఁ బురప్రవే
శంబు సేసి రాజమందిరగతుం డై ధృతరాష్ట్రునకు గాంధారికిఁ గృపద్రోణభీష్ముల
కుం బ్రణమిల్లి యుల్లంబు వికసిల్లఁ గనకాసనాసీనుం డయ్యె నప్పుడు కర్ణుం
డతని కిట్లనియె. 91

ఉ. భాగ్యము గాదె కౌరవనృపాల భవన్మఖ మిష్టసత్క్రియా
యోగ్యత నిర్వికల్పముగ నొందె సమాప్తి నశేషధాత్రియున్
భోగ్యమ నీకు నింక రణభూమిఁ బృథాసుతులన్ జయించి స

మ్యగ్యమశాలి వై భువనమాన్య యొనర్పుము రాజసూయమున్. 92

క. అది యెమ్మెయి నగునో యని, మదిలో వగవంగ వలదు మఘవతనూజుం
గదనమున నే జయింపక, పదనఖధావన మొనర్పఁ బార్థివముఖ్యా. 93

తే. అనినఁ గర్ణుఁ గౌఁగిటఁ జేర్చి యన్నరేంద్ర
నందనుఁడు నీసహాయత నాకుఁ గలుగఁ
బాండవుల నోర్చు టెంతటిపని మహాత్మ
యని సహోదరసహితుఁడై హర్ష మొందె. 94

వ. అట ధర్మతనయుండు సూతతనయుప్రతిజ్ఞ విని వానిబలశౌర్యవిభవంబును నభేద్యకవచప్రభావంబును దలంచి విషణ్ణహృదయుండై రేలెల్లను గన్ను మూయుట లేక వగచుచుండె నిట దుర్యోధనుండును గర్ణసౌబలప్రవర్తితకార్యఖిద్ధుండై భీష్మద్రోణకృపాదులకును మహనీయులైనమహీసురులకు ననుదినంబును బ్రియసత్కారంబులు సలుపుచు ధనంబు దత్తభుక్తఫలంబుగా వగచి నిరంతరత్యాగభోగంబుల ననురాగంబు నొందుచుండె ననిన వైశంపాయనునకు జనమేజయుం డిట్లనియె. 95

క. దుర్యోధనుచెఱ దలఁగియు, వార్యపరాక్రములు పాండవప్రభులు మహై
శ్వర్యచరితు లవ్వనమున, నార్యులు మఱి యెట్టివార లైరి మునీంద్రా. 96

ద్వైతవనంబునందలిమృగసమూహము ధర్మజు స్వప్నంబునందు వచ్చి తమదుఃఖము చెప్పుట.

వ. అని యడిగిన నమ్మహాముని యమ్మహీపతి కిట్లనియె. 97

సీ. ద్వైతవనంబున ధర్మజుం డొకనాఁడు, నిద్రింపఁగాఁ దద్వనేచరంబు
లగునట్టిమృగజాతు లన్నియుఁ గలలోన, వచ్చి కన్నుల నశ్రువారి దొరుఁగఁ
దమ్మెఱింగించి యాతనితోడ నిట్లను, ధర్మాత్మ మీరు నిత్యంబుఁ గడఁగి
చంపంగఁ జంపంగ సమసి యల్పావశిష్టము లయ్యె నిప్పు డస్మత్కులంబు

తే. లేము బీజమాత్రను చిక్కి యిట్లు వనరుచున్నవారము మీ రింక నొండుగడకు
నరిగి మముఁ గావ రే కరుణార్ద్రబుద్ధి, ననిన నట్ల కాకని వానికభయ మిచ్చి. 98

క. జనపతి మేల్కాని యంతయు, ననుజుల కెఱిఁగించి యిట్టు లను నబ్దము పై
నెనిమిదినెల లుండితి మి, వ్వనమునఁ దగు నింక నొండు[1] వలనికిఁ బోవన్. 99

వ. ఇప్పుడు కామ్యకవనంబు బహుమృగాకీర్ణంబై సరసఫలభరితభూరుహప్రకరంబై విమలకమలాకరాభిరామంబై యున్నయది యని వింటిమి గావునం గ్రమ్మఱ నందులకుం జని తృణబిందునాశ్రమంబున వసియించుట లెస్స యనినం దమ్ములు దేవా నీ వెట్లు నిశ్చయించితి మాకు నదియ యిష్టం బని పలికిరి తదనంతరంబ.

1. అ. వనమున కేఁగన్.

క. అనుజన్ములుఁ బాంచాలియు, ననుచరవర్గంబు బ్రాహ్మణావలియును దోఁ
జను దేరఁగ సమ్మదమున, ఘనతేజుఁడు సనియెఁ గామ్యకవనంబునకున్. 101

వ. ఇట్లరిగి యందుఁ గృతనివాసులై యవ్వీరులు శాకఫలమూలంబులం జేసి దేహయాత్రలు నడపుచు నొండొరులయలజడి సూచి యత్యంతదుఃఖపరవశు లగుచు జూదంబునాఁడు దమపడినపాట్లు దలంచి కలంగుచుఁ గ్రోధశోకంబులు దమలోన నుపశమించికొనుచు వర్తిల్లం బదునొక్కం డగునేఁడు సనిన నందఱుం గాలంబు గడగాంచినవారై వెడవెడ వికసిల్లినచిత్తంబులతో నుచితవృత్తంబుల నుండు నంత.

శా. ప్రీతుం డై చనుదెంచె నాశ్రితజనాభీష్టక్రియాశీలుఁ డు
ద్గీతామ్నాయుఁడు నిర్విధూతదురితక్లేశుండు [1]యోగామృత
స్ఫీతస్వాంతుఁ డనంతసంతతసమావిర్భూతకారుణ్యధా
రాతోయస్నపనైకశీలుఁ డగుపారాశర్యుఁ డచ్చోటికిన్. 103

క. మునిపతి దాదవ్వులఁ గని, జనపతి దమ్ములును దాను సంప్రీతి నెదు
ర్కొని యర్ఘ్యాదివిశేషా,ర్చనలం బరితుష్టుఁ జేసె సంభృతభక్తిన్. 104

వ. కృష్ణద్వైపాయనుండును ననవరతవనవాసాయాసకృశదేహుల నధికదుఃఖాయమానహృదయులం దనమనుమలం జూచి వగచి ధర్మపుత్త్రున కిట్లనియె. 105

ఉ. కాలవిపర్యయంబున సుఖంబును దుఃఖము వచ్చుచుండు నె
క్కాలము నేరికిన్ ధ్రువము గాదు సుఖంబును దుఃఖమున్ మహీ
పాల బుధుండు దద్ద్వివిధభంగు లెఱింగి ప్రమోదఖేదసం
శీలుఁడు గాఁడు రెంటను బ్రసిద్ధపథంబున నప్రమత్తుఁడై. 106

క. విను నీవును [2]నాపదలకు, మనమున నొక్కింత యోర్చి మహనీయము గా
నొనరింపుము తపము తపం, బునన కదా సకలసౌఖ్యములు సిద్ధించున్. 107

క. క్షమయు నహింసయు సత్యము, సమతయు నింద్రియజయంబు శమముఁ బరిత్యా
గమును దపోలక్షణములు, క్రమమున నిన్నియును నూర్ధ్వగతికారణముల్.

తే. ఇందుఁ జేసినపుణ్యంబు లందుఁ గుడుచు, మీఁదిజన్మంబునకు నది మేలు సేయుఁ
గాన తనశక్తితోఁ గూడ దానధర్మ, చిరపరోపకారంబులు సేయ వలయు.

వ. అనినం బాండవాగ్రజుండు దానతపంబులలో దుష్కరం బెయ్యది యెద్దాన నధికఫలం బగు నని యడిగిన వేదవ్యాసుం డిట్లనియె. 110

సీ. దాన మూర్జితఫలదం బర్థసాధ్యమై, పర్వఁగుటఁ గరము దుష్కరము నదియు
నరులకు నధిప ప్రాణంబులకంటెను, రూపింప నర్థంబు తీపు వినవె
యుగ్రంబు లైనయాయుధముల మొనలపై, నుఱుకుట యంభోధిదఱిసి చనుట
కృషిపాశుపాల్యసంక్లేశంబు నొందుట, యడవులఁ గొండల నిడుమ వడుట
ఆ. నవసి పొవసి యనుదినముఁ బరప్రేష్యులై, యునికి దలఁప నర్థమునకఁ జూవె

---

1. అ. యోగామృతా, స్వీతస్వాంతుఁ. 2. క. నాపలుకులు...నొక్కింత నచ్చి.

యట్టిదుఃఖలబ్ధ మైనయయ్యర్థంబు, విడుచు టెవ్విధమునఁ గడిఁది గాదె. 111

శా. అన్యాయార్జిత మైనవిత్తమునఁ జేయం బూనుదానంబు మూ
ర్ఖన్యాయం బది దానఁజేసి ఫలపాకం బేమియున్ లేదు యు
క్తన్యాయార్జిత మించుకంత యయినం గాలంబు దేశంబు స
మ్మాన్యం బై తగఁ బాత్రయోగమున సౌమ్యం బై ఫలించుం దుదిన్. 112

వ. తొల్లి ముద్గలుం డనుమహాద్విజుండు సన్మార్గోపార్జితం బైనవ్రీహిద్రోణంబు సత్పాత్రంబునఁ బ్రతిపాదించికాదె పరమసిద్ధిం బొందె ననిన విని ధర్మనందనుండు మునీంద్రా ముద్గలుండు వ్రీహిద్రోణం బెబ్భంగి నుపార్జించె నెట్టిపాత్రంబునఁ బ్రతిపాదించె విన వలతుం జెప్పవే యనిన నతం డి ట్లనియె 113

వ్యాసుఁడు ధర్మజునకు వ్రీహిద్రోణాఖ్యానంబు సెప్పుట.

క. అతిథిప్రియుఁడు విశిష్ట, వ్రతుఁడు విమత్సరుఁడు సత్యవచనుండు విని
ర్జితవిషయేంద్రియుఁడు సము, న్నతపుణ్యుఁడు ముద్గలుఁడు ఘనస్థిరబుద్ధిన్. 114

వ. పుత్త్రదారసహితంబుగాఁ గురుక్షేత్రంబున వసియించి యుంఛవృత్తిపరాయణుం డై పాడ్యమిం దొడంగి పదునాలుగుదివసంబులొక్కొక్కగింజ యుకాఁ దూమెఁడు వడ్లు సమకూర్చి పర్వదినంబునఁ బాకంబు సేయించి దేవపితృపూజనంబులొనరించి యతిథుల కన్నంబు వెట్టి మిగిలినయన్నంబునఁ దానును బుత్త్రకళత్త్రంబులును దేహయాత్ర నడపుచు నివ్విధంబునఁ బక్షోపవాసవ్రతంబున వర్తిల్లుచున్నయెడ నొక్కపర్వదినంబునందు. 115

మ. మతి నత్యంతజుగుప్సితం బయినయుగ్రోన్మత్తస్వరూపంబుతో
గతవస్త్రుండును ముక్తకేశుఁడు బహుగ్రామ్యోక్తిశీలుండు నై
హితపుణ్యుండు మునీశ్వరుం డతిథి యై యేతెంచె దుర్వాసుఁ డ
య్యతి యమ్ముద్గలుపాలికిం బటుబుభుక్షాయత్తతం దూలుచున్. 116

క. అతనిఁ గని యించుకంతయు, మతి ననుమానంబు లేక మానుగఁ బ్రత్యు
ద్గతుఁ డై యర్ఘ్యముఁ బాద్యము, నతిభక్తి నొనర్చి మునికులాగ్రణి నెమ్మిన్.

క. అన్నంబు వెట్టె నతఁడు త, దన్నం బంతయును గుడిచి యాత్మఁ దనిసి శే
షాన్నంబు మేన నిండఁగ, నన్నుతుఁ డలఁదికొని మగిడి చనియె నిజేచ్ఛన్.

క. మునిపతి పర్వముపర్వం, బున మఱియును నరుగుదెంచు ముద్గలుఁడును దా
ననశనుఁ డై యుండియు న, మ్మునివరునకు నొసఁగు నన్నముం బ్రియ మెసఁగన్.

వ. ఇవ్విధంబున నాఱుపర్వంబులు గుడిచి దుర్వాసుండు వానిచిత్తంబున నొక్కకొఱంతయుం గానక యద్భుతప్రమోదమగ్నమానసుం డై వాని కి ట్లనియె. 120

క. నీయట్టిదానశీలుని, నీయఖిలమునందుఁ గాన నెన్నండును స
త్త్వాయత్తమతివి సాధువి, ధేయుండవు నీవు పుణ్యతేజుఁడ వనఘా. 121

చ. మనమున నేవగింప కవమానము సేయక యించుకంతయుం

గినియక సోల మందక యకృత్రిమభక్తి నొనర్చి తీవు స
జ్జనసుత యన్నదానము ప్రసాదము సత్యము ధైర్యముం దమం
బును నపరిగ్రహత్వమును బొల్పుగ నీధన మయ్యె నియ్యెడన్. 122

చ. చవులకుఁ బ్రేముడించు ననిశంబును నాలుక దాల్మి పెంపు ధ
ర్మువును శమంబుఁ ద్రెక్కొను సముద్ధతి నాఁకలి వీన రెంటనుం
వులవు జీవితస్థితివిరోధాయక మన్నము నీవు జీవితే
చ్ఛ విడిచి తిప్పు డే మని ప్రశంస యొనర్తు నినుం దపోనిధీ. 123

క. మనమును నింద్రియములవ, ర్తనమును సరిగా నొనర్చు ధర్మంబు దపం
బని చెప్పుదు రట్టితపం, బనఘా నీయంద కలిగె నభిమతభంగిన్. 124

ఉ. ప్రీతుఁడ నైతి నీవలనఁ బేర్చినపుణ్యపదంబు లెల్ల నీ
చేతివ యయ్యె నీ దగుప్రసిద్ధతపోవిభవంబు నిర్జర
వ్రాతము లిప్డు సూపెడు దివంబున నీవును మేనితోడ వి
ఖ్యాతిఁ దేవయానమునఁ గ్రమ్మన నేఁగెదు సంయమీశ్వరా. 125

వ. అని పలికి దుర్వాసుం డరిగెఁ దదనంతరంబ హంససారసయుక్తంబును గింకిణీమా
లికామనోహరంబును గామగమనంబును నయినవిమానంబు గొనుచు దేవదూత
ముద్గలుకడకుం జనుదెంచి యి ట్లనియె. 126

క. అనఘ భవత్సుకృతంబున, ననిమిషలోకాభిగమ మవాప్తం బయ్యెం
జనుదెమ్ము విమానము చ, య్యన నెక్కుము చిత్తమునఁ బ్రహర్షం బెసఁగన్.

వ. అనిన దేవదూతం జూచి ముద్గలుండు మహాత్మా దివిజలోకం బెట్టిది విన వలతు
నందులగుణదోషంబు లెఱింగింప వలయు సత్పురుషులతోడిమైత్రి సాప్తపదీనం
బని చెప్పుదురు గావున మైత్రిం బురస్కరించి ని న్నడిగెద ననిన నతం
డమ్మునీంద్రున కి ట్లనియె. 128

ముద్గలునకు దేవదూత పుణ్యలోకంబు తెలియఁ జెప్పుట.

క. ఈలోకమునకు మీఁదై, చాలఁగ వెలుఁగొందు చుండు స్వర్లోకము నా
నాలంకారయుతము ది, వ్యాలోకము దేవయాన మది మునినాథా. 129

చ. అమలతపోనివాసులు మహాధ్వరశీలురు సత్యసంధు లు
త్తములు జితేంద్రియుల్ సములు దానపరుల్ రణశూరు లందు హ
ర్షమున వసింతు రచ్చరలు సాధ్యులు దేవమునుల్ మరుద్వసు
ప్రముఖులు వేఱువేఱ తగుపట్టుల నుండుదు రంద యిమ్ములన్. 130

వ. మఱియు ముప్పదిమూఁడువేలయోజనంబుల విస్తృతం బైన మేరుశిఖరంబునందు
నందనప్రముఖంబు లయిన దేవోద్యానంబులు పుణ్యపరులకుఁ గ్రీడాస్థానంబు లై
విలసిల్లు నయ్యెడల నాఁకలియు నీరువట్టును శీతోష్ణభయంబులును జరారోగ
వికృతులును బుట్ట వయ్యెడలం జూచిన నతిమనోహరం బై సకలేంద్రియతర్పణం

బై యుండు నిట్టిలోకంబునకు నర్హు లయినపుణ్యపురుషులు విధినియోగ
పక్వంబు లయినమానుషశరీరంబులువిడిచి తేజోమయంబు లగుదివ్యదేహంబులు
ధరియించి వివిధాంబరాభరణభూషితులును నమ్లానకుసుమమాలికామనోహ
రులును నై కనకవిమానంబులందు దేవదూతలచేతఁ గొనిపోవం బడి యందు
శోకశ్రమాయాసవిరహితు లై వివిధసుఖంబు లనుభవించు చుండుదురు. 131

ఆ. అనఘ యింద్రలోకమునకంటె మీఁద ని, శ్శోక మగుచు బ్రహ్మలోక మమరు
నది యనన్యదీప్తసదన మై తన దైన, వెలుఁగునను జగంబు వెలుఁగఁ జేయు.

చ. మనువులు ధాతలు౯ మునులు మానుగ నుండుదు రందు లోభముం
గినుకయుఁ దాపముం బగయుఁ గిల్బిషము౯ ఘనదుఃఖవైకృతం
బును జనియింప వీభువనముల్ దెగునప్పుడు నాశ మొందద
ద్వినుతపదంబు దానియెడ వేడుక సేయుదు రింద్రముఖ్యులున్. 133

వ. స్వర్గంబునం గలగుణంబు లెఱింగించితిఁ దదీయదోషంబులు సెప్పెద వినుము.

తే. ఇందుఁ జేసినపుణ్యంబు లెల్ల నందుఁ, గుడుచుఁగాని మర్త్యునకందుఁ గడఁగి పుణ్య
మాచరింపంగఁ గాదు పుణ్యావసాన, మగుడు భూమిక త్రోతురు మగుడ నతని.

క. కడు మరగినసౌఖ్యంబులు, విడుచుటఁ జిత్తంబు దుఃఖవివశముగ మహిం
బడుఁ జూవె పుణ్యలోకం, బెడలినమనుజుండు దేజ మేది యబలుఁ డై. 136

క. తనతక్కువయునికియు న, న్యునియున్నతలీలయుం గనుంగొని చిత్తం
బున నెరియు చునికి గలుగును, జననుత సురలోకవాసజనులకు నెల్లన్. 137

వ. బ్రహ్మలోకంబునం దక్కఁ దక్కినపుణ్యలోకంబులం దెల్ల నిదియ మేరయై చెల్లు
మఱియుఁ బుణ్యలోకపరిభ్రష్టుండు మర్త్యలోకంబున సుఖశీలుం డయి పుట్టు
నీలోకంబు గర్మభూమియు నాలోకంబు ఫలభూమియు నని యెఱుంగుము నీవలని
యాదరంబునం జేసి యింతయుం జెప్పితి నీ వింకఁ దడయ నేల చనుదె మ్మనిన
ముద్గలుండు గొండొక విచారించి దేవదూతం జూచి యి ట్లనియె. 138

ఆ. ఇట్టిదివ్యసుఖము లే నొల్లఁ బదివేలు, వచ్చె నాకు నమరవర్గమునక
యుండ నిమ్ము వాని నో యన్న విచ్చేయు, మిష్టమైనయెడకు నిపుడ నీవు. 139

క. ఎయ్యెడకుఁ జనినఁ బురుషుం, డియ్యెడకును మగుడ కుండు నెక్కాలము నే
నయ్యుత్తమపదవికి నై, యెయ్యనువున నైన నుత్సహించెద బుద్ధిన్. 140

వ. అని దేవదూత వీడ్కొలిపి ముద్గలుండు శిలోంఛవృత్తి విడిచి పరమశాంతిం గైకొని
నిర్వికల్పంబైనజ్ఞానయోగంబునం జేసి తుల్యనిందాస్తుతియును సమలోష్టాశ్మకాంచ
నుండును నై పరమసిద్ధిం బొందెఁ బాండవోత్తమా నీవును రాజ్యరహితుండ నైతి
నని వగవక తపంబు సేయుము తపంబునం జేసి శుభంబులు సేకుఱుఁ బదుమూఁ
డవ నేఁటికడపటఁ బిత్ర్యపైతామహం బైనరాజ్యంబు నిన్నుం బ్రాపించు ననియిట్లు
సాత్యవతేయుండు గౌంతేయుల నాశ్వాసించి నిజాశ్రమంబునకుం జనియె నంత

మ. వితతానేకమృగాకులంబును సదావిర్భూతనానాతరు
వ్రతతీపుష్పసుగంధబంధురసుఖావాసంబు బ్రహ్మర్షిసం
శ్రితపుణ్యాశ్రమమండలంబు నగుచుం జెల్వొందునక్కానలో
ధృతపుణ్యుల్ విహరించి రేవురును గుంతీపుత్త్రు లిచ్ఛాగతిన్. 142

వ. ఒక్కనాఁ డమ్మహారథులు దృణబిందునాశ్రమంబున ధౌమ్యసహితంబుగాఁ
బాంచాలి నునిచి యేవురు నొక్కట మృగయార్థంబు నలుదిక్కులకుం జనిన
యనంతరంబ. 143

సైంధవుఁడు ద్రౌపదిం జూచి మోహించుట.

ఉ. వీరుఁడు సైంధవుండు నయవిశ్రుతశౌర్యుఁడు సాల్వకన్య నిం
పారఁగఁ బెండ్లి యాడుటకునై నిజవైభవ ముల్లసిల్ల వి
స్ఫారచతుర్విధోరుబలసంగతుఁడై చను చుండి యాశ్రమ
ద్వారమునందుఁ గాంచె ద్రుపదక్షితిపాలతనూజ నచ్చటన్. 144

ఉ. నీలపయోదమండలి వినిశ్చలలీల వెలుంగఁ జేయుచుం
గ్రాలెడువాలుఁ గ్రొమ్మెఱుఁగుకైవడిఁ దద్వనభూమి నెంతయుఁ
లాలితదేహకాంతిపటలంబునఁ జేసి వెలుంగఁ జేయున
బ్బాల వినీలకుంతలవిభాసినిఁ జూచి సవిస్మయాత్ముఁడై. 145

తే. మగువఁ దగిలినచూడ్కులమగుడఁ దిగువ, నేర్పు సాలక యపుడు కందర్పదర్ప
గోచరాత్ముఁడై నిజసఖుఁ గోటికాస్యుఁ, డనున్నృపాత్మజుఁ జూచి యిట్లనియెఁ బ్రీతి.

ఉ. ఇన్నలినాక్షి యెవ్వతియొ యివ్విపినంబున నేకతంబ యి
ట్లున్ననిమిత్త మేమియొ సురోత్తమకన్యయొ యక్షకాంతయో
పన్నగభామయో మనుజభామిని గామి నిజంబ యిట్టిచె
ల్వున్నదియే మహీతలమునన్మగలు లెవ్వరియందు నారయన్. 147

ఉ. లీల [1]మెలర్పఁగా నబల లేఁజిగురాకునుబోలె నొప్పు కెం
గేలు కదంబశాఖతుదిఁ గీల్కొనఁ జేసి వసంతవిభ్రమో
న్మీలితబాలవల్లిక్రియ మే లగుచూడ్కుల కించి పావక
జ్వాలయపోలెఁ జిత్తము నిజం బెరియింపఁ దొడంగెఁ జూచితే. 148

ఉ. ఈకమలాస్య నాకు హృదయేశ్వరి యైనఁ ద్రిలోకరాజ్యముం
జేకుఱి యేలినట్లు వికసిల్లనె దర్పకవీరు బంటుఁ గాఁ
గైకొననే వయస్య వెసఁ గాంత నొడంబడఁ బల్కి దీనికిన్
నాకును బొం దొనర్చి కరుణం జరితార్థునిఁ జేయవే ననున్. 149

వ. అని పనిచినం గోటికాస్యుండు గ్రక్కునం బాంచాలిపాలికిం జని ప్రణయసుభ

1. జ. యొనర్పఁగా.

గంబుగా నమ్మగువ కి ట్లనియె. 150

సీ. మృగనేత్ర దారుణ ✽ మృగసమాకుల మైన, యివ్వనాంతరమున ✽ నేకతంబ
యిట్లు నీయునికికి ✽ నెయ్యది మూల మి,వ్వన దేవతవొ సు ✽ రేశ్వరునితోడ
నలిగి ధరిత్రికి ✽ నరుగుదెంచిన శచీ, [1]దేవివొ హరియుర ✽ స్స్థితి దొఱంగి
కేలిఁ గ్రుమ్మరుప ద్మ ✽ గేహవొ భవదీయ,జనకత్వమున సము ✽ జ్జ్వలితుఁ డైన

తే. పుణ్యుఁ డేవంశమునవాఁడు ✽ పొలఁతి నీదు, జీవితేశ్వరుఁ డగుసుఖ ✽ జీవితాత్ముఁ
డెవ్వఁ డబల నీనామ మై ✽ యింపు మిగులు,శబ్ద మెయ్యది నాకు ని ✽ జంబు సెపుమ

క. కరిరాజగమన మాతెఱఁ, గరయఁ దలఁచి తేని వినవె ✽ యధికబలుఁడ నే
సురథుఁ డనురాజుపుత్త్రుఁడ, నరిమథనుఁడఁ గోటికాస్యుఁ ✽ డనఁ జనువాఁడన్.

తే. [2]ఉల్ల కాంచనరథముపై ✽ నున్నవాఁడు, ఘనుడు క్షేమంకరుండు త్రి ✽ గర్తవిభుఁడు
మఱియు నినుఁ జూచుచున్నాఁడు ✽ మగువ వాఁడె,[3]దీప్తభుజుఁడు కళింగ ధా ✽ త్రీవరుండు.

తే. ఉల్లపద్మాకరము పొంత ✽ నుండి నిన్ను, మెచ్చి కనుఁగొను చున్నయ ✽ స్మీలితాక్షుఁ
డుత్పలాక్షి. యిక్ష్వాకువం ✽ శోద్భవుండు,సుబలభూపతిపుత్త్రుండు ✽ సుభగుఁ డతఁడు.

వ. అరుణాశ్వయుక్తంబు లయినరథంబులయందు రత్నమయభూషణు లయి సమిద్ధ వహ్నులుంబోలె వెలుంగుచున్నయాసౌవీరకుమారులు పన్నిద్దఱుం దన్నుం జేరి కొలువ ననేకసహస్రకరితురగరథపదాతిపరివృతుం డై మహాగజంబుపై శోభిల్లుచున్నయవ్వీరుండు సింధుసౌవీరనాథుం డైన జయద్రథుం డమ్మనుజేశ్వరుం డిప్పుడు నీతెఱం గెఱుంగఁ దివిరి నన్ను నిట పుత్తెంచె ననినఁ బాండవపత్ని మృదుసంభ్రమంబునం గదంబశాఖ విడిచి యుత్తరీయంబు సంగతంబు గావించుకొని కోటికాస్యున కి ట్లనియె. 155

తే. అన్న యిచ్చట నే నొంటి ✽ యున్నదాన, నీ విచటి కేఁగుదెంచుట ✽ నీతియగు నె
నుతవతిని ధర్మవతి నన్ను ✽ నితర కాంతఁ,గాఁ దలంచి పెక్కులు వల్కఁ ✽ గాదు నీకు.

వ. నీవు శిబివంశోద్భవుం డైన సురథుపుత్త్రుండ వగు టే నెఱుంగుదు నస్మత్ప్రకారంబు సెప్పెద విను మేను బాంచాలపతి యైనద్రుపదుకూఁతుర గృష్ణ యనుదానం బాండునందను లగుయుధిష్ఠిర భీమార్జున నకుల సహదేవులకు ధర్మపత్ని నవ్వీరు లిప్పుడు నన్ను నివ్వనంబున నునిచి. 157

తే. ధర్మజుఁడు దూర్పు భీముఁడు ✽ దక్షిణంబు, నర్జునుఁడు పడమర గవ ✽ లర్థి నుత్త
రంబుగా వేఁట వోయిరి ✽ రాజముఖ్య, లనఘు లింతకు వత్తురు ✽ వినుతబలులు.

వ. మీ రమ్మహాత్ములకు మాననీయులరు గావున నార్యజనమిత్త్రు లగునక్కురుకుల పవిత్త్రులు సేయుసత్కారంబులు గైకొని పోవుదురు గాని యొక్కింతతడ వియ్యాశ్రమసమీపంబున నిలువుం డని పలికి యల్లన యవ్వరవర్ణిని భయంబునం బర్ణ

1. గ.జ. లలనవో హరియుర✽స్స్థలి దొఱంగి. 2. 'ఉల్ల' యనియే ప్రాఁతప్రతులనెల్లఁ జూపట్టెడి; ఒక్కట 'పొన్న కాంచన' యని యున్నది. 3. గ. దృప్తవిభుఁడు.

'అందజయానన మాకొసగు నట్టిసపర్యలు మాకువచ్చె' పెద్దన్న.

గృహంబు సొచ్చినం గోటికాస్యుండును గ్రమ్మఱి చని జయద్రథునితోడ నబ్భా
మిని పాంచాలకన్యక యనియును బాండవపత్ని యనియునుం జెప్పిన నద్దురా
త్ముండు మదనకంపితహృదయుం డగుచు నమ్ముగువ నపహరింపం దివిరి కతిపయజన
సమేతంబుగా నరిగి సింహగారంబు సొచ్చువృకంబునుంబోలెఁ బాండవనివా
సంబు సొత్తెంచి పాంచాలిం గని దాని కి ట్లనియె. 159

క. వామాక్షి నీకుఁ గుశలమె, నీమన సెవ్వారియందు ‡ నిత్యప్రేమం
బై మెఱయు నట్టిసొబగులు, నీమగ లేవురకు నిపుడు ‡ నెమ్మదియె మదిన్. 160

వ. అనిన వానికి నమ్మానవతి యి ట్లనియె. 161

చ. స్థిరమతు లైనపార్థులకు ‡ సేమమ నీకు ననామయంబె భూ
వర తగువింద వైతి కురు‡వర్యులయింటికి నట్లు గావునం
బరువడి నాసనక్రియయుఁ ‡ బాద్యముఁ గైకొను మాదరంబుతో
సరసకురంగమాంసములఁ ‡ జల్పుము భోజనకృత్యమి త్తఱిన్. 162

ఆ. వేఁట వోయినారు ‡ విభు లిప్డు వత్తురు, వారు వచ్చి నీకు ‡ వలయునట్టి
ప్రియము లాచరింపఁ ‡ బ్రీతుండ వై మఱి, యిష్టజనులు నీవు ‡ నేఁగు మనఘ.

చ. అనవుడు సైంధవుం డనియె ‡ నంబుజలోచన నీవు మాకుఁ జే
యునతిథిపూజ లన్నియును ‡ నొక్కట నైనఁ గొఱంత [1]లేదు వ
చ్చినవియ మన్మథాస్త్రముల‡చిక్కనఁ గాఱియ వొందె డెంద మిం
క ననుఁ గృతార్థుఁ జేయుము ద‡గఱ రథ మెక్కుము లెమ్ము నెమ్మితోన్. 164

మ. ధరణీరాజ్యము గోలుపోయి ఘనకాం‡తారస్థలీవాసు లై
సరివా రెల్లను నవ్వఁ గుత్సితదశా‡సంప్రాప్తిమై నున్న ము
ష్కరులం బార్థులఁ [2]గొల్చినం గలదె సౌ‡ఖ్యం బెంతయుఁ బేల వై
తరవిందానన శ్రీవిహీనులఁ గరం ‡ బర్థింతు రే కామినుల్. 165

ఆ. చిగురుఁబోఁడి నిఖిల‡సింధుసౌవీరభూ, వలయరాజ్యగౌర‡వంబుతోన
నన్ను నేలికొని మ‡నఃప్రియభోగైక, యోగ్య వగుము విడువు ‡ మొండుదలఁపు.

వ. అనినం బాంచాలి ప్రకంపితచిత్త యగుచుఁ గొండొక దొలంగి వానిదెస నవ
మానదృష్టిం జూచుచుఁ దనపతులరాకయ కోరుచుం బ్రతివాక్యంబులఁ గొంత
కాలక్షేపంబు సేయుటకై వాని కి ట్లనియె. 167

తే. తలఁపఁ బాండవధార్తరా‡ష్ట్రులకుఁ జెలియ, లైనయాదుస్సలకుఁ బతి ‡ వనఘ నీవు
నాకుఁ దోఁబుట్టువవు గావె ‡ నీకుఁ జనునె, పాడి దప్పినమాటలు ‡ పలుక నిచట.

క. నయమును ధర్మముఁ గలయు, న్నయమున జనియించినాఁడ ‡ వక్కట ధర్మ
క్రియ యెఱుఁగంగా వలదె యు, భయలోకవిరుద్ధ మైన‡పథ మేమిటికిన్. 169

వ. అనిన నద్దురాత్ముండు దరస్మితాననుం డగుచు ని ట్లనియె. 170

1. క. లేక వచ్చినయవి. 2. జ. గల్చినం.

క. వనజాక్షి, రాజధర్మము, వినవే యెన్నఁడును మనుజవిభులకుఁ బ్రమదా
జనులయెడ వావి వెదకం, జనదు వలసినట్ల వేడ్కఁ జలుపంగఁ జెల్లున్. 171

క. విను మదియుఁ గాక జగమున, వనితారత్నంబు లెల్లవారికి భోగం
బునయెడ సాధారణము లొ, కనిధన మని గరుసు గలదె కరినిభగమనా 172

వ. అనిన నయ్యంగన క్రోధకలుషితాంతరంగ యై యిప్పాపాత్ముండు ప్రియవచనం
బులం బోవండు బెట్టిదంబులం గాని చక్కంబడఁ డని తలంచి యి ట్లనియె. 173

ద్రౌపది సైంధవునితో నిష్ఠురోక్తులు వలుకుట.

చ. ప్రకటితశౌర్యసారుల [1]నభంగపరాక్రమనిర్జితాహిత
ప్రకరులఁ బాండునందనులఁ బాండుయశస్కుల నాత్మలోఁ దలం
పక నను ధిక్కరించెదు నృపాలకులాధమ నీదుగర్వదు
ర్వికసన మింతఁ [2]బోదు తుది వ్రేఁగగుఁ దక్కుము దుష్ప్రలాపముల్. 174

మ. హిమవత్పాదవనాంతకేలిరతి మై నే పారి కోపారుణ
క్రమనేత్రాంచల మై ప్రభూతమదరేఖం బైనగంధద్విపేం
ద్రము డాయం జని సిల్లు సూపుట సుమీ ధర్మాత్ము నత్యుగ్రవి
క్రముఁ గాంతేయవరిష్ఠు నీవు దొడరం గాఁ జూచు టూహింపఁగన్. 175

ఉ. శాతనఖాగ్రఖండితలసన్మదకుంజరకుంభముక్తము
క్తాతతశైలకందరగుహాంతరసుప్తమృగేంద్రకేసర
వ్రాతము వేడ్క [3]నూఁచికొన వారక చేరుట గాదె క్రోధని
ఘ్రాతమహోగ్రు భీముఁ జెనకం దలపోయుట నీకు నెమ్మెయిన్. 176

మ. చలజిహ్వాగ్రవిలీఢవిస్ఫురితదంష్ట్రాభీషణం బైనబె
బ్బులిఁ గోలం గొని వ్రేసి త్రోసి తొలఁగం బో వచ్చినన్ వచ్చుఁ గా
క లసత్క్రూరశరాగ్నిదుస్సహుని నగ్గాండీవి నల్గించి యె
వ్వలనన్ మానధనాఢ్యు లై బ్రతికి పోవన్ వచ్చునే యేరికిన్. 177

ఉ. బోరన విస్ఫులింగములు వాడ్మఁగ నుగ్రవిషంబు గ్రక్కుచుం
గ్రూరవిచేష్ట నాలుకలు గ్రోయుమహోరగరాజయుగ్మముం
జేరి పదాహతిం గినియఁ జేయఁ దలంచుట గా నెఱుంగు దు
ర్వారులు మాద్రిపుత్త్రుల కవజ్ఞ యొనర్పఁ దలంచు టేర్పడన్. 178

ఉ. [illegible] నమరాసురకోటికి నైనదుర్జయుల్
వాలినవీరు [illegible] వారికి నెగ్గొనరించి పోయి పా
తాళము సొచ్చి డాఁగినను దప్పదు మృత్యువు నీకు నక్కటా
కాలము నిండె నీవశము గాదు విధాతృనిచెయ్యి త్రోవఁగాన్. 179

తేలును గర్కటియును దెగు, కాలమునకుఁ జూలు దాల్చుగతిఁ బార్థుల యి

1. క. అ. సంభగ్నపరా. 2. క. బోక. 3. అ. నాఁచికొన.

ల్లాల నయిననా దెస దుశ్శీలుఁడ వై తిది వినాశచిహ్నము గాదే. 180

వ. అనిన జయద్రథుండు నవ్వుచు నవ్వెలందికి ట్లనియె. 181

ఉ. వారిజనేత్ర పాండుసుతవర్గము [1]నేఁడుగ మాకు వింతయే
భీరులఁబోలె నేల వెఱపించెదు మాటల మమ్ము వింటె సా
వీరకులప్రసూతులము వీకుల మే మితరక్షితీశసా
ధారణబుద్ధి సేయకు [2]ముదాత్తచరిత్రుల మైనమా దెసన్. 182

వ. వలవనిమాటలఁ [3]దేర్చినం దీరదు వేగంబ యుల్లకనకరథం బొండె నుల్లమహా
గజంబు నొండె నెక్కుము బీరంపుమాట లాడక ప్రియవచనంబుల నస్మత్ప్రి
సాదభాజనంబ వగు మనిన విని యాజ్ఞసేని వాని కిట్లనియె. 183

ఆ. వీరపత్ని నయ్యు వీరసహోదరి, నయ్యు నీకుఁ జూడ ననద వోలె
నున్నదాన నెట్లు లున్నను నాకు నీ, దెలుప నేల పలుకు తియ్య మేల. 184

చ. అతులితవృష్ణికేకయబలావళితోఁ బటుశంఖఘోషభీ
షితభువనత్రయుం డగుచు శీఘ్రతురంగరథాధిరూఢుఁ డై
జితదనుజాన్వయుండు యదుసింహుఁడు వెన్నడి ముట్టి నీ బరి
క్షతబలుఁ జేయ నాకు దెస గల్గు నెఱింగెదు గాక యత్తఱిన్. 185

సీ. గాండీవరేఖ యాఖండలుచాపంబు, కరణి గాఁ దద్గుణక్వణము ఘోర
గర్జగా నవిరళగంభీరవీరర, సాపూర్ణమై సంతతతావలి ప్ర
శత్రుప్రతాపోష్మసమయంబు శమితంబు, గా మిత్రబర్హికేకారవంబు
లెసఁగంగఁ దోఁతెంచి యింద్రనందనమహా, జలధరం బాయతసాయకోరు

ఆ. వృష్టి ముంచుటయును వెగడొంది చేష్టింప, నలవి గాక నిల్చి యప్పు డైన
నాత్మదోషవృత్తికై మనంబున వగ, చెదవు గాక యిపుడు సెప్ప నేల. 186

ఉ. ఘోరగదాభిదారణవిఘూర్ణితశాత్రవకుంభికుంభకుం
భీరచిరోరుమౌక్తికగభీరతరారుణసాగరాంబుకే
లీరసలోలుఁ డై సమదలీల బకాంతకుఁ డేఁగుదేరఁ గ
న్నారఁగఁ జూచి [4]కాక యిటు లంతకు నీమదిత్రుళ్లడంగునే. 187

క. ననుఁ జెఱవనితలచందం, బున నవమానింప నీకుఁ బోలదు మత్పా
వనపాతివ్రత్యమహిమ, ననిశము నేకీడు నెందు నందదు నన్నున్. 188

---

1. అ. నేఁ డిట. 2. అ. ముదారచరి. 3. క. నేర్చినం. 4. గ. [illegible]
ఒకానొకప్రతియందు 187-188 వ పద్యములకు నడుమ
చ. 'ఘనతరచాపదండభవకాండమహానిలధారచేఁ జమూ
ఘననికురుంబ మంతయును గంపము చేయుచు వేగ మాద్రినం
దను లిట వచ్చునంతట మదంబును శౌర్యము మాని యాత్మలో
నను గణియింపు కార్యమును నా దగునిర్మలవాక్యపద్ధతుల్.' అను పద్యము కన్పట్టెడి.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

వ. అని పలికి ద్రౌపది యద్దురాత్ముండు దన్నుఁ బట్ట సమకట్టుక న్నెఱింగి తమపురోహితు ధౌమ్యునిం జీర్కొని యాక్రోశించిన నతం డతిరయంబునఁ జనుదెంచు నాలోన. 189

సైంధవుఁడు ద్రౌపదిని బలాత్కారముగా నెత్తికొని పోవుట.

ఉ. పాపవినిశ్చయుండు సతిపయ్యెదకొంగు గడంగి పట్టినం
గోపముతోఁ [1]నుదల్చికొని కోమలి యూర్చె వెస వాని ద్రోయుడుం
బోపడి వాఁడు చిత్రముగ భూమితలంబునఁ ద్రెళ్లె మారుత
క్షేపవిభగ్నమూల మయి చెచ్చెరఁ ద్రెళ్లుమహీరుహంబనన్. 190

వ. ఇట్లు నేలం బడి తడయక యెగసి జయద్రథుండు మగువం దిగిచి రథంబుపై నిడికొని సపరివారుం డయి యరుగం దొడంగె నప్పు డప్పొలఁతి పురోహితునకు మ్రొక్కిన నమ్మహాత్ముండు సైంధవుం జీర్కొని యి ట్లనియె. 191

మ. తగునే రాజకులప్రసూతులకు నత్యంతంబు నేతాదృశం
బగుదుష్కర్మము నాదుపల్కు విను మీయజ్ఞాక్షి పుణ్యాత్మ యి
మ్మగువన్ వే విడు పాండునందనులు నీమానంబుఁ బ్రాణంబు నే
పగిదిం గొందురు గాని పో విడువ రీపాపంబు నిం ద్రెక్కొనున్. 192

వ. అని యాక్రోశించుచు నమ్మహీసురవరుండు వానిపిఱుందన చనియె నిట పాండవులు నవ్వనంబున ననేకమృగంబుల వధియించి యందఱు నొక్కయెడం గూడంబడి యాశ్రమాభిముఖు లై వచ్చునెడఁ దమ్ములం జూచి ధర్మజుం డి ట్లనియె.

సీ. ఇనుఁ డున్నదెసనుండి [2]యెలుఁగింపఁదొడఁగెఁ బక్షులు మృగంబులు నతిఘోరరు
మగిడెడు నిప్పుడు మనకు [3]దాపలిదెస, నతిభీషణాకృతి నఱచె వఱడు [తుల
పగఱచే నవమానపాటును గయ్యంబుఁ, గలుగు నీశకునప్రకార మరయఁ
[4]గడుకొని చెయివెట్టి కలఁచిన ట్లయ్యెడుఁ, జిత్తంబుఁ దనువు నిశ్చేష్ట మయ్యె
ఆ. నరుగుదెండు వేగ యాశ్రమంబునఁ గృష్ణ, నునిచి వచ్చినార మొంటి యకట
తలఁపఁ గ్రూరమతులు ధార్తరాష్ట్రులు గడు, నెగ్గు సేయఁ జూతు రెడరు వేచి.

ఆ. కమలహీన మైనకమలాకరము వోలె, రాజహీన మగుపురంబు వోలెఁ
జూడఁ గామ్యకంబు శూన్యమై యున్నట్లు, దోఁచె నేమికీడు దొడరునొక్కొ.

వ. అనియె ని ట్లయ్యేవురు నరదంబులు సత్వరంబుగాఁ దోలుకొని యాశ్రమంబునకు వచ్చునెడఁ బాంచాలిపరిచారిక ధాత్రేయిక యనునది యతికరుణంబుగా నేడ్చుచున్నం గని ధర్మతనయుసారథి యైనయింద్రసేనుండు రథంబు డిగ్గ నుఱికి చని యిది యేల నేలం బడి పొరలుచు నేడ్చెదవు నీ కపకారంబు సేసినవా రెవ్వ రనిన

1. 'ఉదల్చు' అని యొకధాతువు. 'ఉదలుముచుం బడుచు లేచుచు. విరా. ౨. ౩౮౦. 2. జ. యెలిఁగింపఁ దొడఁగెఁ. 3. క. దాపటిదెస. 4. అ. గడుపులోఁ జెయి'.

నది వానిం జూచి సైంధవుచేతం బాంచాలి చెఱపోయె నని పలుకుచుఁ
బె ల్లేడ్చిన నింద్రసేనుం డి ట్లనియె. 196

సీ. పాండుపుత్త్రులబహిఃప్రాణంబు నుత్తమ, శీలసమగ్రఁ బాంచాలతనయఁ
గొనిపోవునంతటికగుండె గల్గెనె విమోహాంధమానసుఁ డైన సైంధవునకు
నేఁగుఁ గా కేమి మహీతలగతుఁ డైన, గగనంబునకు వేగ యెగసి చనినఁ
బో నిచ్చెదరె [1]పారివుత్తురు గాక యు, ద్ధురవృత్తిఁ బార్థులా దురితచరితు

ఆ. వీరవరులఘోరవివిధాస్త్రకౌశలం, బెఱుఁగఁ డయ్యెఁ గాక యేమి వాఁడు
వగవ కుండు మబల వైరి నుగ్రతఁ దున్మి, మగువఁ దెత్తు రిపుడ మనుజవిభులు.

వ. అనిన నయ్యంగన యపాంగతరంగితంబు లగుబాష్పజలంబు లల్లన కరపల్లవ
ప్రమార్జనంబుల నపనయించుచు నతనిం గనుంగొని యి ట్లనియె. 198

ఆ. ఇంద్రకల్పు లైన యేవురునృపతుల, నాత్మ[2]లోన నుఱక యంబుజాక్షి
నపహరించినపుడ యద్దురాత్మునకును, జేటు మూఁడె వేఱ చెప్ప నేల. 199

ఉ. ఇంతకు మున్న వాఁడు సని యెంగడు దవ్వగఁ బోవ కుండ న
త్యంతరయంబునం బటురథావలి యొప్పఁగ నేఁగుఁ డుగ్రులై
సంతనకట్టుఁ డస్త్రములు శస్త్రములుం దొడుఁగుండు వర్మముల్
సంతతదివ్యబాణముల శాత్రవుఁ దున్మఁడు దెండు నెచ్చెలిన్. 200

సీ. బూదిలోఁ దొరఁగినపూర్ణాహుతియుఁబోలెఁ, గుక్కతోల్తిత్తిలోఁ గూరినట్టి
రాజితఃపిలగోరసధారయునుబోలె, మసనంబులోఁ బడ్డమహితపుష్ప
మాలికయునుబోలె మదిరాక్షి దుర్జను, కతమున దూషిత గాక మున్న
చనరయ్య వేగంబ చనునె సన్మంత్రవి, శ్రుతపురోడాశంబు శునకమునకుఁ

తే. జనునె కమలసుగంధికాసారకేళి, కలుషశవఖాది యైనసృగాలమునకుఁ
జనునె తన్వంగి సౌందర్యచతురభావ, భంగి యాదుష్టచరితునిపాలు వడఁగ.

పాండవు లేవురు సైంధవుపై యుద్ధమునకుఁ బోవుట.

వ. అని పలుకుచున్న ధాత్త్రేయికపలుకులు విని దాని నాశ్వాసించి యక్కురువీరు
లేవురు నాక్షణంబ సన్నద్ధు లై క్రోధావేశంబునం జేసి మహోరగంబులుంబోలె
రోఁజుచు జయద్రథు వెన్నడి దాడి వెట్టి కూడ ముట్టి తత్సైన్యంబుపిఱుంద నా
క్రోశవచనవిహ్వలుం డై పోవుచున్న ధౌమ్యుం గని నమస్కరించి మీ రింక విగత
ఖేదుల రై యొయ్యన రం డని యామిషంబునకుం గవియుడేగలుంబోలె సైంధవ
సేనపయిం గవిసి సింహనాదంబులు సేసి రప్పుడు పాండుపుత్త్రులరథంబు లడియా
లంబులు సూచి సైంధవుండు ద్రౌపది కి ట్లనియె. 202

క. ఈవచ్చురథంబులవా, రేవురు నీమగలె యంబుజేక్షణ వీరిఁ
భావించి యెవ్వఁ డెవ్వం, డేవిధమునవాఁడు సెపుమ యెఱుఁగఁగ వలయున్.

---

1. అ. పోరఁ బొరివుచ్చెదరు గాక, దుస్సహతేజు లాదురిత 2. జ. వోలెఁ దలఁపఁ గంబుజాక్షి.

వ. అనిన నప్పాంచాలి యనాదరక్రోధఘూర్ణిత యగుచు నతని కి ట్లనియె. 204

ఆ. ఇంక వీరి నెఱుఁగి తేనియు నెఱుఁగక, యుండితేనిఁ జేయు నొండు గలదె
దుర్మదమునఁ గరము దుశ్చరిత్రమునకుఁ, జొచ్చి నీకుఁ జేటు దెచ్చికొంటి. 205

వ. అయినను నన్నడిగితివి గావునం జెప్పెద నింతియకాని నీవలన నాకు భయమించుకంతయుఁ గలుగదు సోదరసహితుం డైనధర్మనందనుం గంటి నింకఁ గుశలంబ యని పలికి యి ట్లనియె. 206

మ. తనువృత్తాంగుఁడు శుద్ధకాంచనసముద్యద్వర్ణుఁ డత్యుల్లస
ద్వనజాతాయతచారులోచనుఁడు దీవ్యద్భూరితేజోఘనుం
డనఘుం [1]డుల్లరథంబుపై వెలుఁగుపుణ్యాత్ముండు ధర్మాత్మజుం
డనిరోధప్రతిభాప్రభావనిధి యత్యాశ్చర్యశౌర్యుం డనిన్. 207

చ. కురుకులశేఖరుం డతఁడు ఘోరరణంబుల నెట్టిశత్రులుఁ
శర ణని [2]వచ్చి రేని విలసత్కరుణామతిఁ గాచు నీవు చె
చ్చెరఁ జెడి పోక నాపనుపు సేసి వినీతి యెలర్ప నమ్మహా
పురుషుని నాశ్రయింపుము విభుండును నీ దగుతప్పు లోఁగొనున్. 208

చ. ఘనజవసత్త్వచారుతురగంబులఁ బూనినయుల్లవిస్ఫుర
త్కనకరథంబుపై నుదితకాయుఁడు సాలమహీరుహంబుచా
డ్పునఁ దనరారుచుఁ బెరయుభ్రూకుటియుఁ దశనోష్ఠపీడనం
బును నయి యున్నవాఁ డనిలపుత్త్రుఁడు భీముఁడు భీముఁ డాజులన్. 209

ఉ. ఈతనిపౌరుషం బరయ నెందు నమానుషకృత్య మప్రతీ
ఘాత మనేక మద్భుతము గర్వితులౌ ధరణీశ్వరుల్ నిజం
బీతని నాజిలోఁ జెనయ నెవ్వరు నోడుదు రమ్మహాభుజుం
డాతతరోషుఁ డైనఁ బ్రళయానలునట్టిఁడ యాజిఁ డేమిటన్. 210

ఉ. ధర్మజుకూర్మితమ్ముఁడును దత్ప్రియశిష్యుఁడు నైనవాఁడు స
త్కర్ముఁడు వాఁడె చూడుము ప్రగాఢవితీర్ణి జితేంద్రియుండు దు
ష్కర్ములఁ గన్న సైఁపఁడు నికామభయంకరవిక్రమక్రియా
నిర్మథితారి ఫల్గునుఁడు నిర్మలతేజుఁ డజేయుఁ డేరికిన్. 211

క. అవశగతిఁ గామరోషా, దివికారము లొందినను మదిని ధర్మపథ
ప్రవిహతి గానీఁ డతఁ డా, దివిజేంద్రతనూజుఁ డద్వితీయుఁడు పేర్మిన్. 212

చ. అయనయసంగ్రహుండు [3]వినయాధ్యవసాయి భయార్తలోకసం
శ్రయుఁడు గృతాస్త్రుఁ డాహవవిశారదశౌర్యుఁడు శిష్టబాంధవ
ప్రియుఁ డసమానసుందరగభీరశుభాకృతి యుల్లపుణ్యుఁ డా

1. 'డుల్ల' అని ప్రాఁతప్రతులు. 2. క. చొచ్చిరేని. 3. జ. వినయవ్యవసాయి.

రయ నకులుండు పాండుసుత । రత్నము భాసురకీర్తి యిమ్మహిన్. 213

ఉ. వీరుఁడు చిత్రయోధి దృఢ । వేధి కృతాస్త్రుఁడు భూరిబుద్ధివి
స్తారుఁడు వాగ్విశారదుఁడు । పార్థులకూరిమితమ్ముఁ డుజ్జ్వలా
కారుఁడు ధర్మదత్తుఁ డవి । కారుఁడు ప్రౌఢపతంగతేజుఁ డ
ద్ధీరుఁడు పాండవుండు సహ । దేవుఁడు దేవనిభుండు పెంపునన్. 214

తే. కొడుకులందెల్లఁ గడుఁగూర్చు । గొంతియితని, కిమ్మహాత్ముఁడుమహిఁ జలి । యించెనేని
నగ్ని చల్లన యయ్యెనే । నాత్మఁ దాను, ధర్మనిష్ఠుఁ డై సత్యంబు । దప్పఁ డెపుడు.

వ. వీ రేవురు నత్యంతదుర్వారులు వీరిఁ బారింబడిన వారాశినడుమ[1]నుగ్రమకరాహతం
బై యవియుపేరోడయుంబోలె నీసైన్యంబు వికలం బగు నీవునుం బ్రాణం బొండె
మానం బొండెఁ గోల్పోక మెయిమెయిం బో నేర్చెదవే యనియె నప్పుడు కౌం
తేయులు సైంధవసేనం దలపడి దిఙ్ముఖంబుల నెల్లం జీఁకట్లు గవియునట్లుగా బాణ
పటలంబులు పఱఁగింపం దొడంగిన. 216

క. తొలఁగకుఁడు పొదువుఁ డేయుఁడు, నిలువుఁడువడిఁ బొదువుఁడనుచు । నిజయోధజనం
బులఁ బురికొల్పుచు సైంధవుఁ, డలఘుపరాక్రముఁడు నిలిచె । నాహవభూమిన్.

వ. ఇట్లు త్రిగర్తశిబిసింధుసౌవీరసైన్యంబులతో ననేకనరపతిపరివృతుం డై నిలిచిన
జయద్రథుం జూచి భీమసేనుండు క్రోధారుణలోచనుం డై రథంబు డిగ్గి హేమబం
ధబంధురంబును నయోమయంబును నగుగదాదండంబు ద్రిప్పుచు వానిపయిం
గవిసిన నడ్డపడి కోటికాస్యుండు నిజసైన్యసంఘంబుతో నమ్మహావీరుం బొదు
వుటయు నతండు. 218

క. మదగజముల రథయోధులఁ, బదాతులను దురగములను । బలువిడిఁ గలయం
జదుపుచు దుర్వారగతిన్, విదితబలుఁడు ఘనగదాప్రవీణత మెఱసెన్. 219

వ. ఇట్లు విహరించి యహితసైన్యంబు నిహతం బగుటయుఁ జెలంగి సింహనాదంబు
సేసి యతండు సారథిసముపనీతం బైనరథంబు సాదరంబుగా నెక్కి గృహీతశరా
సనుం డై విక్రమించె మఱియును. 220

క. అలిగి యుధిష్ఠిరుఁడును న, గ్గలికం బ్రతివీరు లడరఁ । గార్ముకవిద్యా
విలసనము మిగుల సౌవీ, రుల నూర్వుర నధికబలుల । రూపడఁగించెన్. 221

క. నకులుఁడు నిశాతసాయక, నికరంబుల సమరధారు । ణీతల మెల్లం
బ్రకటపరవీరవరమ, స్తకదంతురముగ నొనర్చె । దారుణభంగిన్. 222

క. నారాచపాతముల దు, ర్వారుఁడు సహదేవుఁ డాహ । వముఖంబున న
శ్వారోహకులం గూల్చుచు, వీరవిహారంబు సలిపె । వేడ్క మెఱవన్. 223

ఆ. సింధురాజసైన్య । సింధుపూరమునందు, మహితఫల్గునాఖ్య । మంథనగము
దిరిగి కలఁపఁ దొడఁగెఁ । బరనృపాలకమహా, జలచరవ్రజంబు । సంచలింప. 224

---

1. క. మహానిలధారాహతి నవయు.

సీ. వారణకోటి దక§దారోహకులతోన, వివశ మై యొఱలుచు § నవనిఁ ద్రెళ్లె
సూతహయధ్వజ§పాతపూర్వకముగ, రథములు దుమురయ్యె § రథులతోన
వెసరాహుతులతోన§వసమఱి హయములు, గడసి యెయ్యెడలను§బుడమిఁ గప్పె
దండడి దెరలుచు § సందడి పెల్లుగాఁ, గాలుబలంబులు § గూలెఁ గలయఁ

ఆ. దుముల మధిక మయ్యె § సమరతలంబున, ఘోరరుధిరవారి§పూర మెసఁగె
జితవిరోధిబలుఁడు § శతమఖసూనుండు, చాపనైపుణంబు § సూపునపుడు. 225

తే. సవ్యకరమునందును నప§సవ్యకరము, నందుఁ బర్యాయసంగత§నగుచుఁ జూడఁ
గొఱవి ద్రిప్పినయొప్పున§మెఱసెఁ బార్థు, గాండివము వాలుఁదూపుల§గనియనంగ.

వ. అట్టియెడం ద్రిగర్తపతి యైనసుధన్వుండు గదాహస్తుండై రథంబు డిగ్గి చని ధర్మతనయురథ్యంబులఁ గూల నేసిన నతండు నిశితసాయకంబున వానియురంబు వ్రచ్చి విగతజీవుం గావించి సత్వరంబుగాఁ జని సహదేవునరదం బెక్కె మఱియును ద్రిగర్తులలోన మహాముఖ క్షేమంకరు లనువారు నకులుం బొదివి ఘనశరాసారంబు గురిసి జలధరంబులుంబోలె గర్జిల్లిన నమ్మాద్రిసూనుండు వారి నిద్దఱఁ జెక్కుమ్మూల నొప్పించె నంతఁ దదీయాగ్రజుం డగుసురథుండు. 227

చ. కరినికరంబుతోఁ గడఁగి § గర్వితుఁడై తనవారణేంద్రు న
క్కురుకులవీరుమీఁద [1]వెసఁ § గొల్పినఁ దద్రథఘోటకంబులం
బరుపతఁ జంపె నగ్గజము § పాయక వాఁ డసిచర్మహస్తుఁడై
ధరణికి దాఁటుచో నది మ§దంబున వెండియుఁ బైఁ గడంగినన్. 228

చ. తొలఁగక యమ్మహాబలుఁడు § దోర్బల మొప్పఁ గృపాణపాతభం
గులఁ గరినాథుకేలు [2]నిడు§గొమ్ములతోఁ బెరయంగఁ ద్రుంప బె
ట్టిలకు విచేష్టమై నొఱగు§నేనుఁగుపై నతిమాత్రభీతివి
హ్వలుఁ డగుశత్రు నుద్ధతిఁ గృ§తాంతవిధేయునిఁ జేసె వ్రేల్మిడిన్. 229

క. వైరులు దలఁకఁగ నిమ్మై, దారుణపౌరుషవిశేష§దక్షుం డై య
వ్వీరుఁడు రయమున నరిగి న, మీరతనయునరద మెక్కె § మెఱసెం బోరన్.

చ. ఘనుఁడు వృకోదరుండు దనుఁ § గట్టలుకం దలపడ్డఁ గోటికా
స్యునితురగంబులం దునిమి § సూతునికంఠముఁ ద్రుంచి వైచి తీ
వ్రనిశిత మైనప్రాసమున § వానియురంబుఁ బగిల్చి చంపినం
గనుకనిఁ బాఱె భీతి యెసఁ§గంగఁ దదీయచమూసమూహముల్. 231

అర్జునుఁడు సౌవీరకుమారులం బన్నిద్దఱఁ జంపుట.

వ. అంత నంగారకుండును గుంజరుండును సృంజయుండును సుప్తకుండును శత్రుంజయుండును సుప్రబుద్ధుండును శుభంకరుండును భ్రమంకరుండును శూరుండును

1. అ. వెసఁగొల్పిన. 2. క. నిడుఁగొమ్ములతో. 3. అ. నిహతి యైన.

రథియును గుహకుండును బలాఢ్యుండును ననుసౌవీరకుమారులు పన్నిరువురు నిక్ష్వాకుశిబిసైంధవత్రిగర్తసైన్యంబులం గూడి క్రీడి నార్కొని పటుబాణ జాలంబులం గప్పిన. 232

మ. అతులక్రోధవిఘూర్ణమానహృదయుం డై చండగాండీవని
ర్గతభల్లౌఘములం దదస్త్రవితతుల్ ఖండించి సౌవీరసం
తతిం బన్నిద్దఱివిండ్లులం దునిమి దోర్దర్పంబు మీఱంగ స
స్మితుం డై యాతండు దచ్ఛిరఃప్రకరవిచ్ఛేదంబు సేసె న్వెసన్. 233

క. ఆకులముగ శైబ్యుల ని, క్ష్వాకుల సైంధవులనుం ద్రిగర్తులనుం బో
నీక పొదివి రయమున న, స్తోకపరాక్రముఁడు దునిమి తూఁటాడె వడిన్. 234

వ. అప్పుడు రణభూమి యంతయు శవమయంబయ్యె నంబరంబంతయుం గబంధమయం బయ్యెఁ జారుకేయూరవీరాంకవిభూషితంబులయిన బాహుచరణచ్ఛేదంబులును గార్ముకతూణీరకాండఖండంబులును నక్షకూబరరథాంగకేతనత్రివేణుకశకలంబులును బుండరీకవ్యజనచామరభంగంబులుం గరవాలపరిఘశక్తిగదాముసలపట్టిసప్రాసలేశంబులు నెక్కడఁజూచిన రాసులై యుండెఁ గీలాలపూరంబును మాంసపంకంబును గేశశైవాలంబును నై నయపూర్వనదీప్రవాహంబునందు బహువిధ (భూతబేతాళాది) క్రవ్యాదగణంబు లవగాహంబు సేయుచుఁ బ్రకటకోలాహలవ్యాకులం బగుచుండె నివ్విధంబున. 235

క. గాండీవపవనప్రేరిత, చండాంబకఘోరశిఖల శతముఖతనయో
ద్దండదహనుఁ డొకమాత్రన, ఖండితసౌవీరసైన్యకానన మేర్చెన్. 236

వ. అట్టిక్రందున జయద్రథుండు ద్రౌపదిని దిగ విడిచి రథంబు దోలుకొని పఱచె నంత ధర్మజుండు ధౌమ్యసమన్విత యై యున్నపాంచాలిం గని నిజరథంబుపై నిడికొనియె సైంధవుపలాయనం బెఱింగి యర్జునుండు శత్రుసేనాహననసంరంభంబున నున్నభీమసేనున కిట్లనియె. 237

తే. పీతలజ్జుఁ డై పఱచె సౌవీరవిభుఁడు, పోనఁగు ప్రజనేల యాఱడిఁ దునిమి వైవ
నద్దురాత్ముని వెనుకొని యసువులిపుడు, గొనఁగవలయు లేలెమ్ము సర్వనుతశౌర్య.

వ. అనిన నతండు గయ్యంబు సాలించి ధర్మతనయుం జూచి. 239

క. జననాథ ద్రుపదసుతఁ దో, డ్కొని ధౌమ్యుఁడు నీవుఁ గవలు గుఱుకొని మగుడం
జనుఁ డాశ్రమంబునకు నే, మును సైంధవు వెనుకఁ గూడకముట్టెదము వెసన్.

క. అతలంబునఁ గ్రుంగిన న,ద్భుతముగ దివమునకు నెగసి పోయినఁ బగతుం
హతుఁ జేయక మగుడము విని, హతుఁడుగఁ జేయుదుము దివిజు లడ్డం బైనన్.

తే. అనిన ధర్మజుఁ డిట్లను నద్దురాత్ముఁ, బొలియఁ జేయుట దగదు దుస్సలఁ దలంచి
వాని నొకతప్పునకు సైఁపవలదె యాంబి, కేయమహిమ కినుకవసేయఁ జనునె.

వ. అనినం బాంచాలి భీమార్జునులతోడ నప్పాపాత్ముని దెసం గృపసేయవలవ దవశ్యం

బును వాని వధియించి నాకుఁ బ్రియంబు గావించునది యట్టిద్రోహి యెల్ల భంగుల వధ్యుం డనియెఁ దదనంతరంబ ధర్మనందనుండు ధౌమ్యద్రౌపదీనకులసహదేవసహితుండై మగిడి యాశ్రమంబునకుం జనియె నిట భీమవిజయులు రథంబులు రయంబునం దోలుకొని చని క్రోశమాత్రాంతరంబున సైంధవుం గని రప్పుడు కిరీటి దూరాపాతవిశిఖంబుల జయద్రథురథ్యంబులం బడ నేసిన.

క. తల్లడపడి యరదము డిగి, విల్లును నమ్ములును విడిచి వెల్ల నగుచు మే
నెల్లఁ జెమర్పఁగ నూర్పులు, పెల్లుగ నమ్మనుజపశువు పెలుచం బఱచెన్. 244

ఆ. వానిఁ జూచి నగుచు వారలోర్వరి యిం, కెందుఁ బోవ వచ్చుఁ బంద నిలువు
మిట్టికడిమి నమ్మికయే ప్రల్లదంబులు, సేయఁదొడఁగి తనుచు డాయుటయును.

వ. మరలి చూచి వాఁ డొక్కగుల్మమధ్యంబుఁ దూఱుటయుఁ గని భీమసేనుండు రోషసందష్టాధరుం డగుచు రథంబు డిగ్గ నుఱికి. 246

క. ఒడిసి తల వట్టి నేలం, బడఁ దిగిచిన వాఁడు పెనఁగఁ బడుటయుఁ జిక్క
మెడఁ ద్రొక్కి గాఢముష్టిం, బొడిచె మొగం[1]బవియ రక్తపూరము దొరుఁగన్.

క. ఒడ లెల్లఁ [2]బిండికూడుగఁ, బొడిచి యెగయ నెత్తి త్రిప్పి భూస్థలి మఱియుం
బడ వైచి యురము మొగమును, నడిచెను వడముడి తలప్రహారకుశలుఁ డై.

వ. ఇట్లు [3]బెట్టు చఱచినఁ బగతుండు వివశుం డగుటయుం జూచి యర్జునుం డోహో యింత సాలు నింక నొచ్చినం బ్రాణవిముక్తుఁ డగుం గావున నజాతశత్రువచనంబులు దలంచి వీనిఁ గరుణింపు మనిన నతండు గవ్వడి దెసఁ గనుంగొని ధర్మనందనుం డెప్పుడుఁ గరుణయ కాని కార్యంబు చేటుపాటు విచారింపఁ జొరండు నీవును నతని భంగిన చేల వై తిద్దురాత్ము నెట్లు సైఁప వచ్చు నని పలికె ననంతరంబ. 249

భీముఁడు సైంధవుం బట్టికొని పరిభవించుట.

ఆ. వాఁడి వైన కత్తివాతి యమ్మునఁ గొని, పగతుశిరము చెక్క లెగయ గొఱిగి
నరుల కెల్లఁ జూడ నవ్వగునట్లుగాఁ, గలయ నైదుగూఁకటుల నొనర్చె. 250

వ. ఇట్లు రాజవేషంబు వికల్పితంబు సేసి యమ్మహాభుజుండు వాని కిట్లను నోరీ బ్రదుక వలతేని నేఁడు మొదలుగా నెల్లసభలయందును పాండవదాసుండ నని పలుకునది యనిన వాఁడును దండాఘాతభయంబున నట్ల చేయుదు ననియె నంత నయ్యిరువురు నతనిం బెడకేలు గట్టి రథంబుపై నిడికొని నిజాశ్రమంబునకుం జని ధర్మపుత్త్రునకు నివేదించి వీఁడె పాండవదాసుం డనిన నతం డట్లేని (వధ్యుండు గాఁడు) విడువుం డనియెఁ బాంచాలియు జయద్రథుం జూచి నవ్వుచు నిప్పాపాత్ముండు భవదీయదాసుం డయ్యెం గావున వీనిం బో విడువుం డని విడిపించె నా సైంధవుండును ధర్మజునకుఁ దత్సభాగతులైన మునులకు మ్రొక్కిన నజాతశత్రుం డిట్లనియె. 251

1. అ. బవిసి. 2. అ. బిండికూరగ. 3. ఇ. బె ట్టడిచిన.

ఆ. ఎట్టికష్టుఁ డైన నిట్టిపాపము సేయ, నెత్తికొనునె ధరణి నీవు దక్క
నరుగు మింక నేమి యందుము నిన్ను నిం,ద్రియవిలోలు నల్పు ధృతివిహీను.

వ. ఇంక [1]నాదానికి నిట్టికొఱగాములు సేయక బుద్ధిమంతుండ వై యుండు మనిన న
తండు లజ్జావనతవదనుం డగుచు నచ్చోటు వాసి గంగాద్వారంబున కరిగి యందు.

శా. ఆదిత్యార్చితపాదపద్ము జగదేకాధీశు నీశాను లో
కాదిం గామవిభేదిఁ బర్వతసుతాహ్లాదైకసంపాది ని
ఖేదుం డై శివు నాత్మలో నిలిపి యక్షీణవ్రతారూఢతం
బాదాంగుష్ఠమునందు నిల్చి తప మొప్పం జేసె సద్భక్తితోన్. 254

ఉ. వానికి నమ్మహేశ్వరుఁడు వత్సలుఁ డై పొడసూపి యీప్సితం
బైనది వేఁడు మన్న నతఁ డానతుఁ డై పరమేశ విక్రమా
హీనులఁ బాండునందనుల నేవుర సైన్యయుతంబుగా ననిం
బూని జయించునట్టివరమున్ గృప సేయుము నాకు నావుడున్. 255

క. ఇది వొసఁగదు పాండవులం, గదనమున జయింప నలవి గా దింద్రాది
త్రిదశులకు వినవె యైనను, వదలక నీకోర్కి దీర్ప వలయున యెట్లున్. 256

చ. విజయుఁ డొకండు దక్క నతివీరులఁ బార్థుల నున్ననల్వురన్
నిజ మొకనాఁటికయ్యమున నీవు జయింపుము ఫల్గునుండు స
ర్వజగదజయ్యవిక్రముఁడు వాని నెదుర్కొని నాకు నైనఁ బో
ర జితునిఁ జేయు టెంతయు భరం బగు నిక్కము వల్కితిం జుమీ. 257

వ. అస్మత్ప్రసాదవిశేషంబునం జేసి వాని కిట్టిప్రభావంబు గలిగె నదియునుం గాక.

క. నిఖిలాస్త్రశస్త్రవిద్యా, సఖుఁ డపరాజితయశోవిశాలుఁడు విష్ణుం
డఖిలేశ్వరుఁ డతనికిఁ బ్రియ,సఖుఁ డటె యవ్వీరు గెల్వ శక్యమె నీకున్. 259

వ. అని పలికి యీశ్వరుం డంతర్హితుం డయ్యె సింధుపతియు నిజదేశంబునకుం
జనియె ననిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 260

తే. ధర్మపత్నీసమేతు లై ద్వైతవనము, నం దపారదుఃఖాతురు లగుచు నున్న
రాజముఖ్యులు సత్యైకరతులు పాండు, సుతులు మఱి యేమి సేసిరి సూతవర్య.

వ. అనిన నతం డి ట్లనియె నట్లు ద్రౌపదీమోక్షణం బొనరించినపిదపం గామ్యక
వననివాసుం డై భూసురనివహంబుతో నున్నధర్మజుపాలికి మార్కండేయుం డరుగు
దెంచిన ననుజసహితంబుగాఁ బ్రత్యుద్గతుం డై యమ్మునివరుం బ్రభూతసపర్యల
సంతుష్టహృదయుం గావించి యవ్విభుండు పాంచాలియెడ జయద్రథుచేసిన
దుర్వ్యవసాయంబును వానిం బరిభవించుటకు నై తమపడినయాయాసంబును
నమ్మహాత్మున కెఱింగించి మహనీయశౌర్యధైర్యధర్మారంభసమగ్రుల మైనమా
కివ్విధంబున నఖిలసామ్రాజ్యభోగవియోగం బై దుస్తరం బగువనవాసంబు సం

1. అ. నైనను నిట్టికోడములు.

ప్రాప్తం బయ్యెం గావున విధికృతం బెవ్వనికి నెబ్బంగుల నలంఘ్యం బని తలంచెద
నని పలికి మఱియు ని ట్లనియె. 262

తే. ద్రుపదనందనక్రియఁ గడుదుఃఖపడిన, నృపవధూటియు నాయట్లఁ నియతశోక
వనధినిర్మగ్నుఁ డైనభూవరసుతుండుఁ, గలఁడె వినఁ జూడ ననఘ యేకాలమునను.

వ. అనిన నతనికి న త్తపోనిధి యి ట్లనియె. 264

క. కడు దుఃఖము నొందితి నని, యుడుగక యిటు వగచె దేలఁ యుర్వీశ్వర నీ
పడు[1]టెంత ది రఘురాముఁడు, గడఁగి యిడుమువడఁడె తొల్లి కాఱడవులలోన్.

ఉ. ఆవిభుకాంత గాదె జనకాత్మజ రావణుచే గృహీత యై
పోవదె వానరప్రకరముల్ వెసఁ దోడుగ నేఁగి యాధరి
త్రీవిభుఁ డబ్ధి గట్టఁడె వధింపఁడె దివ్యశరంబులన్ దశ
గ్రీవునిఁ గ్రమ్మఱం జని యకిల్బిషరాజ్యవిభూతి నొందఁడే. 266

ధర్మజునకు మార్కండేయుఁడు రామాయణకథ సెప్పుట.

వ. అనిన విని ధర్మజుండు మునీంద్రా రాముం డెవ్వనివంశంబునవాఁడు రావణుం
డెవ్వనితనయుం డేమినిమిత్తంబున సీతాపహరణంబు సేసె రామరావణులకు
సంగ్రామం బెట్లు వర్తిల్లెం జెప్పవే యని రామాయణకథాశ్రవణకుతూహలి యై
యడిగిన నమ్మహీపతికి నమ్మహాముని యి ట్లనియె. 267

క. విను మిక్ష్వాకుకులంబున, జనియించె నజుండు నాఁ బ్రశస్తచరితుఁ డా
తనికొడుకు దశరథుఁడు ముద,మున నాతఁడు పెండ్లియయ్యెఁ ముగ్గురుసతులన్.

వ. అందుఁ గౌసల్యకు రాముండును గైకేయికి భరతుండును సుమిత్రకు లక్ష్మణశత్రు
ఘ్నులును జనియించి రందు రామునకు విదేహరాజనందన యైనసీత ప్రియాంగన
యయ్యె నిఁక రావణుజన్మంబు సెప్పెద వినుము. 269

ఆ. అఖిలలోకకర్త యగువిరించికిఁ బుల
స్త్యుండు నాఁగ మానసుఁడు దనూజుఁ
డుద్భవించె నతనికి నుదయించె వైశ్రవ
ణాభిధానుఁ డైనయాత్మజుండు. 270

వ. ఆవైశ్రవణుండు దనతండ్రి యగుపులస్త్యుని విడిచి తాత యగుచతుర్ముఖునకుం
దపంబు సేసి నలకూబరుం డనుకొడుకును లోకపాలకత్వంబును ధనేశ్వరత్వంబు
ను లంక యనుపురంబును శంకరుతోడిసఖ్యంబును వరంబులు గాఁ బడసి మహా
విభూతితో వర్తిల్లుచున్నం గని యలిగి పులస్త్యుండు నిజశరీరంబునం దర్ధంబున
విశ్రవసుం డనువాని సృజియించి యావైశ్రవణున కహితంబు సేయు మని పని
చిన నెఱింగి కిన్నరేశ్వరుండు విశ్రవసుపాలి కరుదెంచి మహాత్మా యేను నీకుం
బుత్త్రుండ నయ్యెద నాకుం గరుణింపు మని యతనిం బ్రసన్నునిం జేసి నృత్తగీత

1. టేయది.

విద్యావిశారద లయినరాక్షసస్త్రీలం బుష్పోత్కటయు మాలినియు బకయు నను
వారి మువ్వుర నవ్విప్రవరునకుఁ బరిచారికలంగా నిచ్చిన. 271

క. పురుడున నయ్యువతులు నొం, డొరులం గెడపంగ విలసదుపచారసమా
చరణప్రవీణభంగులఁ, బరితోషితుఁ జేసి రాతపస్వివరేణ్యున్. 272

వ. ఇట్లు ప్రీతుం డై యతండు వారలకుః బుత్త్రదానంబు సేసిన నందుఁ బుష్పో
త్కటకు రావణకుంభకర్ణులును మాలినికి విభీషణుండును బకకు ఖరుండును
శూర్పణఖ యనుకన్యకయు మిథునంబై ప్రభవించి రక్కుమారులకు నలువురకుఁ
దజ్జనకుండు జాతకర్మాదిసంస్కారంబు లొనరించి సగౌరవంబుగాఁ బెనిచి యుప
నీతులం జేసె నందు. 273

ఉ. ఆతతతేజుఁ డున్నతభుజాగ్రుఁడు లోకభయంకరుండు వి
ఖ్యాతపరాక్రముండు దశకంఠుఁడు సంతతరోషమానసుం
డాతనియట్ల దుర్మదసమాత్ముఁడు క్రూరుఁడు గుంభకర్ణుఁడున్
భీతివిదూరుఁ డార్యుఁడు విభీషణుఁ డుత్తమచిత్తుఁ డారయన్. 274

క. ఖరుఁడు ఖరతేజుఁ డవనీ, సురపరిభవకారి మాంసశోణితభుజుఁ డు
ద్ధురచిత్తుఁడు శూర్పణఖయు, దురితచరిత ధర్మకర్మదూషణి యెపుడున్. 275

వ. ఆరాక్షసకుమారులు దండ్రివలన సకలవేదవేదాంగధనుర్వేదపారగు లై గంధ
మాదనగిరియందు సుఖం బుండి యొక్కనాఁ డతనికి మ్రొక్క వచ్చువాని
నధికవిభవసమన్వితు వైశ్రవణుం జూచి తత్ప్రభావంబు దపోలబ్ధం బగుట విని
జాతమత్సరు లయి తారును బితామహు నుద్దేశించి తపంబు సేయం దొడంగిరి
తత్ప్రకారంబు వినుము. 276

తే. మండువేసవిఁ బంచాగ్నిమధ్యమున ఘ
నాగమంబున బయల నత్యంతతుహిన
సమయమున నీరియందు నిశ్చలత నిలిచి
దశముఖుఁడు వాయుభక్షుఁ డై తప మొనర్చె. 277

మ. నియతాహారుఁడు నిర్జితేంద్రియుఁడు నై నిష్కంపవృత్తిన్ మహీ
శయనుం డై వ్రతముల్ చరించె నధికేచ్ఛం గుంభకర్ణుండు ధై
ర్యయుతుం డై ఘనుఁ డవ్విభీషణుఁడు పర్ణాహారయుక్తిన్ జపా
ధ్యయనాసక్తిఁ దపంబు సేసె మది నత్యంతంబు సంశుద్ధితోన్. 278

వ. ఖరుండును శూర్పణఖయు వారికిం దగినపరిచర్యలు సేయుచుండి రంత సహస్ర
వర్షంబులు నిండినం బంక్తివదనుండు దనమస్తకం బొక్కటి ఖండించి మండెడు
నగ్నియందు వేల్చి మఱియు వేయేండ్ల కొక్కటిగాఁ దలలు దొమ్మిదియుం దఱిగి
వేల్చి ధైర్యంబు దఱుఁగక పదియగుతలయును ద్రెంప సమకట్టినఁ బితామహుండు

ప్రత్యక్షంబై వారించి వానిశిరంబు లెప్పటియట్ల కలుగ నొసంగి యమరత్వంబు దక్క నొండు నీ కభిమతం బగునది యెయ్యది యైనను నడుగు మనుటయు నన్నిశాచరుండు. 279

శా. దేవా యేను సమస్తదేవపితృదైతేయాహిగంధర్వర
క్షోవిద్యాధరయక్షజాతులకు నక్షోభ్యుండఁగాఁ బ్రీతితో
నీవిశ్వంబునఁ గామరూపగతి నాత్మేచ్ఛావిహారుండఁగా
నీవే నావుడు వాని కవ్వర మజుం డిచ్చెం గృపాలోలుఁడై. 280

వ. [1]మనుష్యజాతి యొక్కండు దక్క నీచెప్పినయందఱవలనను నీకుమరణభయంబు లేదని పలికి పరమేష్ఠి గుంభకర్ణుం జూచి వరం బడుగు మనిన వాఁడును దైవోపహతుం డై తనకు నాత్యంతికంబైన నిద్ర యడిగిన నట్లయగు నని విభీషణున కభిముఖుం డగుటయు నతండు కృతాంజలి యై జలజాసనుఁ బ్రస్తుతించి. 281

క. పరమాపద యైనపుడును, దురితంబులు నామనంబు దొడరమియును భా
సుర మగుబ్రహ్మాస్త్రంబును, గరుణింపవె యనిన నిచ్చెఁ గమలజుఁ డనియెన్. 282

క. నిరతము రాక్షసభావముఁ, బొరసియు నీ విట్లు ధర్మబుద్ధి వగుట య
చ్చెరు విది గావున నీకును, దిరముగ నమరత్వ మిచ్చితిం గృప వత్సా. 283

వ. అని పలికి పితామహుం డంతర్హితుం డయ్యెఁ దదనంతరంబ. 284

మ. వరగర్వోన్నతుఁడై దశాననుఁడు దుర్వారోద్ధతిన్ దాడిమై
నరిగెం గిన్నరనాథుపై నతఁడు కార్యం బాత్మ నూహించి సం
గరసన్నద్ధుఁడు గాక కింపురుషయక్షశ్రేణితోఁ గూడఁ దా
నరిగెన్ లంకఁ బరిత్యజించి రభసోద్యత్పుష్పకారూఢుఁడై. 285

వ. ఇట్లతండు గంధమాదనంబునకుం జనునెడ వెన్నడిం దగిలి దానవుండు వానిమానంబుతోన విమానంబు నపహరించినం గనలి యక్షేశ్వరుండు గురుండ నగునన్ను నవమానించితివి గావున నివ్విమానంబు నీపగతుపా లయ్యెడు మని శపించె నంత.

క. రాక్షసలక్ష్మీమహిమకు, రక్షకుఁడుగఁ బంక్తిముఖుని రాక్షసమాయా
దక్షు నభిషిక్తుఁ జేసిరి, రాక్షసబేతాళవరులు రాగం బెసఁగన్. 287

వ. వాఁడును బలదర్పమోహితుండై కడంగి యింద్రాదిదేవతల నోడించి తత్పదంబు లాక్రమించి యీను మిగిలి జగద్రావణంబు సేయుటం జేసి రావణుం డనుపేరం బ్రఖ్యాతి వహించి సకలభూతభయంకరుం డయ్యె నట్టియెడ దేవర్షులును రాజర్షులునుం గూడి చని తత్ప్రకారం బగ్నిదేవునకుం జెప్పిన నతండు వారిం దోడ్కొని వారిజాసనుపాలికిం జని యిట్లనియె. 288

ఉ. భూరిభుజుండు విశ్రవసుపుత్త్రుఁడు పంక్తిముఖుండు దర్పదు

---

1. మనుష్యజాతుం డొక్కరుండు.

ర్వారుఁడు రాక్షసేంద్రుఁడు భవద్వరదత్తి నవధ్యుఁ డై మహా
ఘోరముగాఁ ద్రిలోకములకుం గడుఁ బీడ యొనర్పఁ జొచ్చె వ్వ
త్రారిపుఁ గమత్రిదశు లందఱుఁ గింకరు లైరి వానికిన్. 289

ఉ. దానవుచేతఁ గష్టపడి దైన్యము నొందుట కోర్వలేక నీ
దైనపదాంబుజంబు లభయం బని చేరితి మింక మమ్ము నె
ట్లైనఁ గృపార్ద్రమానసుఁడ వై తగఁ జేకొన వయ్య మాకు ది
క్కైనను గాక యున్నఁ గమలాసన నీవ కదయ్య యెయ్యెడన్. 290

వ. అనినఁ బరమేష్ఠి వారల కిట్లను నిక్కార్యంబునకు నేను మున్న తగినయుపాయంబు నిశ్చయించి నారాయణుం బ్రార్థించితి నద్దేవుండు మనుష్యభావంబున నవతరించి యారాక్షసు వధియించువాఁ డయ్యె నింద్రాదిసురులునుం దమతమ యంశంబులం జేసి ఋక్షవానరజాతులయందు జనియింపం గలవారు మీ రాభయంబు వల దని యగ్నిప్రముఖు లైనయమ్మహామునులసమ్ముఖంబున దుందుభి యనుగంధర్వకామినిం బిలిచి నీవు కుబ్జరూపంబున మంథర యనుపేర భూలోకంబున నుద్భవించి నీనేర్చువిధంబున దేవకార్యంబులు నిర్వహింపు మని పనిచి వారి వీడ్కొలిపెఁ బదంపడి దివిజులయంశావతారంబులుఁ జేసి. 291

మ. గురుశైలోన్నతగాత్రు లుద్ధతభుజాగ్రుల్ వజ్రపాషాణక
ర్కరు లర్కప్రతిమానతేజులు గుణాకల్పుల్ మహాకల్పభీ
కరకాలాంతకకల్పు లాజినిపుణుల్ గర్వోన్నతుల్ ఋక్షవా
నరవీరుల్ జనియించి రెల్ల యెడలన్ నాగాయుతప్రాణు లై. 292

క. అన విని యుధిష్ఠిరుం డమ్మునివరుతో ననఘ ధర్మమూర్తిని నారా
ముని నేల యరణ్యంబున, కనిచెను దశరథుఁడు సెపుమ యక్కథ యెల్లన్.

వ. అని యడుగుటయు మార్కండేయుం డిట్లనియె దశరథుండు నిజసుకృతపాకంబునం జేసి రామప్రముఖు లయినకొడుకుల నలువురం గని త్రైలోక్యరాజ్యంబు సంప్రాప్తం బయినయట్లు సంతసిల్లె నక్కుమారులు క్రమంబున నుపనీతులు నఖిలవేదవేదాంగవినీతులు యథాక్రమపరిణీతులు నై విలసిల్లి రంత. 294

సీ. అభినవపద్మదళాక్షు నక్షీణవి, స్తృతవక్షు నాజానుదీర్ఘబాహు
మధురస్మితాననుఁ మదగజగమను నా, రూఢయౌవను నభిరూపతేజు
శ్రీరమణీయుఁ బ్రసిద్ధయశోరమ్యు, నిఖిలవిద్యాగమనిపుణచిత్తు
నింద్రసమాను జితేంద్రియు ధర్మజ్ఞుఁ, బౌరబాంధవజనప్రార్థనీయు

ఆ. దుష్టనిగ్రహైకధుర్యు విశిష్టసం, రక్షణాభిలోలు రామభద్రుఁ
గులపవిత్రుఁ బెద్దకొడుకుఁ గనుంగొని, రాజవరుఁడు గరము రాగ మెసఁగ. 295

వ. యౌవరాజ్యపదంబునకు నతని నభిషేకం బాచరింపం గోరి యాప్తమంత్రిజనసమ్మతంబునఁ బురోహితనిరూపితం బైనశుభదినంబున నక్కార్యంబునకు సమకట్టు నెడ

భరతుఁదాది మంథర యనునది యమందగతిం గైకేయిపాలికిం జని యిట్లనియె.

ఉ. అక్కట నీదెసం బతికి నాఁడికూరిమి యయ్యె [1]మాయపుం
జొక్కులు నీవు నిక్కముగఁ జూచి మనంబున మోసపోయి తా
టక్కరి కోసలాత్మజయెడం బ్రియుఁడై యదె తత్తనూజు నిం
పెక్కఁగ యౌవరాజ్యమున నిప్పుడు పట్టము గట్టఁ బూనెడున్. 297

ఆ. పుడమిఁ జేనిమిదికి నెడ నైతి నీ వింక, నేమి సెప్పఁ గలదు వామనయన
కడఁగి నిన్నుఁ గొడుకుఁ [2]బెడవాడఁ ద్రోచి యీ, సవతికొడుక యేలు నవనియెల్ల.

క. అనిన నుదరిపడి కేకయ, తనూజ గడు సంభ్రమమునఁ దత్క్షణమ నరేం
ద్రునిపాలికిఁ జని యేకత, మున నిట్లనుఁ బ్రణయపూర్వకముగ నాతనితోన్. 299

క. ధరణీశ తొల్లి నాకుం, గరుణించినవర మొకండు గల దది మదిలోఁ
బరికించి యిప్పు డొసఁగుము, [3]చిరముగ సత్యవ్రతంబు సెల్లింపు తగన్. 300

వ. అనిన నతం డయ్యతివం గనుంగొని యవధ్యుల వధియించుటయును వధ్యులం గాచుటయును బ్రాహ్మణధనంబులుదక్క నన్యులధనం బపహరించుటయును నభీష్టధనంబు నిచ్చుటయును మొదలుగా నతిదుష్కరంబు లైనవాని నైనను భవత్ప్రియార్థంబు సేసెద నెయ్యది సెప్పు మనినఁ బ్రీత యై భరతమాత యిట్లనియె.

తే. యౌవరాజ్యపదంబున యందు భరతు, నధిప యభిషేక మొనరింపు మడవిలోన
నొలసి పదునాల్గువర్షంబు లుండ నాన, తిమ్ము రాముని [4]నురువర మ్మిదియ నాకు.

క. అనవుడు వీనులు గొఱవిం, గొని చూఁడినయట్టు లైనఁ గువలయపతి పె
ల్చన పిడుగడిచినక్రియఁ జే, తనరహితుం డగుచు ధరణితలమునఁ బడియెన్.

వ. అంతయు నెఱింగి రాఘవుండు నిజజనకుండు సత్యప్రతిజ్ఞుండు గావుత మని యాక్షణంబ సీతాసమేతుం డై వనంబునకు వెడలె నతనిపిఱుంద లక్ష్మణుండునుం జనియెఁ దదనంతరంబ. 304

దశరథుఁడు రామవిశ్లేషముచే సురలోకగతుం డగుట.

క. రాముఁడు సనుట విని మహో, ద్దామం బగుశోకవహ్ని దరికొనఁగను హా
రామ గుణధామ యని యా, భూమీశ్వరుఁ డనువియోగముం బ్రాపించెన్.

వ. ఇట్లు దశరథుండు సురలోకగతుం డగుటయుఁ గైకేయి దనకొడుకు రావించి భూవల్లభుండు దేవభావంబు నొందె రాముండును వనంబున కరిగె నింక నర్హుండవు నీవ కావున నఖిలమహీరాజ్యరక్షణంబు సేయు మనిన నక్కుమారుండు క్రోధశోకదందహ్యమానమానసుం డగుచుఁ దల్లి కిట్లనియె. 306

సీ. దురితంబు లెన్నండుఁ బొరయక వెలుఁగొందు, కమలాప్తకులమునఁ గసటుగలిపి
పరమధర్మాత్మకుఁ బురుహూతసన్నిభుఁ, బతి మ్రింగికొని కృపఁ బాఱ నైచి
యాయతబాహుఁ దేజోయుక్తు మాయన్నఁ, బటుధైర్యు నడవులఁ బాలువఱిచి

1. క. వాయపుం. 2. గ. బెడచేత. 3. అ. స్థిరముగ. 4. గ. నిరువర మ్మిదియ.

[1]జీవితైకార్థి వై త్రోవంగ రానిదు, ప్కీర్తి నాయాదలఁ గీలుకొల్పి
ఆ. శ్రీకి నెడపి సకలలోకంబులందును, దిట్టుఁ గుడిచి కోర్కి దీర్చుకొంటి
పాపజాతురాల యీపాతకం బేమి, సేయు దింక నేమి సేయువాఁడ. 307

వ. అని దుఃఖించి భరతుండు దండ్రికి నుచితక్రియలు నిర్వర్తించి యనంతరంబ సమస్తమంత్రిసామంతభూసురపౌరజానపదసహితుం డై కదలి మువ్వురు దల్లులను వసిష్ఠవామదేవులనుం బురస్కరించుకొని తానును శత్రుఘ్నుండును రామానునయార్థంబు చిత్రకూటశైలంబున కఱిగి యందు. 308

మ. కనియెం గోమలనీలమేఘసుభగాకారుఁ జటావల్కలా
జినధారుఁ సితభూతిభూషితుని రాజీవాక్షుఁ గల్యాణకీ
ర్తనుఁ [2]గాకుత్థ్సకులప్రదీపకుని సీతాలక్ష్మణోపేతు స
న్మునిలోకార్చితు సత్కృపాభరణు రాముఁ రాజచూడామణిన్. 309

వ. కని యంతంత నాక్రందనపరుం డగుచుం జని తదీయచరణంబులపయిం బడి పితృమరణప్రకారం బంతయు నెఱింగించి దేవా సకలసామ్రాజ్యధురీణుండ వై మమ్ముండఱి ననుశాసింపవే యని యర్థ్యజనసహితంబుగా నతనిం బ్రార్థించిన. 310

క. గురువాక్యరతుం డైనకా, దరచిత్తుం డైనయయ్యుదాత్తచరితుఁ డ
ప్పురుసున నోడఁబడఁ డయ్యెను, సరసమహీరాజ్యసమనుశాసనమునకున్. 311

వ. భరతుండును రాముచేతఁ బ్రత్యాఖ్యాతుం డై తదీయపాదుకంబులు గొని చని వాని నర్చించుచు నందిగ్రామంబునందు వసియించి రాజ్యానుసంధానంబు సేయుచుండె నిట రాఘవుం డయోధ్యాసమీపంబగుటం జేసి క్రమ్మఱ భరతాగమనంబు శంకించి చిత్రకూటంబు వాసి శరభంగుపాలికిం జని యతనిచేత సత్కృతుం డై దండకారణ్యంబు సొచ్చి యందు గోదావరీతీరంబున ననుజవధూసహితంబుగాఁ గృతనివాసుం డై యున్నంత దశగ్రీవుచెలియలు శూర్పణఖ సనుదెంచి వారికి నపకారంబు సేయ మొనసినం గినిసి యారాజపుత్త్రులు దత్కర్ణనాసికావైకృతం బొనరించినం బదంపడి. 312

ఉ. శూర్పణఖానిమిత్తమున శూరు లనేకులు రక్కసుల్ మహో
త్సర్పితరోషు లై బహుళసైన్యయుతంబుగ నెత్తి వచ్చుదుర్
దర్పితవైరిభంజనుఁ డుదారుఁడు రాఘవుఁ డస్త్రవిద్య నే
ర్పేర్పడఁ గేలిఁబోలె సమయించె రణాంగణభూమి నందఱన్. 313

వ. ఇట్లు ఖరదూషణాదులం దొట్టి పదునాలుగువేలరాక్షసులం జంపి దండకారణ్యంబు విగతకంటకంబు గావించె నంత శూర్పణఖయు రయంబున రావణుపాలికిం జని తచ్చరణంబులపయిం బడి యేడ్చినం జెలియలి కైనవైకృతం బేర్పడం జూచి యన్నిశాచరనాథుం డిట్లనియె. 314

1. అ. జీవితహంత్రి వై. 2. గ. మార్తాండకులేందు నిందసము సీ.తా.

సీ. ఎఱిఁగి యెఱింగి నే ✽ డెవ్వఁడు నిశితవి, స్ఫారశూలాగ్రంబు ✽ పయికి నుఱికెఁ
దలయంపియం దగ్గి ✽ దరికొల్పి యెవ్వండు, నేఁడు నెమ్మది శయ ✽ నింపఁ జూచె
నుగ్రవిషానలం ✽ బుమియు చున్నయహీంద్రుఁ, గడఁగి నే డెవ్వండు ✽ గాలఁ దన్నె
హుంకారఘోరమై ✽ యొదరు బెబ్బులిమీస, లుఱక యెవ్వాఁడు నేఁ ✽ డూఁచికొనియె
ఆ. [1]నిన్ను నెవ్వఁ డకట ✽ నేఁ డిట్లు గడు భంగ, పఱిచెఁ జెపుమ నాకుఁ ✽ బద్మనయన
యాయువును సిరియు[2]ను ✽ నవశంబు లయ్యె నేఁ, డెవ్వనికొ తలంప ✽ నిజ్జగమున.
క. అని పలుకునప్పు డాతని, ఘనతరముఖనేత్రనాసికాకర్ణములం
దనవరతరోషపావక, జనితశిఖావితతు లక్కజంబుగ వెడలెన్. 316

వ. శూర్పణఖయు నతనికి రాఘవు లున్న తెఱంగును నిజపరిభవంబు దత్కృతం బగుటయు ఖరదూషణాదిరాక్షసవధయునుం జెప్పిన విని ధనదానుజుం డాక్షణంబ పురసంరక్షణంబునం దాప్తజనంబుల నియోగించి సన్నద్ధుం డై యొక్కరుండ వెలువడి త్రికూటకాలపర్వతంబులు గడచి సముద్రతీరంబునఁ బరమేశ్వరనివాసం బైన గోకర్ణస్థానంబునకుం జని యచ్చటం దొల్లి రామువలనం బ్రాప్తపరాభవుం డై ప్రవ్రజనంబు నొంది తపంబు సేయు చున్నవానిం దనపూర్వామాత్యు మారీచుం గనిన నతండును బ్రియసంభ్రమంబులతోడ నతనిం బూజించి కుశలం బడిగి భవదాగమననిమిత్తం బేమి యని యడిగిన నసురేశ్వరుం డిట్లనియె. 317

ఉత్సాహము. వినవె రాముఁ డనఁగ నొకఁడు ✽ విపులదర్పహృదయుఁ డై
మనఖరుండు లోనుగా స✽మగ్రశౌర్యు లైనయ
ద్దనుజవరులఁ దునిమి యిపుడు ✽ దండకస్థలంబునం
దొసర నిర్భయత్వ మొప్ప ✽ నున్నవాఁడు మేటి యై. 318
ఆ. వానిఁ బరిభవింప ✽ వలయు నప్పనికి సా, హాయ్యకం బొనర్పు ✽ మనఘ నాకు
ననిన నధికభయస✽మాపిష్టహృదయుఁ డై, యమరవైరి కిట్టు ✽ లనియె నతఁడు.
చ. ఎఱుఁగవు [3]గాక రాఘవును ✽ దీర్ఘభుజాబలశాలి నాజిలో
నుఱక తదీయబాణరయ ✽ మోర్వ వశంబె పినాకి కైన న
క్కఱియుఁ గ నీకు నిత్తెఱఁగుఁ ✽ గా దన కేఖలుఁ డొక్కొ బుద్ధిఁగాఁ
గఱపినవాఁడు చేటునకుఁ ✽ గాలము సేరెనొ కాక యిమ్మెయిన్. 320
ఆ. రాముతోడఁ దొడరి ✽ రణమునఁ గడు భంగ, మొందికాదె దైన్య✽యుక్తి నిట్లు
దపసి వైతి నేఁడు ✽ తగ దమ్మహాత్ముని, యందు వైరబుద్ధి ✽ యధిప నీకు. 321

వ. అనినం గలుషించి లంకేశ్వరుండు వానిం జూచి నాపనుపు సేయ వైతివేని నిన్నిప్పుడ కృతాంతగోచరుం జేయుదు ననిన వాఁడును దనమనంబున వీనిచేతం జచ్చుటకంటెను రాఘవకృతం బైనమరణంబు మే లని తలపోసి మహాత్మా నీకు

1. గ. వాఁడు మత్ప్రతాప✽వైశ్వానరార్చులఁ, బొలియుఁ నీక్షణంబ✽శలభ మనఁగ. 2. చ. న✽పాయంబు లయ్యె. 3. జ. నీవు రాఘవును.

హితంబు గోరి చెప్పితి నిది యిష్టంబు గాదేని భవదీయశాసనంబు గైకొని చేసెదం
బనుపు మనినఁ బౌలస్త్యుం డిట్లను నీవు రత్నమయతనూరుహం బగు కనకమృ
గంబ వై చని జానకిం బ్రలోభింపవలయు సీతాచోదితుం డై రాముండు నిన్నుం
బట్ట సమకట్టి నీచేత నతిదూరంబు గొనిపోవంబడునప్పు డేను దద్భామిని నపహ
రించెదఁ బ్రియావిరహదుర్మనస్కుం డై యతండు చెడి పోవు ననిన నట్ల కాక
యని మారీచుండు. 322

మారీచుఁడు మాయామృగం బై చనుదెంచుట.

క. కనకమృగరూపమునఁ జని, యినవంశ్యుఁడు సతియు నున్న | యెడఁ బొలయుటయుం
గని జానకి కౌతూహల, మునఁ బ్రియుఁ బ్రార్థించె హరిణ | పుంగవుఁ బట్టన్. 323

ఆ. ధరణిసుతయు విధియుఁ | దన్నుఁ బ్రేరేపంగ, వివశబుద్ధి యగుచు | నవనివిభుఁడు
మృగముఁ బట్టఁ దివిరె | మృగనేత్ర కాపు స, ద్వినుతబలు సుమిత్ర | తనయు నునిచి.

క. అసదృశకార్ముకధరుఁ డై, మసలక యామృగము వెనుక | మర్దితరిపుఁ డిం
పెసఁగంగ నరుగఁ దొడఁగెను, వెస రుద్రుఁడు యజ్ఞమృగను | వెనుకొనుమాడ్కిన్. 326

వ. అట్టియవసరంబున.

మ. పఱచుం దవ్వగఁ జేయలంతి నిలుచుం | బట్టీక [1]యాసాసలం
బిఱువ్రేవుం బొదలందు డిందుఁ బొడముం | బిట్టుల్కి వే దాఁటుఁ గ్ర
మ్మఱి చూచుం జెవి దార్చి నిల్చు మలయుం | మట్టాడుఁ [2]గ్రోడాడు నే
మఱిన ట్లుండుఁ దృణంబు [3]మేయు నలయుం | మాయామృగం బిమ్ములన్. 327

వ. ఇట్లతిదూరంబుగా నెలయించి యలయించిన నది రాక్షసమాయగా నూహించి
రాఘవుం డమోఘబాణంబు దొడిగి తడయక యమ్మృగంబు నేసిన. 328

క. వాలమ్ము దాఁకి యొఱలుచు, నాలోనన రాము నెలుఁగు | నట్టియెలుఁగు గా
హా లక్ష్మణ సీతా యని, కూలి కపటమృగము దన్ని | కొనుచుం జచ్చెన్. 329

తరువోజ. ఆయెలుఁగేర్పడ | నవనీతనూజ | యాలించి తల్లడం | బడరుచి త్తమున
నోయన్న లక్ష్మణ | యొలసి మాయన్న | యుగ్రరాక్షసబాధ | నొందంగఁ బోలు
నాయతభుజ వింటె | యమ్మహాభాగుఁ | డత్యంతదుఃఖార్తుఁ | డై నిన్నుఁ జీరెఁ
బోయి వే [4]కావు వి | స్ఫురితపుణ్యైక | భూషణోదార య | పూరుషరత్నంబు. 330

వ. అనిన నతం డమ్మానిని కిట్లనియె. 331

ఆ. అబల వెఱవ కుఁడు | మఖిలలోకములను, రాఘవేశ్వరునకు | రణములోన
నెదురఁ గలఁడె శూరుఁ | డెవ్వాఁడు నతనికి, నెట్టియెడల దురిత | మేల పొందు.

క. ఇనవంశోత్తముఁ డిప్పుడ, చనుదెంచుఁ బ్రియంబు నొందు | జలజానన నా
విని జానకి లక్ష్మణునెడ, జనితాశంక యయి క్రోధ | సంభ్రాంతమతిన్. 333

---

1. గ. యాసాసగా. 2. 'క. గ. చ. జ. గోడొడ్డు. 3. గ. జ. లాను. 4. అ. కావవే | పుణ్యగుణై
క | భూషణోదారు న | పూరుషరత్నంబు.

సీ. నీతలం పెఱుఁగుదు నీ కేల వలవని, జాలి నీ కిట్లేల సంభవించె
నతిఘోరశస్త్రవిషాగ్నులయం దొంట, వేగంబ ప్రాణముల్ విడుతుఁ గాక
యే నేల నిను వరియింతు బెబ్బులికాంత, యక్కట నక్కపొం దాసపడునె
యని యిట్లు సత్పురుషాగ్రణిసౌమిత్రిఁ, బడఁతి యప్రియములు వలుకుటయును
ఆ. చెవులు మూసికొనుచుఁ జిత్తంబు గలఁగ ల, క్ష్మణుఁడు దక్షిణంబ మహితశౌర్యుఁ
డమలబాణచాపహస్తుఁడై తనయన్న, చనినచొప్పునంద చనఁదొడంగె. 334

వ. అయ్యవసరంబున దశాననుండు. 335

మ. కమనీయం బగుజన్నిదంబు శిఖయుం గౌపీనముం ధాతువ
స్త్రము దండంబును గుండియుం గుశపవిత్రంబుం గదుర్ వృద్ధభా
వము సంధిల్లఁ ద్రిదండివేషధరుఁడై వచ్చెం బథిశ్రాంతి దే
హమునం దోఁపఁగ సీత యున్నెడకు మాయాదక్షుఁ డక్షీణతన్. 336

తే. వాని నిక్కంపుమునియ కావగచి రాము, వనిత గడుభక్తిఁ బూజించి వన్యఫలము
లొసఁగుటయు వానిఁ జేకొన నొల్లక సుర, మదనవివశుఁడై యిట్లను మగువఁ జూచి.

మత్తకోకిలము ఏను దానవనాయకుండ నహీనసత్త్వుఁడ రావణా
ఖ్యానిరూఢుఁడ లంక నాఁగ జగత్ప్రసిద్ధము మత్పురం
బానతాంగి మదీయవల్లభ వై [1]భజింపఁగ రాదె ది
వ్యానుభోగము లిష్టచేష్టితహారియౌవనలీలలన్. 338

క. ఎక్కడిరాఘవుఁ డక్కట, తక్కువ యవుపేదమనుజుఁ దగిలి వనమునం
జిక్కిడుమలఁ బడఁ దగునే, తక్కుము మది నింక నొండుదలఁపులు తరుణీ. 339

వ. అనిన విని వైదేహి భయకంపితదేహ యగుచు నతని కిట్లనియె. 340

సీ. ఇట్లాడ నర్హమే [2]యే నేడ నీ వేడ, నక్షత్రతారాగణంబుతోడ
నాకసం బంతయు నవనిపైఁ గూలిన, వసుమతి వ్రస్సిన వనధు లెల్ల
నింకినఁ జంద్రదినేశ్వరు లన్యోన్య, [3]విపులతేజంబులు వీడుపడిన
నే నేల యన్యుని నెడలోనఁ గామింతుఁ, గరిణి యేనాఁట సూకరముఁ గలయు
ఆ. మహితకమలమధురమధురసాస్వాదన, పరవశాత్మ యైన భ్రమరకాంత
రిత్తబుద్ధి నకట రేఁగుఁబువ్వులరసం, బానునెట్లు బేల వైతి గాక. 341

రావణుఁడు సీత నెత్తికొని లంకకుఁ బోవుట.

వ. అని పలుకుచు నొయ్యనొయ్యన తొలంగం జనిన నద్దురాత్ముఁ డతిభయంకరంబుగా జంకించి యమ్మగువం బట్టికొని గగనంబున కెగసి లంకాపురాభిముఖుండై యరుగఁ దొడంగిన నయ్యింతి యెంతయుం దలరి యిట్లని విలాపంబు సేసె. 342

ఉ. దేవతలార యోధరణిదేవతలార జగత్త్రయోన్నతుం

---

1. గ. జ. భుజింపఁగ. 2. 'యే నేల నీవేల'; 'ఏడ' కు మాఱుగా 'ఏల' యనియె ప్రాఁతప్రతులం గానిపించెడి. 3. క. విషయకాలంబులు.

డై వెలుఁగొందు రామునికులాంగన జానకి నేను నన్ను మో
హావిలుఁ డొక్కరక్కసుఁ డనర్గళుఁ డై కొనిపోయెడుం గృపం
గావరె పుణ్యమూర్తుల్ యశముఁ గైకొనరే యిదె మీకు మ్రొక్కెదన్. 343

క. అని యేడ్వఁగఁ దద్వచనము, లనఘుఁడు గిరిగహ్వరాంతరాలయగతుఁ డై
విని యరుణసుతుఁడు దేజో,ఘనుఁడు జటాయు వనుపక్షి గారుణ్యమునన్. 344

క. ఎఱకలు గలకులశైలము, [1]తెఱఁగు మెఱయ రయము మెఱయ దివికి నెగసి పె
ట్టుఱుముజలధరముక్రియ ను, క్కఱి [2]తద్వన మెల్ల నద్రువ నార్చుచుఁ గడిమిన్.

ఉ. ఓరి దురాత్మ యీయబల నోడక యేటికిఁ బట్టినాఁడ వం
భోరుహనేత్ర విడువు మెట ఫ్రాయినఁ బ్రాణముఁ గొందు నింక ను
గ్రాజివిభేదవిక్రము జటాయు నెఱుంగవె యంచు దర్పదు
ర్వారుఁడు వీఁకఁ దాఁకె సురవర్గవిమాననసద్దశాననున్. 346

మ. ఘనపక్షాహతులం బ్రకాండపరిఘాఘాతంబులం దీవ్రశా
తనఖోచ్ఛేదములం బ్రదీప్తశరవేధక్రీడలం గ్రూరచం
చునిపాతంబులఁ బ్రౌఢకుంతముఖవిస్ఫోటంబులం దక్షగేం
ద్రనిశాటేంద్రులపోరు సాధనసమర్థత్వస్ఫూర్తి నొప్పెం గడున్. 347

చ. పటుతరపక్షిపక్షముఖపాదనఖప్రవిఘాతఖండిత
స్ఫుటితశరీరుఁ డై బహుళశోణితధారలు మేనఁ గ్రమ్మఁగాఁ
దటసముపాంతనిర్గళితధాతురసారుణసాంద్రనిర్ఝరో
త్కటకులశైలలీల దశకంఠుఁడు నిల్చె నకంపితస్థితిన్. 348

వ. తదనంతరంబ. 349

క. తెఱపి గని దానవేశ్వరుఁ, డుఱక కృపాణమున నాఖగోత్తము నెఱకల్
నఱకినఁ గూలె నతం డిల, నఱవఱ లై పవనహతమహాభ్రముపోలెన్. 350

వ. ఇట్లు జటాయువుం గూల్చి రావణుం డధికరయంబున నరుగు నెడ జానకి దనకు
ది క్కెవ్వరు లేమిం జేసి నిరాశ యై యొక్కశైలశృంగంబునందుఁ గొందఱు
వానరులు మెలంగుచున్నం గని తనకట్టినపుట్టంబుకొంగు చించి [3]భూషణంబు
లూడ్చి తత్ప్రదేశంబున వైచెం బంక్తివదనుండును లంకాపురంబునకుం జని
యం దశోకవనమధ్యంబున నాసుమధ్య నునిచి తదీయరక్షణార్థంబు రాక్షసీనివ
హంబు నియోగించె నిటఁ రాఘవుండు మాయామృగంబు వధియించి మగుడం
జనుదెంచువాఁడు దన కెదురుగా వచ్చులక్ష్మణుం గని రాక్షసగోచరం బైనవనం
బున జానకి నొంటి యునిచి వచ్చి తప్పు సేసి తని పలుకుటయు సుమిత్రానంద
నుండు ధాత్రీతనయ దన్ను నవమానించి పలికిన తెఱంగు సెప్పిన. 351

మధురాక్కర. కనకమృగ మట్లు దను దవ్వుగాఁ ద్రిప్పి తెచ్చుటకు

---

1. క. తెఱగు మెఱయ రయము నెఱయ. 2. గ. భువనం బెల్ల. 3. జ. భూషణంబులు ముడిచి.

వనజముఖి నేకతమ శూన్యవనమునయం దునిచి
వెనుక ననుజుండు వచ్చినవిధమునకు మదిలోన
ననఘుఁ డెంతయు వగచుచు నరిగె నాశ్రమమునకు. 352

వ. ఇట్లు సని చేతనారహితం బయినశరీరంబునుంబోలె సీతావిహీనం బై యున్న పర్ణగృహంబుం గనుంగొని రాఘవుండు మూర్ఛితుండై లక్ష్మణ[1]ప్రయుక్తంబునం గొండొకవడికిం దెలివొందె నంత నయ్యన్నయుం దమ్ముండును దత్ప్రదేశంబుల యందు సుందరిం దడవుచుం జనువారు ముందట. 353

తే. కులిశపాతభంగుర మైనకులనగంబు
కరణిఁ బడి యున్నగృధ్రంబుఁ గాంచి బుద్ధి
నదియు రాక్షసమాయ యౌ నని తలంచి
యేయ సమకట్టుటయు విహగేంద్రుఁ డెఱిఁగి. 354

క. ఓయయ్యలార యేను జటాయు వనం బరఁగుపక్షి నరయుఁడు నన్నున్
మీయయ్య దశరథక్షితినాయకునకుఁ బ్రియసఖుండ నావుడు వారల్. 355

వ. డాయ నరుగు దెంచుటయు నలంకు వారితో రావణుండు వైదేహిం గొనిపోవుట యుఁ దదర్థంబై తాను నద్దనుజుం దొడరి పెనంగుటయుం జెప్పి రావణుం డరిగిన దెస [2]నెఱిఁగించి విగతజీవుం [3]డయ్యె నయ్యిరువురునప్పులుఁగుఱేనికి నతిగౌరవం బున నగ్నిసంస్కారాదికరణీయంబులు నిజజనకనిర్విశేషంబున నాచరించి దక్షి ణాభిముఖు లై చని చని. 356

చ. ఉరమునయందుఁ గన్నులుఁ బృథూదరదేశమునందు నోరుఁ బ్ర
స్ఫురితభుజద్వయంబుఁ గులభూమిధరోన్నతభావముం గరం
బరుదుగ నుగ్ర మైనవికృతాకృతితోడ నశేషసత్త్వఘ
స్మరుఁ డగు చున్నవానిఁ బటుసత్త్వుఁ గబంధునిఁ గాంచి రచ్చటన్. 357

ఆ. అక్కబంధుఁ డామిషార్థి యై లక్ష్మణుఁ
బట్టికొనియె బాహుబల మెలర్ప
నతఁడు గడు విషణ్ణుఁ డై యన్న నుఁ జూడు
మనుచు రాముఁ జూచి యనియె మఱియు. 358

శ్రీరాముఁడు కబంధుఁ డనురాక్షసుం జంపుట.

సీ. మహనీయసామ్రాజ్యమహిమ వాయుటయును, బితృమరణంబు నాభీలవిపిన
భూములఁ గడుదుఃఖమునఁ జరించుటయు వై, దేహిఁ గోల్పడివగఁ దిరుగుటయును
దుదిఁ బోయి యే నిట్టుదొడరి యీదానవు, వాతఁ జిక్కుటయును వగవ నీకుఁ
బై పయిఁ బెక్కు లాపద లయ్యె నక్కట, ధరణీశ నీవు నాధరణిసుతయుఁ

1. అ. ప్రయత్నంబున. 2. 'నెఱింగించి పరమాత్మునపరావతారం బగునయ్యాదిహరి రఘురా ముం గనుంగొనుచు విగతజీవుండై పుణ్యలోకప్రాప్తుం డయ్యె' నని యధికపాఠ మొకటిఁ జూపట్టు చున్నది. 3. గ. డై పుణ్యలోకప్రాప్తుం డయ్యె నయ్యి.

ఆ. గలసి పూజ్యరాజ్యగౌరవంబున వెలుఁగంగ నెలమిఁ జూడఁ గాన నైతి
నేను దలఁప నెట్టిహీనభాగ్యుండనో, యనుచు ననుజుఁ డార్తి నడలుటయును.

తే. విగతసంభ్రముఁడై రామవిభుఁడు గడఁగి, యన్నలక్ష్మణ యోడకుమన్న యేను
గలుగ నీ కేల యాపద గలుగ నేర్చు, ననుచు గ్రక్కున నిశితమహాసి వెఱికి.

వ. ఆరక్కసుడాచేయి దునియ వ్రేసిన లబ్ధమోక్షణుం డయి లక్ష్మణుండు ప్రకటసైంహికేయదంష్ట్రాయంత్రవిముక్తుండయినతిగ్మభానుండునుంబోలెఁ బ్రదీప్తుం డయి తీక్ష్ణకౌక్షేయకంబునఁ దదీయదక్షిణబాహుఖండనంబు సేసి పార్శ్వద్వయంబు భేదించిన నాక్షణంబ కబంధుండు దివ్యరూపధరుం డగుటయుం గని రాఘవుండు విస్మితుం డై. 361

క. ఈవనమునందు రాక్షస, భావంబున నున్ననీకుఁ బ్రకటితదివ్య
త్వావాప్తి యైనకారణ, మేవిధ మనుటయును నాతఁ డిట్లని చెప్పెన్. 362

వ. ఏను విశ్వావసుం డనుగంధర్వుండ బ్రహ్మశాపంబునం జేసి రాక్షసత్వంబు నొంది మీవలన శాపమోక్షంబు వడసితి రావణుం డనురక్కసుండు జానకిం గొనిపోయి లంకానగరంబున నునిచినవాఁడు మీకు హితోపదేశంబు సేసెద నిట పోవం బోవఁ బంపాభిధానం బయినసరోవరంబు గలదు దానియావల ఋశ్యమూకం బనుశైలంబునందు వాలిసహోదరుండు సుగ్రీవుం డనువానరుండు సచివచతుష్టయసహితుం డై యుండు నతనితోడ సఖ్యంబు సేయుము దానం జేసి నీకుఁ గార్యసిద్ధి యగు నని పలికి గంధర్వుండు వారి వీడ్కొని నిజేచ్ఛం జనియెఁ దదనంతరంబ యట చని చని. 363

సీ. కమనీయకమలినీకహ్లారదళకేస, రాన్వితజలముల నర్ఘ్యవిధియుఁ
దరళతరంగహస్తములఁ బాద్యంబు ను, న్మదచక్రసారసమధుపహంస
రుతులఁ బ్రియోక్తులు రుచిర[1]వానీరని, వేశనచ్ఛాయల విశ్రమంబు
మందసంచారితమారుతంబుల నురు, తాపనోదనమును దగిలి యెపుడు

ఆ. నాచరించుచును బరమంచితాతిథిజన, సేవనమునఁ దనదుజీవనంబు
ఫలము నొంద నొప్పుపంపాసరోవరం, బెదురఁ గాంచి రన్నరేంద్రసుతులు. 364

వ. ఆసరోవరతీరంబునం గౌసల్యానందనుండు [2]దత్తద్విషయవిశేషోల్లాసంబులవలనం గ్రొత్త యై చిత్తజానలంబు దరికొని చేతోవృత్తంబు నెఱియింపం దొడంగినఁ దాల్మి దొఱంగి జానకిం బేర్కొని యాక్రందనవచనవివశుం డగుటయు నతనికి లక్ష్మణుం డిట్లనియె. 365

చ. పురుషవరేణ్య యిట్లు మిముబోఁటులకుం జనునయ్య యాపదల్
వారసినచోఁ గలంగుట ప్రభుత్వ మెలర్పఁగఁ దాల్మి యూఁది దు

1. అ. వానీరనివేశన. 2. క. జ. దత్తద్వియోగాదివిశేషవిషయోల్లాసంబులవలనం.

స్తరతరమానసవ్యథలు ♦ దల్గుము సంభృతపౌరుషుండ వై
యరయుము దేవి యున్నయెడ ♦ యారసి కార్యము దీర్ప మేర్పడన్. 366

ఆ. అధిప శిష్యుఁడను స♦హాయుండ భృత్యుండ, నైన యేను గల్గ ♦ నాత్మ నీకు
నేల వగవ నని మ♦హీపతిచిత్తంబు, నలఁత డిందుపఱిచె ♦ నవరజుండు. 367

వ. తదనంతరంబ యయ్యిరువురుం బంపాసరోవరంబునం గృతస్నాను లయి దేవపితృ
తర్పణంబులు సేసి చని ముందట నతిబహుళబలాహకవ్యూహసన్నాహసమున్న
తంబు లైనయభంగశృంగసముదయంబుల నఖిలగగనక్రోడపీడనంబు సేయుచున్న
దాని ఋశ్యమూకశైలంబుఁ జేరి [1]తదుపకంఠప్రదేశంబున విశ్రమించి యు
న్నంత. 368

సీ. ఆరాజపుత్త్రుల ♦ నారూఢతేజుల, వీరుల నున్నతో♦దారభుజులఁ
గనుఁగొని సుగ్రీవుఁ ♦ డనఘుఁ డగ్గిరిశృంగ, మున నుండి తానును ♦ దనసచివులుఁ
జింతించి వారివృ♦త్తాంతము నెఱుఁగంగ, సంతతోత్సాహు ధీ♦మంతు శౌర్య
వంతు నుత్తము హిమ♦వంతునిఁ బోనియ, త్యంతసుస్థిరు హను♦మంతుఁ బనిచె

ఆ. నతఁడు నరిగి నృపతి♦సుతుల తెఱం గెల్ల, నెఱిఁగి వనచరేంద్రు ♦ నెఱుఁగఁ జెప్పి
యుగ్రతేజుఁ డైన ♦ సుగ్రీవుతోఁ జెల్మి, యొనర సంఘటించె ♦ మనుజపతికి. 369

వ. సుగ్రీవుండును మున్ను సీతాపరిత్యక్తంబై తమముందటం బడినం దారు గైకొని
సంగ్రహించి యున్నభూషణనిచయంబు రామునకు నివేదించినం జూచి యతండు
సముత్సుకుండై వానికి వానరైశ్వర్యంబు ప్రతిశ్రుతంబు సేసి తదీయశత్రుం డైన
వాలిం జంపఁ బ్రతిజ్ఞ సేసెఁ గపీశ్వరుండును జానకిం దెచ్చుటకు సహాయంబు గా
నొడంబడియె నంతట నందఱుం గూడికొని వాలినివాసం బైన కిష్కింధానగరం
బున కరిగి రప్పుడు భానుసూనుండు. 370

క. వాలిగృహద్వారంబున, వాలి మదం బెసఁగ నార్చి ♦ వారక బాహా
స్ఫాలనము సేయుటయు విని, వాలి మహారోషదుర్ని♦వారోద్ధతిమైన్. 371

వ. సమరసన్నాహం బమర వెలువడం బోయినఁ దదీయవల్లభ యగు తార యతని వా
రించి యిట్లను నేఁటిచందంబు సూడ సుగ్రీవుండు బలవత్సహాయుం డై వచ్చిన
వాఁ డది యెట్లనిన దశరథనందనుం డైనరాముండు రావణుచేత నపహృత
దారుం డయి నిజసహోదరుం డగులక్ష్మణుండును దానును సుగ్రీవసహాయత్వం
బపేక్షించి యతనికార్యంబు దీర్పం బూనె నని వింటి నదియునుంగాక మహాబలు
లయినమైందద్వివిదులు నతిలోకపౌరుషుం డయినహనుమయుఁ బ్రసిద్ధబుద్ధియగు
జాంబవంతుండును వానికి మంత్రు లై యుండుదురు గావున నీ విప్పుడు గయ్యం
బునకుఁ బోక నా కిష్టంబు గా దనిన నవ్వనచరవీరుండు. 372

క. ఆవనితవచనములు సు, గ్రీవవిషయపక్షపాత♦[2]కృత్రిమములు గా

---

1. గ. తదుపకందరప్రదేశంబున. 2. అ. కృత్యంబులుగా.

భావించి యాదరింపక, తా వెడలె ననూనబాహుదర్పం బెసఁగన్. 373
వ. ఇట్లు వెడలి కట్టెదుర నున్నసుగ్రీవుం జూచి యి ట్లనియె. 374

వాలిసుగ్రీవులయుద్ధము.

తే. ఓరిదుష్టాత్మ యే నిట్లు పోరఁ జెక్క, మాఱు లెగవఁగ సిగ్గఱి పాఱుచుండు
నట్టినీ కున్నయునికి యిట్టలముగ, నిట్టిబీర మెక్కడనుండి పుట్టెఁ జెపుమ. 375
వ. అనినఁ బ్రహసితముఖుం డగుచు నబ్బలిముఖుం డి ట్లనియె. 376
క. ఆలిని రాజ్యముఁ గోల్పడి, యాలంబునఁ దూలపోయి యక్కట బ్రదు కిం
కేలా యని తెగువ మెయిన్, వ్రాలి రణము సేయ నమరి వచ్చితి నీతోన్. 377
తే. చక్కఁగ న్మింక ముందటి చంద మొందఁ, గలదె తొంటిసుగ్రీవుండు గాఁడు నేఁడు
నిన్నుఁ బోరిపుచ్చి కాని పోనేర్చు నెట్లు, ననుచు నుగ్రుఁ డై యవ్వీరు నార్చి కవిసె.
వ. ఇవ్విధంబున. 379
ఉ. భూవిదితప్రభావులు ప్రభూతబలోద్ధతు లుగ్రవైరి తే
జోవిజయుల్ నిరంతరయశోజయకాంక్షులు భూరిభూరుహ
గ్రావనఖాయుధుల్ బలిముఖప్రవరుల్ గడుఁ బొంగి వాలిసు
గ్రీవులు దాఁకి రొండొరు లకృత్రిమరోషకషాయవక్త్రు లై. 380
మ. తరుసంఘంబులు పూన్చి యొండొరుల నుద్యద్బాహు లై వ్రేయ ని
ష్ఠురవక్షస్స్థలపాతవేగవిరళస్తోకంబు లై పోయె న
త్తరుసంఘంబులు వెండియుం గడఁగి మాద్యల్లీల నయ్యిద్దఱుం
బరుపానేకశిలాప్రయోగముల నొంపం జొచ్చి రన్యోన్యమున్. 381
క. అతులితశిలావితానం, బితరేతరతనునిపాతహేలాసంచూ
ర్ణిత మగుటయు వారలు పటు, గతిఁ గవిసిరి [1]బాహుయుద్ధకౌతుకమతు లై. 382
ఉ. ఒండొరుఁ బట్టుచుం దిగుచు చొండొరుఁ బాయుచు వ్రేయుచున్ మహో
ద్దండత నొండొరుం దెరలఁ దాఁకుచు నీఁగుచు లోఁగుచుం జలం
బొండొరు మీఱి యొండొరులయుద్ధతి సైఁపక పీఁచఁ బోరి రా
ఖండలభానుసూను లవిఖండితచండభుజాప్రకాండతన్. 383
శా. దేహోత్సేక మెలర్ప నుత్థితమదాంధీభూతు లై యాహవో
త్సాహవ్యగ్రులు విగ్రహంబు మిగులన్ సంరంభశుంభద్గతిన్
[2]బాహాబాహిని బోరునప్పు డమరెం బ్రౌఢద్విపద్వంద్వహే
లాహస్తద్వయగాఢకర్షణరణోల్లాసంబు విస్పష్ట మై. 384
వ. మఱియు నన్యోన్యదంతనఖముఖవిఖండితశరీరు లై హరివీరులు రుధిరధారలం దడిసి పుష్పితంబు లగు నశోకంబులుం బోలె నొప్పి చలంబులు మెఱయం బెనంగు నెడం దుల్యబలరూపవిక్రము లై యున్నయయ్యన్నదమ్ముల నిరువుర నేర్పడ లక్షింప నేరక

1. గ. యుద్ధకేళీకౌతుక. 2. క. గ. జ. బాహాబాహులఁ బోరునప్పు.

లక్ష్మణాగ్రజుండు విలక్షహృదయుండై వీక్షించుచున్న నాంజనేయుండు రాఘవున
కు నభిజ్ఞానార్థంబుగా నొక్కపల్లవదామంబు సుగ్రీవునఱుతం బెట్టెఁ దదనంతరం
బ రాఘవుండమోఘబాణంబుదొడిగి వాలియురంబు వగుల నేసినం బడి యవ్వా
నరుండు దశరథనందను నిందించుచుఁ బ్రాణవియోగంబు నొందె నిత్తెఱంగున.

ఆ. వాలిఁ జంపి యతనివనిత సుగ్రీవుని, వశము సేసి నిఖిలవనచరేంద్ర
పదవియందు నెమ్మిఁబట్టంబుఁ గట్టెఁ బ్ర, స్ఫారయశుఁడు రామభద్రుఁ డతని.

వ. ఆవనచరుండును రామునకుఁ గృతాంజలి యై దేవా యీఘర్మసమయశేషంబును
ఘనసమయంబునుం గడపి మఱి సీతాన్వేషణంబునకు నుత్సహించుట లెస్స యని
యయ్యిరువురకును మాల్యవత్కూటంబున నివాసంబుఁ గావించి తానును
గిష్కింధాపురంబున నుండె నంత. 387

మ. ఉరుఘర్మాఘవిఘాతసంవిహితవిశ్వోల్లాస మై సంచల
త్సరసాంభోదనినాదతూర్యరవ మై చంచద్బలాకాగరు
ద్భరలీలానవచామరస్ఫురణ మై పర్జన్యసామ్రాజ్య మొ
ప్పె రమామందిర మై యుదగ్రశిఖినీపింఛాతపత్రంబులన్. 388

వ. ఆసమయంబున నక్కడ. 389

క. దానవనాయకుచెఱఁ బడి, జానకి యురిఁ బడినహరిణశాబముపోలెన్
మానిని సంతతభర్తృ, ధ్యానవివశ యగుచు నుండెఁ దాపం బెసఁగన్. 390

వ. అమ్మగువ కాపున్నదనుజాంగనలు త్ర్యక్షియు లలాటాక్షియుఁ ద్రిస్తనియు నేక
పాదయు దీర్ఘజిహ్వయు నజిహ్వయుఁ ద్రిజటయు నేకలోచనయు మొద లయిన
వారు పెక్కండ్రు వికృతాకారంబులతోడ నయ్యబలం బరివేష్టించి యహర్నిశం
బును నేమఱక యదల్చువారును బెలుచం దిట్టువారును ఖరోష్ట్రనిస్వనంబులు
సెలంగ వెఱపించువారును ద్రిభువనాధిపతి యైనమనదశగ్రీవు నొల్లనియీదుష్ట
మానుషిం బట్టి చెండి కండలు దిందు మనువారును నై యున్న నయ్యుగ్మలి గళ
ద్బాష్పయు గద్గదకంఠియు నగుచు నారాక్షసస్త్రీల కి ట్లనియె. 391

తే. అమ్మలార మీవలసినయట్ల చేయుఁ, డింక నేటికిఁ దడయంగ నేను రాముఁ
దప్ప నొండొకపురుషుఁ జిత్తమునఁ దలఁప, నింత నిజము నాకును జీవితేచ్ఛ లేదు.

వ. అనిన నజ్జానకి తెగువ రావణున కెఱింగింపఁ గొందఱు సనిరి మఱియు సంతతప్రి
యవాదినియు ధర్మజ్ఞయు నై నత్రిజట యనురక్కసి రామాంగనం జేరం జని యి
ట్లనియె. 393

త్రిజట దనస్వప్నవృత్తాంతము సీతతోఁ జెప్పుట.

సీ. అమ్మ నీ కెంతయు హర్షంబుగా నొక, వార్త నే నెఱిఁగింతు వనజవదన
నామాట నిజముగా నమ్ముము వినవె య, వింధ్యుండు నా నొక్కవృద్ధదైత్యుఁ
డనఘుండు రామహితాన్వేషి యై నీకు, నాశ్వాస మొనరింప నబల నన్నుఁ

బనిచెను విను నిన్నుఁ । బాసినపిదప ల, క్ష్మణుఁడును దాను సేమమునఁ గలసి

ఆ. యఖిలవానరేంద్రుఁ । డైనసుగ్రీవుతోఁ, జెలిమి సేసి యిపుడు । శీఘ్రమునన
వీరవరుఁడు నిన్ను । విడిపించుపనికి నై, [1]యొదవి యుత్సహించి । యున్నవాఁడు.

వ. రావణునకు రంభానిమిత్తం బయిననలకూబరుశాపంబు గలదు గావున నీయందు బలాత్కారంబు సేయ రాదు నీకు వీనివలనిభయంబు వలదు మఱి యిద్దురాత్మునకుం జేటు దెలుపునట్టిదుస్స్వప్నంబుఁ గలిగె నది యాకర్ణింపుము. 395

క. ఖరములఁ బూనినరథమున, విరిసినవెండ్రుకలు వెంట । వ్రేలఁగ దశకం
ధరుఁడు బహుళతైలాప్లుత, శరీరుఁ డై దక్షిణంబు । సనఁ గనుఁగొంటిన్. 396

తే. అతనిచుట్టును గుంభకర్ణాదు లెల్ల, నరుణమాల్యానులేపను । లై వికీర్ణ
పతితకేశు లై నగ్ను లై । పరఁగఁ బ్రేత, పతిదిశకు నేఁగుగతి గానఁ । బడిరి నాకు.

ఉ. [2]చారుసితోష్ణవారణల । సత్సితమాల్యసితాంగరాగుఁ డై
ధీరగుణోత్తరుం డధిక । ధీనిలయుండు విభీషణుండు వి
స్ఫారసితాద్రిశృంగమున । భవ్యుఁడు మంత్రిచతుష్టయాన్వితుం
డై రమణీయలక్ష్మిఁ బొలు । పారఁగ నేఁ గలఁ గంటి నుగ్మలీ. 398

చ. తనసితకీర్తి విశ్వవసు । ధాగగనాంతరపూరితంబు గా
ఘనభుజుఁ డున్నతద్విరద । కంధరసుస్థిరుఁ డై ముదంబుతో
ననుజుఁడు దాను రాఘవకు । లాగ్రణి సన్మధుసిక్తపాయసం
బొనర భుజింపఁ గంటి విక । చోత్పలలోచన నిక్క మింతయున్. 399

క. పులిచేత వ్రేటువడి మైఁ, గలయఁగ నెత్తురులు గ్రమ్మఁ । గా నేడ్చుచు ని
మ్ముల నుత్తరాభిముఖ వై, కలుషితగతి నరుగ నిన్నుఁ । గనుఁగొంటిఁ గలన్. 400

క. నాకల నిక్కల యయ్యెడు, శోకింపకు మమ్మ నీవు । సుందరి పుణ్య
శ్లోకు జితశోకు నతులవి, వేకుం బ్రియుఁ బొందఁ గలుగు । వేగమ నీకున్. 401

ఆ. అనినఁ ద్రిజటపలుకు । లవి నిక్కములు గాఁగ, వగచి సీత గొంత । వనట దక్కి
యాసతోడ నుండె । నట దశవదనుండు, సీతఁ దలఁచి వివశ । చిత్తుఁ డగుచు. 402

వ. తాను దేవదానవగంధర్వాదిసంఘంబుల నెల్ల జయించియుం గందర్పదర్పంబు వారింప నోపక యాక్షణంబ దివ్యమాల్యాంబరాభరణభూషితుం డై సంచారశీలం బైనకల్పపాదపంబునుంబోలె నొప్పియుఁ దనయొప్పు సీతకుఁ బితృవనంబునందలి వటభూరుహంబునుంబోలె నతిభీషణం బగుచుండ నశోకవనమధ్యంబు సొత్తెంచి రోహిణీసమీపంబునకు వచ్చుశశైశ్చరుండునుంబోలె జానకిం జేరం జనుదెంచి ప్రణయపూర్వకంబుగా ని ట్లనియె. 403

క. ఏల మదిరాక్షి వలవని, జాలిం బడి నవసెదవు ల । సద్భూషణలీ
లాలంకృత వై ననుఁ గృప, నేలికొనం గాదె వేయు । నేటికి నింకన్. 404

---

1. క. గ. జ. యొదవ నుత్స. 2. అ. చారుసితాంబరుండు విల ♦ సత్సిత.

చ. అనిమిషయక్ష.రాక్షసవియచ్చరకిన్నరపన్నగాసురాం
గనలఁ గరంబు చిత్తమునఁ గైకొన కే ననురాగలీలమై
నిను మది నాదరించు టిది నీ దగుభాగ్యము గాదె యింతయుఁ
వనిత యెఱుంగ నైతి గరువంపువిచారము లేదు నీయెడన్. 405

ఉ. రాముఁ డనంగఁ బేర్మియును రాజ్యముఁ గోల్పడి కానలోన దుః
ఖామయమగ్నుఁ డై నరయొకయల్పమనుష్యుఁడు వానిపైఁ గడుం
బ్రేముడి సేయుచుఁ వగపు పెల్లునఁ జిత్తము దల్లడిల్లఁ గా
నీమెయి నుండునీయునికి యేసుఖ మందు లతాంగి చెప్పుమా. 406

వ. ఏను సకలలోకేశ్వరుండ నాకుం గింకరులై పదునాలుగుకోట్లు నిశాచరభటులును నిరువదియెనిమిదికోట్లు రాక్షసులును నెనుబదియాఱుకోట్లుయక్షులును వర్తిల్లుదురు నిఖిలధనాధ్యక్షుం డయినయక్షేశ్వరుండు నాయగ్రజుండు బ్రహ్మసమానుం డగువిశ్రవసుండు మదీయజనకుండు గుబేరునకు వినోదపాత్రంబు లైనగంధర్వాప్సరోగణంబులు నన్ను సేవించుఁ బంచమలోకపాలుం డని నన్నుఁ ద్రిభువనంబులుఁ గీర్తించు భక్ష్యభోజ్యాదివస్తువులును సురేశ్వరగృహంబునం దెట్లట్ల నా గృహంబున నక్షయంబు లిట్టినావిభవం బింతటికిని మదీయజీవితంబునకు నధీశ్వరి వై సుఖంబున జీవింపు మనిన విని వైదేహి క్రోధశోకవ్యాకుల యగుచు వానిదెసం జూడక యొక్కతృణాంకురం బుపలక్షించి యిట్లనియె. 407

సీ. అకట పరాంగన నబలఁ బతివ్రతఁ, బరికింపఁగా మర్త్యభామ నేను
రాక్షసుండవు నీవు రాగంబు మది నించు, కయు లేనినాదుసంగమమునందుఁ
గలిగెడునట్టిసౌఖ్యం బెంత యదియును, గాక యాద్యుం డైనకమలగర్భ
పౌత్త్రుఁడ నని లోకపాలతుల్యుఁడ నని, హరసఖుం డైనధనాధినాథు
ఆ. భ్రాత నని భవత్ప్రభావంబు సెప్పితి, విట్టినీవు ధర్మ వెఱఁగి దురిత
వర్తనంబు విడువ వలదె సిగ్గేది యి,ప్పగిదిఁ బ్రల్లదములు వలుకఁ దగునె.

వ. అని పలికి జానకి యుత్తరీయసంవృతవదన యై యతికరుణంబుగా నేడ్చిన నద్దురాత్ముఁడు వెండియుఁ గొన్నిదుర్వచనంబులు పచరించి యనంతరంబ యంతర్ధానంబు నొందె నప్పొలఁతియు నెప్పటియట్ల రాక్షసీరక్షిత యై యుండె నని మార్కండేయుండు ధర్మరాజునకు నిర్దేశించిన తెఱంగు వైశంపాయనోక్తం బైన యాఖ్యానంబు విఖ్యాతమాధుర్యమనోహరంబుగా. 409

క. విమలక్షాత్త్రగుణోన్నత, విమలాదిత్యాత్మజన్మవిలసత్కమలా
రమణీకరకమలోజ్జ్వల, విమలాంబుజరేణురాగ[1]విలసితవక్షా. 410

వనమయూరము. భూసురకదంబసురభూరుహ వికాసో
ద్భాసితకృపారసవిపాక సుగుణైకో

---

1. క. వికసిత-రక్షా-దీక్షా.

ల్లాస హరహాసమృగకలాంఛనమృణాళీ
హాసినవకీర్తివిసరాకలితలోకా. 411

గద్యము. ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దారణ్యపర్వంబునందు దుర్యోధనుప్రాయోపవేశంబును బాతాళగతు లయిన దానవు లతని నాశ్వాసించుటయు వైష్ణవయాగప్రవర్తనంబును బాండవులు గ్రమ్మఱం గామ్యకవనంబున కరుగుటయు వ్రీహిద్రోణాఖ్యానంబును ద్రౌపదీహరణంబును జయద్రథుభంగంబును రామాయణకథాప్రవృత్తియు నందు రామరావణులజననంబును రాఘవువనప్రస్థానంబును సీతాపహరణంబును సుగ్రీవమిత్రత్వంబును వాలివధయును ద్రిజటాస్వప్నకథనంబును రావణుదుష్టవచనంబులు నన్నది షష్ఠాశ్వాసము. 412

శ్రీ

శ్రీమదాంధ్రమహాభారతము

ఆరణ్యపర్వము, సప్తమాశ్వాసము.

కర సోమాన్వయర
త్నాకరహిమధామ ధార్మికాంచితవినయో
త్సేక భువనైకవీర మ
హాకావ్యరసప్రయోజనారూఢమతీ. 1

రాముఁడు లక్ష్మణుని సుగ్రీవునొద్దకుఁ బంపుట.

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నట్లు పరమతపోనిలయుం డయిన
మార్కండేయుండు పాండవేయులతో మఱియు నిట్లనియె నంత మాల్యవ
త్కందరమందిరుం డైనదశరథాగ్రనందనుండు నవకందళితసుందరంబులును
జనకనందినీవియోగదుస్సహంబులు నగుఘనసమయదివసంబుల నెట్టకేనియుం
గడపి నిరతిశయసాంద్రచంద్రాతపస్నపనశీతలసమీరవాహ్యమానవినిద్రకుముద
కేదారసౌరభ్యనిర్భరంబులు నతిదీర్ఘయామంబులు నైనశారదయామినులు లప
నయింప నోపక యొక్కనాఁడు దమ్మునిం జూచి యిట్లనియె. 2

సీ. చూచితే లక్ష్మణ సుగ్రీవుకొఱగామి, యమ్మెయిఁ దనపగ యడఁచి మనము
కపిరాజ్య మిచ్చినఁ గైకొని యింద్రియ, సుఖముల నెంతయుఁ జొక్కి నేఁడు
మనదిక్కు దలఁపఁడు మనతోడఁ బల్కిన, సమయంబుఁ జెల్లింపఁ జనదె తనకుఁ
గడుఁ గృతఘ్నత సేసెఁ గపికులాధముఁడు నీ, వనఘ కిష్కింధకు నరుగు మిపుడ
ఆ. యద్దురాత్ముఁ గృపణు నాత్మీయకార్యత, త్పరుని నధికరాగపరవశాత్ముఁ
దొడరి వాలి చనినత్రోవనే యనిచి ర, మ్మేల తడయ మనకు నింక నిచట. 3

ఆ. నీవు సనకమున్న నెఱితోడ మనకార్య, మునకుఁ దగినయత్నములు ఘటించి
యుండెనేని వాని నొం డేమియుం జేయ, వలదు తోడితె మ్మవార్యశౌర్య. 4

చ. అనుడుఁ దదాజ్ఞఁ బూని యతఁ డాతతకార్ముకహస్తుఁ డై రయం
బునఁ జనియెం గపీశ్వరునిప్రోలికి వాఁడును సంభ్రమంబుతో
ననుఁగులుఁ దాను రాజసుతు నర్థి నెదుర్కొని మ్రొక్కి యర్ఘ్యపూ
జన మొనరించుడు విభుని శాసన మాతఁడు సెప్పె వానికిన్. 5

వ. చెప్పిన విని భయకంపితగాత్రుం డగుచుఁ గమలమిత్త్రపుత్త్రుండు సుమిత్త్రాపుత్త్రున కిట్లనియె నయ్యా యే నేల కృతఘ్నుండ నగుదు జానకి నన్వేషించుటకునై బలవంతులు బుద్ధిమంతులు నగువానరుల ననేకుల నలుదెసలకుం బనిచితి వారును సకలవనశైలసాగరగ్రామనదీసహితం బైనభూచక్రంబునం దెల్ల రోసి యొక్కమాసంబులోనం గ్రమ్మఱి వచ్చువా రై సమయంబు సేసి పోయి రింక నైదు దినంబులు గొఱంత యింతియ యటమీఁద వైదేహివార్త గొనుచు దేవరం గొలువ వచ్చువాఁడ నై యున్నవాఁడ ననినం బ్రీతుం డై లక్ష్మణుండు. 6

క. వానిం దోడ్కొని చని యా, భూనాథునిఁ గానిపించి । పొందుగఁ దత్కా
ర్యానుష్ఠానవిశేషము, దా నెఱిఁగించుటయు విభుఁడు । దద్దయు నలరెన్. 7

వ. పదంపడి కొన్నిదివసంబులకుఁ బూర్వపశ్చిమోత్తరదిక్కులకుం జనినవనచరులరుగుదెంచి రాఘవుఁగని దేవా సకలసాగరమేఖలావలయితంబైనభూవలయంబంతయు వెదకితిమి మీదేవిం బొడగాన మని చెప్పిన నతండు దుఃఖితుం డయి దక్షిణదిశకుఁ బోయినవానరులవలన వైదేహితెఱం గెఱుంగుదు ననునాసం జేసి ప్రాణంబులు ధరియించి యుండె నంత వెండియు నొక్కమాసంబు సెల్లిన (నతండు దుఃఖితుండై యుండఁ) గొందఱు వనచరులు పఱతెంచి సుగ్రీవుం గని యిట్లనిరి.

సీ. నీవును వాలియు । నేఁడును నాఁడుఁ బ్రి, యంబునఁ బాటించు । నాఁకతోఁట
మధువనం బదె నేఁడు । మనయంగదుండును, హనుమంతుఁడును మొద । లైనవారు
బలువిడిఁ జూఱాడి । ఫలము లానెదరు త, ద్రక్షకు లగుమమ్ము । రయముమీఱ
భంగించి రనవుడు । భానునందనుఁ డాత్మ, నంగదప్రముఖులు । యామ్యదిశకుఁ
తే. జనినవారలు గావున । జనకపుత్త్రిఁ, గనినయుబ్బది గాఁబోలుఁ । గాక యిట్లు
సేయ వెఱవరె పతికార్య । సిద్ధి సలుపు, జనుల కీచన వెందును । జనున కాదె. 9

వ. అని యూహించి తత్ప్రకారంబు రఘుపతికిం జెప్పె నంత. 10

ఉ. తేనెలు గ్రోలి క్రోలి కడుఁ । దియ్యనికమ్మనిపండు లింపు సొం
పూనఁగ నాని యూని పర । పొందిననీడలు మెచ్చి మెచ్చి మం
దానిలశైత్యసౌరభస । మగ్రతకుం గడుఁ జొక్కి చొక్కి యు
ద్యానమునందు మారుతసు । తప్రముఖుల్ విహరించి తృప్తులై. 11

వ. అందఱుం గూడుకొని చని సుగ్రీవలక్ష్మణసహితుం డై యున్నజననాథుం గని దండప్రణామంబు సేసినం గాకుత్స్థకులప్రదీపకుండు వారలముఖవర్ణవిశేషంబు లుపలక్షించి సీతం గనినవార కా నిశ్చయించె నప్పు డత్యంతమతిమంతుం డయిన హనుమంతుండు రాఘవునకుఁ గృతాంజలి యై యిట్లనియె. 12

క. దేవిఁ బొడగంటి నేను ధ, రావల్లభ శైలసరిద । రణ్యనగరపా
రావారకలిత మగువసు, ధావలయము వెదకి వెదకి । దక్షిణపుదిశన్. 13

హనుమంతుఁడు రామునితో సీతం జూచినవృత్తాంతంబు సెప్పుట.

తే. అవధరింపుము దేవ మేమందఱమును, నేకముఖమునఁ దోలితోలి యుందునందు
నరయుచును బోయియొక్కెడ నతివిశాల, మైనభూవివరముగంటి మద్భుతముగ.

వ. కని దానిం బ్రవేశించి నిరంతరతిమిరసంవృతంబును బహుకీటసంకులంబును నైన మార్గంబున ననేకయోజనంబులు సనునెడ ముందట నర్కప్రకాశం బైనపురంబు గానంబడియె నందొక్కతాపసాంగన యుండి మమ్ము నాదరించి తనపేరు ప్రభావతి యనియును నప్పురంబు మయునిపురం బనియునుం జెప్పి మధురంబు లయిన భక్ష్యభోజ్యంబు లొసంగిన దృప్తుల మై తదుపదిష్టమార్గంబున మహీవివరంబు నిర్గమించి సహ్యాదర్దురశైలంబులు గడచి మలయశైలశిఖరం బెక్కి. 15

స్రగ్ధర. లీలం గల్లోలభాగోల్లిఖితగగన మై లీననానాకులీర
వ్యాళోగ్రగ్రాహమీనావళుల నెసఁగి దుర్వారవారోఘగంభీ
రాలంఘ్యప్రాణవేగం బగుచు బహుతరాయామవిస్తార మై బి
ట్టాలోకింపంగ నుగ్రం బగుజలనిధి నంతంతటం గంటి మంతన్. 16

క. కని యిది రత్నాకర మి, వ్వననిధిసీమమునఁ గల్గు వసుమతిలోనన్
జనకసుత వెదకి కానము, చన దివ్వారాశి దాఁటి చన నెవ్వరికిన్. 17

ఉ. భూమితనూజఁ గాన మని పోయి రఘూద్వహుతోడఁ జెప్పి య
బ్భూమిపుచిత్త మాతురతఁ బొందఁగఁ జేయుటకంటెఁ జూడఁ గా
నీమెయిఁ జావు మేల మన కేల విచారము లింక నంచు నం
దేము గడంగి యందఱము నేకమతం బగునిశ్చయంబుతోన్. 18

వ. అనశనవ్రతంబు సంకల్పించి నియతచిత్తుల మై యుండి రాఘవుకార్యార్థం బై తెగినజటాయువు గృతార్థుం డయ్యె మనము నట్టిపుణ్యలోకంబు వడయుద మని పలుకుచున్నయెడ. 19

క. గిరిశృంగతుంగవిగ్రహుఁ, డురుతరసత్త్వుఁడు విహంగమోత్తముఁ డం దొ
క్కరుఁ డొయ్యన మాయున్నెడ, కరుదుగఁ జనుదెంచి వికళితాశ్రుండగుచున్.

సీ. అయ్యలార జటాయు వని పల్కెదరు మీర, లెవ్వరు సెప్పరే యేను వాని
కగ్రజుండ ననూరు నాత్మజన్ముల మేము, సంపాతి నాపేరు సమ్మదమున
నేనును దమ్ముండు నినమండలమునకుఁ, జనువేడ్క నొకనాఁడు చదలి కెగసి
చనఁ జనఁ దీవ్రాంశుసంతాపమునఁ జేసి, కమరె నాఱెక్కలు గమర వయ్యె

తే. ననుజుపక్షమ్ములే నిమ్మహాచలమున, నాఁటఁగోలె నెచ్చటికిఁ జనంగ నేర
కున్నవాఁడ నాతమ్ముఁ డెట్లున్నవాఁడొ, యెఱుఁగ నెఱిఁగింపరే నాకు నిష్టమెసఁగ.

వ. అనిన నేమతనికి భవదీయవృత్తాంతంబును రావణుండు దేవిం గొనిపోవుటయు దదర్థంబు రావణుతో జటాయువు సమరంబు సేసి యీల్గుటయుఁ జెప్పిన విని దుఃఖితుం డై సంపాతి యస్మదీయప్రవర్తనం బేర్పడ నడిగి మా కిట్లనియె.

ఉ. రావణు నే నెఱుంగుదుఁ బరాక్రమదుస్సహుఁ డన్నిశాచరుం
డీవనరాశిమధ్యమున నిచ్చటికిన్ శతయోజనంబులన్
భూవిదితంబు లంక యనుప్రోలు తదీయనివాస మచ్చటన్.
భూవరు దేవిఁ గాన నగుఁ బొం దరయుండు కృతప్రయత్నులై. 23

క. అని యతఁడు సనిన నందఱు, మును సాగరతరణకార్యమునకు నుపాయం
బొనరఁ దలపోయు నెడ నే, నని యుత్సాహంబు సేయఁడయ్యె నొకండున్. 24

మ. జననాథోత్తమ యేను బూని భవదాజ్ఞాలీలచెల్వంబు మ
జ్జనకుం డైనసమీరదేవుకృపయున్ సత్త్వోన్నతిం జేయఁగా
ఘనవాస్తుంగతరంగసంగతమహాగ్రాహగ్రహాత్యుగ్రద
ర్శనమై పేర్చుపయోధి దాఁటితి జనాశ్చర్యైకసంపాది నై. 25

ఉ. ఆలవణాబ్ధిమధ్యమునయందుఁ ద్రికూటనగంబుమీఁద ను
త్తాలవిశాలసాలమణిధామసముజ్జ్వల మైనలంక యన్
ప్రోలిని గంటి నెంతయు నపూర్వము దద్విభవంబు దేవ య
చ్చో లలితాంగి నారసితిఁ జొచ్చి [1]యనేకవిచేష్టితంబులన్. 26

వ. అరసి యొక్కెడ రావణాంతఃపురం బయినయశోకవనంబునందు. 27

సీ. కన్నీరు జడిగొని క్రమ్మఁ బ్రాఁ కెక్కిన, కమ్రకపోలభాగములు గలిగి
యవశమై యొఱగినయంగవల్లిక పొంత, నున్నభూమీరుహంబూఁత గాఁగ
వెడలునిట్టూర్పులవేఁడిమిఁ బగిలిన, యధరపల్లవము గాకరాఁకుఁ బోలఁ
దలఁపులసందడిఁ దందడించినతాల్మి, కదలు శిరఃకంపగతుల బెరయ

ఆ. నున్నపుణ్యమూర్తి నుత్తమసౌందర్య ,నవనతాస్య నార్త యైనదానిఁ
గని విదేహతనయ గా నెఱింగితి నేను హా రఘుప్రవీర యనుచు నడల. 28

క. వినయమున దేవిఁ జేరం, జని యభివాదనము సేసి జానకి రఘునం
దనుదూత నేను మారుత, తనయుఁడ వానరుఁడ నిన్నుఁ దడవ నిచటికిన్. 29

వ. అరుగుదెంచితి రామలక్ష్మణు లత్యంతకుశలంబున నున్నవారు వానరేశ్వరుం డయినసుగ్రీవుండు వారితో సఖ్యంబు సేసి తత్కార్యంబు దీర్పం బూనె నింక మనలక నీహృదయేశ్వరుండు సను దెంచు నూఱడిల్లుము. 30

క. రక్కసుఁడఁ గాను జుమ్మీ, నిక్కపువానరుఁడ నేను నీమదిలోనం
దక్కు మనుమాన మనవుడు, నొక్కింత దలంచికొని సకముత్సుక యగుచున్.

వ. అద్దేవి నా కిట్లనియె నన్నా నిన్నెఱింగితి నది యెట్లనిన రామహితాన్వేషి యగు వాఁ డవింధ్యుం డనువృద్ధరాక్షసుండు మున్నయింతయుఁ ద్రిజటచేత నాకెఱింగించె నతనిపలుకులు దప్పవు రాఘవుండు సుగ్రీవసహాయుండయియునికిఁ గలిగినది గావున నింకఁ దడయక యవ్వీరవరుం దోడ్కొని వచ్చి నాకుం బ్రియంబు సేయు

1. అ. నవసిన. 2. అ. యనేకవిధంబులం దగన్.

ము నీకుఁ గార్యసిద్ధియయ్యెడు మఱుగు మని తనశిరోభూషణం బయిన యీరత్నం
బు మీకు నభిజ్ఞానార్థంబుగా నాచేతి కిచ్చి మఱియుఁ జిత్రకూటచరితం బైన
కృతకవాయసకథయును జెప్పిన నేను లంకాపురదాహంబు సేసి యిట దేవర
కింతయు విన్నవింప వచ్చితి నని చెప్పి హనుమంతుండు జానకీహృదయంబు మూర్తి
మంతం బైనపగిది నున్న యమ్మహామణిరాజచూడామణి నప్పగించిన. 32

ఆ. అమ్మనోజ్ఞరత్న మక్కునఁ గదియించి, పులక లెగయఁ గొంతప్రొద్దు విభుఁడు
జానకీకుచాగ్రసంగమసుప్తుఁ డై, నట్ల యుండె ముకుళితాక్షుఁ డగుచు. 33

వ. ఇట్లు రాఘవుండు సీతావృత్తాంతంబు విని తత్సమాగమకుతూహలవ్యగ్రుం డై
సుగ్రీవుం జూచి దండున కాయితంబు సేయు మనినఁ బ్రసాదం బని యతండు
నలుదిక్కులం గలవానరనాయకులం బిలువం దొడంగిన. 34

వానరవీరులు నానాదేశంబులనుండి సుగ్రీవునొద్దకు వచ్చుట.

క. శతకోటిద్వయహరిపరి, వృతు లై చనుదెంచి ఘోరవీరులు ధీరో
ద్ధతులు గజుఁడు గవయుఁడు వి,శ్రుతముగ రఘుపతికిఁ దోడు సూపిరి గడఁకన్.

క. అఱువదికోటులు గపివరు, లుఱక జగత్త్రయము నొకట నువ్వెత్తుగొనం
దఱిగొన్నయట్లు నడవఁగ, నెఱసి కుముదుఁ డరుగుదెంచి నృపవరుఁ గనియెన్.

ఉ. కోటిసహస్రసేన దనుఁ గొల్వఁగ వానరకోటి కెల్లఁ దా
మేటి మహాభుజుండు నిరమిత్రుఁడు మిత్రసహాయుఁ డై నలి
వీటికి నుబ్బగాఁ జటులవేగ[1]సముచ్ఛ్రితపుచ్ఛగుచ్ఛవి
స్ఫోటితదిగ్విభాగుఁ డగుచుం జనుదెంచె సుషేణుఁ డత్తఱిన్. 37

క. గణుతింప రానివానర, గణములతో దధిముఖుండు కాకుత్స్థకులా
గ్రణికిఁ బ్రియంబుగ వచ్చె ధ, రణిభాగము వాహినీచరణచలితముగాన్. 38

ఆ. శతసహస్రకోటిసంఖ్యలమెలువులు, గొలువ జలదనీలఘోరమూర్తి
జాంబవంతుఁ డతులసత్త్వుఁ డై చనుదెంచె, భూపవరుని కార్యమునకుఁ బూని.

వ. మఱియు ననేకు లనేకసహస్రసంఖ్యలబలంబులతోడం జనుదెంచి రిట్లు గూడిన
కపివీరులు వివిధాకారు లపారబలశౌర్యసారు లతిఘోరంబుగాఁ బేర్చి నిగుడుచు
మగుడుచుం దాఱుచుఁ బాఱుచుం దిరుగుచు నుఱుఁకుచు మలయుచుఁ బొల
యుచు మత్తిల్లి గిరిగుహాలయంబులందును దరువనంబులందును సరిదుపాంతం
బులయందును నానందంబున విహరించుచుండిరి తదనంతరంబ. 40

మ. ప్రభ నొప్పారి యనుంగుఁదమ్ముఁడు మహాభాగుండు సౌమిత్రి వీ
తభయుం డై కొలువం గపీంద్రబలసంతానంబుతో నుద్ధతిన్
శుభలగ్నంబున రాఘవుండు గదలెన్ సుగ్రీవసాహాయ్యసం
ప్రభవోత్సాహ మెలర్ప దర్పితరిపుప్రాలేయతిగ్మాంశుఁ డై. 41

1. అ. సముంచితపుచ్ఛ.

ఉ. ఆహరివీరవాహినుల కన్నిటికిం మొగ మై మరుత్సుతుం
డాహవదోహళుం డమరె నంగదనీలనలాదివీరు లు
త్సాహము మీఱ [1]నయ్యయిదెసం దగుకావలి యై సముగ్రస
న్నాహమహోగ్రతం జనిరి నాకవిరోధివధాభిలాషు లై. 42

వ. ఇట్లు నడచి యెడ నెడం బ్రభూతవన్యఫలజలాశయంబు లగుగురుప్రదేశంబుల విడియుచుం గపిసైన్యంబు గతిపయదినంబులకు దక్షిణోదధితీరంబు సేరి రెండగు వారాశియుంబోలె ఘూర్ణిల్లు చుండె నంత రాఘవుండు రవితనయుం జూచి యి ట్లనియె. 43

క. మనబలమును నతిబహుళము, వననిధియును దుస్తరంబు వానరవర యి
వ్వననిధిఁ గడచునుపాయము, మన కొక్కటి నిశ్చయింపుమా తగుభంగిన్. 44

తే. అని విచారించునెడఁ గొంద ఱధిపుఁ జూచి, జడధి బలితంపుఁ దెప్పలఁ గడత మనిరి
ఘనపుఁగలములు సమకట్టి కడత మనిరి, కొంద ఱంతయు విని రఘునందనుండు.

సీ. అల్లన నగుచు నిట్లనియె మీ చెప్పుటల్, దగినయుపాయంబు లగున యయిన
నగణితం బై నయీహరిసైన్యముల కెల్లఁ, గలములుఁ దెప్పలు వలయునన్ని
సమకట్టు టరయ నశక్యంబు శతయోజ, నంబులపర వైనయంబురాశిఁ
గలములఁ దెప్పలఁ గడచుచో రిపుకోటి, యెదురునఁ బైఁబడి పొడువ కున్నె

ఆ. యాదియుఁ గాక యల్పు లగువణిగ్జనముల, యోజ శూరతతికిఁ [2]దేజ మగునె
కాన నాదుమతము గా దివ్విధంబు నా, మనసునిశ్చయంబు వినుఁడు మీరు.

చ. వ్రతము ధరించి నిష్ఠ నుపవాసవిధిం గొలుతుం సముద్రు నా
కితఁడు [3]ప్రియంబుతోడఁ దెరు విచ్చుట యంతన కల్గెనేని మే
లితరునిఁ గా నసుం దలఁచె నేని సమానుషరోషవేషదీ
పితశరవహ్ని నిజ్జలముఁ బీల్చెదఁ బ్రేల్చెద నొక్క వ్రేల్మిడిన్. 47

రాముఁడు దర్భశయనం బై సముద్రుఁ బ్రార్థించుట.

వ. అని పలికి దశరథాగ్రసూనుండు దానునుదమ్ముండును నుపవసించి దర్భశయనుఁడై జలధీంద్రు నుపాసించు చున్నంత సముద్రుండు సకలజలచరప్రకరపరివారుం డై రాఘవునకుం బొడసూపి యయ్యా నీవలనఁ బ్రీతుండ నైతి నీ కెయ్యది ప్రియంబు సేయుదుఁ జెప్పు మనిన నతండు నాకు లంకపై నరుగం దెరు విచ్చునది యీని నాఁడు సూర్యనిభంబు లయినమదీయదివ్యాస్త్రంబుల నిన్ను శోషింపం జేయుదు ననిన విని సరిత్పతి రఘుపతి కి ట్లనియె. 48

సీ. జననాథ నీకార్యములకు నే విఘ్నంబు, గావింప నోడుదు నేవిధమున
వినుము నావాక్యంబు జను లెల్ల నెఱుఁగ నీ, కిత్తతె నేఁ దెరు విత్తునేని
నిల నెల్లవాఁడును విలసితదివ్యాస్త్ర, బలమున సాధింపఁ దలఁచు నన్ను

1. క. నయ్యెయిదెసం. 2. అ. నైజ మగునె. 3. జ. ప్రసన్నుఁ డై తెరువు నిచ్చుట.

మీయందుఁ గపివీరుఁ - డాయతమతి విశ్వ, కర్మసూనుఁడు శిల్పి - కర్మవిదుఁడు

ఆ. నలుఁడు నాఁగ నొకఁడు - గలఁడు వాఁ డొలసినా, యందుఁ దరులు గిరులు - నొండవైన
నవి ధరింతు నేను - దివిరి నీ కది సేతు, వుగఁ గడంక నరిగి - పగఱ గెలుము. 49

వ. అని యతని నొడంబఱిచి సముద్రుండు సనుటయు నమ్మహీపతి నలు రావించి సేతు బంధనంబు సేయ నియోగించిన ననేకవానరసహస్రంబులు నలుదిక్కులకుం బఱచి గిరిశిఖరంబులుఁ దరువులు విఱిచి తెచ్చి యిచ్చుచుండ నన్నలుండు మున్నీటి యందు శతయోజనాయామంబును దశయోజనవిస్తారంబునుం గా నతిదృఢం బగు సేతుబంధనంబు నిర్మించె నయ్యవసరంబున. 50

ఆ. అన్నతోడ నలిగి - యాప్తులుఁ దాను వి, భీషణుండు వినయ - భూషణుండు
నెమ్మి నరుగుదెంచి - నృపశిరోమణి రాము, శరణుఁ జొచ్చె భక్తి - భరితుఁ డగుచు.

క. ఆరాక్షసవృషభునియా, కారము నింగితముఁ జూచి - కాకుత్స్థకులో
దారుఁ డతని నతిధార్మికుఁ, గా రూపించి ముద మొప్పఁ - గైకొని కరుణన్. 52

ఉ. వానికి దానవేంద్రవిభ - వంబు సమస్తము నిచ్చువాఁడ గాఁ
బూని ప్రతిజ్ఞ సేసి కృత - పుణ్యుఁడు లక్ష్మణుతోడి చెల్మియుం
వానికి నిచ్చి చెచ్చెర న - వారితవానరసైన్యయుక్తుఁ డై
వానిఁ బురస్కరించుకొని - వారిధి దాఁటె మహోగ్రలీలతోన్. 53

వ. ఇట్లు సేతుమార్గంబున సాగరోత్తరణం బాచరించి త్రికూటపర్వతం బెక్కి లంకానగరంబుచుట్టును శిబిరంబులు సంఘటింపం బంచిన. 54

క. తాళైలాగురుసాలర, సాలతమాలామ్రనింబ - జంబూజంబీ
రాలంకృతలంకావన, జాలంబుల విడిసె వృక్ష - చరసైన్యంబుల్. 55

వ. తదనంతరంబ రావణుచారు లయిన శుకసారణు లనువారలు వానరాకారంబులు దాల్చి శిబిరంబునఁ గ్రుమ్మరుచున్న నెఱింగి విభీషణుం డారాక్షసులం బట్టించి రామునకు సమర్పించిన నతండు వారికి నిజసైన్యం బంతయుం జూప నియోగించి విడిచి పుచ్చుటయుం జని యయ్యిరువురు నమరవైరిం గని కపిసైన్యంబు దుర్జయం బనియును రామలక్ష్మణుల తేజోమూర్తివిశేషంబులును నెఱింగించిన నతండు దాని సరకు సేయక సమరంబునకు మోహరించి. 56

సీ. బద్ధశిలాయంత్ర - బహుళమై యుత్తాలి, తాట్టాలకాభీల - మై యుదగ్ర
కేతుపతాకాప్ర - కీర్ణమై తోమర, [1]ముద్గరాలాతక - ముసలశూల
శరశతఘ్నీముఖ - సాధనోపేత మై, యుగ్రవిగ్రహసార - యోధవీర
సంకులం బై హయ - స్యందనవేదండ, చండ మై సముదిత - సప్తసాల

ఆ. మై యలంఘ్యపరిఖ - మై తృణకాష్ఠజ, లాదివస్తుభరిత - మైన లంక
కధికరక్షఁ జేసి - యప్రమాదంబున, నుండె రిపుజిగీష - నుదితబలుఁడు. 57

1. అ. చక్రముద్గరపట్టిసత్రిశూల.

వ. ఇట రాఘవుండును సుగ్రీవసహితుండై యుండి యంగదుం జూచి నీవు రావణు పాలికిం జని యతనికిం దగినతెఱంగున బుద్ధిగాఁ జెప్పి జానకి విడుచుట మేలని చెప్పు మని పనిచినం బని వూని యవ్వీరుండు. 58

శా. లంకాద్వారము దుర్నివారగమనోల్లాసంబునం జొచ్చి ని
శ్శంకుండై సురశత్రుసైనికసహస్రంబుల్ దనుం జూచి యా
శంకం బొందఁగ లీలమైఁ జని సుహృత్సంఘంబు గొల్వన్ నిరా
తంకుండై కొలు వున్నదైత్యుఁ గని యుద్యన్మూర్తియై యిట్లనున్. 59

అంగదురాయబారము.

క. ఇనకులతిలకుఁడు బాణా, సనవిద్యాగురుఁడు రామచంద్రుఁడు నీతో
నను నిట్లను మని పనిచెను, వినుము తదీయోక్తిభంగి విస్పష్టముగాన్. 60

సీ. అనపరాధులఁ గాననాంతరమ్మున నున్న, వేదతాపసులఁ జంపితి పలువుర
నమరులయాలువుటాండ్రను జెఱ వట్టి, తఖిలలోకములకు నలఁత సేసి
తిది యెల్ల నొకతల యేపు మీఱఁగ నన్నుఁ, జెనకుట యొకతల చెప్ప నేల
బలిమి యొప్పఁగ మంచిబంటవై వెడలుము, కయ్యంబునకు నట్లు గాక యున్న

ఆ. శరణుఁ జొచ్చి నాకు జానకి నొప్పింపు, మొదువెంట బ్రదికి యుండఁ దీఱ
దస్మదుగ్రశరశతాశీవిషంబుల, కెరయ నీదుప్రాణ మింత నిజము. 61

క. మనుజుండనై ననాతెఱఁ, గనుమానము వాయఁ జూడు మాహవభూమిన్
విను రాక్షసు లను నామం, బును నడఁపక యేను రిత్తవో నిచ్చెదనే. 62

వ. అని పలుకుచున్న యంగదుపరుషభాషణంబులకు రోషించినయసురపతి కన్నెఱింగి పలువురు రక్కసులు గ్రక్కున నవ్వాలినందనుం బొదువం బట్టిన బిట్టెగసి హర్మ్యశిఖరంబుపైకి దాఁటుటయుఁ దదాక్షేపవేగంబున నన్నిశాచరులు ధరణీతలంబున జర్జరితశరీరులై పడిరి [1]హరివీరుం డచ్చటనుండి శిబిరమధ్యంబునకు లంఘించి భూనాథునకుఁ దనపోయివచ్చినతెఱంగు విన్నవించెం దదనంతరంబ రాఘవుననుమతంబున. 63

మత్తకోకిలము. తాలసాలశిలాగ్రహస్తు లుదగ్రగోత్రమహీధరో
త్తాలదేహు లనేకవర్ణులు దారితాఖిలదిఙ్ముఖా
భీలవాలశిఖాగ్రు లుగ్రగభీరసత్త్వులు వానరుల్
గాలకల్పులు పేర్చి సంతన గట్టి రాహవకేళికిన్. 64

క. పరువడి మొత్తములై బం, ధురఘోషం బెసఁగఁ బొంగి తోఁతెంచు హరీ
శ్వరబలమునందు ఘనసా, గరవీచివికాస[2]రేఖ గానఁగ నయ్యెన్. 65

మత్తకోకిలము. కోటఁ బన్నిన ఘోరదానవకోటిఁ జుల్కనఁ దోలి య
క్కోటయెల్లెడలున్ మహోగ్రతఁ గూలఁ దాచి సమున్నమ

1. అ. హరివీరుండు నవరత్నమయుం బగు తదీయాస్థానమండపంబునశిఖరంబు రాక్షసనాశహేతుసంభూతమహోల్కయుం బోలెఁ బడఁ దన్ని యాక్షణంబ యచ్చటనుండి. 2. క. పంక్తి.

త్కూటతోరణయంత్రకేతనగోపురాట్టకసంహతుల్
వీటతాటము సేసి రక్కపివీరు లొక్కట మాత్రలోన్. 66

వ. మఱియుఁ బ్రాకారంబుపై నున్నగదాపరిఘకుంతప్రముఖంబులు గైకొని లంకామధ్యంబున వైవం దొడంగిన నాబాలవృద్ధం బగుపౌరలోకంబు హాహాకారవ్యాకులం బై కలంగం బడియె నంత రావణచోదితు లైనదానవులు నానాకోటిసహస్రసంఖ్యు లరిగి యెక్క డెక్కడ యని కపిసముదయంబులం దోలి యెప్పటియట్ల ప్రాకారంబుం గైకొని నిల్చి రప్పుడు. 67

క. మును మర్కటబలములచే, ననయంబును గపిలవర్ణ మైనది మగుడన్
దనుజబలసంవృతం బై, ఘనపటలచ్ఛాయఁ గోట గడు నొప్పారెన్. 68

క. వనచరసేనలు దెరలిన, నినవంశోత్తములు నృపతు లిద్దఱుఁ గయ్య
మ్మునకుఁ గడంగుటయుఁ గ్రమ్మఱఁ, గొనకొని కపిసేన యెల్లఁ గోటకుఁ గవిసెన్. 69

వ. ఇట్లు గవిసినం బ్రాకారరక్షకు లైనరాక్షసవీరులు వారలం జేరనీక శిలాశూలపరశుతోమరాలాతప్రముఖంబులు ప్రయోగించినం గయికొనక వనచరులు వృక్షశిలాప్రకరంబులు పఱిగించుచుం గడంగి ప్రాకారంబుఁ బ్రాకుటయు నయ్యిరుదెఱంగులవారికిం గేశాకేశి యగుసమరం బయ్యెఁ బదంపడి రావణుండు ననుపఁ బర్వతుండును బ్రఘునుండును ఖరుండును గ్రోధవశుండును బ్రరుజుండును ననురాక్షసు లేవు రనేకరాక్షససేనాపరివృతు లయి పురంబు వెలువడి మాయ గావించి యదృశ్యాకారు లై కపిసైన్యంబు నొప్పింపం దొడంగినం గని. 70

ఉ. దారుణవిక్రముండు రిపుదర్పవిభేది మహాస్త్రవేది మా
యారణకోవిదుండు గడు నల్గి విభీషణుఁ డేఁగుదెంచి య
వ్వీరులమాయయుం జలముఁ బ్రేల్మిడిలోఁ గుదియించి వీరకే
ళీరసికుండు వారి నవలీలమెయిం దునుమాడె నందఱన్. 71

క. ఆతనిశరపాతంబుల, చేతం గడు నొచ్చి దైత్యసేన సగము ధా
త్రీతలపతితం బయ్యె వి, భీతిఁ బఱచి పురము సొచ్చెఁ బెఱసగము వెసన్. 72

క. అది యెల్ల విని దశాననుఁ, డుదితక్రోధుఁ డయి మంత్రియుతముగ వెడలెన్
మదగజఘోటకసైనిక, [1]పదభరభుగ్నావనీవిభాగుం డగుచున్. 73

వ. ఇట్లు వెడలి యభేద్యం బగునౌశనసవ్యూహంబు సంఘటించి వనచరబలంబుపయి నడచినం గని రాఘవుండును బార్హస్పత్యవ్యూహంబు దీర్చి పేర్చి యెదురుకొనియె నాసేనలు రెండు నకాండక్షుభితసాగరయుగళంబు తెఱంగు దోఁప నొండొంటిం గవిసె నప్పుడు రాముండు రావణుతోడం దలపడియె లక్ష్మణుం డింద్రజిత్తును సుగ్రీవుండు విరూపాక్షునిఁ దారుండు నిఖర్వటుం దాఁకి రిట్లిరువాఁగునకును దేవాసురులకుంబోలె నాభీలసమరం బయ్యె నందు. 74

1. అ. పదహతిభగ్నావనీ.

క. సౌమిత్రినిశితవిశిఖ, స్తోమంబుల నసురపతిసుతుం బొదివెను సం
గ్రామమునకుఁ దొలఁగక యతఁ, డామనుజోత్తముని ముంచె నాశుగవృష్టిన్.
ఉత్సాహము. అమరవైరివిభుఁడు దశరథాగ్రసుతుఁడు నేపునన్
సమరసత్ప్రతాపకోపజాజ్వలచ్ఛరీరు లై
తుములబాణపటలవృష్టిఁ దొప్పదోఁగి యిర్వురుం
దమక మేది తమక తమక తనిసి రాహవంబునన్. 76
వ. తదనంతరంబ. 77
క. ఆరావణుండు నిజదో, స్సారంబున రాముబాహుసారం బతిదు
ర్వారం బగు టేర్పడఁ గని, వీరారంభంబు కడఁక విడిచి రయమునన్. 78
క. మగిడి నగరంబు సొచ్చిన, బెగడి నిశాచరబలంబు వెల్లగిలుటయున్
విగతభయుండు ప్రహస్తుఁడు, దగఁ గోల్తలసేసె నత్యుదగ్రస్ఫురణన్. 79
ఉ. ఆతనిఁ గాంచి తద్బలము లన్నియుఁ గ్రమ్మఱ నాహవోత్సవ
స్ఫీతము లై కడంగుటయుఁ బేర్చి విభీషణుఁ డుగ్రవానర
వ్రాతసమన్వితంబుగ నవారణ మార్కొనినన్ మహారణం
బాతత మయ్యె సైన్యనివహంబులు రెంటికి నద్భుతంబుగన్. 80
వ. అంత. 81

ప్రహస్తధూమ్రాక్షులయుద్ధము.

మ. కృతహస్తుండు ప్రహస్తుఁ డాహవకళాకేళీవిదగ్ధుండు ద
ర్పితుఁ డై తాఁకె విభీషణుం గడఁకమైఁ బెంపారి వా రిద్దఱున్
శితశల్యోగ్రమయూరపత్త్రవిశిఖశ్రేణీశతచ్ఛన్ను లై
ధృతి నొప్పారిరి చిత్రవారిధరపంక్తిచ్ఛన్నశైలాకృతిన్. 82
చ. కదిసి ప్రహస్తుఁ డార్చి పరిఘంబు రయంబున నెత్తి భీకరో
న్మదకరిహస్తతాడనము మాడ్కి దలిర్పఁగ వ్రేసె నీసుమై
నదయత రావణానుజుని నాతని వ్రేటున కించుకంతయుం
గదలక హేమకూటగిరికైవడి నిల్చి యుదీర్ణకోపుఁ డై. 83
మ. శతఘంటాపరిభూషితంబును జగత్సంహారఘోరానలో
త్థితకీలాసదృశంబు నై [1]నెఱయుశక్తిం బూన్చి మంత్రించి యు
ద్ధతతేజుఁడు ప్రహస్తు వైచిన వెసం దత్క్రూరసంపాతపా
టితవక్షుం డయి కూలె వాఁడు శతకోటిక్షిప్తశైలాకృతిన్. 84
వ. ఇట్లు ప్రహస్తుండు పడినం దత్సైన్యంబులు విముఖంబు లగుటయు ధూమ్రా
క్షుండు రోషతామ్రాక్షుం డగుచు నతినిబిడబలాహకానీకభీకరం బై కాఱు
కొను చున్న నిశాచరచక్రంబుతో నురులం బఱతెంచినం జలించి బలీముఖబలం

1. అ. మెఱయు.

బులు దుర్బలంబులై తొలంగినం జూచి యాంజనేయుం డజయ్యుండై నిల్చినం
బెల్చిన యెప్పటియట్ల యూథపతులుం గూడుకొని రప్పుడు. 85

సీ. అనిలతనూజధూమ్రాక్షరక్షితసైన్య, యుగళంబునకు నయ్యె నుగ్రసమర
మందు నిష్ఠురచరణాఘాతముల డొల్లు, నరదంబులును శిలాహతులఁ దూలి
యొఱలు నేనుంగులు నుత్తాలతరుహతిఁ, ద్రెళ్లు ఘోటకములుఁ దీవ్రనఖర
దంతక్షతంబుల దళితాంగులై నేలఁ, బడి తన్నికొను వీరభటులు నగుచు
ఆ. నధికశౌర్యసారు లగుకపివీరుల, చేత నొచ్చి దైత్యసేన భీతిఁ
బఱచెఁ గొంత జెందు వడియుండెఁ గొంత ధూమ్రాక్షు వెనుక కొదిఁగె నంతఁ గొంత.

మహాస్రగ్ధర. కని ధూమ్రాక్షుండు విశ్వగ్రసనరసలసత్కాలమేఘుంబపోలెన్
[1]ఘనగర్జాఘోష మొప్పం గడఁగి శరశతాకల్పితాసారదుర్ధ
ర్షనవీరారంభుఁడై నన్ సకలహరిచమూసంఘముల్ విహ్వలంబై
చనఁ దూలెం గూలె లావుం జలమును జెదరన్ [2]సంగడిన్ విచ్చె నొచ్చెన్.

తే. అతనియుద్ధతి సైఁపక యనిలసూనుఁ
డనిలవేగుఁడై పఱతెంచి యార్చి తాఁకెఁ
బ్రథన మయ్యిద్దఱకు నుగ్రభంగి నమర
పతికి [3]బ్రహ్లాదునకుఁ బోలెఁ బ్రకట మయ్యె. 88

క. పరిఘంబులు గదలును బె, క్కురుదుగ రక్కసుఁడు వైచె నమ్మారుతిపై
నురుగండశైలములు ఘన, తరువులు హరివరుఁడు గురిసె దానవుమీఁదన్. 89

వ. ఇబ్భంగిం బెనంకువ సెల్లుచుండం గొండొకసేపునకు. 90

స్రగ్ధర. లంకాలుంటాకుఁ డుద్యల్లఘుతరగమనోల్లాసియై డాసి వీఁకం
బొంకం బేపారఁ జంచద్భుజరచితమహాభూరుహం బెత్తి వ్రేసెం
గింకన్ ధూమ్రాక్షు వాఁడుం గెడసెను వదనోత్కీర్ణకీలాలధారా
పంకప్రాగ్భారమగ్నాపతనవిఘటితప్రాణుఁడై యాహవోర్విన్. 91

వ. ఇత్తెఱంగున ధూమ్రాక్షుండు దెగినపిదపఁ గపివరసైనికు లార్చి హనుమంతుని ననేకభంగులం బ్రస్తుతించుచు రజనిచరులం గనుకనిం దోలినం దూలి యందఱుం బఱచి పురంబు సొచ్చి దనుజేంద్రునకుం బ్రహస్తధూమ్రాక్షులమరణప్రకారంబు లెఱింగించినఁ బ్రకటబాష్పనిశ్వాసవివర్ణవదనుం డగుచుఁ బంక్తివదనుండు. 92

క. కలవా రెల్లను మడిసిరి, [4]కలిగియు లేఁ డయ్యెఁ గుంభకర్ణుఁడు వీనిం
దెలుపుదునో యేను గొడుకుం, జల మెడపక రిపులతోడ సరిఁ బెనఁగుదునో. 93

వ. అని వితర్కించి యప్పటికిఁ గుంభకర్ణప్రబోధంబు గార్యంబుగా నిశ్చయించి తదీయశయ్యాగృహంబునకుం జని వానిం దెలుపం బరిజనంబులం బనిచిన. 94

సీ. భేరీమృదంగగంభీరనాదంబులుఁ, గాహళఘంటికాకలకలములు

---

1. గ. ఘనమార్వ్యఘోషగర్జం గడఁగి. 2. గ. సందడిన్. 3. గ. బలదైత్యునకు. 4. జ. కలిగియు లేక యుగు.

దారుణసింహనాదంబులు నొనరింపఁ, గడుఁ బెద్దవడికి నంగమము గదల్చి
యొదిఁగిలి కను విచ్చి హా యని బిట్టావులించి కొండొక దేఱి లేచి నీల్గి
కలయఁ జూచుటయును గట్టెదురన యున్న, యన్నవ్వుచుఁ దనయనుఁగుఁదమ్ముఁ

ఆ. జూచి యనియె నిట్టిచోద్యంపునిద్రలుఁ, గలవె యేరికిని జగంబులోన
నెవ్వరేమి యైరొ యెఱుఁగవు ధన్యుఁడ, వీవ మనకు నైన యెడరు వినవె. 95

వ. దశరథనందనుం డైనరాముండు నాచేత నపహృతభార్యుం డై కలుషించి యనేక వానరయూథంబులం గూర్చుకొని వచ్చి వనధి బంధించి మనవీటిపై విడిసి మమ్మెల్లను నేలకుం గోలకుం దెచ్చు చున్నవాఁడు ప్రహస్తాదివీరులు వానిచేతం జెక్కుండ్రు చిక్కిరి నీవకాక వాని జయింప నన్యుండు శక్తుండు గాఁడు గావున లెమ్ము గ్రక్కునం బగతుపై నడచి పొడిచి గెలువుము దూషణానుజులు వజ్రవేగప్రమాథులు నీకుం దోడ్పడియెద రనిన నట్లకాక యని కుంభకర్ణుండు విహితపరికరబంధుండై సమరబంధు లయినపరిజనంబులతోడం గూడి వెల్వడి నడతెంచిన.

కుంభకర్ణుండు యుద్ధంబు సేయుట.

లయగ్రాహి. దారుణదవానలశిఖారుణశిరోరుహు గభీరఘనకర్బురశరీరుఁ బటురోష
క్రూరనయనాంతగళితోరుతరవహ్నికణఘోరముఖు దంతవలభీరభసదంశో
ద్గారిరుధిరాధరు నుదారభుజసారణవిసారితదిగంతుఁ బదభారవినమద్భూ
భారుఁ ద్రిజగద్విజయభూరిబలు నద్దనుజవీరుఁ గని రచ్చెరువుగూరఁ గపివీరుల్.

క. రక్కసుఁడును దనమదిలో, నక్కపి[1]వీరులను జీరికైనఁ గొనక పే
రుక్కున రఘుకులవీరుల, దిక్కునకుం గవియుదెంచెఁ దీవ్రస్ఫురణన్. 98

మ. వడి నడ్డం బరికట్టె నెట్టన హరివ్రాతంబు పెన్మ్రాఁకులం
బిడుగుల్వోనిమహోద్ధతాశ్మముల నాభీలంబుగా దైత్యు బి
ట్టడువన్ వైవఁగఁ జొచ్చెఁ గొందఱు బలంబారంగ వేడాసి దం
దడి తత్కాయము సించి రుగ్రనఖదంతన్యాససంక్రీడలన్. 99

ఉ. కన్నుల [2]నిద్ర దేఱఁగ నకంపితుఁ డై యతఁ డెంత సేసినం
దన్ను నెఱుంగ కొక్కమొగిఁ దత్కపిసైన్యచయంబుఁ బోరఁ బే
రన్నన మ్రింగఁ జొచ్చె విలయాగమసంభృతదర్పరోషవే
గోన్నతలీలఁ గాలుఁడు జనోత్కరమున్ గ్రసియించుచాడ్పునన్. 100

వ. ఇట్లు బలచండబలవజ్రబాహులు లోనుగాఁ బెక్కండ్రు యూథపతులను బహుసహస్రసంఖ్యలవానరయూథంబును మ్రింగియు గొదగొని వచ్చు చున్న యన్నిశాచరుని మార్కొన నోడి తారప్రముఖు లైనబలీముఖులు నలువంకలం జెదరి పఱచిన. 101

మ. కని సుగ్రీవుఁడు బిట్టదల్చుచును వేగం [3]బెద్ది దైత్యేంద్రు మా

1. క.గ. పైన్యరబుఁ. 2. గ. నిద్ర వ్రేలఁగ నకంపితుఁ డై. 3. అ. బార.

రొక్కని సాలంబున వానియౌదలఁ గడుక ఘోరంబుగాఁ బూన్కి వ్రే
సిన నావ్రేటున నిద్ర దేఱి కడఁకం జేదోయి సారించి యను
మ్మనుజాశుండు గపీంద్రుఁ బట్టె రభసోన్మాదంబుమై నార్చుచున్. 102

క. పట్టువడినసుగ్రీవునిఁ, గట్టెదురం గాంచి యెయ్యి కలుషితమతియై
దట్టుఁడు లక్ష్మణుఁ డసురక, బిట్టేసెం బిడుగుఁబోని పృథుబాణమునన్. 103

సీ. ఉరమాడి యాశరం బుచ్చి పోవుటయును, గడు నొచ్చి యాకుంభకర్ణుఁ డలిగి
వెస వాలితమ్ముని విడిచి తోరపుశిలఁ, గొనుచు నుక్కున రాముకూర్మితమ్ము
దెసఁ బాఱు తెంచిన ధీరుండు సౌమిత్రి, భల్లయుగ్మమునఁ దద్బాహుయుగము
నఱికె మాయాబలోన్నతుఁడు దైత్యుఁడుచతు, ర్బాహుఁడై తోఁచిన భానుకులుఁడు

ఆ. చేతు లెల్లఁ దునిమె శితభల్లముల వాఁడు, మఱి యనేకహస్తమస్తకాంఘ్రి
భాగుఁ డైనఁ గినిసి బ్రహ్మాస్త్ర మేసినఁ, గూలె నసుర గొండ గూలినట్లు. 104

వ. ఇట్లు కుంభకర్ణుండు దెగటారినం జూచి దూషణానుజులు వజ్రవేగుండును బ్రమా
థియు రాఘవానుజుం దలపడి నిబిడబాణౌఘనిమగ్నుం జేయుటయు నతండును
వారి నతిబహుళం బగుశరజాలంబునం బొదివినఁ గయ్యం బొక్కముహూర్తంబు
చూపఱకు రోమహర్షణం బై చెల్లెఁ దదనంతరంబ. 105

చ. అనిలసుతుండు నీలుఁడు రయం బెసఁగం బఱతెంచి యుమ్మహా
దనుజులమీఁద నేపున నుదగ్ర[1]నగాగ్రయుగంబుఁ బూన్చి వై
చినఁ గడు రూపఱం జదిసి చెప్పఁగఁ జూపఁగఁ లేక పోయి ర
ద్దనుజులు వానరోత్కరము దద్దయు నుబ్బున నార్చె నత్తఱిన్. 106

క. ఆకులగతి నలుదెసలం, గాకులక్రియఁ జెదరి కడు వెగడుపడి రక్షో
నీకములు లంక యెనిమిది, వాకిళ్లం దూఱెఁ బౌరవర్గము దలఁకన్. 107

క. అంతఁ దనకూర్మితమ్ముం, డంతకుఁ గూడుటయు దూషణానుజమృతివృ
త్తాంతంబును విని యెంతయు, వంతఁ దలరి యఱచెఁ బంక్తివదనుఁ డవశుఁడై.

వ. అయ్యవసరంబున నాముక్తకవచుండును నాబద్ధతూణీరుండును బ్రచండకోదండ
పాణియుఁ గృపాణబాణబాణాసనాదివివిధసాధనోపేతసన్నిహితస్యందనుండును
బురందరహృదయసాగరమందరుండును నైన మేఘనాదుండు దండ్రిం జేరం జను
దెంచి వినయంబున నిట్లనియె. 109

చ. వగవఁగ నేల దైత్యకులవల్లభ యేఁ గలుగంగ నిమ్మెయిన్
జగముల నీదుశత్రులకు శౌర్యము సెల్లునె వృత్రవైరి లో
నగుసురకోటియే పడఁచి [2]యప్రతిమోన్నతి నున్ననీకుఁ గ్రో
తిగముల నోర్చు టెంతపని దేవ ననుం గృపఁ బంపు మాజికిన్. 110

ఉ. కూడినకొండముచ్చులను క్రోఁతుల నుగ్రత ముట్టి కిన్కఁ జెం

---

1. గ. ఘహాద్రియుగంబు. 2. అ. యర్థి జయోన్నతి.

డాఁడెద నుజ్జ్వలోగ్రవివిధాంబక [1]చుంబితదిఙ్ముఖుండ నై
యాఁడెద వీరనృత్యము రయంబునఁ బార్థివసూను లిద్దఱిం
గ్రీడయపోలెఁ గిట్టి పెడ కేలుగఁ గట్టెదఁ బట్టి తెచ్చెదన్. 111

వ. అనినం దెలి వొంది మందోదరీసుందరుండు ప్రియనందనున కిట్లనియె. 112

సీ. నీపరాక్రమలీల నిక్కమే నెఱుఁగనే, పుత్త్ర నీభుజబలస్ఫురణమునన
కాదె నా కిట్టివిఖ్యాతియు సిరియును, గలిగె గీర్వాణసంఘంబుతోడఁ
గూడ నయ్యింద్రునిఁ గొనివచ్చి నాబంటుఁ, గా నొనరింపవే గర్వ మెసఁగ
మాయావిదుండవు మహితదివ్యాస్త్రవి, శారదుండవు నీవు సంగరమునఁ

ఆ. బగతు రెల్ల వెగడుపడఁగ [2]దృశ్యాదృశ్య, దుర్నిరూపభంగిఁ దొడరి చిక్క
వఱచునీమహోగ్ర బాణపాతంబులు, దశరథాత్మజులకుఁ దరమె యోర్వ.

ఆ. నిఖిలశత్త్రుచయము నిశ్శేషముగఁ జంపి, యనఘ సమరనిహతులైనయస్మ
దీయజనులఋణము దీర్పుము మసలక, పోయి రమ్ము పోరఁ బొడిచి గెలుము.

వ. అని కౌఁగిలించుకొని వీడుకొల్పిన నింద్రజిత్తు సత్వరుండై యరదం బెక్కి లంకాపురంబు వెలువడినం గని వనచరానీకంబు లార్చుచు నెదురు నడచుటయు నతండు దాని నించుకయు సరకుగొనక కరతలం బెత్తి లక్ష్మణునిం బిలిచిన. 115

ఇంద్రజిత్తు లక్ష్మణుతోడ యుద్ధము సేయుట.

క. విని యాతండును వహార్వి, నినదంబున గగనధారుణీమధ్యం బె
ల్లను మ్రోయ మత్తగజముం, గనినమృగేంద్రుండపోలెఁ గడఁగెం బెలుచన్.

వ. అంత. 117

ఉ. చైత్త్రులు గోత్రభూమిధరసారులు వార్ధిగభీరు లుల్లస
చ్చిత్త్రధనుఃకళావిదు లజేయులు భూరిజయార్థు లప్డు సౌ
మిత్త్రియు మేఘనాదుఁడు నమిత్త్రవిభేదులు దాఁకి రార్చి లో
కత్రయభీకరప్రధనకౌతుకవేగితచిత్తవృత్తు లై. 118

క. మచ్చరము మీఱ నొండొరుఁ, జిచ్చుఱపిడుగులను బోనిశితవిశిఖములం
జెచ్చెర నొంపఁగ విలునే, ర్పచ్చటఁ దుల్యంబ యయ్యె నయ్యిద్దఱకున్. 119

క. తనకంటె నపుడు రావణ, తనయుం డని మీఱఁ జూచి తా నాతనికం
టెను మున్న రాఘవానుజుఁ, డనుపమశరలీల నతిశయంబుగ మెఱయున్. 120

క. అంతఁ బటుతోమరంబుల, నెంతయు [3]వెస నృపతనూజునింద్రజి వైవన్
సంతతశరముల నన్నిటి, నింతింతలు శకలములుగ నేసె నతండున్. 121

వ. అట్టియెడ నంగదుండు గడంగి లక్ష్మణునకుం దలకడచి యమందవేగంబున మందోదరీనందనుం గవిసి ఘనమహీరుహంబునఁ దన్మస్తకంబు వ్రేసినం జలింపక నిలిం

1. క. మూర్ఛిత. 2. అ. దివ్యాస్త్రవిస్ఫారదుర్నివారభంగి. 3. క. నృపతనయు నసుర యెలమిఁ గైవన్.

పపతివైరి నిశితప్రాసంబు వాసవపౌత్త్రుం జంప నెత్తుటయు లక్ష్మణుండు దానిం
దునియ నేసిన నయ్యసురయు గదాదండంబుఁ దీర్చి యంగదు[1]వక్షంబు వ్రేసినం
దొలంగక చెలంగి వాలిసూనుండు సాలవృక్షంబున నారాక్షసురథంబు రథ్యసా
రథిసహితంబుగాఁ జదియ నడిచె నట్లు విరథుం డయి యచ్చోటన యంతర్ధానంబు
నొంది గగనగతుం డయ్యెఁ బదంపడి. 122

క. ఎవ్వలన నుఱుకునో యతఁ, డెవ్వరి నెటు సేయునొక్కొ యిం దనుచుఁ గడున్
నివ్వెఱపడి కపిసేనలు, గ్రొవ్వు సెడం బంక్తివదను కొడు కుద్ధతుఁ డై. 123

చ. ఉఱుముచు నంతకాలచలితోగ్రబలాహకలీల దోఁపఁగాఁ
దఱచగు ఘోరపుంబిడుగుఁదండముఁ బోనిశరప్రతాన ము
క్కుఱఁ దొరఁగించుచుం గపిబలావళిఁ ద్రుంచి కలంచె నేపునన్
నెఱఁకులు నొంచి బాణమయనీరధి ముంచె రఘుప్రవీరులన్. 124

క. మాయాధికు నంతర్హిత, కాయుఁ బురందరవిరోధిఁ గాకుత్స్థులు క్రో
ధాయత్తు లగుచు నేసిరి, ధీయుక్తులు శబ్దవేధిదివ్యాస్త్రములన్. 125

వ. వానికి నలిగి సుగ్రీవాదివానరులు వృక్షశిలాప్రకరంబులు గైకొని యాకసంబున
కెగసిన నద్దానవుండు వారి నందఱ వెఱచఱవ నేయుటయుఁ జేవ సెడి మగిడి
పుడమి కెఱఁగిరి వాఁ డంత నిలువక వాఁడితూపులు వఱపి రామలక్ష్మణులఁ గరం
బు నొప్పించినం జెయ్వేది యయ్యన్నయుం దమ్ముండును గపిబలంబు లడల
ధరణీతలంబునకు నొరగిలి విలయకాలపతితు లయినసూర్యేందులచందంబున
నున్నం గని సింహనాదంబు సేసి. 126

మ. పరమోదాత్తులఁ బార్థివోత్తముల శుంభద్విక్రమారంభులన్
సురసంకాశులఁ గోసలప్రభుల నస్తోకప్రభోద్దాములన్
వరలాభోన్నతుఁ డన్నిశాచరుఁడు గర్వం బొప్ప దుర్వారని
ర్భరనాగాస్త్రములం దదాహవమహిన్ బాధించె నయ్యుద్ధతిన్. 127

వ. తదనంతరంబ సుగ్రీవసుషేణజాంబవత్ప్రముఖు లయినకపివీరులు రామలక్ష్మణు
లున్నయెడకుం జనుదెంచి యెయ్యదియునుం జేయునది నేరక దుఃఖితు లగు
చుండ నవ్విభీషణుండు వారి నాశ్వాసించి బ్రహ్మాస్త్రప్రయోగంబున నారాజ
కుమారులకు బంధమోక్షణంబు గావించె సుగ్రీవుండు విశల్యకరణి యను నౌష
ధంబున వారల విశల్యదేహులం జేసె నిట్లు ప్రబుద్ధు లై రాఘవులు గ్రమ్మఱఁ
గయ్యంబునకుం గడంగి రప్పుడు రావణానుజుండు రామునకుఁ గృతాంజలి యై
యి ట్లనియె. 128

సీ. నరనాథ కిన్నరనాథునిపనుపున, [2]శ్వేతుండు నాఁగఁ బ్రసిద్ధుఁ డొక్క
గుహ్యకుఁ డదె మీకుఁ గొని వచ్చె దివ్యతో,యంబు లీజలముల నంబుజాక్ష

1. క. సవ్యపార్శ్వంబు. 2. అ. శ్వేతాద్రినుండి ప్రసిద్ధుఁ.

నయనపద్మక్షాళనము సేయు మిప్పుడ, దృశ్యభూతము లెల్లఁ దెల్లముగను
గానంగఁ బడు నన్నఁ గైకొని రాఘవుం, డనుజసహాయసమన్వితముగ
ఆ. నట్లు చేసి కనియె నంబరమధ్యమం, జారుఁ గృతవివర్తసంప్రహారు
నింద్రజాలశీలు నింద్రజిద్రణలోలు, రావణాగ్రతనయు రహితవినయు. 129

వ. ఆరక్కసుండునుం దనచేసినపౌరుషంబు ప్రతిహతం బగుటకు విస్మయం బంది మగి
డి హోమకార్యంబును దొడంగం బోయిన నెఱింగి విభీషణుండు లక్ష్మణుం
జూచి యిన్నిచునకు హోమసమాప్తి యయ్యెనేని నెవ్వరికి గెలువ నశక్యంబు
వీనివెన్నడిం దగిలి తెగటార్పు మనిన నతండు. 130

ఆ. ఆర్చి వెనుకఁ దగిలి యశనికల్పము లైన, శరము లేయుటయు నిశాచరుండు
గినిసి వడి నెదిర్చి కీలించె లక్ష్మణు, నంగకముల నుజ్జ్వలాంబకములు. 131

వ. ఇట్లు దలపడి యవ్వీరు లిరువురు నిశాచరవనేచరబలంబులు రణం బుడిగి వెఱఁగు
పడి తమపోటు సూచుచుండ నుద్దండవేదండద్వయంబు తెఱంగున నాభీలశార్దూల
యుగళంబుకరణి నసహ్యసింహయుగళంబు లై వడి నతిఘోరయుద్ధంబు సేయం
దొడంగి రంత. 132

క. వడి నొక్కవెట్ల లక్ష్మణుఁ, డడరించె నిశాతశరము లారక్కసుపైఁ
గడఁగి యతఁడు నాతనిపై, నెడపక నాటించెఁ గలయ నెనిమిదియమ్ముల్. 133

ఆ. వాఁడితూపు లొడల వడి నాటుటయు నొచ్చి, తోన కలుషరోషధూమకేతుఁ
డతిశయిల్లి రాఘవానుజుం డురుచాప, శింజినీరవంబు సెలఁగఁ గవిసి. 134

ఇంద్రజిత్తు లక్ష్మణునిచేతఁ జచ్చుట.

మ. శితభల్లద్వితయంబునం గడువెసం జేదోయి ఖండించి ఖం
డితగోత్రాచలతుంగశృంగశతకోటిస్ఫారఘోరానల
ద్యుతిసాంద్రం బగుశాతభల్ల మొకటం ద్రుంచెం గనత్కుండలా
న్వితమై యొప్పునిశాచరేంద్రుశిరముం వీరక్రియాదక్షుఁ డై. 135

ఆ. భగ్నశాఖ మైనపాదపంబునుబోలె, నిట్లు నంగరమున నింద్రజిత్తు
వడినఁ జూచి దైత్యబలములు భయ మంది, పఱచెఁ జెలఁగి యార్చెఁ బ్లవగబలము.

క. తనయునిమరణం బేర్పడ, విని దశకంధరుఁడు శోకవివశుం డై బో
రన బాష్పము లొలుకఁగ హా,యనుచుం బదినోళ్లఁ దెఱచి యఱచెం బెలుచన్.

క. శోకంబు సైఁపలేక య, శోకవనంబునకు నరిగి సురశత్రుఁడు రో
షాకులుఁ డై జానకిఁ బు, ణ్యాకారం జంపఁ జంద్రహాసము వెఱికెన్. 138

వ. అప్పుడు వయోవినయవృద్ధుఁ డైనయవింధ్యుం డతని వారించి యిట్లనియె. 139

చ. ఇది దగునే దశానన మహేంద్రుఁడు లోనగుదేవతాతతిం
గదనములోఁ జయించి త్రిజగంబులఁ బేర్కొని యున్ననీకు ని

1. క. గ. జ. విలిప్త.

ష్ముదిత వధింతు నంట గడు మోసము గాదొకో యోపుదేని నే
పొదవఁగ రాఘవుఁ గెలువు ముగ్ధ్మలిఁ జంపినఁ బెంపు గల్గునే. 140

వ. అనినం దద్వచనంబుల సుపశమితరోషుం డయి దోషాచరేశ్వరుండు సమరసన్నాహం బమర రథం బెక్కి మిక్కిలిబీరంబు సొంపార నఖిలసేనాసహితుంబు గాఁ బురంబు వెల్వడి నడతెంచె నంత. 141

శా. సుగ్రీవాదిసమస్తవానరులుఁ బ్రస్ఫూర్జన్మహావిగ్రహ
వ్యగ్రాకారతఁ బేర్చి భూరుహశిలావ్రాతంబులం దాల్చి వా
లాగ్రవ్యాచలనంబు లొప్ప దశకంఠాగ్రసరోదగ్రదై
త్యగ్రామంబు నెదిర్చినన్ సమర మత్యంతోగ్ర మయ్యెన్ వడిన్. 142

వ. ఆసమయంబున నఖిలమాయాకుశలుం డైన దశముఖుండు మాయ గావించిన.

క. ఆరావణుదేహంబున, ఘోరగదాశక్తిఖడ్గకోదండధరుల్
వీరులు సహస్రసంఖ్యల, వారలు జనియించి రసురవరు లుద్ధతు లై. 144

వ. వారి నందఱఁ గౌసల్యానందనుండు సాంద్రశరజాలంబుల నవలీలం దునిమి తూఁటాడిన నమ్మేటిరక్కసుండు మఱియు నుఱక మాయ ప్రయోగించి రామలక్ష్మణప్రతిరూపంబు లనేకంబు లుత్పాదించుటయు నయ్యన్నయుం దమ్ముండును వెఱఁగుపడియునుం జిడిముడిపడక యమ్మాయారూపంబు లన్నియుం దునిమి తదనంతరంబ. 145

చ. అభినవభానుబింబరుచిరాకృతియున్ హరియుగ్యమున్ మహా
రభసదురాసదంబును విరాజితకేతనమై జయంతికా
ప్రభమును నైన తేరు సురపాలకుపంపునఁ జేసి రాఘవ
ప్రభునకుఁ దెచ్చి మాతలి సభక్తికుఁ డై ప్రియ మొప్ప నిట్లనున్. 146

మ. ధరణీనాథ సురేంద్రుతే రిది మహాదైత్యేంద్రులం ద్రొల్లి యీ
యరదం బెక్కి యనేకులం దునిమె జంభారాతి ఘోరాజి నీ
యరదం బెక్కి వధింపు మీవును మదీయస్ఫారసారథ్యని
ర్భరభంగిన్ దశకంధరుం ద్రిభువనీభంగోన్నమత్కంధరున్. 147

మ. అనినన్ మాతలి నాదరించి యరదం బా రాఘవుం డెక్కి యు
క్కున మీఱెన్ రిపుకోటిమీఁద విలసత్కోదండమౌర్వీమహా
స్వనభిన్నాఖిలదిగ్విభాగుఁ డగుచున్ [1]శాతాస్త్రధారాభిషే
చనపూతప్రతిపక్షసైన్యుఁ డగుచున్ సంరంభదుర్వారతన్. 148

ఉ. అత్తఱి రావణుండు విలయానలదుస్సహమూర్తి యై నరేం
ద్రోత్తముమీఁదఁ దేరు గడు నుగ్రగతిం బఱపించి సంతతో
ద్వృత్తశరప్రవాహపరివీతదిశాముఖుఁ డైనఁ జూచి పే

---

1. గ. జ. శస్త్రాస్త్ర...ధూతప్రతిపక్ష.

రుత్తలమంది రాతని సముద్ధతిఁ [1]దివినుండి నిర్జరుల్. 148

వ. ఇట్లు దలపడి రామరావణు లతిఘోరంబుగాఁ బోరం దొడంగి రంతఁ బంక్తివదనుండు నిబిడజ్వాలం బగు శూలంబు రాఘవుమీఁదం బ్రయోగించిన నతండును నడుమన దానిఁ దునియలు సేసిన నీసునం బెరిఁగి సురవైరి మఱియునుం దరతరంబ శతసహస్రసంఖ్యలు గల శూలంబులు భిండివాలంబులుఁ దోమరంబులు శరంబులుం బఱఁగించి యంబరంబెల్ల నస్త్రమయంబుగావించిన నఖిలభూతంబులును హాహాకారవ్యాకులంబు లయ్యె నసురసైన్యంబున భేరీప్రముఖతూర్యనినదంబులు సింహనాదంబులుం జెలంగె నంతఁ గొండొకసేపునకు రావణప్రయుక్తంబై నశస్త్రాస్త్ర దహనం బంతయు నిరంతరవిశిఖధారాసారంబునం గబళించి రామజలధరంబు గంభీరసంరంభంబునం బొదలుటయు సకలప్లవంగసముదయంబును బ్రహర్షకోలాహలం బయ్యెఁ బదంపడి. 150

శ్రీరాముఁడు రావణాసురుని సంహరించుట.

సీ. కమనీయకనకపుంఖప్రభాభాసియుఁ, దీక్ష్ణముఖంబును దివిజయక్ష
మునిసిద్ధసాధ్యసమ్మోదావహంబు నై, విలసిల్లుబాణ ముర్వీవరుండు
గైకొని బ్రహ్మాస్త్రకలితమంత్రాభియుక్తంబు గా నొనరించి కార్ముకమున
సంధించి[1] జగములు జయపెట్టఁ జెచ్చెరఁ, దివిచి యేయుటయును దీవ్రభంగిఁ
ఆ. గడఁగి యాశరంబు గల్పాంతదహనంబ, పోలెఁ బంక్తికంఠుఁ బొదివి నీఱు
గా నొనర్చె. సూతఘనరథరథ్యస, మన్వితముగ నొక్కమాత్రలోన. 151

వ. అప్పు డంబరంబున దివ్యతూర్యనాదంబులు సెలంగం గలంగి యసురులెల్లఁ దొలంగిరి గంధర్వగానంబులు నప్సరోనర్తనంబులుఁ బ్రవర్తిల్లె నింద్రాదిదేవోత్తము లన్నరదేవోత్తముం బ్రస్తుతించుచుం బ్రమోదంబు నొందిరి. 152

క. ఏకోత్సవంబు లయ్యెఁ ద్రిలోకంబులు నఖిలలోకలుంటాకుఁడు ఘో
రాకారుఁడు దశవదనుఁడు, గాకుత్స్థనిశాతశరముఖంబునఁ బడినన్. 153

ఉ. అంత ననంతకీర్తి శరణాగతరక్షణశాలి రాఘవుం
డెంతయు వేడ్కతోడ నసురేంద్రపదంబున నవ్విభీషణుం
సంతతపుణ్యుఁ బుణ్యజనసంతతివర్ధనుఁ గట్టెఁ బట్టమ
త్యంతదయాంతరంగుఁడు గృతాహితభంగుఁడు దానుఁ దమ్ముఁడున్. 154

వ. తదనంతరంబ యవింధ్యుండు విభీషణసహితుం డై జానకి నుచితయానంబున నునిచికొని రామదేవుపాలికిం దెచ్చి దేవా దేవిం బరిగ్రహింపు మని విన్నవించుటయు నతండు. 155

చ. అతిమలినాంగి జీర్ణమలినాంబరధారిణి సంతతాశ్రుపం
కితవిలసత్కపోలఁ బరికీర్ణజటాయితకేశభార నా

1. జ. వినువీథి.

యతఘనదుఃఖదూపితఁ బ్రియాంగనఁ గన్గొని యప్రియాత్ముఁ డై
నుతచరితుండు దద్దయు మనోవ్యథ సేయుచు నింతి కిట్లనున్. 156

సీ. అధికదుష్టాచారుఁ । డైనదశాననుఁ, డింతకాలముఁ దన । యింటఁ బెట్టి
కొని యున్న నిన్నుఁ గై । కొనిన నస్మచ్చరి, త్రమునకుఁ దొడరదే । ధర్మహాని
పరిభవంబునకు నై । ప్రతికారముగ వైరిఁ, గూల్చితిఁ గాని నీ । కొఱకుఁ గాదు
మెలఁత నీచరితంబు । మే లైనఁ గీ డైనఁ, గా నిమ్ము నిన్ను ని । క్కముగ నొల్లఁ
ఆ. బరఁగఁ గుక్క వాతఁ । బడినహవ్యముభంగి, యయ్యె నీ తెఱంగు । నరయ నిపుడు
గాన యిచటఁ దడయఁ । గాదు చెచ్చెర నీకు, నిష్టమయినకడకు । నేఁగు మతివ.

ఆ. అనినఁ జెవులఁ గొఱవి । గొని చూఁడిన ట్లైనఁ, దాల్మి పెల్లగిల్లఁ । దరళనయన
మొదలు నఱక నొఱగు । కదళిచందంబున, నెలఁత దల్లడమున । నేల వ్రాలె. 158

క. వెఱఁగుపడి హర్షరాగము, దఱఁగిన వెలువెల్ల నై వ । దనములు వ్రాలం
దెఱఁ గేది చిచ్చవడి ర, త్తఱిఁ దత్పరిజనము లెల్లఁ । దద్దయు వంతన్. 159

తే. పడఁతి యల్లన మఱికొంత । వడికిఁ దెలిసి, యలసమూర్తి యై దందడి । నశ్రు లురులఁ
గేలు మొగిడించి వసుమతీ । పాలుఁ జూచి, యెలుఁగు గుత్తుకఁ దగులంగ । నిట్టు లనియె.

క. నినుఁ గీడు వొరయ కుండఁగ, జనులకు నానిక్క మెక్క । జననాయక నే
ననలంబుఁ జొచ్చి వెడలెదఁ, గనుఁగొను మిచ్చనవు నాకుఁ । గరుణింపు దగన్.

ఉ. నా దగుబుద్ధి నీదుచర । ణస్మరణంబ యొనర్చుఁ గాని యొం
డేదియు నెన్నఁడుం దలఁప । దిట్టిద యిం దొకచంద మైన ని
మ్మేదినియుం గృశానుఁడు స । మీరుఁడు శీతకరుండు నర్కుఁడుం
గాఁ దన కీక్షణంబ నను । గాల్పరె వేల్పులు చెట్ట సైఁతురే. 162

వ. అని పలుకుటయు నప్పుడు పృథివ్యాదిభూతంబు లెలుంగులు సెలంగ నెల్లవారును
వినం దమతమనామంబు లెఱింగించి యి ట్లనిరి. 163

క. విను ముత్తమురాలు సుమీ, జననాయక జనకతనయ । సందేహపడం
బని లేదు మాకుఁ దెల్లము, జనులకు మము మొఱఁగ రాదు । సకలక్రియలన్.

వ. అనినయనంతరంబ సకలసురమునిగణసహితంబుగాఁ బితామహుండు సనుదెంచి
రాఘవుచేత సత్కృతుం డై యిట్లనియె నయ్యా నీవు సకలభూతదుస్సహుం డైన
రావణుం బరిమార్చి లోకహితంబు సేసితివి వినుము నలకూబరుశాపంబునం జేసి
దశగ్రీవునకుఁ బరస్త్రీలయందు బలాత్కారంబు సెల్లదు గావున నీధర్మపత్ని యొం
డొక్కదురితంబునుం బొరయదు నీవు నిర్విచారుండ వై యిప్పతివ్రతం బరి
గ్రహించి నెమ్మదిఁ బురంబున కరుగు మని పలికి యతనికిఁ బ్రియంబుగాఁ దత్స
మరనిహతు లైనవానరులఁ బ్రాప్తజీవులంగాఁ జేసి పరమేష్ఠి సనియెఁ బురందర
సారథియును దాశరథి వీడ్కొని హరిసహస్రయుక్తం బయినరథంబు గైకొని
నాకలోకంబున కరిగె నంత. 165

మ. అవిరోధంబున జానకీసహితుఁ డై యాఁబద్ధరత్నప్రభా
నవపుష్పం బగుపుష్పకం బనువిమానం బెక్కి యర్కాన్వయ
ప్రవరుం డిమ్ముల నేఁగె సమ్మదభరప్రాగ్భారవారాకర
ప్లవమానుం డగుచుం బురంబునకుఁ బ్రాప్తశ్రీవిశేషోన్నతిన్. 166

వ. ఇట్లరిగి భరతాదిబంధుజనంబులు నఖిలపరిజనంబులు నభినందింప వసిష్ఠవామ
దేవాదివిహితం బైనయభిషేకశోభనంబు వహించి రాముండు సుగ్రీవ విభీష
ణాదిసుహృజ్జనంబులను ఋక్షవానరబలంబులను బ్రకటబహుమానవిశేషంబుల
నాదరించి వీడ్కొలిపి యభిమతభోగంబుల నిరంతరత్యాగంబులఁ బ్రభూతయా
గంబులఁ బ్రసిద్ధుం డయి బహుసహస్రవత్సరంబులు వసుమతీసంరక్షణం బాచ
రించె నిది రాఘవుచరిత్రంబు. 167

ఉ. వారక యిట్లు పూని వనవాసనిరంతరదుఃఖముల్ మహా
వైరికృతాపకారదురవస్థయు నోర్చి శుభంబు నొందఁడే
యారఘురాముఁ డట్ల వసుధాధిప నీవును దుఃఖ మింతయున్
సైరణ సేసి పొందెదవు సర్వమహీవలయాధిరాజ్యమున్. 168

వ. అని చెప్పిన విని యుధిష్ఠిరుండు రామునిపరాక్రమవిశేషంబు గొనియాడి జానకి
పాతివ్రత్యమహిమయు నింతయొప్పునే యని పలికి మునీంద్రా పతిభక్తితాత్పర్యం
బున నఖిలదుఃఖంబుల నోర్చి శుభంబులొందినపుణ్యసతిచరిత్రంబు విన వలతుం
జెప్పవే యనిన నతనికి మార్కండేయుండు సావిత్రి యనురాజపుత్త్రిచరిత్రంబు
విను మది నీప్రశ్నంబునకు నుత్తరం బగు నని యిట్లనియె. 169

మార్కండేయుఁడు ధర్మజునకు సావిత్ర్యుపాఖ్యానంబు సెప్పుట.

సీ. కలఁడు మద్రేశుండు ఘనుఁ డశ్వపతి యను, ధరణీశుఁ డతఁడు సంతానకాంక్ష
నెంతయు ధృతిఁ బదునెనిమిది యేఁడులు, సావిత్రిఁ గొల్చె నజ్జనవిభునకు
నద్దేవి ప్రత్యక్షమై వర మడుగుము, నావుడు నతఁడు వినమ్రుఁ డగుచు
నాత్మజుఁ గోరెద ననవుడుఁ గన్నియ, పుట్టు నీ కనిన నా భువనమాత
తే. యనుడు దేవి భవత్కృప నస్మదీయ
వాంఛితము సఫలంబుగా వలదె యని నృ
పోత్తముఁడు విన్నవింప నయ్యోగమూర్తి
గాఢకారుణ్యవికచహృత్కమల యగుచు. 170

వ. ఏను నీమనోరథంబు తెఱంగు మున్న చతుర్ముఖున కెఱింగించిన నతండు గన్నియఁగా
నిర్దేశించె నద్దేవునియానతి యమోఘంబు విను మక్కన్నియకారణంబున నీకు
నొక్కవిధంబునం బిదపఁ బుత్త్రశతలాభంబు నగు సంతసిల్లుమని యనుగ్రహించి
యాదేవి యంతర్ధానంబు నొందె నయ్యశ్వపతియును సావిత్రీప్రసాదంబున నిజ
ధర్మపత్ని యయినమాళవియందు సావిత్రి యనుకూఁతుం గని యక్కన్నియ నతి

గౌరవంబునం బెనిచె నంత. 171

క. ఆవనజాక్షి పరిస్ఫుట, యౌవన యై సిద్ధసాధ్యయక్షామరక
న్యావలిఁ దనసౌందర్య, శ్రీవిలసనరేఖ నపహసించుచు నుండెన్. 172

తే. కోరి జనపతి దనకూర్మికూఁతుఁ జూచి, గుణవయోరూపముల కనుకూలుఁ డైన
భర్త నెమ్మెయి దీనికిఁ బడయువాఁడ,నొక్కొ యని యెందుఁ దడవుచు నుండె నెలమి.

వ. అదియును సాళ్వపతి యైనద్యుమత్సేనుకొడుకు సత్యవంతుండు రూపవంతుం డని
యును గుణవంతుం డనియును విని వానియందుఁ జిత్తంబు దగిలి యున్నను సిగ్గు
పెంపున నెవ్వరికి నెఱింగింప కుండె నంత నొక్కనాఁ డమ్మద్రపతికడకు నారదుం
డరుగుదెంచిన నతం డమ్మహాముని [1]నుచితసపర్యాపరితోషితుం జేసి సద్గోష్ఠీవిశే
షంబు సలుపుచున్న యెడ. 174

క. నెచ్చెలులు దన్నుఁ గొలువఁగఁ, బచ్చవిలుతుకలిమి యెల్లఁ బద్మానన యై
యచ్చుపడినట్లు మెఱయుచు, నచ్చటికే తెంచె భూవరాత్మజ నెమ్మిన్. 175

వ. ఇట్లు వచ్చి సఖీజనంబు నంతంత నిలిపి మెలుపుతోడి [2]పొలుపు విముగ్ధలీలామధురం
బగు చుండఁ దండ్రికి మ్రొక్కిన నతండు ప్రగాఢస్నేహసన్నాహదోహళం బగు
చిత్తంబుతో నత్తన్వి గ్రుచ్చి యెత్తి నిజాంకతలంబున నునిచికొని సముచితో
పలాలనకేళీపరవశుం డయ్యె నప్పుడు నారదుం డమ్ముద్దియం జూచి యశ్వపతితోడ
నిక్కన్నియం దగినవరున కొసంగక యిట్లేల యునిచినాఁడ వనిన నతండు గూఁ
తున కిట్లనియె. 176

తే. తల్లి నీగుణరూపవృత్తముల కెందుఁ, దగినవరు నీవ యిమ్ముగఁ దడవి నెమ్మి
నీమనస్సున కెక్కిననృపకుమారుఁ, గోరి వరియింపు మిదియ నాకును బ్రియంబు.

వ. అనిన నదియుఁ గొండొక లజ్జించి కోర్కి పెంపున సిగ్గు దొలంగం ద్రోచి ప్రకట
కౌతూహలతరళితాంతరంగ యగుచుఁ దండ్రి కిట్లనియె. 178

క. చిరకీర్తి సాళ్వభూవరు, వరతనయుం డయినసత్యవంతుఁడు నాకుఁ
రుఁడుగఁ గోరుదు మదిలో, వరవర యాతనికి నిమ్ము నను బ్రీతిమెయిన్.

వ. సాళ్వపతి యిప్పుడ దైవయోగంబునం జేసి విగతచక్షుం డయి తనరాజ్యంబు
వైరులచేతం గోల్పడి పుత్త్రదారసహితంబు వనంబున నున్నవాఁ డట్లయినను
సత్యవంతున వరియింతు ననిన మద్రేశ్వరుండు నారదుం జూచి మునీంద్రా మీ
యెఱుంగనివారు లేరు సావిత్రిచేత వరియింపఁబడినకుమారుం డెట్టివాఁడు వాని
గుణరూపశీలంబు లెఱింగింపుఁ డనిన నారదుం డి ట్లనియె. 180

సీ. సత్యంబు వలుకుటసత్యవంతుం డన, నతఁ డొప్పు మఱియుఁ జిత్రాశ్వుఁ డనఁగ
నామాంతరంబు నన్నరనాథసుతునకుఁ, గలదు తేజంబునఁ గమలమిత్త్రు

---

1. క. నుచితసపర్యావిధులం బరితోషితుం జేసి ప్రసంగగోష్ఠీవినోదంబులు సలుపు. 2. అ. పొలుపున నమ్మగువ లీలామధురంబుగఁ దండ్రికి.

బుద్ధి నింద్రాచార్యుఁ బురుడించు శూరత, వాసవుఁ దాలిమి వసుధఁ బోలుఁ
గాంతిఁ జంద్రున కెనగాఁ దగు రూపున, నాశ్వినేయులసరి యనఁ దలిర్చుఁ
ఆ. దపము శమము దమము దానంబు బ్రాహ్మణ, భక్తియును మహాప్రభావతయును
నతనియంద కాని యన్యులయందు లే, దింత నిక్కువము మహీతలేశ. 181
వ. వానియందుఁ గీడు నొక్కటియుఁ గలదు [1]నేఁడు మొదలుగా నొక్కసంవత్స
రంబునకు మృతిఁ బొందు నిది నీకుఁ జెప్పవలయుటం జేసి చెప్పితి ననిన నతండు
గూఁతుమొగంబు సూచి తల్లీ యిమ్మహాత్ముండు దేవరహస్యంబు లెఱుంగు నీతని
వచనం బమోఘంబు నీకు నట్టివరుం డేల యొండొక్కవరుని వెదకికొ మ్మనిన
నక్కన్నియ దండ్రి కిట్లనియె. 182
వ. వినుము మనోవాక్కాయము, లన మూఁడు దెఱంగు లందు నంతఃకరణం
బనఘ ప్రధానము గావున, మనమునఁ గైకొన్నభర్త మానం దగునే. 183
క. సత్యవంతుం డెట్టివాఁ డైన నగుం గాని యే నింక నొరుల వరియింప నొల్ల ననిన
నశ్వపతి నారదు దెసఁ జూచుటయు నతం డిట్లనియె. 184
చ. గొనములప్రోక నీయనుఁగుఁగూఁతురు దీనితలంపు మాన్పఁగా
మనకు నశక్య మింక ననుమానము లేల నరేంద్ర యింతిఁ జ
య్యన నృపసూతి కిమ్ము కమలానన చేసినపుణ్యగౌరవం
బున నయినం బ్రియుండు పరిపూర్ణచిరాయురుపేతుఁ డయ్యెడున్. 185
వ. అనిన నమ్మహీపతి యమ్మునిపతికి మ్రొక్కి నీవు మాకుం బరమగురుండవు నీయా
న తిచ్చినట్ల చేసెద ననిన నారదుండు వారి దీవించి దివంబునకుం జనియె నంత.
సీ. అమరఁ బుణ్యదినంబునందు బాంధవమంత్రి, వృద్ధపురోహితవితతితోడ
సావిత్రిఁ దోడ్కొని జననాయకుండు వై, వాహికమహనీయవస్తుకోటి
గొనుచుఁ బుణ్యారణ్యగోచరుం డై తపస్వినుతుఁ డైనయాద్యుమత్సేనుకడకుఁ
జనిన నారాజును సంభ్రమంబున నశ్వ, పతికి నర్ఘ్యాదిసంభావనంబు
ఆ. లాచరించి సముచితాభిమతాలాప
పూర్వకముగ సుజనపూజ్యుఁ డతని
యాగమననిమిత్త మడిగిన మద్రేశుఁ
డెలమి సాళ్వపతికి నిట్టు లనియె. 187
క. ఈకన్నియ నాకూఁతురు, మాకులమున కెల్లఁ దేప మనుజోత్తమ నీ
కీకన్నియఁ గోడలు గాఁ, గైకొనుము మదీయవచనగౌరవబుద్ధిన్. 188
వ. అని పలికి సావిత్రి నతనికి నభివందనంబు సేయించి మఱియు నతండు. 189
తే. నీకొడుకు సత్యవంతున, కీకన్నియ దగు నరేంద్ర యీకన్నియకున్
నీకొడుకు దగు ననన్యగు, ణాకరు లియ్యిరువురును సమంచితమూర్తుల్. 190

1. అ. పరిణయంబు మొదలుగా.

వ. అనిన నతనికి ద్యుమత్సేనుం డిట్లనియె. 191

తే. విగతరాజ్యులమై ఘోరవిపినములకు, వచ్చి యిమ్మెయిఁ దపము మున్నవార మేము
బాల సుకుమారి యిది జనపాల యడవి, నుండి మాతోడియిడుమకు నోర్చునయ్య

వ. అనిన నశ్వపతి యతని కిట్లనియె. 193

చ. కలిమియు లేమియున్ సతము గా వవి సెందినచోఁ జెలంగుచుం
గలఁగుచు నున్కి ధీరులప్రకారమె లెన్నగ నింతవట్టు నేఁ
డెలియుదుఁ జెప్పదన్ వసుమతీవర పిన్న యనంగ నేర నే
కోలఁదియుఁ గాదు ధీరమతి గూఁతురు పేర్కొనఁ జాలుఁ బెంపునన్. 194

క. నీతోడ వియ్య మందం, జేతోగతి నాసఁ జేసి చెచ్చెర నిట్లే
నే తెంచితి మత్ప్రార్థన, బ్రాఁతిగఁ జేకొనక యునికి పాడియె నీకున్. 195

సావిత్రి సత్యవంతుని వివాహం బగుట.

వ. అనుటయు నయ్యంధనృపతి తత్సంబంధంబునకు సంతసిల్లి నిజాశ్రమవాసు లైన మునులం గూర్చుకొని శుభలగ్నంబున సత్యవంతునకు సావిత్రిం బరిణయంబు సేసె నయ్యశ్వపతియును గూఁతునకు నల్లునకు వివిధాంబరాభరణాదివస్తువిశేషంబు లొసంగి నిజపురంబున కరిగెఁ బదంపడి. 196

తే. పడఁతి రమణీయభూషణాంబరవిలాస, ముజ్జగించి వనాంతరయోగ్యలీల
వల్కలాజినవసన యై వదల కధిక, భక్తి భర్తృశుశ్రూషణపరత నుండె. 197

క. ఆ మెలఁత సేయు[1]సవినయ, సామకథల మృదుగభీరసంభావనలన్
మామయు నత్తయు సంతో, షామృతమునఁ దేలి రంతరంగములఁ దగన్. 198

వ. సావిత్రియుఁ దనమగనియాయుఃప్రమాణంబు నారదముని చెప్పినదినంబు మొదలుగా ననుదినంబును లెక్క యిడికొనుచుండె నిట్లు వర్తిల్లుచుండ నాలుగుదివసంబులు గొఱంతగా నొక్కసంవత్సరంబు గడచిన. 199

క. నాలవదినంబు పతిమృతి, కాలం బని మది నెఱింగి కడు నిష్ఠ మెయిం
జాల భరంబుగఁ బూనెను, బాల త్రిరాత్రోపవాసపరమవ్రతమున్. 200

వ. దానికి విస్మయం బంది ద్యుమత్సేనుండు గోడలిం బిలిచి తల్లీ యిట్లేల [2]దుస్తరం బగువ్రతంబు దొడంగితి వనిన నమ్మద్రరాజతనయ వినయంబుతో నిట్లనియె. 201

క. మీరు మదీయం బగువ్రత, భారమునకు వగవ వలదు పరమశుభంబుల్
గోరి వ్రత మేను బూనితిఁ, గారణములు మీ కెఱుంగఁ గా నగుఁ బిదపన్. 202

వ. అనిన నతం డట్లేని మేలు గాక యనియె నంతఁ జతుర్థదివసంబున. 203

సీ. కడు రేపకడయ మేల్కని నిజభర్తకు, మరణదినం బని మానసమునఁ
దద్దయు శోకసంతాపంబు గదురంగ, దినముఖోచితవిధుల్ దీర్చి భక్తిఁ
బతికి సమంచితపావనపరిచర్య, యప్పుడు [3]శుశ్రూష యాచరించి

1. అ. సువినయు, సామగ్రిని. 2. జ. దురవస్థం బగు. 3. చ. గడువేడ్క నాచ.

యత్తకు మామకు నచటివృద్ధులకును, వేర్వేఱ ప్రణమిల్లి వేడ్క వారు
తే. దనకు సౌభాగ్యభాగ్యవర్ధనము గాఁగ, నిచ్చుదీవన మదిలోనఁ గ్రహించి యున్నఁ
బ్రొద్దు జామెక్కుటయుఁ బూవుఁబోఁడిఁ బిలిచి, మామ యిట్లని పలికె సమ్మాన మెసఁగ.

క. కడు నుగ్రం బగు వ్రత మిది, దొడఁగితి దివసత్రయంబుతో నిది సెల్లెం
బడఁతీ యెంతయు డస్సితి, దడయక పారణ యొనర్పఁ దగదే యింకన్. 205

వ. అనిన సావిత్రి యతని కిట్లనియె. 206

ఆ. అధిప ప్రొద్దు గ్రుంకునంతకు నేఁడును, గుడువఁ దగదు నాకుఁ గోరి యిట్లు
గాఁగ వ్రతముఁ బూనుకాలంబునన యేను, నిశ్చయించికొనిన నియమ మిదియు.

వ. అనియె నప్పుడు సత్యవంతుఁడు సమిత్కుశఫలాహరణార్థంబు వనంబునకుం గద
లినం జూచి సావిత్రి యతనిఁ జేరం జని వనంబున కేనును నీతోడఁ జనుదెంతుఁ
దోడ్కొని పోవలయు ననిన నతండు నీవు త్రిరాత్రోపవాసంబునం జేసి యెంతయు
డస్సినదానవు రా నోప వనిన నది వాని కిట్లనియె. 208

మ. ఉపవాసశ్రమ మిప్పు డించుకయు నాయుల్లంబునం దోఁప దీ
విపినం బుజ్జ్వలపుష్పపల్లవఫలావిర్భూతినానాలతా
గపరీతం బన విందుఁ గూడఁగ మదిం గౌతుహలం బయ్యె న
న్నుపరోధింపకు మింతవట్టుచన వీ యుక్తుండ వెబ్భంగులన్. 209

వ. అనిన నతం డట్లకాక చనుదెమ్మనుటయు సావిత్రి చయ్యనం జని భార్యాసహితుం
డయి యున్నతనమామకుం బ్రణమిల్లి మీకొడుకు వనంబునకు నగ్నిహోత్రా
ర్థం బై సమిధలు దేర నరిగెడు నాకును నతనితోడన చని వనంబు సూడ వే
డ్క యైనది మీరు నా కివ్వరంబు గృప సేయ వలయు ననిన నాతం డిమ్మగువ
యెన్నండును నెయ్యదియును నడుగ దిత్తెఱంగు దీనికిం బ్రియం బై యున్నది
నాకు నివారింప నేల యని తలంచి యనుమతించిన న య్యిరువురయడుగులం
బడి వీడ్కొని. 210

సత్యవంతుండు సావిత్రీసహితుం డై వనంబునకుం బోవుట.

క. చిత్తంబునఁ బైకొనియెడు, నుత్తల మడఁచుచును ముఖపయోరుహమునఁ ద
ళ్కొత్తెడు వెడనవ్వునఁ బ్రియు, చిత్తం బిగురొత్తఁ జనియెఁ జెలువ యడవికిన్.

వ. ఇట్లు దంపతులు మందగమనంబున నరిగి పరిసరారణ్యంబు దఱియం జొచ్చి
రప్పుడు. 212

సీ. కమనీయకమలినీకల్లోలవీథులఁ, గదలురాయంచలగతులయొప్పు
బహుపుష్పపల్లవప్రకరచిత్రితము లై, తనరారుతరులతాతతులసొంపు
మకరందరసపానమదవిలోలంబు లై, క్రాలెడిమెలదేఁటిగములయులివుఁ
బరిపక్వమంజులఫలరసోద్ధతము లై, పలుకురాచిలుకలపటురవంబుఁ

ఆ. బ్రియుఁడు వేఱువేఱ ప్రీతిమైఁ జూపుచుఁ, జెప్పుచును జనంగఁ జిగురుఁబోఁడి

గనుచు వినుచు నిర్వికారసల్లాపంబు, లార నతని తెఱంగు నరయుచుండె.

వ. తదనంతరంబ యారాజర్షినందనుండు మధురంబు లగుఫలంబులు గోయుచు గరిడియ నిండించి యొక్కయెడఁ బరశుపాతంబునం జేసి కాష్ఠదళనంబు సేయం దొడంగి శ్రమంపడి యొల్లంబోయి గొడ్డలి పుడమిపయి వైచి నిరంతరనిశ్శ్వాస[1]వివర్ణవదనుం డగుచు సావిత్రిం గనుంగొని. 214

చ. ఒడలు వశంబు గాదు భ్రమ నొందినయట్లు మనంబు దూలెడిం
గడఁగి శిరంబు శూలవిశిఖప్రకరంబున నొంచినట్టి ద
య్యెడు నిలువంగ నోర్వ నొకయించుక సేపు శ్రమంబు దీఱ నీ
యెడ శయనింతు నావుడు సితేక్షణ మెత్తనిసంభ్రమంబుతోన్. 215

క. తనయంకతలము ప్రియుశిర, మున కుపధానముగఁ జేయ భూపతనయుఁ డా
య్యాన వ్రాలి సోలి నిశ్చే, తనుఁ డైన ట్లుండెఁ గొంతతడవున కెమురన్. 216

మ. కనియెం గోమలనీలమేఘ[2]విలసత్కాలాంజనాకారు ఘో
రనిశాతోత్కటదంష్ట్రు నుజ్జ్వలచలద్రక్తాక్షుఁ బ్రత్యగ్రకాం
చనవర్ణాంబరు నంత్యకాలదహనజ్వాలాప్రచండుం జగ
జ్జనసంత్రాసకు నొక్కదివ్యుఁ బటుపాశప్రౌఢహస్తోద్ధతున్. 217

వ. అప్పురుషుండును నధికసంరంభంబున సత్యవంతుం గదిసిన నయ్యింతి యెంతయు భయంబునం బ్రియునిశిరం బొయ్యన దిగువం జేర్చి నిల్చి కృతాంజలి యై యయ్యా మీ రెవ్వ రియ్యెడకు నెయ్యది సేయం దలంచి విజయంచేసితి రనిన నతం డి ట్లనియె. 218

సీ. కాలుండఁ జువ్వె యేఁ గమలాక్షి నను నీవు, మహితపాతివ్రత్యమహిమఁ జేసి
కానంగఁ జాలితి కాన రా దన్యుల, కిదె నీదుభర్తకు నిపుడు కాల
మగుటయు వీఁడు మహాపుణ్యనిధి గాన, యితరులఁ బనుపక యేన వీనిఁ
గ్రచ్చఱఁ గొనిపోవఁ గాఁ జనుదెంచిన, నని యుగ్రభంగి నయ్యంతకుండు

ఆ. ధరణినాథతనయుతనువునఁ బ్రాదేశ, పరిమితాత్ముఁ డగుచుఁ బ్రజ్వరిల్లు
జీవు వెడలఁ దిగిచి చెచ్చెర నతిదీర్ఘ, భయదపాశనికరబద్ధుఁ జేసి. 219

మ. కొని వేగంబున దక్షిణాభిముఖుఁ డై ఘోరంపుమార్గంబునం
జనఁగాఁ జొచ్చె ననంతరంబ మదిలో సావిత్రి శోకంబు పై
కొనఁ బ్రాణేశ్వరుదేహ మొక్కయెడ సంగుప్తంబు గావించి యం
తనిపజ్జం దగఁ దాను నేఁగెఁ బదపద్మంబుల్ పొరిం దొట్రిలన్. 220

ఆ. దానిఁ జూచి దండధరుఁడు నీ విట్లేల, వచ్చెదవు లతాంగి వలదు నిలువు
మింతి నీకగమ్య మిటమీఁది తెరు వెల్ల, ననిన నతని కిట్టు లనియెఁ బొలఁతి.

క. పతు లెందుఁ జనిన నచటికి, సతులకుఁ జన వలదె నీప్రసాదమునను మ

---

1. క. విషణ్ణవదనుం డగుచు. 2. గ. జ. విదళత్కా.

తృతిభక్తికతమునను సం, స్తుతగుణ నా కరుగ రాని చోటులుఁ గలవే. 222

వ. సకలమార్గంబులందును ధర్మమార్గంబు ప్రధానం బట్టిధర్మంబునకు నాధారంబు సజ్జనుల యని వినంబడు నట్టిసజ్జనసందర్శనం బెప్పుడు వృథగాదు గావున సజ్జన శేఖరుండ వనం జనునీ దైనసందర్శనంబునం బరమశుభంబులం బొందక యేను రిత్తజనంబుల తెఱంగున నూరక యెట్లు మగుడుదు ననిన దానిప్రగల్భవచనంబులకు నద్భుతం బంది ధర్ముం డి ట్లనియె. 223

ఆ. తనులతాంగి భవదుదారవాగ్భంగికి, మెచ్చు వచ్చె నాత్మ నిచ్చువాఁడ వేఁడు మొక్కవరము విభునిజీవిత మొక్క,టియునుదక్క నేదియయిననొండు.

సావిత్రి యమునివలన నభీష్టవరంబులు నడయుట.

చ. అనవుడు మద్రరాజసుత ప్రాంజలి యై సమవర్తితోడ ని
ట్లను రిపుకోటిచే నపజయంబునఁ బొంది వనాంతరంబునం
[1]దనవరతవ్రతాభిరతుఁ డై నమహాత్ముఁడు సాళ్వభూవిభుం
డనఘుఁడు లబ్ధచక్షుఁ డగునట్టులుగాఁ గరుణింపవే మదిన్. 225

క. నావుడు నట్టుల యయ్యెడు, నీ విట రావలవ దుడుగు నెమ్మి నని వెసం
బోవఁ దొడంగెను బితృపతి, యావెలఁదియు నంత నిలువ కరిగెఁ బిఱుందన్.

వ. ఇట్లు చని చని మఱియు ని ట్లనియె. 227

చ. ఁడపక వాఙ్మనఃక్రియల నేరికి హింస యొనర్పఁ బూన రె
య్యెడలను దీనులం గరుణ యేర్పడఁ బ్రోవన చూతు రిచ్చఁ జొ
గడమ వడంగ నీ కెదిరికాంక్షితముల్ దుదిముట్టఁ దీర్తు రె
క్కుడు మదిఁ గూర్తు రాశ్రితులకుం గని మిన్నియు నార్యధర్మముల్. 228

క. నీ వెఱుఁగనియది యెయ్యది, దేవ్యాత్తమ ధర్మగతులఁ దెలిఁ గెల్ల భవ
ద్భావాధీన మగుటఁ గా, దే వెలసితి వీవు ధర్మదేవత యనఁగాన్. 229

క. సమబుద్ధితోడఁ దత్త, త్సముచితకర్మఫల మఖిలజంతుతతులకుం
సమకూర్చుట నీ కయ్యెను, సమవర్తి యనంగఁ బేరు జగదభినుత యై. 230

క. యముఁ డండ్రు నిన్ను నార్యులు, యమింతు భూతముల నెల్ల న ట్లగుటఁ దగం
శమనుండ వైతి కల్మష, శమనంబునఁ జేసి నీవు జలజాప్తసుతా. 231

వ. అనినం బ్రేతపతి యాపుణ్యసతి కి ట్లనియె. 232

క. తృషితుఁ డగువానిఁ బరిలఘు,తుషారతోయములు మోదితునిఁ జేయుగతిం
హృషితాంగుఁ జేసె ననుఁ గల్మషరహితము లై ననీసమంజసఫణుతుల్. 233

వ. కావున సత్యవంతుప్రాణంబులు దక్కం దక్కినకోర్కి యెయ్యది యైనం జెప్పుము సఫలంబు సేసెద ననిన సావిత్రి దేవా వైరులచేత నపహృతం బైనరాజ్యం బెప్ప

---

1. క. దనవరతప్రభీతియతుఁ డై.

టియట్లు ద్యుమత్సేనుండు ప్రాపించునట్లుగా ననుగ్రహింపవే యని వేఁడుటయు వైవస్వతుం డట్ల యగు నని పలికి యిట్లనియె. 234

ఆ. వలదు నిలువు మింక వదలక నీభక్తి, మగని కెక్క దుర్గమంపుఁద్రోవ
యిది కృతంబు లయ్యె[1]నెల్లయు నీ విట, వచ్చు సెలవు లేదు వనజనయన. 235

వ. అనిన నమ్మహాభాగ యతని కిట్లనియె. 236

క. ధర్మాత్ములు దమసలిపెడు, ధర్మక్రియ దప్ప రెట్టిదశలందును మో
హార్తియుఁ దాపముఁ బుట్టవు, ధార్మికహృదయములఁ బ్రథమధర్మాఖ్యాతా.

క. కావునఁ బతియనుగమనం, బేవిధమున విడువఁ దగునె యెట్లయినను మో
హావేశముఁ బొందక ధ, ర్మావస్థితి సలుప వలదె యవహితబుద్ధిన్. 238

తే. అనిన నంతకుఁ డిట్లను నతివ నీవు, ప్రకటధర్మవిశేషతత్పరవు గాన
యింక నొకవరమిత్తుఁ బ్రాణేశుబ్రదుకు, వలదుగాని యొండడుగుము వలయు దాని.

వ. అనుటయు నక్కాంత కృతాంజలి యై మాతండ్రి మద్రేశ్వరుం డపుత్రకుం డతనికిఁ బుత్త్రశతలాభంబు గావలయు నని యభ్యర్థించిన నట్లకా నిచ్చితి నని పల్కి ధర్మరాజు నేఁడు నీవు గడుదూరంబు వచ్చి డస్సి తింక మగుడుట లెస్స యని పలికిన నప్పతివ్రత యిట్లనియె. 240

తే. నాకు డప్పి యెక్కుడిది మనంబు భర్తృ, చరణపంకజాసక్త మై కరము భక్తి
నలరుచున్నది సతులకు నన్య మెట్టి, దియును ధర్మ మె భర్తృసంశ్రయము కాక.

వ. మఱియు నొక్కవిన్నపంబు సేసెద. 242

ఆ. ఆత్మధర్మనిరతు లైనపుణ్యాత్ములు, దుర్లభులు సమస్తదురితములును
శాంతిఁ బొందు వారిసంసర్గమునఁ దీర్ఘ, భూతమతులు వారు భూతలమున. 243

ఉ. వారలపేర్మిఁ గాదె శశివారిజమిత్త్రులు నిర్వికారసం
చారత నుల్లసిల్లెదరు సర్వపయోనిధుల్ నిరాకులా
కారతఁ గ్రాలెడుం గులనగంబులు నిశ్చలరూఢిఁ జాల నో
ప్పారెడు భూతధాత్రి నిఖిలైకధురీణతఁ బేర్మిఁ బొందెడున్. 244

వ. అని పలికి మఱియు నిట్లనియె. 245

తే. ఏడుమాట లాడినయంత నెట్టివారు, నార్యజనులకుఁ జుట్టంబు లగుదు రనినఁ
జిరసమాలాపసంసిద్ధి[2]జేసి నీకు, నేను జుట్టమ నని వేఱ యేల చెప్ప. 246

వ. కావున మిత్త్రమనోరథం బవశ్యకర్తవ్యంబుగాఁ జిత్తగింపు మనిన నమ్మహానుభావుం డబ్బామిని దెసం గనుంగొని నీకుం బ్రసన్నుండ నైతి నభీష్టం బైనవరం బొక్కటి యిచ్చెద వేఁడు మనిన నమ్మానిని యిట్లనియె. 247

క. మది సత్యవంతుజీవిత, మది యిమ్ముగఁ దొలఁగఁ బెట్టి యన్యంబుల ని
చ్చెద నని పలుకుదు మును నీ, వది యిప్పుడు లేద యింక నడిగెదఁ బ్రీతిన్.

---

1. అ. నెల్లవియును నిటు, వచ్చు నెలవు. 2. జ. జేసి యునికి.

చ. [1]పతిరహితంబు దుస్సహము । భర్తృవినాకృత యైనకాంత దూ
షిత యగు సర్వమంగళవిశేషములందును గాన మత్ప్రియుం
డతులితకీర్తిశాలి సుగుణాఢ్యుఁడు సాళ్వసుతుండు లబ్ధజీ
వితుఁడుగ నిమ్ము ధర్మపదవీపరిరక్షణ పుణ్యవీక్షణా. 249

వ. అనిన నట్ల చేయుదు నని యాక్షణంబ కృతాంతుండు సత్యవంతు నపగతపాశుం
జేసి యాసుందరి కిట్లనియె. 250

చ. కొను మిదె నీమనఃప్రియుని । గోమలి వీఁడు చతుశ్శతాబ్దముల్
మను నిటమీఁదఁ బుత్త్రులఁ గ్రమంబున నూర్వురఁ గాంచుఁ గీర్తివ
ర్ధనుఁ డగు సంతతాధ్వరవిధానములం బరితుష్టి సేయు న
య్యనిమిషకోటి కెల్లను [2]నిజాన్వయమాళివిభూషణుం డగున్. 251

వ. అని యాదేశించి యాతం డంతర్హితుం డయ్యె నక్కాంతయుఁ గ్రమ్మఱి చని యె
ప్పటియట్ల జీవితేశ్వరుం దనతొడలపై నిడుకొని కూర్చున్న యెడం గొండొకవడికి
లబ్ధచేతనుం డై సత్యవంతుండు దెలిసి నిజవల్లభం జూచి యిట్లనియె. 252

క. కడుఁ బడవు నిద్ర వోయితిఁ, [3]బడఁతీ ననుఁ దెలుపవలదె । బలియుఁ డొకరుఁ డె
క్కుడు జవమునఁ బట్టి బలం, బెడలఁగ ననుఁ దిగిచె నాతఁ । డెవ్వఁడు సెపుమా.

చ. అది గల గాదు నిక్కువమ । యైనటు లున్నది నాకు నెంతయున్
మది మఱపుట్టె నావుడును । మానిని యిట్లను నీకు నంతయున్
ముదమున రేపు సెప్పెదఁ దమోమయ మై యిదె శర్వరీముఖం
బొదవె విలంబనం బిచట । నొప్పదు లెమ్ము నరేంద్రనందనా. 254

మ. అదె నక్తంచరు లిందు నందును మహోగ్రాకారు లై [4]క్రందుగా
మెదలం జొచ్చిరి ఘోరఫేరవరుతుల్ । మిన్నందెఁ దీవ్రంబు లై
పదశబ్దంబులు మీఱఁ జూడు కలయం । బాఱం దొడంగెం బెనుం
గదుపుల్ గట్టి మృగంబు లెంతయు భయోత్కంపంబు నాకయ్యెడిన్. 355

క. విను నీవు దడయుటకు మీ, జననియు జనకుండుఁ గరము । సంతాపభరం
బునఁ బొందుదు రింతకుఁ గ్ర, న్నన వారికి సంతసం బొనర్పవె యధిపా. 256

వ. అని పలికి తదీయవిషాదచేష్టితంబు లుపలక్షించి వెండియు. 257

చ. తమమును బెల్లుగాఁ బరఁగె । దవ్వు నిజాశ్రమభూమియయ్యు మదిన్
శ్రమమును బాయ దిప్డు ననుఁ । జందమ యైనఁ జనంగ నేల యిం
పమరఁగ నింత ప్రొద్దు సుగుణాకర యిచ్చట నిల్చి రేపు వో
దమె తెఱఁ గెద్ది నావుడును । దన్వికి సాళ్వతనూజుఁ డిట్లనున్. 258

క. మానె శిరోవేదన నా, మేనికిఁ దగులావు వచ్చె । మెల్లన యరుగం

---

1. అ. పతివిరహాంబు. 2. క. నిజాన్వయకోటివిభూషణంబుగన్. 3. శ. క. జ. బడలి
నను దెలుప వలదె ♦ మఱియొక్కరుఁడె. 4. జ. క్రమ్మఁగా.

గా నేర్తుఁ దల్లిదండ్రులఁ, గానక యే నెట్లు నిలుతుఁ । గాననభూమిన్. 259

క. ఇంతకు మున్నెన్నఁడు నే, నింతతడవు వారిఁ బాసి । యెందుఁ దడయ నేఁ
డింతవడి మసలుటకు వా, రెంత వడిరో యేమి యైరొ । యెట్లున్నారో. 260

ఆ. సంధ్యప్రొద్దు నన్ను । జనని యెన్నఁడు నిలు, వెడల నీదు నేఁడు । విపినభూమి
మధ్యరాత్రివేళ । మసలుట కాయమ, యెట్టిపాటు వడునొ । యే నెఱుంగ. 261

సీ. కౌఁగిటనను జిక్కఁ । గదియించి శిరము మూ, ర్కొంచును బాష్పముల్ । గురియుచుండఁ
బట్టి మాయొడలును । బ్రాణంబులును నెల్ల, యర్థముల్ నీవ మా । యన్న నీవు
దేపగా సంసార । తీరంబు సేరెద, మని తలంచెదము ను । మ్మన్న యన్న
కన్నులు లేనిమా । కన్నులుఁ గాళులు, నీవ కదన్న మా । నిఖిలవంశ

ఆ. మును సముద్ధరించు । మోపు నీయదియ క, దన్న యనుచు నిట్టు । లగ్గలంపుఁ
బ్రేమ ననుదినంబుఁ । బ్రేముడింతురు వృద్ధు, లక్కటకట యేమి । యైరొ నేఁడు.

ఆ. అడవి కేఁగు దెంచి । యడరంగ ఫలమూల, తతులు గొనుచు నేను । దడయ కపుడ
పోవ నోప నైతి । దైవోపహతి నింత, చిక్కుపడితి నేమి । సేయువాఁడ. 263

క. నాయున్నచో టెఱుంగక, యాయాశ్రమవాసు లైన । యందఱు నతిదుః
ఖాయత్తుఁ డగుచు నడుగును, మాయయ్య దలంకి మాటి । మాటికి నింకన్. 264

క. నావార్త వినక యింతకు, నావృద్ధులు భిన్నహృదయు । లై ప్రాణంబుల్
వో విడుతురు గాక చటికిఁ, బోవం బని గలదె యేనుఁ । బుచ్చెద నసువుల్. 265

—••—సత్యవంతుఁడు సావిత్రితోడ మరలి తనయాశ్రమంబునకు వచ్చుట.—••—

వ. అని బహుప్రకారంబులం బలవరించి కన్నీరు నించిన నక్కాంత దుఃఖాక్రాంత యగుచు నతని నాశ్వాసించి నవమృణాళమృదులంబు లగుభుజంబులం గౌఁగిలించి మెగయ నెత్తిన మెత్తన నిలిచి యతండు ధూళిధూసరం బైనశరీరంబు దొడసి కొని గమనంబున కుత్సహించిన. 266

క. ఫలభారము దుర్భర మని, వెలఁది యచట నొక్క వృక్ష । విటపంబున ని
మ్ముల గరిడియ దగిలిచి యు, జ్జ్వలపరశువుఁ గొనుచు మృదుల । సంభ్రమలీలన్.

వ. జీవితేశ్వరు వామబాహువు నిజవామభుజంబుపయి నిడికొని దక్షిణహస్తంబున నతని గ్రుచ్చి కౌఁగిలించి మందగమనంబున నాశ్రమోద్దేశంబునకు మగిడె నంతకు మున్న యక్కడ. 268

ఉ. కన్నులు వచ్చి యెల్లెడలుఁ । గన్గొని వృద్ధన రేంద్రుఁ డాత్మకుం
గన్నులుఁబోలె నైనతన । గాదిలిపుత్త్రుఁడు గాననంబులో
నెన్నఁడు లేనియంతతడ । వేటికిఁ జిక్కెనొ యంచు నార్తితోఁ
గన్నులు లేనియ ట్లొకఁడుఁ । గానక యేడ్చె సతీసమేతుఁ డై. 269

తరలము. కొడుకు నిందును నందు రోయుచుఁ । గోరి ప్రేమభరంబునం
గొడుకు సద్గుణకోటు లెల్లను । గోటిభంగుల నోలి ను

గ్గడన సేయుచు సత్యవంతునిఁ గానరే మునులార యీ
యడవిలోపల నంచు హాసుత యంచు దైర్యము డించుచున్. 270

వ. ఉన్నంతఁ దదాశ్రమవాసు లైన మును లందఱు నతనిం బొడగని తదీయనయన లాభంబునకు విస్మయం బందుచు నుచితవాక్యంబుల నతని నాశ్వాసించు చుండిరి తదనంతరంబ యొక్క ముహూర్తంబునకు సావిత్రీసహితుం డై చిత్రాశ్వుండు సనుదెంచిన నావృద్ధదంపతు లత్యంతహర్షంబున నతనిం గౌఁగిలించుకొని మూర్ధఘ్రాణంబు సేసిరి మునివరులును గరంబు సంతసిల్లి రప్పు డారాజర్షిముఖ్యుండు పుత్రునిం జూచి యయ్యా యిట్లేల వనంబులో మసలి తని యడిగిన నతండును దానుఁ జని పండ్లు గోయుటయును గాష్ఠదళనంబు సేయునెడం దలయేరు గదిరి నిలువ నోపక విశ్రమించుటయుఁ దన్నొక్క పురుషుండు గలలోన నిగ్రహించుటయుం జెప్పునెడ సావిత్రి మామ కి ట్లనియె. 271

సీ. ఈరాజసుతునకు నిద్దనంబున మరణం బని ముని చెప్పె నారదుండు
మునినాథువచనం బమోఘంబు గావున, నేమఱ కేను నేఁ డితనితోడ
నడవికి నేఁగితి నచట నీతఁడు సుప్తుఁ డై యున్నయెడ వచ్చె నంతకుండు
వచ్చి యివ్విభునిజీవముఁ గొని పోవంగ, వెనుకస చని యేను వివిధభంగి

ఆ. సత్యధర్మఫణితి సంస్తుతించుటయుఁ గృపార్ద్రచిత్తుఁ డగుచు నజ్జముండు
నాకు నెమ్మి నొసఁగె నాలుగువరము లందొకట నితఁడు జీవయుక్తుఁ డయ్యె.

వ. మఱియు నొకవరంబు భవదీయనయనోన్మేషణకారణం బయ్యెఁ దక్కినవరద్వయంబునకు మీకు వైరిహృతరాజ్యసంప్రాప్తియు మదీయజనకునకుఁ బుత్రశతలబ్ధియు నగు నని చెప్పిన నయ్యిద్దఱుఁ బరమానంద[1]కందళితహృదయు లై కోడలి కి ట్లనిరి. 273

క. ఆపత్సముద్రమగ్నం, బై పోయెడునస్మదన్వయము పెంపెసఁగం
దేప యయి కడవఁ జెట్టిన, నీపుణ్యచరిత్ర కీర్తనీయము తల్లీ. 274

వ. అని యభినందించి రప్పు డయ్యిందువదన మునివరు లందఱుఁ బ్రశంసావచనంబుల నుపలాలించి వారల దీవించి నిజగృహంబులకుం జని రంతం గతిపయదినంబులకు. 275

సీ. ఆసాళ్వభూపతియాప్తమంత్రులు మూలభృత్యులుఁ బౌరులుఁ బృథివిఁ గలుగు
పెద్దలుఁ గూడి సంప్రీతి నాతనిపాలి, కేతెంచి వినయసమేతు లగుచు
నవనీశ నీశత్రుఁ డాత్మీయభృత్యభే, దనమునఁ జేసి బాంధవసహాయ
సహితుఁ డై మృతిఁ బొందె సకలజనంబులు, నేకచిత్తంబున నిపుడు నిన్నుఁ

ఆ. బ్రకటరాజ్యపదవిఁ బట్టంబు గట్టంగ, వచ్చినారు నిఖిలవసుధయందు
విస్తరిల్లె నీదువిజయఘోషము భద్రగజము నెక్కి వేగ కదలు మింక. 276

1. క. శీతలశరీరు లై.

క. ప్రాకటతపోబలంబున, నాకలితవిలోచనుండ వై యున్న నిన్నున్
లోకేశ చూడఁ గంటిమి, "మాకన్నులు చల్ల నయ్యె మాభాగ్యమునన్." 277

వ. అనినం బ్రహృష్టహృదయుండై ద్యుమత్సేనుండుఁ దత్క్షణంబ తదాశ్రమవాసు
లయినమునుల నామంత్రణంబు సేసి కొడుకునుం దానును గజారూఢుండై (సతీ
సమేతుండగుచు) బహుళచతురంగసేనాసంకులగమనంబునం బురంబునకుం జని
సకలమహీరాజ్యంబును గైకొని చిత్రాశ్వునకుం బురజనసమ్మతిం బ్రథితయావ
రాజ్యపట్టం బొసంగి పరమైశ్వర్యధుర్యుం డయ్యె ని త్తెఱంగున. 278

క. తనమగని నత్తమామల, జననీజనకులను దన్ను సకలకులంబున్
ఘనముగ సముద్ధరించెను, జనవర సావిత్రి దత్సుచరితన కంటే. 279

తే. ఆపతివ్రతయట్ల యీయాజ్ఞసేని, పరమకల్యాణి ధర్మసంభావనీయ
యధిప మిమ్మును మీయఖిలాన్వయంబు,నుద్ధరించు మహాభాగ్యయుక్తిఁ జేసి.

క. అని చెప్పి పాండుతనయుల, ననఘుల వీడ్కొని మునీంద్రుఁ డనుపమతేజో
ఘనుఁ డగుమార్కండేయుఁడు, దనయాశ్రమమునకు నరిగెఁ దద్దయు నెమ్మిన్.

సూర్యుఁడు బ్రాహ్మణవేషంబునఁ గర్ణునకు హితంబు సెప్పుట.

వ. అని చెప్పిన విని జనమేజయుండు వైశంపాయనునితో మునీంద్రా యింద్రుండు
గర్ణకవచకుండలంబు లెవ్విధంబున హరియించెం జెప్పవే యని యడిగిన నతం
డి ట్లనియె. 282

సీ. వనమున నప్పాండుతనయు లుండఁగ నందు, వరుసఁ బండ్రెం డగువత్సరంబు
కడపట నింద్రుఁడు గడఁగి పాండవహిత, కారి యై కర్ణునికవచకుండ
లములు మాయాప్రయోగమున హరింపంగఁ, దలఁచిన నాతనితలఁ పెఱింగి
జలజాప్తుఁ డొకనాఁడు వెలయు రాధేయున, కదియెల్ల నెఱింగింతు నని తలంచి

ఆ. లోకనుతుఁడు బ్రాహ్మణాకార మొప్పంగ, నతనియున్నకడకు నరుగుదెంచి
యేకతంబ యున్నయాకర్ణుతోడ న, భీష్టభంగి దోఁప నిట్టు లనియె. 283

క. ఓకర్ణ సుజనవినుత గు, ణాకల్ప భవద్ధితార్థ మై యొకకార్యం
బేకతమ చెప్ప వచ్చితిఁ, బ్రాకటముగ వినుము నాదుపలుకులు వరుసన్. 284

వ. పాండవపక్షపాతి యై పాకశాసనుండు భవదీయంబు లయినకవచకుండలంబులు
హరింపం గోరి నీవు బ్రాహ్మణప్రియుండ వనియును బ్రాహ్మణు లడిగిన నెయ్యది
యైనను వంచన సేయ వనియును నెఱుంగుం గావునఁ గపటబ్రాహ్మణుఁడై వచ్చి
యడుగం గలవాఁడు నీవును గవచకుండలంబు లీ వలవదు రత్నకాంచనవనితా
ప్రముఖంబు లయినపదార్థంబులు సూపియుం బ్రార్థించియు నెవ్విధంబున నయినం
గడపి పుచ్చ వలయు నట్లు గాక వీని నతని కిచ్చి తేని మృత్యువశంబునం బొందఁ
గలవాఁడవు. 285

చ. అమృతమయంబు సువ్వె సుగుణాకర యిమ్మహనీయవస్తుయు

గ్మ మివియ యుండునేనిఁ ద్విజగోగంబులయందు నశేషశత్రులో
కమునకు నీవు వధ్యుఁడవు గావు నిరంతరసౌఖ్యసంప్రమో
దమున వెలుంగు దీ విధి హితంబుగఁ జెప్పితి మోసపోకుమీ. 286

క. అనిన విని సూతతనయుఁడు, వినయంబున నిట్టు లనియె విప్రాకారం
బున వచ్చినవేల్పువు నీ, వనఘా యెవ్వఁడవు నాకు నానతి యీవే. 287

క. అనిన నతఁ డేను సూర్యుఁడ, మనమున నీయందుఁ గలుగుమక్కువఁ గర్జం
బానరఁగ నుపదేశింపం, జనుదెంచితి ననిన నతఁడు సంభ్రమ మొప్పన్. 288

వ. అభివాదనంబు సేసి దేవా దేవర నాకత్యంతహితుండ వగుటం జేసి కృతార్థుండ
నైతి నిం కొక్కవిన్నపంబు సేసెద నవధరింపుము. 289

ఉ. భూసురకోటి వేఁడుటయుఁ బోఁడిగఁ బ్రాణము లైన నీగి నా
బాస దినేశ [1]లోకమునఁ బ్రస్ఫుట మింతయు నట్లు గావునన్
వాసవుఁ డట్టె నన్నడుగ వచ్చుఁ బ్రియం బడి నాకు నొక్కబ్రాఁ
తే సురలోకవందిత మహాదిం గవచంబును గుండలంబులున్. 290

క. జగముల నెల్లను నిండిన, పొగడిత గడువెలితి సేసి పొల్లయొడలికై
తగవే జన్మవ్రత మిటు, దిగ విడువఁగ నేఁడు నాకుఁ ద్రిభువనదీపా. 291

మ. మఱిఁ గుంతీసుతపక్షపాతి యగుచున్ మాయాస్వరూపంబుతో
[2]జితదైత్యుండు శతక్రతుండు నను భిక్షింపంగ నేతెంచున
ట్టితఱిం గైనఁ దదీయకీర్తియ చుమీ డిందుం ద్రిలోకీసము
న్నత మై యొప్పు మదీయకీర్తి యిది సూ నాపుణ్య మెబ్భంగులన్. 292

ఆ. కీర్తి విడువఁ జాలఁ గీర్తితో మెలఁగంగఁ, జావు వచ్చెనేనిఁ జత్తుఁ గాని
జగములోన నెల్ల నడికంటెఁ జావు మే, లనఁగఁ బరఁగుమాట యనఘ వినవె.

ఉ. కీర్తియ యిచ్చుఁ బుణ్యగతిఁ గీర్తియ తల్లియుఁబోలెఁ బోచు స
త్కీర్తియ యాయువున్ సిరియున్ గీర్తివిహీనుఁడ చూ శవంబు దు
ష్కీర్తికు నెల్లచేటులును గిట్టి హరించు ననండె తొల్లి భ
ర్తార్తిహరుండు నాఁ బరఁగునంబుజసూతి జగద్ధితంబుగన్. 294

సీ. విప్రులు గడు నర్థి వేఁడినఁ గలిమిలోఁ, బొచ్చెంబు సేయక యిచ్చు టొకటి
బలితంపుఁబగతురఁ బరిమార్చు టొక్కటి, దండియై యనిఁ జచ్చుటొండె నొకటి
శరణాగతుని నెట్టిశత్రునినైనను, గరుణఁ గయ్యంబునఁ గాచు టొకటి
భామినీద్విజవృద్ధబాలాతురుల కైన, యాపదఁ జెచ్చెరఁ బాపు టొకటి

ఆ. [3]యనఘ యివి వ్రతంబు లై చెల్లు నాకు నిం, దొకటి దప్పెనేని వికలకీర్తి
నగుదుఁ గాన యిత్తు [4]నఖిలభావముల నా, ఖండలునకుఁ గవచకుండలములు.

1. క. గ. దీని నడుమం బంగఁ జతుర్ముఖుఁ డైననోపఁడ, వ్యాసవు. 2. క. జితధైర్యుండు, 3. జి. యైనయివి. 4. గ. నఖిలమ్ము నెఱుఁగునా.

వ. అనినఁ గర్ణునకు సూర్యుం డిట్లనియె. 296

క. కడు నెయ్యురు హితముగఁ జె, ప్పెడుపలుకులు వినవు గరము బేలవు నీ వె
క్కడ బుద్ధి తెరువు లెక్కడ, చెడక వినుము నీకుఁ దెలియఁ జెప్పెదఁ గర్ణా.

క. తనకుఁ దనయులకు సతులకు, జననీజనకులకు బంధుజనులకుఁ గీడౌం
దని తెరువునఁ గీర్తి గొనం, జనుఁ గాకం దఱును జెడుయశం బేమిటికిన్. 298

ఉ. కావున నీవు ప్రాణములు గావుము కీర్తి యటుండ నిమ్ము నీ
జీవిత మున్నఁ గీర్తి మఱి చేరదె కీర్తి యొకం డనంగ నే
లా వనితల్ దనూభవులు లక్ష్ములు బంధులు సార్వభౌమ తే
జోవిభవంబు [1]ని మ్మడరఁ జొప్పడుఁ బ్రాణ మొకండు గల్గినన్. 299

క. మృతుఁ డైన నరుఁడు వెస భ, స్మితుఁ డై చనుఁ గాక కీర్తి మేలిమి గను నే
మృతదేహంబునకు నలం, కృతిఁ జేసినయట్లు మృతునికీర్తియుఁ బదపన్. 300

వ. నీవు నాకు నత్యంతభక్తుండ వగుటం జేసి భక్తజనరక్షణంబు గర్తవ్యంబు గావున నీ కిట్లన్నియుం జెప్పవలసె మఱియు దేవనిర్మితం బై నరహస్యం బొక్కటి గలదు దానం జేసి నీయందు నాకు వాత్సల్యంబు మిగిలియుండు నది యిప్పు డేను జెప్పఁ బదపఁ దనయంతన యెఱుంగంబడియెడుఁ నీకు నర్జునునకుం దెగనిపగ వై యుండు మీకుఁ గయ్యంబు నయ్యెడు నందు నీవు సహజకుండలమండితుండ వగుటం జేసి యర్జునున కజయ్యుండ వయ్యెద వట్లుం గాక వీనిం గోలుపోయి తేని నెంతయు దెప్పరం బగు ననినం గర్ణుం డిట్లనియె. 301

మ. కరుణామూర్తివి నీవు సంతతము భక్తశ్రీసమాధానత
త్పరచిత్తుండవు గావునం గడఁగి నాపై మక్కువం బద్మినీ
వర మే లానతి యిచ్చితిం కొకటి దేవా నిన్నుఁ బ్రార్థించెదం
గరుణన్ నాప్రతికూలదుర్లలితవాక్యంబుల్ సహింపం దగున్. 302

క. అనృతమున కెంత వెఱతును, విను మంతకునకును నంత వెఱవఁ బ్రతిగ్రహిం
చినవ్రతము విడిచి దుర్గతిఁ, జనఁ జాలుదునయ్య నన్నుఁ జను నే మాన్పన్. 303

వ. అర్జునుండు దుర్జయుం డని చూడవలదు నీవును మదీయంబు లగు దివ్యాస్త్రవిశేషంబు లెఱుంగుదు జామదగ్న్యుండును ద్రోణుండును నాకు నొసంగినదివ్యాస్త్రంబు లల్పంబులు గావు గావున నవశ్యంబును సమరంబున నమరరాజనందనుం దెగటార్ప నోపుదు నీ వింక నొండు దలంపక నాకు ననుజ్ఞ యి మ్మనిన నొక్కింత విచారించి యా దేవుండు రాధేయున కిట్లనియె. 304

సూర్యుఁడు గర్ణునితో నింద్రుచే శక్తిఁ గైకొను మని చెప్పుట.

తే. ఎల్లభంగుల నిశ్చయం బిదియ యేని, వత్స విను మింక నొక్కటి వాసవునకుఁ
గలదు దారుణంబును నమోఘంబు నైన, శక్తి యది నీకు నడుగుము సవినయముగ.

1. గ. నిమ్మపడ. 2. క. యాదితేయుండు.

క. తొలితొలి బలసూదనుచేఁ, జెలువుగ నాదివ్యశక్తి సేకుఱఁ గొని కుం
డలములుఁ గవచంబును మఱి, యలఘుమతీ యిమ్ము భద్రమగు నట్లయినన్.
ఉ.[1] వైరులఁ జంపి చంపి వెస వచ్చుఁ గరంబున కాజిలోన న
ద్దారుణశక్తి వాసవుఁడు దానన తొల్లి సహస్రసంఖ్యలం
గ్రూరసురారిసంఘములఁ గూల్చె మహాభుజ నీకు నెమ్మి నా
ఘోరపుసాధనంబు దొరకొన్న నవశ్యము [2]గెల్తు పోరులన్. 307
వ. అని చెప్పి కమలహితుం డంతర్హితుం డయ్యెఁ గర్ణుండును వాసవురాక కెదురు
చూచు చుండె ననిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె. 308
మధురాక్కర. కలదు దేవగుహ్యం బని కమలబాంధవుఁడు గర్ణుఁ
బలికె నని చెప్పి తది యెద్ది బలియుఁ డాసూతజుండు
లలితకవచంబు మణికుండలములు నెమ్మియిఁ బడసె
వెలయ నివ్విధ మంతయు వివరింప వలయు నాకు. 309
వ. అనిన వైశంపాయనుం డది యంతయుం జెప్పెద విను మని యిట్లనియెఁ దొల్లి
కుంతిభోజుకడకు దుర్వాసుం డతిథి యై వచ్చి వానిచేతం బూజితుం డై నాకు
నీయింటఁ గొంతకాలంబు వసియింప నిష్టం బై నది నాయున్నయంతకాలంబును
నీవును నీయనుచరులును నిర్వ్యాజం బగుభక్తి సేయ వలయు నిట్లొపుదే
యనుటయు నొడంబడి యతండు దనకూఁతుం బృథ యనుకన్యకం బిలిచి
యమ్మహామునిం జూపి. 310
ఉ. దేవసమానుఁ డీధరణిదేవుఁడు వేడుక మద్గృహంబునం
దా వసియింపఁ గోరుటయు దానికి నేనును నియ్యకొంటి నిం
దీవరనేత్ర నీవుఁ గడుధీరవు ధీవినయోపచారసం
భావితవృత్త వట్లగుట భక్తి భజింపుము బ్రాహ్మణోత్తమున్. 311
క. ఇతఁ డెయ్యది యెత్తఱి సమ్మతిఁ గోరిన నది ఘటించి మచ్చిక నిడితో
షితుఁ జేయు మిమ్మహాత్ముని, మతి యలుగక యుండవలయు మానిని మెపుడున్.
ఆ. వినుము విప్రవరులు వెడవెడ గినిసిరే, నియును ధరణి యెల్ల నీఱు సేయఁ
జాలుదురు తపఃప్రకాశులు దుర్వార, తేజు లెందు నధికధీరమతులు. 313
క. భూదేవపరాభవమునఁ, గాదె వాతాపిదండకప్రభృతులు పెం
పేది చెడిరి భూదేవస, మాదరమునఁ గాదె బ్రదికినవి యిజ్జగముల్. 314
సీ. పసిబిడ్డ వయ్యును బడఁతి నీ వెంతయు, గుణవంతురాలవు గురులయందుఁ
బెద్దలయందును బృథివీసురులయందుఁ, గడు భక్తి సేయుదు కమలనయన
బంధులుఁ జెలులు సంబంధిజనంబులుఁ, బురమువారును నంతిపురమువారుఁ

1. 306వ 307వ పద్యములకు నడుమ 'అమ్మహాసాధనంబు తెఱంగుఁ జెప్పనచ్చెరువు దానివిశేషం బుఁ జెప్పెద విను మని మఱియు నిట్లనియె' ననువచనము నొకటఁ గాన్పించెడి. 2. గ. మేలు.

బూఁబోఁడి నిను నెమ్మిఁ బొగడనివారు లే, రే మని వర్ణింతు నేను నిన్ను
తే. యదుకులంబునఁ బుట్టి యత్యంత సౌఖ్య,మమరఁ బెరిఁగితి నాపుత్త్రి వై త్రిలోక
సుందరము రూపు ప్రాయంబు సొంపు నిట్టి,దిచ్చరిత్రంబు సతులకు నెందుఁ గలదు.

వ. నీగౌరవం బంతయు నెఱింగి కాదె వహ్నిసమానుం డైన యీమహాముని నారాధించుటకు నీయందు భారం బెక్కించెద నీవును దర్పంబును నహంకారంబును దూరంబున నిడి యిప్పుణ్యపురుషుం బరితుష్టుం జేసి కృతార్థతం బొందు మనిన నక్కన్నియ దండ్రి కి ట్లనియె. 316

ఉ. కోరుదు నేను విప్రతతిఁ గొల్వఁగ నెప్పుడు నాత్మలోన నా
కోరినకోర్కి నేఁడు దలకూడె నరేశ్వర యట్లుఁ గాక నీ
కోరినయట్టి[1]యవ్విధము గోరి యొనర్చుట నాదుభాగ్యసం
భారము గాదె యూఱడుము భారము నాపయిఁ బెట్టి నెమ్మదిన్. 317

వ. అని పలికిన సంతసిల్లి కుంతిభోజుండు దుర్వాసున కక్కన్నియం జూపి యి ట్లనియె.

క. ఈపిన్నది నాకూఁతురు, తాపసజనముఖ్య మిమ్ముఁ దాఁ గొలువంగా
నోపుదు నని పూనెం బసి,పాప సుఁడీ కినుక లేక పని గొన వలయున్. 319

చ. ఎఱుఁగక తప్పుగా మెలఁగ నేనియు దానికి సైఁచి నేరముల్
గఱపి ప్రియంబుతోఁ గొలువు గైకొనఁగాఁ దగు మీకు బాలురుం
దెఱవలు వృద్ధులుం దమకుఁ దెల్లగః దప్పులు సేసి రేనియుం
మఱతురు గాని యల్గరు సమగ్రశమాన్వితు లైన తాపసుల్. 320

కుంతి దుర్వాసునకుఁ బరిచర్య సేయుట.

వ. అని యప్పగించి యప్పార్థివేంద్రుం డప్పు డమ్మునీంద్రునకుఁ జంద్రికాధవళం బైనసౌధంబునందు శయనాసనప్రముఖోపకరణంబులు నభిమతాహారసాధనద్రవ్యంబులు నాయితంబులు సేయించి తాను సంతసంబున నూఱడి యుండె నంత. 321

క. భావించి నాఁడునాఁటికి, వేవిధముల మిగుల భక్తివినయంబులతో
దైవోపచారముల భూ, దేవోత్తముఁ గొల్చెఁ గుంతిదేవి నియత యై. 322

సీ. అతఁడును దద్భావ మరయంగ మదిఁ గోరి, చూపించి యొకమరి రేప వత్తు
నని పోయి నడికిరే యర్థితోఁ జనుదెంచు, [2]రేయి వచ్చెద నని రేపు వచ్చు
నేపొద్దు వచ్చిన నింతి యప్పుడ భక్ష్య,భోజ్యముల్ గ్రొత్తపొల్పుగ నొనర్చు
నెయ్యది గోరిన నిచ్చకు రాఁ బెట్టు, నలయదు మది నైన నలుగ దెపుడు
ఆ. ననుదినంబు భోజుఁ డాత్మజఁ బిల్చి త,ద్వర్తనంబు నడుగ వనజముఖియుఁ
దాను గొల్చు తెఱఁగు దాపసవరునిచం,దమును జెప్పుచుండుఁ దండ్రి యలర.

వ. అంత నొక్కసంవత్సరంబు పరిపూర్ణం బయినఁ బ్రీతుం డై దుర్వాసుండు గుంతిం

1. క. దివ్విధము. 2. చ. మాపు.

జూచి నీచేసినయారాధనంబునకు మెచ్చితి నభిమతంబు లిచ్చెద నడుగు మనిన నమ్మౌనిని గృతాంజలి యై మీరు నావలనం బ్రసన్నుల రయితిరి దీనికి మాతం డ్రియుం గరంబు నలరు నింతియ చాలు నొం డేల యనిన నతం డల్లని నిది యొక్కమంత్రంబు గైకొను దీనం జేసి యెవ్వనివేల్పు నాహ్వానంబు సేసెద వవ్వేల్పు సనుదెంచి నీవశంబున నుండు ననిన నొం డన వెఱచి కుంతియుం బ్రసాదం బనియె నమ్మునీంద్రుండు దాని కమ్మంత్రంబు విధియుక్తంబుగా నుప దేశించి కుంతిభోజుని దీవించి నిజేచ్ఛం జనియె నంతఁ గొంతకాలంబునకు. 324

మ. మదిఁ గారుణ్యము సేసి విప్రవరుఁ డీమంత్రంబు నా కిచ్చె నే
నిది యేచందమొ చూతు నంచు నొకనాఁ డిచ్ఛన్ ఋతుస్నాత యై
సుదతీరత్నము పూర్వశైలతటిపై శోభిల్లుతిగ్మాంశుఁ జూ
చి డళత్పంకజభంగి నుల్లసిత యై చిత్తంబు రాగిల్లఁగన్. 325

వ. సహజకుండలకవచాభిరామం బయినతదీయమూర్తివిభవంబున కోటువడి దేవా భవత్సమానరూపసుందరుం డగునందనుం గరుణింపవేయని మనంబునం గోరుచు మంత్రోచ్చారణంబు సేయుచున్నఁ బ్రభాకరుండును నిజయోగబలంబున మూ ర్త్యంతరంబు ధరించి కుంతిపాలికిం జనుదెంచి మధురస్వనంబున. 326

తే. అబల నీమంత్రబలమున నరుగుదెంచి
నాఁడ నీ వాఁడ నైతి మనఃప్రియంబు
నీకు నెయ్యది యొనరింతు నిజము చెపుమ
యనినఁ బడఁతి యి ట్లనుఁ గమలాప్తుతోడ. 327

తే. కార్య మొక్కటియును లేదు కౌతుకమున, నేనుమంత్రంబు నొడివితి నింతమాత్రఁ
జేసి నీకు నిచ్చటికి విచ్చేయ నేల, దివికి నరుగుము క్రమ్మఱ దేవ నీవు. 328

వ. అనిన దానికి సూర్యుం డి ట్లనియె. 329

ఉ. క్రమ్మఱి పోక తప్పెడినె కామిని యే మని మున్ను నీవు చి
త్తమ్మునఁ గోరి తద్విధము దప్పక యిప్పుడుఁ బల్కరాదె తే
జమ్మున మత్సమానుఁ గవచస్ఫుటకుండలమండితాంగు స
త్సమ్మతుఁ బుత్త్రుఁ గోరవె నిజమ్ముగ నావలనం దలోదరీ. 330

వ. కావున నిప్పుడు మదీయసమాగమంబున కొడంబడుము నీకోరినయట్టితనయుండు జనియించు నిట్లు సేయని నాఁడు నిన్నును భవజ్జననీజనకులను భస్మంబు సేయుదు మఱియు నీదైనశీలవృత్తంబు లెఱుంగక మంత్రంబుగర్వంబునం జేసి నీ కుపదే శించినతాపసు నీక్షణంబ నిర్దహింతు నిదె యంబరంబుననుండి యింద్రాదిసురవ రులు నీకతమ్మునఁ జిక్కువడి యున్ననన్ను నవ్వుచున్నవారు వీరిం జూడు మని దివ్య దృష్టి యిచ్చినం జూచి కుంతిభోజరాజనందన డెందంబున నమందలజ్జావివశ యగుచు దినేశ్వరున కి ట్లనియె. 331

క. నను నిచ్చుటకుం గర్తలు, జననియు జనకుండుఁ గాక । చనునే నాకున్
వనితాధర్మువు విడువఁగ, ననఘా యిట్లయిన వంశ।హానియుఁ గాదే. 332

ఆ. మంత్రబల మెఱుంగ । మదిఁ గోరి తప్పు సే, సితి మహాత్మ దీనిఁ । జెట్ట గాఁగ
నవధరింప కెట్టు । లైన నా బాల్యంబు, గరుణ సైఁపవలయుఁ । గమలమిత్ర.

వ. అని మఱియు ననేక ప్రకారంబుల దివాకరు ననునయించి యెట్లునుం గ్రమ్మఱింప
నేరక తనకారణంబునఁ గులంబునకును గురుజనంబులకును నపాయం బగు నని
యునుం దలపోసి భయంబు మిగులఁ దెగువ సేసి యతని కిట్లనియె. 334

చ. ముదము దలిర్ప బంధుజన।మున్ గురువర్గముఁ గూడి రూఢి నొ
ప్పిదముగ ధర్మమార్గమునఁ । బెండిలి సేయఁగఁ బిమ్మటన్ సము
న్మదరసకేళిలీల[1]కుఁ గ్ర।మం బగుఁ గాక కులంబు శీలమున్
వదలి వధూజనంబులకు । వచ్చునె యిమ్మెయి వేడ్క సల్పఁగన్. 335

క. బంధుమతి నైన నను ని, ర్బంధము మెయి ధర్మబాహ్య।పథమున నలినీ
బాంధవ యిటు సేయుటయు న, మంథరభవదీయకీర్తి । మలినము గాదే. 336

చ. జగములయందు ధర్మువును । సత్యము నీయది గాదె దేవ యే
తగవులు నీ యెఱుంగని వి।ధంబులె యిట్టిది నీదు బుద్ధికిం
దగ వగునేని మార్పలుకు।దాన నె యే నగుఁ గాక నీకు నిం
పగు తెఱఁగాచరింపు మిట।యావల నయ్యెడు నింద కోర్చితిన్. 337

సీ. అనుటయు నద్దేవుఁ।డయ్యిందుముఖిఁ జూచి, తల్లిదండ్రులును బాం।ధవజనులును
గారు నిన్నిగికిఁ । గర్తలు విను నీవ, యొడయురాలవు నీకు । నుజ్జ్వలాంగి
కామంబు లెల్లను । గామించి పొందుట, నయ్యెఁ గన్యాశబ్ద । మట్లు గాన
యాత్మతంత్రత్వంబు।నందు నీ కెగ్గు లే, దే నేల నడతు ధ।ర్మేతరంబు

ఆ. మత్సమాగమమున । మదిరాక్షి నీదుక
న్యావ్రతంబుఁ జెడదు । నందనుండు
నధిక తేజుఁ డుదయ।మగు నిన్ను లోకనిం 338
దయును బొందకుండుఁ । దథ్య మబల.

కుంతి సూర్యునివరంబున గర్భంబుఁ దాల్చి కర్ణుం గాంచుట.

వ. అని యొడంబఱిచి సూర్యుండు దత్సమాగమంబునం బ్రీతుం డయి దానికి గర్భా
ధానంబు సేసి గగనంబున కరిగె నంతఁ బూర్వపక్షంబునచంద్రుండునుంబోలె
గర్భంబును గ్రమంబునఁ బ్రవర్ధనంబు నొందుచు నభివ్యక్తం బయ్యును
బ్రభాకరుమహిమం జేసి లోకవిదితంబు గాకుండెఁ దత్ప్రకారంబు దాదికూఁతు
రొక్కతియ యెఱుంగు నిట్లు వర్ధిల్లుచుం బది యగుమాసంబున నొక్కనాఁటి
నిశాసమయంబునం గన్యాంతఃపురంబునందు. 339

1. క. గరిమం బగుఁగాక.

ఆ. కొడుకుఁ గనియె సహజకుండలకవచాభి, రాము విమలకమలకోమలాక్షు
దీర్ఘబాహుఁ జారుదృఢదేహుఁ దరుణార్కు, తేజుఁ గుంతిభోజరాజపుత్త్రి.

వ. ఇట్లు జనియించినయర్భకుం జూచి లోకాపవాదభయంబునకుఁ దలరి యాక్షణంబ యొక్కమంజూషలోన నబ్బాలకుం బదిలంబుగా నిడి దాని నతిదృఢంబుగాఁ [1]దెప్ప బంధించి సఖియునుం దానును గొని చని పురసమీపగతం బయినయశ్వనదీప్రవాహంబున విడిచి కుంతి యెంతయు సంతాపంబున నిట్లని విలాపంబు సేసె. 341

ఆ. కొడుక నిన్నుఁ గాంచుకొఱఁతనోముల కాని, పెంచి గారవించి పేర్మి నీదు
ప్రోపుఁ గుడువఁ గాంచుపుణ్యంబు దుది ముట్ట, నేల చేయనైతి నేను గుత్తి.

మ. నెఱయం బున్నమచందురుం బెనయునీనెమ్మోమునం [2]దియ్యమై
చిఱునవ్వొప్పఁగఁ జూడ నీకపులకల్ చెల్వొంద నిన్ గ్రుచ్చి య
క్కఱ [3]దీఱఁగ బోరి నక్కునం గరము వేడ్కం జేర్ప నీకిమ్మెయిన్
[4]వఱదం ద్రోవఁగఁ జేసెనే యకట దైవం బెందుఁ జొత్తున్ సుతా. 343

సీ. ఏపుణ్యసతికి నీ వింకఁ [5]జేపడియెదో, యెక్కడఁ బడియెదో యే నెఱుంగ
నేపుణ్యురాలొకో యిప్పుడు నినుఁ బుత్త్రుఁగాఁ గాంచుటకు మేలికలను గాంచు
లలిఁ బాంసుకేళి నల్లన [6]నడపాడుచు, నవ్యక్తమధురవాక్యామృతంబు
వీనులఁ గురియుచు వెడఁదగన్నులుఁ బిన్న,నవ్వును శుభలక్షణములు నమరఁ

ఆ. దేజరిల్లు నిన్నుఁ దెఱవ యెవ్వతయొక్కొ, యడర గ్రుచ్చి యురమునందుఁ జేర్చి
వేడ్క మిగిలి వేనవేలభంగులఁ గొని, యాడి యాడి ముద్దులాడుఁ గొడుక.

ఉ. లాలితయౌవనోజ్జ్వలవిలాసమునం దిలకించి సుందరా
భీలవిచేష్టితం బమర [7]భీమవనోద్భవసింహరేఖమై
వ్రాలవె యింక నీ వెలమి వామవిలోచన లంగజన్మలీ
లాలసలై విపక్షులు భయాలసులై ధృతి యేది చూడఁగన్. 345

ఆ. ఎచట నున్ననైన నెల్లప్పుడును నిన్నుఁ, గన్నులారఁ జూడఁ గాంచుఁ గాన
తనయ నిన్నుఁ గనినతపనుండు గడుధన్యుఁ, డయ్యె మందభాగ్య నైతి నేను.

చ. ఇనుఁ డఱచేత మాటువడుచున్నఁడుఁ గల్గునె నిన్ను నెమ్మి నేఁ
గనియెదఁ గాక యింక నొకకాలమునం దయినం దనూజ నీ
వినుతశరీరభావమును వీనులసన్మణికుండలంబులున్
ఘనతరవజ్రవర్మముఁ బ్రకాశత నొందక యుండ నేర్చునే. 347

చ. దివి భువి నంతరిక్షమున దిక్కుల గాడ్పున నగ్నియందు న

---

1. దెప్పంబునం బంధించి. 2. క. గ. దియ్యనై. 3. గ. యారన్. 4. జ. వఱుతం. 5. అ. నందనుఁడవై. 6. అ. నడయాడుచు. 7. క. భీమమనోద్భవసారరేఖ; చ. భీమతనూద్భవసింహరేఖ. చ. భీమమనోద్భవసింహరేఖ. జ. భీమమనోద్భటసారరేఖ. 'హిమవద్వనసంభూతం సింహం కేసరిణం యథా' అని మూలము.

ర్ణవములయందు ఘోరవిపినంబులయందును నీకు నెల్లెడన్
శివ మగుఁ గాక దిక్పతులు సిద్ధులు సాధ్యులు రుద్రు లాశ్వినుల్
పవనులుఁ బుత్త్ర నిన్నుఁ గృపఁ బాయక యెప్పుడుఁ గాచుచుండెడున్. 348

వ. అని యేడ్చుచుం గుంతి యచ్చటం దడయ వెఱచి గూఢప్రకారంబునఁ గన్యాంతఃపురంబునకు వచ్చి యెప్పటియట్ల వర్తిల్లుచుండె నట మంజూషయు నశ్వనదీవేగంబునఁ జర్మణ్వతికిం జని యందుండి యమునాగతం బై యట చని భాగీరథిం బడి సూతవిషయంబునం జంపానగరంబు చేరువ నరుగుచుండె నాసమయంబున.

సీ. ధృతరాష్ట్రసఖుఁ డై నయతిరథుం డనుసూతుఁ, డతివలుఁ దానును నతివిభూతి
గంగలో జలకేళిసంగతుం డై యుండి, తుంగతరంగానుషంగవశతఁ
జనుదెంచుమంజూషఁ గని కడు వేడుకఁ, దనపరిజనములఁ బనిచి పట్టి
తెప్పించి ధీయుక్తి యొప్ప నేకతమున, నప్పెట్టెఁ దెఱచి తా నప్పు డందు

ఆ. వినుతహేమకవచుఁ గనకకుండలధరు, ననుపమానతేజు ఘనుఁ గుమారుఁ
గని మనంబులోననయంబు విస్మయం, బొనరఁ గ్రుచ్చి యెత్తికొని ముదమున.

వ. తనజీవితేశ్వరి యైనరాధకుం జూపి యి ట్లనియె. 351

క. అనపత్యుల మైనమనకు, మనపాలిటివేలు పిక్కుమారుని నిచ్చెన్
వనజాక్షి యితఁడు మానుష, జనితుఁడు గాఁ డరయ దేవసంభవుఁడు ను ?.

క. అని దానిచేతి కిచ్చినఁ, గొని యురమున నదిమి కొనియెఁ గొడుకు నతివ య
వ్వనితకు బాలెంత తెఱంగున, జన్నులు సేఁపె నపుడు గూరిమి పేర్మిన్. 353

వ. ఇట్లాదంపతులు ప్రమోదసంపద సొంపారం గుమారుం గొని నిజమందిరంబున కరిగి యాత్మీయకులోచితంబు లగుజాతకర్మాదిసంస్కారంబు లొనరించి సహజకుండలాలంకృతకర్ణుం డగుటం జేసి వానికిఁ గర్ణుం డని నామకరణంబు సేసి రంత.

క. వసువర్మధరుఁడు గావున, వసుసేనుం డనఁగ బేరు వానికి నిడి రిం
పెసఁగఁగ భూసురు లాది, త్యసుతుం డిబ్భంగి సూతతనయుం డయ్యెన్. 355

వ. తద్వృత్తాంతం బంతయుఁ గుంతి తనయాప్తచరులవలన విని శిథిలీకృతసంతాపయయి యుండె నతిరథుండును సంప్రాప్తయౌవనుం డైనకొడుకుం దోడ్కొని వచ్చి ద్రోణాచార్యులయొద్ద నస్త్రశిక్ష సేయం బెట్టె నాసూతసూనుండు మఱియుఁ గృపాచార్యువలనను జామదగ్న్యువలనను వివిధాస్త్రలాభంబు నొంది క్రమంబున దుర్యోధనుతోడ బద్ధసఖ్యుం డై యతనికిఁ బ్రియంబు సేయం దివిరి దివిజతనూజుండగు నతనితోఁ మచ్చరించుచుఁ బాండవుల కప్రియంబు సేయుచుండె. 356

ఉ. ఆతనియస్త్రవిద్యయును సమంచితకుండల[1]వజ్రవర్మవి
ఖ్యాతియు నాత్మలోఁ దలఁచి కౌరవనాయక ధర్మసూనుఁడున్
భీతమనస్కుఁ డై యతఁ డభేద్యబలుం డని సంతతంబు దై

1. క. వర్మకర్ణ.

ర్యాతిశయంబు డించి హృద।యవ్యథఁ బొందుచు నుండెఁ గానలోన్. 357

వ. అయ్యుధిష్ఠిరునకుఁ బ్రియం బాచరింపం గోరి కవచకుండలంబులు గొనుటకై పురందరుం డొక్క నాఁడు బ్రాహ్మణరూపంబునం జని మధ్యాహ్నసమయంబునఁ గర్ణుండు సూర్యోపాస్తి సేయుచుండి బ్రాహ్మణులకు నభీప్సితంబు లిచ్చుతఱిం గని భిక్షాం దేహి యనుటయుఁ గర్ణుం డతని కి ట్లనియె. 358

చ. అలసవిలాసలాలసర।సాన్విత లైననితంబినీజనుల్
వలసిన భూరిసస్యపరి।వస్తుసమగ్రము లైనగ్రామముల్
వలసిన నుల్లసన్మణిసు।వర్ణవిభూషణగోధనావళుల్
వలసినఁ గోరు మిచ్చెద ధ్రు।వంబుగ నావుడు నాతఁ డి ట్లనున్. 359

క. విను మివి యెయ్యవియును నా, కు నభీష్టము గావు నీదు।కుండలములు స
ద్వినుతకవచంబు నిచ్చినఁ, గొనియెద నీ నోపుదేని । గుణరత్ననిధీ. 360

చ. అనవుడుఁ గర్ణుఁ డి ట్లనియె । నక్కట యేను విశిష్టవస్తువుల్
గొనకొని యిత్తు నాఁగ నిటు । గోరెద వీవు దలంప నప్రయో
జన మగువాని భూమిసుర।సత్తమ యెంతయు జేల వైతి ము
న్నెనయఁగ నిట్టు లెవ్వరును । నెయ్యెడ వేఁడిరె యెజ్జగంబులన్. 361

క. కుండలములుఁ గవచము న, ట్టుండఁగ ని మ్మనఘ వేఁడు । మొండుధనంబుల్
నిండింతు నీమనోరథ, మొం డేమియు ననకు మింక । నూర్జితచరితా. 362

వ. అనిన నతం డెవ్విధంబున నొడంబడక కవచకుండలంబులయంద బద్ధాభిలాషుం డయి పలికినఁ గర్ణుండు వానిం బ్రార్థించియుఁ బూజించియు ననేకమణికనకాది ద్రవ్యంబులు నివేదించియు నెట్లును నొడంబఱుప నేరక యతని కి ట్లనియె. 363

తే. సహజములు నాకు నిక్కవ।చంబుఁ గుండ
లములు నివి లేక యున్న నే । సమరభూమిఁ
గడిఁదిశత్రులచేత భం।గంబు వడుదుఁ
గాన యీఁ జాల నయ్యెడ । వీని నేను. 364

క. నానాజనపదబహుళము, నానాధనసంయుతంబు । [1]నారాజ్యము స
మ్మానంబున నిచ్చెదఁ గొన, వే ననుఁ గారింప కింక । విప్రవరేణ్యా. 365

వ. అనియును నతనియందు సుముఖత్వంబు గానక కానీనుండు దరహసితాననుం డగుచుఁ గృతకభూసురు నుపలక్షించి యి ట్లనియె. 366

చ. ఎఱిఁగితి నేను నిన్ను శిబు।ధేంద్రుఁడ వీవు జగత్త్రయంబు
చ్చలఱ భవదీయరక్షణము।సంద వెలుంగుచు నుండు నిట్టి
న్నులఱవుగ నేను వేఁడుకొన । యుక్తుఁడఁ గాక మెుఱంగి నన్ను
క్కలఱ పడి నీవు వేఁడు టిది । గర్జమె నిర్జితదైత్య చెప్పుమా. 367

1. క. నాకామ్యము.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No

తే. అనిన నింద్రుఁ డి ట్లనియె మిహిరయయ్య పద్మ
హితుఁడు మున్నింత సెప్పె నీ కిష్ట మెసఁగఁ
గాన యెఱిఁగితి నీ విం కఁ గడప నేల
యనఘ మాబోఁటులకుఁ బ్రియం బైనపనిని. 368

వ. అనిన రాధేయుండు దేవా యట్లయిన నఖిలశత్రుఘాతిని యైననీయమోఘశక్తి నాకుం గృప సేసి కవచకుండలంబులు గొను మనినం బాకశాసనుం డి ట్లనియె. 369

ఉ. ఇచ్చెద శక్తి నీకు విను మేర్పడ నాజి మదీయశత్రులం
గ్రచ్చఱఁ జంపి చంపి యది గ్రమ్మఱి చేతికి వచ్చుచుండు నీ
కిచ్చుట యట్లు గాదు భువి నెందును దుర్జయుఁ డైననీరిపుం
జెచ్చెరఁ దున్మి యొక్కరున చేకుఱ నన్ను భజించుఁ గ్రమ్మఱన్. 370

వ. ఇట్టిది సమయంబుగాఁ బరిగ్రహింపు మనినఁ గర్ణుండు నాకుం గలపగతుం డొక్కరుండ వాని వధియించుటయ మదీయమనోరథం బనుటయుఁ బురందరుండు దరహాసితవదనుం డై. 371

ఉ. నీయభిలాష మేను మది నిక్క మెఱుంగుదు నుగ్రశౌర్యుఁ డే
జోయుతుఁ బార్థు నోర్తు నని చూచెదు నీ కది యేల తీరు రా
ధేయ దయావిధేయుఁడు విధేయజగత్త్రయుఁ డవ్యయుండు నా
రాయణుఁ డమ్మహాత్మునకు రక్షకుఁ డేరికి వాఁడు సాధ్యుఁడే. 372

వ. అనినం దపననందనుం డది యట్లుండె నాకు సహజం బైనకవచంబు నొలిచి యిచ్చిన మదీయదేహంబు గరంబు వికృతం బగు నది యే మని యవధరించి తనిన నింద్రుండు నీశరీరంబు భవజ్జనకుం డైనయరుణకిరణవర్ణం బెట్టి దట్టిదీప్తిం జెలువొందు నని పలికి వానికి నమోఘశక్తి యొసంగి దీని నాపత్కాలంబునం దక్కఁ బెఱయప్పుడు ప్రయోగించిన నీకు నపాయం బగు నని చెప్పెఁ దదనంతరంబ యవ్వీరుండు గవచకుండలంబులం బుచ్చి యతని కిచ్చె. 373

చ. అలఘునిశాతశస్త్రమున నంగము లన్నియు నిర్వికారుఁ డై
యొలువఁ దొడంగినట్టియెడ హా యని కిన్నరయక్షసిద్ధసా
ధ్యులు దివినుండి యార్చుచును దూర్యరవంబు సెలంగ నద్భుతం
బెలయఁగఁ బుష్పవృష్టిఁ గురియించిరి కర్ణుపయిం బ్రియంబునన్. 374

వ. ఇట్లు సూతపుత్త్రుని వికృతగాత్త్రుం జేసి వాసవుండు ప్రమదవికాసభాసితుం డగుచు నిజలోకంబున కరిగెఁ దద్వృత్తాంతం బంతయు విని కౌంతేయు లత్యంతసంతోషంబునం బొదలిరి గాంధారేయులు దుఃఖవిదారితహృదయు లై రని యిట్లు కుండలాహరణంబు సవిస్తరంబుగాఁ జెప్పిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 375

క. అనయము దుస్తర మగున, వ్వనవాసము నిస్తరించి ద్వాదశవర్షం
బునకడపట నేమివిధం, బొనరించిరి మత్పితామహుల్ మునినాథా. 376

వ. అనిన నమ్మహీపతి కమ్మహీదేవుం డి ట్లనియె నట్లు మార్కండేయువలనఁ బుణ్య
కథలు విని పాండవు లనంతరంబ క్రమ్మఱి ద్వైతవనంబున కరిగి యుం దున్న యెడ
నొక్కనాఁడు సుఖాసీనుం డయి యున్నధర్మరాజుపాలికి నొక బ్రాహ్మణుండు
సంభ్రమంబునఁ బఱతెంచి యి ట్లనియె. 377

ధర్మరాజు బ్రాహ్మణునియరణి దెచ్చుటకుఁ బోవుట.

క. తరుశాఖఁ దగిల్చిననా, యరణి యొకమృగంబు వచ్చి యతిరయమున న
త్తరువున నొరసికొనంగా, ధరణీశ్వర తగిలెఁ జువ్వె తచ్ఛృంగమునన్. 378

క. దానిఁ గొని పఱచె నమ్మృగ, మానతనృపలోక నాకు నయ్యరణిఁ దగం
గా నిపుడు దేరఁ బనుపవె, భూనుత నిత్యవిధి లోపమునఁ జన కుండన్. 379

చ. అనవుడు నాక్షణంబ మనుజాధిపుఁ డుద్ధతచాపహస్తుఁ డై
యనుజులుఁ దాను నెంతయు రయంబున నాహరిణేంద్రుపజ్జఁ గై
కొని చని కూడ ముట్టి మెఱుఁగుల్ నిగుడం బటుసాయకంబు లే
సిన నొకయమ్ము నమ్మృగము సెందద చేరద యద్భుతంబుగన్. 380

వ. అదియును వారి నతిదూరంబుగా నెలయించికొని చని యొక్కఘోరవిపినంబున
నదృశ్యం బైన నయ్యత్నంబు విఫలం బగుటకు విషాదంబు నొందుచు నయ్యేవురు
నతిశ్రాంతు లై శీతలచ్ఛాయం బగునొక్కవటమహీరుహంబు క్రింద విశ్రమించి
రప్పుడు నకులుండు ధర్మనందనున కి ట్లనియె. 381

క. కులశీలోన్నతియు విని, శ్చలకరుణాగతియు ధర్మసంగ్రహమతియుం
గలమనకు నివ్విధంబున, నలజడి వచ్చుటకు మూల మది యెయ్యదియో. 382

వ. అనిన నమ్మహాప్రాజ్ఞుం డతని కి ట్లనియె. 383

క. వినుము సుఖమునకు దుఃఖం, బునకుం గారణము దనదుపూర్వకృతం బై
చనుకర్మమ కారణ మిది, యని యన్యము గలుగ నేర దం డొక్కటియున్.

వ. అనుటయు భీమసేనుండు నకులున కి ట్లనియె. 385

ఆ. ప్రాతికామి వోయి పాంచాలిఁ గొలువులోఁ
బలికిఁ దేర నపుడ యలుక యెసఁగ
నాంబికేయసుతుల నందఱఁ దునుమ కే
నునికి నిట్టియెడరు మనకుఁ బుట్టె. 386

చ. అనవుడు నర్జునుం డనియె నాసభ సూతసుతుండు పేర్చి ప
ల్కినపటువాక్యముల్ వినియుఁ గిన్కకుఁ బూనక యేఁ దొలంగి కా
ననమున కిట్లు కాతరజనంబులచాడ్పున నేఁగుదెంచుటన్
మనకు దురంతదుఃఖములు మానక పైకొని వచ్చెఁ దమ్ముఁడా. 387

వ. అనినయనంతరంబ సహదేవుం డి ట్లనియె. 388

ఆ. దుష్టశీలుఁ డైన ✽ దుర్ద్యూతకితవు గాం, ధారుఁ బట్టి యేను ✽ దడయ కపుడ
తునుమ కునికి నిట్టి ✽ దుర్దశపా లైతి, మనఘ మనము కాన ✽ నాంతరముల. 389

వ. అని యి ట్లుండఁ బన్ని తెఱంగులఁ బలుకు చుండ నజాతశత్రుండు నకులుం జూచి
భవదీయసోదరు లత్యంతపిపాసితు లైనవారు నీ విమ్మహీరుహం బెక్కి జలంబు
లున్నయెడ యరయు మనిన నతండును దద్వచనానురూపంబున నవ్వనస్పతిసమా
రోహణంబు సేసి దెసలు గలయం బరికించి దూరంబున సలిలంబు లున్న వని
యన్న కెఱింగించిన నతం డట్లేని నీవ పోయి జలపానంబు సేసి మాకును జలంబులు
గొని రమ్మని పనుచుటయును మాద్రేయుండు వృక్షావతీర్ణుం డయి రయంబునం
జని ముందట నతిమనోహరం బగుతటాకంబుఁ గని జలంబులు ద్రావం బోయిన
నొక్కయశరీరభూతం బి ట్లనియె. 390

నకులాదులు యక్షుని నిరాకరించి నీరు ద్రావి మూర్ఛితు లగుట.

క. ఓయన్న యీతటాకము, నాయది నీ వీజలము గొనంగ వలశేనిఁ
నాయడిగినప్రశ్నములకు, ధీయుత యుత్తరము లిమ్ము ✽ తేటపడంగాన్. 391

క. అనుటయు నవ్వాక్యము దెస, ననాదరము సేసి నకులుఁ ✽ డక్కొలనం ది
య్యనినీరు ద్రావి నిశ్చే, తనుఁ డై యాక్షణమ పడియెఁ ✽ దత్తీరమునన్. 392

వ. అట ధర్మపుత్త్రుండు సహదేవుం గనుంగొని నకులుండు జలంబులకుం జని తడసె
నీ వరిగి యతనిం దోడ్కొని జలంబులు గొనుచు రమ్మని పనిచిన నక్కుమారుం
డతిశీఘ్రగమనంబునం బోయి పద్మినీతీరంబునం బడి యున్నయన్న తెఱంగుఁ జూచి
విస్మయశోకవ్యాకులహృదయుం డగుచు నిది యేమినిమిత్తంబున నయ్యెనో
యని యూహించుచుఁ బెల్లడరుతృష్ణాభరంబు సహింప నోపక జలంబులదెస
నాసఁ జేసి కొలనికి డిగ్గిన నెప్పటిభూతం బి ట్లనియె. 393

ఆ. అనఘ యీజలాశ ✽ యము నాయధీనంబు, సాహసంబుఁ జేసి ✽ చనదు చొరఁగ
నాదుప్రశ్నములకు ✽ నలి నుత్తరము లిచ్చి, వారి గొనుము నీకు ✽ వలసినట్లు. 394

క. అనిన నది యాదరింపక, ఘనుఁ డాసలిలములు ద్రావి ✽ గ్రక్కున విష మె
క్కినవిధమునఁ బరవశుఁ డై, ఘనసాలమహీరుహంబు ✽ కరణిం బడియెన్. 395

సీ. అంత నంతకసూనుఁ ✽ డంతరంగంబున, సంతాప మెసఁగ వా ✽ సవతనూజుఁ
గనుఁగొని యన్న నీ ✽ యనుఁగుఁదమ్ములు వోయి, కడుఁదడవయ్యెని ✽ క్కాననమున
నెయ్యది పుట్టెనో ✽ చయ్యన నీ వేఁగి, వారిని దోడ్కొని ✽ వారి గొనుచుఁ
జను దెమ్ము నావుడు ✽ ఘనభుజుం డధికర, యంబున నరిగి జ ✽ లాశయంబు

ఆ. తీరభూమిఁ బడిన ✽ వారి నవారిత, మహితశౌర్యధనుల ✽ మాద్రిసుతులఁ
జూచి విస్మయైక ✽ గోచరుఁ డై సవ్య, సాచి యుల్లమున వి ✽ షాద మడర. 396

క. నాలుగుదిక్కులుఁ గనుఁగొని, యాలో నెవ్వరిని గాన కత్యంతపిపా
సాలసుఁ డై సలిలంబులు, గ్రోలఁగ సమకట్టి యొయ్యఁ గొలనికి డాసెన్. 397

వ. డాయుటయు నాకాశవాణి యిట్లని వీతెంచె. 398

మ. బలిమిం జొచ్చిన నట్టివారి కయినం బ్రాణంబుపై వచ్చు నీ
సలిలావాసము మత్పరిగ్రహము తృష్ణాచ్ఛేద మొందం జలం
బులు ద్రావఁగ వలతేనిఁ బ్రశ్నములకుం బొం దొందఁగా నుత్తరం
బులు నాకి మ్మనుడుం మనంబునఁ బృథాపుత్త్రుండు సక్రోధుఁ డై. 399

ఉ. ముచ్చిలి వచ్చి దుర్వచనముల్ పచరించినఁ జెల్ల నిత్తునే
చెచ్చెర నీయెలుం గడఁగఁ జేసెద నిప్పుడు సూడు మంచు వి
వ్వచ్చుఁడు శబ్దవేధిశరవర్గముఁ దద్వచనంబు చక్కటిం
గ్రచ్చఱ నించె మౌర్వీరవకంపితసర్వదిగంత[1]రాళుఁ డై. 400

ఆ. ఇట్టు లేయుటయును నప్పటివాక్యంబు, మఱియు వినఁగఁబడిన మఘవసూను
డలసి కొలను సొచ్చి యంబుపానము సేసి, యిలకు నొఱగె వివశహృదయుఁ డగుచు.

వ. తదనంతరంబ యుధిష్ఠిరుండు భీమసేను నాలోకించి కవలును గవ్వడియును నింత వడి దడయుటకు నిమిత్తం బెయ్యదియో నీవు నరుగు మనినం గిమ్మీరవైరి మారుతజవంబున నమ్మువ్వురుఁ జనినచొప్పునం జని పద్మాకరకూలంబునందు నిద్రావివశులుం బోలెఁ బడి యున్నతమ్ములం గని దుఃఖితుం డై. 402

తరలము. ఇది మనుష్యకృతంబు గాదు సురేంద్రకిన్నరపన్నగ
త్రిదశనిర్మిత మైనకర్మము దీని నింతయు నేర్పడం
బిదపఁ జూచెదఁ గాక యంచు విభీతిదూరుఁడు నీరువ
ట్టొదవఁ దత్సలిలాశయంబు సముత్సుకుం డయి చొచ్చినన్. 403

వ. అంతరిక్షగోచరం బైనవచనం బిట్లని వినంబడియె నయ్యా నీ విట్లేల సాహసంబు సేసె దిక్కొలను మత్పూర్వపరిగ్రహంబు నీ వొపుదేని నాయడిగిన యర్థంబులకు నుత్తరంబు లిచ్చి జలంబులు ద్రావు మనిన నప్పలుకులు గైకొనక వృకోదరుండు నిపీతసలిలుం డై యచ్చోటన మూర్ఛితుం డై పడియె నిట పాండవాగ్రజుండు. 404

క. తమ్ములు నలువురు నొక్కట, నమ్మెయి మసలుటకు నాత్మ నత్యంతవిషా
దమ్మొలయ సముత్థితుఁ డై, క్రమ్మఱ నమ్మార్గ మపుడు గైకొని నడచెన్. 405

సీ. అపగతజనశబ్ద మై యనభివ్యక్త, మార్గ మై యవిరళదుర్గశైల
తరుగుల్మవల్లీవితాన మై గజసింహ, శరభశార్దూలసూకరలులాయ
బహుళ మై బహువిధపక్షికోలాహల, భయద మై కడుఁ బర యయినయడవి
ననుజుల వెదకుచు ననఘుండు సని కాంచెఁ, గమలాకరంబుతీరమునఁ బడిన

1. క. గ. జ. భాగుఁ డై.

ఆ. వారిఁ బూరువంశ। వరుల భీమార్జున, యముల సమితబలుల। విమలమతులఁ
బ్రళయపతితలోక। పాలసంకాశుల, భూరిపుణ్యధనుల। వీరవరుల. 406

మ. కని డెందంబునఁ దల్లడం బడర దీ। ర్ఘశ్వాసవైవర్ణ్యముల్
దనుకం దాల్మి సలింప విస్మయపరీ। తస్వాంతుఁడై శోకబా
ష్పనిరుద్ధాకులలోచనుం డగుచు మూ। ర్ఛల్ పైకొనం గొంతసే
పు నరేంద్రోత్తముఁ డుండెఁ జిత్రమునరూ। పుంబోలెఁ దా నచ్చటన్. 407

వ. పదంపడి డెందంబు ధృతిపొందున నిడికొని యతం డన్నలువుర నుపలక్షించి నలు
దెసలుం బరికించి యాత్మగతంబున. 408

తే. ఒరులు వచ్చినచొప్పు లే। దరిగినట్టి, చొప్పు లేదు పెనంగిన। చొప్పు లేదు
ఘనభుజులయంగకంబులు। గనుఁగొనంగ, నక్షతము లేలయొక్కొ యి। ట్లయిరి వీరు.

ఉ. క్రూరుఁడు ధార్తరాష్ట్రుఁ డతి। కుత్సితుఁ డెంతయుఁ బాపబుద్ధి గాం
ధారుఁడు పెక్కుమాయలకుఁ। దావల మక్కట యద్దురాత్మకుల్
వారక యెద్దియేని నొక। వంచనమై నిటు సేసిరొక్కొ యె
వ్వారలు నాత్మ నమ్ముదురె। వక్రవిచారులఁ బాపకారులన్. 410

క. వదనంబుల తెలివియుఁ గర, పదరుచియుం జెడదు వీరు। పడుటకుఁ గత మీ
యుదకము విషదిగ్ధం బని, మది దలఁపం బోల దేమి।[1]మాయయొ యెఱుఁగన్.

చ. పుడమియు నర్థసంపదయుఁ। బొల్పఱ వైరులపాలు సేసి యీ
యడవికి వచ్చి భీకరమృ। గావలిపొత్తున నున్నవీరి వె
న్నడికొని యిట్లు సేసెనె య। నాథులఁబోలె విధాతృఁ డింక నె
క్కడఁ జనువాఁడ నేది కడ। గాఁ దరియింతు దురంతదుఃఖముల్. 412

సీ. పుత్త్రులు దుఃఖార్తిఁ। బొగులుట కనిశంబుఁ, బొక్కుచు నున్నయ। పుణ్యచరిత
నాతల్లి పాండుని। మహిషి నా కెదురుగా, వచ్చి కౌఁగిటఁ జేర్చి। వత్స నాఁడు
దమ్ముఁగుఱ్ఱలు నీవుఁ। దగ విపినంబున, కరిగితి రిప్పు డ। య్యనుజు లెందుఁ
జనిరి నీ వొక్కండ। చను దెంచి తిది యేమి, యనిన నాయమతోడ। నకట యేమి

ఆ. యనఁగ నేర్చువాఁడ। నాచార్యవిదురశాం, తనవకృపులు నను ము। దంబుతోడఁ
గుశల మడిగిరేనిఁ। గుశల మే మనువాఁడఁ, [2]దలఁగ రానియెడరు। దగిలె నాకు.

వ. అని పెక్కుచెఱంగుల వగచి యాధర్మజుండు దప్పి కోర్వక నీళ్లు ద్రావుటకై
సరోవరంబులోనికి దిగుటయు నశరీరభూతం బి ట్లనియె. 414

మ. విను మే నొక్కబకంబ నిక్కలను పృ। థ్వీనాథ నాసొమ్ము నీ
యనుజుల్ మద్వచనంబు గైకొనక తో। యాస్వాదులై యివ్విధం
బునఁ బ్రాణచ్యుతిఁ బొంది రీవును గడున్। మోహంబునన్ సాహసం
బునకుం జొచ్చిన నట్ల యయ్యెదు సుమీ। [3]ము న్నట్ట వారించితిన్. 415

1. క. మాయ యొ పగవన్. 2. జ. దలఁపఁ గాని. 3. క. జ. మున్మన్న.

క. ఏ నడిగినయర్థములకు, భూనుత యుత్తరము లిచ్చి పొలుపారఁ బయః
పానము సేయుము నావుడు, నానిర్మలచరితుఁ డంబకరాభిముఖుం డై. 416

వ. అయ్యా నీవు బకరూపధరుండ వై యున్నరుద్రుండవో పావకుండవో పవనుండవో యట్లు గానినాఁడు కులపర్వతప్రతిము లయిననాతమ్ములం బడఁ ద్రోచునట్టి బలంబు పులుఁగులకుం గలదె దేవాసురగంధర్వయక్షాదులకు దుర్జయు లైన యివ్వీరుల నిట్లు సేసి నీవుగానివాఁడవపోలెం దొలంగియున్నవాఁడవు నాకు నద్భుతభయకౌతుకంబు లొక్కటం బొడమెడు నీ వెవ్వండవు నీతలం పెయ్యది చెప్పి నాహృదయవేదన నపనయింపవే యనిన నదృశ్యభూతం బి ట్లనియె. 417

ఆ. కౌరవేంద్ర బకముఁ గాను నే విను మొక్క, యక్షవరుఁడ నిచట నస్మదీయ
నికృతిఁ జేసి పడిరి నీతమ్ము లందఱు, ననుచు నాక్షణంబ యతనియెదుర. 418

మ. నిలిచెం దాళసముచ్ఛ్రితాంగుఁడు మహానిర్ఘోషసంతర్జితా
ఖిలభూతప్రకరుండు దీర్ఘవిపులగ్రీవుండు దంష్ట్రాసము
జ్జ్వలవక్త్రుండు విరూపలోచనుఁడు దీప్రప్రస్ఫారతేజోఘనుం
డలఘుం డాసరసీతటాగ్రమున నయ్యక్షుండు ఘోరాకృతిన్. 419

వ. ఇట్లు నిలిచి కౌంతేయాగ్రజున కి ట్లనియె. 420

క. నాయనుమతి లేకుండఁగ, నీయుదకము ద్రావి రేని నెవ్వారైనన్
ధీయుత చత్తురు నీ వటు, సేయవు సమ్యగ్విచారశీలుండ వగుటన్. 421

వ. కావున మదీయంబు లగుప్రశ్నంబుల కుత్తరంబు సెప్పు మనిన నతండు మహాత్మా నీచిత్తంబునకు వచ్చునట్లుగాఁ జెప్ప నాబోఁటివానికి శక్యం బగునే యైనను నానేర్చువిధంబునం జెప్పెద నడుగు మనిన నయ్యక్షుం డి ట్లనియె. 422

ధర్మరాజు యక్షప్రశ్నముల కుత్తరంబు లిచ్చుట.

క. దినకరు నెయ్యది నడపును, దినకరు నెవ్వారు గొలిచి తిరుగుదు రద్దే
వుని యస్తమించు నేమిట, ననఘ తదాధారభూత మది యెయ్యదియో. 423

తే. అనిన ధర్మజుఁ డి ట్లను నబ్జహితుని
నడపు బ్రహ్మంబు సురకోటి నడచుఁ గొలిచి
ధర్మచే నస్తమితుఁ డగుఁ దపనుఁ డమ్మ
హాత్మునకు సత్య మాధార మండ్రు బుధులు. 424

వ. అనిన విని యక్షుం డి ట్లనియె. 425

క. ఏమిట శ్రోత్రియుఁ డగుఁ జను, నేమిటఁ గడుమహిమ వడయు నిమ్ముగఁ బురుషుం
డేమిట సహాయయుతుఁ డగు, నేమిట నగు బుద్ధిమంతుఁ డేర్పడఁ జెపుమా.

వ. అనిన నతం డి ట్లనియె. 427

క. శ్రుతమువలన శ్రోత్రియుఁ డగు, నతులతపోయుక్తిఁ గడుమహత్త్వమువడయున్
ధృతిచే సహాయయుతుఁ డగు, నతిశయముగ బుద్ధిమంతుఁ డగు బుధసేవన్.

ప్రౌఢకవన = భారతము

వ. అని చెప్పిన నప్పార్థివోత్తమున కప్పురుషుండు వెండియు నిట్లనియె. 429

తే. ఏమికతమున భూదేవుఁ డెసఁగు దేవ, భావమున నాతనికి సాధుభావ మెవ్వి
ధమున నగు నసాధుత్వ మెద్దానఁ జెందు, మానుషుం డగు నాతఁ డేదానఁ జెపుమ.

చ. అనవుడు ధర్మజుం డనియె నధ్యయనంబున దేవభావముం
గను నవనీసురుం డధికవ్రతశీలత సాధుభావ మా
తనికి విశిష్టవృత్తి దిగఁ ద్రావి యసాధు వనంగ నుండు శౌ
చనియతి లేక మృత్యుభయసంగతి నాతఁడు మానుషుం డగున్. 431

క. నా విని యతఁ డాతనితో, జీవన్మృతుఁ డెట్టివాఁడు చెప్పు మనుటయుఁ
దేవాతిథిపితృభృత్యజ, నావళులకు నిడక కుడుచునతఁ డని చెప్పెన్. 432

చ. విని మగుడంగ వాఁడు పృథివీపతిఁ జూచి ధరిత్రికంటె వేఁ
కన యగుదాని నాకసముకంటెఁ గడుం బొడవైనదాని గా
డ్పునకును నెక్కుడై జవము పొంపిరి వోయెడుదానిఁ బూరికం
టెను దఱచైనదానిని ఘటింపఁగఁ జెప్పుము నాకు నావుడున్. 433

వ. అమ్మనుజోత్తముం డయ్యక్షోత్తమున కిట్లనియె. 434

ఆ. తల్లి వ్రేఁగు సువ్వె ధరణికంటెను నాక, సంబుకంటెఁ బొడవు జనకుఁ డరయ
గాడ్పుకంటె మనసు గడుశీఘ్రగతి తృణో, త్కరముకంటెఁ జింత గరము తఱచు.

వ. అనిన నంబరచరుం డమ్మహీవరున కిట్లనియె. 436

తే. మొనసి నిద్రించియును గన్ను మూయ దెద్ది, పుట్టియును జేతనత్వంబుఁ బొరయ దెద్ది
యరయ రూపు గల్గియు హృదయంబు లేని, దెద్ది వేగంబు కతమున నెద్ది వాలుచు.

తే. అనినఁ గన్ను మూయదు సుప్త మయ్యు మీను
పుట్టియును గ్రుడ్డు చేతనం బొరయకుండు
హృదయరహితంబు శారూప మేఱు రయము
కతన వర్తించు నని చెప్పెఁ గౌరవుండు. 438

వ. చెప్పిన నయ్యక్షుం డతనితోఁ దెరువు నడచువానికి రోగార్తునకు గృహస్థునకు మృతిఁ బొందినవానికి నెవ్వ రెవ్వరు చుట్టంబు లనిన నప్పుడమిఱేఁ డన్నలువురకుం గ్రమంబున సార్థంబును వైద్యుండును సద్భార్యయుఁ గృతం బగుధర్మంబును బరమమిత్త్రంబు లని నిర్దేశించుటయు వాఁడు వెండియు నిట్లనియె. 439

క. ఎయ్యది ధర్మువునకుఁ గుదు, రెయ్యది యాశ్రయము గీర్తికి న్మగుమార్గం
బెయ్యది సురలోకమునకు, నెయ్యది సుఖములకు నిక్క మేర్పడఁ జెపుమా.

వ. అని యడుగుటయు. 441

క. అమరఁగ దాక్షిణ్యము ధర్మమునకుఁ గుదు రండ్రు కీర్తి మహిమ నెలవు దా
నము సత్యము సురపురిమా, ర్గము శీలము సంశ్రయము సుఖంబుల కెల్లన్.

వ. అని యుధిష్ఠిరుం డెఱింగించిన నతండు. 443

చ. నరునకు నాత్మ యెవ్వఁడు ఘనంబుగ దైవిక మైనచుట్ట మె
వ్వ రతనికిం దదీయ మగు వర్తన మేమిట నిర్వహించు భూ
వర యతఁ డేమి పూని యనపద్యతఁ బొందు నెఱుంగఁ జెప్ప మీ
వరుదుగ నన్న నక్కురుకులాగ్రణి యాతనితోడ నిట్లనున్. 444

తే. ఆత్మజుఁడు నువ్వె పురుషున కాత్మ యయ్యె, నాతనికి భార్య దైవికమైనచుట్ట
మతనిజీవిక పర్జన్యకతనఁ జెల్లు, నతఁడు దానము గొనియాడి యతిశయిల్లు.

చ. అన విని మేటిధర్మ మగునట్టిది యెయ్యది యెట్టి దెప్పుడుం
గవియఁగఁ బండి యుండు నెసకంబుగ నెయ్యది నిగ్రహించినం
దనరుఁ బ్రమోదసిద్ధి నియతంబుగ నెవ్వరితోడిసంధి యెం
దును వికలంబు గాదు పరితోష మెలర్ప నుపన్యసింపవే. 446

వ. అని దివ్యుండు వలికిన నాదివ్యబోధనుం డిట్లనియె 447

ఆ. విను మహింస మేటి యనఁ జనుధర్మంబు, యోగకర్మ మెపుడు నొనరఁ బండి
యుండు మనసు ద్రొవ్వ ఖండింపఁగా మోద, మెసఁగు సుజనసంధి యెడల దెంచు.

తే. అనిన నతఁడులోకమున కెయ్యదియు దిక్కు, జలము నన్నము నెద్దాన సంభవించు
విష మనంగ నెయ్యది శ్రాద్ధవిధికి నెద్ది, సమయ మనిన నిట్లని చెప్పె జనవిభుండు.

తే. సజ్జనులు దిక్కు సూవె యీసర్వమునకు, నభము ధరణియు జలము నన్నమ్ము నుద్భ
వించు నెలవులు విష మగు విప్రధనము, లనఘ శ్రాద్ధకాలము బ్రాహ్మణాగమంబు.

వ. అని తెలిపిన నయ్యక్షుండు ధర్మనందనుతో మనుజుం డెయ్యది పరిత్యజించి సర్వ
జనప్రియుండును నిశ్శోకుండును నర్థవంతుండును సుఖియును నగు ననిన నమ్మహీ
పతి యతని కిట్లనియె. 451

తే. సర్వజనసమ్మతుం డగు గర్వముడిగి, క్రోధ మడఁచి శోకమునకుఁ [1]గొలువుగాఁడు
వినవె యర్థాఢ్యుఁడగు లోభ మొనరవిడిచి, తృష్ణవర్జించి సౌఖ్యంబు తెరువుఁగాంచు.

వ. అనినయనంతరంబ యద్దివ్యుం డతనితోఁ బురుషశబ్దవాచ్యుం డెట్టివాఁడు మఱియు
సర్వధని యగువాఁ డెవ్వండు నిశ్చయింపు మనినఁ బాండవజ్యేష్ఠుం డిట్లనియె. 453

క. దివి ముట్టి ధరణి యంతట, నివిడి మెఱయు చుండు నెవ్వనియశోరమ య
ట్టివిశిష్టచరిత్రుఁడు య, క్షవరా పురుషుండు నాఁ బ్రకాశత నొందున్. 454

ఆ. ప్రియము నప్రియంబుఁ బెల్లగు సౌఖ్యదుఃఖములు భూతభావికార్యములును
నెవ్వనికి సమంబు లివి సర్వధని యనఁ, బరఁగుఁ జువ్వె యట్టి భవ్యుఁ డనఘ.

వ. అని వివరించిన విని యుధిష్ఠిరుదెసఁ బ్రసాదమధురం బైనయాలోకనంబు నిగుడ
నయ్యక్షవరుండు మహాత్మా మదీయంబు లైనప్రశ్నంబు లన్నింటికి సదుత్తరంబు
లిచ్చితివి నీవలనం బ్రీతుండ నైతి నీతమ్ములం దొక్కని ప్రాణంబు లిచ్చెద వేఁడు
మనిన నతండు. 456

---

1. క. గుదురు గాఁడు.

సీ. శ్యామాంగు నారక్తజలరుహనేత్రు సా, లప్రాంశు నున్నతదీప్రబాహు
నకులుని బ్రదికింపు నావుడు యక్షుండు, భీమఫల్గును లతిభీమబలులు
ప్రియులు నీ కెంతయుఁ బృథివీశ వీరిలో, నొకనిఁ గోరక యిట్లు నకులుఁ గోరి
తనుడు ధర్మాత్మజుఁ డనియెను మాతండ్రి, యగుపాండువిభునకు మగువ లిరువు

ఆ. రందు గొంతికొడుకు లైనమువ్వురిలోన, నేను బ్రదికినాఁడ నింక మాద్రి
తనయు లిరువురందుఁ దగ నిప్పు డొక్కఁడు, బ్రదుకవలదె చెపుమ పాడి తెలిఁగు.

ఆ. ధర్మనందనుండు ధర్మాత్ముఁ డని యెప్డుఁ, దగిలి జగము నన్నుఁ బొగడుచుండు
నట్టియేను ధర్మహానికి నోర్వఁ జు, మ్మెంత వచ్చె నేని నింత నిజము. 458

వ. అనిన నతండు నీ దైనధర్మజ్ఞతకు మెచ్చితి నీతమ్ము లందఱు లబ్ధజీవితు లయ్యెడు
మనిన నాక్షణంబ విగతక్షుత్పిపాసు లై యన్నలువురు నిద్రవోయి మేల్కని
నట్లు సముత్థితు లైనం జూచి విస్మితుం డై ధర్మజుం డి ట్లనియె. 459

చ. నిను నొక యక్షమాత్రుఁడుగ నే మది నమ్మఁగ నేర నయ్యెదర్క
జననుత నీవు నిక్కముగ శక్రుఁడవో పురసూదనుండవో
యనలుఁడవో సమీరుఁడవొ యట్టులు గాక జగన్నుతుండు మ
జ్జనకుఁడు ధర్మదేవతవొ సత్కృపఁ జెప్పుము నాకు నేర్పడన్. 460

వ. అనిన నమ్మహాత్ముండు మందస్మితాననుం డై. 461

మత్తకోకిలము. ఏను ధర్ముఁడఁ జువ్వె రాజకులేంద్ర సత్యము శౌచముం
దానముం దపముం శమంబును దాంతియుం యశముం బరి
జ్ఞానయుక్తియు నాదుమూర్తులు సమ్మదంబున నిప్డు మ
త్సూను నుత్తమధార్మికుం నినుఁ జూచువేడుక వచ్చితిన్. 462

వ. నన్ను నాశ్రయించినజనంబులు దుర్గతిం బొరయరు గావున నభిమతవరం బి
చ్చెద వేఁడు మనినఁ బాండవాగ్రజుండు సంభ్రమభక్తిభరితుం డగుచు దండ
ప్రణామంబు సేసి యద్దేవోత్తముం బ్రస్తుతించి దేవా మదీయాశ్రమవాసుం
డైనభూసురముఖ్యునరణి యొక్క హరిణంబుచేత నపహృతం బయ్యె నతనికిం గర్మ
లోపంబు గాకుండ నయ్యరణిం గరుణింపవే యనినఁ బ్రీతచిత్తుం డగుచు
ధర్మదేవుండు. 463

క. విను మేను నీమనోగతి, యనఘా యెఱుఁగంగ వేఁడి యరణీహరణం
బొనరించితి మృగ మెక్కడి, దని యమ్మహనీయవస్తు వతనికి నిచ్చెన్. 464

వ. ఇచ్చి మఱియు ని ట్లను నిదె పదుమూఁడవయేఁడు సనుదెంచు నింక మీకు
నజ్ఞాతవాసంబు సలుపవలయు నందు మీ రెవ్వ రెక్కడ నేరూపంబునం జరి
యింపం గోరిన నయ్యైరూపంబు లలవడియెడు నెట్లున్నను మిమ్ము నెవ్వరు
నెఱుంగకుండునట్లుగా వరం బిచ్చితి నింక నొం డెయ్యది వలసిన నడుగు మనిన
నమ్మనుజేశ్వరుం డి ట్లనియె. 465

మత్తకోకిలము. ఆదిదేవుఁడ వైననీవు దయామతిం బొడసూపి న
న్నాదరించుటఁ జేసి ధన్యుఁడ నైతి నింతకు నెక్కుడౌ
నేది గల్గెడు నైన నామది నెల్లనాఁడును గ్రోధమో
హాదులం బెడఁబాసి ధర్మమునందు నిల్కడఁ జేయవే. 467

వ. అనిన నద్దేవుం డతనికి నవ్వరం బొసంగి యనంతరంబ యంతర్హితుం డయ్యెఁ గౌంతేయులు గ్రమ్మఱ నిజాశ్రమంబున కరిగి ధరణీదేవునకు నరణిప్రదానంబు సేసి తత్ప్రయుక్తాశీర్వాదశతంబులు గైకొని పరమానందంబునం బొంది రని యిట్లు పాండుతనయులవనవాసప్రకారంబు సవిస్తరమధురంబుగా నుపన్యసించి.

క. అనఘుఁడు కృష్ణద్వైపాయనశిష్యుఁడు బోధనిధి సముంచితమేధా
ఘనునకుఁ బారిక్షితునకు, ననవరతానందసుఖసమగ్రత [1]యొసఁగెన్. 468

సీ. భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుండు, శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ
సంతతధ్యానసంసక్తచిత్తుఁడు సూర, నార్యునకును బోతమాంబికకును
నందనుం డిలఁ బాకనాటిలో నీలకం, ఠేశ్వరస్థాన మై యెసక మెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు, ధన్యుఁడు ధర్మైకతత్పరాత్ముఁ

తే. డెఱ్ఱనార్యుండు సకలలోకైకవిదితుఁ
డయినన్నయభట్టమహాకవీంద్రు
సరససారస్వతాంశప్రశస్తి దన్నుఁ
జెందుటయు సాధుజనహర్షసిద్ధిఁ గోరి. 469

క. ధీరవిచారుఁడు తత్కవి, తారీతియుఁ గొంత దోఁపఁ దద్రచనయ కా
నారణ్యపర్వశేషము, పూరించెఁ గవీంద్రకర్ణపుట[2]పేయముగాన్. 470

క. వీరావతార విమలా, చార మహోదార శుభవిచార సుజనమం
దార నవకీర్తిమౌక్తిక, హార హరపదాబ్జమధుకరాత్మవిహారా. 471

తరలము. అమితవైభవ లోభమోహభయాదిదుర్లభ మంజువి
భ్రమవికాసి విలాసినీజనపంచబాణ నిరంతరా
నమదశేషనృపాలమౌళివినద్ధ[3]ముగ్ధమణిప్రభా
క్రమసమర్చితవిస్ఫురత్పదకాంతినిర్జితపంకజా. 472

1. యొప్పన్. వ. ఉపన్యసించిన తెఱంగున. 'సీ. భవ్యచరిత్రు—' అని యచ్చుప్రతులమాత్రము గనుపట్టెడిని. 2. క. జ. మోదముగాన్. 3. జ. దివ్యమణి.

గద్యము. ఇది సకలసుకవిజనవినుతనన్నయభట్టప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దారణ్యపర్వంబున సీతాన్వేషణంబును లంకాభిగమనంబును రామరావణయుద్ధంబును రాఘవాభ్యుదయంబును సావిత్రీచరిత్రంబును సూర్యుండు గర్ణునకు హితోపదేశంబు సేయుటయుఁ గర్ణజన్మకథనంబును విప్రరూపంబునఁ గర్ణుకవచకుండలంబు లింద్రుండు హరించుటయు నారణేయంబును యక్షప్రశ్నంబులును ధర్ముండు ధర్మజునకు వరంబు లొసంగుటయు నన్నది సర్వంబును సప్తమాశ్వాసము.

శ్రీమదాంధ్రమహాభారతమునందలియారణ్యపర్వము

సమాప్తము.

Printed at the Ananda Press, Madras. 1924.

ఆనందాశ్రమ గ్రంథరత్నమాల

తెనుఁగుపుస్తకముల వివరము

గ్రంథములకు వ్రాయునపుడు వాని వెలయును దెలుపవలెను.

శ్రీమద్భగవద్గీత

ప్రతిపదటీకా భాష్య విశేషార్థ సహితము.

ఈ గ్రంథము మొదటి కూర్పునందు శ్రీరామానుజభాష్యము ననుసరించి టీకాతాత్పర్యములు కొంత సంగ్రహముగ వ్రాయఁబడినవి. భాష్యమును యథామూలముగా తెనుఁగు చేసినచో మిక్కిలి యుపయుక్తమని యనేకులు కోరినందున భాష్యమునం దొక్క విషయమునైన విడువక అందలి ప్రమాణములకు ఆకరములతోను, కష్టములైన ప్రమాణములకు అర్థములతోను, భాష్యమునందు సందిగ్ధములైన విషయములకు తాత్పర్యచంద్రికనుండి విశేషముగా వివరణములతోను గూర్చి, తేట తెనుఁగున ఈ రెండవకూర్పును ముద్రించి యున్నారము. ఇందు గీతార్థసంగ్రహమునకు టీకయు చరమశ్లోకమునకు లోకాచార్యులు రచించిన రహస్యార్థమును గలవు. మొదటి కూర్పుకంటె నీ రెండవ కూర్పునందు సుమారు 250 పుట లధికముగాఁ జేర్పఁబడియున్నవి. కాలికో బైండు గిల్టు పేరు గలది 3 0 0

శ్రీమదాంధ్రమహాభారతము, పద్యకావ్యము.

పెక్కు వ్రాఁతప్రతులసహాయమున చిరకాలమునుండి సంపూర్ణశ్రద్ధతో వ్రాయింపఁబడి 40 రతుల గ్లేసు కాగితములపై అచ్చొత్తించి మేలు కాలికో బైండు గిల్టుపేరు చేయఁబడియున్నది.

I.	ఆది సభాపర్వములు గల సంపుటము	2	4	0
II.	ఆరణ్యపర్వము	2	4	0
III.	విరాటోద్యోగపర్వములు	2	4	0
IV.	భీష్మద్రోణపర్వములు	2	4	0
V.	కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వములు	2	4	0
VI.	శాంతిపర్వము	2	4	0
VII.	ఆనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వములు గల సంపుటము	2	4	0

భాస్కరరామాయణము, అచ్చగుచున్నది.

శ్రీకృష్ణకర్ణామృతము మూఁడాశ్వాసములు, ఆంధ్ర టీకాతాత్పర్య విశేషార్థములతోను ఆంధ్ర పద్యములతోను కాలికో బైండు గిల్టుపేరుగలది 1 12 0

శ్రీసహస్రనామ స్తబకము:—విష్ణుసహస్రనామస్తోత్రమ్, లక్ష్మీనరసింహ సహస్రనామస్తోత్రమ్, గోపాలసహస్రనామస్తోత్రమ్, హయగ్రీవ సహస్రనామస్తోత్రమ్, హయగ్రీవాష్టోత్తరశతమ్, హయగ్రీవ కవచమ్, కృష్ణసహస్రనామస్తోత్రమ్, లక్ష్మీసహస్రనామస్తోత్రమ్, కృష్ణాష్టోత్తరశతమ్, రామాష్టోత్తరశతమ్, రఙ్గనాథాష్టోత్తరశతమ్, ఆఞ్జనేయాష్టోత్తరశతమ్, నృసింహద్వాదశనామస్తోత్రమ్, కృష్ణద్వాదశనామ స్తోత్రమ్, లక్ష్మ్యష్టోత్తరశతమ్, హర్యష్టకమ్, కృష్ణాష్టకమ్, సుదర్శనాష్టకమ్, ముకున్దమాలా, ఆదిత్యహృదయమ్, నారాయణకవచమ్, సప్తర్షిస్తోత్రమ్, గోపికాగీతాస్తోత్రరత్నమ్, శ్రీస్తుతిః, రామానుజాష్టోత్తరశతమ్, శ్రీపరమార్థస్తుతిః- మొదలగు 29 అంశము లిందుఁ గలవు. చిన్నసైజు అత్యుత్తమప్రతి చక్కనికూర్పు కిత్తాను బైండు 0 12 0

శ్రీగోపాలసహస్రనామస్తోత్రము 0 3 0

ముకుందమాలా టీకాతాత్పర్యసహితమ్ 0 4 0

హరిశ్చంద్రోపాఖ్యానము, ద్విపద సటిప్పణము. అట్టబైండు ... 0 12 0

లచరిత్రము;—ఇది చక్రపురిరాఘవాచార్యప్రణీతమయిన ద్విపదకావ్యము. ఇందలికవిత్వము మృదుమధురము. శైలి రసానుగుణము. ఇందు నలదమయంతుల యావద్వృత్తాంతమును చక్కఁగా వర్ణింపఁబడినది. ఇదివఱకు తప్పులతడకగా ముద్రితమయినప్రతిని, ప్రాచీనము లగు వ్రాఁతప్రతుల యాధారమున సవరించి కఠినపదములకు టిప్పణముతో ముద్రించియున్నాము. 0 12 0

బిల్హణీయము:—చిత్రకవి సింగరార్య ప్రణీతమై పండిపెద్ది కృష్ణస్వామి ప్రణీతముగా లోకములో వాడుకయైన ప్రబంధము. ఇందు రాజకుమారి యగు యామినీపూర్ణతిలక మహాకవి యగు బిల్హణుని వరించుట మొదలగు సంగతులు కడుసొగసుగ వర్ణింపఁబడినవి. చక్కని కూర్పు చిన్నసైజు కాలికోబైండు గలది ... 0 12 0

డిటో డిటో పేపరు బైండు ... 0 8 0

పారిజాతాపహరణము:—ముక్కు తిమ్మనార్యుని ముద్దుపలుకులు ఎవరి కిష్టముండవు? ఇందలికథ శ్రీకృష్ణుఁడు స్వర్గలోకమునుండి పారిజాతవృక్షమును దెచ్చుట. సత్యభామ నూరార్చుటయును ఇంకను పెక్కుకథలు గలవు. నాగపూడి కుప్పుస్వామయ్యగారిగొప్పపీఠిక గలదు. 0 8 0

గజేంద్రమోక్షణము:—టీకాతాత్పర్యసహితము. కాలికోబైండు ... 0 10 0

డిటో డిటో పేపరు బైండు 0 8 0

భజగోవిందశ్లోకములు, శ్రీమచ్ఛంకర భగవత్పాదవిరచిత మగు శ్రీగోవిందద్వాదశమఞ్జరికాస్తోత్రము తచ్ఛిష్యవిరచిత మగు శ్రీగోవింద చతుర్దశమఞ్జరికాస్తోత్రము ఈరెండును టీకాతాత్పర్యములతో 0 2 0

భోగినీదండకము:—ఇది బమ్మెర పోత నామాత్య ప్రణీతము, తంజనగరం తేవప్పెరుమాళ్లయ్యగారిచే వ్రాయంబడిన టీకతోను, పాఠాంతరములతోను కూర్పఁబడి చక్కఁగ ముద్రింపఁబడినది. 0 2 0

సప్తమస్కంధము, మూలము. 0 6 0

వేమనపద్యములు. 0 4 0

శబ్దమంజరి 0 4 0

హరిశ్చంద్రనాటకము 0 8 0

తత్త్వత్రయమ్. (పిళ్లెలోకాచార్యులచే ద్రావిడభాషయందు రచింపఁబడినది.) మణిప్రవాళవ్యాఖ్యానముతోను తెనుఁగు తాత్పర్యముతోను ... 2 0 0

నూతన ప్రచురము

రామలింగానుశాసనము అను నామాంతరము గల

అమరకోశము

త్రికాండము - సటీకము

ఆంగ్లేయభాషాంతర పదములతోఁ గూడినది.

క్యాలికోబైండు 20 రతుల డిమ్మి గ్లేజుకాగితములు ... 1 12 0

క్యాలికోబైండు 16 రతుల సాదా కాగితము ... 1 8 0

అట్టబైండు 1 0 0

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

పుస్తకం సంఖ్య	AOUA103B112
పుస్తకం పేరు	శ్రీమదాంధ్రమహాభారతము అరణ్యపర్వము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	333
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO 5,
లేని పేజీలు	NO
తయారు చేసినది	Bhargavi
పేజీలు విడదీసినది	Lakshmi
స్కాన్ చేసినది	Ch Naga [illegible]
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good